8

శ్రీరస్తు

ముక్కుతిమ్మనార్యవిరచిత

# పారిజాతాపహరణము

శ్రీ విజయనగరాధీశ్వరాజ సంస్కృతకళాశాలాధ్యక్షపండిత విద్వద్బిరుదాంకిత

శ్రీసూసి రామమూర్తిశాస్త్రి విరచిత

సురభివ్యాఖ్యాసహితము



894.8271
THI

MEMORIAL LIBRARY

చెన్నపురి:

రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ముద్రితము.

1960

All Rights Reserved.]

[Price Rs. 7—0—0

శ్రీ:

ముక్కు తిమ్మనార్య విరచిత

# పారిజాతాపహరణము

## సురభివ్యాఖ్యాసహితము



DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N00036

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No. 0036

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ప్రకటితము.

1960

*All Rights Reserved.*

894.8271
TH1

Printed by

V. RAMASWAMY SASTRULU & SONS

AT THE 'VAVILLA' PRESS

MADRAS.—1960.

1 AOUA(04B110

# భూమిక

## కృతికాలము

దేశకాలపరిస్థితులతోఁ గవితావధూటి కడుంగడుఁ జెలిమిగలిగి వర్తిలుట సహజము. అందును నాంధ్రరాజులయండఁ జేరి యనితరసాధారణమగు నభివృద్ధినందిన, పెద్దతనమునఁ గన్న నన్నయముద్దుపట్టి యానాయకులయాశయముల ననుసరించి మెలంగుటలోను, వారిదేశపరిస్థితుల నభివర్ణించుటలోను, వారికాలపరిస్థితుల బ్రకటించుటలోను, వారితోఁబాటుగ వృద్ధిక్షయముల నందుటలోను, వారితో సమముగ సుఖదుఃఖములకు లోనగుటలోను నబ్బుక మే మున్నది? మతాంతరము లచే వైదికమతము లుప్తప్రాయ మగునను వెఱపు వెలయునాఁడు రాజరాజ్యస్థిమతము నుద్ధరింప బ్రభవిష్ణుఁడై శ్రుతిస్మృతిసిద్ధసనాతనధర్మసర్వస్వమునకు ఖనియును, ముదముగొలుపు దనతాతముత్తాతలచరిత్రమునకుఁ దావలమైనదియును బంచమవేదమునాఁ బ్రణుతి గన్నదియును నగు వ్యాసభారతమును దనయాస్థానకవి యగునన్నయచే సర్వజనసంవేద్యము గావింపఁబూనుఁ గఁ దదనుసారిణి యై యాంధ్రకవితాబాల తదాశయము ననుసరించి మెలంగుటయు, దేశము ప్రశాంత మై యలరారునెవసమున దేశాధినాథులు స్వస్థచిత్తు లై యెలమిమీఱి వర్తిలురోజుల నాంధ్రకవితాయువతి యనన్యసామాన్య మగునందమున మించి తనయందచందములు నాయకుల ననురాగాంబుధి నోలలాడించుచుఁ దానును వారితోఁ గలిసి యోలలాడుటయు, దేశమును దేశాధినాథులును నాయోహనాదులం జేసి యలజడినొందునాఁ డయ్యెవతి చెలువేది రూపఱి తత్సమదుఃఖ యై యొప్పుటయు, దేశకాలపరిస్థితులయలజడి యుడిగి మహీనాయకులు వంతలం దలంగి యలరుకతన నేఁడు పూర్వమిత్రములు నాయకరత్నములు తోలంగినను నవ్వధూటి పలుపన్నెలఁ బలు చిన్నెల నెఱపుచు జగన్మోహనియై నటించుటయుఁ, బైని పేర్కొన్న విషయములకుఁ బ్రమాణము లగుచున్నవి.

ఆంధ్రకవితాయువతి నాయకరత్నములతోఁ దా ననురాగాంబుధి నోలలాడునదనులఁ బతులమతుల కతులరాగము గూర్ప వెలయించిన శృంగారవిలాసములే పారిజాతాపహరణమనుచరిత్రాదు లనుట కిను మంతయు సందియము లేదు. అందును బారిజాతాపహరణ మవ్వధూటీ విలాసములలో నింతింతనరానిసొరుప మించుమొట్టమొదటవెలసిన విలాస మని తదనితరపూర్వాసమానసౌందర్యమును భావవీథి నిల్పి యేకాంత భావనసల్పుసహృదయులకుఁ దోఁపకపోదు.

కీ॥ శే॥ కం. వీరేశలింగము పంతులుగా రించుమించుగా నీరెండు కావ్యములును నొక్కకాలమందే యనఁగా క్రీ. శ. 1520 ప్రాంత మున రచియింపఁబడియుండు నని సిద్ధాంతీకరించిరి. కాని మనుచరిత్ర పారి జాతాపహరణములలో మనుచరిత్రమే మొట్టమొదట నుదయమంది తక్కుంగలపారిజాతాపహరణాదిప్రబంధరాశికి మార్గదర్శక మయ్యె నని పలుపురువిమర్శకులు భావింతురు. కాని పారిజాతాపహరణమనుచరిత్రము లంచలి నాయకమణిక్యతేతరనాయకరత్నవిజయప్రసంగముల నరయ నరయఁ బారిజాతాపహరణమే మనుచరిత్రమునకన్న మున్ను వెల్వడె నని విశదమగును. క్రీ. శ. 1520-21-వ వత్సరప్రాంతమున జరిగినట్లు విమర్శకులనేకులు తలంచు కలబరిగివిజయమును "ప్రళయఘనాఘన భాంకృతిభీమచపేటలుతక్కలబరిగికితిరకుక" అని మనుచరిత్రము నిరూపింప దక్కుమై విచక్షణమ్మాఅ వర్తిలుటయుఁ, బారిజాతాపహరణ మీవిషయమునఁ దటస్థముగ నుండుటయు నిట్టి సైయూహాను దృఢ పఱచుచున్నవి.

కీ॥ శే॥ కే. వి. లక్ష్మణరావుగారు తమపేరిటవెలయు వ్యాసావళిలో నీకలబరిగివిజయయాత్ర క్రీ. శ. 1510, 14, 21, వత్సరములలో నెప్పుడు జరిగెనో యనుమూఁడువికల్పములు గలవనియు, వీనిలో 1514 క్రీ. శ. వత్సర మనుసిద్ధాంతమే యధికగ్రాహ్య మనియు వ్రాసిరి. (చూ. లక్ష్మణరాయవ్యాసావళి పేజి 44.) వారు వ్రాసినటుల నీవిజయ యాత్ర రాయలపూర్వదిగ్విజయాత్రకు మున్నే జరిగియుండునెడల బూర్వదిగ్విజయాత్రాప్రసంగములనెల్లఁ బూర్ణముగఁ బూన గ్రుచ్చి

నట్లు తెల్పుపారిజాతాపహరణ మీనాయకమణి దగునుద్విజయము నేల ప్రకటించి శ్లాఘింపకుండెనో యని సందేహింపవలసియున్నది. మఱియు క్రీ. శ. 1512 ప్రాంతమున దక్షిణదిగ్విజయయాత్రయు, క్రీ. శ. 1513-15 ప్రాంతమునఁ బూర్వదిగ్విజయయాత్రయు రాయ లొనరించి క్రీ. శ. 1515-20 వత్సరముల నడుమకాలమున విశ్రాంతిఁగైకొనినట్లు విమర్శకులు వాఙ్మయపరిశోధన మొనరించి సిద్ధాంతీకరించియున్నారు. పైని వ్రాసిన విషయము ననుసరించి యవ్విజయమును బూర్వదిగ్విజయయాత్రానంతరమే రాయలు చూరఁగొనె ననియు, నాకలబరిగివిజయయాత్రకుఁ బూర్వమే పారిజాతాపహరణమును ముక్కుతిమ్మనార్యుఁడు రచించె ననియు నంగీకరించుటయే యుచితమైనట్లు పారిజాతాపహరణప్రణాళిక యీసందర్భమునఁ దెల్పుచున్నది. ఏదియెట్లైనను గళింగవిజయమును గటకవిజయమును స్పష్టముగఁ దెల్పుచుఁ గలబరిగివిజయప్రసంగమును నిసుమంతయుఁ దలంపనికతనఁ, బారిజాతాపహరణనిర్మాణకాలమునకుఁ గలబరిగిని రాయలు జయింపలేదనియు నీవిజయయాత్ర,పూర్వదిగ్విజయయాత్రానంతర వృత్తమనియు, దాన నీప్రబంధము పూర్వదిగ్విజయయాత్ర ముగిసిన యనతి కాలములోనే, రాయలు గృహమునఁ బూర్వదిగ్విజయయాత్రానంతరము విశ్రాంతిగైకొనుసమయములోనే, విరచిత మయ్యె ననియు నంగీకరించుట కించుకైన సందియంబందఁ బని లేదని తోఁచెఁజిని. ఇఁక నీయంశమును దిమ్మకవి పేర్కొనుట మఱచెనేమో యని కొందఱు తలంతురేమో! చిన్నచిన్నపల్లెలవిజయమును బెద్దగఁజేసి కీర్తించినతిమ్మకవి నాయకమణి దగు నీమహావిజయమును బేర్కొనుట మఱచె ననుట యంతగ విశ్వాస పాత్రముగామి నమ్మఁబడినది గా దనియే తలంపవలసియున్నది. కాఁగాఁ బారిజాతాపహరణము పైనిప్రస్తావితప్రకారము క్రీ. శ. 1515-20 నడుమను, మనుచరిత్రము కలబరిగివిజయానంతరము క్రీ. శ. 1521లోను విరచితము లని ఫలితమును నిర్ణయింపవలసివచ్చినది.

మనుచరిత్రము ప్రబంధసంతతికి మార్గదర్శక మనియు, నట్టిదాని నాదిని రచించుటఁజేసియే పెద్దన కాంధ్రకవితాపితామహాభిరుదము

గుదిరె ననియు ననుపండితప్ర కాండులవిమర్శనవాక్యములకుఁ బైసిద్ధాం
తము విరుద్ధ మగును. కాని సంస్కృతహరివంశమున (68-76) నధ్యా య
ములలో విపులముగ వర్ణితమైన యీకథను దిమ్మకవి యనుసరించినటుల
సంస్కృతాంధ్రీకృతులఁ జెఱియొకచేతంబట్టి పరిశీలించువారికి సుగోచర
మగుటం జేసియు, సూర్యాస్తమయచంద్రోదయాదివర్ణనములం దక్కఁ
దక్కుఁగలప్రధానకథాసంబంధముల నెందును గవి స్వాతంత్ర్యమును
వహించినట్లు విశదము గామిం జేసియు, నొక్కొకచో మూలము నున్న
దున్నటులను నొక్కచో సంగ్రహించియు ననుసరించినట్లు తెల్లమగుటం
జేసియు, నీప్రబంధము మనుచరిత్రాదులను సానలుతీరిన జాతిరత్నము
లను బోలునది కా దని చెప్పవలసియున్నది. కానఁ బురాణార్థ మగు చిన్న
కథ నాధారముగఁ గొని తమయిచ్చవచ్చిన పలురూపములగు మార్పులం
జేసి పెంచి కూర్చిన వసుచరిత్రాదిప్రబంధములలో మనుచరిత్రము
తొలుదొల్తఁ బొడమె ననుటలోను, నద్దానఁ బెద్దన కాంధ్రకవితా
పితామహాభిరుదము గుదిరె ననుటలోను వివాదమే లేదనవచ్చును.
మఱియు మనుచరిత్రమును రచించుకాలమునకే యాంధ్రకవితాపితా
మహాభిరుదము పెద్దన కల్గియున్నట్లు "ఆంధ్రకవితాపితామహా యల్లసాని
పెద్దనామాత్య" అను రాయలవాక్యము స్పష్టపఱచుచుండుటంబట్టి మను
చరిత్రరచనమే పెద్దన కాంధ్రకవితాపితామహాభిరుదమునకుఁ గారణ మని
యంగీకరింప నక్కఱ లేదు. ఇంతియగాక యీప్రబంధమున మనుచరి
త్రాదులందువలె షష్ట్యంతములపదపఁ బట్టణచాతుర్వర్ణ్యచతురంగబల
పుష్పలావికావర్ణనాదులును, నాయకావిరహావస్థా చంద్రమాయతో
పాలంభాదివర్ణనములును నగపడకుండుటయు దీనిప్రాచీనతకు దృష్టాం
తము గానోపును. తిమ్మకవి పైవర్ణనముల నేదో యొకసందుసేసికొని
జొనుపుటకు యత్నించినవాఁడును గాఁడు. తిమ్మకవి యిట్లు తనకావ్యము
ననితరసాధారణముగ నిర్మించుటకు మూలానుస్మృతి యొకటియుఁ,
బ్రబంధరచనాసంవిధాన మక్కాలమునకుఁ జక్కఁగ నేర్పడకుండు
టొకటియుఁ గారణము లనితలంపవలసియున్నది. పైనిప్రాసినవిషయ
ముల ననుసరించి పరిశీలింపఁ బారిజాతాపహరణము ప్రబంధవాఙ్మయ
సౌధనిర్మాణమునకై తొలుదొల్త నెలకొల్పినశంకు వనియుఁ, బ్రాబంధిక

నియమములఁ బూర్ణముగ వెదఁజల్లు మనుచరిత్రాదులు తదనంతరకాలిక సౌధములనియు నొక్కివక్కాణింపనగును. నడువనడువ మార్గమేర్పడుట సహజముగదా! పైనిప్రాసినయుక్తుల ననుసరించి యీప్రబంధరత్నము రాయల పూర్వదిగ్విజయాత్రానంతరమే, యనఁగా రాయలు పూర్వదిగ్విజయాత్రసు ముగించి యింట విశ్రాంతిగైకొను నైదువత్సరముల కాలములోనే వెలువడి కృష్ణరాయరాజరత్నమునకు లభించె నని చెప్పవలసియున్నది. మనుచరిత్ర మన్ననో రాయల కలబరిగి విజయయాత్రానంతర ముత్పన్నమై రాయనాయకమణిచిహ్నిత మయ్యె నని తెల్లమగుచున్నది. కాన క్రీ. శ. 1516-20 నడుమఁ బారిజాతాపహరణమును, 1521 క్రీ. శ. తరువాత మనుచరిత్రమును విరచితములయ్యెనని నిర్ధారణ చేయుట కడ్డంకి లే దని తోఁచెడిని.

ఇఁక మనుచరిత్రరచనాసంవిధానమున కెంతయు మెచ్చి రాయలు పెద్దనను బెద్దగ సంభావించుటయుఁ దిమ్మనార్యు నంతగ నర్చింపకుంటయుఁ బారిజాతాపహరణమునకన్న మనుచరిత్రము ప్రాచీన మనుటలోఁ గారణములుగఁ గొంద అందురు. కాని యిది సరికాదు. పెద్దనను గౌరవించినట్లే తిమ్మనార్యుంగూడ రాయలు గౌరవించె నని తిమ్మన చెప్పికొన్న కావ్యాంతమునంబలి "కృష్ణరాయక్షితీశ కరుణాసమాలబ్ధసచతురంతయానమహాగ్రహారసన్మానయుతుఁడు" అను వాక్యమునుబట్టి మన మూహింపవచ్చును. మఱియు మనుచరిత్రము రచింపఁబడు కాలమునకు రాయలు పూర్ణముగ విజయశ్రీసనాథుఁ డై యెలమిమీఱు నుండుటయుఁ, బారిజాతాపహరణనిర్మాణ కాలమునకుఁ గలబరిగి మున్నగుదుస్సాధముల దుర్గముల జయింపఁ దలంపుఁగొనియుండుట నంతగ సంతుష్టుఁడై యుండమియుఁ గారణము లని తలంపవలసియున్నది. ఇంతియగాక రాయలు సంపూర్ణవిజయశ్రీని జేపట్టి తనరాజధాని నెలమిమీఱు వర్తిలురోజుల శత్రునాశము నిశ్శేషముగఁ జేసి దుస్సాధములఁ గలబరిగాద్యదుల దుర్గముల సాధించి యానందాబ్ధి నోలలాడుదివసములఁ బెద్దనయే మిగిలినయాస్థానకవు లెల్లరిలోఁ బెద్దగ్గై మిగిలియుండుటయుఁ, బారిజాతాపహరణమును మించునట్లు కొంగ్రొత్తపోకడలఁ బెద్దప్రబంధమును నిర్మించుటయు రాయకృతామిత

గౌరవమునకుఁ బెద్దన పాత్రుఁ డగుటకుఁ గారణము లని యూహింప నగును. ఎలమిమీఱి రాయ లుండునాఁడు తిమ్మనార్యుఁడే యున్నఁ బెద్దన కన్నఁ బెద్దగ నాతనినే సంభావించి యుండు ననియుఁ దలంపవచ్చును. మఱియుఁ బారిజాతాపహరణకథ విరివిగ వీరవృత్తమును విశదీకరించు టయు, మనుచరిత్రకథ కేవలము శృంగారమునకు సంబంధించి యమ రుటయును, గ్రమముగఁ గృతిపతి దగు నక్కాలపు వీరవ్యాపారమున కును, నితరచింతారాహిత్యమున వెల్లివిరియు శృంగారవ్యాపారమున కును సూచకము లనుట కవకాశ ముండుటఁ జేసి, పారిజాతాపహరణము రాయల పూర్వదిగ్విజయాత్ర ముగిసిన యనతికాలములోనే విరచిత మయ్యె ననియు, మనుచరిత్రము నిశ్శేషముగ జన్యములయలజడి తీరిన పిదప నుద్భవించిన దనియు తీర్మానింపవలసియున్న ది.

## కృతికర్త

ఈ ప్రబంధమును రచించిన కవితిలకుఁడు నంది తిమ్మనార్యుఁడు. ఈతఁ డార్వేలనియోగి బ్రాహ్మణుఁడు. మలయమారుతకవి యను ప్రశస్తిసహిం చిన ఘంటసింగయకు మేనల్లుఁడు గ్రంథాంతమందలి "కౌశికగోత్రుఁడు" అనుపద్యము పూర్ణముగ నీతనిచరితమును వెల్లడించుచున్న ది. ఇతఁ డాంధ్రభోజుఁ డనుప్రసిద్ధిఁ బడసిన విద్యానగరప్రభువగు శ్రీకృష్ణదేవ రాయలయాస్థానమున నష్టదిగ్గజము లని ప్రశస్తివహించిన కవివరులలో నొక్కఁడు. ఈతనియింటిపేరు నందివారు. ఆయన నీతనిని ముక్కు తిమ్మన యనియే యెల్లరు వ్యవహరింతురు. "నానాసూనవితానవాసనల" అని ముక్కు నతిమనోహరముగ నీతఁడు వర్ణించినకతన నీతని కీనామము గల్గె ననునానుడి గలదుగాని యీపద్యమును రామరాజభూషణుఁడు తనగ్రంథమునఁ జేర్చికొనె ననుకథ యద్దానికన్న మిన్నగఁజెప్పిన లెక్కకు మీఱిన వసుచరిత్రపద్యములనుబట్టి యాలోచింప నెంతయు విశ్వాస పాత్రముగామిఁ, బైపద్యమును వసుచరిత్రకర్తయే రచించె ననియు, ముక్కును ముడివెట్టుటకై పైగాథ నెవ్వరో కల్పించియుంట నది పరంపరగ వచ్చుచున్న దనియు, దీనపీపద్యరచనవలన నీతని కీనామ ముగల్గె ననుట నమ్మదగినమాట గా దనియుఁ జెప్పవలసియున్న ది. కాని "ముక్కు తిమ్మనార్యముద్దపల్కు" అను నభియుక్తోక్తి బహుకాలమునుండియు

వినయయ్యెడినని. ముఖ్యముగా నిట్టినాయకుడి గల్గుటకుఁ బెద్ద లసుకొనినట్లు పెద్దముక్కే కారణ మని యూహింపనగును.

## కృతినిర్వృతికారణము

శ్రీకృష్ణదేవరాయలు తనసతియగుతిరుమలదేవి తనదెస నొండొక ప్రణయాపరాధము గాపింప సహ్యమీజాని యమ్మగువమోమును జూడక నాఁటగోలెఁ గోపావిష్టుఁడై యుండె ననియు, నాసతీపతులఁ గలుపుటకై ముక్కుతిమ్మనార్యున కీకృతి రచింపవలసివచ్చె ననియు, నిందలిసత్యాకోప సంరంభమును సూచించునట్టియు శ్రీకృష్ణకృతసత్యానునయమును బ్రకాశిత మొనర్చునట్టియు ముద్దలొలుకుపద్దెముల విన్నమాత్రమున రాయలు కోపమును విడనాడి ప్రియసతిని సంభావించె ననియు నొక కింవదంతి వినయయ్యెడినని. నిపుణముగఁ బరిశీలింప నిక్కావ్యమునందలి కథాసంవిధానము పైకింవదంతి కనుకూలముగనే యుంట నట్లే యై యుండ నగు ననియూహింప నవకాశమున్నది. మఱియు మూలమున లేని సత్యావామపాదకృతశ్రీకృష్ణశిరస్తాడనరూపప్రసంగము నీతఁడు క్రొత్తగఁ గల్పించుటయు నట్టియపరాధినిని శ్రీకృష్ణుఁడభీప్సితదానమున నధికశ్రమకోర్చి సంభావించె ననుటయు శ్రీకృష్ణదేవరాయలజాయ యగు తిరుమలదేవికైన యపరాధమునకును నామెను రాయలు సంభావించుట కును సూచకముగై యమరుటఁజేసియుఁ బైనానుడి సత్యగై యుండు నేమో యని సంశయము పొడమెడి. మఱియు "ప్రతివర్షవసంతోత్సవ కుతుకాగతసుకవినికరగుంభితకావ్యస్మృతిరోమాంచవిశంకిత చతురాంతఃపురవధూప్రసాదనకసికా" అను విషయమును నిందులకు సూచకమే యగు ననవచ్చును.

## నాయకుఁడు, నాయిక

ఎవనివృత్తము ప్రధానముగఁ బ్రబంధమంతయు వ్యాపించి యుండునో యాతని నాయకునిగ నెన్నవలయుం గాన నిక్కావ్యమున నాసియమము ననుసరించి శ్రీకృష్ణుఁడు నాయకుఁ డగుచున్నాఁడు. అట్లే శ్రీకృష్ణభార్యలలో సత్యావృత్తము ప్రధానమై వెలయుఁ గాన నామెను నాయికగా నంగీకరింపనగును. శృంగారప్రధాన మగు నిక్కా-

వ్యమునందలి యంగభూతపీరాది రసప్రకాశక కథాసందర్భముల నిపుణముగఁ బరిశీలింప శ్రీకృష్ణుఁడు ధీరోద్ధతనాయకుఁడు గానోపును. పఁటియు "ఏయే వేళల నేసరోజముఖి, ఇది భోజాత్మజకిచ్చినన్ గినుకతో" అను మున్నగు శ్రీకృష్ణవాక్యముల ననుసరించి చూడ నీతఁ డందును దక్షిణనాయకుఁ డనఁదగియున్నాఁడు. శ్రీకృష్ణుఁడు పారిజాతమును శ్రమపడి స్వర్గమునుండి గొనివచ్చి సాత్రాజితి పెరటిచెట్టుగ నాటించి తదభీప్సితముం బూరించి యామెను సంభావించె ననుప్రథానకథ ననుసరించియు నీతఁడు దక్షిణనాయకుఁ డగుచున్నాఁడు. తనకుఁ గల దారలందఱియెడలను సముఁడై సంచరించువాఁడె దక్షిణనాయకుఁ డని యాలంకారికసంకేతము గదా!

మగనిశిరసుఁ దన్నుట, పారిజాతప్రసంగమున వనపాలురతో స్తుతిమీఱుఁ బల్కుట, మున్నగుసందర్భములఁ బరిశీలింప నీసత్యా నాయిక ప్రౌఢనాయిక యనియు, నీర్ష్యాకషాయిత యై శ్రీకృష్ణుని ప్రేరఁ దుదకు బాలపల్లవగ్రాసకషాయకంఠకలకంఠవధూకలకాకలీ ధ్వని మీఱ నేడ్చినప్రస్తావన ననుసరించి ధీరాధీర యనియు, మానవతి యసయుఁ దెల్లమయ్యెడిని.

## మూలకథ, ముఖ్యములగుమార్పులు

సంస్కృతహరివంశకథ నాధారముగఁ గొని యీప్రబంధమును దిమ్మనామాత్యుఁడు రచించె నని మొట్టమొదటనే యుక్తమయ్యె. మఱియు నందలిశ్లోకములకు సరియగునాంధ్రీకరణమునుగూడ నందం దొనర్చుచు మహాకావ్యలక్షణలక్షిత మగుట కుచితముగ సూర్యోదయాస్తమయ చంద్రోదయాది వర్ణనముల నందందుఁ జొనుపుచుఁ బాత్రోచితముగ మూలకథలోని కొన్నిసందర్భముల మార్చుచు నిక్కావ్యరత్నము నొనర్చె ననియు మున్నే చెప్పఁబడినది.

శ్రీకృష్ణుఁడు తాను రుక్మిణియొద్ద నుండఁగ నారదుఁడు వచ్చి యక్కుసుమము నొసఁగె ననియు దాన తాను దయమీఱి రుక్మిణికద్దాని నిచ్చితి ననియుఁ గానఁ దప్పు టేమింపవలె ననియు సత్యను వేఁడుకొని నట్లు మూలమున నుండఁగ, నిందుఁ గృష్ణుఁడు సత్యాపాదములకు మ్రొక్కి

నట్లును నామె పతిశిరసును వామపాదమునఁ దాఁచినట్లును గవి మార్చి
నాఁడు. ఇందులకు నాయకుని మితిమీఱినశృంగారమును నాయికో
ద్ధతిని గనుపఱుపఁ గవి సంకల్పించికొనుటయే కారణ మని యెన్నవల
యును. మఱియు "దాసే కృతాగసి" అను సంస్కృతశ్లోకార్థము నను
సరించిన నిట్టికృత్య మాలంకారికలక్షణలక్షితమే యనవలసియున్నది.
ఇంతియగాక యిట్టియపరాధినినిగూడ నాయకుఁడు క్షమించుటయేగాక
యామె కోర్కిని దుష్కరమైనదానిని నెఱవేర్చి యనునయించినట్లు
వర్ణించుట కతన నాయికానాయకుల యనోన్యప్రేమాతిశయము
సహృదయ హృదయఫలకములఁ జిత్రితమగు ననియు, దాన కావ్యరసము
పరిపుష్టి నొందు ననియు, దాన నాయికోద్ధతి స్త్రీస్వభావముఁ దేటపడు
ననియుఁ గవి కరం బెంచె నని చెప్పనగును. మఱియు నింతటి యపరాధి
నినే కృష్ణుఁడు క్షమించి యామెకోర్కిని నెఱవేర్చి యామె ననునయించు
నపుడు తాము తమజాయను తిరుమలదేవిని నఁల్పాపరాధము గావించిన
దానిని క్షమించి యనునయించు టెంతయు సుచిత మని కవి కృతిపతి
కేతస్తూలముగ బోధించి కావ్యరచనాప్రధానోద్దేశము నీమూలముగ
వెల్లడించె ననియుఁ జెప్పనొప్పును.

సత్య పారిజాతసుమవృత్తాంతముఁ దెలిసికొన్నపిదపఁ గృష్ణు
నితోఁ దాను దపమొనర్పఁ బోవుదు ననియుఁ బతి యనుమతిలేక సతి
చేయు వ్రతములు వితథము లగుట నీయనుజ్ఞఁ గోరుచుంటి ననియుఁ
బల్కినట్లు మూలమున నుండఁగ నిం దాప్రసంగమే యగపడకున్నది.
మానవతియు నుద్ధతిపొంగారఁ బొల్చునువిధయు నగు సత్యదైనశీల
మున కిమ్మాట లంతగఁ బనికి రా వని యెన్ని యీప్రసంగమును గవి పరి
త్యజించినట్లు తోఁచెడిని.

శ్రీకృష్ణుఁడు నారదుని గల్పనగమును దనకొసంగున ట్లింద్రుని
సన్నుతింపఁ జేయు మని కోరె ననియు, నట్లాతఁ డీయకున్న గదతో నాతని
యెద మోదెద ననియు ననినట్లును, నారదుఁడు వెడలివచ్చి యింద్రుఁ
డందులకు సన్నుతింపమినిఁ దెల్పె ననియుఁ, బిదపఁ గృష్ణుఁ డింద్రుని జన్య
మున జయించి పారిజాతముం గొనె ననియు మూలకథ గలదు. తుదకు
జరిగినది జన్యమున పారిజాతముం గొనుటే గానఁ గవి శ్రీకృష్ణుఁడు నార

దునిమూలమున నింద్రుని సంప్రార్థించినట్లు గల కథాసంబర్భమును నాయక గుణాపకర్షకుఁ గారణమగుదానిఁ బరిత్యజించి ధీరోద్ధతలక్షణ లక్షితుఁగాఁ జేయ సంకల్పించె ననియీమార్పునకుఁ గారణము నూహింప వలసియున్నది. మఱియుఁ బెఱరాజులకుఁ బగతుర కిట్లు వార్త సంపుట చెల్లుంగాని సర్వవిధములఁ దాను ప్రేమమీఱి నరయు నగ్రజున కిట్లు తప్పుఁగుట్ట యొకమహామహానిమూలమున వార్తసంపుట సరి కాదనియుఁ గవి భావించె నని తోఁచెడిని. ఇంతియకాక యదితికుండలముల నర్పింప నరిగె ననుటంజేసి నాయకుని పౌరుషాతిశయమును మాతృభక్తియు వెల్లడింపఁ గవి యత్నించి యిట్టిమార్పు నొనర్చియుండు ననియుఁ జెప్ప నగును.

శ్రీకృష్ణుఁడు పారిజాతమునకై పరమేశుంగూర్చి తపమొనర్చి వరము వడసినట్లు మూలమున: గలదు. ఇం దట్లుగాక సత్యాసమేతుఁడై స్వర్గమున కరిగి యుపేంద్రుఁ డింద్రసమ్మానితుఁడై యింద్రద్రుమము నపహరించి జన్యమున నింద్రు నోర్చి జయముఁ గొనెనని యున్నది. జగదీశుండును బరాత్పరుండును శ్రీమహావిష్ణ్వపరావతారుండును నగు శ్రీకృష్ణుఁ డింకొకదైవము నారాధించి వరము వడసినట్లు చెప్పినఁ బరమ వైష్ణవుం డగు కృతిపతి కృష్ణరాయలు మది నే మనుకొనునో యనియు, వైష్ణవమతము విజృంభించు నక్కాలమున విష్ణుమతావలంబకులతో నిండి యుండునారాయల నిండుకొలువున నస్మాదృశులహృద్యము లగుటఁ దన కావ్యమున కుత్కృష్ట చెడునేమో యనియుఁ గవి యనుమానించి, యిట్లు వైష్ణవమతానుకూలముగఁ గథాసంబర్భమును మార్చెనేమోయని యను మానింపవలసియున్నది. ఇంద్రోపేంద్రులజన్యసంరంభముఁ గాంచి జగ ములు కడుఁగడు భీతిం జెంద నజప్రేరితులై యదితికశ్యపులు పారి జాతమునుఁ గొనిపోవఁ గృష్ణున కనుజ్ఞయిడి రని మూలమున నుండ నిందు జన్యమున జయముఁ గొని కొనిపోయినట్లు కథ యగపడును. నాయకుని పరాక్రమాతిశయప్రకాశనమే ముఖ్యప్రయోజన మనియు, నట్టిప్రయో జనము మూలకథ ననుసరించిన సిద్ధింపకుండుటేగాక పరాక్రమాపకర్షకుఁ గూడఁ గారణ మగు ననియు నెన్ని, కవి యిం దిట్లు మార్చియుండునగును. తలిదండ్రులు దయదలఁచి యిచ్చిన కల్పనగముఁ గొనిపోయె నని

చెప్పినఁ గృష్ణుని పరాక్రమము ప్రకాశిత మె ట్లగును? మఱియు శ్రీకృష్ణప్రతాపాతిశయ ప్రకాశనమూలమునఁ గవి కృతిపతి కృష్ణ రాయ ప్రతాపాతిశయమును వ్యంగ్యమర్యాదను సూచింప నెంచిన ట్లూహింపవలసియుంటఁ, గవి తనయుద్దేశమున కనుగుణముగ నిట్లు మార్చియుంపు నని యందులకుఁ గారణము నూహింపవలసియున్నది.

ఇంతియగాక మూలమునఁ బ్రసన్నుఁడగుశ్రీకృష్ణుని నారదుఁడు దేవతలలోఁ దనకు బ్రహ్మత్వము సిద్ధించునట్లును నాభగవానునిసాలో క్యము సంప్రాప్తమగునట్లును వరము వేఁడిన ట్లున్నది. ఇం దట్టికథాసంద ర్భమే గానరాదు. బ్రహ్మ మానసపుత్రుండును పరమతపస్వివిత్రుండును నగునారదునిచేఁ దిరుగ బ్రహ్మత్వమును శ్రీకృష్ణుని యాచింపఁ జేయుట వలన నొక్కింత ప్రయోజన ముండఁబో దనియుఁ, బురాణములు బ్రాహ్మణ మహిమం దేటఁగుచుటకును బ్రహ్మమతము నుద్ధరించుటకును సుద యించిన వగుట నట్లవి చెప్పియుండు ననియుఁ గవి యెన్ని పైకథాభాగ మును బరిత్యజించియుండ నగును.

మూలమున నంతగఁ బుణ్యకవ్రతము వర్ణితము గాకున్నను నిందు విస్తృతిగఁ బుణ్యకవ్రతవిధి వర్ణితమయ్యెను. ఇట్లు వర్ణించుటకు శ్రీ కృష్ణభగవానునిభక్తపరాధీనతను నాతనివైభవసమృద్ధిని ప్రకాశిత ములఁ జేయుటయే పరమప్రయోజన మని తలంపవలసియున్నది. మఱియు సత్యాపాత్ర కొక లెస్సయగు విపరిణామముంగూర్చుటకును నిది సాధన మగుచున్నది. నారదకృతకృష్ణస్తవాదులు మూలమునఁ గానరావు. అక్కాలమున విష్ణుమతము విజృంభించుటఁ జేసియుఁ బరమవైష్ణవుండు కృతిపతియగుటఁ జేసియు, విరివిగ విష్ణుభక్త్యుద్రేకమును కల్గించుకథా సంచర్భములఁ గవి కూర్చియుండు నని యందులకుఁ గారణముల నూహింపవలసి యున్నది.

మూలమునఁ గానరాని చంద్రోదయసూర్యాస్తమయస్వర్గవర్ణ నాదులను దనకావ్యము మహాకావ్యలక్షణలక్షిత మగుటకు నాలంకారిక సంప్రదాయము ననుసరించి సందర్భోచితముగఁ గవి కల్పించె నని తలంపవలసియున్నది. ఇంకను లెక్కకుమీఱిన భేదములు మూలమునకు

నాంధ్రీకరణమునకును గలవుగాని యవి యంతగ నెన్నవలసినవి గామిం జేసి యవి యనాదృతము లయ్యె ననిసహృదయులు తలంపవలయును.

## కథాసంవిధానము - పాత్రపోషణము

సామాన్యముగఁ బ్రబంధములందుఁ గావ్యత్వసంపాదనమునకై సమకూర్పఁబడిన వర్ణనాదులవలనఁ గథాసరణి మృగ్యమగును. మఱియు నట్టివర్ణనలు కథావేగమున కడ్డంకి గల్గించుచుంటఁ బాఠకులకు విసువు జనించును. ఇంతియగాక ప్రబంధవాఙ్మయమును బరికింపఁ దత్కర్తలు కావ్యలక్షణములగు పురశైలాదివర్ణనములను సందర్భింపఁజేయుటకై కథాసందర్భమును బరిగ్రహింతురుగాని ప్రధానముగఁ గథ నడుపుటకుఁ గా దని విశదమగును. ఇందుఁ దిమ్మనార్యుఁ డట్లుగాక కథయును గథావేగమును బ్రధానముగఁ గొని వాని కడ్డంకిని నాయావర్ణనాదులఁ గల్పింపక సందర్భోచితముగ వర్ణనములఁ జేయుచు మొదటనుండి తుది వఱకు కథ నొక్కరీతిగనే నడిపినవాఁడు. దీనఁ బాఠకహృదయములకుఁ గథ సుబోధ మగుటయేగాక చదువ దొరకొన నుత్తరోత్తరకథాజిజ్ఞాసయు మెండగుచుండును.

ఆంధ్రప్రబంధవాఙ్మయమునందలిపాత్రలు సామాన్యముగా నొకేస్వభావము గల్గియున్నవి. తత్తదవస్థావిశేషముల పాత్రముల శీలము భిన్నభిన్నముగా నుండవలసియుండ నొకేవిధముగ నున్న ట్లగపడును. మానవస్వభావములు భిన్నభిన్నము లనియు శృంగారాద్యవసరముల వారిమాటలును వర్తనమును దన్మనోగతి ననుసరించి వేర్వేఱుగ నుండు ననియు లోకానుభవజ్ఞులగు సహృదయులకుఁ దెల్లమే. అయినను బ్రబంధకవులు సామాన్యముగ గ్రంథానుభవమునే తమ గ్రంథములఁ బ్రకటించిరిగాని మానవలోకానుభవమును బ్రకాశిత మొనర్ప యత్నించినవారు కారు. మఱియు సృష్టివైచిత్ర్యమును స్పష్టీకరింపఁ గవు లాదినుండియు నలవాటువడినవారు గారు. ఇక నీకృతికర్త యన్నన్నో సామాన్యముగ నన్ని పాత్రములకును నందును సత్కాకృష్టాది ప్రధానములకును నొండొంటికి సరసముగ సహజమగుగతిని స్వభావ భేదమును బాత్రోచితముగఁ బరికల్పించి కథాభాగమును గూర్చిన వాఁడు. నాదాదిస్వతంత్రపాత్రలను దత్తత్సమయోచిత ప్రసంగ

ప్రవర్తనలమూలమున మెఱుఁగువెట్టి సరసముగఁ జిత్రించినవాఁడు. ఇఁక నీకృతియందలి నాయక శ్రీకృష్ణపాత్రము నించుక పరికింతము.

శ్రీకృష్ణుఁడు భగవానునియపరావతారము. కాన నతనియందు దైవమానుషచర్యలు మేళవించి యుండవలయును. మఱియు నాతఁడు ప్రకృతము మానవుండై మహి నవతరించినవాఁడుగాన, నాతనిసతులు గాని యొరులుగాని భగవానుఁ డని గుర్తింప కుండునట్లును మానవుని వలెఁ గష్టసుఖాదులకు లోనగునట్లును నాపాత్రను చిత్రింపవలయును. కాన ముక్కుతిమ్మనార్యుఁ డితరప్రబంధకర్తలవలె నాయకునికులాదులను సౌందర్యసౌష్ఠవాదులను నిరూపింప మొదలిడక సర్వాహ్లాదీమవాసియగు మహోత్తునికులసౌందర్యాదులవర్ణనమును విడుచుటమూలమున, దేవత్వము గూఢముగఁ బ్రకాశితమొనర్చు నారదునిపంపున సౌఖ్యరసైకలోలుండై పదియాఱువేవుర లలనామణులను దన్ను వాంఛించు వారినిఁ గూడి విహరించుచుండె ననిమానవత్వముఁ బ్రకాశితముచేసి, మొట్టమొదట నాయకుని బాలకుల కెఱుకపఱచినవాఁడు. పిదప మాయాకల్పనాచాతురిచే నాసరోజముఖుల నెల్లరిని సంతోషపెట్టుచుండె ననివర్ణించి తన్మానవత్వమును మఱికొంత వృద్ధిచేసి చూపినవాఁడు. రుక్మిణితో వినోదించునదనున నారదుఁడు విజయముచేయ శ్రీకృష్ణుఁడు, "నేను గృతార్థుఁడను, నాపైఁ గరుణ గలిగియుంట యిదియ కారణము" అను మున్నగుమాటలనాడినట్లును, మఱియు గృహస్థధర్మము ననుసరించి తనమందిరము పవిత్రమయ్యె ననియుఁ గృతార్థుఁడనైతి ననియుఁ బల్కినట్లును గవి నిరూపించి, శ్రీకృష్ణునిమానవత్వమును మఱికొంత పుష్టినొందించి ప్రకాశితమొనర్చినవాఁడు, కలహాశనమునిచే శ్రీకృష్ణునవతార విశేషముల సంకీర్తింపఁజేసి నిగూఢముగఁ దన్మూలమున దేవత్వమును భాసిలఁజేయుచుఁ, బారిజాతసుమప్రదానవిషయమున నాయకున కుదయించిన యీరాటమునమూలమున నాతనిమానవత్వమును దేటతెల్లము గావించుచు, సత్యభామామందిరమున కరుగునపుడు నాయకునితాల్మి కేతనపటాంచలచంచల మైయుండె ననియుఁ, దత్తరము తురగజవము మున్ గడవఁ ద్రోయఁగడఁగుచుండె ననియు, మానసము తిరిగెడుబండి కండ్లపగిది భ్రమించుచుండె ననియుఁ జెల్వి, నాయకునిమానుషసహజ

స్వభావమును బ్రత్యక్షమునేయుచు, కోపగృహమునఁ దనకాంతకు నాయకుఁడు చెలులచేత నున్న తాళవృంతముం దానె పట్టివిసరి పేరలుకం జెందిన తనకాంత నసునయించె ననియుఁ, దనకుఁ దనప్రియురాలిపైఁ గలకూర్మియు విధేయతయు నాజ్ఞావశేవ ర్తిత్వమును హాయావాదిత్వము దోఁప బ్రకాశితమొనర్చె ననియుఁ దెల్లము గావించి, కాముకసహజ స్వభావమును గన్నులయెదుట మూర్తీభవింపఁజేయుచుఁ, దాఁజేయు యత్నమంతయు వ మ్మగుటఁ దుట్టతుదకు నాయకుఁడు జగన్మాటక సూత్రధారి భార్యాపాదముల కర్మిలి మ్రొక్కె ననియు, నామె కోపో ద్వేగమున నాత్మీయవామపాదమున నాతనిశిరసును దొలఁగం ద్రోయ నదియే తనకు మన్నన యనియు మీఁదుమిక్కిలి యామెపాదము స్వతను పులకాగ్రకంటకవితానము సోఁకి నొచ్చె నని విచారించె ననియుఁ దెల్పి, కవి నాయకునిమానవత్వమును బరిపూర్ణత నంచించుచు, నాపాత్రను జిత్రించెను. ఇట్లు పారిజాతాపహరణసమయమునందలి యాతనిబలప్రతా పాదులను, బరాజితుఁడగు బలారి శరణువేఁడ నీమఱందలీకొమ్మ వదాన్య భూరుహమునుకోరినఁ దెచ్చితిఁగాని కొమ్మ నీసొమ్మని వజ్రమిచ్చి మధు సూదనుఁ డాతను వీఁదలంచె నని వర్ణించి యాతని బాన వీరత్వమును, సత్య భారవోయఁ బా నారదుని యాజ్ఞావశుండయి మెలంగె నని వర్ణించి యాతనిభక్తపరాధీనతను బాలకులహృదయఫలకములఁ జిత్రించినవాఁడు. నిపుణముగఁ బరికింపఁ బ్రథమాశ్వాసకథాసంబర్భముంబట్టి శ్రీకృష్ణపాత్రమునకు శృంగారముతోడను, బంచమాశ్వాసకథా భాగమునుబట్టి వీరముతోడను, సంబంధమును ముఖ్యముగఁ గవి కూర్చినట్లు విశదమగుచున్నది. ఏపట్టునను గవి యితరపాత్రమూలము ననే నాయకుని దేవత్వమును సూచించినవాఁడుగాని నాయకవర్తనాదుల మూలమున సూచించియుండ లేదు. ఒక్కదేవేంద్రుని వజ్రముం జేతఁ దాల్చునదనునమాత్రము దేవత్వము పాత్రప్రవర్తనమూలమునసే తెల్లమైనది. మొత్తముమీఁదఁ గవి శ్రీకృష్ణపాత్రమును 'గవికల్పిత పాత్రమా నిక్కమైన మానవుఁడా' యనుసంశయము డెందములకుఁ బొందుపఱుచుచుఁ గావ్యమునఁ బొందుపఱుచినవాఁ డని నొక్కి చెప్ప నొప్పును.

అట్లే సత్యాపాత్రమునుగూడ ననితరసాధారణముగ నిర్మించి కవి తనచాతుర్యమును ప్రకటించినాఁడు. కవి శ్రీకృష్ణునిగుణాదిసంకీర్తన మొనర్పక పాఠకుల కెఱుకపఱచినట్లే సత్యభామనుగూడ నెఱుకపఱచిన వాఁడు. ఈకృతికర్త పాత్రము నెట్టిదిగా మొట్టమొదట ముచిమాట లతో నెఱుకపఱుచునో యమ్మాటల ననన్వర్థములుగాఁ జేయుటకే యుత్తరకథాసందర్భముల యత్నించువాఁడు. కులమును రూపము నగనికూరిమియుం గలదాన ననుగరువతనము గలది సత్య యని తోలు దోల్తఁ గవి యీపాత్రమును గన్నులయెదుట నిడినవాఁడు. స్వాధీన పతిక ననుగర్వముగలది సత్య యని కవి ముఖ్యముగ నిరూపింప నెంచిన వాఁడు. మఱియు శ్రీకృష్ణభార్యలం దీమె మానవతి ననియు మహనీయ సౌభాగ్యవతి ననియు ననుకొనుచుండు నని వర్ణితయయ్యె. ఇట్టిగుణములఁ గూర్చుచుఁ గవి యీపాత్రము నెట్లు చిత్రించెనో యిఁక నరయుదము.

తనశృంగారవనమునఁ జుంద్రోపలవేదిపై సరసగోష్ఠిక బోటియుం దా నుండఁగా నామెకు దక్షిణనేత్రస్పందమైనట్లును దోడనే యామె 'దక్షిణాంసచూచుకనయన ప్రకంపగుణసూచనలేమియు వల్లగావు సారెకు మది జాలిఁబొంది యొకరీతిఁ దలంకెను. ప్రాణనాథుఁ డొండొక చపలాక్షిఁ గూడి యొల్లనిచెయిదము లేమిఁచేసెనో' అని వగఁ జెందఁ జొచ్చె ననియు నజ్ఞాతపారిజాతసుమవృత్తాంతను సత్యను గవి వర్ణించె. పారిజాతసుమవృత్తాంతము నెఱుంగనిసత్య కేవల దక్షిణనేత్రస్పందము మూలమున మఱియొక యనిష్టము నూహింపక మగనికూరిమి మఱి యొకమగువపైకిఁ బోయె నని యనుమానించుటకతన నామెకుఁ గల మానవతీత్వమును మగనికూర్మి మిక్కిలి గలదనుగరువతనమును మిగులఁ బ్రకాశితములయ్యె. అనంతర మామెకుఁ బారిజాతసుమవృత్తాంతము తెల్లమగుడు వ్రేటువడ్డ యురగాంగనవలెను నేయివోయ బగ్గన దరి కొన్న భీషణహుతాశనకీలలీలను విజృంభించి కనులఁ గోపారుణకాంతులు చెలంగఁ గలహశేషుని, శ్రీకృష్ణుని, సవతులను దూలనాడి తనస్వాధీన భర్తృకతను జెలితోఁ జెప్పికొనుచు మిగుల గుంది కోపసపనమున కేగె నని గవి సత్యను వర్ణించె. భర్త తనమాటఁ జవదాటఁ డను నచ్చిక గలమచ్చికంటి కపు డాపారిజాతసుమవృత్తాంతశ్రవణము మానహానిని,

మగనికూర్మికి భంగమును గూర్చిన దగుటంజేసి, వ్రేటువడ్డ యురగాంగన వలెను నేయివోయ బగ్గన దరికొనువహ్నితాశనకిలవలెను సత్య విజృం భించుట సంభవించిన దనుట తెల్లము. దీన నాయికామానవతీత్వము మగనికూర్మగలదాననుగరువతనమును బ్రస్ఫుటములుగాఁ గవి యెనర్చె నని చెప్పనోప్పును. మఱియు నీసందర్భమునఁ గవి సత్య పారిజాత సుమవృత్తాంతము నాకర్ణించి యంతటిమానహానిని సహించి ప్రాణ ములు భరింపఁజాల నని యుఱక యసురుల విడువఁదలంచె నని వర్ణిం చుచు నామెయగుమానవతీత్వమును గడుంగడుఁ బ్రకాశిత మొనర్చిన వాఁడు. కులసతి మగనికూర్మి మఱియొకవనితయందుఁ బ్రసరించె నని తెలిసిన నోర్వఁజాలకుంటయు నందును మానవతికి సవతులయెడుట పరా భవము గల్గిన సహింప వీలులేకుంటయు సహజములుగదా! ఈసందర్భ మునఁ గవి స్త్రీస్వభావమును జక్కఁగ సహజమగుగతిని బొందుపఱచి సత్యభామపాత్రను జిత్రించి తనయసమానసైపుణిని జూపినవాఁడు. ఇట్లే సవతులయెడుట మగఁడు తన్నవమానించుటయు నారదుఁడు తన్నాసమ యమున నూరకొనక తడవుటయు సత్యకు మిగుల సంతాపజనకము లయ్యె నని వర్ణించుటవలన నామెగరువతనము సుప్రకాశితమయ్యె నని యెన్నవలయును. మగనికూర్మి నంతగఁ జూఱఁగొనిన సౌభాగ్యవతికి మానవతి కంతటియవమానము గల్గిన నామెయలుక సామాన్యముగఁ దీరదుగానఁ, గవి నాయకునిచే నామెయలుకం జక్కదిద్దుటకై పలు పాటులఁ బడఁజేసియుఁ బ్రయోజనముఁ జూపక యాతనిచే నమ్మానవతికిఁ బ్రణామముసేయించి తగినశిక్ష గావించి పారిజాతముం బెరటిచెట్టుగ నొనర్చు నని శపథ మొనర్పించి యామెక్రోధాగ్నిం జల్లార్చినాఁడు. ఈ సందర్భమునఁ గవి కోపగృహమునందలి సత్యయునికిని, వర్తనమును, స్త్రీస్వభావమున కెంతయు ననుగుణమగురీతిని వర్ణించి పాఠకహృదయ ముల రంజిలఁజేసినవాఁడనుట యతిశయోక్తి గానేరదు. తన్నవమానిం చినవారికిఁ దగినశిక్ష యొనర్చినంగాని, మానినికోపము చల్లారకుండుట సహజమాటను సత్యాపాత్రముమూలమునఁ గవి సూచించినవాఁడు. మఱియు నీసందర్భమునఁ గవి మానవతికి మానమే ప్రాణమునకంటె నధిక మని నిపుణముగ నిరూపించినవాఁడు. సురేశ్వరువనపాలకులతోడ

సత్య యొనర్చినప్రసంగ మీమామె వీరపతివ్రత యనుటకును గరువతనము మిక్కుటముగఁ గలదియనుటకును బ్రబల నిదర్శనములు. మఱియు ననికైన బతి నిన్నఁ బాసి చనునో యన్న నారదునిమాటల నీసందర్భమునఁ గవి యన్వర్థములుగఁజేసి చూపినాఁడు. ఇట్టిమానవతిని గర్వము గలదానిని బుణ్యకవ్రతాచరణముమూలమునఁ గవి నిపుణముగ గర్వాదులం దొలఁగంద్రోసి యతుల భక్తియుక్తగా మార్చి మనకండ్లయెదుట పెట్టుటకతన నాతనిపాత్రపోషణనైపుణి యనితరసాధారణమైన దని చెప్పుట కేమిసందియము? మొత్తముమీఁదఁ దిమ్మనార్యుఁ డీపాత్రమును స్త్రీస్వభావమును జక్కఁగఁ బోషించుచు శ్లాఘ్యతమముగ నిర్మించె ననుటకు సందియము లేదు.

ఇట్లే నారదపాత్రమునుగూడఁ దత్కాలహితత్వరతను నుత్తమ భక్తత్వమును దేటతెల్లము గావించుచుఁ జిత్రించినవాఁడు. పట్టమహిషి యగురుక్మిణినిగూడ నుచితరీతిని జిత్రించినవాఁడు. పారిజాత మీమెకు భర్త యొసంగి గారవించుసందర్భము ననుసరించియు నీమె పుణ్యక వ్రతమునకుఁ బోవుటయె యుచిత మని యెన్నుకొనుసందర్భమును బట్టియు నీమె సమయజ్ఞ యనియు గరువతనము కొంచెమైనను లేని నిపుణ యనియుఁ దెల్లమగును. తక్కుంగలపాత్రములనుగూడ నిట్లే తిమ్మనార్యుఁడు మనోహరముగఁ జిత్రించినవాఁడని పాఠకులు పరిశీలించి గ్రహింపవలెను.

ఇట్టిపాత్రపోషణ కథాపోషణాదినైపుణులతోఁబాటుగ నీకవి పుంగవునకు మృదుమధురపదరచనానైపుణి గుదిరియుంట కడుంగడు శ్లాఘింపఁదగినది. కథాసందర్భమునకును బాత్రస్వభావమునకును రస మునకును నుచితమగురీతిని బదజాలము నుపయోగించుట కితఁడు మిగుల యత్నించినవాఁడు. మఱియుఁ బ్రసన్నలాకలితములగుపదములనే తనప్రబంధమున వాడినవాఁడు. కావుననే "ముక్కుతిమ్మనార్య ముద్దుపల్కు" అనునానుడి యన్వర్థ మని పండితపాఠకుల స్వాంతములకు విశద మయ్యె. పాఠకహృదయసీమల నాఁటుకొనుంజాలుపాత్రములను, గథా వేగమున కడ్డంకిని గల్గింపని హృద్యములగువర్ణనములనుగూర్చి ప్రౌఢ పాకమగుశైలితోఁ బ్రబంధము నుత్తమోత్తమముగ రచించిన యీ

తిమ్మనార్యునకుం బ్రబంధకవులలో నగ్రస్థాన మొసంగుట కడ్డంకి లే దన వచ్చును.

## వర్ణనలు - విశేషవిషయములు

ఇందలివర్ణనములు సంగ్రహములును భావగర్భితములును మనో హరములును నై కథావేగమునకు భంగమును గలిగింపనివియును, పాత్ర కులమునకి విసువునుబుట్టింపనివియును నైయున్నవి. కావ్యమున సాధారణ ముగ నష్టాదశవర్ణనములను జేయవలయు ననియాలంకారికులు శాసిం తురు. కాని వానిని సందర్భోచితముగనే చేయవలయు ననియారభిప్రాయ పడినట్లు "వానిలోఁ గొన్నితక్కువయైనను నిష్టమే" అను వారివాక్యమే స్పష్టపఱచుచున్నది. కావుననే తిమ్మనార్యుఁడు సాయంకాలస్వర్గప్రయా ణాదులం గొన్నింటిని కావ్యలక్షణము ననుసరించి సంగ్రహముగను స్వభావసిద్ధముగను నొనర్చినవాఁడు గాని ప్రయోజనశూన్యముగ వర్ణనములం జొనిపినవాఁడుగాఁడు. అందు ద్వితీయాశ్వాసమునందలి యంధకారనక్తంచంద్రచకోరాదివర్ణనములును, మేర్వాదివర్ణనములును, తృతీయాశ్వాసమందలి నందనోద్యానాదివర్ణనములును, చతుర్థాశ్వాస మందలి మధ్యాహ్నజలకేళీవర్ణనములును, పంచమాశ్వాసమునందలి యుద్ధాదివర్ణనములును సందర్భశుద్ధి గలవై మనోహరములై యలరారు చున్న వనుటకు సందియము లేదు.

కవిబ్రహ్మ యగు తిక్కనసోమయాజినుండి ప్రారబ్ధ మై వచ్చు చున్న స్వప్నవృత్తాంత మిందుఁ బరిత్యక్తము. కవిబ్రహ్మకాలమునాఁ డీవృత్తాంతము రసవంతముగ నుండియుండునేమోగాని యానంతర కాలికకవులకాలమునాఁ డిది నీరసమైయే యుండెడి దనియుఁ బాఠకులకు విసువుపుట్టించెడి దనియుఁ బరిశీలించిన విశద మగును. ఇట్టి స్వప్నవృత్తాం తముం గవులు తమగ్రంథముల కపూర్వమగుగౌరవము నాపాదింపఁ గూర్చికొన్న దని నిపుణముగఁ బరిశీలింపఁ దెల్ల మగును. తిమ్మనార్యుఁడు తనగ్రంథమునకు గౌరవము సందర్భశుద్ధి, పాత్రపోషణము, కథా చమత్కృతి, రచనాపాటవము, రసస్ఫూర్తి మున్నగువానిమూలమునసే సంపాదింప నెంచినవాఁడుగాని లేనిపోనిపోకడలవలన సంగ్రహింప

యత్నించినవాఁడు గామించేసి, యట్టిలాంఛనమును బరిత్యజించె ననఁ
దగును. మఱియుఁ బ్రబంధవాజ్మయసౌధనిర్మాణమున కీగ్రంథము శంకు
వగుటంజేసియు నిం దట్టిస్వప్నవృత్తాంతము పరిత్యక్త మనఁదగు.

ఇంతియ గాక కవిలోకముచేఁ జర్వితచర్వణముగఁ జేయఁబడు
సుకవిస్తుతి కుకవినిందలును నీకబ్బమునఁ గానరావు. కవితాకలితు లగు
కవులెల్లరును గుకవుల నిందించునపు డట్టినిందకు స్థానభూతు లగు కాకవు
లెవ్వ రని యనుమానింపవలసియుండుటంజేసి, తిమ్మనార్యఁ డట్టినిరర్థక
మగు మార్గమును వదలినవాఁ డని చెప్పఁదగు. మఱియు నీకృతికర్త తన
గ్రంథమునకుఁగాని తనకుఁగాని గౌరవము పండితపాఠకులమూలము
ననే గల్గు నని యెంచి యట్టి యప్రస్తుతప్రశంసను విడిచియుండనగును.
కుకవులమిషను బరుల నిందించుట పాడిగాదు గదా!

ఇతరప్రబంధములందువలె నిందుఁ గవివంశానుక్రమణికను దెల్పు
పద్యములు గానరావు. సాధారణముగ నాంధ్రకావ్యములం దీసందర్భ
మునఁ గవులు తమ గుణాతిశయమును, గౌరవాతిశయమును, బొండి
తాద్యతిశయమును, దాతముఖ్యాతలగొప్పందనమును, వర్ణించికొని నిపుణ
ముగ నాత్మశ్లాఘచేసికొనుట యాచారమైయున్నది. ఏవానివంశగౌరవ
మునకైనను, నేవానిగౌరవమునకైనను, నేవానిపాండిత్యోత్కర్షాదుల
కైనను లోకము ప్రమాణముగాని వానివాక్యము ప్రమాణము
గాకుంట సహజము. మఱియు నొకవేళ నవ్వాని నొకఁడు చెప్పికొన్నను
నయ్య దాతనియాత్మశ్లాఘాపరతనే సూచించున దగును. కావుననే తిమ్మ
నార్యఁ డాప్రసంగ మనుచిత మని యెంచి సంత్యజించి ప్రబంధాంతమున
నతిసంగ్రహమున నొక్కసీసమునఁ దనవంశానుక్రమణిని సరసముగఁ
బాఠకలోకమునకుఁ దెల్లము గావించె. మఱియు మనుచరిత్రాదులందు
వలె నిందుఁ గృతిపతి కర్పూరతాంబూలాదులఁ దన్నర్చించి కృతి
యొసంగు మని వేఁడినట్లు కవి చెప్పికొనలేదఁ. దీనఁ గవి కృతిని రచించి
తానే కృష్ణరాయలను బతిగ నిర్ణయించికొన్నట్లును, గృతిని రచించి
యుత్తమనాయకుని వెదకి యర్పించుటయే యుచిత మని యెంచినట్లును
దెల్లమగుచున్నది. గ్రంథాంతమున గృష్ణరాయదత్త బహుళాగ్రహార

సన్మానయుతుఁడ ననిమాత్రము చెప్పికొని కృతిపతికిఁ దనయందలి యత్యధి కాదరమును గూఢముగ వెల్లడించికొనెను.

కృతిపతి వంశానువర్ణనమునఁ గూడ నీకవిపుంగవుఁ డందు ముఖ్యులును బ్రసిద్ధులును నగువారిని సరసముగను మనోహరముగను స్వభావావిదూరముగను వర్ణించి కృతిపతి నతిహృద్యము లగు యథార్థ ములైనవచనములతోడ నుతించి నిపుణముగ వర్తించినవాఁడు. మొత్తము మీఁద నితరప్రబంధకర్తలవలెఁగాక నీతఁ డెల్లసంవర్భములందును బ్రధానముగ నౌచిత్యమును గమనించుచునే వర్తించె ననియు నిట్టు రసవంతముగఁ గబ్బమును రచించుట యన్యకవిసాధారణము గాదనియు నిట్టిహృదయంగమమగుశైలి యన్యకవిదురాప మనియు దాన నీకవి పుంగవునికబ్బ మెల్లభంగుల హృద్య మనియుఁ దెల్పుచు గ్రంథవిస్తర భీతిని విరమింతును. తక్కుంగలవిశేషములఁ బాఠకసహృదయులు పరిశీ లింపనగును.

కృష్ణరాయలకాలమునఁ బ్రతివర్షము వసంతోత్సవము జరుగు చుండెడి దనియు నాసమయమునఁ గవులు కబ్బముల రచించి రాయలకుఁ గృతి యొసంగుచుండెడివా రనియుఁ బ్రథమాశ్వాసాంతపద్యము (13) విశదపఱచుచున్నది. దీన నీకృతియుఁ గృష్ణరాయలు పూర్వదిగ్విజయ యాత్ర ముగించి యిలుసేరి వసంతోత్సవమొనర్చుసమయముననే విర చిత మైయుండు ననియు, మఱియు నాపద్యమునందలి "అంతగిపురవధూ ప్రసాదనకసికా" ననుపదము ననుసరించి మీాకబ్బ మంతగిపురవధూ ప్రసాదనమునకే విరచితమయ్యె నని నిపుణముగఁ గవి సూచించె ననియు ననుమానింపవలసియున్నది.

ఇందలి ద్వితీయాశ్వాసాదిపద్యమునందైన "మలయకూటప్రాసాద నివేశ" ననుపదము ననుసరించి కృష్ణరాయనివాసప్రాసాదనామము మలయకూట మని తెల్లమగు. ఇటులుండ మనుచరిత్రమున "తిరుమల దేవీచరణోదరలాక్షాకల్పికస్థలకమల స్ఫురదిందీవరబంధుర, హరిహయ మణివలయకూటహార్యవిహారి" ననుపద్యమున (3 ఆ. 143) మణివలయ కూట యను సపాఠ మంగీకృత మగుట యన్యరస మనఁదగును. హరి

హాయమణిమయమగు మలయకూట మనుహార్శ్యమున విహరించుచా
డగుటయే సకస మని పారిజాతాపహరణమునందలి పైపద్యభాగము విశ
దీకరించుచుంట నిది సంస్కర్తలప్రమాద మని చెప్పనొప్పును. హరి
హాయమణివలయములు గలశిఖరములతోడ నొప్పుమేడ యనుటకంటె
నిద్రనీలమణిమయ మలయకూటాఖ్యప్రాసాదమున నుండువాడను
టయే యతిహృద్య మనియు మలయకూటమనున దాతనిమేడ పేరని గమ
నింపక యేదే నొకయర్థమును ముడివెట్టి మకారమునకుం బ్రక్క నున్న
కొమ్మును సంస్కర్తలు తీసివేసియుందు రనియుం గాన "హరిహాయమణి
మలయకూటహార్శ విహారి" అనుపాఠమే కవ్యభిప్రేత మైన దనియుం
బాఠకులు పరిగ్రహింపవలయును.

అచ్చతెలుంగు సుమలకూర్పు, నందమందందుడెందము నానం
దాబ్ధినోలలాడింప, బ్రసన్నతాకలితగీర్వాణపదసంధాన మొక్కొక్కచో
స్వాంతమును సంతోషాయత్త మొనర్ప నిష్టమై యాతనిశైలి పండిత
హృదయంగమమై పరఁగెడిని. వ్యాకృతివిశేషములు వ్యాఖ్య నాయా
యితావుల విశదీకృతములగుట నియ్యవసరమున వానిఁబడవఁబని లేమిఁ
బరిత్యక్తములు. చకోరాదివర్ణనపద్యము లచ్చతెలుఁగుఁ బల్కులకూర్పుల
కును యుష్మదాదివర్ణనపద్యములు గీర్వాణరచనలకును నుదాహరణము
లుగఁ గైకొనఁగను. మఱియు నీకృతికర్త శార్దూలాదివృత్తములను
దనయిచ్చకువచ్చిన గతినిగాక యాయాయిసందర్భములరసోచితముగ
నెలకొల్పుట విశేషములలో నెల్ల మేటివిశేష మని సహృదయులు సంభా
వింతురుగాక !

ఇట్లీ పరిశీలించినకొలందిని విశేషములు వెల్వడుచునేయుండును
గానఁ గావ్యరసాస్వాదనతత్పరులును నిపుణులును నగుబుధజనులును
గవిపుంగవులును బాఠకహృదయులును గుణగ్రహణతత్పరులై తఱచి
విశేషముల వెల్లడింతురుగాక !

ఇట్లు,

బుధజనవిధేయుఁడు,

విజయనగరము.
25-4-1933.

**విద్వాన్ దూశి రామమూర్తిశాస్త్రి.**

శ్రీరస్తు

# పారిజాతాపహరణము

## సవ్యాఖ్యానము



## పీఠిక

మదికిం బ్రియం బెసఁగఁ జేర్చినయయ్యలీల వైజయం
తీమిళితాచ్ఛకౌస్తుభము నిద్ధపుఁగాంతిఁ దనర్చి యాత్మవ
క్షోమణివేదిఁ బొల్పెసఁగఁ జూడ్కులపండువు సేయువేంకట
స్వామి గృతాగ్రఁ జేయు నరసక్షితినాథునికృష్ణరాయనిన్. 1

ఆంధ్రకవితల్లి జూఁడును, ముక్కుతిమ్మనార్యాపరనామాముండును నగు నందితిమ్మన 'కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే, సద్యఃపరనిర్వృతయే కాంతా సమ్మితతయోపదేశయుజే', అను నాలంకారికోక్తి ననుసరించి, సమస్తశ్రేయస్సాధకమును, గాంతాసమ్మితమును నగుసత్కావ్యము నొనర్పం బూని వ్యాసమునిప్రణీతహరివంశము నందలి పారిజాతాపహరణపుణ్యకథ నాధారముగాఁ గొని పారిజాతాపహరణం బను నీశృంగారప్రబంధమును రచించెను. అం దాదిని 'ఆశీర్నమస్క్రియావస్తునిర్దేశోవాపి తన్ముఖమ్', అను నభియుక్తోక్తి ననుసరించి, కృతిపతియగు కృష్ణదేవరాయలకుఁ దదిష్ట దైవతాశీస్సంఘటనరూప మగు నాశీర్వాదము ననుసంధించెను. మఱియు, 'దేవతా వాచకాశ్శబ్దా యే చ భద్రాదివాచకాఃి, తే సర్వే నైవ నిర్దిష్టాస్సంక్షిప్తితో గణతోఽపివా', అను నార్యవాక్యమునుబట్టి, శ్రీశబ్దము దేవతావాచకమును, భద్రాదివాచక మును నగుటంజేసి యద్దాని నాదిని సెలకొల్పెను. ఇంతియగాక 'మంగళాదీని మంగళ మధ్యాని మంగళాంతాని చ కావ్యాని ప్రథంతే', అను నభియుక్తోక్తి ననుసరించి, కావ్యము నిర్విఘ్నముగఁ బరిసమాప్తి నొందుటకొఱకును, శిష్యశిక్షార్థమును, మంగ ళాదివాచకమగు శ్రీశబ్దమును గావ్యాద్యంతములఁ బ్రయోగించి కావ్యమున కుత్కృ-

ర్షను సంపాదించెను. భగణము చంద్రదేవతాకమగుటఁ గర్తృపతులకుఁ గల్యాణదాయక మనుతలఁపునఁ గవి కావ్యాదిసి సెలకొల్పె నసి గ్రహింపవలయును.

టీక. శ్రీమదికిక్ = లక్ష్మీదేవియొక్క చిత్తమునకు, ప్రియంబు = సంతసము, ఎసఁగఁ =అతిశయించునట్లు, చేర్చిన = పొందించిన, వైజయంతీ...కౌస్తుభము - వైజయంతీ=వనమాలతో, మిళిత=కూడియున్న, అచ్చ = స్వచ్ఛమైన, కౌస్తుభము=కౌస్తుభమనుమాణిక్యము, సిద్ధపుఁగాంతిక్ (సిద్ధపు=స్నిగ్ధ) = తఱిచైనకాంతితో, తనర్చి=అతిశయించి, ఆత్మ...వేదిక్ - ఆత్మ=తనదైన, వజ్రోమణివేదిక్ = మణివికారమగుతిన్నెను బోలు గుండెపై, పొల్పు=అందము, ఎసఁగఁ = మీఱఁగా, చూడ్కులు = దృష్టులు, వేంకటస్వామి=వేంకటేశ్వరుఁడు, నరస...రాయనిక్ =నరసరాజుకొడుకైన కృష్ణదేవరాయని, ఇచట షష్ఠికి జన్యజనకభావ మర్థము. కవులు తండ్రి పేరులతోఁ గలిపి కృతిపతులనామముల నిరూపించుట యాచారమైయున్నది. కృతార్థక్ =సఫలమగు కార్యములుగలవానినిగా (ధన్యుఁగా) చేయున్. 'చేయున్' అనునది తద్ధర్మార్థక మగుటఁ ద్రికాలవాచిగా సెన్నవలయును. 'తనర్చ' అని పాఠము గలదు. అపుడు నిద్దపుఁగాంతితో నొప్పునది కౌస్తుభము గాక యెద యగును. సారస్య మిందుఁ జింత్యము.

భావము. శ్రీవేంకటేశు నెద మణివేదివలెను, నందు మించు కౌస్తుభాంచితవనమాల యయ్యెదపై సెలకొనియున్నసిరికి నయ్యెలరీతిని నొప్పుచుండె నని భావము. వనమాలాకృతి యయ్యెలత్రాటివలెను, నందు నడుమమించుకౌస్తుభ మయ్యెలనడుమ నొప్పుఫలకమువలెను నమరియున్న వని గ్రహింపవలయును. అట్లు కౌస్తుభాంచిత వనమాలాధరుండై యెదను లచ్చి వెలుంగ మించు నా శ్రీవేంకటేశ్వరుఁడు కృష్ణరాయల సఫలకార్యంజేయుత మని యాశీర్వాదము.

వ్యాకరణవిశేషములు. ఊయ్యెల:—డోయేల, డోయెల, ఊయ్యాల, ఊయెల. ఇత్యాదులు రూపాంతరములు. 'డోయేలాదులం దొలియచ్చుమీఁది హల్లునకు ద్విర్వచనం బొండె నగును' అని. నిద్దపుఁగాంతిక్ :—రూ. అ. నిద్దంపుంగాంతిక్. 'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు. సమాసంబుల నుదంతంబులగు స్త్రీసమంబులకును బుంపులకును బరుషసరళములు పరంబు లగునపుడు నుగాగమం బగుఁ' ద్రుతకార్యములు. నిద్దంపు న్గాంతిక్, నిద్దంపుఁగాంతిక్ ఇత్యాదు లూహ్యములు. కృష్ణరాయఁడు 'కర్మధారయం బియ్యది మిశ్రంబు సిద్ధసమాసంబట్ల యగు' అనుసూత్రమునుబట్టి యిందుఁ బూర్వపదము లుప్తవిభక్తికంబై యవికృతాంతం బగును. పండుగు. రూ. అ. ఫండువు. అపదాద్యంబైన గకారమునకు వకారం బగు.

విశేషార్థాదులు. కావ్యాదిపద్యములనుండి వ్యంగ్యమర్యాదను గావ్యేతివృత్తము నుద్ధరించుట యాచారమైయున్నది. ఆపద్ధతి నిందలి 'శ్రీమదికిం బ్రియం జెసఁగఁగ, ఆప్త వశీ మణివేదిక' అనుమున్నగుపదములశక్తి ననుసరించి క్రమముగ శ్రీకృష్ణుఁడు సత్యా ప్రీతిదాయకుండై యొప్పుటయుఁ బారిజాతము నామె పెరటిచెట్టుగ నెలకొల్పుటయు గోచరించుచున్నవందురు కాని సమగ్రముగఁ గావ్యార్థసూచన తొలిపద్యమునందే చేసెననుటకంటె 'రాఘవత్వేఽభవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని,' అను నారోక్తిననుసరించి శ్రీరూపయగు రుక్మిణిని శ్రీకృష్ణుఁడు సంతుష్టంజేయుటను దొలిపద్యమునను దరువాతి పద్యమునఁ దన్మూలమున సత్యకుఁగల్గిన యీర్ష్యయు శ్రీకృష్ణకృతాశ్వాసాదికమును గవి వెల్లడించి పైరెండుపద్యములమూలమున సమగ్రముగఁ గావ్యార్థమును సూచించె ననుట సరసమును, సముచితమును, సాధారమును నగు నని తోఁచెడిని. సంస్కృతకవు లీగతిని రెండుమూఁడుపద్యములమూలమునఁ గావ్యార్థమును నాటకాదులందు సూచించుటయుఁ గలదు. మఱియుఁ గృతిపతి వైష్ణవమతాశ్రయుఁడుగాన మహాలక్ష్మ్యంశసంభూత యగు రుక్మిణికి శ్రీకృష్ణుఁడు ప్రియముగూర్చుటను గృతిపతి మత్రద్వైతానుకూలవిషయ నిరూపణమూలముగను, దాను శైవుఁడుగాన లక్ష్మ్యంశసంభూతకాని యీర్ష్యాకషాయి తను సత్యను శ్రీకృష్ణుఁ డనునయించుటను, స్వమతానుకూలస్వేష్ట దైవప్రసంగద్వార ముగను నిరూపించి పతిమతస్వమతానుకూలవిషయప్రసంగతిని గావ్యార్థమును మనో హరముగ సూచించె ననుట యెంతయు నొప్పియుండును.

కవులు సామాన్యముగ నాపాదింపఁబోవువిషయమున ననుకూలించురీతి నిష్ట దైవములకు రూపమును సంఘటించుట యరుదు. తిమ్మనార్యుఁ డట్లుగాక కృష్ణరాయనిఁ గృతార్థుంజేయుటకు లక్ష్మీయుతత్వకౌస్తుభాద్యమూల్యాలంకారవిశిష్టత్వాదులధర్మముల వేంకటేశ్వరునకు సమకూర్చి ప్రతిపాదితవిషయమున ననుకూలించు ప్రసన్నరూపమును సంఘటించి సరసమగుగతిని విషయమును బోషించెను. అలం. ఊర్ధ్వోత్థాపనాద్యలంకార ములకు సంసృష్టి.

మ. పొలఁతుల్ గొఁగిట గ్రుచ్చి యెత్తి తలఁబ్రా లోర్వోయించునవ్వేళ నో
దల గంగం దనసీడఁ దాన కని మాగ్ధ్యం బొప్ప వేఱొక్క తో
య్యలి యంచున్న ది నెంచుపార్వతియసూయావాప్తికిన్నవ్వుక్రొ
న్నెలపూఁదాలుపు కృష్ణరాయనికి సంధించున్ శ్రీహ్యార్యముల్. 2

టీ. పొలఁతుల్=స్త్రీలు, కొఁగిట=భుజమధ్యప్రదేశముచే, రూ. అ. కవుఁగిలి. గ్రుచ్చి=తూర్చి, ఎత్తి=లేవఁదీసి, తలఁబ్రాలు=నూత్రనదంపతులు మంగళార్థము తలమోఁదఁ

బోసికొనుబియ్యము, అవ్వేళ=ఆసమయమున, రూ. అ. ఆవేళ. దొడలు=తొల మోద తనసీడ=తనప్రతిబింబమును, మాగ్ధ్యంబు = తెలివితక్కువతనము. వేలొక్క తొయ్యలి=మఱియొకవనిత, అసూయావాప్తికి=ఈర్ష్యనుబొందుటకు, (అసూయ + అవాప్తికి), క్రొన్నెలపూదాలుపు = క్రొత్తచందురునిధరించువాడు (రాజశేఖరుడు), మహైశ్వర్యముల్ = గొప్పసంపత్తులను.

భావము. పార్వతి సిగ్గుచే సీసునితలపైఁ దలబ్రాలు పోయఁజాలకున్న స్త్రీలామెను గౌగిటఁ గదియించి యెత్తి తలబ్రాలు పోయించి రసియు, నపు డామె శివజటాజూట వాసిని యగుగంగయందుఁ బ్రతిఫలించిన తనసీడఁ దాను గని యజ్ఞతచే శివుఁ డింతకు మున్ను వేలొకతెను బరిగ్రహించియుండు ననితలంచి యీర్ష్యాకషాయిత యయ్యె ననియు, నపు డీశుఁ డాపార్వతియొక్క యట్టితెలివితక్కువతనమునకై నవ్వె ననియు భావము.

వ్యా—విశే. కౌగిలి. ఇది యాపవిభక్తికము. ఇటి తి వర్ణంబు లాపవిభక్తికములు ఇవి ద్వితీయాద్యేకవచనములు పరంబు లగునపుడు నామంబులకుం గొన్నింటికిఁ బ్రాయికం బుగనగు. ఆపవిభక్తికములఁ దృతీయాసప్తముల కత్వంబాదేశంబు బహుళముగా నగు. 'కౌగిట' ఆదల. ఇయ్యది శబ్దరత్నాకరమున నిర్బిందుకముగనే యగపడును. సప్తమ్యర్థమున నవ్యయీభావము. ఇట్టిరూపము లాంధ్రవాఙ్మయమున కడుస్వల్పముగాఁ గాననగును. పెడతల, లోఁబోద ఇత్యాదులు. అవ్వేళ. ఆ+వేళ. ఆ ఈ ఏ యనుసర్వనామములు త్రికసంజ్ఞకములు. కర్మధారయంబు త్రికస్త్రీసమధాతుజవిశేషణ పూర్వపదంబైయుండు. త్రికంబుమోఁది యసంయుక్తహల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు. ఊష్మరేఫములకుఁ గలుగదు. అవ్వేళ. క్రొన్నెల. క్రొత్త+నెల. పూవు. సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమోఁదివర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు. పరుషేతరములు పరంబులగునపుడు నుగాగమప్రాప్తి లేమిఁజేసి ద్విత్వము కల్గును. క్రొన్నెల.

విశే. తొలిపద్యమున వివరించినరీతిగ నిందు సత్యాసూయగమ్య మగుచున్నది. మఱియు, 'తనసీడఁ దాను గని, మాగ్ధ్యంబొప్ప' అనుపదములజాడ ననుసరించి సత్య యూరకే భ్రమఁజెంది యీర్ష్యఁ బూనె ననియు, నిందు శ్రీకృష్ణుని తప్పేమియు లేదనియు వ్యంగ్యములు స్ఫురించుచున్నవి. శివుఁడు సంపత్ప్రదాత గాన, మహైశ్వర్యముల నొసంగుటలో నాతనికిఁ బ్రాధాన్య మిడుట యెంతయు హృద్య మనఁదగును. చంద్రవంశమణి యగు హరినికిఁ జంద్రచూడామణి యగుశివుఁడు మహైశ్వర్యముల నొసఁగుఁగాతమనుట యెంతయు సరసమగును. మఱియు మందాకిని మూళిం బూని

నూత్నచంద్రాలంకారమును ధరించి వివాహమంగళకౌతుకమువశమున హాసాలంకృతవద
నుండై యెలమిమీఱి నుండుప్రసన్నుడు మహైశ్వర్యసంధాతయగుఁగాకనుట మిగుల
నుచిత మనఁదగును.

అలం. భ్రాంతిమత్తు.

మ. తన దంతాగ్రముచేతఁ దీక్ష్ణమతి నుద్యత్కుంభయుగ్మంబుచే
త నితాంతోన్నతి దానవిస్ఫురణ నుత్సాహంబు శుండాముఖం
బున దీర్ఘాయువు నిచ్చుఁ గావుత గుణాంభోరాశికిం గృష్ణరా
యనికిన్వారణరాజవక్త్రుఁడు కృపాయత్తైకచిత్తాబ్జుఁడై. 3

టీ. వారణరాజవక్త్రుఁడు = ఏనిక మేటిమొగముగల గణనాథుఁడు, దంతాగ్ర ముచేతన్ =దంతంపుంగొనచే (ఏకదంతుఁడుగాన నొకకొన యనెను), తీక్ష్ణమతిన్ = నిశితమగుబుద్ధిని, ఉద్యత్కుంభయుగ్మంబు చేతన్ -ఉద్యత్ =పైకిలేచిన, కుంభయుగ్మంబు చేతన్ =కుంభద్వయముచే, ఏనుఁగుతల నిరువంకలనుండు నెత్తగుప్రదేశముల రెండు కుంభము లనుట కవులయాచారము. 'ఘనకుచకుంభయుగ్మకము దారొకని యుప్పనకై యసూయపై' అని నృసింహపురాణము. ఎ. ప్ర. నితాంతోన్నతిన్ = అత్యంతమగు నున్నతిని. దానవిస్ఫురణన్ = మదముయొక్క ప్రకాశముచే, ఉత్సాహంబును = పరిపాలనాశక్తిని, శుండాముఖంబునన్ = తొండముయొక్కకొనచే, దీర్ఘాయువును= చిరాయువును, గుణాంభోరాశికిన్ =సుగుణసముద్రునకు, కృపా...అబ్జుఁడై-కృపా= దయకు, ఆయత్త=అధీనమైన, ఏక=ముఖ్యమైన, చిత్తాబ్జుఁడై = మనఃపద్మముగలవాఁడై.

విశే. తైక్ష్ణ్యముగలసాధనముచేఁ దైక్ష్ణ్యమును, నౌన్నత్యముగలదానిచే నున్నతిని, నుత్సాహయుక్తమగుదానిచే నుత్సాహమును, దైర్ఘ్యముగలదానిచే దైర్ఘ్యమును, ప్రసాదించుఁగాతమని చెప్పుట మిక్కిలి హృద్యముగను, సారస్యముగను నున్నది. ఉత్సాహము. ప్రభుమంత్రోత్సాహములను శక్తిత్రయములో నిది యొకటి. అలం. పరికరము.

చ. సరసపుటల్కఁ దీర్చుతఱి శార్ఙ్గసుదర్శననంద కాబ్జసం
భరణగుణాప్తి నెన్నడుముపైఁ గటిపై జడపై గళంబుపై
హరి నలుగేలుఁ జైకొన సుఖాంబుధి నిచ్చలు నోలలాడునిం
దిర కృపఁ జూచుఁ గాత నరదేవశిఖామణి కృష్ణరాయనిన్. 4

టీ. సరసపుటల్కన్ =పొలయలుకను, తీర్చుతఱిన్ =దిద్దుసమయమున, శార్ఙ్గ... గుణాప్తిన్ -శార్ఙ్గ = ధనువు (విష్ణుదేవునివే యీ నామంబగును.) సుదర్శన = చక్రము,

నందక = కత్తి, అబ్జము = శంఖము అనువీనియొక్క, సంభరణ = భరించుటయును, గుణ=గుణమునియొక్క, ఆప్తిక్ = ప్రాప్తితో, నలుగేలుక్ = నాల్గుచేతులును, (క్రమముగా) హరి = శ్రీవిష్ణువు, నెన్నడుముపైక్ = మనోహరమగుకౌనుపైని, కటిపైక్ = జఘనముపైని, జడపైక్ = జడపైని, గళంబుపైక్ = మెడమీఁదను, పైకొనక్ = చేర్పఁగా, సుఖాంబుధిక్ = సుఖమనుసముద్రమున, నిచ్చలుక్ = నిత్యము, ఓల లాడు=ఈదులాడు, ఇందిర = లక్ష్మి, నరదేవశిఖామణిక్ = భూపాలశ్రేష్ఠుని, కృష్ణరాయనిక్ = కృష్ణదేవరాయని, కృపక్ =దయతో, చూచుఁగాతక్ = దర్శించునుగాక.

భా. పాలయలుకందీర్ప శ్రీమహావిష్ణువు శార్ఙ్గమును ధరించిన యొకచేతిని దనకడుముమీఁదను, సుదర్శనమునుబట్టిన యొకచేతిని దనకటిపైని, నందకమును బూనిన చేతిని తనజడమీఁదను, శంఖమునుదాల్చినచేతిని దనగళముపైని జేర్చి యుభలాలింప నెంతయు సుఖించులక్ష్మి కృష్ణరాయల దయతోఁ జూచుఁగాత మని భావము.

విశే. ఇట్లు చెప్పుటవలన నడుము ధనువువోలె ముష్టిగ్రాహ్యమై యున్న దనియుఁ, గటిచక్రమునుబోలియున్నదనియు, జడ యసిలతంబోలి యొప్పునదనియు, గళము శంఖము భాతి నమరియున్నదనియుఁ దోఁచును. సరసపుటలుకక్ - సరసము+అలుకక్, కర్మధారయంబులందు ముపర్జకంబునకుఁ బుంపు లగు. కర్మధారయంబులం దుత్తర కచ్చుపరమగునపుడు టుగాగమం బగు. సరసంపుటలుక ఇత్యాదులు రూపాంతరము లూహ్యములు. నలుగేలు, ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగానగు. మిశ్రంబు నకుఁగాదు. నాలుఁగు యొక్కరూపాంతరము నలు. నెన్నడుము - నెఱి+నడుము, ప్రాతాదుల తొలియచ్చుమీఁది వర్ణములకెల్ల లోపంబు బహుళంబుగా నగు. పరుషేతరంబులు పరములగునపుడు నుగాగమప్రాప్తి లేమించేసి వానికి ద్విత్వముకలుగును. కవియీపద్యమునఁగూడ లక్ష్మికి వక్తవ్యవిషయమున కనుకూలించునాకృతి నుల్లాసమును నుసంధించినాఁడు. శ్రీకృష్ణకృత్ర సత్యానునయమును దాన సత్యభామకుఁ గర్ణసంభవమును నుఁ గావ్యార్థము నిందుఁ గవి పొందుపఱిచె నని తోఁచెడిని. అలం. యథాసంఖ్యము.

చ. తనమృదుగీతికాపరిణతధ్వనివైఖరిఁ బల్కుమంచు మిం
చినరహిఁ జేతివీణియకుఁ జెక్కులు గీఁటుచు నేర్పుచున్నదో
యన నఖరాంకురంబుల నయమ్మునఁ దంత్రులు మీటి గానమిం
పొనరఁగఁజేయువాణి ప్రతిభోన్నతుఁ జేయుతఁ గృష్ణరాయనిన్. 5

టీ. తన...వైఖరిక్ -మృదుగీతికా=మృదువైన పాటయొక్క, పరిణత=పరిపక్వమైన, ధ్వని=శబ్దమునియొక్క, వైఖరిక్ =రీతివంటిరీతితో, నఖరాంకురంబులక్ = గోటి

మొలకలచే, ఇంపు=సొగసు, ఒనరన్=ఒప్పునట్లుగా, తంత్రులు=వీణతీఁగెలు, ప్రతిభోన్నతున్-ప్రతిభా=అనుక్షణము వికసించుబుద్ధిచే, ఉన్నతున్=అధికుని, 'నించినరహిన్' అనిపాఠాంతరము. మించిన యనుటకంటె నించిన యనుటలో నర్థవిశేష మెద్దియుఁ గానరాదు. మఱియు 'చున్నదోయను, లీలనొయ్యన' 'నయమ్మున, రయమ్మున' అను పాఠము లగపడును.

భా. తనగళస్వనమునకు సరియగుగతిని బబ్బ్రా మని కడురయమునఁ దనచేతి యందలి వీణియకుఁ జెక్కలుగీటుచుఁ గఱపుచున్నదో యన గోటిమొలకలచే నేర్పు మీఱ వీణతీఁగెల మీటుచు మనోహరముగ గానము సేయుసరస్వతి కృష్ణరాయని మించిన ప్రతిభ గలవానిం జేయుఁగాత మని భావము. ప్రతిభాప్రదాత్రి సరస్వతి గాన నిట్లు చెప్పుట యెంతయు నుచితమగును.

వ్యా—విశే. వీణియ-ఱూ. అ. వీణె. ఇయకుమాఱుగా నామాంతంబున కెత్వంబు బహుళంబుగా నగును. అలం. ప్రతీపము.

చ. వలిమలయల్లువాఁడు తలవాఁక ధరించినపూవుగుత్తి వే
ల్పులగమిజీవగఱ్ఱి యుడివోవనిచల్వలకొంకి వెన్నెల
లొలచినపాదు పాల్కడలిముద్దులపట్టి నృసింహకృష్ణరా
యలఁ గరుణారసంబు నినుపారెడిచూపులఁ జూచుఁగావుతన్. 6

టీ. వలిమలయల్లువాఁడు-వలిమల=మంచుకొండ (హిమాలయము), అల్లువాఁడు=అల్లుఁడు, తలవాక...గుత్తి = దొఁదలయందలి యేటితోధరించిన పుష్పగుచ్ఛము, వేల్పుల...కఱ్ఱి = దేవతలసమూహమునకు జీవనాధారము, ఉడి...కొంకి=తఱుఁగని శైత్యములకుఁ దావగువాఁడు. వెన్నెల...పాదు=వెన్నెలలు పుట్టుటకు స్థానమైనవాఁడు. పాల్కడ...పట్టి = పాలసంద్రము ననుఁగుసుతుఁడు, కరుణారసము = దయారసము, ఇనుపారెడి = ద్విగుణీకరింపఁజేయు, 'వలిమలయల్లువాని తలవాఁక దనర్చిన లేక తలర్చిన' అనుపాఠ మగపడు. ఇం దన్వయము సరళముగ నొప్పును.

భా. శివజటాజూటమున మిన్నేటితోఁగూడి పుష్పగుచ్ఛమువలె వెలుంగువాఁడును, దేవతాబృందమునకు జీవనాధారమును దఱుఁగనిచలువలకుఁ దావలమైనవాఁడును బాలకడలి ముద్దుపట్టియును నగుచంద్రుఁడు కృష్ణరాయనివిస్తారమగుదయం దిలకించుఁగాత మని భావము. చంద్రుఁడు కృష్ణరాయనివంశమునకు మూలపురుషుఁడు.

విశే. అమ్మూలపురుషు నీశుఁ డొఁదలఁదాల్చెననియు, నక్షఁడు బుధజీవనాధారమై పరఁగెననియు, శైత్యములకుఁ దావలమైనవాఁడనియు, క్షీరసాగరసుతుఁడనియు విశేషించి పేర్కొనుటంజేసి, క్రమముగ సత్పురుషసమ్మాన్యుఁడనియు, సత్సంశితవ్ర

సంపూజ్యుఁడనియు, శాంత్యాదిసుగుణసమేతుఁడనియు, సద్వంశసంభూతుఁడనియు వ్యంగ్యములు వెల్లడియగుచున్నవి. అట్టియుత్తమునివంశమునఁ బుట్టుటంజేసి, కృష్ణరాయలును నట్టివాఁడే యగునని కవియూహ. ఆంధ్రకవిసంప్రదాయమును గణింపక. యీకృతికర్త సుకవిస్తుతి కుకవినింద లనేలొకో పరిత్యజించెను. చూ. ఉపోద్ఘాతము.

వ్యా—విశే. జీవగఱ్ఱి. ఇట్లు సంస్కృతాంధ్రములకు సమాసముకూర్చుట దుష్టమగుటంజేసి యీరూపము గ్రామ్యమైనది. కాని మహాకవిప్రయుక్తమగుటంజేసి యనింద్యగ్రామ్యమునాఁదగును. మహాకవిప్రయుక్తములకుమాత్రమే యీసాధుత్వకల్పనము గాని మఱి కొన్ని యిట్టివి కల్పించి కవులు ప్రయోగింపరాదని బుధులయభిప్రాయము. ఈపద్యమున మూఁడుపాదములు ముద్దులొల్కు నచ్చతెనుంగుపదములతోఁ గూర్పఁబడినవి.

## కృతిపతివంశావళి

ఉ. ఆయమృతాంశుసం దుదయమయ్యె బుధుం డతఁడార్తరక్షణో
పాయుఁ బురూరవుం గనియె నాతనికాయువు పుత్రుఁ డయ్యె న
య్యాయతకీర్తికి న్నహుషుఁ డాత్మజుఁ డై యల యేలెఁ దత్సుతుం
డై యల రెన్యయాతి యతఁ డాహవదోహలుఁ గాంచెఁ దుర్వసున్.

టీ. ఆయమృతాంశునందున్ = అయ్యమృతకిరణుండగుచంద్రునందు, ఉదయమయ్యెన్ = పుట్టెను. ఆర్తరక్షణోపాయున్-ఆర్త=సంకటపాటునొందువారలను, రక్షణ=ప్రోచుటయందు, ఉపాయున్ = ఉపాయములుగలవానిని, ఆయతకీర్తికిన్ = విశాలమగుయశముగలవానికి. 'ఆయతశక్తికిన్' అనిపా. అ. ఆపక్షమున ఆయతశక్తికి=విస్తారమగుసామర్థ్యముగలవానికి, ఆహవదోహలున్ = యుద్ధోత్సాహముగలవానిని.

విశే. ఆ+ఆయతకీర్తి = అయ్యాయతకీర్తి త్రికంబుపై విశ్వము.

క. ఉర్వీశమౌళి యగునా, తుర్వసువంశంబునందు దుష్టారిభుజా
దుర్వారగర్వరేఖా, నిర్వాపకుఁ డీశ్వరాఖ్యనృపతి జనించెన్. 8

టీ. ఉర్వీశమౌళి=రాజశ్రేష్ఠుఁడు, దుష్టారి...నిర్వాపకుఁడు-దుష్ట=దుర్జనులైన, అరి=శత్రువులయొక్క, భుజా=భుజములసంబంధమైన, దుర్వార=నివారింపరాని, గర్వరేఖా = గర్వాకృతికి, నిర్వాపకుఁడు = నాశకుఁడు.

ఉ. తామసవృత్తి లేదు సతతంబును సుగ్రుఁడు గాఁడు పౌరుషం
బేమియు వెల్లిగాదు తన కెందును బైమఱి రాజు లేఁడు సు
గ్రామములోన నొక్కనరుగాసికి వాసి దొఱంగఁ డీశ్వర
శ్రీమహిళామనోహరునిసాటియె యీశ్వరుఁ డెన్నిభంగులన్. 9

తామసవృత్తి—తామస = కోపాధిక్యముయొక్క. శివపర. తమోగుణముయొక్క, వృత్తి=వర్తనము. ఉగ్రుడు = భయంకరుడు. శివుడు సతత ముగ్రశబ్ద వాచ్యుడు. పౌరుషము=మగటిమి. శివుడర్ధమున నారిం దాల్చువాడగుట నాత్రినికి బుంస్త్వము వెలితియే. పైక=మొదను, రాజు లేడు. తన్ను శాసింపగల నధికుడగు రాజులేడనుట, ఈశ్వరున కుత్తమాంగమునఁ బైని రాజుగలఁ డనుట. సంగ్రామములోనక=యుద్ధములో, ఒక్కనరుగాసికిక = ఒక్కమనుజునిబాధకు. శివ. ఒక్కయర్జునునిబాధకు, వాసి=ప్రసిద్ధి, తొఱఁగఁడు=విడువఁడు. తా నొక్కనరునిబాధనంది తన ప్రసిద్ధిని గోలుపోలేదని యీశ్వరనృపతిహరము ఒక్కయర్జునునిచేఁ గాసినంది వాసి తొఱఁగినవాఁడు శివుఁడని శివపరము. ఈశ్వరక్ష్మా...హరుని = ఈశ్వరభూపతీనాథుని.

భా. తామసవర్తుండగుటను, సంత్రస్తముగ్రుడగుటను, పౌరుషము వెల్తియగుటను, బైని రాజుండుటను, నొక్కనరుగాసికి వాసిదొఱఁగుటను, నీశ్వరుఁ డీశ్వర నృపతికి సాటి గాఁజాలఁడని భావము మాయాకిరాత్రరూపుఁ డీశుఁడు పందికై సమరము సేయు నపు డర్జునున కోడె నుభారతగాథ నిచట నుసంధింపవలయును.

అలం. శ్లేషోత్థాపితవ్యతిరేకము.

ఉ. రాజులనెత్తుటం బరశురాముఁడు వ్రంతలు సేసె రెండుమూఁ
డీజగతిక గణింప నది యెంతబవిస్మయ మబ్జినీసుహృ
త్తేజుఁడు కందుకూరికడఁ దిమ్మయయాశ్వరుచే జనించె ఘో
రాజి బెడందకోట యవనాశ్వికర క్తనదీసహస్రముల్. 10

టీ. రాజులనెత్తుటక = రాజులరక్తముచే, వ్రంతలు = మడుఁగులు, రెండు మూఁడు:-ఇది యల్పార్థద్యోతకము. మటియు రెండును మూఁ డైదసియు గ్రహింప వలయును. విస్మయము = ఆశ్చర్యము. అబ్జినీసుహృత్తేజుఁడు - అబ్జినీసుహృత్ = సూర్యుఁడు. వానియొక్కకాంతివఁటి కాంతిగలవాఁడు. తిమ్మయయాశ్వరుచేక = తిమ్మరాజుకొడుకగు నీశ్వరరాజుచే, ఘోరాజిక = భయంకరమైనయుద్ధమున, బెడంద కోట...సహస్రముల్ = బెడందకోటయంబలి తురకకాతులసంబంధమగు రక్తరూపము లగు నదులఁ బెక్కింటిని.

భా. పరశురాముఁడు రెండుమూఁడు (ఐదు) రక్తపుమడుఁగుల రాజులరక్తముచేఁ గావించెనుగాని యయ్యది యొకయద్భుతకార్యము గాదు. తిమ్మయయాశ్వర నృపతి బెడందకోటయందలి తురుష్కులగు నాశ్వికులరక్తముల నసంఖ్యములగు నదీ ప్రవాహములఁ బుట్టించుట యత్యద్భుతకార్యము.

వ్యా-విశే. నెత్తురు-దోపవిభక్తికము. తృ. నెత్తుటన్. పరశురాముఁడిరువది యొక్కమాఱులు క్షత్రియవీరులఁ జంపి కురుక్షేత్రమున సైదుమడుఁగులు త్రవ్వించి వానిని రాజులరక్తముతో నింపి పితృతర్పణము గావించెను. ఇదియే శ్యమంతపంచకము నాఁబరగు. అను బ్రహ్మాండపురాణగాథ సిచట ననుసంధింపవలయును. అలం. అతిశయోక్తి.

క. శాశ్వతవిజయుఁడు తిమ్మయ
యాశ్వన్నృపతికిని గౌరి కెన యగు తత్పా
ణేశ్వరి లక్కాంబికకు
న్వీశ్వాతిగయశుఁడు నరసవిభుఁ డుదయించెన్. 11

టీ. తత్పాణేశ్వరి = ఆయాశ్వరరాజుభార్య, విశ్వాతిగయశుఁడు - విశ్వ = లోకములను, అతిగ = దాఁటిపోవు, యశుఁడు = కీర్తిగలవాఁడు, ఎన=సాటి. ఇందు 'లక్కాంబిక' అనుచో 'బుక్కాంబిక' అని పాఠాంతర మగపడును. మనుచరిత్రాదుల ననుసరించిన 'బుక్కాంబిక' అనియే యుండు నని చెప్పవలెను.

సీ. ఎవ్వానివిజయంబు లెఱిఁగించుశాసన స్తంభంబు లాశాంతశైలవితతు
లెవ్వానియరిగాఁపు లేపారు కాళింగ యవనాది వివిధదేశాధినాథు
లెవ్వానినిత్యదానైకవిలాసంబు లారూఢతరతులాపూరుషంబు
లెవ్వానిచిరకీర్తి యింద్రలోకాంగనాభోగినీగీతికాభోగపదము

తే. వాఁడు నొగడొందు సర్వసర్వంసహాధి
దేవతాముఖపర్వణెవ్వైజయనగర
భద్రసింహాసనస్థుఁ డున్నిద్రతేజుఁ
డీశ్వరాధిపునరసభూమీశ్వరుండు. 12

టీ. ఆశాంతశైలవితతులు - ఆశాంత=దిగంతములందైన పర్వతసమూహములు, అరిగాఁపులు=పన్ను చెల్లించుసామంతరాజులు, నిత్యదానైకవిలాసంబు = సర్వదా చేయునీవియొక్క ముఖ్యమైనవిలాసమును, ఆరూఢతరతులాపూరుషంబులు = మిగులఁ బ్రసిద్ధమైన తులాపురుషాదిదానములు, ఇంద్రలోక...పదము - ఇంద్రలోక=స్వర్గమునందలి, అంగనా=స్త్రీలయొక్కయు, భోగినీ = నాగలోకస్త్రీలయొక్కయు, గీతికా=పాటలయందు, ఆభోగ=విస్తారమైన, పదము = స్థానముగలదో, సర్వసర్వం...సింహాసనస్థుఁడు - సర్వ=సమస్తమైన, సర్వంసహా=భూమియొక్క, అధిదేవతా = అధిష్ఠానదేవతయొక్క, ముఖ=మొగమునకు, దర్పణాత్=అద్దమువలె నాచరించునట్టి, విజయనగర=విజయనగరమునందలి, భద్రసింహాసన=మంగళసింహాసనమున, స్థుఁడు=ఉండువాఁడు, ఉన్నిద్రతేజుఁడు=

నిద్రవోసికాంతిగలవాఁడు. అనఁగా సర్వదా ప్రజ్వరిల్లు ప్రతాపముగలవాఁడనుట. ఇందు 'ఆరూఢపర' అనుచో 'ఆరూఢబహు' అనుపాఠ మగపడును. అర్థవిశేషము దీన నెద్దియులేమిఁ ద్యక్తము.

భా. నరసరాజు దిగంతములవఱకుఁ గలభువినంతను జయించుటంజేసి, దిగంత ములం గలపర్వతములే యాత్రసిజయములఁ దెల్పుజయస్తంభములయ్యె ననియు, కాళింగ యవనాదివివిధదేశాధీశులు సామంతరాజు లాతనికిఁ గప్పముఁ గట్టువా రైరనియు, నాతఁడొనర్చిన తులాపురుషాదిదానము లాతనినిత్యదానోన్నతి నెఱిఁగించుచున్న వనియు, నాతనికీర్తిని దేవకామినులును నాగాంగనలును గానముచేయుచుండు రనియు, నాతఁడు భువి సరోన్నతోత్కృష్టపుం బరఁగు విజయనగరమున భద్రసింహాసనస్థుఁడై పాలించు ననియు భావము.

వ్యా-విశే. వాఁడు వొగడొందఁదు. ప్రథమమొఁది పురుషములకు గసడదవలు బహుళముగా నగు. తా నందుల నొక్కప్రక్కఁ గూర్చుండి వేఱొకప్రక్క బంగారు, వెండి, ముత్యములు, మాణిక్యములు లోనగువానిలో నేవేని తనయెత్తు పోసి వాని నొక సత్పాత్రకు దానముసేయుట తులాపూరుషమండ్రు. అలం. అతిశయోక్తి

సీ. కుంతలేశ్వరుఁడు సిక్కఁ వడంగ విద్యాపు
రంబు గైకొని నిజప్రౌఢి నెఱపెఁ
బారసీకునకు దుర్భరమానవత్వంబుఁ
దొలఁగించె మానవదుర్గసీమఁ
జోళవల్లభునకు సురవధూమధురాధ
రము లిచ్చి మధురాపురంబుఁ గొనియె
శ్రీరంగపట్టణసీమ ఖడ్గనటీవి
నోదంబు యావనేంద్రునకుఁ జూపె

తే. నతఁడు సుతి కెక్కఁ రామసేత్వంతరాళ
కలితషోడశదానవిఖ్యాతయశుఁడు
మండలీకరమేషమార్తాండబిరుదుఁ
డీశ్వరాధిపునరసమృథ్వీశ్వరుండు. 13

టీ. కుంతలేశ్వరుఁడు=కుంతలదేశపురాజు, సిక్కఁ=చిక్కఁ, విద్యాపురము = బీజపురము, నెఱపెఁ = వ్యాపింపఁజేసెను. కుంతలశబ్దము కేశవాచకమగుటను, 'సిక్కఁ వడంగ' అనుపదము అణ్బిగ నయి చిక్కుఁజెందుట అనుసర్థము గలదగుటను, గుంతల

ములు చిక్కువడి చీకాకుఁ జెంది శోభావిహీనములయ్యె ననునర్థాంతర మిచట స్ఫురించు చున్నది. దుర్భరమానవత్వము=భరింపరానిమనుష్యభావము. సుర...అధరము = దేవతాస్త్రీలయొక్క తీయని మోవులను (మధురాధరముల నొసంగి మధురఁ గొనుట యెంతయు నొప్పియున్నది) శ్రీరంగ...సీమన్ = శ్రీరంగపట్టణప్రాంతమున, ఖడ్గనటీవినోదంబు = కత్తియను నటియొక్క వినోదమును-యావనేంద్రుఁడు = యవనదేశపురాజు. రామసేతుమధ్యమునఁ జేయఁబడిన పదునాఱుదానములచేనైన ప్రసిద్ధమైనకీర్తిగలవాఁడు. 'మండలీకరమేఘమార్తాండ' ఇది బిరుదవాచకము. ఈశ్వరా...శ్వరుండు = ఈశ్వరరాజుకొడుకగు నరసరాజు.

భా. నరసరాజు కుంతలేశుని జిక్కుపఱచి విద్యాపురమును గొని తనప్రౌఢత్వమును గనుపఱచెననియు, పారసీకుని జుంపె ననియుఁ, జోళరాజు నాహవమునఁ దునిమి వీరస్వర్గమును బొందించి మధురకు లాఁగికొనెననియుఁ, దనకత్తి త్రిప్పుట యందలి నైపుణిని యవనదేశపురాజునకుఁ జూపె ననియు, షోడశదానముల నొనర్చి మహాదాతయనియు భావము.

విశే. షోడశదానములు:—బంగరు, వెండి, రాగి, కంచు, ఆవులు, ఏనుఁగులు, గుఱ్ఱములు, ఇల్లు, భూమి, వృషభము, బట్టలు, శయ్య, ఛత్రము, పాదుకలు, దాసి' అన్నము.

క. ఆనరసమహీమహిళా
జానికిఁ గులసతులు పుణ్యచరితలు తిప్పాం
బా నాగాంబిక లిరువురు
దానవదమనునకు రమయు ధరయును బోలెన్. 14

టీ. మహీమహిళాజాని =భూమియను స్త్రీ భార్యగాఁగలవాఁడు, కులసతులు = కులకాంతలు, పుణ్యాచరితలు=పవిత్రమైననడవడిగలవారు, దానవదమనుఁడు=రాక్షసుల మర్దించువాఁడు శ్రీవిష్ణువు. శ్రీభూదేవులు మహావిష్ణుజాయలు.

వ్యా-విశే. బహువ్రీహిని దుదినుండుజాయాశబ్దములోని 'యా' అనుదానికి 'జాయాయానిఙ్' అనుదానిచే 'ని' అనునది వచ్చి 'జానికి' అయినది.

క. వారలలోఁ దిప్పాంబకు,మారుఁడు పరిపంథికంధిమంథాచల మై
వీరనరసింహరాయఁడు, వారాశిరీతభూమివలయం బేలెన్. 15

టీ. పరిపంథికంధిమంథాచలము=శత్రువులను సముద్రమునకు మందరపర్వతమై, అనఁగా శత్రుసమూహమును సంక్షోభము నొందించువాఁడనుట. వారాశి - వలయము=సముద్రముచేఁ జుట్టివాలొకనఁబడిన వలయాకృతిని మించుభూమిని.

## కృష్ణదేవరాయలవర్ణనము

శా. వీరశ్రీనరసింహశౌరిపిదప న్విశ్వక్షమామండలీ
భారంధర్యమునన్ జనంబు ముదమందన్నాగమాంబాసుతుం
డారూఢోన్నతిఁ గృష్ణరాయఁడు విభుండై రాజ్యసింహాసనం
బారోహించె విరోధులున్గహనశైలారోహముం జేయఁగన్. 16

టీ. విశ్వ...ధర్యమునన్ = సమస్తమైనభూమండలముయొక్క భారమును మోయుటచే, గహనశైలారోహమున్ =వనములను గొండలను నెక్కుటను.

వ్యా-విశే. నాగమాంబాసుతుండు 'నాగమ' అనుసంజ్ఞావాచకమును సంస్కృత పదముగనే గ్రహించి 'అంబా' అనుదానితో సమాసము చేయఁబడెను. ఇట్లు సంజ్ఞా వాచకములకు సంస్కృతపదములతో సిద్ధసమాస మొనర్చుట కలదు. 'లక్ష్మమావర తనయా' అని పాం. మ.

సీ. యాదవత్వమున సింహాసనస్థుఁడు గామి
సింహాసనస్థుఁ డై చెన్ను మెఱయ
గొల్లయిల్లాండ్రతోఁ గోడిగించుటఁ జేసి
పరకామినీసహోదరతఁ జూప
మఱి జరాసుతునకై మథుర డించుటఁ జేసి
పరవర్గదుర్గము ల్బలిమిఁ గొనఁగఁ
బారిజాతము నాసపడి పట్టి తెచ్చుట
నౌదార్యమున దాని నడుగువఱుపఁ
తే. గోరి తొలుమేనఁ దన కైనకొదువ లెల్ల
మాన్చుకొన వచ్చి భువనైకమాన్యలీల
నవతరించినకృష్ణుఁ డౌననఁగ మించె
నరసవిభుకృష్ణరాయభూనాయకుండు. 17

టీ. యాదవత్వమున=యదువంశమునఁ బుట్టినవాఁడగుటను, చెన్ను = సొగసు, కోడిగించుట = సవిలాసముగఁ గ్రీడించుట, పర...దరత = పెఱవనితలకు సోదరుఁడగు టను, డించుట=విడుచుట, ఔదార్యము=ఈవి, అడుగుపఱుపన్ =క్రిందుసేయ, తొలు మేనన్ =పూర్వజన్మమున, కొదువలు = లోపములు, మార్చుకొనన్ = పోఁగొట్టుకొన, భువనైకమాన్యలీలన్ =లోకముచే ముఖ్యముగా గౌరవింపఁదగిన విలాసముతో, నరస... నాయకుండు=నరసరాజుకొడుకైన కృష్ణరాయభూపతి.

భా. తాను దొలిపుట్టువున యాదవుఁ డౌట సింహాసనము నెక్కునర్హత లేక పోవుటంజేసి, యట్టికొఅంత నపనయింప నిపుడు సింహాసనస్థుఁడయ్యెనని యు, నపుడు గోపికలతోఁ గ్రీడించుటంజేసి, యాలోపమును సవరించుకొన నిపుడు పెఅవనితల నక్కచెల్లెండ్రవలె నరయు ననియు, నాఁడు జరాసంధున కోడి మధుర విడుచుటంజేసి వాటిల్లిన యపయశమును నిర్మూలింప, నేఁడు శత్రుదుర్గముల బలాత్కారముగఁ బరిగ్రహించు ననియు, నానాఁడు పేరాసను బారిజాతమును దెచ్చుటంజేసి కృష్ణదూఱును మాయఁ జేయ, నీనాఁ డీవిచే నద్దాని గ్రందుసేయు ననియును, నిట్లు పూర్వజన్మమున పైన కొఅంతల మాపుకొన యల్పించుటకతన, నాశ్రీకృష్ణుఁడే యీకృష్ణరాయభూనాయకుఁడుగా నవతరించె నని యనవలయు ననియు భావము.

వ్యా-విశే. కామి-అగుధాతువునకు వ్యతిరేకభావమున మిజేయు మిజే పరముగా 'అగునకుననుకనులకు ముజ్జేత్తులు పరములగునపుడు కానాకానలు విభాషనగు'అని కాదేశమును గల్గెను. కోడిగించుటఁజేసి-కోడిగించుటను + చేసి 'కోడిగించుటను' అను ద్వితీయ 'కోడిగించుటచే' అను తృతీయార్థమున 'జడంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగా నగు' అనునియమము ననుసరించి కల్గెను. పిదప 'కొన్నియెడలఁ జేత్రవిభక్త్యర్థక వర్ణకంబులకును వలన వర్ణకంబునకును జేసి యనుప్రయుక్తంబగు' అనునియమము చొప్పునఁ జేసి యనుప్రయుక్తమయ్యె. తక్కుంగల ప్రక్రియ యూహించి తెలిసికొనునది. అలం. రూపకకావ్యలింగములకు సంకరము.

శా. శ్రీరంగేశ్వరనాభిపంకజరజశ్శ్రీకంటె జోళేంద్రత
నీరాజత్కుచపాళి*మంజరులకంటె న్సహ్యాభూభృత్తటీ
నీరంధ్రీకృతగైరికద్రవముకంటె న్వన్నె గావించెఁ గా
వేరీతోయముఁ గృష్ణరాయఁడహితోర్వీనాథరక్తప్రభన్. 18

టీ. శ్రీరంగేశ్వర...శ్రీకంటెక = శ్రీరంగనాయకుని పొక్కిలియందలి తమ్మిపైనపరాగముయొక్కశోభకంటెఁ, చోళేంద్ర...మంజరులకంటెక =చోళరాజభార్యల యొక్క ప్రకాశించుస్తనప్రదేశములందలి పుష్పగుచ్ఛములకంటెఁ, సహ్యా...ద్రవముకంటెక =సహ్యాపర్వతప్రదేశములందైన దట్టమైన గైరికాదిధాతురసముకంటెఁ, కావేరీతోయముక =కావేరీనద్యుదకమును, అహితోర్వీనాథరక్తప్రభక =శత్రురాజులసంబంధమైన నెత్తుటికాంతిచే.

---

*కుంకుమముకంటెఁ. అని పాఠాంతరము.

భా. కృష్ణరాయలు శ్రీరంగనాయకుని పొక్కిలియందని తమ్మిదగుపుప్పొడి కాంతిని మించునట్లును, చోళరాజస్త్రీల స్తనములందలి పుష్పగుచ్ఛములవన్నెను మాఱునట్లును, సహ్యాచలభూములందైన గైరికాదిద్రవప్రభ నతిశయించునట్లును శత్రురాజరక్త కాంతిని గావేరీతోయము నరుణమును గావించెనని భావము. దీనఁ గృష్ణరాయలు తొలు దొల్త శ్రీరంగమును, బిదపఁ జోళదేశమును, దరువాత సహ్యాచలభూములను, ననంతరము కావేరీతీరస్థశత్రుసమూహమును జయించి జయశ్రీని జూరఁగొనె నని తోఁచును.

వ్యా-విశే. 'కంటెవర్ణకము నిర్ధారణపంచమి కగు' అనుసియమము ననుసరించి వచ్చిన దగుట, రక్తప్రభావిషయమునఁ గావేరీతోయము పైమాఁటిని మించియున్న దనుట నిశ్చయము. అలం. అనుగుణము.

సీ. చక్రవర్తిమహాప్రశస్తి నాఁడును నేఁడు
చెలఁగి ధర్మక్రమస్థితి ఘటించె
భూభృదుద్ధరణవిస్ఫూర్తి నాఁడును నేఁడు
గోరక్షణఖ్యాతిఁ గుదురు పఱిచె
సాధుబృందావనసరణి నాఁడును నేఁడు
వంశానురాగంబు వదలఁ డయ్యె
సత్యభామాభోగసక్తి నాఁడును నేఁడు
నాకల్ప మవని నింపార నిలిపె

తే. నాఁడు నేఁడును యాదవాన్వయమునందు
జనన మందెను వసుదేవమనుజవిభుని
కృష్ణుఁ డనువేర నరసేంద్రకృష్ణదేవ
రాయఁ డనువేర నాదినారాయణుండు. 1)

టీ. నాఁడును = కృష్ణావతారమునను, నేఁడును = కృష్ణరాయావతారమునను, చక్రవర్తిమహాప్రశస్తి—చక్రవర్తి=కృ. చక్రముతో నుండువాఁడు (చక్రి), కృ. రా. మూర్ధాభిషిక్తుఁడు సార్వభౌముఁడు అనుగొప్పదగుఖ్యాతితో, చెలఁగి = ఒప్పి, ధర్మక్రమస్థితిక్ -ధర్మ=కృ. ధర్మరాజుయొక్క, కృ. రా. ధర్మముయొక్క, క్రమస్థితిక్ = రీతియొక్కయునికిని, ఘటించెక్ = కూర్చెను. భూభృదుద్ధరణవిస్ఫూర్తి—భూభృత్. కృ. గోవర్ధనగిరియొక్క, ఉద్ధరణ = ఎత్తుటయొక్క, విస్ఫూర్తి=ప్రకాశము, కృ. రా. భూభృత్=రాజులయొక్క, ఉద్ధరణ=సంహరించుటయొక్క, విస్ఫూర్తి=ప్రకాశము, గోరక్షణఖ్యాతిక్—కృ. గోపాలుఁడను ప్రసిద్ధిని, కృ. రా. గో = భూమియొక్క

రక్షణ=పాలనముయొక్క, ఖ్యాతి=ప్రశస్తిని, సాధుబృందావనసరణి-కృ. సాధు = లెస్సయైన, బృందావనసరణి=బృందావనమార్గము, కృ. రా. సాధుబృంద = సజ్జనసమూహముయొక్క, అవనసరణి=రక్షించుమార్గము. వంశ. కృ. వెదురునందు (పిల్లనగ్రోవి.) అనురాగము=ఆసక్తి, వంశానురాగంబు = కృ. రా. తనవంశమునఁబుట్టినవారియందుఁ ప్రేమ, సత్యభామాభోగసక్తి-కృ. సత్యభామాసంబంధమగు భోగమునందైన యాసక్తిచే, కృ. రా. సత్య=సత్యముయొక్కయును, భామా=నిజదారలయొక్కయును లేక, సత్య= సత్య మనెడు, భామా=స్త్రీయొక్క, భోగ=అనుభవమునందైన, సక్తి=ఆసక్తి, ఆకల్పము= కృ. ఆపారిజాతమును, అవనిన్=భూమిపై, కృ. రా. ఆకల్పము=కల్పాంతమువఱకు, యాదవాన్వయమునందు=కృ. యాదవకులమున, కృ. రా. యయాత్యగ్రసుతుండగు యదువుయొక్కవంశమున.

భా. చక్రవర్తి యను గొప్పప్రసిద్ధి కల్గియుండి ధర్మక్రమస్థితిని ఘటించుటం జేసియు, భూభృదుద్ధరణమొనర్చి గోరక్షణఖ్యాతి పాదుకొల్పుటంజేసియు, సాధు బృందావనసరణిని మించి పంశానురాగము వదలమించేసియు, సత్యభామాభోగసక్తిని మాఱి యాకల్ప మవని నిలుపుటంజేసియు, నవ్వసుదేవసుతుండే యయ్యాదినారాయ ణుండే నరసరాజునకుఁ గొడుకై కృష్ణదేవరాయఁ డనుపేరితోఁ బుట్టెనని భావము. కృష్ణావతారమునఁ జక్రమును దాల్చి ధర్మజునకు న్యాయమును గూర్చెను. కృష్ణరా యావతారమున చక్రవర్తి యనుప్రఖ్యాతిని బడసి ధర్మమును సరిగఁ బాదుకొల్పెను. చక్రవర్తిత్వము, ధర్మక్రమస్థితిసంఘటనము-ఇయ్యి వీరెండవతారములకుఁ గల సమాన ధర్మములు. కృష్ణావతారమున గోవర్ధనగిరి నెత్తి గోవులఁ గాపాడెను. కృష్ణరాయావ తారమున భూపాలురఁ జంపి భువిని లెస్సగఁ బాలించెను. భూభృదుద్ధరణగోరక్షణము లీరెండవతారముల సమానములు. కృష్ణావతారమున రమ్యమగు బృందావనమందును (మురళి) వేణుయష్టియందును నధిక మగుననురాగము కల్గియుండెను. కృష్ణరాయావ తారమున సక్తసమూహమునందును దనవంశీయులందును నధికాదరము కల్గియుండెను. సాధుబృందావనవంశానురాగములు నిందు నందుఁ దుల్యములు. కృష్ణావతారమున సత్య భామాభోగమునం దైనప్రీతిచే పారిజాతవృక్షము నిలకుఁ గొనితెచ్చెను. కృష్ణరాయావ తారమున సత్యమునందును నిజభార్యలందును నైన ప్రేమచే నవని నాకల్పము నిల్పెను. సత్యభామాభోగసక్తియు నాకల్పస్థాపనమును నీరెంటను సదృశములు కాన నాకృష్ణుఁడే యీకృష్ణరాయఁడని భావము

విశే. కృష్ణునితండ్రి నందుఁ డొకసమయమున నింద్రయాగము సేయ సమ కట్టఁగాఁ, గృష్ణుఁ డాతని వల దని వారించెను. దాన నింద్రుఁడు కోపించి శిలావర్షమును

గురిపించెను. అపుడు తల్లడమందు గోపాలురను గోవులను శ్రీకృష్ణుడు గోవర్ధనగిరి నెత్తి ఛత్రముగా నొనర్చి దానిక్రింద గోవుల గోపాలుర నిల్పి యాయుపద్రవము నుండిగాపాడెను అనుపురాణగాథ నిచట సమసంధింపవలెను. బృందావనము శ్రీకృష్ణుని విహారోద్యానము. అలం. శ్లేషానుప్రాణితరూపకము.

చ. అలఘణిభోగరత్నములు నావిగిభోత్కటగండగంధము
ల్తలఁపునఁ బొతి నవ్వు వసుధాసతి దా భుజకీర్తిమూ క్తిక
చ్ఛలమునఁ గృష్ణరాయనృపచంద్రునిబాహువునందు భూషణో
జ్జ్వలమణుల న్మృగీమదమువాసనయుం గని ధూ ర్త లంగనల్. 20

టీ. అలఘణిభోగరత్నములుల్ = ఆప్రసిద్ధములగు శేషునిపడగలయందలి రత్నములును, ఆదిగి...గంధములు = ఆదిగ్గజముల యధిక మగు చెక్కిళ్లయందలి పరిమళములును, తలఁపునన్ =జ్ఞప్తియందు, వసుధాసతి=భూదేవి, కృష్ణ...బాహువునందున్ = కృష్ణరాయఁడను రాజశ్రేష్ఠునిబాహువునందు, భూషణోజ్జ్వలమణులన్ =ఆలంకారములందుఁ బ్రకాశించు మాణిక్యములను, మృగీమదమువాసనయున్ = కస్తూరియొక్క సుగంధమును, భుజకీ ర్తిమూ క్తికచ్ఛలమునన్ - భుజకీ ర్తి = అంగదములంటైన, మూ క్తిక= మంచిముత్తియములయొక్క, ఛలమునన్ =మిషచే, ధూ ర్తలు=దుశ్శీలలు.

భా. భూదేవి తన్నిపుడు బుజములపై నిడి కృష్ణరాయలు భరించుటంజేసి, యాతని బాహువునందలి యంగదములంటైన మణులను గస్తూరిగంధమును గని, మున్ను తన్ను మోచినశేషుని వగుపడగలందలిమణులును దిగ్గజములగండములందలి మదసుగంధమును దలంపునకు రాఁగా, నవి కృష్ణరాయాంగదములందలి మణులను సుగంధమును బోలఁ జాలమి భుజకీర్తులందలి ముత్తియము లను మిషను బరిహసించె నని భావము. నాయకాంతరాశ్రయమును బొంది తొల్లి తన్నుఁ బ్రేమమీఱి భరించిన శేషదిగ్గజనాయకుల వగు రత్నపరిమళములఁ బరిహసించుటంజేసి భూసతీదుశ్శీలత్వ ప్రకటిత్వ మగుచున్నది. హాసము ధవళముగా నుండునట్లు వర్ణించుట కవిలోకసంప్రదాయము. ఇందు 'వాసనయుఁ' అనుచో వాసనలు అనుపాఠాంతర మగపడును. విశేషార్థద్యోతకము గామి, దాని యర్థవివరణము వ్యక్తము. అలం. అర్థాంతరన్యాసము.

చ. మునుకొని కొండవీటికడ మూఢత రుద్రుఁడు కృష్ణసందను
న్మనసిజుని న్జయించె నది మానుషమే నరసేంద్రకృష్ణరా
యనృపతి కొండవీటికడ నాహవభూమిఁ బ్రతాపరుద్రనం
దనుఁ డగువీరభద్రుఁ గరుణామతిఁ గాచె జగత్ప్రసిద్ధిగన్. 21

టీ. మునుకొని=పూనిక్రవహించి, రుద్రుఁడు=ఈశ్వరుఁడు, కృష్ణనందనున్=శ్రీకృష్ణునికొడుకైన, మనసిజునిన్=మన్మథుని, మానుషమే=పౌరుషమా? ఆహవభూమిన్=యుద్ధభూమిని,కొండవీటికడన్=కొండవీఁడను పట్టణముయొక్క ప్రాంతమందు, ప్రతాపరుద్రనంద...భద్రున్=ప్రతాపరుద్రునికొడుకైనవీరభద్రుని, కరుణామతిన్=దయతోఁ గూడినబుద్ధితో, జగత్ప్రసిద్ధిగన్=లోకప్రఖ్యాత మగునట్లుగా, కాచెన్=రక్షించెను.

భా. తొల్లి యాశుఁడు పూనిక్రమై కృష్ణసుతుం డగు మన్మథుని కొండవీటికడ జయించెను. నేఁడు కృష్ణరాయలు కొండవీటిసమీపమున ప్రతాపరుద్రసుతుం డగు వీరభద్రుని దయతో రక్షించెను. తనసుతుని జంపినవానియొక్క సుతునిఁ దాను జంపక దయమాఱి రక్షించుటఁజేసి కృష్ణరాయపరాక్రమమే శూరజనశ్లాఘ్యమగు పౌరుషమగు ననియు, రుద్రపరాక్రమ మట్టిది కాదనియు భావము.

చ. నెలకొని కృష్ణరాయధరణీవిభుఁ డుత్కలభూమిపాలుతోఁ
గలన నెదిర్చి హస్తికరకాండతతుల్ మసకంపుఁబాములై
మలసినచోటఁ గూడినసమగ్రయశోవసనంబు గప్పి తా
వలవఁగఁజేసె భూసతిని వశ్యవిధిజ్ఞుఁడు గాన నేర్పునన్. 22

టీ. నెలకొని. రూ. అ. నెలవుకొని. ఉత్కలభూమిపాలుతోన్=ఉత్కలదేశపురాజులతో, కలనన్=యుద్ధమున, హస్తికరకాండతతుల్=కాండములవంటి యేనికతొండములయొక్క సమూహములు, మసకంపుఁబాములై=సంభోగేచ్ఛతో మించుసర్పములై, మలసినచోన్=కూడినచోటు, సమగ్రయశోవసనంబు=సంపూర్ణమైన కీర్తి యను వస్త్రమును, వలవఁగన్=ప్రేమించునట్లు, వశ్యవిధిజ్ఞుఁడు=పరుల వశపఱచుకొనువిధులనెఱింగినవాఁడు.

భా. కృష్ణరాయ లుత్కలనాథునితో నెదుర్చినాఁడు పోరు ఘోరం బగుట, గజములతుండములు తెగి సంభోగేచ్ఛ మాఱి వర్తులసామములవలెఁ బరస్పరముగఁ గలసి మెలసి పడె ననియు, నట్టియుద్ధముకతనఁ గృష్ణరాయల కనంతయశంబుఁ గల్గె ననియు భావము. పైవిషయమునే కవి యిట్లు చమత్కరించి వర్ణించెను. కీర్తి తెల్లగా నుండును గాన నద్దానిని వస్త్రముగాను, హస్తికరతతుల నద్దాన నెలకొనుమసకపుఁబాములఁగాను, నాకీర్తి భువిపై నంతట వ్యాపించియుండుట నద్దాని భూసతిని వశముపఱచుకొన నామె పైఁగప్పినసంభోగేచ్ఛను వర్తులసర్పమిథునములఁ గూడినవస్త్రముగాను జమత్కరించెను. కామినుల వలవంజేయఁ గాముకు లిట్లొనర్తు రని ప్రసిద్ధి.

వ్యా-విశే. మసకంపుఁబొములు-మసకము = సంభోగేచ్ఛ, కర్మధారయసమాసంబుల మువర్ణకమునకుఁ బుంపు లగు. వానికిఁ బరుషములు పరము లగునపుడు నుగాగమము, ద్రుప్రకార్యములు. వలవఁగ్ . ప్ర. వలచు + ను. 'ఆగమాన్యచకారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరంబగునపుడు పవలగు.' అనుపద్ధతి ననుసరించి యయ్యాదాగమముగాక యన్యము సిద్ధమునగుటను జేపరముగా వకారము. వలవ్ -దీనిపై 'క్' అనున దనుప్రయుక్తమైన దానికి వికల్పముగా హ్రస్వము కల్గెను.

సీ. ఉదయాద్రివేగ యత్యుద్ధతి సాధించెఁ
వినుకొండ మాటమాత్రన హరించెఁ
గూటము ల్నెదరంగ కొండవీ డగలించె
బెల్లముకొండయచ్చెల్లఁ జెఱిచె
దేవరకొండయుద్వృత్తి భంగము నేసె
జల్లిపల్లె సమగ్రశక్తి డుల్చెఁ
గిసుక మీఱి ననంతగిరి క్రిందుపడఁ జేసెఁ
గంబంబుమెట్టు గ్రక్కునఁ గదల్చె

తే. బలనికాయము కాలిమట్టులనె యడఁచుఁ
గటకమును నింక ననుచు సుత్కలమహీశుఁ
డనుదినమ్మును వెఱచు నెవ్వనికి నతఁడు
రాజమాత్రుండె శ్రీకృష్ణరాయవిభుఁడు. 23

టీ. ఉదయాద్రివేగ = ఉదయాద్రియొక్కవడిని, (ఆలోపముసు) అత్యుద్ధతిక్ =మిగుల గర్వముతో, వినుకొండక్ =వినుకొండ యనుదానిని, వినబట్టికొండ గాన మాటయాడినంతమాత్రమునచే భయపడి వశమయ్యె ననుట. కూటములు=శిఖరములు, అగలించెక్ = పెల్లగించెను. కొండవీడుగాన శిఖరములు చెదరున ట్లున్మూలించె ననుట. చెఱిచెక్ =చెడున ట్లొనర్చెను. బెల్ల మచ్చుతోఁ దయారగుగాన నద్దానిం జెఱిపె ననుట. ఉద్వృత్తిక్ = ఉద్ధతిని, భంగము=నాశము, సమగ్రశక్తిక్ = సంపూర్ణమైన సామర్థ్యముతో, కినుక=కోపము, గ్రక్కునక్ = శీఘ్రముగ, బలనికాయము=బలముల గుంపు, కాలిమట్టులక్ = పాదములత్రొక్కుడులచే, ఉత్కలమహీశుఁడు = ఉత్కల దేశపురాజు.

భా. ఉదయాద్రి, వినుకొండ, కొండవీడు, బెల్లముకొండ, దేవరకొండ, జల్లిపల్లె, అనంతగిరి, కంబముమెట్టు, కటకము - ఇవి రాయలు జయించినప్రదేశములు. రాయల పూర్వదిగ్విజయాత్ర సమగ్రముగ నిందు సూచిత మయ్యెను.

వ్యా-విశే. చెఱిచె. చెడునకుఁ జుక్కఁ బరమగునపుడు డా కలఘు లేఫంబగును. అడఁచు. రూ. అ. అణఁచు. వేగ. ఇయ్యది కళిత్తైనట్లు 'ధృతరాష్ట్రు డవిసీతి నేసినను సంధింపంగరాదంచు వేగ తెగంబాఱికు'అను తిక్కనభారత ప్రయోగము తెల్పుచున్నది. హరిశ్చంద్రనలోపాఖ్యానమునందలి 'ఆవేళ నరిగె నాకులజీవాతువు వేగ' అనుస్థలము నరయునది. చూ. హరి. పీఠిక.

ఈసీసమున నొక్కొక్కప్రదేశమును సాధించె నని చెప్పుటలోఁ గవి సాధ్వి ప్రాయములగుపదముల నిల్పిన ట్లూహింపనగును.

సీ. బాహుసౌధక్రీడఁ బరఁగుపంటవలంతి
తొయ్యలినిడుదకస్తూరిబొట్టు
వైరిసైన్యాబ్ధిలో వచ్చు గెల్పులనావఁ
గడఁజేర్చు ప్రాకుడుంగడపుఁజేయి
యరికుంభికుంభముక్తాక్షరాంకిత మగు
జయరమాకన్యక చదువుపలక
శత్రురాజులకు నచ్చరల నాకర్షించు
సమరేంద్రజాలపించంపుఁగుంచె

తే. మేనుసగము యశోమహేంద్రానునకును
శౌర్యరవిఁ గోరి వచ్చినచాయలేమ
నరసవిభుకృష్ణరాయభూనాథచంద్ర
చేత ననిలోన మించుకౌక్షేయకంబు. 24

టీ. బాహుసౌధక్రీడ = బాహు వనెడు మేడయందలి యాటయందు, పరఁగు=ఒప్పు, పంటవలంతితొయ్యలి=భూమి యనువనితయొక్క, నిడుద=నిడుపుగానున్న, కస్తూరిబొట్టు=కస్తూరితిలకము, వైరిసైన్యాబ్ధిలోన్ = శత్రుసేనయనుసముద్రములో, గెల్పులనావన్ = విజయనౌకను, కడఁజేర్చు=చరఁజేర్చు, ప్రాకుడుంగడపుఁజేయి=పాఁచిపట్టినచుక్కాను, (అరిప్రము) అరి...అంకితము-అరి=శత్రువులయొక్క, కుంభి=ఏనుఁగులయొక్క, కుంభ=కుంభస్థలములందైన, ముక్త = మంచిముత్తియములను, అక్షర=వర్ణములచే, అంకితము=చిహ్నితము, జయరమాకన్యక చదువుపలక=జయలక్ష్మి యను బాలికయొక్క చదివెడుబల్ల, శత్రురాజులకున్ =వైరిభూమీశులకు, అచ్చరలన్ = అప్సరలను, ఆకర్షించు=తెగుచునట్టి, సమర...కుంచె = యుద్ధమునుగారడిసంబంధమైన

నెమిలి పించముయొక్క కుంచె, యశోమహేశానునకుఁ =కీర్తియనుసీశ్వరునకు, మేను సగము=శరీరార్ధము, భార్యయని భావము. శౌర్యరవిఁ =పరాక్రమమనుసూర్యుని, చాయ లేమ=ఛాయాదేవి, చేతఁ =హస్తమున, మించు= ప్రకాశించు, కౌక్షేయకము = కత్తి. ఇది కర్తృపదము.

భా. కృష్ణరాయని చేతనుండుకత్తి యాత్రసిభుజసౌధమున నాటలాడుభూసతికి కస్తూరికాతిలకమువలెను, వైరిసేనాసముద్రమున నడయాడు గెల్వునావ నొడ్డునకు జేర్చు పాఁచిపట్టిన యరిష్ట్రమువలెను, శత్రువుల యేనుంగులకుంభము భేదించుటకఱన గ్రుచ్చుకొని నిల్చియున్న యాణిముత్తెములతోఁగూడి జయలక్ష్మి యనుబాలిక చదువు కొనుబలపముపలకవలెను, శత్రురాజులకు నచ్చరల నాకర్షించి కూర్చుయుద్ధమనుగారడి సంబంధమైన నెమిలిపించపుఁగుంచెవలెను, గీర్తి యనుసీశ్వరున కర్ధాంగివలెను, బరాక్రమసూర్యునిఁ బడయఁగోరి వచ్చిన ఛాయాదేవివలెను ప్రకాశించుచున్నదనిభావము.

విశే. రాజు భుజమున నిడిభువి మోయు ననుట కవిలోకసంప్రదాయము గాన, భూసతి భుజమున నుండే ననుటయుఁ, గస్తూరికాతిలకము నల్లనైయుండునుగాన నల్లని యసి నామె తిలకముగా నూహించుటయు సరసముగా నున్నవి. అసి నల్లగా నుండునుగాన నరిష్ట్రము పాఁచివట్టిన దనుట యెంతయు హృద్యమగు. నల్లనికత్తిపైఁ దెల్లనిముత్తి యము లంటియుండుటంజేసి, తెల్లనియక్షరములతోనొప్పు చదువుబల్లగా దాని నూహిం చుట లెస్సయగు. భువిపై నుండు రాజన్యులకు దివిపైనుండు నచ్చరలఁ దిగిచి కూర్చు యసిత్ర మగునసిగాన, దీనిని గారడిసంబంధ మగు నెమిలి యీకలకుంచెగాఁ జెప్పుట నొప్పగు. కీర్తి తెల్లగా నుండును. ఈశ్వరుఁడును దెల్లనివాఁడే. పార్వతి నల్లనిది. కత్తి నలుపు. కానఁ గీర్తి సీశ్వరునిఁగాను, గత్తి నాత్రసియర్ధాంగిగాను జేరొక్కనుట సముచిత ముగ నున్నది. సూర్యునికాంత ఛాయాదేవి. శౌర్యరవి గాన నీఛాయ యాత్రసినే గోరి పొందినది. మఱియు ఛాయాశబ్దమునకు నీడ యనియు నర్థము గలదు. నీడ నల్లగా నుండును. కాన నల్లనికత్తిని ఛాయగా నిరూపించుటయుఁ, బ్రతాపఖనిని రాయలను రవిగా నూహించుటయు మిగుల దగియున్నవి. అలం. రూపకము. ఉల్లేఖము.

## ఆశ్వాసాంతములు

క. ఏవంవిధగుణఖనికిని, దోష్యవనితా ప్రార్థ్యమానధూర్తారిధరి
త్రీవరసంగతిసుభగం, భావుకరణముదితకలహాపారణమునికిన్. 25

టీ. ఏవం...ఖనికిని - ఏవంవిధ = ఈరూపములైన, గుణ = మంచిగుణములకు, ఖనికిని=గనియైనవానికిని, దోష్య...మునికిన్ -దోష్యవనితా = దేవతాస్త్రీలచే, ప్రార్థ్య

మాన = కోరఁబడుచున్న, ధూర్త=దుష్టులైన, అరిధరిత్రీవర = శత్రురాజులయొక్క, సంగతి=కలయికకు, సుభగంభావుక = మనోహరమగు, రణ = యుద్ధముచేత, ముదిత = సంతుష్టుఁడగు, కలహ=కలహమే, పారణ=భోజనముగాఁగల, ముసికిఁ = నారదుఁడు గలవానికిని, కృష్ణరాయనికి.

విశే. 'కలహపారణముసికిఁ' అను పదముచేఁ బారిజాతసుమసమర్పణమూలక మగు నారదకృతకలహవృత్తాంతము సూచితము. అలం. పర్యాయోక్తి, ముద్రాలంకారము.

క. రాధాతనయాధారిత, గాధాధఃకరణనిపుణకరసదయునకుఁ
మేధావదసాధారణ, బోధాకరహృదయునకు విబుధసదయునకున్.26

టీ. రాధా...యునకుఁ - రాధాతనయ = కర్ణునియందు, ఆధారిత = నిల్పఁబడిన, గాధా = కథను (అనఁగా: దానకర్ణుఁడను ప్రఖ్యాతిని) అధఃకరణ = క్రిందు సేయుటయందు, నిపుణ=నేర్పుకల, కర = హస్తముగల్గిన, సదయునకుఁ = దయతోనొప్పువానికి, లేక, కర=హస్తముయొక్క, సత్=యోగ్యమైన, అయునకుఁ=శుభావహ విధిగలవానికి, 'నిపుణకరణశయునకుఁ' అని పాఠాంతరము. నిపుణ = నైపుణ్యముగల, కరణ=సాధనమైన, శయునకుఁ = హస్తముగలవానికి, మేధా...హృదయునకుఁ - మేధావత్=ప్రజ్ఞగలపండితులకు, అసాధారణ=సాధారణముగాని, బోధా=జ్ఞానమునకు, ఆకర=స్థానమైన, హృదయునకుఁ=మదిగలవానికి, విబుధసదయునకుఁ = పండితులవిషయమై దయతోఁగూడినవానికి. ఇందలియమకముఁ గమనించిన సదయున కనునదియె సత్పాఠమగునుగాని తక్కుంగలపద్యములలో నొక్కొకవర్ణమునకే వ్యావృత్తి యగపడుట నట్లగుట సరికాదని తోఁచెడిని.

భా. కృష్ణరాయఁడు దానముచేఁ గర్ణునిఁ గ్రిందుపఱచువాఁడనియుఁ, బండితుఁ కంటె మించినజ్ఞానముగలవాఁడనియుఁ, బండితులయెడల దయాళువనియుఁ భావము.

క. నాగాంబికాకుమారున, కాగామిగతాధునికనృపాలభ్యయశో
*శ్రీగుంభహసితహిమగుది, శాగజతనుకటజన్యలాభ్యసంభారునకున్. 25

టీ. నాగాంబికాకుమారునకుఁ = నాగాంబాసుతునకు, ఆగామి...సంభారునకుఁ -ఆగామి = పుట్టఁబోవునట్టియు, గత = చనినట్టియు, ఆధునిక = ప్రకృతమునఁ జెయున్నట్టియు, నృప=రాజుల చే, అలభ్య=పొందశక్యముకాని, యశశ్శ్రీ = కీర్తిసంపత్తియొక్క, గుంభ=కూడిక చే, హసిత=నవ్వఁబడిన, హిమగు=చంద్రునియొక్కయు, దిశా

---

* 'శ్రీగలహాస్థితహిమగు' పాఠాంతరము.

గజ = దిగ్గజములయొక్కయు, (క్రమముగా) తను = శరీరమునుండియు (ఈశరీరము చంద్రునిది), కట = గండములనుండియు, జ=పుట్టిన, సైల్య = నీలత్వముయొక్క, సంభారునకున్ = సంపూర్ణత గలవానికి.

భా. కృష్ణరాయలయశస్సు త్రికాలములయం దైనరాజన్యులకీర్తిని మించిన దనియు, నాకసమును దిగంతములను నాక్రమించి మించె ననియు భావము.

క. సామర్ష దళితపరభట, సామజహాయకూలముద్రజక్షుతజధునీ
కామికితాఖిలజలధికి, నాసుష్యాయణసుధీగృహాంగణనిధికిన్. 28

టీ. సామర్ష ...జలధికిన్ -సామర్ష=కోపముతో, దళిత=బ్రద్దలు చేయఁబడిన, పరభట=శత్రుసైటులయు, సామజ=శాత్రవులయేనుఁగులయు, హయ=గుఱ్ఱములయుఁ, కూలముద్రజ=ఒడ్డును జెల్లగించి పడఁద్రోయుటవల్లనైన (నిర్మూలించుట చేనైన) క్షుతజధునీ=రక్తప్రవాహముల చేత, కామికిత=విటులుగాఁజేయఁబడిన, జలనిధికిన్ = సముద్రములుగలవానికి, ఆముష్యా...నిధికిన్ -ఆముష్యాయణ = సద్వంశసంజాతులగు, సుధీ = పండితులకు, గృహాంగణ=ఇంటిముంగిలివాకిలియంద్రైన, నిధికిన్ =నిధియైనవానికి. ఇందు 'కూలముద్రజ' అనుచో 'కూటమూర్ధజ' అనుపాఠ మగపడును. కూలముద్రజ పదము ప్రసిద్ధపదమగుటను, బొఠాంతరము విశేషార్థబోధకముగామిని బరిత్యక్తము.

భా. కృష్ణరాయలు శత్రువులభటులను, నేనుఁగులను, గుఱ్ఱములను జంపుటకతన నెత్తురుటేఱులు వెల్వడి సముద్రమునఁ గలియుచుండె ననియు, నాతఁడు పండితులకు నింట నుండుపెన్నిధి యనియు భావము.

క. కోదండద్రోణినకును, వేదార్థస్థాపనప్రవీణినకు సమి
న్నేదిష్ఠవిమతతరసా, స్వాదనవశతుందపరిమృజకృపాణినకున్. 29

టీ. కోదండద్రోణినకున్ = ధనువువిషయమై ద్రోణునింబోలువానిని (ధనుశ్శబ్దము లక్షణచే ధనుర్విద్యాబోధక మగునని గ్రహింపవలయును.) వేదార్థ=వేదవిహిత కార్యముల, స్థాపన=నెలకొల్పుటయందు, ప్రవీణినకున్ = నేర్పుగలవానికి, నేదిష్ఠ... కృపాణినకున్ -నేదిష్ఠ = సమీపమునన్నున్న, విమత = శత్రువులయొక్క, తరస = మాంసముయొక్క, ఆస్వాదనవశ = భుజించుటకతన, తుందపరిమృజ = కడుపునుదడవి కొను (సోమరియైన), కృపాణినకున్ = కత్తికలవానికి, ఇందు 'వేదార్థ' అనుచో 'వెదార్థ్య' అనుపాఠ మగపడును. వేదమార్థస్థాపన మను సరసార్థము సరళముగ బోధించుటఁ బొఠాంతరము హృద్య మని తోఁచెడిని.

భా. కృష్ణరాయలు విబుధవిద్యా ద్రోణునిబోలువాఁడనియు, వేదార్థముల నెల కొల్పుతత్పాహము గలవాఁడనియు, శత్రురాజులరక్తములు గడుపునిండ భుజించుట కతన సోమరిత్వమైనకత్తిని చేతధరించు నకుంఠితపరాక్రమము గలవాఁడనియు భావము.

క. అసుహృదసుపవనవిసర, గ్రసనరసవ్యసనవశవికసదసిరసనా
ప్రసరణశయఫణివిలసన, విస్మృమరమరుపకితసమరవీథీస్థలికిన్. 30

టీ. అసుహృ...స్థలికిన్ -అసుహృత్ = శత్రువులయొక్క, అసుపవన=ప్రాణ వాయువుల, విసర=సమూహములయొక్క, గ్రసన=మ్రింగుటయందలి, రస = రుచియను, వ్యసన=ఆసక్తికి, వశ=అధీనమైన, వికసత్ = విడియయున్న, అసి=కత్తి యను, రసనా = నాలుకయొక్క, ప్రసరణ=చాచుటనుగల్గిన, శయ = హస్తమను, ఫణి=పడగయొక్క, విలసన=విలాసముచేత, విస్మృమరమరుపకిత=వ్యాపించునట్టి భయముగలదిగాఁ జేయఁబడిన, సమరవీథీస్థలికిన్ = యుద్ధరంగము గలవానికి.

భా. కృష్ణరాయలకత్తి యనుపామునాలుక యాత్రని యరచేయి యనుపడగ నుండి వెల్వడి శత్రురాజులప్రాణవాయువులు బీల్చుటయం దాసక్తమై చరించుచు యుద్ధరంగమున సమస్తమునకు వెఱపును బుట్టించుచు మించె నని భావము. ఇట్లనుట చే బాహువునకు సర్పత్వము గమ్యమగుచున్నది. అలం. రూపకము. వృత్త్యనుప్రాసము.

క. వైంధ్యద్విపగంధనిబ, ద్ధాంధ్రాళిప్రతిపదోదితాలయవిభవా
పంధ్యప్రబంధకృతిసం, బంధ్యనుభావునకు బుధితమనుభావునకున్. 31

టీ. వైంధ్య...భావునకున్ -వైంధ్య=వింధ్యపర్వతమునఁబుట్టిన, ద్విప=ఏనుఁగుల యొక్క, గంధ=పరిమళముచేత, నిబద్ధ=కూర్పఁబడిన, ఆంధ్య=గ్రుడ్డితనము గల్గిన, అళి = తుమ్మెదలచేత, ప్రతిపద=అనుక్షణమందు, ఉదిత=పలుకఁబడిన, ఆలయ=ఇంటియొక్క, విభవ=వైభవముగలవాఁడును, అపంధ్య=మొక్కవోని, ప్రబంధ = కావ్యములయొక్క, కృతి=నిర్మాణమునకు, సంబంధి=సంబంధించిన, అనుభావునకున్ = మహిమగలవాఁడును గువానికి, బుధితమనుభావునకున్ =తెలిసికొనఁబడిన మనువుయొక్కధర్మముగలవానికి, లేక మను=మంత్రముల, భావునకున్ =ధర్మముగలవానికి, మంత్రార్థముల నెఱిఁగినవాఁడని భావము.

భా. కృష్ణరాయలయింట వింధ్యోద్భవములగు మంచియేనుఁగులు కల వనియు, వానిమదమును గ్రోలి తుమ్మెద లనుక్షణము మత్తిలి రూఢాకృతినొనర్చుచుండు ననియు, దాన నాతనిగృహవైభవము సర్వాతిశాయియై మించుచుండు ననియు, నాతఁడు సరస

ములగు కృతులఁ బొగడ్తగాంచినవాఁడనియు, మనువు పాలించుపద్ధతిని బ్రజాపరి పాలనాపద్ధతిని నడపువాఁడనియు లేక మంత్రార్థవేది యనియు భావము.

క. వనితాజనతాస్మరునకు, ఘనతాపనితారకాభికద్యుచరగవీ
ఘనతాయనకారకస,త్పనితాత్మనితాంతదానపరతంత్రునకున్. 32

టీ. వనితాజనతాస్మరునకున్ =స్త్రీసమూహమునకు మన్మథుఁడైనవానికి, ఘనతాప ...తంత్రునకున్ -ఘన = గొప్పదగు, తాప = సంకటములను, నితారక = నిశ్శేషముగఁ బోఁగొట్టుటయందు, అభిక=అధరముగల, ద్యుచర = సురలయొక్క, గవీ=ఆవుయొక్క (కామధేనువు), ఘన=గొప్పదైన, తాయన=వృద్ధికి, కారక=హేతువైన, 'తారక' అని పాఠాంతరము. సత్ = సజ్జనులచే, పనిత = స్తోత్రముచేయఁబడిన, ఆత్మ = ప్రనయొక్క, నితాంత=అత్యంతమైన, దాన=ఈవికి, పరతంత్రునకున్ = స్వాధీనుఁడైనవానికి, ఘన= మేఘునియొక్కయు, తాపని=కర్ణునియొక్కయు, తారకాభిక=చంద్రునియొక్కయు, ద్యుచరగవీ=కామధేనువుయొక్కయు అని చెప్పనగు. దేవతలకుఁ గళల ననుదినమిచ్చుటకు జంద్రుఁడును దాత యగుచున్నాఁడు.

భా. కృష్ణరాయలయీవి కామధేనువునేవిసిగూడ మించిన దని భావము. 'తారక' అనుపాఠమున వానియొక్క, ఘనతా = పెద్దతనమునకు, ఆయన=స్తోత్రము, తారక = చూపునది, అని యర్థము చెప్పవలెను.

క. పరిపంథిదోర్బలసమి,త్పరివర్ధిష్ణుప్రతాపదహనారణికిక్
సరసకళాధోరణికిక, నరసాధిపకృష్ణరాయనాయకమణికిన్. 33

టీ. పరిపంథి...రణికిక్ -పరిపంథి = శత్రువులయొక్క, దోర్బల = బాహుబల మనే, సమిత్ =సమిధలచే, పరివర్ధిష్ణు = అభివృద్ధిఁజెందుస్వభావముగల, ప్రతాప=శౌర్య మను, దహన=అగ్నికి, అరణికిక్ = మంథనదారువైనవానికి, సరసకళాధోరణికిక్ -సరస= రసయుక్తములైన, కళా=విద్యలయొక్క, ధోరణికిక్ =పద్ధతిగలవానికి. అలం. రూపకము.

# ప్రథమాశ్వాసము

## ఈకథాప్రారంభము

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నాయొనర్పం బూనిన పారిజాతాప
హరణం బనుమహాప్రబంధమునకుం గథాక్రమం బెట్టి దనిన. 34

టీ. అభ్యుదయపర-పరాభివృద్ధిగాన్ -అభ్యుదయపరంపర = శ్రేయస్సుల సమూహము, అభివృద్ధిగాన్ =అభివృద్ధియగునట్లుగా, నాయొనర్పన్ = నేను చేయుటకు, పూనిన= వహించిన, పారిజాతాపహరణం బను=పారిజాతాపహరణ మనునట్టి, మహాప్రబంధంబు నకున్ =మహాకావ్యమునకు. కథాక్రమంబు=కథయొక్కసారిది.

వ్యా-విశే. నాయొనర్పంబూనిన:—ధాత్వర్థవిశేషణభావార్థకపూర్వవ్యవహితా వ్యవహితకర్తృపదప్రథమకుం దఱుచుగ యొక్కషష్ఠి యగు ననుపద్ధతిని 'నే నొనర్పం బూనిన' అనుచో నే ననుపది ధాత్వర్థవిశేషణపూర్వవ్యవహితకర్తృపదప్రథమయగుటం జేసి యొక్క షష్ఠి రాఁగా నద్ధానికి యొక్కకులోపంబు బహుళం బనుదానిచే లోపము కల్గి 'నాయొనర్పంబూనిన' అని యయ్యెను.

పారిజాతాపహరణమునుగూర్చి యైనప్రబంధ మగుట దీని కీపేరు కల్గెను. కావ్యకథను సమగ్రముగఁ దెల్పువేరగుటనిది దీని కెంతయు నొప్పియున్నది. పురాణ ప్రసిద్ధ మగుకథనుగాని లేక స్వకపోలకల్పితకథనుగాని యాధారముగఁ గొని పురశ్చేలా ద్యష్టాదశవర్ణనములలోఁ గథకు సంబంధించినవానిం గొన్నివర్ణనలఁ గూర్చి రచించిన గ్రంథము ప్రబంధము నాఁబడు. కావ్య మనియుఁ జెప్పనొప్పును.

క. జనమేజయనృపవల్లభుఁ,డనుదినమును హరికథాసుధాస్వాదమునం
దనివి సనక వైశంపా,యనమునికిఁ గుతూహలాయత్తమతిన్. 35

టీ. జనమేజయనృపవల్లభుఁడు=జనమేజయుఁ డనుమనుజేశుఁడు, అనుదినమును = ప్రతిదినమును, హరికథాసుధాస్వాదమునన్ -హరి = విష్ణునియొక్క, కథా=కథ యను, సుధా=అమృతమునియొక్క, ఆస్వాదమునన్ = పానము చేతను, తనివి=తృప్తి, చనక = పొందక, కౌతుకాయత్తమతిన్ - కౌతుక = పైపైవినవలె ననుసంతసమునకు, ఆయత్త= అధీనమైన, మతిన్ =బుద్ధితో.

భా. హరికథల సత్రమ్ము వైశంపాయనుండు విన్పింప జనమేయుం డత్యాదర మున వానిని విను నసియుఁ, నింకను వినవలె ననునాసమీఱ నొప్పు నసియు భావము.

వ్యా-విశే. అనుదినము. వీప్సార్థ కావ్యయీభావము. అలం. రూపకము.

సీ. హరివంశకథ లెల్ల నానుపూర్వ్యగ నిట్టి
వని కృతార్థుండ నైతి మునివరేణ్య
యాదానవారాతి యమరులఁ బ్రోవంగఁ
బూని యాయదువంశమున జనించి
యతఁడు గ్రమ్మఱి వారి కాథార మగుపారి
జాతంబు పుడమి భీతిఁ దెచ్చి
ననుమతి నిచ్చిరో యావేల్పు లొండేని
బలిమిఁ జేకొనియెనో పాడి దొఱఁగి

తే. తెలియ నానతి యిమ్ము సందియము దీఱ
వినఁగ వేడుక యయ్యె సవిస్తరముగ
ననిన నావ్యాసమునిశిష్యుఁ డతనితోడ
నధిప విను మని పలికె నత్యాదరమున. 36

టీ. మునివరేణ్య=ముశ్రేష్ఠ, హరివంశకథల్లెల్లన్=హరివంశమునకు సంబంధించిన కథలనెల్లను, ఆనుపూర్వ్యగన్=ఒకటితరువాతనొకటిగా, కృతార్థుండను=చేయఁబడిన కార్యములుగలవాఁడను (ధన్యుఁడను), ఆదానవారాతి=ఆరాక్షసశత్రువగునిష్ణువు, అమరులన్=దేవతలను, ప్రోవంగన్=రక్షించుటకై, పూని=యత్నించి, ఆయదువంశమునన్=ఆయాభవకులమున, జనించి=పుట్టి, క్రమ్మఱిన్=మఱల, వారికి=ఆసురలకు, పారిజాతము=కల్పవృక్షము, పుడమికిన్=భూమికి, భీతిన్=భీతిరుగ, అనుమతిన్=సమ్మతితో, ఆవేల్పులు=ఆసురలు, ఒండేసి=కాదేసి, బలిమిన్=బలాత్కారముగ, చేకొనియెనో=స్వాధీనము చేసికొనెనో, పాడి=న్యాయము, తొఱఁగి=విడిచి, ఆనతి=ఆజ్ఞ, సందియము=సందేహము, వేడుక=సంతసము, సవిస్తరమున్=విస్తృతితోఁ గూడునట్లు, వ్యాసమునిశిష్యుఁడు=వైశంపాయనుఁడు, అత్యాదరమునన్=మిగులమన్ననతో.

వ్యా-విశే. ఆజ్ఞప్తి. ప్ర. వి. ఆనతి. సందేహము. ప్ర. వి. సందియము. పృథివి. ప్ర. వి. పుడమి. హరివంశము. హరివంశచరిత్రాదులను జెప్పునది. దీనిని సంస్కృతమున వ్యాసుఁడు రచించెను. కవిప్రయములోనివాఁడైన యెఱ్ఱన పురాణమార్గమున దీని

సాంద్రీకరించెను. పారిజాతము:-"మందారము, పారిజాతము, సంతానము, కల్ప వృక్షము, హరిచందనము" అని వేల్పులమ్రాను లైదు.

చ. హరి నరకాసురుం గెలిచి యద్దనుజేంద్రునియింట నున్నయ
చ్చరలకొలంబువారి నెఱజవ్వనము బొలివోనివారిఁ ద
స్వగునిఁగఁ గోరువారి లలనామణులం బరియాఱువేవురం
బరిణయమయ్యె నారదునిపంపున సౌఖ్యరసైకలోలుఁడై. 37

టీ. హరి=శ్రీకృష్ణుడు, అద్దనుజేంద్రునియింట = ఆరాక్షసరాజగృహమున, అచ్చరలకొలంబువారిన్ =దేవవేశ్యలవంశమున బుట్టినవారిని, నెఱజవ్వనమున్ =నిండు యౌవనమును, బొలివోనివారిన్ =చెడనివారిని, వరునిగన్ =భర్తగా, లలనామణులన్ = స్త్రీరత్నములను, నారదునిపంపునన్ = నారదునియాజ్ఞ చే, సౌఖ్యరసైకలోలుఁడై - సౌఖ్య=సుఖము, రస=రసమునందే, ఏక=ముఖ్యముగా, లోలుఁడై = ఆసక్తికలవాఁడై, పరిణయమయ్యెన్ =వివాహమయ్యెను.

భా. శ్రీకృష్ణుడు నరకాసురుని జయించి యాతఁడు తనయింట సంగ్రహించి యుంచికొనిన పదియాఱువేలస్త్రీరత్నములను నారదునియాజ్ఞ ననుసరించి పెండ్లిచేసి కొనెను.

వ్యా-విశే. అప్సరాకి-ప్ర. వి. అచ్చర. అ+పసుజేంద్రుఁడు=అద్దనుజేంద్రుఁడు. ఇల్లు-ఔపవిభక్తికము. దీని సప్తమ్యేకవచనరూపము ఇంటన్. వేగురు—వేయిశబ్దము యొక్క మహాప్రాణార్థకబహువచనరూపము. నేయి+రు. "సంఖ్యావాచకములకు రురవర్ణకములు పరమగునపుడు సాధారణముగ గువర్ణంబు పూర్వాగమంబగును. సంఖ్యా వాచకములకు విభక్తి పరమగునపుడు కొన్నిటియంత్యాక్షరమునకు లోపంబగు" అను పద్ధతుల ననుసరించి వేయిలోని తుది యికారమునకు లోపమును గువర్ణాగమంబును గలిగిన 'వేగురు' అని యగును. పిదప 'గ'కారమున కపదాద్యమునకు వకారము-వేవురు. ఇందు శ్రీకృష్ణుడు స్త్రీరత్నములు తన్ను వరునిగఁ గోరుటచేతనే వరించెనుగాని వారి యౌవనాదులం గాంచి కామించి బలాత్కారముగఁ బరిగ్రహింపలే దనువిషయము ప్రస్ఫుటమగచుండుటంబట్టి యత్తమనాయకత్వము సూచితము. అదియు మహాముని నారదునియాజ్ఞ ననుసరించియేకాని యొండు గాదని దానికిం గవి మెఱుఁగువెట్టెను.

విశే. నరకాసురుఁడు. "వరాహరూపమున నున్న విష్ణువువలన భూదేవియందుఁ బుట్టినవాఁడు. ఈతనిరాజధాని ప్రాగ్జ్యోతిషము. ఈతఁడు తన్నియైన భూదేవియొక్క

దయచే శ్రీవిష్ణునివలన వైష్ణవాస్త్రము నందఁగల్గెను. ఈతఁడు పదియాఱువేవురను స్త్రీలను జెఱపెట్టెను. అదితికర్ణకుండలములను వరుణునిచ్ఛత్రమును నపహరించెను. శ్రీకృష్ణుఁడు సత్యభామం గూడి కదలి యుద్ధమున నరకుని జయించి స్త్రీలను జెఱవిడిపించి స్వర్గమునకేఁగి యదితికుండలములను సమర్పించెను" అనుభారతభాగవతగాథల నిచట ననుసంధింప వలెను.

తే. మఱియు రుక్మిణి, సత్య, జాంబవతి, మిత్ర
వింద, భద్ర, సువంత, కాళింది, లక్ష
ణ, యనఁగా మున్న కల రబ్జనాభునకును
మహిషు లెనమండ్రు సమతాభిమానవతులు. 38

టీ. మున్న=మొదటనే (అనఁగాఁ బదియాఱువేవురను బరిగ్రహింపకమునుపే) సమతాభిమానవతులు = సమత్వముతోఁగూడిన యభిమానముగలవారు అనఁగా 'నేనె తగినదానను, నేనె తగినదానను' అను నభిమానము గలవా రనుట. మహిషులు=దేవేరులు.

వ్యా-విశే. ఎనమండ్రు ఎసిమిదియొక్క మహన్మహత్యర్థకబహువచనరూపము. రుక్మిణి— ఈమె విదర్భదేశపురాజగు భీష్మకన్యపాలునికూఁతురు. ఈమెయన్న రుక్మి యీమెను శిశుపాలున కిచ్చి కల్యాణము గావింపఁ దలంప, నీమె యొకబ్రాహ్మణునిచేఁ దన యనురాగమును గృష్ణునకుఁ దెలిపె. అంత గృష్ణుఁడు రుక్మిణీసందేశమును విని వెడలి వచ్చి శిశుపాలాదుల జయించి రుక్మికి గర్వభంగము గావించి రుక్మిణిని రాక్షసోద్వాహ విధిని బరిగ్రహించి పురంబునకుఁ దోడ్కొని జనియెను.

విశే. సత్య, జాంబవతి— ఈమెకు సత్యభామ యన్న నామాంతరము గలదు. ఈమె సత్రాజిత్పుత్రిక. సత్రాజిత్తు తమ్ముఁడు ప్రసేనుఁ డొకనాఁడు తనయన్నకుసూర్యానుగ్రహమున లబ్ధమైన స్యమంతక మనురత్నరాజమును దాను మెడందాల్చి యాఖేటోత్సాహము మీఱ నటవిం జేరె. అట నొక సింహ మాతనిం జంపి యారత్నమును గొనెను. దాని నొక ఋక్షరాజము పోలియించి యారత్నమును గొని తనగుహం జేరెను. పూర్వ మొకా నొకప్పుడు శ్రీకృష్ణుఁడమ్మహారత్నమును దన కొసంగుమని సత్రాజిత్తును గోరెనుగాని యర్థి లోభమున నాతఁ డద్దానిం గృష్ణునకు నొసంగలేదు. ఇక్కారణమున నాప్రసేనుఁడ ట్లరణ్యమున రత్నసహితముగ మాయముకాఁగా శ్రీకృష్ణుఁడే వాని జంపి యమ్మహామణిని బరిగ్రహించియుండు ననుమాటు నగరమునం దంతటను, సత్రాజిత్తుచే నిట్లు వ్యాపించి, కృష్ణునిచెవిం బడెను. అంతఁ దదపనోదార్థము కృష్ణుఁడు పయనమై యటవిం జేరి గుఱ్ఱపు టడుగులజాడంబట్టి పోయిపోయి క్రమముగ జాంబవంతునిగుహం జేరి పదునెనిమిది

వారములు జాంబవంతునితోఁ గయ్యమొనర్చెను. జాంబవంతుఁడు కడ కాతని భగవంతునిగా నెఱింగి నుతియొనర్చి రత్నమును, జాంబవతీ కన్యారత్నమును గృష్ణున కర్పించి, వేఁడుకొని వరములం బడసెను. శ్రీకృష్ణుఁ డంత మణి పురిం జేరి యాస్యమం తకమును బేరోలగమున సత్రాజిత్తున కొసంగి జనాపవాదమును బాపికొనెను. సత్రాజిత్తుం తనూరకే జను లట్లు దూఱుటకును, దా నట్టినింద నాతనిపై నారోపించుటకును మిగుల వగచి, యమ్మహారత్నముతోఁగూడ దనపుత్రికను సత్య నాత్రనికి ధర్మపత్నిగా నొసంగి, తాఁ గావించిన మహాపరాధమును క్షమింప వేఁడుకొనెను.

శ్రీకృష్ణుఁ డమ్మణిని దా గ్రహింపక మఱల దాని సత్రాజిత్తునకే యొసంగి సత్యను మాత్రమే పరిగ్రహించి పరిణయమయ్యెను.

మిత్రవింద.—అవంతిదేశాధీశులైన విందానువిందులచెలియలు. ఈమె రాజాధి దేవియఁను కృష్ణునిమేనత్తకూఁతురు. ఈమె కృష్ణుని వరింపఁగోర నీమెయన్న లీమెను వారించి స్వయంవరము చాటించి దుర్యోధనుని వరింప నుద్యోధించిరి. శ్రీకృష్ణుఁడు స్వయంవరమున రాజలోకమును సరకు సేయక యీమెను గొని రథముపై నిడికొని మఱి పురముఁ జేరి పరిణయమయ్యెను.

భద్ర.—శ్రుతకీర్తికూఁతురు. కృష్ణునకు మేనమామకూఁతురు.

సుదంత.—ఈమెకు నాగ్నజితి యని నామాంతరము. ఈమెతండ్రి నగ్నజిత్తు. నగ్నజిత్తు కోసలదేశాధీశుఁడు. ఈతఁడు తనయూరఁ బ్రజల కపాయము సేయుచు దుర్దాంతములై నేరికిని బట్టువడక చెలఁరేగువృషభములఁ బట్టినవారికిఁ దనకూఁతు నిత్తు నని ప్రతినచేసెను. శ్రీకృష్ణుఁ డవ్వానింబట్టి పోలియించి నాగ్నజితిని బరిణయ మయ్యెను. సత్య యనియు నీమెకు నామాంతరము కలదండ్రు.

కాళింది.—సూర్యునికొమరిత. ఈమె విష్ణుని వరునిగాఁ గోరి తపస్సు చేసెను. పిదప నొకప్పుడు సముద్రతీరమునఁ గృష్ణార్జునులు విహరించుచుండ మనోహరాకృతి నీమె వచ్చి తనకోర్కిని శ్రీకృష్ణునకు నివేదించుకొనియెను. శ్రీకృష్ణుఁ డీమెను బురికిఁ గొనిపోయి పరిణయంబయ్యెను.

లక్షణ.—ఈమె మద్రరాజుకూఁతురు. సర్వలక్షణసంపన్నయై యన్వర్థసంజ్ఞ మించు నీమెను స్వయంవరమున శ్రీకృష్ణుఁ డపహరించి వివాహమయ్యెను.

ఉ. ఆరమణీలలామముల నందఱిఁ గూడి యదూద్వహుండు త
ద్ద్వారవతీపురోపవనవాటికలం గృతకాద్రిసీమల

వారిధితీరకుంజసదనంబులఁ గేళితరంగిణీతటీ
కైరవిణీసహాయమణికల్పితసౌధముల వ్వసించుచున్. 39

టీ. యదూద్వహుండు = యదువంశోద్ధారకుఁ డగు శ్రీకృష్ణుఁడు, ఆరమణీలలామములన్ = ఆయుత్తమస్త్రీలను, తద్ద్వార...వాటికలన్-తత్ = ఆ, ద్వారవతీపుర= ద్వారకాపట్టణసంబంధమైన, ఉపవన=ఉద్యానవనములయొక్క, వాటికలన్ = ప్రదేశములందు, కృత...సీమలన్ - కృతక=కల్పితములైన, అద్రి=కొండలయొక్క, సీమలన్ = ప్రదేశములందు, వారిధి...సదనంబులన్ - వారిధి = సముద్రముయొక్క, తీర=ఒడ్డునందైన, కుంజసదనంబులన్ =పొదరిండ్లయందును, కేళి...సౌధములన్ -కేళి=విలాసార్థమైన, తరంగిణీ=నదులయొక్క, తటీ=ఒడ్డయందైన, కైరవిణీసహాయమణి=చంద్రకాంతసూణిక్యములచే (కలువలకు సహాయమైనవాఁడు చంద్రుఁడు) కల్పిత=నిర్మింపఁబడిన, సౌధములన్ = మేడలందును, వసించుచున్ = నివసించుచు.

భా. శ్రీకృష్ణుఁడు పదియాఱువేలస్త్రీరత్నములను, సేనమంద్రుమహిషులను, గూడి ద్వారకాపట్టణోద్యానవనములందును, కేళీశైలములందును, సముద్రతీరమందలి పొదరిండ్లయందును, గేళితరంగిణులతీరములందైన చంద్రకాంతమణి నిర్మితసౌధములందును వసించు నని భావము.

విశే. ఉద్యానములు, కేళిశైలములు, సముద్రతీర కుంజసదనములు, విహారనదీతీరస్థ చంద్రకాంతసౌధములును జలువ కాకరములై మనోహరములై శృంగారోద్దీపకములై కాముకునకుఁ గడుంగడు కామాసక్తిని గల్గించును. కానఁ గవి పదియాఱువేల యెనమంద్రను గూడిన శ్రీకృష్ణునకు వీనిని విహారప్రదేశములుగ వక్కాణించుట యెంతయుఁ దగియున్నది.

శా. ఏయేవేళల నేసరోజముఖి 'యేయేలీలలం గోరుఁ దా
నాయావేళల నాసరోజముఖి నాయాలీలలం దేల్చి యే
చాయం జూచినఁ దానయైమెలఁగుచున్సౌఖ్యాబ్ధినోఁగాడుభో
గాయత్తుం డయి పెక్కురూపముల మాయాకల్పనాచాతురిన్. 40

టీ. ఏయేవేళలన్ =ఏయేసమయముల, ఏసరోజముఖి = ఏవనిత, ఏయేలీలలన్ = ఏయేవిలాసములను, తాను=శ్రీకృష్ణుఁడు, ఆయాలీలలన్ =ఆయా విలాసములచే, తేల్చి= సంతోషపెట్టి, ఏచాయన్ =ఏవైపును, తాన ఐ=తానే యగపడువాఁడై (తాను+అ), మెలఁగుచున్ =సంచరించుచు, సౌఖ్యాబ్ధి = సుఖమనుసముద్రమున, భోగాయత్తుండు= భోగముల కధీనుఁడు, పెక్కురూపములన్ =పలువిధములగు నాకృతులతో, మాయా...

చాతుర్యక్ =మాయాకల్పనమునందైన నైపుణ్యముచే, ఓలలాడుక్ = తేలియాడును. 'ఓల' ఇది నీట నీదులాడునపు డగుధ్వన్యనుకరణము.

భా. శ్రీకృష్ణుడు పదియాఱువేల యెనమండ్రను వారువారు కోరినరీతిని దన్పుచు, మాయాకల్పనాచాతుర్యమున బహురూపములం దాల్చి యందఱిని నన్ని రూపముల మెలంగుచు భోగాసక్తుండై వారిం గూడి మెలంగు నని భావము. ఇందు నెల్లర కనుకూలుండై చాతుర్యము మీఱి మెలంగు నటచే శ్రీకృష్ణునకు దక్షిణనాయకత సూచితమైనది.

క. హరి యిట్లు సతుల నంచఱి
సరిగాఁ జూచియును భోజజనపాలసుతం
దరుణీమణి సాత్రాజితి
నిరువుర మన్నించి మిగుల నిచ్చుం జనవుల్. 41

టీ. సతులక్ =భార్యలను, సరిగాక్ =సమానముగా, భోజజనపాలసుతక్ =రుక్మిణిని, తరుణీమణిక్ =స్త్రీరత్నమగు, సాత్రాజితిక్ =సత్రాజిత్పుత్రికయగు సత్యభామను, మన్నించి = గౌరవించి, మిగులక్ = మిక్కిలియును, చనవుల్ = ప్రేమయుక్తమగు స్వాతంత్ర్యములను.

భా. శ్రీకృష్ణుడు భార్యలెల్లరియెడలను సముడెకాని యందు రుక్మిణీ సత్యభామల నందఱిలోఁ బెద్దదగుప్రేమమీఱఁ జనవిచ్చి మన్నించు నని భావము.

విశే. రుక్మిణి లక్ష్మ్యంశసంభూతురాలు గాన వాసనావశమున నామెను బెద్దగ సమ్మానించును. తరుణు లెల్లవారిలో నీమె యన్నిటను మణివంటి దగుట నీమెనుగూడ రుక్మిణితో సరిగ సమ్మానించు నని సారస్యము తేబచున్నది. సాత్రాజితి: సత్రాజిత్తు యొక్క సంతానమైనస్త్రీ. తద్ధిత. అణ్.

చ. కులమును రూపము న్మగనికూరిమియుం గలదాన నంచు నీ
వల నలరుక్మిణీకమణి వాసిఁ జెలంగఁగ సత్యభామయుం
గులమును రూపమున గనికూరిమియుం గలదాన నంచు నా
వలఁ బచరింపఁగా రవరవ లొ్వడమె న్మది వారి కెంతయున్. 42

టీ. కులమును = అభిజాత్యమును, రూపమును = చక్కందనమును, మగనికూరిమియుక్ = పతియొక్కచెలిమియును, ఈవలక్ =ఈవైపు, వాసిక్ = ఆధిక్యముతో, చెలంగఁగక్ = ఒప్పుచుండ, ఆవలక్ = ఆవైపు, పచరింపఁగాక్ = ప్రవర్తింపఁగా, రవరవలు=స్పర్ధలు, మదిక్ =చిత్తమున, ఎంతయుక్ = మిక్కిలి, పొడమెక్ =పుట్టెను.

భా. 'నేనె సద్వంశజాతను, నేనె చక్కనిదానను, నేనె మగనిచెలిమి గల దానను' అని రుక్మిణి యొకప్రక్కను సత్యభామ యొకప్రక్కను ప్రవర్తించుటంజేసి, యయ్యిరువురకును మనస్సులో స్పర్ధలు పుట్టె నని భావము. శ్రీకృష్ణుఁ డీయిరువురనే కడుఁ గడు సమ్మానించుటంజేసి వీరికే రవరవలు కల్గె ననియు, దక్కుఁగలవారలకుఁ గలుగఁ బ్రసక్తి లేకపోయె ననియు గ్రహింపవలయు.

వ్యా. విశే. ఈవలన్, ఆవలన్.—వృత్తియందు వలనుశబ్దము తుదినుండు 'ను' అనునది లోపించె. మంచికులమునఁ బుట్టుట, మంచిరూపమును గల్గియుండుట, నాపై మగనికూరిమి గనుట యనునివి యొకటొకటే స్త్రీకి గర్వజనకముకాఁగా, నన్నియు నొక్కట నమరియున్న చెప్పెడిదేమి! మగువలకు ముఖ్యముగ మగనికూరిమియ వాంఛనీయము. సౌందర్యముతోఁబాటుగ మగనికూరిమి యొప్పినమగువ గర్వింపకుండునా? అదియుంగాక వనితలు సామాన్యముగఁ బతి మఱియొకతెను సమ్మానింపఁ జూడఁజాలరు. కాన, స్త్రీజనసహజ మగు నట్టియీర్ష్యనే పూని లోకము పాడి రుక్మిణీసత్యభామలు పరస్పరము స్పర్ధ నూని రని గ్రహింపవలయును.

ఉ. అంతట నొక్కనాఁడు ధవళాంబుజనేత్రుఁడు వచ్చి రుక్మిణీ
కాంతగృహంబులోన శశికాంతశిలామయవేదిమీఁద నే
కాంతమునందుఁ గొందఱు మృగాయతనేత్రలు గొల్వ జూద మ
త్యంతవినోదకేలిమెయి నాచుచు నుండఁగ నద్భుతంబు గన్. 43

టీ. అంతట్, = (ఇట్లు రవరవలు పొడముసమయమున) ధవళాంబుజనేత్రుఁడు- ధవళ= తెల్లనైన, అంబుజ=పద్మములవంటి, నేత్రుఁడు=కన్నులుగలవాఁడు శశికాంత... వేదిమీఁదన్ - శశికాంతశిలామయ = చంద్రకాంతశిలాప్రచురమైన, వేదిమీఁదన్ = తిన్నెపై, ఏకాంతమునందున్ =రహస్యమున, మృగాయతనేత్రలు-మృగ=లేడియొక్క, ఆయత=దీర్ఘములైన, నేత్రలు=కన్నులవంటి కన్నులుగలవారు, జూదము = ద్యూతము, అత్యంతవినోదకేలిమెయిన్ = మిక్కిలి ప్రాస్తుపుచ్చుటకొఱకైన యాటయొక్కవిధము తో, అద్భుతంబు గన్ = ఆశ్చర్యముగా.

భా. రుక్మిణీసత్యలకు రవరవలు పొడముకాలమున నొక్కనాఁడు శ్రీకృష్ణుఁడు రుక్మిణీగృహమున కేతెంచి చంద్రకాంతరత్ననిర్మిత మగుతిన్నెపై నొకరహస్యప్రదేశమునఁ దన్నుఁ గొందఱు వనితలు గొల్చుచుండ నబుసుపోకకై జూదమాడుచుండె నని భావము.

వ్యా-విశే. ధవళాంబుజనేత్రుఁడు.—తెల్లందన మంబుజములకు వికసించినంగాని కలుగఁబోదు. కావున నీవిశేషణమహిమవలన శ్రీకృష్ణుఁడు వికసితనేత్రుఁ డనియు, నెలమి మీఱి నియ్యదనున రుక్మిణీగృహమున కేతెంచినవాఁ డనియుఁ దెలియవచ్చును. ఇట్లే 'మృగాయతనేత్రలు' అనుపదముగూడ స్త్రీలసంతోషాతిశయమును సూచించును. మఱియు శ్రీకృష్ణుఁ డేకాంతమునసే జూదమును సాగించుచుండె ననుటచే, ముందు సంభవించు నారదాగమనాదుల గుర్తెఱిఁగియే రహస్యప్రదేశమున శ్రీకృష్ణుఁ డుండెనని తేలుచున్నది. దీన శ్రీకృష్ణునిత్రికాలవేదిత్వము పరిస్ఫుట మగుచున్నది. నారదాగమనాది వృత్తాంతము సత్యకుఁ దెలియు నవకాశము సంఘటించుటకును, శ్రీకృష్ణుని భోగాతిశయము సూచించుటకును, రహస్యరక్షణమున నసమర్థలగు మృగాయతనేత్రల నట్టి రహస్యప్రదేశమున శ్రీకృష్ణునకు సేవఁజేయువారినిగాఁ గూర్చినాఁ డని యెన్న వలయును. జూద. వి. ద్యూతము. ప్ర.

### శ్రీకృష్ణునియొద్దకు నారదుఁడు వచ్చుట.

సీ. సరిగమపధనిస సంజ్ఞస్వరంబుల
మహతి నభోవాయునిహతి మెరయ
భాగీరథీపయఃపరిపూర్ణమణికమం
డలువు హస్తంబునఁ జెలువు మిగులఁ
బ్రణవమంత్రావృత్తిపావనస్ఫటికాక్ష
వలయంబు కర్ణశష్కులిక వ్రేల
సమరన్నతోన్నతచమరవాలంబును
గక్షపాలయు భుజాగ్రమున మెఱయ

తే. దేహకాంతులకాలచంద్రికల నీన
జడలు మోక్షద్రుపల్లవశంక సేయ
గగనమునసుండి వచ్చె నాకస్మికముగ
నారివేరంపుఁదపసి వైశ్యారికడకు. 44

టీ. సరి...స్వరంబులన్ = 'స, రి, గ, మ, ప, ధ, ని, స' అను సంజ్ఞలుగల స్వరములచేత, మహతి=మహతి యను నారదునివీణె, నభోవాయునిహతిన్ -నభః=ఆకాశమందైన, వాయు=గాలియొక్క, నిహతిన్ =అత్యంతమగు దెబ్బ చే, మెరయన్ =శబ్దింపఁగా, భాగీరథీ...కమండలువు-భాగీరథీ = మిన్నేటిసంబంధమైన, పయః=నీటిచే, పరిపూర్ణ = నిండిన, మణికమండలువు=మణినిర్మిత మగు గిండివంటిపాత్రము, హస్తంబునన్ =చేతి

యందు, చెలువు=అందము, మిగులన్=అతిశయింపఁగను, ప్రణవ...వలయంబు-ప్రణవ మంత్ర=ఓంకారరూపమంత్రముయొక్క, ఆవృత్తి = వల్లెవేయుటచే, పావన=పవిత్రమైన, స్ఫటికాక్షవలయంబు=స్ఫటికమణులచే నిర్మితమైనజపమాల, కర్ణశష్కులికన్ = చక్కిలమువంటిచెవిని, ప్రేలన్ = ప్రేలాడుచుండఁగా, సమర...వాలంబును-సమర = యుద్ధమునందలి, నృత్య=నాట్యమునకు, ఉచిత=తగిన, చమరవాలంబును = చామరమును, కక్షపాలయన్=బుజమున బద్ధమై ప్రేలాడుసంచియు, భుజాగ్రమునన్=మూఁపునందు, మెఱియన్ = ప్రకాశింపఁగా, దేహకాంతులు = శరీరసంబంధమైనతేజస్సులు, అకాల చంద్రికలన్ = వేళకానివేళయందైన వెన్నెలలను, ఈనన్=కనుచుండఁగా, జడలు = జటలు, మోక్షద్రుపల్లవశంకన్-మోక్షద్రు = అపవర్గమనువృక్షముయొక్క, పల్లవ= చిగురులయొక్క, శంకన్=సందేహమును, చేయన్=ఒనర్పఁగా, గగనమునకుండి = ఆకాశమునుండి, ఆకస్మికమునన్ = తటాలున, ఆరివేరంపుఁదపసి - ఆరివేరము + తపసి= కలహప్రియుండగుమని-నారదుఁడు, వైత్యారికడకున్=రాక్షసశత్రువగు శ్రీకృష్ణుని కడకు.

భా. మింటిగాలిచాఁకున మహతి యను తనవీణె సప్తస్వరముల శబ్దించుచుండ, మిన్నేటిసీట నాపూర్ణమైన మణికమండలువు తనహస్తమున చెలువుమీఱి నుండ, నోంకారవృత్తిచే నత్యంతపూతమైన స్ఫటికజపమాల దక్షిణకర్ణము నంటి ప్రేలాడుచుండ, యుద్ధసమయనృత్యమున కర్హమగుచామరమును సంచియు భుజమునగ్రమునంటి ప్రేలుచుండ, శరీరధవళకాంతులు కాలముకానికాలమునందైన చంద్రికలంబోలి వర్తిలుచుండ, నెఱినిజడలు మోక్షవృక్షసంబంధమగు చిగురులసందియము నొందించుచుండఁ, గలహప్రియుండగు నారదుండు మింటినుండి శ్రీకృష్ణునికడ కాకస్మికముగ నేతెంచె నని భావము.

వ్యా-విశే. స్వరములు—షడ్జము, ఋషభము, గాంధారము, మధ్యమము. పంచమము, ధైవతము, నిషాదము, మహతి నారదునివీణెకుఁ బేరు. శష్కులిక. వి. చక్కిలము. ఆకృతివిషయమునఁ జెవులను జక్కిలములతోడను, శ్రీకారములతోడను, గవులుపోల్తురు. విప్రునిదక్షిణకర్ణము మిగులఁ బూతమైనదిగా స్మృతులు పలుకును గాన, నందే జపమాల యమర్పఁబడిన దని గ్రహింపవలయును. స్ఫటికము మోక్షోద్యుక్తకృష్ణ ఫలముల నొసంగ సమర్థము గాన, మోక్షార్థి యగుమూని తన్నిర్మితాక్షవలయమును ధరించె నని యూహించునది. నారదుఁడు కలహప్రియుఁడుగాన, యుద్ధము జరుగు సమయముల సంతోషముమీఱి నాట్యముసల్పు నసియు, నపుడు కల్గుశ్రమము నపనయింపఁ జామరము సమర్థ మగు ననియు గ్రహింపవలసియుండును. నారదుఁడు తెల్లనివాఁ డౌటంజేసి యాతని శరీరసంబంధ మగు ధవళకాంతులు వెన్నెలలం బోలి

యొప్పె ననియు, నుత్కృష్టవస్తువులఁ గవులు తెల్లనివానిఁగా నిరూపించుట యాచారము గానఁ దెల్లనివాఁడని మోహవృష్టిముగను, నాతనియెఱ్ఱనిజడలను బల్లవములుగను గవి నిరూపించె ననియుఁ గ్రహింపవలయును. ఆరివేరము + తపసి.—కర్మధారయమున మువర్ణకమునకుఁ బుంపులును, నుగాగమమును ద్రుతకార్యములును గల్గి 'ఆరివేరంపుఁ దపసి' అయ్యెను. నారదుఁడు కలహప్రియుఁ డను నన్వర్థనాముఁడు. నిక్కముగ మానవుల ప్రాకృతమునుబట్టియే యాతనికి వారిపక్షమునఁ గలహాముం గూర్ప బుద్ధిపోడమును. కాని, యిందు మున్ముందుఁ బారిజాతకుసుమదానమునఁ గూర్పఁబోవు కలహాపు విషయమును సూచించుటకై, యాతనియన్వర్థనామమునే కవి యిందుఁ బేర్కొనెనని గ్రహింపవలయును, 'గగనముననుండి.' గగనమువలన:—ఉండిపదంబు వలనవర్ణకమున కనుప్రయుక్త మగు. అయ్యది పరముకాఁగా వలనవర్ణకమునకు ద్వితీయాసప్తములు ప్రాయికముగాఁ గల్గు నను పద్ధతుల ననుసరించి యీరూపము కల్గెను. 'ఆకస్మికము = అకస్మాద్భవము' అని శబ్దరత్నాకరము. ఆకస్మికము కఁ = అకస్మాద్భవ మగునట్లుగా, ఇచ్చోఁ 'అకస్మాత్తుగా' అనునర్థమున నిది ప్రయుక్తమయ్యెను. ఇందు జడదారివేసము మనోహరముగ సహజమగుపద్ధతిని వర్ణించెను. అందును నారదునియాకృతిని బురాణప్రసిద్ధ మగునాతనియాకృతిని మది భావించి హృద్యముగఁ జిత్రించెను. మఱియు నీవర్ణనము మాఘకావ్యప్రథమసర్గనుండి నారదవర్ణనమును జ్ఞప్తికిం దెచ్చుచున్నయది. అలం. అతిశయోక్తి. విభావన. రూపకము. ఉత్ప్రేక్ష.

క. వచ్చినమునిపతి కెదురుగ
వచ్చి నమస్కృతు లొనర్చి వనితయుఁ దానుం
బొచ్చెంబు లేనిభక్తి వి
యచ్చరరిపుభేది సలిపె నాతిథ్యంబున్. 44

టీ. మునిపతికిఁ=మునీశ్వరునకు, నమస్కృతులు = నమస్కారములు, ఒనర్చి=చేసి, వనితయుఁ (రుక్మిణియు) బొచ్చెంబు=తక్కువ, వియచ్చరరిపుభేది-వియచ్చర = గగనమునఁ దిరుగుదేవతలకు, రిపు=శత్రువైనరాక్షసులకు, భేది=సంహర్త (శ్రీకృష్ణుఁడు), ఆతిథ్యంబుఁ = అతిథిసత్కారమును, చలిపెఁ=చేసెను.

భా. శ్రీకృష్ణుఁడమ్మహాముని రాఁగ నమస్కారము లాచరించి, రుక్మిణియుం దాను నతిథిసత్కారము నతిభక్తి నొనర్చె నని భావము.

వ్యా-విశే. 'ఆత్మార్థ మభిహిత మగునపుడు తన్లింగసంఖ్యాభిధాయివచనంబు తద్విశేషణక్రియల కగు' అనుపద్ధతిని క్రియ తానుపదమునకు సంబంధించి యేకత్వమును

బోండినవి. వృద్ధు గృహమునుగూర్చి వచ్చిన, యువకుని ప్రాణము లూర్ధ్వముగఁ బాఱు ననియు, నావృద్ధు నుచితముగఁ బ్రత్యుత్థానాభివాదనముల గారవించి యనంతర మా యువకునిప్రాణములు మఱల స్వస్థానముం జెందు ననియు నార్యవచనము. కావునఁ నే యతి భక్తిని సజానియై యాతనిం బ్రత్యుత్థానాభివాదనముల నాతిథేయమున సంతుష్టుని శ్రీకృష్ణుఁ డతిభక్తిని గావించె నని తేలుచున్నది. మఱియు శ్రీకృష్ణుఁడు పరమాత్ముఁడును సకలవంద్యుఁడును సైనను, ప్రకృతము మాయామానుషరూపధారి యై యువకుఁ డై యున్న వాఁడు గాన, లోకంబునపాడి నాతని ప్రత్యుత్థానాదుల గారవించె నని గ్రహింపవలయును.

తే. అపుడు రుక్మిణికనుసన్న నబ్జముఖులు
రత్నసింహాసనంబు నారదున కిడిరి
హరియు నమ్మానియనుమతి నర్ఘ్యపీఠ
మున సుఖాసీనుఁ డయి కరంబులు మొగిడ్చి. 46

టీ. అబ్జముఖులు = పద్మములవంటి మోములు గలవారు. కనుసన్న = నేత్ర సంజ్ఞ చే, అమ్మానియనుమతిఁ = ఆముసీశ్వరునియొక్క యంగీకారముచే, సుఖా సీనుఁడు = సుఖముగఁ గూర్చున్నవాఁడు, మొగిడ్చి = ముడిచి.

భా. రుక్మిణి కనుసన్న చే వనితల నాసనము వేయఁ డని యానతీయ, వారు మణిమయ సింహాసనము నిడి రనియు, నందు నారదుఁడు గూర్చుండ నాతనిసెలవంది శ్రీకృష్ణుఁడును నుచితాసనమున సుఖముగఁ గూర్చుండె ననియు భావము.

వ్యా-విశే. సన్న. వి. సంజ్ఞ. ప్ర. రుక్మిణి రాజ్ఞి యొక్కతీవి యిందుఁ జూపినది. తాను స్వయముగ సింహాసన మిడక యితరవనితల కానయిడుటయే యిందులకు నిదర్శనము.

క. సురసంయమివర! మీ రిట
కరుదేరఁగ నిప్పు డేఁ గృతార్థుఁడ నయితిఁ
నిరతంబు మీరు నాపయిఁ
గరుణ గలిగి యునికి యిది యకారణము *సుమీ. 47

టీ. సురసంయమివర=దేవర్షిశ్రేష్ఠుఁడా! ఇటకుఁ =ఇచ్చటికి, అరుదేరఁగఁ =రాఁగ, ఏను= నేను, కృతార్థుఁడను= చేయఁబడినకార్యములుగలవాఁడను (ధన్యుఁడను), నిరతంబు= మిగుల నాసక్తికొన్నటులుగా, ఈపదము సాధారణముగ సంతతమనునర్థమునఁ బ్రయు క్తమైన ట్లూహింపనగు. కరుణ = దయ, అకారణముసుమీ = హేతుశూన్యముసుమా!

*సుఁడీ. పాఠాంతరము.

ఇందు 'మీరు' అని బహువచన మగపడుటంజేసి 'చుఁడీ' అని యుండిన లెస్స యని తోఁచెడిని.

భా. మీరాకచే ధన్యుఁడ నైతిని. సంతతము మీరు నాపై దయకలిగియుండుటకుఁ గారణ మెద్దియు లేదు. (నిర్హేతుకజాయమానకరుణ కలవాఁడవు.)

వ్యా-విశే. అరుగుదెంచు.—అభ్యాగతి సరుగ్వాదులకుఁ దెంచుధాతు వనుప్రయుక్తమగు. అగుచో గువర్ణంబు విభాషను లోపించు. అరుదెంచు+నుజీ అర్ద్ధానికి ముజ్జీత్తులు పరమగునపుడు తేతేరు లగును. జీత్తు పరమగునపు డుక్వంబున కక్వంబగు. అరుదేరన్.

క. నావుడు శౌరికి నిట్లను, నావేలుఁపుఁదపసి మర్త్యఁ డాడెడిరీతిన్
నీ విట్లు పలుక నుచితమె?, యే విశ్వజనీనచరిత!యెఱుఁగనె నిర్మున్ ?

టీ. నావుడున్ = అనినపిదప, ఆవేలుపుఁదపసి = ఆదేవర్షి, మర్త్యుఁడు = మనుష్యుఁడు, ఆడెడురీతిన్ =మాటలాడుపద్ధతితో, ఇట్లు= ఈరీతిని, ఉచిత మె=తగునె? వీను= నేను, విశ్వజనీనచరిత=సర్వజనులకు హితమైనచరిత్రముగలవాఁడా !

వ్యా-విశే. నావుడున్ =అనుథాత్వానంతర్యార్థకరూపము. 'అనవుడు, అనుడు' అనునవి దీనిరూపాంతరములు. లాతిచో సహితము కాదేశాదులు గానంబడియెడి. విశ్వజనీనము. విశ్వజనహిత మనునర్థమున తద్ధితరూపము.

నారదుఁడు శ్రీకృష్ణుని నుతించుట

సీ. ప్రేమిసుకులదొంగఁ బాతాళకుహరంబుఁ
జొరఁబాతి చీఁకినచోఁ వీవ
తరిగొండ వెన్నపైఁ దాల్చి వేల్పులఁ గూటి
చవిఁ దేర్చినట్టి కచ్ఛపమ వీవ
నీటిలో మునిఁగిన నేలచేడియఁ గొమ్ము
కొన నుబ్బ నెత్తిన ఘోణి వీవ
మునిమాపు బలుగంబమునఁ బుట్టి బంటు న
క్కఱఁ గాచినట్టి సింగంబ వీవ

తే. దితిజు మెట్టిన యాపొట్టిదిట్ట వీవ
పుడమి తోఁడుల నడఁచిన ప్రోడ వీవ
కడలిఁ గోలకుఁ దెచ్చిన గబ్బి వీవ
యిపుడు ద్వారక వసియించునీపు నీవ.

టీ. ప్రామినుకులవొంగన్ - ప్రామినుకుల = వేదములయొక్క, (ప్రాత మాటలు) దొంగన్ = చోరుని, పాతాళకుహరంబున్ = పాతాళబిలమును, చొరఁ బాఱి=ప్రవేశించి, చీఱిన=బ్రద్దలు చేసిన, చోఱివు = మత్స్యమవు, తరిగొండన్ = కవ్వపుఁగొండను (మంథరమును), వెన్నుపైన్ =వీఁపుపై, తాల్చి=ధరించి, వేల్పులన్ = దేవతలను, కూటిచవిన్ = అన్నపురుచిచే, తేల్చినట్టి=సంతోషపెట్టినట్టి, కచ్ఛపమవు = కూర్మమవు, నేలచేడియన్ = భూదేవిని, కొమ్ముకొనన్ =దంష్ట్రాగ్రమున, ఊబ్బన్ =పైకి లేచునట్లుగా, ఘోణివి=వరాహమవు, మునిమాపు=సాయంసంధ్యాకాలమున, బలుగంబమునన్ =పెద్దస్తంభమున, అక్కఱన్ = కోర్కితో, బంటున్ =భృత్యుఁడైన ప్రహ్లాదుని, కాచినట్టి=రక్షించినట్టి, సింగంబవు=సింహమవు. దితిజున్ = దితికొడుకైన బలిచక్ర వర్తిని, పెట్టిన=అడఁచిన, పొట్టిదిట్టవు=వామనధీరుఁడవు, పుడమిఱేడులన్ =రాజులను, ప్రోడవు=ప్రౌఢుఁడవు, కడలిన్ = సముద్రమును, కోలకున్ =బాణమునకు, తెచ్చిన=వచ్చునట్లుచేసిన, గబ్బివి=గర్వివి (శూరుఁడవు), ద్వారకన్ = ద్వారకాపట్టణమున, వసించు=ఉండు, నీవు, నీవ=నీవే. అనఁగాఁ బూర్వోక్తకార్యముల నాచరించిన మాపర మాత్మవే యనుట.

విశే. 1. సోమకుఁడను నసురుఁడు వేదముల దొంగలించి సముద్రముం బొరఁ బాఱి, నాతని మత్స్యరూపముం దాల్చి మహావిష్ణు వాతని సంహరించె ననుపురాణ గాథను బ్రథమపాదమున ననుసంధింపవలయును. 2. మహావిష్ణువు మంథరమును గవ్వ ముగాఁజేసి, వాసుకిని త్రాడుగాఁజేసి, సముద్రమును సురలంగూడి మథించి, యపు డందు మునింగినమంథరమును గూర్మరూపమునఁ దెచ్చె ననియు, నందుఁ బుట్టినయమృతమును దేవతలకుఁ బంచి కొన్నియుత్కృష్టవస్తువులఁ దాను గ్రహించి, కొన్నిటిని దేవేంద్రు నకు నొసఁగె ననుపురాణకథను ద్వితీయపాదమున ననుసంధింపవలెను. దూర్వాసుని శాపవశమునఁ గల్గిన తాపము నాపికొనం జాలక భువి జలధిం బడ నద్దాని మహావిష్ణువు కూర్మరూపముం దాల్చి తేల్చె నని కొన్నిగాథలు నుడువును. 3. హిరణ్యాక్షుఁడు భువిని జాఁపచుట్టఁగ జుట్టునపుడు విష్ణువు వరాహరూపముం దాల్చి ఆతని సంహరించి భూదేవిని సంరక్షించె ననుపౌరాణికకథను తృతీయపాదమున గమనింపవలెను. 4. భక్తుఁడగుప్రహ్లాదుని రక్షించి యాతనిపలుకును సత్యముఁగాఁ జేయఁ, గంబమున నుద్భవించి మహావిష్ణువు హిరణ్యకశిపుని సింహరూపమున సాయంసంధ్యాసమయమున సంహరించె ననుకథను జతుర్థపాదమున ననుసంధింపవలయును. దేవతలచేతఁగాని మనుష్యులచేతఁ గాని మృగాదులచేతఁగాని యవధ్యత్వమును, బవలుగాని రేయిగాని చావకుండుటను వర ములుగా హిరణ్యకశిపుఁడు బ్రహ్మను గోరి పడసియుండుటచే, శ్రీమహావిష్ణు వాతని నర మృగరూప మిళితమగు నాకృతిం దాల్చియు, రేయింబవలు గానిసంజను సంహరించె నని

తెలియునది. వ్. బలి మల్లోకముల నాక్రమించి తాన యేలుచుండెను. దాన నింద్రుఁడు పదభ్రష్టుఁ డయ్యెను, పిదప దేవతలు బ్రహ్మనుగూడి విష్ణువుకడ కేగి జరిగిన దానిం దెల్పికొని రక్షింపు మని వేఁడికొనిరి అంత విష్ణువు వామనావతారముం దాల్చి వదాన్యచక్రవర్తి యగుబలికడ కేతెంచి మూఁడడుగులభువిని యాచించెను. ఆడి తప్పని యాబలి తనగురువు శుక్రాచార్యుఁ డెన్ని భంగుల బోధించినను వినక మూఁడడుగుల యిల నొసంగ, నావామనుండు పెచ్చుపెరిగి భువినిండి భువి నొకపాదమున దివినొక పాదమున నాక్రమించి, వేఱొకపాదమునకుఁ దావులేమి నాతనిశిరసుపై నిడి పాతాళ మున కడుఁగఁద్రొక్కె- ననుగాథను గీతప్రథమపాదమున ననుసంధింపవలయును. 6. కార్తవీర్యునిసుతుఁడు తనతండ్రిం జంపె ననుకోపము మీఱఁ బరశురాముఁడు ముయ్యేడు మాఱులు రాజుల వధించి, తద్రక్తమునఁ బితృతర్పణము గావించె ననుపౌరాణిక గాథను గీతద్వితీయపాదార్థమును గమనించునప్పుడు జ్ఞప్తికిఁ దెచ్చుకొనవలయును. 7. శ్రీరాముఁడు లంకం జేరుటకు సముద్రుఁడు దారి నీయకుంట నాతనిపై బాణ మేసి లోఁగఁ జేసె ననుగాథను గీతతృతీయపాదమున ననుసంధింపవలెను. 8 ఈచతుర్థ పాదమునఁ గృష్ణావతారము కీర్తింపఁబడినది. అవతారక్రమమున బలరామావతారమే యవతారములలోఁ గీర్తితమైనది. కాని బలరామకృష్ణుల నొక్కయవతారముగనే పురా ణాదులు నుడువుచుంట నిట్లుండుట యవిరుద్ధము. ఇందుఁ గృష్ణస్తుతి ప్రసక్తము గానఁ గృష్ణావతారమే పేరొక్కనఁబడియె. కంబము. వి. స్తంభము. ప్ర. సిఁగము. వి. సింహము. ప్ర. ప్రౌఢ. వి. ప్రౌఢ. ప్ర. గర్వి. ప్ర. గబ్బి. వి.

క. రక్కసిమగువలయాలువు
మొక్కపఱిచె దీన పాపములగమిఁ గాలం
ద్రొక్కెదవు నీవ యింకిట
నిక్కముగా నిన్నుఁ బొగడ నేర్తునె కృష్ణా! 50

టీ. రక్కసిమగువలయాలుఁవుర్ = రాక్షసస్త్రీల పాతివ్రత్యమును, మొక్కపఱి చెదు=నశింపఁ జేయుదువు, పాపములగమిర్ = పాపసమూహమును, నిక్కముగార్ = నిజముగా, నేర్తునె=ఓపుదునే?

విశే. రక్కసి వి. రాక్షసి. ప్ర. ఇందు మొదటివిషయము బుద్ధావతారసూచక మందురు గాని యది విచారణీయము. రెండవవిషయము కల్క్యవతారసూచక మనుట యెట్లో సరిపెట్టుకొనవలసియుండును.

క. ద్వారక వైకుంఠపురం
బీరుక్మిణి లక్ష్మి మీర లిచ్చట నునికిర్

సారెకుఁ గొల్వఁగ వత్తును
గోరికతోఁ గంసహార! ముకుంద! మురారీ! 51

టీ. సారెకుక్ =మాటిమాటికి, కొల్వఁగక్ =సేవించుటకు, కంసహ =కంసుసిసంహరించినవాఁడా! మురారీ = మురద్వేషీ!

భా. ఈద్వారక వైకుంఠమును, ఈరుక్మిణి లక్ష్మియు, నీవు సాక్షాద్విష్ణువును పగుట, మాటిమాటికి మమ్ము సేవింప వచ్చుచుందు నని భావము. అనఁగా భగవంతుఁడవను జ్ఞానముతో నిను సేవింప నేతెంతు నంట.

వ. అని యిట్లు బహుప్రకారంబులం బ్రశంసించి యవ్వారించినందనుండమందానందంబు డెందంబునం గ్రందుకొన నిజవాసనాబిరుదగాథా కథనవందిబృందాయమానేందిందిరంబును, సుచితోపయోగజనితానందబాష్పసందోహశంకావహమకరందబిందుతుందిలంబును, నిఖిలమనోరథప్రదానకీర్తిశంకాకరవిశదప్రభానిచుళితంబును నగుపారిజాతంపుఁగొన్నన మిన్నేటిపాసిండినెత్తమ్మిచిగురుటాకునం బొదివియిచ్చిన. 52

టీ. బహుప్రకారంబులక్ =అనేకవిధముల, ప్రశంసించి=కొనియాడి, అవ్వారించినందనుండు=ఆబ్రహ్మపుత్రుండగునారదుండు,ఆమందానందంబు=అధికమైన సంతోషము, డెందంబునక్ =మనస్సునందు, క్రందుకొనక్ = వ్యాపింపఁగా, నిజ... నేందిందిరంబును-నిజ=తనదైన, వాసనా = పరిమళమునకు సంబంధించిన, బిరుద=ప్రసిద్ధియొక్క, గాథా=కథలను, కథన=చెప్పుటయందు, వందిబృందాయమాన=స్తుతిపాఠకసమూహమువలె నాచరించుచున్న, ఇందిందిరంబును=తుమ్మెదలు కలదియు, ఉచితోప తుందిలంబును-ఉచిత=అర్హమైన, ఉపయోగ=ఒదవుబడిచే, జనిత=పుట్టిన, ఆనందబాష్ప = సంతోషమువలని కన్నీళులయొక్క, సందోహ=సమితియొక్క, శంకా=సందేహమును, వహ=తాల్చునట్టి, మకరందబిందు=పూవుండేనెబొట్టులచే, తుందిలంబును=బలిసినదియు, నిఖల...నిచుళితంబును-నిఖల=సమస్తమైన, మనోరథ=కోరుకలను, ప్రదాన = ఇచ్చుటచేనైన, కీర్తి=యశస్సుయొక్క, శంకా=సందియమును, కర=చేయునట్టి, విశదప్రభా=తెల్లనికాంతిచే, నిచుళితంబును=పట్టుబడినదియు, అగు=ఐనట్టి, పారిజాతంపుఁగొన్నన్ =పారిజాతవృక్షసంబంధమైన క్రొత్తపువ్వును,(క్రొత్త యనుటచే నపుడపుడే వికసించినదనియు, నపుడే కోయంబడినదనియుఁ దెలియవచ్చెడిని.) మిన్నేటి...టాకునక్ -మిన్నేటి=ఆకాశగంగ

యందలి, పసిండినెత్తమ్మి=సొగసైన బంగారు తామరసంబంధమైన, చిగురుటాకునన్ = పల్లవమునందు, పొదివి = చుట్టి.

భా. అవ్విరించిసుతుఁ డింతింతనరాసిసంతసము స్వాంతమునఁ జెలంగఁ దనపరిమళంపుఁబ్రసిద్ధిసఁ బొగడ బట్టులగుతుమ్మెదలు గలదియుఁ, బ్రకృతము మహామహుండగు శ్రీకృష్ణునకుఁ దా నర్పింపఁదగియుంటఁ దగినయుపయోగము తనకుఁ దటస్థించెఁగదా యని హృద్యయు సంతోషమునందుటకతన గ్గ్నయానందబాష్పము లేమో యను సంది యమును గ్గ్రించుమకరందబిందువులఁ జెలువుమీఱునదియుఁ, జెల్లకోర్కుల నొసంగుట కతనఁ గ్గ్నినవిమలయశం బేమో యనుసంశయము నాపాదించు విమలప్రభను మించు నదియు నైన పారిజాతనూత్నసుమమును వియన్నదీసువర్ణపద్మపత్రమునఁ బొదివి శ్రీకృష్ణున కర్పించె నని భావము.

వ్యా-విశే. ఆ+విరించినందనుండు-త్రికంబుమీఁది హల్లునకు ద్విత్వము వికల్పముగఁ గల్గును. క్రొత్త+నన-ప్రాఁతాదుల తొలియచ్చుమీఁది వర్ణములకెల్ల లోపమును, వానికిఁ బరుషేతరములు పరములుగా ద్విత్వమును గల్గును. క్రొన్నన. చిగురుటాకు-రూ. అ. చిగురాకు కర్మధారయంబునఁ బేర్వాదిశబ్దముల కచ్చుపరంబగునపుడు టుగాగమంబు విభాషనగు. మిన్ను+ఏఱు-సమాసమున 'టి'ఁదొపవిభక్తిక ప్రత్యయము కల్గెను. బృందా యమాన—'బృందకవాచరమాణ' అనునర్థమునఁ గల్గిన క్యజంతరూపము. మతుబర్థమున 'తుంద+ఇల' 'తుందిల' అని యయ్యెను. తుమ్మెదలు స్తుతిపాఠకు లగుచున్న వనుటచేఁ బరిమళాతిశయమును, గీర్తిశంకను గలుగఁజేయుచున్న దనుటచే విశదప్రభాధిక్యమును సూచితము లగును. సుమము మనోహరమగుటకుఁ బరిమళమును గాంతియు నావశ్యకములు. మఱియుఁ బూఁదేనె నిండియుండుట పరిమళమునకుఁ బోషకమును వికాసమునకు నూత్నతను దెల్పునదియు నగు పైనినిరూపించిన విశేషణత్రయమునఁ బుష్పము నధికమనోహరముగ నొనర్చి, యద్దాని శోభామహిమాతిశయములఁ బాఠకులకుఁ జేట పఱచెను. మున్యాగమనపుష్పప్రదానములు ప్రబంధకథావృత్తమునకు బీజావాపము లని యెఱుంగవలయును. అలం. మూఁడు సమాసవాక్యములలోను ఉత్ప్రేక్ష.

క. వినయంబు విస్మయంబును
మనమునఁ జెనఁగొనఁగ నపుడు మాధవుఁ డాక్రొ
న్ననఁ గయికొని భీష్మకనం
దనఁ గనుఁగొని సత్యభామ తలఁపున నిలువన్. 51

టీ. వినయంబున్ =అణఁకువయు, విస్మయంబును=అపూర్వవస్తుదర్శనమునఁ గల్గు చిత్తవిస్తారమును, మనమునన్ =మనస్సున, జెనన్ =పెనుపును, కొనఁగన్ =స్వీకరింపఁగ,

మాధవుఁడు=కృష్ణుఁడు, ఆకొన్ననన్ =ఆయపూర్వసుమమును, కయికొని = స్వీకరించి, భీష్మకనందనన్ =రుక్మిణిని, కనుఁగొని=చూచి, తలఁపునన్ = మదియందు.

భా. అట్లాముని యవ్విరి నొసంగ దానిని వినయమును నపూర్వసుమదర్శనమున విస్మయమును మదిఁ బెనంగఁ గైకొని చెంతఁ గలరుక్మిణిం గాంచి వెనువెంటనే మదిని సత్యభామ తోఁపఁ గృష్ణుఁడు పరఁగె వని భావము.

వ్యా-విశే. 'వినయము' 'సత్యభామ తలంపున నిలువన్' అనుపదములు శ్రీకృష్ణునకుఁ బెద్దలయందుఁ గలవినయమును, రుక్మిణీసత్యలందుఁ గలసమానానురాగమును సూచించునవి. దీన నుత్తమనాయకప్రధ్వనితము. నిలుచు+నుజి ఆగమాన్యచకారంబుబ కద్విరుక్తంబులకు ముత్తుపరం బగునపుడు ప వ ల గు. నిలువన్.

మ. ఇది భోజాత్మజ కిచ్చినం గినుకతో నేమంచు నూహించునో
మది సాత్రాజితి దాని కే నిపుడు ప్రేమం బంపినన్ దీని నె
ల్లిదముం జేసినజాడ దోఁచునొకొ యాలె మ్రిందు నే సున్కఁ జె
ల్లదువో యేరికిఁ బంపఁగా ననుచు లీలన్ రుక్మిణీకాంతకున్. 54

టీ. ఇది=ఈపారిజాతపుగ్రొన్ననను, భోజాత్మజకున్=రుక్మిణికి, కినుకతోన్=కోపముతో, ఏమంచున్=ఏమనుచు, ఊహించునో=తర్కించునో? సాత్రాజితి=సత్యభామ దానికిన్=ఆసత్యకు, ఏను=నేను, ఇపుడు=ఈసమయమున, ప్రేమన్=అనురక్తితో, పంపినన్ = పంపినట్లైన, దీనిన్=ఈరుక్మిణిని, ఎల్లిదమున్=చులకనను, చేసినజాడ=ఒనర్చిన రీతి, తోఁచునొకొ=ప్రత్యక్షమగునొకొ? ఔలెమ్ము=ఔనులెమ్ము-సరియేకాని, ఇందున్=ఈరుక్మిణీగృహమున, నేను, ఉన్కిన్=ఉండుటచే, ఏరికిన్=ఏవారికిని, పంపఁగాన్=పంపుటకు, చెల్లదువో (చెల్లదు+పో) = తగదు. అనుచున్ = అనుకొనుచు, లీలన్=విలాసముతో.

భా. ఈపారిజాతపుష్పమును రుక్మిణి కొసంగిన గోపమువహించి సత్యభామ మది నే మనుకొనునో, లేక దీని నాసత్యకే యంపించిన రుక్మిణిని దాఁ జులకనగాఁ జూచినరీతి స్పష్టపడునే మో, విక్రమున నే నిం దుండియుంట నేరికిని దీనిం బంపుట తగవు కాదు. అని సవిలాసముగ దానిం గృష్ణుఁడు రుక్మిణి కిచ్చె నని యుత్తరపద్య ముతో నన్వయము.

వ్యా-విశే. ఏమి+అంచు - ఏమ్యాదులయిత్తునకు సంధి ద్వైకల్పికము. అంచున్. రూ. అ. అనుచున్-చువర్ణకము పరమగునవు డన్యాదుల కుత్వలోపంబేని నుస్థానంబున బిందువేని విభాషనగు. అంచున్. ఔను. రూ. అ. అగును. అవును. ఆచ్చికంబునందు

యవులకు వక్రతమంబులు బహుళంబుగా నగు. డౌను + లెమ్ము. లేచుధాతుసంబంధమైన మధ్యమపురుషైకవచనరూపముచేశె. చెల్లదువో. పోవుధాతుసంబంధమైన మధ్యమపురుషైకవచనరూపాంతరము 'చెల్లదు' అనుదానికి నిశ్చయార్థద్యోతకమై చేరెను. శ్రీకృష్ణునకు రుక్మిణీసత్యలందుంగల సదృశానురక్తి సూచితము.

చ. కనుఁగవఁ బిన్ననవ్వు దొలఁక ముని నాథునికన్నుసన్న ని
చ్చినఁ దగ భోజనందనయుఁ జేకొని మ్రొక్కి యవ్విరిం
దనరెతిగొప్పునం జెరివిన వ్వలిగుబ్బలిముద్దుపట్టి లే
తనెల ధరించిన ట్లమరెఁ దద్దయు మోహనకాంతిసంపదన్. 55

టీ. కనుఁగవన్ = నేత్రద్వంద్వమున, పిన్ననవ్వు = చిఱునగవు, దొలకన్ = అతిశయింప, మునినాథునికన్నుసన్నన్ = నారదుని నేత్రసంజ్ఞను, ఇచ్చినన్, తగన్ = ఒప్పునట్లుగా (తా నేరీతి యణఁకువను బుచ్చుకొనవలెనో యారీతి తోఁచునట్లుగ) చేకొని = గ్రహించి, మ్రొక్కి = నమస్కరించి, అవ్విరిన్ = ఆ పారిజాతసుమమును, తనరెతిగొప్పునన్ = తనరమ్యమైన కేశబంధమున, చెఱివిన = ముడువఁగా, వలిగుబ్బలిముద్దుపట్టి = వలిగుబ్బలి = చల్లనికొండ (హిమవఁత్తుఁడు) వానియొక్క, ముద్దుపట్టి = గారాబుకూఁతురు (పార్వతి), లేఁతసెలన్ = బాలచంద్రుని, ధరించినట్లు = తాల్చినరీతిని, తద్దయున్ = మిక్కిలి, మోహనకాంతిసంపదన్ = మోహింపఁజేయునట్టి తేజస్సంపత్తితో, అమరెన్ = ఒప్పెను.

భా. వికసితనేత్రుఁడై శ్రీకృష్ణుఁడు నారదునానుజ్ఞ నాతని కనుసన్నను బడసి యా సుమమును రుక్మిణీదేవి కొసంగ, నామెయుఁ దగురీతిని బరిగ్రహించి, యమ్మునివరునకు నమస్కరించి, కొప్పున ముడిచికొని లేఁతచందురుని దాల్చినగౌరివలె మనోజ్ఞమైన కాంతి సంపద నలరారె నని భావము.

విశే. శ్రీకృష్ణుఁడు మహామహుండు నారదుండు తనదరి నుండుటంజేసి, యణఁకువ సూచించుటకును, దాను దాని కిత్తునా దీని కిత్తునా యనుసందియమునకు లోఁబడియు, దగ్గర నున్నదానికే విరి నొసంగుటయం దభిముఖుం డౌట, నాభావమును మఱుఁగు పఱచుటకును, సంతోషము మీఱనే యవ్విరి నిచ్చినటుల దేవేరికిఁ దెల్పుటకును, జిఱు నగవాననమునఁగాక కన్నుదోయియం దె తొలఁకఁజేసె నని తోఁచును. నిక్కముగఁ గృష్ణుఁడు దాను సమయోచితముగఁ బ్రవర్తింపఁ దలంచినను నవ్విరిం దెచ్చిన నారదుని యాశయమెటు లుండునో యెఱుంగకున్న బాగుగా నేరదు. మఱియుఁ దానుపక్షపాతము మీఱ మెలంగినటుల విశద మగును. కాని యింత నారదుఁడును నేత్రసంజ్ఞను శ్రీకృష్ణు నవ్విరిని భోజాత్మజకీయ సూచించె. తన కింక భారము తలఁగెను. మున్ముందు జఱుపవలసియే

యాసుమరాజమును రుక్మిణికొసంగినటుల నెల్లరకు స్పష్టమయ్యెను. దయతోసుమము తనకిమ్మని యమ్మని కనుసన్న యొనర్చుటకతనము భక్తికతనము నమ్మాని కాపై ప్రణమిల్లెను. పారిజాతము తెల్లని దౌట లేనెలవలె నమరు నని గ్రహింపపలయును. రుక్మిణి కిద్దాని నొసఁగుటఁజేసి ముందుముందు సత్యకు నీర్షపాడము నను నంశమమ్మని యెఱిఁగియే యట్లాదేశించె నని గ్రహించునది. అలం. ఉపమ.

సీ. మగమిాల నగఁ జాలుతెగఁ గీలుకొనువాలుఁ
గనుఁగవ కొకవింతకాంతి యొదవె
వలిజక్కవలపెక్కవలు దక్కవగ నిక్క
చనుదోయి కొకవింతచాయ దోఁచె
నెలతుమ్మెదలదిమ్ము వెలిఁజిమ్ము చెలువమ్ము
గలవేణి కొకవింతనలుపు మీఱె
నల చెందొవలవిందు చెలువెందు వెదచిందు
మొగమున కొకవింతజిగి దొలంకెఁ

తే. జక్కఁదనమున కొకవింతచక్కఁదనము
జవ్వనంబున కొకవింతజవ్వనంబు
విభ్రమంబున కొకవింతవిభ్రమంబు
గలిగె నద్దివ్యకుసుమంబుకతన సతికి. 56

టీ. మగమిాలక్ =గండుమీాలను (మీాలు=చేఁపలు), నగక్ = పరిహసించుటకు, చాలుతెగక్ =సమర్థమగువిధమున,కీలుకొను=అమరియుండు, కనుఁగవకుక్ =నేత్రద్వంద్వమునకు, ఒకవింతకాంతి=అపూర్వమగు సొగసైనశోభ, ఒదవెను=సంభవించెను, వలిజక్కవలపెక్కవలు=గుండ్రమైన చక్రవాకపక్షులయభివృద్ధులు, దక్కవగక్ =హీనమగునట్లు, నిక్క=పైకుబ్బునట్టి, చనుదోయికిక్ =స్తనద్వంద్వమునకు, ఒకవింతచాయ = ఒకయపూర్వకాంతి, తోఁచెక్ =సంభవించెను, ఎలతుమ్మెదలదిమ్ముక్ = లేఁదేంట్లగర్వమును, వెలిక్ =పైఁగా, చిమ్ము=పాఱఁదోలునట్టి, చెలువమ్ము=అందము,కల=కల్గిన, వేణికిక్ =జడకు, ఒకవింతనలువు=ఒకయపూర్వమగునందము (నలుపు పా.), మీఱెక్ =అతిశయించెను. అల చెందొవల విందుచెలువుక్ =ఆయెఱ్ఱగలువలకుఁ బండుగైనవానియందమును, అనఁగాఁ జంద్రునిసంబంధమైనయందమును, ఎందుక్ =ఏచోటను, వెదచిందు = వ్యాపింపఁజేయు, మొగమునకుక్ = ముఖమునకు, ఒకవింతజిగి = ఒకవిధమగునూతనకాంతి, దొలంకెక్ = అతిశయించెను. చక్కఁదనమునకుక్ = సౌందర్యమునకు, ఒకవింతచక్కఁదనము = ఒకయపూర్వమగు సౌందర్యమును,జవ్వనంబునకుక్ =యౌవనమునకు, ఒకవింతజవ్వనంబుక్ = ఒకనూతనతారుణ్యమును, విభ్రమంబునకుక్ =విలాసమునకు, ఒకవింతవిభ్రమంబుక్ =ఒక

యపూర్వవిలాసమును, అద్దివ్యకుసుమంబుకతన = ఆదేవపుష్పకారణమున, (అనఁగా నాదివ్యసుమధారణవశమున నగుట) సతికిన్ =పతివ్రత యగునారుక్మిణీదేవికి, కలిగెన్ = సంభవించెను.

భా. ఆపారిజాతకుసుమమును ధరించుటకతన గండుమీలఁ బరిహసించు రుక్మిణి కన్దోయి కొకయపూర్వశోభాతిశయ మెదవె ననియు, గుండ్రనిచక్రవాకముల యభివృద్ధులఁ గ్రిందుపఱచు నామెచన్దోయి కొకభూతపూర్వముగాని కాంతి కల్గె ననియు, లేఁ బ్రాయంపుఁదేంట్లగర్వమును దూరముగాఁ బాఱఁదోలునందము గల యామెవేణి కొక చెప్పరానిసౌందర్యము సంభవించె ననియు, చంద్రునియందము నెందును వ్యాపింపఁ జేయు నామె మోమున కొకవింతకాంతి యతిశయించె ననియు, నామె చక్కఁదనమున కొక వింతసౌందర్యమును, నామెయౌవనమున కపూర్వమగుతారుణ్యమును, నామె విలాసమున కొక యపూర్వవిలాసమును గలిగె ననియు భావము.

వ్యా-విశే. జక్కవ. రూ. అ. జక్కవ. 'జక్కవ' అను నుకారమధ్యరూపము నిందలి 'క్క' అను ననుప్రాసము దృఢపఱచుచున్నది. చనుదోయి. రూ. అ. చన్దోయి. అఁట ఇఁక చుఁడు శబ్దములందప్ప నుడితొలిహ్రస్వముమీఁద ఖండబిందువును ద్రుత మునకు లోపమును లేవు. 'చన్దోయి, కన్దోయి' అనువానిలోన నకారము ద్రుతమగునా యనునంశము విచారణీయము. సీసతృతీయపాదమున 'నలుపు' అని పాఠాంతర మగపడు. అపూర్వమగునందమును బ్రత్యంతమునకుఁ గూర్చుటకే కవి యత్నించినట్లు దీని పూర్వోత్తరపాదములందలి 'కాంతి, చాయ, జిగి' అనుపదములు తెల్పుటంబట్టి జడనల్లందనము దెల్పుపాఠ మిచ్చోఁ బ్రసక్తము గా దనియే తోఁచెడిని. మఱియు నల్లందనమునుసూచింప నెలతుమ్మెదే త్యాదిపద్యశేషణమే సమర్థమగును. చెన్ను + తొవ= చెందొవ. ప్రాఁతాదుల తొలియచ్చుమీఁదివర్ణములకెల్ల లోపంబు బహుళంబుగా నగును. పిదపఁ బరుషములు పరముకాఁగా నుగాగమము. చక్కఁదనము. రూ. అ. చక్కందనము. సమాసంబుల నుదంత స్త్రీసమంబులకును, బుంపులకును,నదంతగుణవాచకంబులకును దనంబు పరంబగునపుడు నుగాగమం బగు. ద్రుతకార్యము. జవ్వనము. వి. యౌవనము. ప్ర. అలం. శబ్ద. అనుప్రాసము.

క. కలకంఠకంఠి యీగతిఁ, బులుగడిగినము త్తియంపుఁబోలు పొందంగా
నెలనవ్వొలయఁగఁ బలికెను, జలజాసనుపట్టి కలహసంభ్రమపరుఁడై.

టీ. కలకంఠకంఠి=కోకిలకంఠమువంటి కంఠము గలయారుక్మిణి, ఈగతిన్ = ఈరీతిగ, పులు=మాలిన్యము, కడిగిన=తొలఁగించిన, ముత్తియంపుఁబోలుపు = మంచిముత్తి

యపుసొగసును, ఒందంగాక్ =పడయఁగా, ఎలనవ్వు = చిఱునగవు, ఒలయంగక్ = వ్యాపింపఁగా, జలజాసమఃట్టి = బ్రహ్మకొడుకైననారదుఁడు, కలహసంభ్రమపరుఁడై - కలహసంభ్రమ=జగడపుపేగిరపాటునందు, పరుఁడై=ఆసక్తిగలవాఁడై, పలికెను.

వ్యా-విశే. ముత్తియము. రూ. అ. ముత్తెము. ముఖ్యము. వి. మౌక్తికము. ప్ర. జగడముపెట్ట నున్నవాఁడుగాన నెలనవ్వొలసె నని గ్రహింపవలయును. కలహసంభ్రమ పరత మీఁద స్పష్టపడును.

నారదుఁడు పారిజాతప్రభావంబు రుక్మిణీదేవికిఁ జెప్పుట

సీ. జలజాక్షి! యిది పారిజాతప్రసూనంబు
నరులకు ధరియింప నరిది సూవె
పౌలోమి పార్వతి పద్మ పద్మజురాణి
యసు శిరంబునఁ దాల్తు రనుదినంబు
హరిబహిఃప్రాణంబ వగుట నేఁ డెఱుఁగంగ
వచ్చె నీ కిపు డిది యిచ్చోఁ గాన
వెలఁదులు పదియాఱు వేవురలో నెన్న
సరి లేదు సౌభాగ్యగరిమ నీకు

తే. నీవు దాల్చినకతన నీపూవు నేఁడు
భాగ్యము వహించె నుచితోపయోగ్యవృత్తి
నీప్సితార్థంబు నొడఁగూర్చు నిది లతాంగి
దీనిమహిమంబు చెప్పెదఁ దెలియ వినుము. 58

టీ. జలజాక్షి=పద్మములవంటి నేత్రములుగలదానా! విశాలనేత్రత సౌందర్య ప్రకాశకము. పారిజాతప్రసూనంబు = పారిజాతపుష్పము, నరులకుక్ =మనుష్యులకు, ధరియింపక్ =తాల్చుటకు, అరిది చూవె=దుర్లభమునుమా, పౌలోమి=ఇంద్రునిభార్య యగుశచీదేవియు, పార్వతి=హిమవంతునికూఁతు రగు నగజయు, పద్మ=పద్మోద్భవ యగు లక్ష్మియు, పద్మజురాణియును=బ్రహ్మదేవేరి యగు సరస్వతియు, శిరంబునక్ =ఉత్తమాంగమున, అనుదినంబుక్ =ప్రతిదినమును, తాల్తురు=ధరింతురు. హరిబహిఃప్రాణంబవు - హరి=కృష్ణునియొక్క, బహిఃప్రాణంబవు=వెలుపలిప్రాణమవు, అగుట=ఐయుండుటను ఎఱుఁగంగక్ =తెలియుటకు,వచ్చెను (తెలిసెను) నీకుక్ , ఇపుడు, ఇది=ఈపారిజాతపుష్పమును, ఇచ్చెక్ కాన=ఇచ్చుటచే (ఇది పై వాక్యమునకు హేతువు) వెలఁదులు, పదియాఱువేవురలోక్ =పదియాఱువేలస్త్రీలలో, ఎన్నక్ = లెక్కసేయఁగా, సౌభాగ్య

గరిమక్ =సౌందర్యాతిశయమువిషయమున, నీకుక్, సరి లేదు=సాటి లేదు. తాల్చిన కతనక్ =ధరించినకారణమున, భాగ్యము=అదృష్టమును, వహించెక్ =పొందెను. ఉచితోపయోగ్యవృత్తిక్ =తగినయుపయోగింపదగిన వ్యాపారముచే, ఈప్సితార్థములు = కోరినకోర్కులను, ఒడగూర్చుక్ = చేకూర్చును, లతాంగి = తీగబోడి, మహిమంబుక్ =మాహాత్మ్యమును.

భా. ఓరుక్మిణీ! ఈపారిజాతమును భరింప నరుల కలవి గాదు. దీనిం బ్రతిదినమును శచియుఁ, బార్వతియు, లక్ష్మియు, సరస్వతియుమాత్రమె ధరింతురు. అట్టి సరోత్కృష్ట లగువారిచేఁ దాల్పఁబడు దీని నీకు శ్రీకృష్ణుఁ డొసఁగుటంజేసి నీ వాతని బయటిప్రాణమ వని తెలియనయ్యెను. మఱియు నితరభార్యల కొసఁగక దీని నీ కొసంగుటంబట్టి యెల్లరిలో సౌభాగ్యాతిశయమున మించినదాన వని తేటపడియెను. ఇట్టి నీవు ధరించినకతన నీసుమ మెంతయో యదృష్టము కల దని చెప్పవలసియున్నది. తగురీతి నుపయోగించిన నిని కోర్కులనెల్లఁ జేకూర్చును. దీనిమహిమ మిఁకఁ దెల్పుదమువినుము.

వ్యా-విశే. వెలఁదులు పదియాఱువేవురలో.—సర్వనామసంఖ్యాభిధానశబ్దవిశేష్యంబులం దెయ్యది ముందు ప్రయోగింపఁబడు దానిద్వితీయామలకుఁ బ్రథమ బహువచనంబుగా నగును. చూవె:—చూడవు+ఎ. రూ. అ. చూవే. పౌలోమి, పార్వతి, పద్మ, పద్మజురాణియు;-నామసర్వనామంబులకును, గళలగునవ్యయములకును గడపల సముచ్చయార్థక విశేషపాదపూరణములందు నుశబ్దంబు దఱచుగ నగు. ఇది కళలగు ననుదంతశబ్దములమీఁద యువర్ణపూర్వకముగ విభాషనగును. మఱియు నిది పెక్కుచోట్ల నుండఁదగియుండినను నొక్కచో నుండినఁ జాలును. ఒడఁగూడు+చు. ఆడోడుకూడుల డకారములకుఁ జుక్కు పరంబగునపుడు లేపం బగు. ఒడఁగూర్చు+ను:—శబ్దరార్థక్రియ. 'నరులకు ధరింపరానిదియు, శచీపార్వతీలక్ష్మీసరస్వతు లనుదినము ధరించునదియు నగునుమము, అని చెప్పటచే సుమమునుశ్రీకృష్ణ తెల్లమయ్యెను. అయ్యుశ్రీకృష్ణకుసుమరాజమును, నీ కిచ్చెను గాన నీవు కృష్ణునివెలుపలిజీవంబవును, బదియాఱువేలమందివనితలలో సాటిలేని సౌభాగ్యగరిమగలదానవును నైతివనుట, తక్కుంగల యెల్లవారిలో నీమెయు నెక్కువసేసి శ్రీకృష్ణుమున నితరవనితాశ్రీతికీర్ష్యను బుట్టించి జగడమునకు దారితీయుటకే యని యెన్నవలయును. మఱియు నీవు ధరించుటకతనచే నీసుమమ దృష్టము వహించె ననుటయు, నిది నీకే ధరింపఁదగినదికాని యితరవనితలకుఁ దగినది కా దని యనుటయుఁ బెఱరామల కసూయకూర్చి కలహమునుసంధించుటకే యని పరిగ్రహింపఁదగు. తగినరీతి నుపయోగించెదేని కోర్కులనెల్లఁ గూర్చు ననుట నింక నీకు దేనఁ గొఱంత లే దని తెల్పుచుఁ, బరభామల కసూయఁ

బుట్టించుటకే యనవలయు. ఇట్లే యిప్పద్యము మొదలుకొని యఱువదేడవపద్యముపఱి కును గల నారదప్రసంగమునఁ గలహసంభ్రమపరత్వ మాన నగును.

క. పరిమళము సెడదు, వాడదు పరువము దప్పదు పరాగభరభరితం బై
నిరతము జగదేకమనో,హర మగు నీ కుసుమరాజ మంబుజవదనా !

టీ. అంబుజవదనా=పద్మముఖీ, పరిమళము=తావి, వాడదు=మ్లానత్వమునందదు, పరువము = పరిపాకము (అనఁగా సంపూర్ణవికాసము), పరాగభరభరితంబై = పుప్పొడి యొక్కభారముచే నిండినదై, నిరతము = సంతతము, జగదేకమనోహరము = లోకము నందుఁ గేవలము తానే మనోజ్ఞమై, ఈకుసుమరాజము = ఈపుష్పశ్రేష్ఠము.

భా. దీనిసుగంధ మెపుడును జెడ దనియుఁ, బరాగమును వికాసమును గోల్పోక నిండువికాసమున సర్వమనోహరమై యెల్లవాని మించి వర్తిలు ననియు భావము.

విశే. పుష్పమునకు సరోత్కృష్టత నుసంధించుచుఁ, దన్మూలమున రుక్మిణికిఁ బెద్దగౌరవమును గూర్పఁ, దక్కుంగలవనితలకు నీర్ష్యను సంపాదింప, నారదుఁ డీగతిని బ్రసంగించుచున్నాఁ డని యెన్నవలయును. మఱియు నాజగదేకమనోహరమగు కుసుమ మును దాల్చుటకతన నీవును జగదేకసుందరి వగు దని యాంతరాశేయము.

మ. అలినీలాలక! నీవు నీపతి రహస్యక్రీడ వర్తించువే
ళ లతాంతాయుధసంగరంబునకు నుల్లాసంబు గల్పించు ను
జ్జ్వలదీపాంకుర మై రతిశ్రమతనూసంజాత ధారాళ ఘు
ర్మలవంబు ల్దొలఁగింపఁగా సురటియై రంజిల్లు నిచ్ఛాగతిన్. 60

టీ. అలినీలాలక=తుమ్మెదలంబోలు నల్లనిసెఱికురులుగలదాన, రహస్యక్రీడన్ = ఏకాంతక్రీడను, వర్తించువేళన్ =ఉండుసమయమున, లతాంతాయుధసంగరంబునకున్ - లతాంత=పుష్పములే, ఆయుధ = బాణములుగాఁగల మన్మథునిదగ్గ, సంగరంబునకున్ = యుద్ధమునకు (రతిక్రీడ కనుట), ఉల్లాసంబు = సంతోషము, కల్పించు= చేయు, ఉజ్జ్వల దీపాంకురమై = ప్రకాశించుదివ్వెమొలకయై, రతి....ఘర్మలవంబుల్ -రతి = సంభోగము వలని, శ్రమ=ఆయాసముచే, తనూ=శరీరమునందు, జాత = పుట్టిన, ధారాళ=అడ్డపాటు లేని, ఘర్మలవంబుల్ = చెమటబొట్టులు, తొలఁగింపఁగాన్ = నిర్మూలింపఁగ, సురటియై= వీవనయై, ఇచ్ఛాగతిన్ =గోర్కి కనుకూలించురీతిని, రంజిల్లున్ =ప్రకాశించును.

భా. నీవును నీభర్తయు నేకాంతక్రీడకు లోనగుదనుక సంభోగమునకు సంతో షాతిశయమును గల్పించు మహాజ్యోతియై వెలుంగుచు, నిది మీకు రతివలనఁ గ్గిన స్వేద బిందువుల నపనయింప వీవనయు నగు నని భావము.

వ్యా-విశే. ఇద్దానిం దాల్చుటకతన, నీకొక్కదానికే యిట్టివైభవము కల్గుఁగాని పెఱవారలకుఁ గల్గఁబో దని నారదుని కలహసంభ్రమపరత విశదమగును. రంజిల్లు—రంజాదుల యించుక్కాకారంబునకు సబింధుకంబునకు అప్రేరణంబున ద్వీరుక్తలకారంబగు. నిరీహుఁడగుమహాముని నారదుఁ డీగతిని శ్రీకృష్ణునిదేవేరితోడ రుక్మిణితోడఁ బ్రసంగించుట సముచితముగాదని యనవచ్చును. కాని, వక్త నిరీహుఁడగుటను వక్తవ్యము సుమమూలకసుఖాతిశయప్రకాశకము కావలసియుండుటను, దన్మూలమున నితరవనితల ఈసూయంగూర్వ మాని తలంచియుంట, నిట్టిప్రసంగమే తలఁచినదానిం గూర్వ సమర్థమైయుండుటను, బైప్రసంగము దుష్టముగా దని యెన్నవలయుమ. సంస్కృతహరివంశమున నీప్రసంగము గానరాదు. స్వాశ్రయులగురాజులకుఁ గలశృంగారాసక్తినిగాని యక్కాలమునఁ గవులకుఁగల శృంగారప్రియత్వమునుగాని గవి వెల్లడించెనేమో !

చ. అడిగినయంతలోన సరసాన్నముల న్సమకూర్చు నాఁకట
న్బడలికఁ జెందనీక యశుభంబు లడంచు జగత్త్రయంబునం
బడయఁగరాని సర్వగుణభవ్యము సుమ్మిది దీనిఁ దాల్చి యి
ప్పుడఁతులలోఁ గనుంగొను మపారమహామహిమానుభావముల్. 61

టీ. అడిగినయంతలోనన్ =కోరినవెంటనే, సరసాన్నములన్ =రుచ్యము లగునన్నముల (అన్నము=తినఁదగినదంతయు నన్న మే యగు), ఆఁకటన్ =క్షుత్తుచే, బడలికన్ = శ్రమను, చెందనీక=పొందనీయక, సమకూర్చున్ =చేకూర్చును, అశుభంబులన్=కష్టములను, అడంచున్ = నశింపఁజేయును, జగత్త్రయంబునన్ = ముల్లోకములను, పడయఁగన్ =పొందుటకు, రాని=శక్యముగాని, సర్వగుణభవ్యము-సర్వ = సమస్తమైన, గుణ=మంచిగుణములచే, భవ్యము = శుభప్రదమైనది, ఇది=ఈపారిజాతము, సుమ్ము = చుమా, దీనిన్ = ఈపారిజాతసుమమును, తాల్చి=ధరించి, ఇప్పడఁతులలోన్ = ఈవనితలలో, (పడియాఱుదేవురిలో), అపార.....అనుభావముల్ - అపార = అనంతములైన, మహత్ =గొప్పవైన, మహిమ=ఐశ్వర్యముయొక్క, అనుభావముల్ = ప్రభావములను, కనుంగొనుము = కాంచుము (పొందుము).

భా. ఈపారిజాత మడిగినతోడనే రుచ్యము లగునన్నముల నిడి యాఁకటివలని బాధ నందనీదు. ముల్లోకముల నిట్లు సర్వగుణముల కాలవాలమును క్షేమంకరమును నగునది లేదు. కాన, నిట్టిభవ్యసుమమును ధరించి సవతులెల్లరిలో ఐశ్వర్యమహిమను మించి మిన్నవగుదుగాక అని భావము.

వ్యా-విశే. సమకూర్చు.—సమకూడు. ప్రే. చు. సమకూర్చు. లోకమున నాకలియు నశుభములయు బాధ సంభవింపకుండుటనే సర్వముం గోరును. కాని యవ్వానిబాధ సత్రత్రము దప్పకుండును. ప్రకృత మాకెండింటి నపయింపఁగలసుమరాజ మీమెకు లభించెను. మీఁదు మిక్కిలి సర్వశుభములకాస్పదము. దీన రుక్మిణి యైశ్వర్య ప్రభావమును గాంచుటయు, నెల్లరిలో మిన్నయగుటయు నేల సంభవింపకుండును? మఱియు నిద్దాని మూలమున నితరవనితలకు మాత్ర మీర్ష్య యేల జనింపకుండును? 'పడఁతు లెల్లరిలో మహామహిమానుభావములు గనుఁగొనుము' అను తుదిపలుకు నారదునికలహసంభ్రమపరతను సూచించును.

చ. కువలయపత్ర నేత్రి! నెఱిగొప్పున నీకునుమంబు దాల్చుటన్
సవతులు వచ్చి నీచరణసారసయుగ్మము నాశ్రయింపఁగా
ధవుఁ డఱలేనికూర్మి జవదాఁటక నీపలు కాదరింపఁగా
నవిరళభోగభాగ్యమహిమాన్వితవై విహరింతు గావుతన్. 62

టీ. కువలయపత్ర నేత్రి=నల్లకలువరేకులంబోలు కన్నులుగలదాన! నెఱిగొప్పున=రమ్యమైనకొప్పున, ఈకుసుమంబున్=ఈపారిజాతపుష్పమును, దాల్చుటన్=ధరించుటచే, సవతులు=సపత్నులు, వచ్చి, నీచరణసారసయుగ్మమున్=నీసంబంధమైన పాదపద్మద్వంద్వమును, ఆశ్రయింపఁగాన్=అండఁగొనఁగా, ధవుఁడు=భర్త,అఱలేనికూర్మిన్=కొఱంతలేనియనురాగముతో, జవదాఁటక=అతిక్రమించక, నీపలుకు=నీమాట, ఆదరింపఁగాన్=మన్నింపఁగా, అవిరళ...మహిమాన్వితవై-అవిరళ = తక్కువకాని, భోగ=సుఖములయొక్కయు, భాగ్య=అదృష్టముయొక్కయు, మహిమ=ప్రభావముతోడ, అన్వితవై=కూడినదానవై, విహరింతుగావుతన్=విహరమొనర్తువుగాత. (అని యాశీస్సు.)

భా. ఓరుక్మిణీ! నీమనోజ్ఞకేశబంధమున నీపారిజాతసుమమును ధరించుటకతన, నీసవతులు నీపాదములంబడి నిన్నుఁ గొల్చుటయు, నీపతి నినుఁ బూర్ణమగుననురాగమున నీమాట జవదాఁటక మెలంగుటయు సంభవించు. కాన, నట్లు పతి దగు మితిలేని యాదరమునకును, సపత్నీసంసేవకును బాత్రమవై భోగములను సుఖములను గాంతువుగాత మని భావము.

విశే. సవతులు పాదసరోజముల సేవించుట, పతి మితిలేనియనురాగమున జవదాఁటకుండుట యనునివి భోగభాగ్యచిహ్నములుగదా! సపత్నులు నీపాదములపైఁ బడుదు రనియు, నీపతి నీమాటను దాఁటక మెలంగు ననియు, నీవె యధికభోగభాగ్యములకుఁ దావగు దనియుఁ బలుకుట యితరతరుణుల కీర్ష్యాసంధానార్థముగాక వే ఱగునా? ఇట్లు నారదుని కలహసంభ్రమపరత ప్రతిపద్యమునుండియు నుద్ధరింపనగును.

క. నెలకొని వేసవిఁ జలువయుఁ, జలివేళల నుష్ణగుణము సముచితభంగిం
గలిగించు నీలతాంతము, కొలఁదులు చెప్పంగ నిచ్చకొత్తలు సుమ్మా.

టీ. నెలకొని=నిలిచియుండి (కొప్పున), వేసవిక్=ఎండకాఱున, చలువయ్‌క్=చల్లఁదనమును, చలివేళలక్=శీతకాలమున, ఉష్ణగుణముక్=వేఁడిమిని, సముచితభంగిక్=ఉచితమగురీతిని, కలిగించును=ఒదవించును, ఈలతాంతముకొలఁదులు=ఈపుష్పపుశక్తులు (పరిమితి), చెప్పంగక్, నిచ్చ=సదా, కొత్తలుసుమ్మా=నూతనములుసుమా.

వ్యా-విశే. నిచ్చ. ప్ర. నిత్య.

క. అలరుంబోఁడులలోపల, నలరుఁ బోఁడుములు నీకు నగ్గల మగుచుఁ
దలపూ వాడక యుండుము, తలపూపు ధరించి వికచతామరసాక్షీ!

టీ. అలరుంబోఁడులలోపలక్=పుష్పమువలె మనోజ్ఞులైనతరుణులలోపల, నీకుక్, అగ్గలమగుచుక్=అధికమగుచు, పోఁడుములు=ఒప్పిదములు, అలరుక్=ఒప్పును, తలపూ=తలయందలిపూవు, వాడక=మ్లానముగాక, తలపూపు=శిరసునందు కుసుమము, ధరించి, వికచతామరసాక్షీ=వికసించినపద్మములఁబోలు కన్నులుగలదాన! ఉండుము.

వ్యా-విశే. లేదా, తలఁపు=చింతితము, డోవాడక, డోగు+ఆడక=చలింపక (స్థిరముగాఁగ) తరువాతఁ బూర్వమువలెనే యని యెన్నవలయును. కొన్నిప్రతులలో 'తలపూవాడక' అని నిర్బిందుకముగఁ బాఠము గానంబడును. తలపూవు వాడక యను పదము మహాభోగసూచకముగఁ గవులు వాడుట గలదు. 'తలపూవువాడనిభోగి' యని వసుచరిత్రము. 'పూ పూవు' అని పూవుశబ్దమున కసమాసమున 'పూ' అని రూపాంతర మున్నట్లు 'శిరసుపూ' అను నుదాహరణ మొసఁగి సీతారామచార్యులుగారు సమర్థించిరి. కాన 'తలపూ' అను పదమునకు 'తలపూవు' అనునర్థము చెప్పవచ్చును. మఱియు, 'తలపూవు' అనుదాని రూపాంతరమే 'తలపూ' అనియు నంగీకరింపనగును. 'డోగు' ధాతువునందలి గకారమునకు వకారముకల్గినరూపముల కంతగఁ బ్రయోగములు లేమిం జేసియు, 'తలపూవాడక' అనుదాని మహాభాగ్యద్యోతకముగఁ గవులు ప్రయోగించి యుండుటంజేసియు, నిచ్చోఁ బారిజాతకుసుమధారణమున రుక్మిణికిఁ గలుగఁబోవు మహా భోగమును బ్రకాశింపఁ జేయుటయే వక్తవ్యాశయ మగుటంజేసియు, 'తలపూవు వాడక' అనునర్థమే చెప్పనొప్పు నని తోఁచెడిని. శబ్దరత్నాకరమున 'డోవాడు' అనుపదమున కర్థము వ్రాయుచు, నీపద్యమునందలి యీపదమునే 'డోవి+ఆడు=డోవాడు' అని యుదాహరించిరి. కాని యీసుమము వాడనిదొట తలపూవు వాడక యుండు మనుటయే యెంతయు హృద్యమగును. అలరుంబోడులు. అలరు+పోడి. ఇయ్యది బహుప్రీహి యని చిన్నయ

సూరి. అపుడు మేనుశబ్దమునకుఁ బోఁడి యాదేశ మని వారిమతము. 'పోఁడి, బోడి' అనుపదములలో 'పోఁడి' అనునదియే యాదేశముగ వచ్చు నని సూరియాశయమైనట్లు సమర్థింపనగును. ఇది యుపమానపూర్వపదకర్మధారయ మనియు, నిందలిపోడిశబ్దమే 'అలరు' మున్నగువానితో సమసించు ననియు, నపుడు దీనికి 'మనోజ్ఞమైనది' అని యర్థ మనియుఁ బౌఢవ్యాకరణము చెప్పరు. తారతమ్యపరీక్ష లేకయే తన్మతములసామంజస్య విచారణ యిట ననావశ్యకమగుటఁ దృక్తము. పూఫ్ఫ. రూ. అ. పువు. పువ్వు. పూ.

ఉ. ఇన్నిదినంబులుఁ సవతు లిందఱిలో నలసత్యభామకఁ
సన్నలఁ ద్రిష్మరుఁ హరి వశంవదుఁ డై యన విందుఁ గాని యో
కన్నియ! నీయెడం గలుగుగారవ మెయ్యెడఁ జూచి కాన లే
కున్న నసర్ఘ్యదివ్యకుసుమోత్తమ మేరికినైన నిచ్చెనే? 65

టీ. ఇన్నిదినంబులుఁ=ఇన్నిరోజులును, సవతులిందఱిలోఁ=ఇంతమంది సపత్నులలో, అలసత్యభామకసన్నలఁ=ఆసత్రాజిత్పుత్రికయొక్క నేత్రసంజ్ఞలను, హరి=కృష్ణుఁడు, వశంవదుఁడై=వశవర్తియై (స్వాధీనుఁడై), త్రిమ్మఱుఁ=సంచరించును, అనఁ=అనఁగా, విందుఁ, కాని, ఓకన్నియ=ఓరుక్మిణి, నీయెడఁ=నీవిషయమున, కలుగు గారవము=ఉన్న గౌరవము, ఎయ్యెడఁ=ఏచోటను, చూచికానఁ=చూచియుండలేదు, లేకున్నఁ=అట్లే కాకున్న,(అందఱిలో నిను నెక్కుడుగారవమున జూడకున్న) అసర్ఘ్య దివ్యకుసుమోత్తమము-అనర్ఘ్య=అమూల్యమైన, దివ్యకుసుమోత్తమము = అసురపుష్ప శ్రేష్ఠమును, ఏరికినైనఁ=ఏవారికైనను, ఇచ్చెనే=ఒసంగెనే?

భా. తడవులంబట్టి హరి సత్యభామకు స్వాధీనుఁడై యామెయాజ్ఞను జవదాఁటక సంచరించు ననునానుడి వినంబడు. కాని, ప్రకృతము నీకే యద్దివ్యకుసుమరాజము నొసంగి యాదరించుటకతన, నమ్మాట పమ్మగుటయేగాక నీయెడంగలగారవ మేచానయెడ లను లే దని విశదమయ్యె.

విశే. ఇంతవఱకుఁ బారిజాతమహిమాప్రకాశనపురస్సరముగ నారదుఁడు తన కలహసంభ్రమపరతను సూచించి యిఁకఁ గలహము నేవారలకుఁ బరస్పరముఁ గూర్పవలె నని సంకల్పించెనో యాగతిననుసరించి యిఁకఁ బలుకుచున్నాఁడు. నారదుఁడు రుక్మిణీదేవితోడఁ బ్రకృతము నీయెడఁ జూపినగారవ మన్యనారీదుర్లభ మనెను. సత్యా వశవర్తి కృష్ణుఁ డను జనశ్రుతి దీన నసత్య మని తేల్చెను. స్పష్టముగ సత్యభామనామ ముఁ వాక్రుచ్చి యామెను గ్రిందుపఱిచెను. ఇఁక గలహము కల్గుట కడ్డేమి? మానినులకు మత్సరము సహజము. అందును సవతులు. అందును బేరెత్తిన చెప్పెడిదేమి? ఇట్లు కలహబీజము లింక సంపూర్ణముగా నాటఁబడును.

ఉ. చక్కనిదాన నంచు నెలజవ్వని నంచు జగంబులోనఁ బే
రెక్కినదాన నంచుఁ బతి యెంతయు నాకనురక్తుఁ డంచుఁ దా
నిక్కుచు విఱ్ఱివీఁగుచు గణింపదు కాంతల సత్య యింతకుఁ
స్రుక్కక యున్నె నీమహిమ సూచిన బోఁటులు విన్నవించినన్. 66

టీ. చక్కనిదానను = సౌందర్యవతిని, ఎలజవ్వనిని = లేఁబ్రాయముగలదానిని, జగంబులోనన్ =లోకమున, పేరెక్కినదానను=ప్రసిద్ధిని 'గన్నదానను, అనురక్తుఁడు = అనురాగముగలవాఁడు, తాను, సత్య=సత్యభామ, నిక్కుచున్ =అతిశయించుచు, విఱ్ఱి వీఁగుచున్ =మిక్కిలి గర్వించుచు, కాంతలన్ = పెఱవనితలను, ఇంతకున్ = ఇప్పటికిని, నీమహిమన్ =నీప్రాభవమును, చూచినన్, బోఁటులు= చేడియలు, విన్నవించినన్ =మనవి చేసినను, స్రుక్కక=దుఃఖింపక, ఉన్నె=నుండునా?

భా. సౌందర్యవతి ననియు, లేఁబ్రాయముగలదాన ననియుఁ, బతి యెంతయుఁ దనయం దనురక్తుఁ డనియు మిగుల గర్వమునందు సత్య యిప్పటి నీమహిమం గాంచి నను, జేడియలు తెల్పినను వంతనొందక మాన దని భావము.

వ్యా-విశే. నాకనురక్తుఁడు—'నాయందనురక్తుఁడు' అనుదానికి బదులుగాఁ బ్రయుక్తము. ఇట్లు షష్ఠి పెక్కువిభక్తులకు మాఱుఁగ నాధ్యాహృయమున నగపడును. ఉన్నె, ఉండును + ఎ. విన్నవించు. ప్ర. విజ్ఞాపించు. ప్రకృత మీకుసుమమును ధరించిన కతన నీకుఁ గర్వనమహిమం జేసి సత్య తన కెఱుపూర్వము సౌందర్యవిషయమునఁ బశ్యను రాగవిషయమున యౌవనవిషయమునఁ గలగర్వమంతయుఁ దలఁగి స్రుక్కు ననుట,మీఁది మాఁటివిషయమున నీవె యిక్కుసుమమును ధరించుటకతన నామెను మించు వనియు, నామె యట్లనుకొనుట గర్వసూచక మే యిఁక నగు ననియుఁ దెలుపుటకని గ్రహింపనగు. మఱియు 'బోటులు విన్నవించినన్' అనుదానింబట్టి బోటులు సత్యకు విన్నవించుటకే నారదుఁ డీరీతిఁ బ్రసంగించె నని యెన్నఁబడియు. మఱియు నుత్తరకథాసూచకమునునిది గానోపును. 'దీనిం దాల్చి యిప్పడఁతులలోఁ గనుంగొన మపారమహామహిమానుభావ ముల్', 'సవతులు వచ్చి నీచరణసారసయుగ్మము లాశ్రయింపఁగాఁ', 'అలరుంబోఁడుల లోపల నలరుంబోడుములు','నెయెడం గలుగుగారవ మెయ్యెడఁగానఁ', 'ధవుఁడఱి తేని కూర్మి నీపలు కాదరింపఁగాఁ' అను మున్నగుమాటలమూలమున నితరతరుణుల కీమెపై నసూయను నెలకొనఁజేయుచు నంతతోఁ దనివిసనక 65, 66 పద్యముల సత్యభామ నగ్గల మగు కోపమునకు నీర్ష్యకును బొలుగాఁజేయ నామెపేరెత్తి దూషించుటయు, దక్షిణీసతిని భూషించుటయునొనర్చె. ఇంకకలహబీజములు మొలవక మొక్కవోవునా?

క. ధరియించిన మొద లొకవ,త్సరమాత్ర ము తావకీనధమ్మిల్లములో
నిరవుకొని మగుడ నివ్వారి, తరుణీ! యలపారిజాతతరువున కరుగున్.67

టీ. ధరియించిన మొదలు = తాల్చినది మొదలుకొని, ఒకవత్సరమాత్రము = ఒక సంవత్సరకాలముమాత్రమె, తావకీనధమ్మిల్లములోన్ = నీదగుకొప్పులో, ఇరవు = స్థానము, కొని=స్వీకరించి, (ఉండి) మగుడన్ =మఱల, ఇవ్వారి = ఈపుష్పము, తరుణీ= ఓయువతీ! అలపారిజాతతరువునకున్ = ఆపారిజాతవృక్షమునకు, అరుగున్ = పోవును.

భా. ఓయువతీ! దీనిం దాల్చినది మొద లొకసంవత్సర మిది నీకొప్పున నొప్పి యుండి మఱల నాగడువు దాఁటగనే పారిజాతవృక్షముం జెందును.

వ్యా-విశే. తావకీన-యుష్మదస్మచ్ఛబ్దములకు ఖఞ్, అఞ్ ప్రత్యయములును నా శబ్దములకుఁ గ్రమముగ 'తవక' మమక, అనునాదేశములును, 'ఈన' అనునది ఖఞ్ న కాదేశమును, శబ్దముల కాదివృద్ధియుఁ గని 'తావకీన, మామకీన' అనురూపములు గలుగును.

తే. అనుచు నారదుఁ డాడినయట్టిపలుకు
లచటివృత్తాంత మంతయు నరసి పోయి
వేఱు వేఱన సఖులు దేవేరులకును
విన్న వించిన వారును జిన్న వోయి. 68

టీ. ఆడినయట్టిపలుకులు = పలికినమాటలు, అచటివృత్తాంతము=అచ్చోటనైన సమాచారము (రుక్మిణీకాంతగృహంబులోన నేకాంతమున నైనదాసిని), అరసి = విచారించి, వేఱు వేఱన=భిన్నభిన్నముగా-సంకలితముగానట్లు, సఖులు = చెలికత్తెలు, దేవేరులకును=మహిషులకును, విన్నవించినన్ =మనవిసేయఁగా, వారును, చిన్న వోయి=ఖిన్నులయి. ఉత్తరపద్యముతో నన్వయము.

భా. ఈరీతిగ నారదుఁ డాడినమాటల నచ్చోట నున్నచెలికత్తెలు విని యొక్కొక్కరే పోయి సంకలితముగానిరీతిని శ్రీకృష్ణునిమహిషులకుఁ దెల్పి రని భావము.

ఉ. అందఱిలోనఁ బెద్ద మహిమాన్విత రుక్మిణి గానఁ *బూవు గో
విందుఁడు దాని కిచ్చుఁ దగవే యని లక్షణ యోర్చి సైఁచెఁ గా
ళింది శమించె భద్ర యవు లెమ్మని యూరడిలెన్ సుదంత లోఁ
గుందుట మానె జాంబవతి కోప మడంచెను మిత్రవిందయున్. 69

* యూమె కిం, పొందఁ బ్రసూనమోఁ దగవ పొమ్మని లక్షణ. ఆని. పా. అ.

టీ. తగవే=న్యాయమే, ఓర్చెక్ =సహించెను, శమించెక్ = శాంతించెను. డూర డిలెక్ =ఆశ్వాసమునందెను, లోక్ =మనస్సులో, కుందుట=దుఃఖించుట, అడంచెక్ = అణఁగఁజేసికొనెను.

భా. రుక్మిణి దేవేరులెల్లరిలోఁ బెద్దదిగాన నామెకుఁ బారిజాతకుసుమమును శ్రీకృష్ణుఁ డొసఁగుట యుచితమే అని లక్షణ, కాళింది, భద్ర, సుదంత, జాంబవతి, మిత్రవిందయును నలుకను నీర్ష్యను బూనరైరి.

తే. వారిలోపల సౌందర్యవతియు మాన
వతియు మహనీయసౌభాగ్యవతియు నైన
సత్య యంతట నేమొకో శౌరికడకుఁ
బోయి రా దయ్యెఁ జెలి ప్రొద్దు వోయె ననుచు. 70

టీ. వారిలోపలక్ =ఆపట్టమహిషులలో, సౌందర్యవతియుక్ =చక్కఁదనముగలదియు, మానవతియుక్ = అభిమానము గలదియు, మహనీయసౌభాగ్యవతియుక్ = గొప్పదగుప్రియవాల్లభ్యముగలదియు, ఐనసత్య = సత్యభామ, నామైకదేశముచేఁ నామమాత్రయుఁ బరిగ్రహింపనగును, అంతటక్ = వెనువెంట, శౌరికడకుక్ = శ్రీకృష్ణునిచెంతకుక్, పోయెఁ=అరిగి.

వ్యా-విశే. మహనీయసౌభాగ్యవతి.—ఇందుఁ గర్మధారయముపై మతుప్ప్రత్యయము గననగు. ఇట్లు కర్మధారయమున మతుప్ప్రత్యయముకల్గుట విరుద్ధమని సంస్కృతలాక్షణికాశయము. కాని 'సర్వధని' అనుభారవిప్రయోగము ననుసరించి బహుళముగ రాఁదగు నని కొందఱు, ఏది యెట్లయినను నిట్టి ప్రయోగములు విరళములని చెప్పనొప్పును. సౌందర్యవతి, మానవతి, మహనీయసౌభాగ్యవతి, కావునసే సత్యమున్నం దీర్ష్యాబూనుట సంభవించె నని గ్రహింపవలయు. రుక్మిణికి సుమరాజమెసంగుటంజేసి, తనచక్కందనమునకును, మానమునకును, మహనీయసౌభాగ్యమునకును భంగము వాటిల్లె నని సత్య యభిప్రాయపడి యలుకం బూనె నని గ్రహింపవలెను.

మ. తనశృంగారవనంబు*లో నగరిపొంతం జక్కఁగా దిద్ది తీ
ర్చిన పూఁదేనియయేటికాలువదరిం జెంగల్వపుప్పాళ్లఁ నిం
చిన చంద్రోపలవేదిపై సరసగోష్ఠిక బోటియుం దాను న
వ్వనజాతాయతనేత్ర శౌరిగుణముల్ వాక్రుచ్చి వర్ణించుచుక్. 71

టీ. తన శృంగారవనంబులోక్ =తనయుద్యానవనమున, నగరిపొంతక్ = అంతఃపురమునసమీపమున, చక్కఁగాక్ = లెస్సగా, దిద్ది = ఏర్పఱచి, తీర్చిన = అమర్చిన,

---

*లోన గిరిపొంతక్. అని పా. అ. (పట్టణము దరిని యను నర్థమున నగరము +పొంతక్ అగును. నగరమునకు నగరి రూపాంతర మెట్లు?)

పూఁదేనియయేటికాలువదరిక్ =మకరందపునదిసంబంధమైన కుల్యయొక్క సమీపమున, చెంగల్వపుప్పొళ్లనించినచంద్రోపలవేదిపైక్ =చెంగల్వసంబంధమైన పరాగముచే నిండియున్నచంద్రకాంతపురాలచేఁ గట్టఁబడినయరుఁగుపై, సరసగోష్ఠిక్ = వినోదప్రసంగమున, బోటియుక్ =చెలియు, తానుక్, అవ్వనజాతాయతనేత్ర=ఆపద్మములవంటి విశాలములగుకన్నులుగలయామె, శౌరిగుణముల్ =శ్రీకృష్ణునిగుణములను, వాక్రుచ్చి=పేరు చెప్పి, వర్ణించుచుక్ = కొనియాడుచు.

విశే. తనశృంగారవనంబులోనక్, "గిరిపాంతక్" అనుపాఠము గాన నగును. ఆ పక్షమున, గిరిపాంతక్ =క్రీడాశైలప్రాంతమున, అని చెప్పనగు, లేదా శృంగారవనంబులో 'నగరుపాంతక్' నగరు=రాజసౌధము దానిచెంతను, అని యర్థముచెప్పిన బాగు. "నగరి, నగిరి, నగరు," లనువానిలో 'నగరు' అనునదియే యిచ్చోఁ నుచితపాఠమని చెప్పనొప్పును. ప్రకృతము సత్యతనసౌధమున నుండుటయు రాజసౌధమునకు నగరు శబ్దము పర్యాయమగుటయు నందులకుఁ గారణములు, 'న, గిరి' అనుపర్వతపక్షపాఠమును, క్రీడాపర్వతములు రాజగృహములఁ గల వని వర్ణించుకవులయాచారముంబట్టి హృద్యమే యగును. కాని 'నగరి' పాఠమున కంతగ సారస్యము గానరాదు. 'పూఁదేనియయేటికాలువ' అనుటఁజేసి యుద్యానమునందుఁ గలకుసుమవృక్షబాహుళ్యము, నందఁసుమసమృద్ధియు, నుద్యానప్రవిస్తృతియు సూచితములు. స్థల ముద్దీపనకర మగుట స్పష్టము.

చ. ఆలికుల రావముల్ గిసలయాకులకోకిలకాకుకాకలీ
కలకలనాదముల్ సెలఁగఁ గమ్మనితమ్మికొలంకుతెమ్మెరల్
వొలయఁగఁ దొంటిచందమున బుద్ధికి నేమియు నింపుగామికిం
గలఁగుచు సత్యభామ చెలిఁ గన్గొని యించుక సంశయించుచున్. 72

టీ. ఆలికులరావముల్ =తుమ్మెదమూఁకలరొదలు, కిసల...నాదముల్ -కిసలయ = చిగురులయందు, ఆకుల=చెదరియున్న, కోకిల=పికములసంబంధమైన, కాకు=భిన్నధ్వనులతో నొప్పు, కాకలీ=సూక్ష్మమగు సవ్యక్తమధురధ్వనులయొక్క, కలకలనాదము=కలకలధ్వనులు, చెలఁగఁగ =ఒప్పఁగా, కమ్మని = సుగంధములైన, తమ్మికొలంకుతెమ్మెరల్ =పద్మములుగలసరస్సునకు సంబంధించినగాలులు, వొలయఁగఁగ =వ్యాపింపఁగా, తొంటిచందమునఁ =పూర్వమువలె, బుద్ధికిఁ =మదికి, ఏమియుఁ =ఒక్కించుకయు, ఇంపు=మనోహరము, కామికిఁ =కాకుండుటకు, కలఁగుచుఁ =కలఁతనందుచు, సత్యభామ, చెలిఁ = చెలిక త్తెను, కన్గొని=కాంచి, యించుక=కొంచెము, సంశయించుచుఁ =సందియమందుచు, ఉత్తరపద్యముతో నన్వయము.

భా. సత్యభామ తుమ్మెదలగానములును, చిగురులం దిని మధురముగఁ గూయు కోకిలధ్వనులును, చల్లనికమ్మగాలులును దనకుఁ దొల్లింటిచందమునఁ గొంచెమైనను హాయి పుట్టింపమిఁ జేరామి యేలొకో యని యెందమున సందియమందుచుండెను.

విశే. తుమ్మెదలపాటలు, కోకిలలకూజితములు, కమ్మనిగాలులు మనోరంజకము లగుట ప్రసిద్ధము. గాఢకి శైత్యసౌరభ్యమాంద్యములం గూర్చుట కవులయాచారము. ఇందు కొలంకు తెమ్మెర కనుటచే శైత్యమును, 'కమ్మనితమ్మి' యనుటచే సౌరభ్యమును, పొలయు నను టచే మాంద్యమును సూచితములు.

చ. అకట! యదేమియో యెఱుఁగనయ్యెదఁ దొయ్యలి దక్షిణాంసచూ
చుకనయనప్రకంపగుణసూచనలేమియు వల్లగావు సా
రెకు మది జాలి వొంది యొకరీతిఁ దలంకెడుఁ బ్రాణనాథుఁ డొం
డొకచపలాక్షిఁ గూడి ననునొల్లనిచెడ్డయము లేమి సేసెనో. 73

టీ. అకట=అయ్యో! ఇది సంతాపసూచకము. అది, ఏమియో, ఎఱుఁగనయ్యెఁ=తెలిసికొనఁదలంతును. తొయ్యలి! దక్షిణాంస...సూచనలు-దక్షిణ = కుడిదైన, అంస=భుజముయొక్కయు, చూచుక = స్తనాగ్రముయొక్కయు, నయన = నేత్రముయొక్కయు, ప్రకంపగుణ = అధికచలనగుణముయొక్క, సూచనలు = జాడలు, ఏమియుఁ=ఇంచుకైనను, వల్లగావు=మంచివిగావు, సారెకుఁ=మాటిమాటికి, మది=మనస్సు, జాలి=విచారమును, పొందు=అందు, ఒకరీతిఁ=ఒకవిధముగా, తలంకెడుఁ=భయపడును, ప్రాణనాథుఁడు=ప్రాణేశ్వరుఁడగుకృష్ణుఁడు, ఒండొకచపలాక్షిఁ=వేఱొకచంచలాక్షిని, కూడి, ననునొల్లనిచెడ్డయములు=ననుపలవనిచేష్టలను, ఏమి చేసెనో=ఏమి చేసియుండునో?

విశే. 'దక్షిణాంసచూచుకనయన' అనుదానిలోని దక్షిణపదమునకు 'అంస, చూచుక, నయన' అను మూఁడుపదములతోడను సంబంధమును గల్పింపవలెను. స్త్రీలకు దక్షిణభాగమునందలి యీయంగము లదరుటయుఁ, బురుషులకు వామభాగమునందలి యివి యదురుటయు నశుభసూచక మనునభియుక్తోక్తి ననుసరించి, సత్యభామ తలఁకె ననిగ్రహించునది. మఱియు నశుభము రానున్నపుడు మది విన్నందనమునంది సంతోషము కల్గియుండుటయు, నెట్టిమనోహరవస్తువును మనోరంజకము గాకుండుటయు, మదిలో భయము పొడముచుండుటయు సహజములు. ఇందుఁ బ్రథమపాదమున 'నయ్యెద ననుచో నియ్యెడ' నని యున్న లెస్స.

క. అని సత్యభామ తనవిధ
మనుఁగుందొయ్యలికిఁ జెప్పునవసరమునఁ జ

య్యన వచ్చి యొక్కనెచ్చెలి
కనుఁగవ నెఱసంజ వొడమఁగా నిట్లనియెన్. 74

టీ. తనవిధము=తనరీతిని, అగుఁగుందొయ్యలికిన్ = గారాబుచెలికి, చెప్పనవసరమునన్ = చెప్పెడుసమయమున, చయ్యన=వేవేగ, నెచ్చెలి=చెలికత్తె, కనుఁగవన్ = నేత్రద్వంద్వమునుఁ, నెఱసంజ=సంపూర్ణసంధ్యాకాలము, లేక నేత్రద్వంద్వమునం దెట్టినిసంధ్య యనియైన చెప్పనగు. కాని నేత్రములయుఁడి సంపూర్ణసంధ్య పొడమెనను టయే కనులందని యత్యధికారుణ్యమును దెల్పు నని తోఁచెడిని. పొడమఁగాన్ = పుట్టఁగా, ఇట్లు, అనియెను=పలికెను.

వ్యా-విశే. కనుఁగవన్ =కనుఁగవయుండి. వలన కాదేశం బగు ద్వితీయాసప్తముల మీఁది యుండికి లోపము బహుళముగఁ గల్గును. 'విచ్చేయు, మదితిగర్భము వెలువడి' ఇత్యాదులు కవిప్రయోగము లిట్టివి గలవు. అందిత్తరసప్తమ్యర్థములమీఁదయుండు ఉండి పదమునకుమాత్రము లోపము గలుగదు. శ్రీకృష్ణుఁడు పారిజాతమును రుక్మిణి కొసఁగుటయుఁ బిదప నారదుఁ డాత్మసఖని బెక్కుగతులఁ దూలనాడుటయు నెచ్చెలికనుల రుణములగుటకుఁ గారణము లని గ్రహించునది. సంజ. ప్ర. సంధ్య. వి.

క. అమ్మా! యే మని చెప్పుదు, నెమ్మి న్నీవిభుఁడు రుక్మిణీసతిమణిసౌ
ధమ్మున నుండఁగ సురముని, గ్రమ్మఱ నాకస్మికమ్ముగా నచ్చటికిన్. 75

టీ. అమ్మా=చెల్లీ, ఇది ప్రేమసూచకము. ఏమి అని చెప్పుదును=ఏమని పల్కుదును? నెమ్మిన్ = అనురాగముతో, నీవిభుఁడు = నీ ప్రాణేశుఁడు, రుక్మిణీసతి మణిసౌధమ్మునన్ =రుక్మిణీదేవియొక్క మణివికారమైన మేడయందు, ఉండఁగన్ =నివసించి యుండఁగా, సురముని=దేవముని యగునారదుండు.

వ్యా-విశే. ద్రుతంబునకు సరళస్థిరంబులు పరములగునపుడు లోపసంశ్లేషములు విభాష నగు. నెమ్మిన్నీ ధవుఁడు. ఈపద్యమున 'క్రమ్మఱన్' అనుపదమునకు 'మఱలన్' అనునర్థము ప్రసక్తముగామి సారస్యము విచార్యము.

క. చనుదెంచి యమ్మురారికి
వనఘు మ్మమరైకయోగ్య మతిసౌఖ్యకర
మ్మనితరసులభ మ్మిది యని
కొనియాడుచు నొక్కదివ్యకుసుమ మ్మొసఁగెన్. 76

టీ. చనుదెంచి=వచ్చి, అమ్మురారికిన్ =శ్రీకృష్ణునకు, అనఘమ్ము=పుణ్యమైనదియు, అమరైకయోగ్యము=దేవతలకే ముఖ్యముగాఁ దగినదియు, అతిసౌఖ్యకరము=మిగుల సుఖముల నొసంగునదియు, అనితరసులభము=ఇతరులకు దుర్లభము, ఇది = ఈదివ్యసుమము, అని, కొనియాడుచున్ =పొగడుచు, ఒక్కదివ్యకుసుమమ్మును = ఒకానొక దేవతాసుమమును, ఒసఁగెన్ = ఇచ్చెను.

విశే. విష్ణునకుఁ జెందునామము లన్నియుఁ గృష్ణునకు వాడుట యాచారము. ఇందలి విశేషణములు నాల్గును సుమప్రభావద్యోతకములు.

క. మిన్నంది వేగ గయికొని
కన్నుల నొత్తికొని మ్రొక్కి గారవ మెసఁగన్
వెన్నుఁడు రుక్మిణి కొసఁగెను
అన్నెలఁతయుఁ గొప్పులోన నవ్విరిఁ దాల్చెన్. 77

టీ. మిన్ను = ఆకాశమును, అంది=పొంది, (ఊపొంగి) వేగ=త్వరగా, కయికొని=స్వీకరించి, కన్నులన్ ఒత్తికొని=కన్నుల నద్దుకొని, భక్తిపూర్వకపరిగ్రహసూచకము. మ్రొక్కి=నమస్కరించి, గారవము ఎసఁగన్ =గౌరవమొప్పఁగా, వెన్నుఁడు = కృష్ణుఁడు, రుక్మిణికిన్ , ఒసఁగెన్ = ఇచ్చెన్. అన్నెలఁతయున్ =ఆమెయు, కొప్పులోనన్ =ధమ్మిల్లములో, అవ్విరిన్ =ఆకుసుమమును, తాల్చెన్ =ధరించెను.

వ్యా-విశే. గారవము. ప్ర. గౌరవము. వెన్నుఁడు. ప్ర. విష్ణుఁడు మిన్నందుటయుఁ గన్నుల నొత్తికొనుటయు, నపూర్వసుమలాభసంజనితసంతోషమునకును భక్త్యతిశయయుతపరిగ్రహమునకును, సుమమదృష్టపూర్వతేజోభరముకల్గి మనోహర మగుటకును సూచకములు. ఇట్లు కుసుమసంబంధ మగునుత్కృష్టతను సూచించి 'గారవమెసఁగన్' వెన్నుఁడు రుక్మిణి కొసఁగె నని చెప్పుచుఁ గృష్ణునకుఁ గల రుక్మిణియందలి యత్యనురాగమును వెల్లడించెను.

తే. అంతలోనన యద్భుతం బొవహిల్ల
గొలఁది యిడరాని యొకవింతచెలువు గలిగి
రాజబింబాస్య రుక్మిణి తేజరిల్లె
సానఁబట్టిన మకరాంకుశస్త్ర మనఁగ. 78

టీ. అంతలోనన, అద్భుతము=ఆశ్చర్యము, ఆవహిల్లన్ =సంధిల్లఁగా, కొలఁది = పరిమితి, ఇడన్ =ఉంచుటగు, రాని=వీలులేని (ఇంతింతనరాని), ఒకవింతచెలువు = ఒక

యపూర్వమగుచక్కఁదనము, కలిగి, రాజబింబాస్య = చంద్రబింబమువంటి మోముగల, రుక్మిణి, సానక్ =నూఁతురాతియందు, పట్టిన=నూఁటిన, మకరాంకుశస్త్రము = మన్మథుని బాణము, అనఁగక్ =అనునట్లు, ఇది యుత్ప్రేక్షావాక్యము. తేజరిల్లెక్ =ప్రకాశించెను.

భా. అక్కుసుమము నొదలదాల్చినతోడనే యామె యొకయపూర్వలావణ్యము కల్గి సానఁబట్టిన మన్మథునిబాణమో నా నొప్పె నని భావము.

విశే. "కుసుమమును బుష్పమాత్రమని భావింపకుము. దానిం దల ధరించుటకతన నీసవతి కపూర్వసౌందర్యము కల్గె. సానతీరిన మన్మథబాణమో నా మె యొప్పుటఁజేసి యామెయే యింక మన్మథబాణముచేయుపనిని జేసి ప్రియుని యనురాగముం జూఱ గొను. నీసౌందర్య మింక నెందులకును బనికిరాదు" అని వ్యంగ్యవృత్తిని జెలికత్తె సత్య కసూయ నుదయింపఁజేయ యత్నించుచున్నది.

ఉ. ఆకుసుమంబు దాల్చినమహామహిమంబునఁ దోడి కామినీ
లోకము మచ్చరంబు మదిలోనఁ దొఱంగి భజించుచుండ న
స్తోకనిజప్రభావములు సూపెడు గద్దియమీఁద నెక్కి ము
ల్లోకము దాన యేలుగతి లోలవిలోచన యేమి సెప్పుదున్. 71

టీ. లోలవిలోచన=ఓచంచలాక్షీ! ఆకుసుమంబుదాల్చినమహామహిమంబునక్ = ఆపారిజాతపుష్పము ధరించుటవల్లనైన గొప్పమహిమ చే, తోడికామినీలోకము=తనతో సదృశలగుస్త్రీజనులు, (సపత్నులు) మచ్చరంబుక్ = మాత్సర్యమును, తొఱంగి=విడిచి కొని, భజించుచుండక్ = సేవించుచుండఁగా, గద్దియమీఁదక్ = ఆసనముపై, ఎక్కి, అస్తోకనిజప్రభావములు-అస్తోక=అధికమైన, నిజ = తనవైన, ప్రభావములు=ప్రాభవము లను, ముల్లోకము = మూఁడులోకములను, తాన=తానే, ఏలుగతిక్ = పాలించురీతిని, చూపెడుక్ = అగపఱిచెడును.

భా. ఆపారిజాతపుష్పమును దాల్చుటకతన సవతులెల్లరును మచ్చరమును విడిచి కొని రుక్మిణీపాదసరోజముల సేవించుచుండ, రుక్మిణి గద్దియ నధిరోహించి యాజగ త్త్రయంబును దానె పాలించురీతిఁ దనప్రాభవమును గనపఱిచె నని భావము.

విశే. సవతులెల్లరును రుక్మిణీపాదసరోజముల మచ్చరమును వీడి సేవించుచుండి రనియు, నస్తోకనిజప్రభావములు గద్దియమీఁదనెక్కి చూపెడు ననియు ననుటచే, నీవును నట్లింక సేవింపవలసినదే యనియు, నింక నీప్రాభవ మొకమూలఁ బడవలసినదే యనియుఁ,

జెలి సత్యకు వ్యంగ్యమర్యాదం దెలిపెను. మఱియు నిట్టిమహిమం దనరారుసుమరాజము నీకు లభింపకపోయెంగదా యనియు మొత్తముమీఁద బోధించె నని గ్రహించునది. 'లోలవిలోచన' ఇది సత్యముగూర్చి నిల్పఁబడినసంబుద్ధి యనుపక్షమున చెలి చెప్పెడు మాటలవలన భీతి యుదయించె ననియుఁ దన్మూలమునఁ, జంచలనేత్ర యయ్యె ననియుఁ గ్రహింపవలయును, లేక దానికి రుక్మిణియే యర్థమగునెడలఁ దనప్రాభవముం జూట్టు పట్టుల నున్నవారలకుం దెల్పుటకై సొగసుగ నేత్రములం ద్రిప్పుచుఁ గలయఁ దిలకించు చుండె నని గ్రహింపవలెను. ఎట్లైనను నీపదము సాభిప్రాయమే యగును.

వ్యా-విశే. మచ్చరము. ప్ర. మత్సరము. ముల్లోకము.—సమానాధికరణంబగు నుత్తరపదంబు పరంబగునపుడు మూఁడుశబ్దము డుజ్వర్ణకమునకు లోపంబును మీఁదిహల్లు నకు ద్విత్వంబు నగు (బాల.) ఒక్కొకచో ద్విగువు మిశ్రం బేకవచనాంతంబు నగు. (ప్రౌఢ.)

ఉ. ఎంతకు లేఁడు నారదమునీంద్రుఁడు శౌరి వినంగ రుక్మిణీ
కాంత వినంగ నేను వినఁగాఁ బలికెం బతిఁ గూర్చుదాన నా
యంతటివారు లే రని యహంకృతి నెప్పుడు విజ్రువీఁగుచుఁ
వంతకు వచ్చుసత్యగరువం బిఁక జెల్ల దటంచు మానినీ. 30

టీ. ఎంతకులేఁడు = అంతకును గలఁ డనుట. (అనఁగా నెంతలేసి సాహసకార్య ములనైనను జేయఁగలఁ డని భావము) పతిఁ కూర్చుదానన్=భర్తకు మేలుకూర్చు దానను లేక ప్రియపడుదానను (ప్రియవాల్లభ్యముగలదాన ననుట.) అహంకృతిఁ = గర్వముచే, విజ్రువీఁగుచుఁ=మిగుల గర్వించుచు, వంతుకుఁ=పోటికివచ్చు(పోటిచేయు) సత్యగరువము = సత్యభామయొక్క గొప్పఁదనము, ఇఁకఁ, చెల్లదు=కొనసాగదు.

భా. నారదుం డెంతలేసి సాహసకార్యములనైనను జేయఁగలఁడు. నీచెలి నగు నేను వినుచుండ నీసవతి యగురుక్మిణి వినుచుండ, "నే నెంతయు ప్రియవాల్లభ్యముగల దానను. నాయంతటివారు లేరు. అని యహంకారమున సత్య సర్వదా మిగుల గర్వించును. దానిగొప్పఁదన మింక సాగదు" అని పల్కెను.

విశే. ఇందు 'వంతున' అని యొకపాఠ మగుపడును. కాని తిమ్మకవిపాఠము 'వంతుకువచ్చు' అనునదియే. కావున నిదియే సరియగుపాఠము.

విశే. నారదునిసాహసము సత్యాసఖి వినుచుండఁ గృష్ణుఁడు వినుచుండ, సత్యభా మను నిందించుటవలననే తెలియనగును. 'మానినీ' అనుసంబుద్ధి సాభిప్రాయ మని యెఱుం గునది. "నీవభిమానవతివిగాన,నీయవమానము నెట్లు సహించెదో? శీఘ్రమ యీయవమాన

ము దీర్చికొనఁ గడంగుము." అని చెలి సత్యను బ్రోత్సహించె నని తెలియునది. శౌరి వినంగ ననె ననుటచే, ఈమాటలు శౌరికిఁగూడ నిష్టము లయ్యె నని సూచించుట కని గ్రహించునది. రుక్మిణీకాంత వినంగ ననుటచే, నీసవతిముందర నీ కవమానము గల్గె నని తెల్పుట కని తెలియవలయును. 'కూర్చు' దీనికి మేలుచేకూర్చు అనునర్థమున భూరి తమునఁ బ్రయోగములు గననగును.

క. ఆరణభోజనుమతకము, లారుక్మిణినటన లామురాంతకుచెయ్వుల్
చేరి కనుంగొనుచో నె,వ్వారికిఁ గోపంబు రాదు వారిజనేత్రీ ! 81

టీ. ఆరణభోజనుమతకములు = ఆకలహభోజనుఁడు అగు నారదునియొక్క మాయలు, ఆమురాంతకుచెయ్వుల్ = అమ్మురద్వేషియగు కృష్ణునియొక్కకార్యములు, ఆరుక్మిణినటనలు=ఆరుక్మిణీదేవిప్రవర్తనములు, వారిజనేత్రీ = పద్మములంబోలు కన్నులు గలదానా. సంబుద్ధి

విశే. "దగ్గరనుండి చూచిన నాకే కోపము గలిగెను. నీకుఁ గోపము గలుగకుండునా? నీవు చూడలేదుగాని చూచినచో నెంత మండిపడుదువో" అని చెలి సత్యకుఁ కోపోద్రేకమును గలిగింపఁ బ్రసంగించెను. మఱియు, మొట్టమొదట నారదుఁడు కపటంపుమాటలాడి మాయచేసె ననియుఁ, గృష్ణుఁడు తదనుసారముగ మెలంగె ననియుఁ, బిదప రుక్మిణి తననిండుతీవిం జూపె ననియుఁ, జెలి సత్యకుఁ దెల్పి మువ్వురివలనితప్పును సూచించె నని తోఁచెడిని. 'వారిజనేత్ర' అనుపద మచ్చెరువున జెప్పవేయక సత్య కాతరయై చూచుటను సూచించుటను సాభిప్రాయ మని యెఱుంగవలయును.

### సత్యభామ చింతనొందుట

చ. అన విని వ్రేటువడ్డ యురగాంగనయుంబలె నేయి వోయ భ
గ్నన దరికొన్న భీషణహుతాశనకీల యనంగ లేచి హె
చ్చినకనుదోయి కెంపు దనచెక్కులఁ గుంకుమపత్రభంగసం
జనితనవీనకాంతి వెదచల్లఁగ గద్గదఖిన్నకంఠి యై. 82

టీ. వ్రేటు=దెబ్బను, పడ్డ=పొందిన, ఉరగాంగనయుంబలెఁ = ఆఁడుపామువలె, భగ్న+అనఁ, ఇది యాకస్మికముగ మండుమంట కనుకరణము. భగ్ననునట్లుగా, దరికొన్న = మండునట్టి, భీషణహుతాశనకీల = భయంకరమైన యగ్నిహోత్రజ్వాల, హెచ్చిన = అధికమైన, కనుదోయికెంపు = రెండుకన్నులయొక్కయెఱుపు, తన

చెక్కులక్ = తనకపోలములందు, కుంకుమపత్ర.....కాంతిక్ -కుంకుమపత్రభంగ = కుంకుమము చేసైన మకరికాపత్రరచనలచే, సంజనిత=పుట్టినట్టి, నవీనకాంతిక్ = క్రొందళుకును; వెదచల్లగక్ =వ్యాపింపఁజేయఁగా, గద్గదఖిన్నకంఠియై=డగ్గుత్తిక చే సన్నగిల్లిన యెలుంగుగలదై, ఉత్తరపద్యముతోనన్వయము.

భా. చెలి యట్లచటివృత్తాంతము దెలుప దండతాడితభుజంగివోలె నేయి పోయ భగ్గని మండు భయంకరాగ్నిజ్వాలవలె లేచి కనులందైన యరుణకాంతి చెక్కుల వ్యాపించి కుంకుమరచితములగు మకరికాపత్రరచనలయందము నావహిల్లం జేయ డగ్గుత్తికచే నెలుంగు డీలుపడ నిట్లనెను.

విశే. సహజముగ సత్య మానిని, ఆపైఁ బ్రియుఁడు వేఱొకతెం గూడి యొల్లని చెడ్డయము తన్నుఁగూర్చి చేసెనేమో యని యపశకునములంబట్టి యనుమానించునది; ఇంకఁ జెలి పారిజాతప్రసూనచరితమును నామెమనం బెరియునట్లు విన్నవించినది. ఈవిన్న పము ప్రియకృతస్వవిషయకానిష్టము ననుమానించుచు నురగాంగనంబోలు సత్యకుఁ బాడనసదృశం బయ్యెను. అట్లే ప్రియుఁడు తన్నుఁగూర్చి యనిష్టము నొనర్చెనేమో యని యనుమానించుచు మండిపడునగ్నిహోత్రజ్వాలంబోలు సాత్రాజితి కివ్వార్త నేఁటివంటి దయ్యెను. ఆఁడుపామునకు సాహసమెక్కుడగుటను స్త్రీవిషయకోపము మగుటను, 'ఉరగాంగన, కీల' అను స్త్రీలింగపదములు ప్రయుక్తములయ్యెను. నారదప్రసంగమును, శ్రీకృష్ణునిచెడ్డయములును, రుక్మిణినటనలును సత్యకుఁ గన్నులనెఱుపు నావహిల్లఁ జేసె నని యెన్నవలయును. రోషముచే నారక్తనేత్రయయ్యె నని గ్రహించునది. చెలి చెప్పిన ప్రసంగము వినుటకతన, భయదుఃఖములు పెనఁగొనె ననియుఁ, దన్మూలమున డగ్గుత్తికచేఁ గంఠస్వరము క్షీణించె ననియు నెన్నఁదగును. మోము పైకెత్తి చూచి నచో దృష్టులు చెక్కులపైఁబడుట సంభవింపదు. కుంకుమరచనలభంగి నెఱ్ఱనిచూపు చెక్కుల నెలకొల్పు ననుటంజేసి మోము వాంచి దృష్టిని గ్రిందుగాఁ బ్రసరింపఁజేయుటను సూచించెడిని.

శా. ఏమేమీ! కలహాశనుం డచటికై యేతెంచి యిట్లాడెనా
యామాట ల్చెవి యొగ్గి తా వినియెనా యాగోపికావల్లభుం
డేమే మాడెను రుక్మిణీసతియు నీ వింకేటికిక్ దాఁచెదే
నీమోమోటలు మాని నీరజముఖీ! నిక్కం బెఱింగింపవే. 83

టీ. కలహాశనుఁడు = జగడమే భోజనముగాఁ గల నారదుఁడు, ఆగోపికావల్లభుఁడు=ఆప్రేతలమగఁడు, నీమోమోటలు=నీదాక్షిణ్యములు, నీరజముఖీ=పద్మమువంటి మోముగలదాన, నిక్కము=నిజము, ఎఱింగింపవే= తెలుపవే.

వ్యా-విశే. జగడమే తిండి గాన నాతఁ డట్లే యాడు నని 'కలహాశన' పదము సాభిప్రాయము. ముగ్ధ లగుగోపికలు గూడుగొల్లఁడుగాన నమ్మాట నాదరమున వినె నని గోపికావల్లభపదము సాభిప్రాయము. చెవియొగ్గి వినె ననుట యాదరాతిశయశ్రవణ సూచకము. చెలికాన, మో మోటమిఁ జెప్పుటకు జంకు నే మో యని సత్య యూహించి 'మో మోటమి మాని' అని పల్కె. ఏ మేమి.—సంభ్రమమున ద్విర్భావము. అచటి కై.—షష్ట్యర్థమునఁ జతుర్థి.

చ. అతులమహానుభావ మని యవ్విరిఁ దా నొక పెద్ద సేసి య
చ్యుతునకు నిచ్చకం బొదవ సూడిద యిచ్చిన నిచ్చోఁగాక తా
నతఁడు ప్రియంబు గల్గునెడ కర్పణ సేసినఁ జేసెఁగాక యా
మతకరివేలుపుందపసి మమ్ముఁ దలంపఁగ నేల యచ్చటన్? 84

టీ. అమ్మతకరివేలుపుందపసి=అమ్మాయావియైనసురమునిపసి, అతులమహానుభావము = సాటిలేని గొప్పప్రభావముగలది, అని = పల్కె, అవ్విరిన్ = ఆపుష్పమును, తాను, ఒక పెద్దచేసి=ఒకానొకగొప్పవస్తువుగానొనర్చి, ఇచ్చకము=ముఖస్తుతివలనిప్రేమ, ఒదవన్ = ఉద్భవించునట్లుగ, సూడిద=కానుక, ఇచ్చినన్ ఇచ్చోఁగాక = ఒసంగిన నొసంగనిమ్ము. తాను, అతఁడు=ఆశ్రీకృష్ణుడు, ప్రియంబు=ప్రీతి, కల్గునెడకున్ =ఉన్నచోటికి, అర్పణ= ప్రదానము, చేసినన్ చేసెఁగాక = ఒనర్చిన, నొనర్పనిమ్ము. అచ్చటన్ = ఆచోటను, మమ్మున్ =నన్నును, తలంపఁగ నేల=తలవ నేల.

భా. అవ్విరిని గొప్పవస్తువుగా వర్ణించి మహామహిమాన్విత మని యిచ్చకమునకై నారదుఁడు కృష్ణున కిచ్చునుగాక. ఆతఁడును దనకుఁ బ్రియమైనవారి కద్దాని నొసంగుఁ గాక. కాని యీమాయజడదారి మ మ్మేల యచ్చోఁ దలంపవలెను?

వ్యా-విశే. పుష్పమునందు అనాదరమును సూచింప ఒక పెద్ద చేసెనని యనెను. సవతిసంబంధ మగుపోరును నోటఁ బల్కుట గూడ నిష్టము గాకుండుటను చెలుపుటకై ప్రియంబుగల్గునెడ కని వాక్రుచ్చెను. స్వాభిమానాతిశయమును సూచింప 'మమ్ము' అని ప్రయుక్తమయ్యెను. "ఇచ్చిన నీవచ్చును, సమర్పణ చేసినఁ జేయవచ్చును. మమ్ముఁ దలఁప నేల." అనుపదములజాడంబట్టి తన్ను సవతిదరిని మాయజడదారి తలంచుటయే సత్య కమ్మాటిలో నెంతయుఁ గష్టముగాఁ దోఁచె నని తెలియును. 'అర్పణ సేసెను' అనుపదము గూడ సత్యాసూయను వెల్లడించును. మతకము + అరి. మతుబర్థకమున నరివర్ణకము. ములోపము. అర్పణ-చరిత్ర మున్నగువానికివలె దీనికిఁ బ్రకృతైకవచనలోపము కల్గెను.

క. పలుదెఱఁగుమొల్లమాటలఁ
గలహామె కల్యాణ మని జగంబులవెంటన్

పారిజాతహా-టీక—నీ

మెలఁగెడుమానికి సహజము
వల దని వారింప వలదె వల్లభుఁడతనిన్. 85

టీ. పలుతెఱఁగుమ్ల్లమాటలన్ = అనేకవిధములగుముడివెట్టు (కలహము పెట్టు) మాటలచేనైన, కలహమె=జగడమె, కల్యాణము = శుభము, జగంబులవెంటన్ =లోకములవెంటను, మెలఁగెడు=సంచరించెడు, మానికిన్ సహజము = స్వభావసిద్ధము. వలదు=వద్దు (కూడదు) అని, వల్లభుఁడు=పతియగుకృష్ణుఁడు, వారింపన్ =అడ్డు పెట్టుటకు, వలదె=యత్నింపవలదా.

భా. జగడములు పెట్టుచు లోకములం ద్రిమ్మరుట నారదునకు సహజము. విభుఁడగు శ్రీకృష్ణుఁడమ్మాటలఁ జెవియొగ్గి వినుట తప్పుగాదె? నాయెదుట నట్లాడరా దనిన నాతఁడాగతి నను నే? కాన నిందు శ్రీకృష్ణునిదే తప్పని భావము.

వ్యా-విశే. ఒకనిమాటకును వేలొకరిమాటకును ముడివెట్టుమాటలే ముళ్లమాటలని యెన్నవలయును. ముళ్లు.—ముడి+లు. ఇత్తునకు బహువచనంబు పరంబగునపుడుత్వంబగు. 'ముడులు'-బహువచనము పరమగునపుడు డ ల ట ర ల యుత్వమునకు లోపంబు బహుళంబుగా నగు; బహువచనశ్లిష్టంబులై యద్విరుక్తంబులైన డకార లకారంబుల కలఫు లకారంబు నిత్యంబుగా నగు. ముళ్లు. ఇందు 'జగంబులవేఁటన్' అను పాఠ మగపడు. అనఁగాఁ "గలహముఁవెట్టి లోకములఁ బీడింపఁగా" అనియైనను జెప్ప నొప్పు నని తోఁచెడిని. ముడి.—నానా. కలహము, బంధము. వలదు+ఎ. వలదె. వలయుధాతు వ్యతిరేకరూపము. రూ. అ. వలవదు.

క. మునియేమి సేయు? రుక్మిణిఁ
గొనఁగారణ మేమి? ధూర్తగోపాలుఁడు నే
సినచెయిద మేమి చెప్పుదు?
మన మెరియదె ప్రాణమైనమగఁడి ట్లయినన్. 68

టీ. ముని, ఏమి, చేయన్ = నారదుఁడేమి చేసెను. రుక్మిణిన్ =రుక్మిణీదేవిని, కొనన్ =నిందింపఁగా, కారణ మేమి=హేతు వేమి? ధూర్తగోపాలుఁడు=మోసకాఁడగు పసులకాపరి, చేసినచెయిదము = ఒనర్చినచేష్టను, మనము=మనస్సు, ప్రాణమైనమగఁడు=జీవమే యగుపతి, ఎరియదె = మండదె?

భా. నారదుఁడేమి చేసెను? ఆతనికిఁ గలహమె కల్యాణమగుట నాతనిపైఁ దప్పు మోపరాదు. శ్రీకృష్ణుఁడు పారిజాతము నొసంగెను గాన రుక్మిణి స్వీకరించెను. దాన నామెనుగూడ నీవిషయమున నిందింపఁ బనిలేదు. ఆడినమాటలఁ జెవియొగ్గి యాలకించుటయు, సుమము నద్దేవి కర్పణసేయుటయుఁ, గావించినయాపసులకాపరిసే నిందింప వలెను. ప్రాణమే యగుపతి యిట్లొనర్చిన మది మండకుండునా?

వ్యా-వి శే. మోసకాఁడును బసులకాపరియుఁ గావునఁ నే యీవిషయమునఁ నౌచిత్య ముఁ గనలేక పోయె నని ధూ ర్తగోపాలపదము సాభిప్రాయము. భార్య పతికర్ధశరీర యగుటను, దనశరీరము పతిశరీరార్ధమే యగుటను, భ ర్త భార్యకుఁ బ్రాణ మే యగును. ఈ పద్ధతి ననుసరించియే భ ర్త చనిన, భార్యయు నాతనితోఁ జనుట తొల్లింటియాచార మైయుండె.

క. పరికింపరు తమజాడలు
తరుణులతగులములు నమ్మఁ దగదంద్రు మదిక్
శరదంబుదచలచిత్తులు
పురుషులె పో వారి నమ్మఁ బోలునె చెలియా ! 87

టీ. పరికింపరు = పరీక్షింపరు, తరుణులతగులములు = యువతులయాసక్తులను, నమ్మక్ =విశ్వసింపఁగా, తగదు = కూడదు, శరదంబుదచలచిత్తులు=శరత్కాల మేఘముల వలె సంచలించుమనస్సుగలవారు, పురుషులెపో=మగవారలేసుమ్ము, పోలునె=తగునె ?

భా. మగవారు తమప్రవ ర్తనముల మంచిచెడ్డలపరీక్షింపరు. యువతులయనురాగ ముల నమ్మకూడ దంద్రు. ఇంతియఁకాని తమప్రవ ర్తనమునుబట్టియే యువతులప ర్తనమును నుండు ననుకొనరు. నిక్కముగ నాలోచింపఁ బురుషులే మిగులఁ జపలచిత్తు లనియుఁ, దాన వారి నేవిషయమునను విశ్వసింప రా దనియు, ముమ్మాటి కెంచవచ్చుఁ.

వ్యా-వి శే. పరికించు. ప్ర. పరీక్షించు. అనుదురు. అందురు. అంద్రు. అంద్రు. 'పో' 'పొమ్ము' అనుదానిరూపాంతరము. ఇయ్యది నిశ్చయార్థప్రకాశకము.

ఉ. ఇన్నిదినంబులుక్ సవతు లిందఱలోఁ గడు గారవంబునం
గన్నియ నన్ను వల్లభుఁడు కన్నులఁ గప్పుకొనంగ నుండి యా
వన్నెయు వాసియుం దఱిఁగి వారు నసుం దలలెత్తి చూడఁగా
సన్నలఁ జాయలం బలుక సైఁతునె ప్రాణము *లెంత తీపొకో ! 88

టీ. సవతులిందఱలోక్ = ఇందఱు సవత్తులలో, కడుగారవంబునక్ = మిగుల గౌరవమున, వల్లభుఁడు=ప్రియుఁడు, కన్నులక్ = నేత్రములందు, కప్పికొనంగక్ = మఱుఁగుపఱచికొనియుండఁగా, అంతటిగారాబమునఁ జూచికొనుచుండఁగా నని భావము. వన్నెయుక్ =అందమును, వాసియుక్ =ప్రసిద్ధియు, తఱిఁగి=తగ్గి, తలలు, ఎత్తి, చూడఁ గాక్, ఇది నిర్భయముగఁ జూచుటను దెలుపును. సన్నలక్ =సంజ్ఞలచేతను, చాయలక్ = జాడలచేతను, ప్రకృతవిషయమున కనుకూలించుగతిని వేఱొకవిషయమునుద్దేశించిపల్కు

* లింత తీపొకో,

టను జాయలఁబల్కుటగా నెన్నవలెను. పలుకక, సైఁతునె = సహింతునె? ప్రాణములు ఎంత తీపు ఒకో?=ప్రాణము లెంతమధురములోగదా.

భా. ఇంతకాలము వల్లభుని బలువాల్లభ్యమునకుఁ బాత్రమనై యాతఁ డతి గారాబమున ననుఁ జూచుకొనుచుండ సవతులెల్లరలో ఖ్యాతిం గాంచితి. ప్రకృతము నన్ను విభుఁ డిట్లవమానించుట వారు నిర్భయముగ ననుఁ గాంచి యాంగికములగు సంజ్ఞలచేతను, గాకిమోఁదను బిచ్చుకమోఁదను బెట్టి నన్ను నిందింతురు. ఇట్టి యవమాన మును నట్టి ఖ్యాతిని గాంచిననేను వన్నెవాసులు తఱుఁగ నెట్లు సహింతును? ప్రాణము లపై మక్కువ యెక్కువ వగుట విడువనైతినిగాని లేకున్న నిపుడె విడిచియుందును.

వ్యా-విశే. సవతి. వి. సపత్ని. ప్ర. గారవము. వి. గౌరవము. ప్ర. కన్నియ. వి. కన్య. ప్ర. రూ. అ. కన్నె. వన్నె. వి. వర్ణము. ప్ర. రూ. అ. వన్నియ. సన్న. వి. సంజ్ఞ. ప్ర. చాయ. వి. ఛాయ. ప్ర. సైఁచుధాతుసంబంధమగు లాడర్థకోత్తమపురుషైకవచన రూపము. సైఁతును. సైఁచు + దు + ను. చువర్ణంబుతోడి దుగ్దకారము తకారంబగు రూ. అ. సయిఁచు. ప్రాణము లెంతతీపొకో.—ఒకోక్, ఒకో, ఒకొ - ఇవి సందేహార్థముం దెలుపునవ్యయములు. సత్యభామామానాతిశయమును 'సైఁతునె' ప్రాణము లెంతతీపొకో అనుపదములు సూచింపఁజాలియున్నవి.

ఉ. నామొగమోటకై *వలనినాటకముల్ గటియించి రుక్మిణీ
కామినిమోఁదటం గలుగుగౌరవముం గృపయుం బ్రియంబుఁ దా
నేమియుఁ గాననీక యిట నిన్నిదినంబులు నన్నుఁ దేల్చె నో
తామరసాక్షి! మెచ్చవలదా మురదానవభేదికృత్యముల్. 81)

టీ. ఓతామరసాక్షి=ఓతమ్మికంటీ! నామొగమోటకై=నామోమోటకై, వలని నాటకములు = అక్కఱలేనివర్తనములను, గటియించి = కూర్చుకొని, రుక్మిణీకామిని మోఁదటన్=రుక్మిణీకాంతపై, కలుగుగౌరవమున్ = ఉన్నగారవమును, కృపయున్ = దయయు, ప్రియంబును=అనురాగమును, తాను, ఏమియున్ =కొంచెమైనను, కాననీక = కనుపడనీక (ప్రకాశము గానీక), ననున్, తేల్చెన్=ఉబ్బఁజేసెను. (సంతోషపెట్టెను.) మురదానవభేదికృత్యముల్ = మురాసురునిఁజంపిన యాశ్రీకృష్ణునికార్యములను, మెచ్చ వలదా=శ్లాఘింపవద్దా? ఆతనికుశలవర్తనమున కెంతయు మెచ్చుకొనవలె నని భావము.

భా. నామోమోటకై యెన్నెన్నో నటనలం గనుపఱచి తనకు రుక్మిణిపైఁగల యాదరమును, దయను, ననురాగము నిసుమంతైనఁ ప్రకాశము గానీక యిచ్చోఁ నిన్ని

---

* వలయునాటకముల్ ; వలసినాటకముల్,

దినంబులు నను సంతోషపెట్టెను. ప్రకృత మిట్లొనర్చెను. కావున, నాతని నైపుణవర్తనము లెంతయు శ్లాఘ్యములు.

వ్యా-విశే. 'వలయునాటకములు' అనియు వలసి అనియుఁ బాఠాంతరము లగపడును. 'వలయునాటకములు=కావలసినవర్తనములు, ఆవశ్యకములగు ప్రవర్తనము లనిభావము. 'వలసి=కావలసి, నామొగమోటకై కావలసి, యనఁగా, నామొగమోటకై యావశ్యకమగుటచే నని భావము. 'వలని=ఉపాయముతోడి' అనియు 'వలని' అనుపాఠమున కర్థము చెప్పనగు. 'రుక్మిణీకామిని' అనుపదము ప్రియసంగమమం దత్యాదరము గలపడఁతి కామిని యగుట సవతిని నిందించుటకును, శ్రీకృష్ణున కామెయందలి యత్యనురక్తిని సూచించుటకును నిల్పఁబడినది. గటియించి. ప్ర. ఘటియించి. ఈక.— ఇచ్ఛాధాతుసంబంధ మగు వ్యతిరేకార్థకకజిరూపము.

ఉ. ఓచెలి! శౌరి కిచ్చె నఁట యొక్కలతాంతము దెచ్చి నారదుం
డాచపలాక్షి కిచ్చె నఁట యాతఁడు నవ్వరి యిట్టిమాట లా
హా! చెవుల న్వినంబడియుఁ బ్రాణము దాల్చెద మేన నింతగా
నోఁచితి నింక నెట్టివి కనుంగొన నెమ్మెయి నున్నదాననో? 70

టీ. లతాంతము=పుష్పము, లత తుదినుండునదిగాన నీపేరన్వర్థము. అవ్వరిక్ = ఆకుసుమమును, ఆచపలాక్షికిక్ =ఆలోలనేత్రకు, ఇట్టిమాటలు, ఇట్టి విన సహింపనికష్టపుఁబల్కు లని భావము. మేనక్ =శరీరమున,ప్రాణములు=జీవముల(అసువుల)ను,తాల్చెదక్ = ధరించెదను, ఇంతగాక్ =ఇంతటియవమానము సంభవించునట్లుగా నని భావము. నోఁచితిని=నోమునోచితి ననుట. ఇంకక్ =మీఁదను, ఎమ్మెయిక్ =వివిధముగా, ఎట్టివి = ఎట్టిపరాభవములను, కనుంగొనక్ =కాంచుటకు,ఉన్నదాననో=జీవించియున్నదాననో.

వ్యా-విశే. ఆ+వరి=అవ్వరి. ఆహా.—సంతాపసూచకావ్యయము, మేనునన్.— ద్వితీయావిభక్తికముల తృతీయాసప్తముల కత్వం బాదేశంబగు. 'మేనక్', చెవుల వినంబడియుఁ బ్రాణము తాల్చెద. మేన-అనుటంజేసి చెవులఁబడఁగానే ప్రాణముల విడువవలసిన దనియు, 'ఇంక నెట్టివి కనుంగొన నున్నదాననో' అనుటంజేసి యింతకు మించిన యవమానము లెన్ని కలుగునో యనియు, నవ్వాని ననుభవించుటకే జీవించియున్నదాన ననియును, 'ఇంతగా నోఁచితిని' అనుటంజేసి నానోములఫల మింతే యనియును నర్థములు స్ఫురించును. వీనిమూలమున సత్యభామాసంబంధ మగు కొలఁదిలేనిమానినీత్వము ప్రస్ఫుటమగుచున్నది. ఓచెలి, ప్రాణేశుఁడు, పతి మున్నగుపదముల వాడక దీనిని వాడుట యనాదరసూచకము.

క. పూనుకొని మేలుగీళ్లకు
లోనయి విహరించువారి లోక మెఱుఁగదో
యానరకాసురదమనుఁడు
దా నెఱుఁగఁడో భోజకన్య తా నెఱుఁగదొకో. 91

టీ. పూనుకొని=యత్నించి (శ్రద్ధవహించి), మేలుకీళ్లకున్ = మేలునకును గీడు నకును, లోనయి=లోఁబడి, విహరించువారిన్ =సంచరించువారిని, లోకము = జనము, ఎఱుఁగదో=తెలియదో? ఆనరకాసురదమనుఁడు=ఆనరకాసురునిమర్దించిన శ్రీకృష్ణుఁడు, భోజకన్య=రుక్మిణి (భోజునికూఁతురు.)

భా. ఎవరు మేలుచేయువారో యెవరుకీడుచేయువారో యెవ రేరీతిగ నెవరి విషయమున నుపకారబుద్ధిని బ్రవర్తించిరో యపువిషయములు లోకు లెఱుంగుదురు. మఱియు నేను మేలు సేయుదానినో కీడొనర్చుదానినో యనుసంశ మానరకాసురహంత శ్రీకృష్ణుఁ డంతయు నెఱుంగు. ఆభోజసుతయుఁ బూర్ణముగ నెఱుంగును. నే నేల వాని నిపుడు పేరొక్కనవలెను?

విశే. ఇందు 'నరకాసురదమనుఁడు, భోజకన్య' అనుపదములు సాభిప్రాయములు. నరకాసురసంహారసమయమునఁ దాను శ్రీకృష్ణునకుఁ గడుంగడుఁ దోడ్పడి మేలుకూర్చుటయు, నట్టియదనున క్షత్రియకన్య రుక్మిణి యిటఁ గూర్చుండి తోడ్పడకుంటయును సూచించుచు, సత్య రుక్మిణి నెత్తిపొడుచుచున్నది. మఱియుఁ గృష్ణుఁడును నంత్రమాత్ర మెఱుంగక నేఁడు వర్తించినవాఁ డగుట, నైనవారి కాకులలోను, గానివారికిఁ గంచములలోను బెట్టుమన్న సామెతను జ్ఞప్తికిం దెచ్చుచుఁ, దనపతి దగుచేసిన మేలును మఱిచుటను నజ్ఞతను బ్రకాశింపఁజేసినది. ఇందలి 'తాను' పదములు నామపునర్గ్రహణంబున నామకుఁ బరముగ నభిహితము లయ్యె.

ఉ. ఆసరసీరుహాక్షినిలయంబునఁ బంకజనాభుఁ డుండుటం
జేసి యొసంగెఁ బో తగవు సేకొని యొక్కలతాంత మింతలో
వాసియు వన్నెయుం దగవు వైభవముం జలము న్వివేకమున్
బో సవతు ల్భజించుటకుఁ బో వెఱఁగయ్యెడు నేమిసెప్పుదున్. 92

టీ. ఆసరసీరుహాక్షినిలయంబునన్ =ఆతమ్మికంటియింట, పంకజనాభుఁడు=పద్మము బొడ్డునఁగలవాఁడు, ఉండుటంజేసి=నివసించుటచేత, తగవు=ఔచిత్యము (తగుట), చేకొని=పట్టి, ఒసంగెఁబో = ఇచ్చెనుజుమ్ము. ఇంతలోన్ =ఈపాటినిషయమునకై, వాసియున్ =గొప్పఁదనమును, వన్నెయున్ =అందమును, తగవున్ =ఔచిత్యమును, వైభవ

మున్ =ప్రాభవమును, చలమున్ = పంతమును, వివేకమున్ = యుక్తాయుక్తజ్ఞానమును, పోన్ =నశింపఁగా, సవతుల్ =సపత్నులు, భజించుటన్ =సేవించుటకై, పోన్ = వెళ్ళుటకు, వెఱఁగు=ఆశ్చర్యము, అయ్యెడున్ =పుట్టెడును.

భా. శ్రీకృష్ణుఁ డత్తమ్మికంటియింట నపు డుంట నక్కుసుమము చిన్నవోవు నని యాచితిం బాటించి యామె కొసంగెను. ఇట్టిస్థితిలో నింతమాత్రమున సవతులు తమ యున్నతిని, వైభవమును, మానాదులను నీటఁ గలిపి యామెను సేవింపఁ బోవుట యేలొకో తెలియకున్నది. పూవు నామె కొసంగుట నా కంతవింతగఁ దోఁపదు కాని, వీ రామెను సేవింపఁ బోవుటమాత్ర మచ్చెరువుం జేసెడును. సత్యతోడిచేడియ లట్లా మెను సేవింపఁ బోవుటను నీచకృత్యముగా నిం దెన్నెను. శ్రీకృష్ణుఁ డొనర్చినదానిం దగ వనెను.

వ్యా-విశే. ఉండుటం జేసి.—కొన్నియెడలఁ జేతవిభక్త్యర్థకవర్ణకంబునకును వలన వర్ణకంబునకును దఱిచుగఁ జేసి యనుప్రయుక్తమగు. 'ఉండుటను' అనుద్వితీయ తృతీయా విభక్త్యర్థమగుటచే దీనికి 'చేసి'అనునది యనుప్రయుక్తమయ్యెను. ఇచ్చెనుబో.—పోఁ:-పొమ్మునకు రూపాంతరము. ఇది నిశ్చయానాదరములం దెల్పుచుఁ బదములమీఁద నగును.

క. కలకాల మొక్కగతిఁ బూ
సలలో దారంబుమాడ్కి సతిమదిలోనన్
మెలఁగెడు *పురుషుఁడు గలుగుట
తొలుజన్మమునోముఫలము తోయజనేత్రా! 93

టీ. కలకాలము=ఎల్లపుడును, ఒక్కగతిన్ =ఒక్కరీతిగా, దారంబుమాడ్కిన్ = దారమువలె, సతిమదిలోనన్ = పతివ్రత యగు వనితమనస్సులో, మెలఁగెడు = సంచరించెడు, పురుషుఁడు=మగవాఁడు, కలుగుట = సంభవించుట (స్త్రీకి మగఁ డగుట) తొలుజన్మము నోముఫలము=తొలిపుట్టువునఁ జేసిన వ్రతమునకు ఫలము.

భా. సర్వదా తన్నెడఁబాయక తనమనస్సును దనయధీనము గావించుకొనం గలుగుపురుషుఁడు తొల్లింటిపుట్టువున నెన్నియోనోములు నోచినంగాని యూఁడుదానికి మగఁ డుగ దొరకనేరఁడు. అనఁగా ననుకూలుఁ డగుభర్త స్త్రీకి దుర్లభుఁ డని భావము.

విశే. 'పూసలలో దారము, తలలో నాలుక,' అనుపదములు నిరంతరసంబంధ సూచకములు. వనిత మది కెక్కినపుడే పురుషుఁ డుత్తముఁడును, నాయికానురాగ పాత్రుఁడును నగును. మఱియు నట్లు తనమదికి నచ్చినమగఁడు సంభవించినపుడే వనిత

---

* పురుషులు.

పతివ్రతయుఁ నాసతిపాతివ్రత్యము పొగడ్తం గనుటయుఁ బొసఁగును. కావున నిక్క
ముగ నీరెండును సతీపతుల నుత్తములుగఁజేయు నుత్తమకృత్యము లనకతీరదు. ఈరెండును
లోకమున నొక్కచో నుంట దుర్లభము. ప్రకృతము కొంతకాలము కృష్ణుఁడు సత్య
మదిలో మెలంగఁగలిగెను గాని, నేటిపారిజాతకుసుమవృత్తాంతముకతన నది పొసఁగ
దయ్యెను, దాన నొక్కగతిఁ గలకాలము మెలఁగుట యని సత్య యనవలసివచ్చెను.
'పురుషులు' అని బహువచనపాఠ మగపడు, అద్దానికి సారస్యము చింత్యము. లేదా
'సతి' అనునది 'స్త్రీణము' అనునర్థమున జాత్యేకవచనముగఁ బ్రయుక్తమయ్యెనని
తలంపవలసియుండును. పతివ్రతయగుమానిని తనమదిని నితర మెవనిస్మరించు, వాఁడే
యుత్తమపురుషుఁ డని తెలుప సతిపదము ప్రయుక్తము. మఱియు సత్యయే తన్మూలముగఁ
దనసతీత్వమును వెల్లడించె ననియుఁ దోఁచెడిని.

సీ. కలలోన నైన నవ్వుల కైన నామాట
జవదాఁట వెఱచునో చంద్రవదన!
యేపదార్థంబు నాయెదుటఁ బెట్టక మున్న
యెవ్వారి కొసఁగఁడో యిగురుఁబోఁడి!
చెలులు నాతో నేమి చెప్పుదురో యని
లంచంబు లిచ్చు నోచంచలాక్షి!
తోడిచేడియలు నాతోడివంతులకు రా
సయిరింపఁజాలఁ డోసన్నుతాంగి!

తే. యరమరలు లేనికూరిమి నఁగి పెనఁగి
కొదలు దీఱనికోర్కులఁ గూడి మాడి
కపట మెఱుఁగనిమమతలఁ గలసి మెలసి
యున్నవిభుఁ డిట్లు సేయునే యోలతాంగి! 94

టీ. ఓచంద్రవదన=చంద్రబింబమునుబోలు మోముగలదాన, కలలోనైనను =
స్వప్నమునైనను, నవ్వులకైనన్ =పరిహాసములకైనను, జవదాఁటన్ =అతిక్రమింపఁగా,
వెఱచున్ = భయపడును, ఏపదార్థంబున్ =ఏవస్తువును, పెట్టక మున్న=ఇడక ముందు,
ఒసఁగఁడు = ఈఁడు, ఇగురుఁబోఁడి = చిగురువలెమనోజ్ఞయైనదాన, లంచంబులు =
తనపనిం జక్కఁబెట్టుకొన నొరునకు రహస్యముగా నొసఁగుధనాదికమును, తోఁడిచేడి
యలు = సవతులు, వంతులకున్ = సామ్యములకు, (భాగములకు ననియైనఁ జెప్పనగు)
అరమరలు=సందియములు లేక భేదములు, కూరిమిన్ =చెలిమితో, అనఁగి పెనఁగి=కలసి
మెలసి, కొదలు=కొఱంతలు, తీఱని = పోనట్టి, (కొఱంత లింకను గల్గినట్టి వనిభావము.)

'అనఁగిపెనఁగి, కూడిమూడి, కలసిమెలసి' జాతీయములగు నీజంటలు సమానార్థకములు. కపటము=కైతవము, మమతలన్ = అభిమానములతో, చేయునే = చేసెనే?

వ్యా-విశే. పూర్వపద్యమునఁ జెప్పినచొప్పున విభుఁడు తనమదిలో మెలఁగుట నిందు సత్య సూచించుచుఁ, బ్రకృతమున కనుకూలించుగతిని బ్రసంగించెను. స్వప్నమునఁ గూడ నవ్వులకైనఁ దనమాట మీఱి వెఱచువాఁడు నేఁడు వెఱపించుకేని లేక మెలఁగుటకును, నేపదార్థమునైనను మున్నుగఁ దనముం దిడి యితరుల కొసఁగువాఁడు నేఁడు తన ముందు మున్నుగఁ బారిజాతము నిడక రుక్మిణి కొసంగుటకును, జెలు లేమి చెప్పుదురో యని లంచము లొసంగునాతఁడు నేఁడు తనచెలి యెదుట నుండఁగనే యట్లు ప్రవర్తించుటకును, దోడిచేడియలు వచ్చుటకు వచ్చునపుడు సైరింపనివాఁడు నేఁడు రుక్మిణీసతిం బెద్దగాఁ దలఁచి పారిజాతసుమప్రదానమున సంభావించుటకును, సెంతయు ననురక్తుఁ డగుపతి యభిమానముఁ బోఁద్రోచి తన్నును, తనయం దితఁ డపూర్వము గలయనురాగమును మఱచి యట్లు సవతి కధీనుఁ డగుటను సత్య యాశ్చర్యమునం దె నని గ్రహించునది. ఇందుఁ జెప్పినచొప్పున మెలంగుపురుషుఁడు సతికి మదిలో మెలంగువాఁడు గాక యన్యుఁ డెట్లు కాఁజాలును? చేయుఱ + ఏ=చేయునే: తద్ధరార్థకము త్రికాలవాచి యగు. తోడిచేడియలు, తోడఱ + చేడియలు 'తోడఱ' ఇది యపద మని యనఁగాఁ బ్రత్యయము లోనగున దని శబ్దరత్నాకరము. దీనికిఁ బ్రత్యేకప్రయోగము గల దని ప్రౌఢవ్యాకరణము. సమాసమునఁ జేత తోడ వలనల కిత్వం బగు; అనుపద్ధతిని నిత్యము గలఁ గె. కూడిమూడిశబ్దపల్లవము. సమసుఖదుఃఖాను భవమర్థము.

సీ. కృతకాద్రికందరాకేళీనిగూహనవేళా[1]పరస్పరాన్వేషణములు
పోషితమాధవీపున్నాగపరిణయోత్సవకల్పితానేకసంభ్రమములు
చాతురీనిర్జితద్యూతపణాదాన కలితచేలాంచలాకర్షణములు
సాయంసమారంభచక్రవాకద్వంద్వ విరహావలోకన[2]విభ్రమములు

తే. సాంద్రతరచంద్రికా [3]కేళిచంక్రమములు
విభుశిలామయవేదికావిశ్రమములు
ఫలకచిత్రితనిజరూపభావనములు
మఱచెనో కాక రుక్మిణిమాయఁ దగిలి. 95

టీ. కృతకాద్రి..... న్వేషణములు-కృతక = కృత్రిమము (మనుజనిర్మితము) లైన, అద్రి=కొండలయొక్క, కందరా=గుహాలయందలి, కేళీ=ఆటలయంలైన, నిగూ

1. పరస్పరావేల్లనములు. 2. విహరణములు. 3. వళీ.

హాన=దాఁగుటలయొక్క, వేళా=సమయములందలి, పరస్పరాన్వేషణములు = అన్యోన్యము వెదకికొనుటలు. (అనఁగా నాగుహలందు దాఁగుడుమూఁత లాడుకొనునపు డొకరి నొకరు వెదకికొనుచుండి రనుట.) పోషిత.....సంభ్రమములు-పోషిత = పెంపఁబడిస మాధవీ=బండిగురువిందలతకును, పున్నాగ = సురపొన్నవృక్షమునకును నైన, పరిణయ= పెండ్లియొక్క, ఉత్సవ=వేడుకలందు, కల్పిత=చేయఁబడిన, సంభ్రమములు=వేగిరపాటులును (మాధవీపున్నాగములఁ బెండ్లివేడుకలందలి సంభ్రమకృత్యము లనుట) చాతురీ... ...కర్షణములు-చాతురీ=నైపుణిచే, నిర్జిత=గెలువఁబడిన, ద్యూతపణ = జూదమునకై యొడ్డిన పందెపుధనముయొక్క, ఆదాన=పరిగ్రహవిషయమున, కలిత=ఒనర్పఁబడిన, చేలాంచల=వస్త్రపుకొనలయొక్క, ఆకర్షణములు = లాఁగికొనుటలు. (పందెపుధనమును బడయఁ జేల చెఱఁగునుబట్టి నిర్బంధించుకొనుట యనుట.) సాయంస.....విభ్రమ ములు-సాయంసమారంభ = సాయంకాలారంభమునందైన, చక్రవాకద్వంద్వ=జక్కవక వలదగు, విరహ=వియోగముయొక్క, అవలోకన = చూచుటయందలి, విభ్రమములు= విలాసములు, (అనఁగా: జక్కవజంటలు భావివియోగమునకై పరస్పరముఁ గలసిమెలసి చింతించుచుఁ దమిఁదీర్చుకొనుచుండ వానిని సానురాగమునఁ గనుచుండి రనుట) సాంద్ర తర.....చంక్రమములు-సాంద్రతర = మిగులఁదఅచగు, చంద్రికా=వెన్నెలయందైన, కేళి=ఆటలయందలి, చంక్రమములు = దాఁటుటలు. (అనఁగాఁ బండువెన్నెలలఁ దిరుగు డాటల నాడుకొనుచుండి రనుట) విధుశిలామయవేదికావిశ్రమములు = చంద్రకాంత శిలాప్రచురమైన యరుఁగులందలి కూర్చుండుటలు, ఫలకచిత్రితనిజరూపభావనములు = పలకయందు వ్రాయంబడిన తమతమరూపముల ధ్యానించుటలు, (అనఁగాఁ దమరూప ముల ఫలకమునఁ జిత్రించి యాబింబములు లెస్సగ నందముగఁ జిత్రితములైనవో లేవో యని సవిలాసముగ నరయుచుండి రనుట) రుక్మిణీమాయా=రుక్మిణిసంబంధమగుమాయ యందు, తగిలి=చిక్కి, మఱచెనో కాక = విస్మరించియుండునో కాక.

విశే. 94-వ సీసపద్యపుగీతమునందలియర్థ మీపద్యమున విపులీకరించి వర్ణించి కవి అరమరలులేనికూర్మిని, కొదలుతీఱనికోర్కిలను, కపటమెఱుఁగనిమమతలను విశదీక రించినాఁడు.

క. పతి ప్రాణసదృశబంధువు, పతి దైవం బేడుగడయుఁ బతి సతులకు న
ప్పతియకడు మేర దప్పిన,గతి కులకాంతలకు వేఱు గలదే చెపుమా.

టీ. పతి=భర్త, సతులకున్ = పతివ్రతలగుస్త్రీలకు, ప్రాణసదృశబంధువు=ప్రాణ ముతో సమానమైనచుట్టము, పతి, దైవంబు=దేవుఁడు, ఏడుగడయున్ = రక్షకుఁడును,

అప్పతియ=అట్టిభ ర్తయే, కడుక్ =మిక్కిలి, మేర=హద్దు, తప్పినక్, కులకాంతలకుక్ = కులపాలికలకు, వేఱు=మఱియొక, గతి=త్రోవ, కలదే=ఉన్నదా?

భా. వనితలకుఁ బ్రాణమువంటిచుట్టమును దేవుఁడును సప్తవిధరక్షకుఁడును నగు భ ర్తయే తాను గానిమార్గముపట్టి జాయను గారించిన నింక నాసతికి వేఱొకగతి లే దని భావము.

విశే. ఏడు + కడ=స ప్తవిధమగుదిక్కు 'గురువు, తల్లి, తండ్రి, పురుషుఁడు, విద్య, దైవము, దాత,' అని స ప్తప్రకారము గలరక్షకము. ఇందు సత్య తనకులకాంతాత్వ మును బ్రశంసించికొనినది.

క. ధన మిచ్చి పుచ్చుకొన్నను
మనమున నోర్వంగ వచ్చు మగఁ డింతులకుక్
జన విచ్చి పుచ్చుకొన్నను
మన వచ్చునె యింక నేటిమాటలు చెలియా! 97

టీ. ఓర్వంగక్ =సహించుటకు, వచ్చుక్ = వీలగును, చనవు=అనురాగమును లేక చెల్లుబడిని, మనక్ =జీవింపఁగా, వచ్చునె=వీలగునె.

వ్యా-విశే. ఓర్వక్ + కాక్, ఓర్చు + నుజి 'ఆగమాన్యచకారముల కద్విరు క్తము లకు ముత్తు పరమగునపుదు ప వ ల గు'. 'ఓర్వన్' 'కాన్' అగు + ను, అగునకు ననుకను లకు ముజ్జీత్తులు పరములగునపుడు కానాకానలు విభాషనగు, నుజ్యంతంబగు నగుధాతువు క్రియావిశేషణంబులకగు. ఓర్వఁగాన్. రూ. అ. ఓర్వంగాన్. తనకొసంగిన యను రాగము లేక చెల్లుబడి రుక్మిణికి పారిజాతప్రసూన మొసంగి తన్ను క్రిందు సేయుట కతనఁ గృష్ణుఁడు పుచ్చుకొన్నయట్లే సత్య భావించె నని గ్రహింపవలయును.

క. అని వగల మిగులఁ బొగులుచు, జనితామర్ష మునఁగోపసదనంబునకుక్
జనియెను లతాంగి హరిచం,దనకోటరమునకు నాగతరుణియుఁబోలెన్.

టీ. వగలక్ =దుఃఖములచే, మిగులక్ =కడుక్, పొగులుచుక్ = పరితపించుచు, లతాంగి=అతివఁబోఁడి, జనితామర్ష మునక్ = పుట్టినకోపముతో, కోపసదనంబునకుక్ = క్రోధాగారమునకు, హరిచందనకోటరమునకుక్ = పసుపువన్నెగల చందనవృక్ష సంబంధమగుతొఱ్ఱికు, నాగతరుణియుఁబోలెక్ = ఉరగయువతివలె (ఆఁడుపామువలె) చనియెను.

విశే. పురుషనాగముకన్న నాఁడుపాము మిగుల నుద్ధతి కర్హయుండునఁట. అందును భ్రాయమునన్న నాఁడుపాముమాట చెప్పనేల? ప్రకృతము తరుణి సత్య

పారిజాతసుమవృత్తాంతశ్రవణమునఁ గగ్గినక్రోధావేగముకతన నాగతరుణిం బోలి యున్నది. సర్వములకుఁ జందనవృక్షకోటరములు నివాసమున కెంతయుఁ బ్రీతిదాయకములు. అచటి గంధమునకు లోనై యయ్యు వచ్చో నివసించు. ప్రకృతము సర్వాంగనంబోలు సత్యకు సర్వాంగనకు చందనకోటరముబలెఁ గ్రోధాగారము సంప్రీతిదాయకమయ్యెను. మఱియుఁ జందనగంధఘ్రాణమువలన సర్వమున కుద్ధతి హెచ్చుగు. అట్లే సత్యకును క్రోధాగారవాసము పరితాపాద్యావేగమునే కగ్గించు నని తేలుచున్నది. క్రోధాగారము రాజగృహములఁ బ్రత్యేకముగ నిర్మితమై యుండు నని కావ్యాదుల వలనఁ దెలియుచున్నది. ఇందు స్త్రీలే కోపమువచ్చినపుడు వానియందు వసింతు రని తెలియవచ్చెడును గాని, పురుషులు నివసించియుండునట్లు తెలియరాదయ్యెను. స్త్రీలు గూడ భర్తలపై నలిగినపుడే యందు వసించుట కన్పట్టును గాని, యొండొకతఱి నున్నట్లు గానరాదు. కోపము కల్గునపుడు పరిజనము తమస్వామినికిఁ గోపము కగ్గినట్లు పోల్చుట కిది యొకచిహ్నము. హరిచందనపదమునకుఁ గల్పవృక్ష మనునర్థమును నొప్పియుంట భావిసత్యాకల్పవృక్షసమీపగమనము ధ్వనిత మగుచున్నది. అలం. ఉపమ. ముద్ర.

ఉ. మాసినచీర గట్టికొని మానముతోడ నిరస్తభూషయై
వాసెనకట్టు గట్టి నిడువాలికకస్తురిపట్టు వెట్టి లో
గాసిలి చీకటింటికడ కంకటిపై జలదాంతచంద్రరే
ఖాసదృశాంగి యై పొరలె గాఢమనోజవిషాదవేదనన్. 91

టీ. మాసిన=మలినమైన, నిరస్తభూషయై=త్రోసివేయఁబడిన నగలు కలదై, వాసెన కట్టు=వాసెనగుడ్డకట్టువంటికట్టు, తలచుట్టును నొకగుడ్డ బిగించికట్టె నని భావము, నిడువాలికకస్తురిపట్టువెట్టి = వెడలుపైన దీర్ఘమైన కస్తూరిపూఁతనుబూసి, తలనొప్పి కలుగునపుడు నొసటవేయుఁ బట్టువంటిపూఁత. లోగాసిలి=మదిశ్రమనంది, చీఁకటింటికడకంకటిపైన్=చీఁకటింటికొననున్నమంచముపై, జలదాంతచంద్రరేఖాసదృశాంగియై-జలద=మేఘముయొక్క, అంత=నడుమనుండు, చంద్రరేఖా=చంద్రరేఖతో, సదృశ = తుల్యమైన, అంగియై=శరీరముగలదై, గాఢమనోజవిషాదవేదనన్=తీక్ష్ణమైన మన్మథదుఃఖము వలని బాధచే, మానముతోడన్=మూకీభావముతో, పొరలెను=దొరలెను.

భా. మాసినచీరను గట్టి, యాభరణములనెల్లఁ దీసివైచి, తలకువాసెనకట్టునుగట్టి, తలనొప్పిని సూచించుటకై వెడఁదనిడుపుకస్తూరిపట్టు వెట్టి, చీకటింటికడ నున్నమంచముపై మేఘాచ్ఛాదితచంద్రరేఖంబోలి గాఢమన్మథవేదనం బొరలుచుండెను.

వ్యా-విశే. చీకటి + యిల్లు + కడ=చీకటింటికడ, ఔపవిభక్తిక మగుటంజేసి 'యిల్లు' శబ్దమునందలి 'ల్లు' అనుదానికి 'ంటి' ఆదేశమయ్యెను. (సమాసమున) 'ఔపవిభక్తిక

Acc NO : 36.



వర్ణాష్టంట్యాదయో భవంతీహ, రుల్వాదేర్నామ్నాంస్యుస్తేహివిభక్తా సమానే చ' అను చింతామణిసూత్రము ననుసరించి యీపవిభక్తికములు సమాసమునంగూడఁ గల్గునని తెలియుచున్నది. అమర్షవశమునఁ దాల్చినవేషమునకుఁ జంద్రరేఖాసదృశాంగి యయ్యె ననియుఁ, జీకటింటనుంట జలదమధ్య చంద్రరేఖంబోలె ననియు నెన్నవలయును. అలం. ఉపమ. మగనిపై నలుకఁబూనినమానిని యొనర్చుకృత్యము లిందు సహజముగ వర్ణితములు.

చ. బిసరుహపత్రలోచనకుఁ బెల్లగుమోహము సంఘటిల్లె వె
క్కసమగు నెవ్వగల్వొడమెఁ గంపము పుట్టెఁ జెమర్చె మేను మా
నసమున విన్నఁబాటొదవె నాఁటుఁ గడుం బరితాపవేదనల్
మసకపుఁబౌముకాటుగతి మచ్చరమన్విస మగ్గలింపఁగన్. 100

టీ. బిసరుహపత్రలోచనక్ = ఆపద్మదళాక్షికి, పెల్లు = అధికము, అగు, మోహము, సంఘటిల్లెక్ = కల్గెను. వెక్కసమగు=సహింపరాని, నెవ్వగల్ =పూర్ణమైన దుఃఖములు, పొడమెక్ =పుట్టెను, కంపము = అంగచాంచల్యము, పుట్టెను=సంభవించెను, మేను=శరీరము, చెమర్చెక్ =చెమ్మటపట్టెను, మానసమునక్ =మనస్సులో, దీనికి 'పరితాప వేదన కలిగె' అనుదానితో నన్వయము. విన్నఁబాటు=వైవర్ణ్యము, ఒదవెక్ =సంభవించెను, పరితాపవేదనల్ =సంతాపమువలనిబాధలు, నాఁటెక్ =గ్రుచ్చుకొనెను, మసకపుఁబౌము కాటుగతిక్ -మసకము = సంభోగేచ్ఛ యను, పాము=సర్పముయొక్క, కాటుగతి = దంశనవశమున (కఱచుటచే నని భావము) మచ్చరమన్విసము = మాత్సర్యమను విషము, అగ్గలింపఁగాక్ =అధికముగ, విష మగ్గలించుటకతనఁ బైని నిరూపించినకార్యములు కల్గె నని యెన్నవలయును.

వ్యా-విశే. మసకము + పాము=మసకపుఁబౌము. రూ.అ.మసకపుంబౌము. నెఱ + వగ-నెవ్వగ, 'మానసము' అనుదానిని దూరమున నున్న 'పరితాపవేదనల్' అనుదానితో నన్వయించుటకన్న 'చెమర్చె మేను మానసమున విన్నఁబాటొదవె' అను పాఠమును గ్రహించి మొగమున వైవర్ణ్యమొదవె ననుట సరసమని మోఁచెడిని 'మచ్చరమన్విసము' అనుచో రూపకము కన్పట్టుటంజేసి తదనురూపముగ 'మసకపుఁబౌము' అనుచోఁగూడ 'సంభోగేచ్ఛయనుపాము' అని యర్థముసేయుటయే యుచితము. కామమోహిత మగుపా మని యర్థముచేసిన నుత్తరమున నున్న 'మచ్చరమన్వి' మనురూపకము నిరాధార మగును. కంపము, స్వేదము, వైవర్ణ్యము, ఇయ్యవి సాత్వికభావములు. మోహము=మూర్ఛ, ఇందుఁ బౌముకాటువలనఁ గలుగుధర్మములను విరాళివలని ధర్మములను సరిపెట్టి చూపినాఁడు.

DPRI Acc. No

చ. వెడవెడ గన్నమాయఁ గనుపిచ్చు నగుం దలయూఁచుఁబొన్పుపైఁ
బడు నుసురంచు లేచుఁ దడఁబాటును దత్తఱమున్ జలంబు లో
నడరఁగఁ గోపవేగమున నగ్గల మైనమనోజుబాధలం
బడి మదహస్తిహస్తగతపద్మినియుంబలె సొంపు పెంపఱిన్. 101

టీ. వెడవెడ = కొంచెముకొంచెము, కనువిచ్చున్ = కన్నుఁదెఱచును, నగున్ = నవ్వును, తలయూఁచున్ = తలపంకించును, పొన్పుపైన్ = శయ్యపై, ఉసురంచున్ = ఊస్సురనుచు, తడఁబాటును = స్ఖలనమును, తత్తఱమున్ = సంభ్రమమును, చలంబున్ = పంతమును, లోన్ = మదిని, అడరఁగన్ = వృద్ధినందఁగ, కోపవేగమునన్ = క్రోధంపుఁద్వరను, అగ్గలమైన = అధికమైన, మనోజుబాధలన్ = మన్మథబాధయందు, పడి = క్రుంకి, మదహస్తి హస్తగత పద్మినియుంబలెన్ = మత్తగజముయొక్క తుండమునుబొందిన పద్మలతవలె, సొంపు పెంపు = అందముయొక్కయతిశయము, అఱిన్ = నశింపఁగా, ఉత్తరపద్యముతో నన్వయము.

విశే. ఇందు వ్యభిచారిభావములు సరసగతిని నిరూపితములయ్యెను. పూర్వపద్యములఁ గోపముకతన వగలు గలిగె నని వర్ణించినకవి 99, 100, 101 పద్యముల సత్య మన్మథవేదనపాలైనట్లు వర్ణించుట పొసఁగునా? సందర్భశుద్ధి కలదా? యనునంశముల విచారింపవలయును. పారిజాతసుమమును రుక్మిణికి శ్రీకృష్ణుఁడర్పించుటంజేసి, సత్యకుఁ గోపము కల్గె. మఱియు నకోపము ప్రియవిషయక మగుటంచేసి యింకఁ దనకు బ్రియుఁడు దుర్లభుఁడనియు, నన్యకాంత కధీనుఁడయ్యె ననియు భావములు పొడమెను. దాన నీర్ష్యయు మనోజవేదనయు సంభవించె నని గ్రహింపవలెను. మత్తేభము పద్మలతం బెకలించి తుండముచేఁ జీకాకుపఱచి దానిని రూపుమాపును. అట్లే కోపవేగమునం గల్గిన మనోజుబాధ సత్యను రూపఱిం జేసె నని యెన్నవలయును. అలం. ఉపమ. 'పద్మిని' స్త్రీలింగగ్రహణము సత్యాసాదృశ్యసంపాదనార్థ మని సారస్యము గ్రహించు నది. అలం. సముచ్చయము.

క. ఈపగిదిన్ సాత్రాజితి, కోపోద్యోగమున వగలఁ గుందుచు ఘనసం
తాపంబుపేర్మి నితర, వ్యాపారము మాని యుండె హరియును నచటన్.

టీ. సాత్రాజితి = సత్రాజిత్పుత్రిక, ఈపగిదిన్ = ఈరీతిగ, కోపోద్యోగమునన్ = కోపోచితప్రయత్నముచే, (అనఁగాఁ గోపముపచ్చినట్లు తెలియుటకై యొనర్చినప్రయత్నముచే నని భావము) కోపోద్వేగమునన్' అని యిచ్చోఁ బాఠాంతరముండిన లెస్స. 'కోపవేగము' అని పూర్వపద్యములలోఁ గన్పట్టుచుంట నిదియె సాధుపాఠ మని యంగీ

కరింపనగు. మఱియుఁ గోపవేగమె పగలఁబొగిలించెను గాని కోపోద్యోగము కామి స
ప్పాతమె సరసమగును. వగలక్ =దుఃఖములచే, కుందుచుక్ =దుఃఖించుచు, ఘనసం తా
పంబుపేర్మిక్ =గొప్పదైన పరితాపముయొక్క యతిశయముచే, ఇతరవ్యాపారమును =
ఒండొకపనిని.

### సత్యభామకడకు శ్రీకృష్ణుఁడు వచ్చుట

మ. ముని నాకిచ్చినపూవుచందమును నే మున్నాడి యీభోజనం
దన కర్పించినజాడయుం దెలియఁ జెంతం బొంచి వీక్షించి పో
యినసాత్రాజితిబోటి నావలనఁ దా నేమేమి కల్పించెనో
యని ప్రద్యుమ్నుని మౌనిదండ నిడి చింతాయత్తచిత్తంబునన్. 103

టీ. చందమును=విధమును, మున్నాడి=తొలుత, జాడయుక్ = రీతియు, తెలి
యక్ =తెలియునట్లు, చెంతక్ = దగ్గఱ, పొంచి=దాగి, వీక్షించి = చూచి, పోయిన=
అరిగిన, సాత్రాజితిబోటి=సత్యాసఖి, నావలవక్ =నావైపున (నావిషయమున), ఏమేమి
కల్పించెనో (కల్పించుశబ్దసారస్యమున=నేమేమి కొండెములు చెప్పెనో యని భావము
గ్రహింపవలయును), మౌనిదండక్ =నారదునిసమీపమున, ఇడి = ఉంచి, చింతాయత్త
చిత్తంబునక్ =విచారాధీనమైన మనస్సుతో.

విశే. సత్యకును వెఱచుటకతన శ్రీకృష్ణునియందుఁగల దక్షిణనాయకత సూచితము.

చ. అరదము నెక్కి కేతనపటాంచలచంచల మైనతాల్మితోఁ
దురగజవంబు మున్నడవఁ ద్రోచి కడంగెడుతత్తఱంబుతోఁ
దిరిగెడుబండికండ్లపగిదిక్ భ్రమియించుమనంబుతోడ నా
హరి సనుదెంచె సత్యసముదంచితకాంచనసౌధవీథికిన్. 104

టీ. ఆహరి=(చింతాధీనచిత్తముగల) ఆ శ్రీకృష్ణుఁడు, అరదమున్ = రథమును,
ఎక్కి=అధిష్ఠించి, కేతన...చంచలమునన-కేతనపట=టెక్కెపుగుడ్డలయొక్క, అంచల=
కొనలవలె, చంచలమైన=కదలునదైన, తాల్మితోక్ = ధైర్యముతో, తురగజవంబుక్ =
గుఱ్ఱములవేగమును, మున్నడవక్ =మీఱుటకు, త్రోచి=వడిగొని, కడంగెడు = యత్నిం
చెడు, తత్తఱంబుతోక్ =వేగిరపాటుతో, తిరిగెడు=భ్రమించెడు, బండికండ్లపగిదిక్ =
(రథ) చక్రములవలె, భ్రమియించు = భ్రమణమునొందునట్టి, మనంబుతోడక్ =మది
తోడ, సత్య.....వీథికిక్ =సత్యభామయొక్క'యొప్పునట్టిబంగారు మేడలవరుసకు, చను
దెంచెక్ = వచ్చెను.

భా. శ్రీకృష్ణుఁ డరచపుటెక్కి-పుగుడ్డలకొనలకంటె నెక్కుడుగ ధైర్యము చలించుచుండ, హయవేగమునుమించిన శత్తరపాటు చెలంగ, రథచక్రభ్రమణవేగమును మీఱి మది భ్రమింప, సత్యయింటి కేతెంచెను.

వ్యా-విశే. ఇందు రథవేగమును నిరూపింపక తాల్మి మున్నగువానిచలనము రథవేగ మును మించియున్న దని చెప్పటంజేసి, రథవేగాతిశయము ధ్వనితమగుటయేగాక తన్మూల మున శ్రీకృష్ణునకు సత్యావిషయమునఁ గలభీతిప్రీతులును వ్యంగ్యము లగుచున్నవి. "బండి కండ్లపగిదిఁ".—బండికండ్లయొక్క-పగిదిఁ. ఔపవిభక్తికంబుల లివర్ణసల లువర్ణంబులకు బహువచనము పరంబగునపుడు పూర్ణబిందుపూర్వకడువర్ణంబు బహుళం బుగా నగును. కల్లు=మద్యము. ఈయర్థమున నీవిధి వర్తింపదు. అలం. ఉపమ.

తే. వచ్చి యరదంబు డిగ్గి తద్ద్వారసీమ
దారుకుని నుండ నియమించి తాన యొకఁడు
కమలనాభుండు కక్ష్యాంతరములు గడచి
యలబలము లేనినగ రెల్ల నరసి చూచి. 105

టీ. డిగ్గి=దిగి, తద్ద్వారసీమఁ=ఆ (సత్యాసౌధ) ద్వారదేశమున, దారుకునిఁ = రథముగడపువాఁడగు దారుకుని, నియమించి=ఆనయిడి, తాన=తానే, (తానయొకఁడు= తానొక్కఁడే)కక్ష్యాంతరములు = తొట్టికట్టుల మేరలను, కడచి = దాఁటి, అలబలము= కలకలము, నగరెల్లఁ = రాజసౌధమంతయు, అరసి = వెదకి.

వ్యా-విశే. డిగ్గి=రూ. అ. దిగి:-దక్కు-లోనగువానిదాకు డకారంబు విభాషనగును. అలబలము లేమి నిందుఁ జెల్వుచున్నాఁడు.—

సీ. కనకపంజరశారికలకుఁ జక్కెర వెట్టి
చదివింప రేలొకో సకియ లిపుడు
కరతాళగతుల మందిరమయూరంబుల
నాడింప రేలొకో యతివ లిపుడు
క్రొవ్వాఁడిగోళ్లఁ దంత్రులు మీటి వీణియ
ల్వలికింప రేలొకో భామ లిపుడు
కలికిరాయంచబోదల నెల్ల నెలయించి
నడిపింప రేలొకో పడఁతు లిపుడు

తే. ఇన్నిదినములవలె నుండ దేమి నేఁడు
చిన్న బోయిన దీమేడ చెన్నుదఱిఁగి

పద్మముఖితోడ నెవ్వారే బారిజాత
పుష్పవృత్తాంత మెఱిఁగింపఁబోలునొక్కొ. 106

టీ. కనకపంజరశారికలకున్ =బంగారుపంజరమున నున్నగోరువంకలకు, చక్కెర= శర్కర (పంచదార), పెట్టి=ఇడి, సకియలు=చెలులు, చదివింపరేలొకో = చదివింపరు + ఏల + ఒకో=ఏల చదివింపరో? అతివలు = స్త్రీలు, కరతాళగతులన్ =చప్పటలయొక్క రీతిచే, మందిరమయూరంబులన్ =ఇంటి నెమిళ్లను, (పెంచిన నెమిళులను) ఇపుడు, ఆడింప రేలొకో=ఎందులకాడింపరో, భామలు=స్త్రీలు, క్రొవ్వాఁడిగోళ్లన్ =క్రొత్తలును నిశిత ములునైన నఖముల చే, తంత్రులు=వీణతీగెలను, మీటి=ఎగఁజిమ్మి, వీణియల్ =వీణెలను, పలికింపరేలొకో=శబ్దింపఁజేయరే మొ?పడఁతులు=వనితలు,కలికిరాయంచబోదలన్నెల్లన్ = మనోహరములగు రాజహంసలపిల్లల నెల్లను, ఎలయించి= చేర్చి,నడిపింపరేలొకో=ఎందులకు నడిపింపరో? చెన్ను=అందము, ఎప్పరేన్ =ఎవరైనను, పారిజాతపుష్పవృత్తాంతము = పారిజాతపుష్పచరిత్రమును,ఎఱిఁగింపఁబోలునొక్కొ=ఎఱిఁగింపన్ + పోలును + ఒక్కొ =తెలియఁజేసియుందురే మో ?

వ్యా-విశే. చక్కెర. వి శర్కర. ప్ర. సకియ. వి. సఖి. ప్ర. బోద. వి. పోత. ప్ర. ఇట్లు వర్ణించుటకతన, సత్యచెలులు విదుషు లనియు, నాట్యకళాభిజ్ఞ లనియు, వీణాగానవిశారద లనియు, నంచయాన లనియుఁ దేలుచున్నది.

క. అని యనుమానించుచు నొ
య్యనఁ గోపగృహంబు సేరి యాసత్రాజి
త్తనయ ముసుంగిడి యుండఁగ
ననువు మెఱియఁ జొచ్చి మాయ యచ్చుపడంగన్. 107

టీ. అనుమానించుచున్ =ఊహించుచు,ఒయ్యనన్ = మెల్లఁగా,కోపగృహంబున్ = క్రోధాగారమును, చేరి=పొంది, ముసుంగు = అవకుంఠనము, ఇడి=చేసి, అనువు=ఉపా యము, మెఱియన్ =ప్రకాశించునట్లు చొచ్చి, మాయ=కపటము, అచ్చుపడంగన్ = స్పష్టపడునట్లు.

మాయ నిం దచ్చుపఱిచుచున్నాఁడు.—

ఉ. కొంచఱి మంతనంబులను గొందఱి జంకెనవాఁడిచూపులం
కొందఱిఁ జేతిసన్నలఁ దగుల్పఁడఁ జేయుచుఁ జేరఁబోయి మ
ధ్యంబినభానుమండలకరావళిహేవళి వాడి యున్నతిఁ
గం దలఁపించునమ్మగువఁ గన్గొని యెంతయు విస్మితాత్ముఁ డై. 108

టీ. కొందఱిక్, మంతనంబులక్ = రహస్యముల చేతను, (రహస్యాలాపముల చేనుట) జంకెనవాఁడిచూపులక్ = బెదరించుతీక్ష్ణము లగు దృష్టుల చేతను, చేతిసప్నలక్ = హస్తసంజ్ఞలచేతను, తగుల్వడక్ = వశమగునట్లు, చేయుచుక్ (వశపఱచుకొనుచు) స్వాధీనులం జేసికొనె నని భావము, చేరక్ =దగ్గఱగా, పోయి = అరిగి, మధ్యందిన... ...హావళిక్ - మధ్యందిన = మట్టమధ్యాహ్నమునకైన, భానుమండల = సూర్య మండలసంబంధమైన, కరావళి = కిరణపంక్తియొక్క, హావళిక్ =ఉపద్రవముచే, వాడియున్న=ఘనమైయున్న, తీఁగక్ =తీవను, తలపించు=జ్ఞాపకమునకుఁ దెచ్చు, అమ్మగువక్ = ఆ సత్యభామను, కన్గొని = కాంచి, ఎంతయుక్ = మిక్కిలియు, విస్మితాత్మఁ డై= ఆశ్చర్యము నందిన మది కలవాఁ డై.

భా. రహస్యాలాపములఁ గొందఱను, బెదరింపుఁజూపులఁ గొందఱను, హస్త సంజ్ఞలఁ గొందఱను నీరీతిగ సత్యాసౌధమునందలి పరిజనుల స్వాధీనముచేసికొనుచుఁ బోయి మట్టమధ్యాహ్నమునందలి తీక్ష్ణసూర్యాతపమునఁ గడుంగడువాఁడియున్న తీవం బోలు సత్యభామం గని యెంతయు నాశ్చర్యము నందెను.

విశే. పరిజనులఁ దత్తత్క్రియల స్వాధీనముచేసికొనుటవలన శ్రీకృష్ణునిమాయ యచ్చుపడుచున్నది.

ఉ. ఈలలితాంగిచందమొకయించుక చూచెద నంచు ధూర్తగో
పాలుఁడు తాలవృంత మొకభామిని సత్యపిఱుందనుండి మం
దాలసలీలమై విసర నాదటఁ గైకొని వీచెఁ దద్వపుఃకీ
లితపంచసాయకశిఖిం దరికొల్పుచు నున్నకైవడిన్. 10)

టీ. ధూర్తగోపాలుఁడు = మాయావి యగు శ్రీకృష్ణుఁడు. (ధూర్తుఁడు= మోసకాఁడు), ఈలలితాంగిచందము = ఈ యందమైన మేనుగల సత్యభామయొక్కవిధము, ఒకయించుక=ఒకకొంచెము, చూచెదను, అంచుక్, ఒకభామిని=ఒకస్త్రీ, సత్యపిఱుందక్ = సత్యభామయొక్కవెనుకను, ఉండి, మందాలసలీలమ్మైక్ = అత్యంతము మంద మగు విధముతో, తాలవృంతము=విసనకఱ్ఱను, విసరక్ =వీవఁగా, ఆదటక్ =ప్రీతితో, కైకొని= పుచ్చుకొని, తద్వపుఃశిఖిక్ - తత్ = ఆసత్యభామయొక్క, వపుఃశరీరమునందు, కీలిత=ఉండునట్టి, పంచసాయకశిఖిక్ = మన్మథాగ్నిని, దరిగొల్పుచుక్ =ప్రజ్వలింపఁ జేయుచు, ఉన్నకైవడిక్ = ఉన్నరీతిగ, వీచెక్ =విసరెను.

భా. మోసకాఁడగుకృష్ణుఁడీమె చందముం గొంచెము చూతుఁగా కని వీవన చేఁబూని విసరునొకకాంతయొక్కచేతినుండి యావీవనం దీసికొనితానే సత్యకు విసరెను.

విశే. మున్ను తన్ను వంచించినయాపూర్తగోపాలుఁడే ప్రకృతము వీవనం జేబూని తనకు విసరుటను సత్య గాంచినచో మఱింత మండిపడును. దాన శ్రీకృష్ణుని యీ సేవ సత్య కెంతయు సంతాపమును జేయునదే యగుం గాని, యున్నసంతాపమును దొలఁగింపనేరదు. మఱియుఁ దరువాతిపద్యమునంచలి ప్రస్తావనంబట్టి పారిజాతసుమసౌరభమును వెదచల్లి సత్య కెంతయు నీర్ష్యఁ గలిగించుటకే కృష్ణుఁడు తాళవృతముంబట్టి విసరె నని తెలియవచ్చుచు గాన, నిదియు నధికసంతాపముం గూర్చుటకే యేర్పడిన క్రియ యని తేలియును. కావునసే యీవిసరుట మున్నున్నమన్మథాగ్నిని దరికొల్పు నటుల నున్న దని కవి యూహించె నని యెన్నునది. ఎక్కఁడుగ వీచిన సత్యకు బాధ యగునేమో యని చెలి యత్యంతము మంద మగుగతిని వీచె నని 'మందాలసలీలమై' యనుపదమునకు సారస్యము సెన్నునది. పంచసాయకములు.—అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలము. ఈయైదును బాణములుగాఁ గలవాఁడు మన్మథుఁడు గాన 'పంచసాయకుఁడు' అనుపడి కల్గెను. అలం ఉత్ప్రేక్ష.

ఉ. అంతటఁ బారిజాతకుసుమాగతనూతనదివ్యవాసనల్
వింతలు సేయఁ దావి యిది విస్మయ మంచు ముసుంగుఁ ద్రోచి యే
కాంతగృహంబు నల్దడలు నారసి సంభృతతాలవృంతునిం
గాంతునిఁ జూచి బాష్పకళికాతరళీకృతలోచనాంత నై. 110

టీ. అంతటన్ = అనంతరమున, పారిజాతకుసుమాగతనూతనదివ్యవాసనల్ = కల్పవృక్షపుష్పమునుండి వచ్చిన క్రొత్త లగు శ్రేష్ఠము లైన పరిమళములు, వింతలు సేయన్ = ఆశ్చర్యములం గలిగింపఁగా, ఇది తావి = ఈపరిమళము, విస్మయము = ఆశ్చర్యకరము, అంచున్, ముసుంగు = అవకుంఠనమును, త్రోసి=తీసివైచి, ఏకాంత గృహంబునల్దడలున్ = రహస్యాగారముయొక్క నలుప్రక్కలను, ఆరసి = విచారించి (వెదకి), సంభృతతాలవృంతునిన్ = పట్టుకొనినవీవనగలవానిని, కాంతునిన్ = మనోహరుని, చూచి = కాంచి, బాష్పకళికాతరళీకృతలోచనాంతనై = మొగ్గలవంటికన్నీళ్లచేఁ జంచలములుగాఁ జేయఁబడిన కన్నులకొనలు గలదై; ఉత్తరపద్యముచో నన్వయము.

భా. అట్లు కృష్ణుఁడు వీవనం జేఁబూని సత్యకు విసర, నపుడింతకుమున్న కృష్ణున కంటియున్న పారిజాతసుమసౌరభము తాళవృంతసంచాలనమువలని గాలిం గలసి పోలయ, నక్కాంత యపూర్వ మీసౌరభ మెటనుండి యే తెంచె నని యచ్చెరువునంది తా నివ

సించుగృహమును నల్లడలం బరికించి వీవనం జేతం బూని విసరువిభుం గాంచి, తోడనే ముకుళములం బోలు బాష్పములు జాలుకొన వెనువెంటనే ముసుంగిడె నని భావము.

విశే. ఇందు 1. 'తావియది'2.'కాంతగృహంబునల్లడలుగన్గొని'3.'బాష్పకణికా' అను పాఠాంతరములు గాననగును. 1. ఈపాఠమున నంతగ విశేషము గానరాదు. కాన 'తావియిది' అనుటయే సరసమవి తోఁచెడిని.2.'అక్కాంతగృహంబునల్లడలు నారసి'అను ప్రామాదికపాఠము నీరీతిని సవరించిరి. కాని, నల్లడలు కన్గొని యనుటకన్న 'వెదకి' అను నర్థముగల 'ఆరసి' అనుపదమే యిచ్చోఁ గవి ప్రయోగించె ననియుఁ బ్రకృతము సత్య క్రోధాగారమున నుండుటంజేసి, 'యేకాంతగృహంబు' అనియే ప్రయుక్త మైయుండు ననియు గ్రహింపనగును. మఱియు 'ఏకాంత' అనుశబ్దములోని కకారమునకును, దాని పైఁగల యచ్చునకును నుభయయతి వేయవచ్చునుగాన, నీపఱిమున నచ్చునకు యతి చెల్లె ననుట నిర్బాధము. 3.'బాష్పకణికా' అని యనినఁ గేవలము బాష్పకణములుమాత్రమే యర్థ మగును. 'కళికా' అని యన్న ముకుళములం బోలు బాష్పము లని బాష్పములకుఁ గొంత పన్నె కల్గును, కాని, యిందు బాష్పములు చాలుకొన్నట్లు కవి వర్ణించిన ట్లగపడదు. కన్నీళ్ళఁ జేఁ గన్నులు కలఁతనొందినట్లు మాత్రమే చెప్పినాఁడు. కావున బాష్పములు బింద్వనంతరము బిందువు చాలుకొనునపు డేర్పడురూపము నిచటఁ గవి బాష్పముల కనుసంధించె ననుట యంత హృద్యముగఁ గానరాదు. కన్నులు తరళము లగుటకుఁ గన్నులనిండఁ బాష్పకణము లేర్పడినంజాలునుగదా! మఱియుఁ దరువాతిపద్యమున మగుడ ముసుఁగిడినతరువాత బాష్పములు చాలుకొన్నట్లు వర్ణించుటంజేసి, యిందు బాష్పోదయము మాత్రమే కవి వర్ణించె నని తోఁచెడిని.

క. తల వాంచి మగుడ ముసుఁగిడెఁ
గొలుకుల డిగజాఱి జాలుకొనుబాష్పంబుల్
పలుచనిచెక్కుల లవలీ
దళపతితమరందబిందుతతిఁ బురుడింపన్. 111

టీ. కొలుకులక్ = కనుకొనలనుండి, చాలుకొను=వరుసనుగొను (ప్రవహించు), బాష్పంబుల్ =కన్నీళ్ళు, పలుచనిచెక్కులక్ =సన్నఁదనమునందిన గండస్థలములందు, లవలీ దళపతితమరందబిందుతతిక్ = లవలీయను లతయొక్క యాకునందుఁ బడిన పూఁదేనె బొట్టులసమూహమును, పురుడింపక్ = అనుకరింపఁగా, మగుడ = మఱల, ముసుఁగు, ఇడెక్ = పెట్టెను.

విశే. అలం. ఉపమ.

ఉ. ఓ రొ్వాకయింత లేనివిక చోత్పలలోచనచి త్తవీథిఁ జ
ల్లార్వఁగ నీలనీరదశుభాంగుఁడు వే చనుదెంచె నంచుఁ గం
దర్పహుతాశను న్వోలికిఁ దార్చుసఖుండును బోలె వేఁడిని
ట్టూర్పు దళంబుగా నిగిడె నున్నమితావరణాంశుకాంత మై. 112

టీ. ఒకయింత = కొంచెము, ఓర్పు = సహనము, లేని, విక చోత్పలలోచనచి త్త వీథిక్ =విరిసివనల్లకలువలంబోలు కన్నులుగలసత్యభామయొక్క- మనోవీథిని, చల్లార్వఁగక్ =ఉపశమిల్లఁజేయుటకు, నీలనీరదశుభాంగుఁడు = నల్లమబ్బువంటి మంగళదేహము గలవాఁడు(శ్రీకృష్ణుఁడు), వే=శీఘ్రముగ, చనుదెంచెక్ = వచ్చెను, అంచుక్ కందర్ప హుతాశనుక్ =మన్మథాగ్నిని, వెలికిక్ =బయటికి, తార్చు=చేర్చు, సఖుండునుబోలెక్ = చెలికానివలె; గాలివలె, అగ్నికి మిత్రము (వాయువుకదా), వేఁడినిట్టూర్పు=వేఁడియైన నిశ్వాసము, దళంబుగాక్ =దట్టముగా, ఉన్నమిత...కాంతమై-ఉన్నమిత=ఎత్తఁబడిన, ఆవరణాంశుక = ముసుఁగిడినచీరయొక్క-, అంతము+ఐ = చెఱఁగు కలదై, నిగిడెక్ = విజృంభించెను.

భా. సత్యమనోవీథిని సంతాపము పాలుచేయు మన్మథాగ్నిం జల్లార్వ శ్రీకృష్ణుఁడనుకాళమేఘు మే తెంచుటం గని యగ్నిసఖుం డగువాయువు తనమిత్రు నగ్నిని వెలికిఁ దార్చుచున్నాఁడో యన వేఁడినిట్టూర్పు లవకుంఠనవస్త్రాంచలముఁ బై కెత్తుచు విజృంభించెను. వేఁడినిట్టూర్పుల నామె చీరచెఱఁగు పై కెగురుచుండె నని భావము.

వ్యా-విశే. 'నీలనీరద' అనుపద మిందు సాభిప్రాయము. కాఱుమబ్బు వర్షించుటయును నగ్నిని జల్లార్చుటయును ప్రసిద్ధమేకదా. నిడు+ఊరుపు=నిట్టూరుపు, కుఱుచిఱు కడునడునిడుశబ్దముల అడల కచ్చుపరమగునపుడు ద్విరుక్తటకార మగు. అలం. ఉత్ప్రేక్ష.

చ. వనితకుచద్వయంబుపయి వ్రాసినకుంకుమపత్రభంగముల్
జనితనితాంతఘర్మకణజాలముచేతఁ గరంగి మెల్ల మె
ల్లన వెలిపట్టుపయ్యెదకెలంకుల జాఱుట యొప్పె మానసం
బున నెలకొన్నక్రోధరసము *న్వడిఁగట్టుచు నున్నకైవడిన్. 113

టీ. వనితకుచద్వయంబుపయిక్ = సత్యయొక్కచందోయిమీఁదను, వ్రాసిన కుంకుమపత్రభంగముల్ =కుంకుమచేనైన మకరికాపత్రరచనలు, జనితనితాంతఘర్మకణ జాలముచేక్ =పుట్టినట్టి యధికమైన చెమటబొట్టులసమూహముచేత, కరంగి=ద్రవీభవించి, మెల్లమెల్లన = ఒయ్యొయ్యన, వెలిపట్టుపయ్యెదకెలంకుక్ = తెల్లనైన పట్టుపయఁట

* న్వడఁబెట్టుచు; న్వడిఁబెట్టుచు; న్వడవెట్టుచు.

యొక్క పార్శ్వములనుండి, జాఱుట; కర్త. మానసంబునన్ =మదిలో, నెలకొన్న=నిల్చియున్న, క్రోధరసమున్ = కోపరసమును, వడిఁగట్టుచున్ = వడఁబోయుచు, ఉన్న కైవడిన్ =ఉన్న రీతిగ, ఒప్పెన్ =అమరెను.

భా. అధికములైన చెమటబొట్టులచే సత్యచన్దోయిపై వ్రాసినకుంకుమపత్రరచనలు కరంగి పైఁటచెఱఁగునొనలుండి జాఱుట రక్తవర్ణమగు క్రోధరసమును సత్య వడఁబోయుచున్నదో యన్న ట్లుమరె నని భావము.

వ్యా-విశే. 'మెల్లమెల్లన' గుడ్డయందు వడఁబోయునపుడు నీరు మెల్లన జాఱుట సహజముకాన నిది సాభిప్రాయము. క్రోధరసము రక్తవర్ణ మని యాలంకారికసంకేతము. పై + ఎద=పయ్యెద. రూ. అ. పయ్యద. ఆలం. ఉత్ప్రేక్ష.

క. మానవతి యిట్లు పూనని, మానక్రోధములచేఁ గుమారిలి చింతా
ధీనగతి నుండ మదిలో, నూనినప్రేమమున నంబుజోదరుఁ డనియెన్.

టీ. మానవతి = అభిమానవతియైన యాసత్య, ఇట్లు=ఈరీతి, మానని = విడువని, మానక్రోధములచేన్ = భర్తయెడఁ గల్గిన పట్టుదలచేతను గోపముచేతను, కుమారిలి = దుఃఖించి, చింతాధీనగతిన్ = విచారమునకు లోనైనవిధమున, ఉండన్, మదిలోన్, ఊనిన=ధరించిన, ప్రేమమునన్ = ప్రీతితోడ, అంబుజోదరుఁడు = దామోదరుఁడు, అనియెన్ =పల్కెను.

వ్యా-విశే. అనియెను-వచ్యర్థమునకు భూశ్రంబున లిడ్రూపము.

శ్రీకృష్ణుఁడు సత్యభామ ననునయించుట

ఉ. ఇందునిభాస్య! మైతొడవు లేల ధరింపపు సన్న కావు లీ
వెందును మాన లేవు తెలు పేటికిఁ గట్టితి వీటికారుచుల్
కెందలిరాకుమోవిఁ దులకింపఁగఁ జేయక యున్కి యేమి నీ
చందము వింతయయ్యెడు నిజంబుగ నా కెఱుఁగంగఁ జెప్పుమా.115

ఇందునిభాస్య = ఓచంద్రముఖి, మైతొడవులు = మేనునాభరణములు, ధరింపవేల=తొల్పవేల? సన్నకావులు=విషములగుకావిబట్టలు, ఈవు=నీవు, ఎందును = ఏసమయమునను, మానక్ =విడువఁగా, లేవు = సమర్థవుగావు, తెలుపు= తెల్లనిబట్ట, ఏటికిన్ = ఎందులకు, కట్టితి=ధరించితివి, వీటికారుచుల్ = తాంబూలపుఁగాంతులు, కెందలిరాకు మోవిన్ = ఎఱ్ఱనిచిగురుటాకుంబోలు పెదవియందు, తులకింపఁగన్ = ప్రకాశించునట్లుగ, చేయక=ఒనర్పక, ఉన్కి=ఉండుట, ఏమి = ఎందులకు? నీచందము = నీవిధము,

వింత=ఆశ్చర్యకరము, అయ్యెడున్, నిజంబుగన్=నిక్కముగ, నాకున్, ఎఱుఁగంగన్= తెలియునట్లు, చెప్పుమా.

విశే. 'నున్న కావులు' అని పాఠాంతరము. నున్ననిబట్ట లనుటకంటె సన్ననిబట్ట లనుటయే సరస మని తోఁచెడిని. అక్కాలమున యువతులు కావిపలిపములం గట్టుటయు, నవి వారికి మిగుల సౌందర్యమును గలుఁగఁజేయున వని యప్పటివారు తలంచుటయుఁ గల దని పారిజాతాపహరణ మను చరిత్రములందలి సత్యావరూథినీవర్ణనములంబట్టి తెలియ వచ్చెడిని.

చ. మన మరయం దలంచి యొకమార్గము వన్నితో నవ్వుటాలకో
నను వెఱపించెదో యకట నాయెడ [1]నిక్కము దప్పు గల్గెనో
వనజదళాయతాక్షి! పగవాఁడనె న న్నిటు లేల చూడ వో
క్కనిమిష మైన నీవు దయఁ గన్గొన కుండిన నిల్వ నేర్తునే? 116

టీ. మనమఁ=మనస్సును, అరయన్=పరీక్షింపఁగా, ఒకమార్గము = ఒక ప్రోవను, పన్నితో = పీర్పఱిచితివా? నవ్వుటాలకో = పరిహాసములకా? నన్, వెఱపించెదో= భయపెట్టెదవా? అకట, నాయెడన్ = నాయందు, తప్పు=దోషము, నిక్కము = నిజముగా, కల్గెనో? వనజదళాయతాక్షి = ఓపద్మపత్రవిశాలాక్షీ, పగవాఁడనె=శత్రుఁడనా? నన్నున్, ఇటులు, చూడ వేల? ఒక్కనిమిషమైనన్=ఒకనిముసమైనను, నీవు, దయన్= కరుణతో, కన్గొనక = చూడక, ఉండినన్, నిల్వన్ = జీవింపఁగా, నేర్తునే = ఓపుదునె?

చ. పలుకులఁ దేనె లొట్టిపడఁ బల్కవు నేఁ డిది [2]యేల వాలుఁగ
న్నుల నునుసిగ్గు మూలొక్కనఁ గనుంగొన వేల యురస్థలంబుఁ జ
న్నుల నెదురొ త్తి మక్కువ ననుం బిగికౌఁగిటఁ జేర్ప వేఁటికే
చిలుకలకొల్కి, యెవ్వ రెడ నేసిరి? నీ కిటు లేల చింతిలన్? 117

టీ. పలుకులన్=మాటలనుండి, తేనెలు = మధువులు, [3]ఒట్టి = కాఱి, పడన్= ఒలుకఁగా; లేదా మాటలందుఁ దేనె లతిశయింపఁగా, నేఁడు పల్కవు ఇది యేల? వాలుఁ గన్నులన్=సోఁగకన్నులందు, నునుసిగ్గు=అల్పమగులజ్జ, మూలొక్కనన్ = కుదురు కొనఁగా, కనుంగొన వేల=చూడ వేల? ఉరఃస్థలంబున్=వక్షఃప్రదేశమును, చన్నుల్= స్తనములచే, ఎదురు ఒత్తి=ఎదురుగా నదిమి, మక్కువన్ = అనురాగముతో, నను-బిగి కౌఁగిటన్ = బిగువైన కౌఁగిలియందు, ఏటికే = ఎందులకే, చేర్పవు? చిలుకలకొల్కి =

---

1. నిక్కపుఁదప్పు. 2. యేమి క్రొలుఁగన్నుల. 3. ఒట్టిపడు-శబ్దపల్లవక్రియ ఒట్టి+పడు అని ఇట్లు విడఁదీయరాదు. చిందు అని యర్థము.

ఓ చిలుకముక్కునంటిన కంటిమూలలవంటి కంటిమూలలుగలదాన, ఎవ్వరు, ఎడ = భేదము, చేసిరి, నీకున్, ఇటులు=ఈరీతిగ, చింతిలన్ =విచారింపగా, ఏల ?

విశే. 'ఎడ' అనుదానికిం బ్రకృతము సత్యకుం గృష్ణునిపైం గోపము జనించుటం జేసియు, నికోపము సత్యాసఖి చెప్పినమాటలచేం గగ్గిన దని కృష్ణునకుం దెలిసియే యుండుటంజేసియు, 'భేదము' అనియే యర్థమును జెప్పి 'ఎవ్వరు భేదమును గలుగం జేసిరే' అని కృష్ణుం డనినట్లు గ్రహించుటయే సరసము.

చ. మనమున మాటలం గ్రియల మన్నన లీ నొకనాఁడు నెట్టికా
మినులకు గారవంబు మెఱమెచ్చులకై పచరింతుఁ గాని పా
యని యనురక్తి నీయెడన యగ్గలమై కనుపట్టు నాకు నీ
పనిచినపంపు సేయుటయ ప్రాభవ మాఁ టది నీ వెఱుంగవే ? 118

టీ. మనమునన్ = మనస్సుచేతను, మాటలన్ = పల్కులచేతను, క్రియలన్ = పనులచేతను (మనోవాక్కర్మములచే), మన్ననలు=సమ్మానములను, ఎట్టికామినులకున్ = ఎట్టియువతులకును, ఈను=ఒసంగను, గారవంబున్ = సమ్మానమును, మెఱమెచ్చులకై = మిక్కిలి మెప్పులకై, పచరింతున్ = చేయుదును, కాని, పాయని = ఎడతెగని, అనురక్తి=అనురాగము, నీయెడన=నీయందే, అగ్గలమై = అధికమై, కనుపట్టున్ =చూపట్టును. నాకున్, నీపనిచినపంపు=నీవు దేని నాజ్ఞాపించిన నాయాజ్ఞను, చేయుటయ = ఒనర్చుటయే, ప్రాభవము=ప్రభుత్వము, ఔటు=అగుట, అది, నీవు ఎఱుంగవే=తెలియవా ?

భా. మనోవాక్కర్మములను నిన్నే సంభావింతును. ఆంగికము లగు క్రియలచేనే నితరకామినులవిషయమున నగపఱచుగారవము మెప్పునకేగాని యన్యము గాదు నీయాజ్ఞను నెఱవేర్చుటయే నేను ప్రభుత్వముగ మది నెన్నుదు ననునంశము నీ వెఱుంగ వనికాదు.

విశే. మనోవాక్కాయకర్మములలో నాంతరంగికము లగు మనోవాక్కర్మముల మాటినిమాత్ర మే పేరొక్కని కాయమును బరిత్యజించుటంజేసి, శరీరద్వారముగనే నెఱపనితలవిషయమునఁ బ్రేమం జూపదు ననియు, నదియు ముఖప్రీతికేగాని యన్యము గా దనియు, శ్రీకృష్ణుఁడు సత్యకుం దెలియంబల్క నని గ్రహించునది. నీయాన నను సరించి పారిజాతముం బ్రాభవమునఁ దెత్తు నని శ్రీకృష్ణుఁడు సాభిప్రాయముగఁ బల్కినట్లు

'సీపనిచినపంపు సేయుటయె ప్రాభవము' అనుమాటవలనఁ దెలియవచ్చెడిని. మఱియుఁ బారిజాతమును రుక్మిణి కిపు డర్పించుట యనునది ముఖప్రీతికై యొనర్చినది గాని, నిండు ప్రేమంజేసినది కా దని శ్రీకృష్ణుఁడు సత్యకు నెఱింగించినాఁడు.

మ. పడఁతీ! నీమధురాధరామృతము నీబాహాపరీరంభముం
బడయ ధన్యుఁడఁ గాకయుండిన నసుం బాటించి యొక్కింత నీ
నిడువాలుంగడగంటఁ జూడు మనుచు న్నిల్పోపమిం బైచెఱుం
గొడియం జేవిరిదమ్మి ప్రేయుటకునై యుంకించి జంకించినన్. 110

టీ. పడఁతీ = ఓయువతీ, నీమధురాధరామృతము = నీదగుతీయనిమోవిసుధను, నీబాహాపరీరంభమున్ =నీచేతులచేసైన యాలింగనమును, పడయన్ =పొందుటను, ధన్యుఁడన్ = కృతార్థుఁడను, కాక + ఉండినన్ =కాకున్న, నసున్, పాటించి=లెక్కఁగొని, ఒక్కింత=ఒకకొంచెము, నీనిడువాలుంగడగంటన్ =నీదగువిశాలమైన దీర్ఘమైనకటాక్షముచే, చూడుము, అనుచున్, నిల్పోపమిన్ = ఓర్పులేమిని, పైచెఱుంగున్ =ఉపరిభాగమున నున్న (చీర) కొనను (పైఁటకొసను), ఒడియన్ =లాగఁగా, (సత్య) చేవిరిదమ్మిన్ = చేతియందలవిరిసిన (లీలా) పద్మముచే, ప్రేయుటకున్ + ఐ = కొట్టుటకునై, ఉంకించి= ప్రయత్నించి, జంకించినన్ = బెదరింపఁగా.

విశే. కామినులు చేత విలాసార్థము పద్మముం దాల్తు రని 'హస్తే లీలాకమల మలకే' అనుమున్నగు కవివాక్యములవలనఁ దెలియవచ్చెడిని.

ఉ. పాటలగంధిచిత్తమునఁ బాటిలు కోపభరంబు దీర్ప నె
ప్పాటను బాటు గామి మృదుపల్లవకోమలతత్పదద్వయీ
పాటలకాంతి మౌళిమణిపంక్తికి వన్నియ వెట్ట నాజగ
న్నాటకసూత్రధారియదునందనుఁ డర్మిలి మ్రొక్కి మ్రొక్కినన్. 120

టీ. ఆజగన్నాటకసూత్రధారి=ఆప్రపంచమను నాటకమునకు సూత్రధారియైన, యదునందనుఁడు=యాదవకుమారుఁడు(శ్రీకృష్ణుఁడు), పాటలగంధిచిత్తమునన్ =పొగడపూవుతావింబోలుతావిగలసత్యయొక్కమనస్సున, పాటిలు=సంభవించిన,కోపభరంబున్ = కోపభారమును, ఎప్పాటను=ఏవిధముచేతను, తీర్పన్ =పోఁగొట్టుటకు, పాటు=సాధ్యము, కామిన్ = కాకుండుటచేతను, మృదు.....కాంతి-మృదుపల్లవ = మెత్తనిచిగురులవలె, కోమల=మృదువైన, తత్ =ఆసత్యభామయొక్క, పదద్వయీ=పాదద్వయసంబంధమైన, పాటలకాంతి = ఎఱ్ఱనికాంతి, మౌళిమణిపంక్తికిన్ =శిరస్సునందలి మాణిక్యముల

చాలునకు, వన్నియ=కాంతి, పెట్టక్=ఇడఁగా, అర్మిలిక్ = ప్రేమతో, మ్రొక్కెక్=నమస్కరించెను, మ్రొక్కినక్=నమస్కరింపఁగా.

భా. సత్యమదిని నెలకొన్నకోప మేపాటను బోఁగొట్టుటకు శక్యము గాకుండుటం జేసి, శ్రీకృష్ణుఁడు పల్లవారుణము లైన యామెపదములయరుణకాంతి యాత్మ మూళి మణులయరుణదీధితికి వన్నియవెట్ట నమస్కరించెను. అనఁగాఁ బాదములపై నెఱఁగె నని భావము.

విశే. జగన్నాటకమును నడుపఁ బ్రధానుఁడుగావున నే యిట్లు నటించినఁగాని యానాటకము చక్కఁబడ నేర దని యెంచి యీగతిని నటించెను. మఱియు నిట్లు నటించు టయు జగన్నాటక మిట్లుండు నని తెల్పుటకే యని గ్రహింపవలెను. కావున, భార్య పాదములపై నొరగుట కృష్ణున కొకకళంకముం గూర్చునది కా దని యెన్నవలయును. మఱియుఁ గామశాస్త్రపద్ధతిని, నలంకారశాస్త్రసరణిని, నాయకుని దగు నీకృత్యము మిగుల రసమును బోషించునదే యగుటంజేసియు నిది యనింద్యమే యనవలయును. సత్యపదములు మృదుపల్లవకోమలము లగుటంజేసియే యామెతాఁపు శ్రీకృష్ణునకు సంతాపకరము గా కుండుటయు, మీఁదు మిక్కిలి కృష్ణుఁ డామెపాదములు నొచ్చెనేమో యని యనుటయు మీఁద సంభవించును, అలం. వృత్త్యనుప్రాసము.

మ. జలజాతాసనవాసవాదిసురపూజాభాజనం బై తన
ర్చులతాంతాయుధుకన్నతండ్రిశిర మచ్చోచ్చె వామపాదంబునం
దొలఁగం ద్రోచె లతాంగి; యట్ల యగు; నాథు ల్నేరము ల్నేయఁ బే
రలుకం జెందినయట్టికాంత లుచితవ్యాపారము ల్నేర్తురే? 121

టీ. లతాంగి = తీవఁబోడియగుసత్య, జలజాతాసన...భాజనంబై-జలజాతాసన=బ్రహ్మ, వాసవ=ఇంద్రుఁడు, ఆది=మొదలైన, సుర = దేవతలయొక్క, పూజా=పూజకుఁ భాజనంబై = పాత్రమై, తనర్చు = ఒప్పు, లతాంతాయుధుకన్నతండ్రిశిరము = పుష్పాయుధుం డగు మన్మథునిజనకపితయొక్కశిరస్సును, అచ్చోచ్చె = ఆసమముమున, వామపాదంబునన్ = ఎడమకాలిచే, తొలఁగన్=అపసరిల్లునట్లుగ, త్రోచెన్ = త్రోసి వైచెను, అట్ల అగున్=అదియుక్తమే. నాథుల్=భర్తలు, నేరముల్=తప్పులను, చేయన్ = ఒనర్పఁగా, పేరలుకన్=పెద్దదగుకోపమును, చెందినయట్టికాంతలు=పొందినట్టికామినులు, ఉచితవ్యాపారముల్=అర్హములైనపనులను, నేర్తురే=నేర్చియుందురే?

విశే. లతాంగి కావుననే యామెతాఁపు శ్రీకృష్ణునకు నొప్పిని గలుగఁజేయ లేదు. భర్తృకృతాపరాధమునఁ బేరలుకం గాంచినదికావుననే సత్య స్త్రీజనసహజభావమున నిటి

యనుచితవ్యాపారము నొనర్పఁ బాల్పడియెఁగాని లేకున్న నట్లెన్నఁడు నొనర్చునదికా దనియు, నిక్కారణము నామెకుఁ బతిభక్తిలే దనికాని, చెడె నని యూహింప నలవి గా దనియు, 'పేరలుకం జెందినయట్టికాంత లుచితవ్యాపారము ల్నేర్తురే' అను సర్థాంతరన్యాసవాక్యమూలమునఁ గవి తెల్పెను. కావున, నిది నాయిక కపకర్ష నాపాదించు నది కా దని యెన్నవలయు.

క. కోపనపదహతిఁ గుహనా
గోపాలుఁడు గాంచి మెయి గగుర్పొడువఁగ ను
ద్దీపితమన్మథరాజ్య
ప్రాపితుఁడై పలికెఁ గూర్మి బయలు పడంగన్. 122

టీ. కోపనపదహతిక్ = ప్రణయకోపముగలభార్యయొక్క పాదతాడనమును, కుహనాగోపాలుఁడు=కార్యాపేక్షచేసైన కపటచర్యం బూనిన శ్రీకృష్ణుఁడు, కాంచి=పొంది, మెయి=శరీరము, గగుర్పొడువఁగక్ = పులకింపఁగా, ఉద్దీపిత...ప్రాపితుఁడై-ప్రకాశించుమన్మథరాజ్యమును బొందింపఁబడినవాఁడై, కూర్మి = అనురాగము, బయలు పడంగక్ = ప్రకాశ మగునట్లుగ, పలికెక్.

విశే. సత్యకూడికకై తహతహనందువాఁడు కావునఁ జే, యామెతాపు కృష్ణునకు గౌరవహానికరమైనట్లు తోఁపకపోవుటేగాక మీఁదుమిక్కిలి మన్మథోద్రేకమునుగూడఁ గలుఁగఁజేయుఁ దయ్యె నని కుహనాగోపాలపదమునకు సారస్యము సెన్నవలయును.

చ. నను భవదీయదాసుని మనంబున సెయ్యపుఁగిన్కఁ బూని తాఁ
చినయది నాకు మన్ననయ చెల్వగు నీపపల్లవంబు మ
త్తనుపులకాగ్రకంటకవితానము *డాఁకిన నొచ్చు నంచు నే
ననియెద నల్క మానవుగదా యిఁకనైన నరాళకుంతలా! 123

టీ. అరాళకుంతలా=కుటిలములైన కుంతలములుగలదానా, భవదీయదాసునిక్ = నీసేవకుని, ననుక్, మనంబునక్ = మదిలో, సెయ్యపుఁగిన్కక్ = ప్రణయకోపమును, పూని=వహించి, తాఁచినయది = తన్నినయది (తన్నుట), నాకుక్, మన్ననయ=సమ్మానమే, చెల్వగు=అందమైన, నీపదపల్లవంబు = నీపాదమనుచిగురు, మత్తను...వితానము= నాశరీరమందలి రోమాంచముకొనలసెడి ముండ్లగుంపులను, తాఁకినక్ = అంటినచో, నొచ్చును, అంచుక్, నీను, అనియెదక్ =పల్కుదను, ఇఁకనైనక్, అలుక్క్ =కోపమును, మానవుగదా = విడువవుగదా?

---

* నాటిన.

విశే. నీకుంతలము లెంత వక్రములో నీస్వభావమును నంత వక్రమే. కాకున్న నింతగఁ బ్రార్థించినను నీపలుక విడువ వేల అనునభిప్రాయముతో 'అరాళకుంతలపదము' ప్రయుక్తమయ్యె నని గ్రహించునది. ముల్లుపైఁ బడినచోఁ జిగురు చిరుగుటయు దాన దానిశోభ చెడుటయు సహజములు. కంటకవితాన మనుటంజేసి రోమాంచాతిశయము ప్రకటిత మయ్యెను. నాయికాపాదతాడనము నందియు నాయకుఁ డిట్లు పలుకుటయు నాయకోత్కర్షకే కారణ మని యాలంకారికాశయ మైనట్లు సాహిత్యదర్పణమునందలి యీక్రిందిసందర్భము తెల్పుచున్నది. "దాసే కృతాగసి భవత్యుచితా ప్రభూణాం పాద ప్రహార ఇతి సుందరి నాస్మి దూయే, ఊద్యత్కఠోరపులకాంకురకంటకాగ్రైర్యద్భిద్యతే మృదుపదం తను సా వ్యథా మే." ఇంచుమించుగ దీనికి భాషాంతరీకరణ మే యీపద్య మనుట స్పష్టము, ఇఁక సత్యభామ కృష్ణునిశిరముపైఁ దాఁచె నని 121-వ పద్యమున వర్ణించినకవి, యిందు సీపదపల్లవను మత్తనుపులకాగ్రకంటకవితానము సోఁకిన నొచ్చు నంచు శ్రీకృష్ణుఁ డన్నట్లు వర్ణించుట యెట్లు పొసఁగునని కొంద అందురు. కాళ్లపై నుత్తమాంగ మును మోపి సాష్టాంగనమస్కార మాచరించునపుడుగదా సత్య కృష్ణునిశిరమును దొలఁగంద్రోచెను? అపు డాపెపదము త్రోచుటయంటైన సంరంభమువశమున శరీరము నకుఁ దాఁకె ననియుఁ, ద్రోయునపుడు శరీరముఁ దాఁకె ననుట కీపద్య మే సాక్ష్యమనియు సమాధానము చెప్పుదురు. కాని శ్రీకృష్ణుఁడు నామేనియందలి కంటకములఁబోలు పులకాగ్రములను నీపాదము తాఁకినచో నొచ్చియుండు నని మాత్ర మే పల్కెనని యుఁ, బాదము మేనును దాఁకినట్లు పల్క లేదనియుఁ జెప్పనొప్పుగాన, నట్లాశంకింప నవకాశ మే లే దని విశదమగుచున్నది. తాఁకినన్ =అంటినచో; ఇది చేదర్థకరూపము. మఱియు నేతన్మూలమున శ్రీకృష్ణుఁడు తనమోహాతిశయమును సత్యకుఁ దెలిపె ననియు ధ్వనిం చెడు. నొచ్చును=నొచ్చియుండును. అనఁగాఁ దాఁకినచోఁ దప్పక పాదమునకు నొప్పి కల్గియుండు నని భావము. ఇది తద్దరార్థకరూపము. అక్కపటనాటకసూత్రధారి శ్రీ కృష్ణుఁడు తనమేనంగల్గిన సాత్వికచిహ్నములను ననురక్తిని సత్యకుఁ బ్రకాశము సేయు నెపమున "ఈయొడలిపై నెగ్గొనుకంటకాగ్రములంబోలు పులకాంకురములం దాఁకిన నీపదపల్లవము నొచ్చియుండును. తెలివితక్కువదానవు. నీకుఁగల్గుకష్టమునుగూడ నీవు కోపవశమునఁ గాంచవైతివి. నీపదము చిగురాకునొప్పిదముగలదిగాన నాకు నొప్పి కలుగఁ జేయఁజాలదు" అని యీరీతిని బ్రసంగించె ననుటయే సరస మగుటఁ బైశంక కవకాశ మే కానరాదు. ఇట్లుగాక కవ్యాశయము కొంద అనుకొనినట్లే యైనచో 'తాఁకుట నొచ్చెను' అనియే పదప్రయోగము చేసియుండును. పురుషులకుఁగూడ సాత్వికోదయమును వర్ణించుట కవులయాచార మై యున్నది. "పాటలగంధి, జలజాతాసన, కోపనపదహతి, నను

భవదీయదాసుని" ఈనాల్గుపద్యములును నేతత్కృతిభర్తయైన శ్రీకృష్ణదేవరాయమహీ
జాని తనప్రియురా లగు తిరుమలదేవి ప్రణయకోపవశమునఁ దన్నుఁ బాదతాడనము
పాల్సేయఁ, దజ్జనితాపమానభరముకతనఁ గొన్నిదినంబు లామెమందిరమునకుఁ బోవుట
మానఁగ, నామె యరణపుఁగవి యగు ముక్కుతిమ్మన యావిషయము నెఱింగి పారిజా
తాపహరణమును రచించి, యందు సత్య శ్రీకృష్ణునిశిరమును దన్నినట్లు విషయమును
గల్పించి, తన్మిషమున గృష్ణదేవరాయల కినుక నపనయించి యిర్వురను గూర్చె ననుజన
శ్రుతికి సూచకము లండ్రు. తదనుసారముగ 122-లో నుండు, కుహనాగోపాలుఁడు=
మాయాకృష్ణుఁడు. ఇది కృష్ణదేవరాయనామద్యోతక మని యండ్రు.

సత్యభామ శ్రీకృష్ణుని దూఱుట

చ. అన విని మానినీతిలక మప్పుడు మేయఱి దోఁప నిక్కి వీ
డిన కచపంక్తిఁ బల్మఱి ముడి న్వేడ దోపుచుఁ బైచెఱింగు గ్ర
క్కునఁ జనుదోయిఁ జేర్చుచు మొగంబున లేఁజెమ రంకురింప జం
కెననెఱిచూపు చూచి పలికెం జలితాధరపల్లవాగ్ర మై. 124

టీ. అనక, విని, మేయఱి=శరీరార్ధము, తోఁపక = ప్రకాశముకాఁగ, నిక్కి
=లేచి, వీడిన, కచపంక్తిక=కేశములపరుసను, ముడి = ముడియందు, వెడ=వ్యర్థముగా
(డూరకే), దోపుచుక=తూర్పుచు, పైచెఱింగుక=పైచెఱఁగును, చనుదోయిక=స్తన
ద్వయమున, గ్రక్కునక=శీఘ్రముగ చేర్చుచు, మొగంబునక, లేఁజెమరు=చిఱుచెమట,
అంకురింపక=పుట్టఁగా, జంకెననెఱిచూపు=బెదరింపుగల సొగసగుచూపు, చూచి, చలితా
ధరపల్లవాగ్రమై=తూలెడుచిగురువంటి మోవికొన గలదై, పలికెన్.

భా. సత్య శరీరార్ధ మగపడురీతిని లేచి వీడినకేశములముడి నమర్చుచుఁ బైఁట
సవరించుకొనుచు, బెదరింపుచూపునఁ గృష్ణునిఁ గాంచి యధరపల్లవము చలింప నీగతి
ననెను.

విశే. సత్యభామ యొనర్చిన యాచేష్టలు సంభ్రమవశమున నారీజను లొనర్చు
నవియు, వారు కామునకుని లోఁగొనునదననఁగూడ నిట్టివాని నొనర్తు రనియుఁ దెలియ
నయ్యెడు.

ఉ. ఈనయగారపుంబ్రియము లీపస లీమొగమిచ్చమాట లే
లా నిను నమ్మియుండినఫలం బిదె తోడన కల్గె నాకు నీ
యాన సుమీ నసుం జెనకి యాఱడివెట్టిన నవ్వువారలం
గాన *వెఱుంగునే పసులకాపరి భావజమర్మకర్మముల్ ?

---

* వెఱుంగునే.

టీ. ఈనయగారపుంబ్రియములు = ఈమృదుత్వముతోడి ప్రియవచనములు, ఈపసలు = ఈచాతుర్యములు, ఈమొగమిచ్చమాటలు = ఈముఖస్తుతివచనములు, ఏలా = ఎందులకు? నిను నమ్మియుండినఫలంబు = నిన్ను విశ్వసించినఫలము, తోడనె = వెంటనే నాకుర్క, కల్గెర్క = సంభవించెను. నీయాన సుమీ = నీతోడుసుమా, నన్ను, చెనకి= తాఁకి (నన్నుద్దేశించి) ఆఱడివెట్టిన నవ్వువారల్ = నిందించినపరిహాసకులను, కానవు= ఎఱుంగవు. (తెలిసికొనవు) (నన్ను నీవు గేలిచేయఁగా నవ్వువారిని ఇక్కడ చూడలేవు గదా అనియు.) 'కానను' అని పాఠాంతరము. అపుడు సత్య కర్తయగు. కానను= చూడలేను. పసులకాపరి=గోపాలుఁడు, భావజమర్మకర్మముల్ = మదనతంత్రములను, ఎఱుంగునే = తెలియునే?

విశే. "పసులకాపరివి కావుననే నను నారదుఁడు దూఱుచుండ నీవును వీనులకు విందుగ వింటివి. మఱియు నరసికశిఖామణివి కావుననే నాకు నీపొందు తగదు." అని సత్య కృష్ణుని గ్రామ్యజనతను, నరసికతను బ్రకటించుచుఁ బ్రసంగించె నని యెన్నునది.

ఉ. ఇం కిటు నిన్ను నమ్మ నను నేమిటికిం గెరలించె దెంతయుం
బొంకము గాని నీవలనిబొంకులు మాచవి గావు రుక్మిణీ
పంకజపత్రనేత్రకును బ్రాణపదంబులు గాని వల్లవీ
కింకర! చాలుఁ జాలు నుడికింపకు నింపకు లేనికూరుముల్. 126

టీ. ఇంక = ఈపైని, ఇటు=ఈరీతిగ, నిన్ను, నమ్మ = విశ్వసింపను, నన్ను, ఏమిటికి = ఎందులకు, కెరలించెదు=చెలరేఁగింతువు. ఎంతయున్ = మిక్కిలి, పొంకము =పొందిక, కాని (నిరుపయోగములు) నీవలనిబొంకులు=నీవాఁడుకూల్యమునకై యాడిన కల్లమాటలు, మాచవి=మాకురుచి, కావు. వల్లవీ కింకర = వ్రేతల సేవకుఁడా! రుక్మిణీ పంకజపత్రనేత్రకును, సత్యభామకే, ప్రాణపదంబులు=ప్రాణతుల్యములు, చాలుఁజాలున్, ఉడికింపకు=పరిహసింపఁజేయకుము, లేనికూరుముల్ = లేని స్నేహములను, నింపకు=నిండింపకుము.

విశే. '1. ఈవలనిబొంకులు, 2. నడికింపకు' అను పాఠాంతరములు గాననగును. 1. అర్థవిశేషస్ఫూర్తిలేమి నిందు విశేషమెద్దియుఁ గానరాదు. 2. నడికింపకు మనఁగాఁ గలపింపఁ జేయకు మని యర్థము. దీనికన్న నాఁడువారిమాటలగతి ననుసరించిన, నుడికింపకు మనునదియే సాధుపాఠ మని తోఁచెడిని. 'మాచవి' అని మాశబ్దప్రయోగ మభిమానాతిశయ సూచకము. వల్లవీకింకరపదము గ్రామ్యవనితాసక్తి ప్రకాశనపురస్సరముగ నరసికతాద్యోతనార్థము.

ఉ. *గట్టివచేఁతలుం బసలుఁ గల్లదనంబులు నీవు పుట్టఁగాఁ
బుట్టిన వెందు లేని పలుపోకలమాయలు నీకు వెన్నతోఁ
బెట్టిన వా యెఱింగియును బేలతనంబున నిన్ను నమ్మి నా
గుట్టును దేజము న్మిగులఁ గోల్పడిపోయితి నేమి సేయుదున్. 127

టీ. గట్టివచేఁతలుర్ = ధూర్తకృత్యములును, పసలుర్ = చాతుర్యములును, కల్లదనంబులుర్ = చెడ్డనడతలును, నీవు పుట్టఁగాఁ బుట్టినవి (నీపుట్టుకతోడనే పుట్టిన వనుట) ఎందుర్ = ఎచ్చటను, లేని, పలుపోకలమాయలు = అనేకవిధములైనమాయలు, నీకు వెన్నతోఁ బెట్టినవి. (నీ కుగ్గుతోఁ బుట్టిన వని భావము) బోట=అగుట, ఎఱింగియును= తెలిసియు, బేలతనంబులర్ = అవివేకమున, నిన్నుర్ నమ్మి=నిన్ను విశ్వసించి, నాగుట్టును= నామానమును, తేజమును=ప్రభావమును, మిగులర్ = మిక్కిలియు, కోల్పడిపోయితిర్ = పోఁగొట్టుకొంటివి. ఏమిచేయుదున్?

విశే. గట్టి + వా=గట్టినోరుగలవాఁడు=ధూర్తుఁడు. గట్టివ. 125, 126, 127 పద్యముల భగవత్పఙ్క్తి మగు నొకానొక యర్థవిశేషమును స్ఫురించెడు:—"125 ప్రియ ములును ముఖప్రీతికరములును నగుమాట లేల? నిన్ను భక్తిని నమ్మినందులకు వెంటనే ఫలము కల్గెను. నన్నుద్దేశించి నిందసేసినపరిహాసకుల నీవు దయమాఱఁ గాంచవు. ఓ గోపాల! మది నుదయించుమర్మకర్మముల నీ వెఱతయు నెఱుంగని సరళస్వభావుఁడవు. 126. ఇఁక నే నజ్ఞానమున నిన్నిదినములు భావించుగతిని నిన్ను భావింపను. న న్నేల యీగతిని గెరలఁజేయుదువు? పొందికకానిబొంకులు పలుకఁజాలను. లక్ష్మ్యంశసంభూతు రా లగు రుక్మిణికి నిక్కువముగ నీమాటలు ప్రాణప్రదములే. ఓగోపాల! నన్ను బాములపాల్సేయక యకృత్రిమ మగుకూరిమిం గాంతువుగాక. 127 సత్వరజస్తమోగుణముల నేర్పడుకృత్యముల మాయారూపుఁడ వై జగత్తును మోహింపఁజేయునిన్ను నే నజ్ఞాన వశమున సామాన్య గోపాలునిఁగాఁ దలంచితి. దాన నామానప్రభావములు డిందుపడి యెను. అయ్యో! నే నింక నేమి యెనర్తును" అని యీగతి నీపద్యత్రయమున భగవా నుని త్రిగుణాత్మకుని బొగడి, తదభక్తవాత్సల్యాతిశయమును నిపుణముగఁ బ్రకటించి, కవి వైష్ణవమతాశ్రయుఁ డగుకృతిపతి కింపు పుట్టించి, తనయభేదభావమును వెల్లడించె నని సరసహృదయులు తలంతురు. ఇట్టి యాశయము మది నిడికొనియే ఈసందర్భమున 'జగ న్నాటకసూత్రధారి' 'కుహనాగోపాలుఁడు' అని శ్రీకృష్ణరూపము భగవానునిమాయా రూపమే యని సూచించెను.

---

* గట్టినచేఁతలుం.

చ. మునిపతి వచ్చి పూ వొసఁగి మోదముతోడ భవత్ప్రియాంగన
నీనుతి యొనర్పఁగా వినినవీనుల మాచవిగానిమాటల
నీనవలసెంగదా యిపుడు నీ విట వచ్చుట పారిజాతవా
సనఁ బ్రకటించి నాకు నెకసక్కెము సేయన కాదె? చెప్పుమా. 128

టీ. మునిపతి = మానిరాజు (నారదుఁడు), మోదముతోడన్ = సంతోషముతో, భవత్ప్రియాంగనన్ = నీప్రియురాలిని, వినుతి = స్తుతి, ఒనర్పఁగాన్ = చేయఁగా వినినవీనులన్ = విన్న చెవుల చే, మాచవిగానిమాటలన్ = మారుచింపనిపల్కులను, వినవలసెంగదా = వినవలసివచ్చెనుగదా? ఇపుడు = ఈసమయమున, నీవు, ఇటన్, వచ్చుట, పారిజాత వాసనన్ = పారిజాతపుష్పపుఁదావిని, ప్రకటించి = వెల్లడించి, నాకున్, ఎకసక్కెము సేయనకాదె = పరిహాసముచేయుటకేకదా! చెప్పుమా.

వ్యా-విశే. 'భవత్ప్రియాంగన'యనటంజేసి, యామెయేనీయెక్కుడు మక్కువకుఁ బాత్రముగాన నేను గానని ధ్వనించెడు. మాశబ్దము చిత్తోన్నత్యద్యోతకము 'నాకు నెకసక్కెము' అనుచో 'నన్ను నెకసక్కెము' అనుటకు మాఱుగా షష్ఠ్యంతనాశబ్దము ప్రయుక్తము. ఇట్లు షష్ఠి పెక్కువిభక్తులకు మాఱుగఁ గల్గుట ప్రసిద్ధము.

క. మానంబె తొడవు సతులకు
మానమె ప్రాణాధికంబు మాన మఖిలస
మ్మానములకు మూలం బగు
మానరహిత మయిన బ్రతుకు మానిని కేలా? 129

టీ. సతులకున్ = పతివ్రతలగు స్త్రీలకు, తొడవు = అలంకారము, ప్రాణాధికంబు = ప్రాణమునకన్న నెక్కు డైనది. అఖిలసమ్మానములకున్ = సమస్తమైన గౌరవములకును, మూలము = కారణము, మానరహిత మైన = చిత్తోన్నత్యము లేని. అలం. ఉల్లేఖము.

తే. తనదుకోడండ్రలోనఁ బెద్దయుఁగ నన్ను
దేవకీదేవి మన్నించు నీవు నాకుఁ
జనవు లిచ్చుటఁజేసి యాసాధ్విసేవ
సేయఁ బోవంగ నా కింక సిగ్గుగాదె? 130

టీ. పెద్దయుఁగన్ = మిగుల పెద్దదానినిగా, మన్నించున్ = సమ్మానించును, చనవు = ప్రేమతోడిస్వాతంత్ర్యము. సాధ్వి = పతివ్రత.

సీ. ఉవిద యెవ్వతె నోఁచి యున్నదో యీస్యమం
తకరత్న మింక నౌఁదల ధరింప
నీరై వతకశై లచారుకూటవిటంక
కేలి కిం కెవ్వతె పాలుపడునో
యెవ్వతె కబ్బునో యీవసంతారామ
కర్పూరకదళికాగారవసతి
లీల నీమణిసౌధజాలకంబుల నిన్నుఁ
గూడి యెవ్వతె వార్ధిఁ జూడఁ గలదో
తే. యకట నేఁ బెంపఁ బెరిఁగిన శుకమయూర
శారికాబృంద మెవ్వతేఁ జేరునొక్కో
నన్ను నాతోడిసవతులు నగక మున్న
పంత మలరంగ నిన్ను మెప్పింతుఁ*గాక. 131

టీ. ఈస్యమంతకరత్నము=ఈస్యమంతక మను పేరుగలరత్నమును (దీనిని సత్రా జిత్తు సూర్యవరప్రభావమునఁ బడసి కూఁతున కరణ మొసఁగెను.) ఇంకన్=ఈపైని, ఔఁదలన్ = తలపైని, ధరింపన్=తాల్పఁగా, ఎవ్వతె, ఉవిద=స్త్రీ, నోఁచి=వ్రత మొనర్చి, ఉన్నదో, ఈరై వతక.....కేలికిన్=ఈరై వతకాద్రిసంబంధమైన సుందరము లైన శిఖరములందలిగువ్వగూడుల విహారమునకు, ఎవ్వతె, ఇంకన్, పాలుపడునో = లోఁబడునో, ఈవసంతారామ.....వసతి=వసంతోద్యానమందలి కర్పూరపుటరఁటిచెట్ల నడుమనైన గృహమందలియునికి, ఎవ్వతెకున్, అబ్బునో=లభించునో? లీలన్=విలాస ముతో, ఈమణిసౌధజాలకంబులన్=ఈరత్నాలమేడలగవాక్షములందు, నిన్నున్ కూడి, ఎవ్వతె, వార్ధిన్=సముద్రమును, చూడన్ కలదో, అకట=అయ్యో! నేను, పెంపన్ = పోషింపఁగా, పెరిఁగిన=అభివృద్ధినందిన, శుక...బృందము=చిలుకలయు నెమిళులయు గోరువంకలయు గుంపు, ఎవతెను, చేరునొక్కో = పొందునొకో? నాతోడిసవతులు = నాతోడివారలైనసపత్నులు, నగకమున్న = నవ్వకమును పే, పంతము=ప్రతిజ్ఞ, అల రంగన్ = ఒప్పునట్లు, నిన్నున్, మెప్పింతుఁగాక = తప్పకమెచ్చఁజేయుదును.

విశే. ఇందు సత్యభామ తనమరణమును గృష్ణునకు సూచించెను 'మెప్పింతుఁ గాన' అని పాఠాంతరము. ఆపక్షమున 'కాన' అనుదాని హేత్వర్థకావ్యయముగ గ్రహించి యుత్తరపద్యముతో నన్వయించుట యుచితము. 'సామికాన' అనుమున్నగు

* గాన.

ప్రయోగములందువలెఁగాక యిందు 'కాన' అనునది స్వతంత్రముగ సంబోధనమునఁ బ్రయుక్తమయ్యె నని కొందఱు వ్రాసిరి. కాని దీని కిందుఁదక్కఁ జెందును స్వతంత్ర ప్రయోగ మగపడమి నట్లు గ్రహింప నవకాశము లే దని తోఁచెడు.

క. నను నెవ్వతిఁగాఁ జూచితి,వని యంతర్బాష్పయగుచు నవనతముఖియై
ఘనతరగద్గదికాని,స్స్వనమున మఱి మాటలాడ శక్యము గామిన్.

టీ. ననుఁ, ఎవ్వతిఁగాఁ, చూచితివి=నన్ను సామాన్యవనితనుగా జెంచితివా ? ఇది యాఁడువార లను గరోక్తి. అని, అంతర్బాష్ప = లోనున్నకన్నీరు గలది, అగుచుఁ, అవనతముఖియై=వంచిన మోము గలదై, ఘనతరగద్గదికానిస్స్వనమునఁ = గొప్పదైన డగ్గుత్తిక గలస్వరముతో, మఱి=మఱియు, మాటలు+ఆడఁ = పల్కుటకు, శక్యము = వీలు, కామిఁ =కాకుండుటచే, ఉత్తరపద్యముతో నన్వయము.

వ్యా-విశే. కామి : అగుధాతువ్యతిరేకభావార్థకరూపము.

ఉ. ఈసునఁ బుట్టి డెందమున హెచ్చినశోకదవానలంబుచే
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభుకట్టెదుటఁ లలితాంగి పంకజ
శ్రీసఖమైనమోమునయిఁ జేలచెఱం గిడి బాలపల్లవ
గ్రాసకషాయకంఠకలకంఠవధూకలకాకలీధ్వనిన్. 133

టీ. లలితాంగి=సుందరమైన శరీరముగలసత్య, ఈసునఁ=ఈర్ష్యచే, పుట్టి, డెందమునఁ=మదిని, హెచ్చిన=వృద్ధినందిన, శోకదవానలంబుచేఁ=శోక మనుదవాగ్ని చే, గాసిలి=బాధనొంది, ప్రాణవిభుకట్టెదుటఁ=ప్రాణేశ్వరుఁ డగు శ్రీకృష్ణు నెట్టయెదుట, పంకజశ్రీసఖమైన=పద్మశ్రీకమిత్రమైన, మోమునయిఁ=ముఖమునిఁద, చేలచెఱంగు= వస్త్రాంచలమును, ఇడి=ఉంచి, బాల...ధ్వనిఁ-బాల=లేఁతయైన, పల్లవ = చిగురుల యొక్క, గ్రాస=తినుచే, కషాయ=మధురమైన, కంఠ=కుత్తుకకల, కలకంఠవధూ=ఆఁడు కోయిలలయొక్క, కల=అవ్యక్తమధురమైన, కాకలీ = సూక్ష్మమైన, ధ్వనిఁ = శబ్దముం బోలుశబ్దముతో, ఏడ్చెఁ.

వ్యా-విశే. చేల. ప్ర. చేలము, ఇచ్చోఁ 'చీర' అనుపాఠాంతర మగపడును. కాని యది వాడుకయందే స్త్రీవస్త్రమాత్రపర్యాయముగ నగపడుట నిందర్థవిశేష మేమియు లేదు. కడు+ఎదురు=కట్టెదురు. ఇది యాపవిభక్తిక మగుట టివర్ణమును సప్త మ్యర్థమున నత్వముం గల్గెను. ఇట్లే మనువసుచరిత్రముల స్త్రీరోదనము హృద్యమగుగతిని వర్ణితమయ్యెను. ఈమూఁడుపద్యములయర్థమును గమనించియే 'ముక్కుతిమ్మన ముద్దు

ముద్దుగను, అల్లసానిపెద్దన నల్లనల్లను, భట్టుమూర్తి బావురు మనియు నేడ్చె' నని పెద్దలందురు. నిక్కముగ నాలోచించిన, నీవర్ణనము ముద్దుముద్దుగనే యొప్పుచున్నది. "భవన్నఖాంకురము సోకెఁ గనుంగొను మంచు వేదనసెపం బిడి కలస్వనంబుతో మీటిన విచ్చుగుబ్బచనుమిట్టల నశ్రులు చిందువొందగా" వరూథిని నేడ్పించిన యల్లసాని వానివర్ణన మల్లనల్లనే యగపడును. మఱియు గిరిక "కాంభోజీరాగవిపంచికాకలన సైర్ణెత్తి మోమునఁ బటాగ్రం బొత్తి" యేడ్చినట్లు వర్ణించిమూర్తికవి వర్ణనము బావురు మని యేడ్చుటనే తెలుపును. ఇట్లే క్రమముగ నొకవర్ణనము నానంతరకాలికులు తమయిచ్చవచ్చినగతిని మెఱుఁగువెట్ట నెంచుట చూపట్టెడిని.

ఉ. ఆరమణీలలామ మది నంటినకోపభరంబు నిల్వఁగా
నేరక నెవ్వగం బొగుల నీరజనాభుఁడు నిండుఁగౌఁగిటం
జేరిచి బుజ్జగించి నునుఁజెక్కులఁ జాలుకొనంగ జాలుక
న్నీరు కరంబునం దుడిచి నెయ్యముఁ దియ్యముఁ దోఁప ని ట్లనున్.

టీ. ఆరమణీలలామ=ఆస్త్రీరత్నము, మది=మనస్సున, అంటిన = లగ్నమైన, కోపభరంబు = కోపభారమును, నిల్వఁగా, నేరక, నెవ్వగ = నిండుదుఃఖమున, బొగుల = దుఃఖింపఁగా, నీరజనాభుఁడు=కృష్ణుఁడు, నిండుఁగౌఁగిట =నిండైనభుజాంతరమున, చేరిచి, బుజ్జగించి=ఓదార్చి, నునుఁజెక్కులఁ, చాలుకొనంగ = వరుస గనునట్లు, జాలు = తొఱఁగు, కన్నీరు, కరంబున = హస్తముచే, తుడిచి, నెయ్యము= స్నేహము, తియ్యము = మాధుర్యమును, తోఁప = ప్రకాశితమగునట్లు, ఇట్లు= ఈరీతిగ, అను =అనెను. వచ్యర్థమున భూతమున లాడ్రూపము.

వ్యా-విశే. కాఁగిలి. ఔపవిభక్తికము.

ఉ. ఓలలితేంద్రనీలశకలోపమకై శిక ! యింత వంత నీ
కేల లతాంతమాత్రమున కేఁ గలుగ న్నిను నీకు దేవతా
కేలివనంబు సొచ్చి యనికి న్బలసూవనుఁ డెత్తి వచ్చినన్
దీలుపడంగఁ దోలి యిటఁ దెచ్చెదఁ నిచ్చెదఁ బారిజాతమున్. 135

టీ. ఓలలి...కైశిక=ఓసొగసైన యింద్రనీలమణిఖండములంబోలు కేశభారము గలదానా ! లతాంతమాత్రమునకున్ =పుష్పమాత్రమునకే, ఇంతవంత=ఇంతయధికమైన దుఃఖము, నీకున్, ఏన్ = నేను, కలుగన్ = ఉండఁగా, ఏల=ఎందులకు, విను=వినుము. దేవతాకేలివనంబు=దేవతలవిహారవనం బగునందనమును, చొచ్చి=ప్రవేశించి, అనికిన్ =

యుద్ధమునకు, బలసూదనుఁడు = బలాసురహంత యగుదేవేంద్రుఁడు, ఎత్తి=దండెత్తి, వచ్చినన్, దీలుపడంగన్ = భయపడునట్లు, తోలి=పాఱఁద్రోలి, ఇటన్ =ఇచ్చోటికి, పారిజాతమున్ =పారిజాతవృక్షమును, తెచ్చెదన్, నీకున్, ఇచ్చెదన్.

విశే. ఒక్క సుమమునకై నీ వింత వగవ నేల! సుమసమూహమున కంతకును నాధారమగు పారిజాతమునే నీపాలు సేయుదు నని 'మాత్ర' పదమునకు సారస్యము. ఆబలాసురహంత యగు దేవేంద్రునంతటివాఁ డెత్తివచ్చినను, నాతనిం బాఱఁద్రోలుదు నని యాత్మశక్త్యతిశయమును, నెంతటిదుష్కరకార్యమునైన నీవిషయమున నీకొఱకే నొనర్తు నని తనప్రేమాతిశయమును బ్రకాశిత మొనర్పఁ గృష్ణుఁ డిట్లు ప్రసంగించె నని 'బలసూదనుఁ డెత్తివచ్చినన్' అనుపదములకు సారస్యమును గ్రహింపనగును.

'తెచ్చెద ఇచ్చెద' అనుపదములు భావ్యర్థమున వాడఁబడిన 'ఎద' రూపములు.

తే. వామలోచన! నీకేలివనములోనఁ
జలువ వెదచల్లు చెంగల్వకొలనికెలన
సరసకర్పూరకదళికాతరులనడుమఁ
బెరటిచెట్టుగ నాటింతుఁ బెంపు గనుము. 134

టీ. వామలోచన=ఓమనోజ్ఞములగు కన్నులుగలదానా, నీకేలివనములోన్ = నీవిహారవనమున, చలువన్ =శైత్యమును, వెదచల్లు = వ్యాపింపఁజేయు, చెంగల్వకొలని కెలనన్ = ఎఱ్ఱకలువలు గల సరస్సుయొక్కపార్శ్వమున, సరసకర్పూరకదళికాతరుల నడుమన్ =సరసములగుకర్పూరపు టరఁటులమధ్యమునందు, పెరటిచెట్టుగన్ = ఇంటి వెనుకదొడ్డిలో నుండువృక్షమగునట్లుగ, నాటింతున్ =పాతింతును. పెంపున్ =సమృద్ధిని, కనుము=పొందుమా.

విశే. వృక్షము బాగుగఁ బెరుఁగుటకును, వాడకుండుటకును, నధికమనోజ్ఞ మగుటకును, నిత్యానందదాయక మగుటకును నిందలిప్రదేశములు సూచకములు. పారిజాతముం దెచ్చి మఱల నింద్రునకుఁగాని, యితరవనితలకుఁగాని యీ నని తెల్పుటకును, కేవలము దాని శాశ్వతముగ నీస్వత్వముం గావింతు నని తెల్పుటకును బెరటిచెట్టుగ నాటింతు నని శ్రీకృష్ణుఁడు సత్యతోఁ బల్కె నని సారస్యము నెన్నునది. కెలను. రూ. అ. కెలఁకు.

క. అని పలుకునంబుదశ్యా,మునిగర్జితమధురవాక్యముల సత్యామా
నిని నీపలతికవోలెం, గనుపట్టె సఖీమయూరికలు సెలరేఁగన్. 137

టీ. అని, పలుకు = మాటలాడు, అంబుదశ్యామని...వాక్యములన్ = నీల మేఘశ్యామునియొక్క గర్జితములఁబోలు తీయనిమాటలచే, సత్యామానిని=మానవతియైన సత్యభామ, నీపలతికవోలెన్ = కడిమిచెట్టువలె, సఖీమయూరికలు = చెలికత్తె లను నాఁడునెమిళ్ళు, చెలరేఁగన్ = విజృంభింపఁగా, కనుపట్టెన్ = చూపట్టెను.

విశే. వర్షాకాలమున మేఘగర్జనము కర్ణనతోడనే కడిమిచెట్టు పుష్పించుటయు, నెమిళులు పురివిచ్చికొని యాడుటయుఁ బ్రసిద్ధ మగుట, నంబుదశ్యామ మధురగర్జితవాక్య ములకలిమిని సత్యామానిని నీపలతికవోలి యగపడుటయు, సఖీమయూరికలు చెల రేఁగుటయు సంభవించె నని సారస్యము నెన్నునది. బలసూదనుతోడ యుద్ధమొనర్చి సంకల్పముపలనియుత్సాహము మీఱఁ బ్రసంగించుటకతన శ్రీకృష్ణవాక్యములు గర్జిత ములంబోలె గంభీర మయ్యె నని గ్రహించునది. ప్రియసఖి కవమానము తీరి యాప్తి తార్థప్రాప్తి మిన్నగ నగుటంజేసి చెలికత్తెలకును సంతసము కల్గె నని గ్రహించునది. పూఁచినకడిమివలె సత్యయు మేటివికాసమున మించె నని తెల్పుటకు నీపలతికపదము ప్రయుక్తము. అలం. రూపకోపమలు.

మ. దయమానాక్షివిలోక ! లోకహితకృత్ప్రారంభ ! రంభాకుచ
ద్వయమర్దాధిపతిద్విషత్పఠితగాథావ్యక్తదోస్సార ! సా
రయశస్సాంద్రదిశాంత ! శాంతహృదయారజ్యన్నయాచార చా
రయుతోపాయవిచార ! చారణగణప్రస్తూయమానోదయా ! 138

టీ. దయ...విలోక-దయమాన = కనికరమువలె నొప్పు, అక్షి=కన్నులయొక్క, విలోక=చూపుగలవాఁడ, లోక...ప్రారంభ-లోక=ప్రజలకు, హిత=ఇష్టమును, కృత్ = చేయునట్టి, ప్రారంభ=కార్యారంభములుగలవాఁడ ! రంభా...దోస్సార-రంభా = రంభ యొక్క, కుచద్వయ=స్తనద్వంద్వ మనెడు, దుర్గ = కోటలకు, అధిపతి=ప్రభువులైన, ద్విషత్=శత్రువులచే, పఠిత=చదువఁబడిన, గాథా=చరిత్రములచే, వ్యక్త = విదితమగు, దోస్సార=బాహుబలముగలవాఁడ, సార...దిశాంత-సార=శ్రేష్ఠమైన, యశస్=కీర్తిచేత, సాంద్ర=తతమైన, దిశాంత=దిగంతములు గలవాఁడ. శాంత...చార-శాంత=ప్రశాంత మైన (క్షాంతియుక్తమైన), హృదయ=మదియందు, ఆరజ్యత్ =పూర్ణముగఁ బ్రకాశించు నయాచార=నీతితోడినడతగలవాఁడ ! లేదా, శాంతహృదయులను రంజింపఁజేయు నీతి తోడినడవడికలవాఁడ, చార...విచార - చార = మర్జులగువారితో, యుత=కూడిన, ఉపాయ=సామాద్యుపాయములయొక్క, విచార = విమర్శనముగలవాఁడ ! చారణ...

దయా-చారణగణ=చారణులసమూహముచే, ప్రస్తూయమాన=నుతింపఁబడు, ఉదయా = అభివృద్ధిగలవాఁడా.

భా. కృష్ణరాయనిచూపులనుండి దయ యొల్కుచుండు నవియు, నాతఁ డేపని నైనను బ్రజాహితముం గోరియే చేయుచుండు ననియు, నాతఁ డనిం జంపినపగతురు వీరస్వర్గముం జూఱగొని రంభాపరిరంభసుఖము ననుభవించుచు నాతనిచరిత్రముం గొని యాడుచుందు రనియు, నాతనికీర్తి దిగంతవిశ్రాంత మయ్యె ననియు, నాతనినడవడి సజ్జన సంస్తూయమాన మనియు, నాతఁడు చారచక్షు వై సామదానభేదదండోపాయముల నరయు ననియు, నాతనియభివృద్ధి చారణజేగీయమాన మనియు భావము.

విశే. ఇయ్యది ముక్తపదగ్రస్తము. పదాంతమున విడువఁబడినపదమును మఱల స్వీకరించుచు నడుపుటకే ముక్తపదగ్రస్తమని పేరు. పాదాదినారబ్ధమైనపదమును తుది పాదపుఁ దుదినట్లే మఱల నావృత్తిచేసినచో, నదియే సింహావలోకన ముక్తపదగ్రస్త మగు. ఈనియమము ననుసరించి యిది సింహావలోకనముక్తపదగ్రస్తమే కాదగుంగాని ప్రథమ పాదాదిని 'దయ'అనియుండ నంతిమపాదాంతమున 'దయా' అని గుర్వంతముగ నుండుటంజేసి చింత్యము.

క. ప్రతివర్ష వసంతోత్సవ, కుతుకాగతసుకవినికరగుంభితకావ్య
స్మృతిరోమాంచవిశంకిత, చతురాంతఃపురవధూప్రసాదనరసికా ! 130

టీ. ప్రతివర్ష ...రసికా- ప్రతివర్ష = ప్రతిసంవత్సరమున నైన, వసంతోత్సవ = వసంతోత్సవమునందైన, కుతుక=సంతోషాతిశయముతో, ఆగత=వచ్చిన, సుకవినికర = సుకవిసమూహముచే, గుంభిత=కూర్పఁబడిన, కావ్య=కావ్యములయొక్క, స్మృతి = స్మరణముచేనైన, రోమాంచ=గగుర్పాటుచే, విశంకిత = మిగులసందియమందు, చతుర= నిపుణలైన, అంతఃపురవధూ = అవరోధజనముయొక్క, ప్రసాదన = తేర్చుటయందు, రసికా=సరసుఁడవైనవాఁడా.

భా. ప్రతిసంవత్సరమున వసంతోత్సవ మొనర్చువేళలఁ గవు లేతెంచి సరసము లగుకావ్యముల నొనర్చుచుందు రనియుఁ, దత్కావ్యరసాస్వాదముంజేసి కృష్ణరాయలకు రోమాంచము కలుగ, నది పెఱవనితలముందలియనురాగముకతనఁ దన కీరీతిని సాత్వి కోదయము కల్గెనని వారు భావింతురేమో యను భయమున, నాతఁడు వారిసందియమును దొలఁగించి సరసగతినిఁ దేర్చుచుండు ననియు భావము.

విశే. ఆశ్వాసాంతపద్య మగు నిందుఁ గవి యీయాశ్వాసమునందైన శ్రీకృష్ణ కృతసత్యానునయరూప మగు సంపూర్ణకథను 'చతురాంతఃపురవధూప్రసాదనరసికా'

అనుదానిమూలమున సూచించెను. మఱియుఁ గృష్ణరాయలు గోపము విడనాడి తనయెడం
బ్రణయాపరాధము గావించిన తిరుమలదేవిని దేర్చుటనుగూడ నిందుఁ గవి సూచించె
ననఁదగును. ఆతేర్చుటయుఁ దనకావ్యనిర్మితి మూలమునఁ జరిగె ననునంశమును గవి
'ప్రతివర్ష వసంతోత్సవ ... సుకవిగుంభితకావ్యస్మృతి...' ఇత్యాదిపదములమూలమున
నిపుణముగఁ బ్రకటించెను. మఱియుఁ దనకావ్యముగూడ వసంతోత్సవవేళనేసృష్టమయ్యె
ననునంశమునుగూడఁ దెలియఁబఱచెను. మఱియుఁ గృష్ణరాయలపాండిత్యమును రసజ్ఞ
తనుగూడఁ బ్రకాశమొనర్చెను. రాజు లక్కలమునఁనేగాక ప్రాచీనకాలము
నుండియు వసంతోత్సవము జరుపువాడుక యున్నట్లు సంస్కృతకావ్యాదులవలనఁ
దెలియవచ్చెడు.

నర్కుటము.—

ప్రసృతివిలోచనాకుసుమబాణ! దిశాలలనా
ఘుసృణపటీరలేపకృతికోవిద! బాహుతటీ
[1] విసృమరకీర్తిజాల! రణవీక్షితవైరినృప
త్యసృగతిపంకిలాసిముఖ! [2] యైందవవంశమణీ! 140

టీ. ప్రసృతి...బాణ-ప్రసృతివిలోచనా = చేరెడుకన్నులుగలస్త్రీలకు, కుసుమ
బాణ = పుష్పాయుధుఁడా! (మన్మథుఁడా!), దిశా...కోవిద-దిశాలలనా = దిగంగ
నలకు, ఘుసృణపటీర = కుంకుమపూవుతోడి మంచిగంధమును, లేప=పూయుట యను,
కృతి = కార్యమందు, కోవిద=పండితుఁడా! బాహు...జాల-బాహుతటీ = బాహు
ప్రదేశమునుండి, విసృమర=ప్రసరించునట్టి, కీర్తిజాల=కీర్తిసమూహముగలవాఁడ, రణ...
ముఖ-రణ=యుద్ధమునందు, వీక్షిత=చూడఁబడిన, వైరినృపతి = శత్రురాజులయొక్క,
అసృక్=రక్తముచే, అతిపంకిల = మిక్కిలి బురదగలదిగాఁ జేయఁబడిన, అసి = కత్తి
యొక్క, ముఖ = అగ్రముగలవాఁడా. ఐందవవంశమణీ! = చంద్రవంశశ్రేష్ఠుఁడా!
చంద్రవంశమనేవంశము (వెదురు) నకు మంచిముత్తియమైనవాఁడా! (చంద్రవంశ
ముక్తాఫలమా!)

విశే. 'వీక్షిత' అనుచో 'విక్షిత' అని యుండిన లెస్స, పరాక్రమముకతన సంభ
వించుటంజేసి కీర్తి బాహుతటినుండి ప్రసరించుచున్న దనెను. సామాన్యముగఁ గవులు
కీర్తినిఁ దెల్లఁగా నున్నట్లే వర్ణింతురు. ఇచ్చో నాసంప్రదాయము ననుసరించి పటీరలేప

1. విసృమరశౌర్యకీర్తి భరవిక్షితవైరి: 2. యాదవ.

మనినం జాలును. కాని, కృష్ణరాయలకీర్తి యతులప్రతాపసంభూత మగుటంజేసి రక్తవర్ణ మిశ్రితపటీరలేపముతోఁ బోల్చెను. మఱియుఁ జందనమునఁ గుంకుమపూవ్వుఁ గూర్చు టయు నాగార మైయుంట నీవర్ణన మెంతయు హృద్య మనఁదగును.

ఇది నరుక్కటవృత్తము. కొందఱు దీనినే కోకిలకాకమందురు. న. జ. భ. జ. జ. వ. గణములు. 11-వ అక్షరము యతిస్థానము.

గద్యము. ఇది శ్రీమదుమామహేశ్వరవరప్రసాదలబ్ధ సారసార
స్వతాభినంది నందిసింగయామాత్యపుత్ర కౌశిక
గోత్రపవిత్ర సుజనవిధేయ తిమ్మయనామ
ధేయప్రణీతం బైనపారిజాతాపహరణం
బను మహాప్రబంధంబునందు
బ్రథమాశ్వాసము.

# ద్వితీయాశ్వాసము



సదనలోచనాబ్జద
యాసారమరందపోషితార్థిభ్రమరో
ల్లాసగుణమలయకూట
ప్రాసాదనివేశ! కృష్ణరాయమహీశా. 1

టీక. శ్రీసదన...నివేశ-శ్రీ=లక్ష్మికి, సదన = స్థానములగు, లోచన = నేత్రము లను. అబ్జ=పద్మములసంబంధమైన, దయాసార=కృపావృష్టి యను, మరంద=పూఁదేనెచే, పోషిత=పోషింపఁబడిన, అర్థి=యాచకు లను, భ్రమర=తుమ్మెదలయొక్క, ఉల్లాసగుణ = వికాసగుణము గల, మలయకూటప్రాసాద = మలయకూట మను మేడ, నివేశ = వాసము గాఁ గలవాఁడ, కృష్ణరాయమహీశా = కృష్ణరాయభూమీశ, మీఁదిపద్యముతో నన్వయము.

భావము. భ్రమరములు పద్మమరందముం గ్రోలి యెలమి మీఱఁ బద్మగృహమున విహరించురీతిని, కృష్ణరాయల కనుదమ్ములనుండి వెల్వడుదయావృష్టి యన్మరందముం గ్రోలి యాచకభ్రమరము లాతనిమేడయం దెలమి మీఱ విహరించుచుండు ననియుఁ, దాదృశ యాచకభ్రమరవిహారాస్పద మగుమేడను కృష్ణరాయలు నివసించు ననియు భావము. అనఁగాఁ గృష్ణరాయలు దయ మీఱ సర్థుల నాదరించువాఁ డనియుఁ దాన వా రెల్లపు డును నాతనిమేడయం దెలమి మీఱ వర్తిలుఁ డనియుఁ దాత్పర్యము.

విశేషార్థాదులు. కృష్ణరాయలనేత్రములు మహాభాగ్యలక్షణలక్షితములై విరిసిన తమ్మలంబోలి యెప్పటియుఁ, గృష్ణరాయల కర్థులపైఁ గలయత్యాదరమును గమ్యములు. కృష్ణరాయఁడు-కర్మధారయం బియ్యది సిద్ధసమాంబట్ల యగును. కావున నిట్టిసంజ్ఞా వాచకములకు మీఁదిసంస్కృతపదములలోఁ సిద్ధసమాసము రాఁదగును. 'లక్ష్మమాపర తసయా, చల్లమాంబాసుతా' అనుమున్నగు నవిట్టివి కవిప్రయుక్తములు గాన నగును.

ఆబం. రూపకము.

తే. అవధరింపుము జనమేజయక్షితీశ, వరున కిట్లను నమ్మానివల్లభుండు
పారిజాతంబు దేనిట్లు ప్రతిన*వట్టి, చంద్రశాలకు నేతెంచి చక్రధరుఁడు.

టీ. అవధరింపుము=శ్రద్ధగా వినుము, జనమేజయక్షితీశవరునకున్ =జనమేజయుఁ డనురాజశ్రేష్ఠునకు, అమ్మానివల్లభుండు = ఆముసీశుఁడు, తేఁ = తెచ్చుటకు, ప్రతిన = ప్రతిజ్ఞ, చంద్రశాలకున్ = శిరోగృహమునకు, ఏతెంచి = వచ్చి.

వ్యా-విశే. అ+మానివల్లభుఁడు త్రికంబుమీఁది యసంయుక్తహల్లునకు ద్విత్వము కల్గును. ఊష్మ రేఫంబులకుఁ గలుగదు. ప్రతిన. వి. ప్రతిజ్ఞ. ప్ర.

ఏతెంచు=ఏగుతెంచు, అభ్యాగతి నరుగ్వాదులకుఁ దెంచుధాతు పనుప్రయుక్త మగును. అగుచో గువర్ణము విభాషను లోపించును.

మ. సరసాలాపముల న్వినోదకథలన్ సాత్రాజితీదేవిఁ బ్రే
మరసాంభోనిధి నోలలార్చి కడు సమ్మానంబు గావించి ని
ర్భరకౌతూహలవృత్తి నుండ ఘటికాపర్యాప్తిఘుంటారవాం
తరనిర్ణీతము లై వినంగఁబడియెన్ మధ్యాహ్నశంఖధ్వనుల్. 3

టీ. సరసాలాపముల్ = రసము చిప్పిలుమాటలచేతను, వినోదకథలన్ = ఱొమ్ము పోకకై చెప్పుకొనెడుకథలచేతను, సాత్రాజితీదేవిన్ = సత్రాజిత్పుత్రిక యగు సత్యభామను, ప్రేమరసాంభోనిధిన్ = అనురాగరససాగరమున, ఓలలార్చి = ఈఁదులాడఁజేసి, సమ్మానము=గౌరవము, గావించి = చేసి, నిర్భరకౌతూహలవృత్తిన్ = సంపూర్ణసంతోష వ్యాపారముతో, ఘటికా...నిర్ణీతములై - ఘటికా = గడియలయొక్క, పర్యాప్తి = నిండుటచేసైన, ఘుంటారవ=గంటలచప్పుడులయొక్క, అంతర=నడుమను, నిర్ణీతములై = నిర్ణయింపఁబడినవై, మధ్యాహ్నశంఖధ్వనుల్ = మధ్యాహ్నకాలమున నైన శంకముల ధ్వనులు.

వ్యా-విశే. ఓలలార్చి ప్ర. ఓలలాడు. ఆడోడుకూడుల డకారమునకుఁ జుక్క పరమగునపుడు రేఫం బగు. గావించి-ఇంచుక్కుగాగమములు పరము లగునపు డాగమా దేశలోపంబులు పెక్కు-తెఱంగులం గానంబడియెడి.

తే. సమయకృత్యంబు లప్పుడు సలుపఁ దలఁచు
నలిననాభునిచిత్తంబు దెలిసి సత్య
భామకనుసన్న నుడిగంపుఁబద్మముఖులు
నిలిచి రంతంత వినయంబు దొలఁక నెదుట. 4

---

* వలికి.

టీ. సమయకృత్యంబులు = కాలోచితకార్యములు, ఉడిగంపుఁబద్మముఖులు = సేవకురాండ్రు, కనుసన్నన్ = నేత్రసంజ్ఞను, అంతంతన్ = దగ్గఱఁగా.

వ్యా-విశే. ఉడిగంపుఁబద్మముఖుఁబు - కర్మధారయంబున మువర్ణకమునకుఁ బుంపు లగును. వానికిఁ బరుషములు పరమ్ముఁగా నుగాగమమును సరళాదేశాదులును నగును.

క. తలిరాకుఁబోఁడి యొక్కతి, జలకమునకు వేళ యనుచు శౌరికి వీణా
కలకలములఁ గలకలనగు,పలుకుల మెలపొలయ విన్నపముగావించెన్.

టీ. తలిరాకుఁబోడి = చిగురాకువలె మనోజ్ఞురాలైనపడఁతి, జలకమునకున్ = స్నానమునకు, వీణాకలకలములన్ = వీణాధ్వనులను, కలకల=ఇది హాసధ్వన్యనుకరణము. నగు=నధ్వనట్టి, పలుకులన్ = మాటలతో, మెలపు=మృదుత్వము, ఒలయన్ =వ్యాపించునట్లు, విన్నపము=విజ్ఞప్తిని, గావించెన్ =చేసెను.

భా. ఒకయువతి స్నానమునకు వేళ యయ్యె నని శ్రీకృష్ణునకు వీణాధ్వనిని దిరస్కరింపఁజాలు మృదువు లగుమాటలతో విన్నవించె నని భావము.

వ్యా-విశే. తలిరాకుఁబోడి - తలిరాకు = కర్మధారయంబునఁ బేర్వాదిశబ్దముల కచ్చు పరమగునపుడు టుగాగమంబు విభాష నగు. రూ. అ. తలిరుటాకు, అలరుఁబోఁడిత్యాదు లుపమానపూర్వపదకర్మధారయంబులు.

ఉ. ఇంచినవేడ్కఁ నాత్మహృదయేశ్వరిఁ గన్గొని శౌరి మందహా
సాంచితనేత్రుఁడై జలకమాడఁగ లెమ్మని పైఁడిచేలకొం
గించుక జాఱి నొక్కతరళేక్షణహస్తముఁ గేల నూఁదుచుం
గంచుకిసంచయంబు సముఖా యన గద్దియ డిగ్గె డిగ్గినన్. 6

టీ. ఇంచినవేడ్కన్ = అతిశయించినయానందముతో, శౌరి = శ్రీకృష్ణుఁడు, ఆత్మహృదయేశ్వరిన్ = తనప్రాణేశ్వరి యగు సత్యభామను, కన్గొని = చూచి, మందహా సాంచితనేత్రుఁడై=చిఱునగవుతో నొప్పుకన్నులుగలవాఁడై,జలకమాడఁగన్ =స్నానము చేయఁగా, లెమ్ము అని, పైఁడిచేలకొంగు = బంగరుబట్టయొక్కచెఱఁగు, ఇంచుక = కొంచెము, జాఱిన్, ఒక్కతరళేక్షణహస్తమున్ = ఒక్కచంచలాక్షిచేతిని, కేలన్ = చేతితో, ఊఁదుచున్ = నొక్కిపట్టుకొనుచు, కంచుకిసంచయంబు=అంతఃపురపుఁగావలివారు, సముఖా=పరాకు, అనన్, గద్దియన్ = ఆసనమును, డిగ్గెన్ =దిగెను, డిగ్గినన్ = దిగఁగా. ఉత్తరపద్యముతోనన్వయము.

వ్యా-విశే. కేలన్ ఇది యాపవిభక్తికము. పాపవిభక్తికముల తృతీయాసప్తముల కత్వం బాదేశం బగు.

క. ప్రామిసుకులపూఁబోఁడుల
సీమంతపుఁజెందిరంబుచే బలె నరుణ
శ్రీమించు నతనిపదముల
భామామణి యోర్తు పయిఁడిపావలు దొడిగెన్. 7

టీ. ప్రామిసుకుల...బలెక్ -ప్రామిసుకుల=వేదము లనెడు, పూఁబోఁడుల = స్త్రీల యొక్క, సీమంతపు=పాపటలసంబంధమైన, చెందిరంబుచేక్ బలెక్ =ఎఱ్ఱనిరంగుచేతవలె, అరుణశ్రీక్ = ఎఱ్ఱనైనకాంతితో, మించు = ప్రకాశించు, అతనిపదములక్ = ఆశ్రీకృష్ణునిపాదములందు, పయిఁడిపావలు = బంగరుపాదుకలను, తొడిగెక్ = కూర్చెను.

వ్యా-విశే. భగవాఁడు శ్రీకృష్ణుఁడుపనిషన్మౌళిలాలితుఁడు కాన, నాతని పాదము లాయుపనిషద్భానులపాపటలందలి యారుణ్యమున నరుణము లయ్యె నని యెన్ననది, ఇందు శ్రీకృష్ణునివేదాంతవేద్యతను గవి సూచించెను. ప్రాత + మినుకులు= ప్రామినుకులు. ప్రాఁతాదులతొలియచ్చుమీఁది వర్ణములకెల్ల లోపంబు బహుళంబుగా నగును. అలం. రూపకము; ఉత్ప్రేక్ష.

తే. కేళిగతి మీఱు మజ్జనశాల కరిగి
శాతమన్యవమణిమయాసనమునందుఁ
గౌస్తుభాదివిభూషణోత్కరము నెల్ల
నొయ్య నొయ్యన సడలించి యున్న యంత. 8

టీ. కేళిగతిక్ =సవిలాసమగునడకతో, మజ్జనశాలకుక్ = స్నానగృహమునకు అరిగి=ఏఁగి, శాతమన్యవ...నందు-శాతమన్యవ మణిమయ=ఇంద్రనీల మణిమయమైన ఆసనమునందుక్ = గద్దియయందు, కౌస్తుభాది...త్కరము నెల్లక్ =కౌస్తుభము మున్నగు నాభరణములనెల్లను, ఒయ్యనొయ్యన = మెల్లమెల్లగా, సడలించి = వదలించి, ఉన్న యంతక్ =ఉన్నమీఁద.

వ్యా-విశే. శతమన్యోరిదం శాతమన్యవమ్, అణ్ =ఇంద్రసంబంధమైనది.

## శ్రీకృష్ణుని మాధ్యాహ్నికస్నానము

ఉ. కంపనలీలమై నసదుఁగౌ నసియాడఁ గుచద్వయంబు స
ర్తింప లలాటరేఖ చెమరింపఁగ హారలతాగుళుచ్ఛముల్
తుంపెసలాడఁ గంకణమృదుధ్వని తాళగతిం జెలంగఁగా
సంపెఁగనూనె యంచె నొకచంద్రనిభానన కంసవైరికిన్. 9

టీ. కంపనలీలమ్రైక్ = చలనవిలాసముచే, అసదుఁగౌను = అల్పమగునడుము, అసియాడక్ = మిగులఁ జలింపఁగా, లలాటరేఖ=నొసలిరేక, చెమరింపఁగక్ =చెమ్మగిలఁగా, హారలతాగుచ్ఛముల్ =హారము లనులతలయొక్కగుంపులు, తుంపెసలాడక్ = నటింపఁగా, కంకణమృదుధ్వని=కంకణములయొక్క మెలపైనసవ్వడి, తాళగతిక్ = లయయొక్కరీతితో, చెలంగఁగాక్ = ఒప్పఁగా, ఒకచంద్రనిభానన=ఒకచంద్రముఖి, కంసవైరికిక్ = శ్రీకృష్ణునకు, సంపెఁగనూనె = సంపెంగతైలమును, అంటెక్ = రాచెను.

వ్యా-విశే. కంపనలీలమ్రైక్-తృతీయావిభక్తిప్రత్యయ మగు చేతవర్ణకమునకు బదులుగా 'మెయి, మ్రై'అనునవి వికల్పముగఁ గల్గును. అసదు కౌను-ఊదంతంబు లగుస్త్రీ సమంబులకును, పుంపులకును బరుషసరళములు పరము లగునపుడు నుగాగమం బగు. మోద ద్రుతకార్యములు. సమాసంబుల ద్రుతమునకు స్వత్వము లేదు. అసదుఁగౌను. అలం. స్వభావోక్తి, సముచ్చయము.

ఉ. తామరదోయిలోఁ దగిలి దాఁటెడుతేఁటులఁ బోలఁ బెన్నెఱుల్
వేమఱు చేతులం బిడిచి విప్పి విదిర్చి నఖాంకురంబులం
గోమలలీల దువ్వి తెలిగొజ్జఁగినీ రెడఁ జల్లి చల్లి గం
ధామలకంబు వెట్టె నొకయంగన కాళియనాగభేదికిన్. 10

టీ. తామరదోయిలోక్ = పద్మద్వంద్వమున, తగిలి=చిక్కుకొని, దాఁటెడుతేఁటులక్ =దాఁటుచున్నతుమ్మెదలను, పోలక్ =పోలఁగా, పెన్నెఱుల్ = పెద్దవెండ్రుకలగుంపును, వేమఱు=మాటిమాటికి, చేతులక్ =హస్తములచే, పిడిచి, విప్పి, విదిర్చి = వదలునట్లుచేసి, నఖాంకురంబులక్ = గోటిమొలకలచే, కోమలలీలక్ = మృదువైనరీతితో, దువ్వి, తెలిగొజ్జగినీరు = తెల్లనిపస్నీరు, ఎడక్ =నడుమనడుమ, చల్లిచల్లి = చిలికిచిలికి, గంధామలకంబు = పరిమళించునుసిరికముద్దను, ఒకయంగన = ఒకస్త్రీ, కాళియనాగభేదికిక్ = కాళియు నడఁచినశ్రీకృష్ణునకు, పెట్టెక్.

వ్యా-విశే. పెద్ద + నెఱులు=పెన్నెఱులు; సమాసంబునఁ బ్రాఁతాదుల తొలియచ్చుమోఁదివర్ణములకెల్ల లోపంబు బహుళంబు. పరుషేతరములు పరము లగునపుడు వానికి ద్విత్వము కల్గును. తేఁటులు. రూ. అ. తేంట్లు. చేతులక్-ఇటి తివర్ణము లోప విభక్తికములు. అవి ద్వితీయాద్యేకవచనములు పరములగునపుడు కొన్నిశబ్దములకుఁ బ్రాయికముగ నగును. "కాళియుఁడు కద్రువకుమారుఁడు. జనులు పెట్టినభక్ష్యముల సర్పము

లన్నియు గరుడున కిచ్చుచుండఁ గాళియుఁడు వానిని గరుడున కొసంగకుండుటఁజేసి, గరుడుఁ డాతనిపైఁ గోపము నూని వానిం దఱిమెను. దానంజేసి భయపడి కాళియుఁడు సౌభరిశాపవశమున గరుడునకుఁ జొఱరానికాళిందిమడువుం జొచ్చెను. ఆతఁ డందుఁ బ్రవేశించుటంజేసి యందలిజలము విషమయ మగుటయు, జీవకోటి చచ్చుటయు సంభవింపఁ, గృష్ణు డక్కొలనుఁ బ్రవేశించి కాళియునిశిరముం దనపాదమునఁ ద్రొక్కి, తజ్జాయలసంప్రార్థనము ననుసరించి వానిం జంపక పాతాళమున కణఁగఁ ద్రొక్కెను." అని తులాకావేరీమాహాత్మ్యము. అలం. ఉపమ.

మ. చెలువ ల్గొందఱు హేమకుంభములతోఁ జేసే నొసంగ న్వినిర్మలదోర్మూలరుచు ల్వెలిం బొలియఁ దోరంబై నచన్గ్రోయిసం
దొలయ న్వేనలి జాఱ నిక్కి యరమే నొయ్యారమై వ్రాలఁగా
జలకంబార్చె లతాంగి యోర్తు యదువంశస్వామికిన్వేడుకన్. 11

టీ. కొందఱు చెలువలు = కొందఱుస్త్రీలు, హేమకుంభములతోన్ = బంగరు గిండ్లతో, చేసేన్ = ఒకరొకరిచేతిమీఁదుగా, ఒసంగన్ = ఈయఁగా, వినిర్మలదోర్మూల రుచుల్ = స్వచ్ఛములైన బాహుమూలములకాంతులు, వెలిన్ = బయటికి, పొలయన్ = వ్యాపింపఁగా, తోరంబైన = స్థూలమైన, చన్గ్రోయిసందు = స్తనద్వంద్వముయొక్క సంధ్యము, ఒలయన్ = వ్యాపింపఁగా, వేనలి = కొప్పు, జాఱన్ = వీడఁగా, నిక్కి = ఊబ్బి, అరమేను = సంగోరుశరీరము, ఒయ్యారము వి = అందముగా, వ్రాలఁగాన్ = వంగఁగా, ఓర్తు లతాంగి = ఒకతీవఁబోఁడి, వేడుకన్ = ఉత్సాహముతో, యదువంశస్వామికిన్ = యదు కులభర్తయగు శ్రీకృష్ణునకు, జలకంబార్చెన్ = స్నానముచేయించెను.

వ్యా-విశే. చేసేన్ - 'చేసేతన్' అనుదాని క్షిప్తరూపము. 'చన్గ్రోయి' ఇందలి నకారము ద్రుతమనునంశము చింత్యము. నకారమాత్రము ద్రుత మనిన సరిపడును. అలం. స్వభావోక్తి.

సీ. చెంద్రికపూవన్నె జిలుఁగుదువ్వలువను
దడియొత్తె నొకకాంతాలలామ
కొనగోళ్ల నెఱులు సిక్కులు వాపి మెలపున
శిర సార్చె నొకలేఁజిగురుఁబోఁడి
వెన్నెలనిగ్గులు వెదచల్లెడుమఱుంగు
లందిచ్చె నొకపూర్ణేందువదన
నవరత్నమయభూషణవ్రజంబులు మేనఁ
గీలించె నొకరాజకీరవాణి

తే. విరులసరు లిచ్చె నొకయరవిందగంధి
యలఁదెఁ జందన మొక ధవళాయతాక్షి
సుదతి యొక్కఁ తె కపురంపుసురఁటి విసరె
నిలువుటద్దంబు నొకయింతి నిలిపె నెదుట. 12

టీ. చెంద్రికపూ...వలువను = కుసుంబపుష్పవర్ణములుగల సన్ననికట్టుకోకచే, ఒక్కకాంతాలలామ=మిక్కిలియందకత్తెయగు నొకతె, తడియొత్తెను. కొనగోళ్లక్ = గోరులకొసలచే, నెఱులు=వెండ్రుకలు, చిక్కులు = అల్లికొనుటలు, పాపి = పోఁగొట్టి, మెలపునక్ = మృదువుగా, ఒకలేఁజిగురుఁబోఁడి = ఒకలేఁజిగురువలె మనోజ్ఞమైన యొప్పిదముగలపడఁతి, శిరసు, ఆర్చెక్ =ఆరఁజేసెను. వెన్నెలనిగ్గులు = వెన్నెలయొక్క యుత్కృష్టకాంతులను, వెదచల్లెడు=వ్యాపింపఁజేసెడి, మడుంగులు=వస్త్రములను, ఒక్క పూర్ణేందువదన=పూర్ణచంద్రునింబోలు మోముగల యొకవనిత, అందిచ్చెక్ = సమర్పించెను. నవరత్న...వ్రజంబులు = తొమ్మిదిజాతులరత్నములచే బహుళములైన యలంకారసమూహములను, ఒకరాజకీరవాణి = శుకరాజముయొక్క పల్క్కలంబోలుపలుకులుగల యొకయువతి, కీలించెక్ =అమర్చెను. విరులసరులను=పూదండలను, ఒకయరవిందగంధి=పద్మపరిమళమువంటిపరిమళముగల యొకవనిత, ఇచ్చెక్. చందనము, ఒకధవళాయతాక్షి = తెల్లనిదీర్ఘములైనకన్నులుగల యొకతరుణి, అలఁదెక్ =పూసెను. కపురంపుసురఁటిక్ = కర్పూరపువీవనను, సుదతి ఒక్కతె = మంచిదంతములుగలయొకతె, విసరెక్ =వీచెను. ఒక ఇంతి=ఒకస్త్రీ, నిలువుటద్దంబుక్ = నిలిచియుండుపెద్దయద్దమును, ఎదుటక్ =అభిముఖముగా, నిలిపెక్ = ఉంచెను.

విశే. అందకత్తెలలో మిన్నగాన నందమగువలువ నొసంగె ననియు, చిగురువలె మనోజ్ఞమైన యొప్పిదముగలది గానఁ జిగురులకొనలంబోలు కొనగోళ్లచే మెలపునఁ జిక్కఁదీర్చుట శిరసార్చుట నొనర్చె ననియుఁ, పూర్ణచంద్రునింబోలు మోము గలవి గావున వెన్నెలనిగ్గులవెదఁజల్లు వస్త్రముల నొసంగఁగల్గె ననియు, రాజకీరవాణి (రాజపుత్రి) కావుననే రత్నాభరణరాజిఁ జక్కగ నమర్చె ననియుఁ, బద్మగంధి కావుననే కమ్మవిరుల నొసంగె ననియుఁ, దెల్లనిదీర్ఘములగుకన్నులు గలదికావుననే తెల్లనిచందనమును మేనఁ బూసె ననియు, కప్పురపుఁబలుకులంబోలు మేలుదంతములు గలది కావుననే కర్పూరపుసురఁటి విసరె ననియు, యౌవనపుమేనితళుకుల మించునింతి కావుననే తళతళ మెఱయు నద్దమును నిల్పె ననియు, నిట్లిందలి యువతీకృతకృత్యములు తత్తరుణీరూప విలాసానురూపములై, సాభిప్రాయములై వెలయుచున్నవి. అలం. పరికరము.

వ్యా-విశే. కప్పురము + సురటి - కర్మధారయంబుల మువర్ణకమునకుఁ బుంపులగు. నిలువు + అద్దము. కర్మధాలయంబులం దుత్తున కచ్చుపరంబగునపుడు టుగాగమంబగు, నవరత్నములు— 1. మౌక్తికము, 2. పద్మరాగము, 3. వజ్రము, 4. ప్రవాళము, 5. మరకతము, 6. నీలము, 7. గోమేధికము, 8. పుష్యరాగము. 9. వైడూర్యము.

క. కలికినిడువాలుఁగన్నుల, తళుకులు మణిదీపశిఖలుఁ దడఁబడ లక్ష్మీ
నిలయున కిచ్చిరి కొందఱు, నెలఁతలు మౌక్తికవిచిత్రనీరాజనముల్.

టీ. కలికి...తళుకులు=మనోజ్ఞములగువాల్గన్నులతళతళలును, మణిదీపశిఖలున్ = మణిదీపాగ్రములును, తడఁబడన్ =వ్యత్యాసపడఁగా, కొందఱు నెలఁతలు = కొందఱు వనితలు, మౌక్తికవిచిత్రనీరాజనముల్ = ఆణిముత్తెములరూపమైన యాశ్చర్యకరము లగుహారతులను, లక్ష్మీనిలయునకున్ = లక్ష్మీదేవికి స్థానమైనవానికి (శ్రీకృష్ణునకు) ఇచ్చిరి=ఇడిరి.

వ్యా-విశే. "ఇయ్యవి మణిదీపాగ్రములు, ఇయ్యవి కన్నులతళుకులు" అని యేర్పడ లేదనుటంజేసి కన్నులతళుకుల కసాధారణకాంత్యతిశయము సూచిత మయ్యెను. కప్పురపుటారతులుగాక మౌక్తికనీరాజనము లగుట విచిత్రనీరాజనము లనెను. లక్ష్మీనిలయుండనుట సాక్షాన్నారాయణత్వము సూచితము. వాలు + కన్నులు, సమాసంబుల నుదంతంబులగు స్త్రీసమంబులకును, బుంపులకును బరుషసరళములు పరములగునపుడు నుగాగమంబగు, సమాసములద్రుతమునకు స్వత్వలోపసంశ్లేషములు గలుగవు.

మ. జలకం బొడి మడుంగు గట్టి మణిభూషాదీప్యమానాంగియై
కలపం బెంతయు వింతగా నలఁది చెంగల్వ ల్నెఱిన్మించ వే
నలిఁ గీలొక్కల్పి పసిండియందెరవళి న్రాయంచ లంతంత రాఁ
జెలులుం దానును సత్యభామ సనుదెంచెన్నాథుఁ డుప్పొంగఁగన్.14

టీ. జలకంబొడి=స్నానముచేసి, మడుంగు = ధౌతవస్త్రము, కట్టి=ధరించి, మణిభూషాదీప్యమానాంగి యై = మణిమయములగునలంకారములచేఁ బ్రకాశించుశరీరము గల దై, కలపంబు=మైపూఁత, ఎంతయున్ =మిక్కిలి, వింతగాన్, అలఁది=పూసి, చెంగల్వల్ =ఎఱ్ఱికలువలు, నెఱిన్ =మనోహరముగా, మించన్ =ప్రకాశించునట్లు, వేనలిన్ =కొప్పును, కీలొక్కల్పి = తఱిమి, పసిండియందెరవళిన్ = బంగరుటందియసవ్వడిచే, రాయంచలు=రాజహంసలు, అంతంతన్ =దగ్గఱదగ్గఱగా, రాన్ = రాఁగా. సత్యభామ, చెలులును దానును, నాథుఁడు=పతి యగు శ్రీకృష్ణుఁడు, ఉప్పొంగఁగాన్ =సంతసింపఁగా, చనుదెంచెన్ = ఏతెంచెను.

వ్యా-విశే. "ఆత్మార్థం బభిహిత మగుచోఁ దల్లింగసంఖ్యాభిధాయివచనంబు ధాతు విశేషణంబుల కగు." అనుపద్ధతి నిచ్చో తాను శబ్దప్రధానముగనే క్రియ సమకెంచె నని యేకవచనమున నమరియున్నది. రాయంచ లంతంత రా నమటంజేసి హంసగమన ముల మించి యమ్మందయానమడక లమరియుంటఁ దెలియనయ్యెడు. రాయంచ. ప్ర. రాజహంస. ఇందుఁ బ్రియవాల్లభ్యపాత్రమును సమయోచితమును నగురీతిని సత్యా శృంగారవేషమును గవి నిరూపించినాఁడు.

సీ. మాత్సర్యఘనమేఘమాలికాపగమప్ర కాశితహిమధామకళ యనంగ
విరహనిశీథినీవిరమసంప్రాపితోన్మీలనామోదపద్మిని యనంగఁ
గ్రోధదంతావళక్షోభవిశ్రమపునస్సంజాతనైర్మల్యసరసి యనఁగ
సంతాపనై దాఘసమయనిర్గమకోరకితనవమాలతీలతిక యనఁగ

తే. గాంతిఁ జెన్నారి వికసితస్వాంత యగుచుఁ
గలఁక యెంతయు దిగఁద్రోచి చెలువ మెసఁగఁ
జేర వచ్చినప్రియభామ గారవించి
యున్న యత్తఱి మురవైరిసన్నిధికిని. 15

టీ. మాత్సర్య...కళ - మాత్సర్య = ఈర్ష్య యను, ఘన = గొప్పదగు, మేఘ మాలికా = మేఘపంక్తియొక్క, అపగమ = పోకచే, ప్రకాశిత = ప్రకాశింపఁజేయఁ బడిన, హిమధామ=చంద్రునియొక్క, కళ, అనంగక = అనునట్లుగ, విరహ...పద్మిని, విరహ=వియోగ మను, నిశీథినీ = రాత్రియొక్క, విరమ = తెగుటచేత (పోవుటచేత), సంప్రాపిత=పొందింపఁబడిన, ఉన్మీలన=వికాసమును, ఆమోద=పరిమళముగల, పద్మిని = పద్మలత, అనంగక, క్రోధ...సరసి-క్రోధ=కోప మను, దంతావళ=మీనుఁగుసంబంధమైన, క్షోభ=కలఁతయొక్క, విశ్రమ = విశ్రాంతిచే (తొలఁగుటచే), పునఃతిరుగ, సంజాత = కలిగిన, నైర్మల్య = నిర్మలత్వము కల, సరసి = సరస్సు, అనంగక, సంతాప...లతిక - సంతాప=కాక యను, నైదాఘసమయ = గ్రీష్మకాలముయొక్క, నిర్గమ = పూర్ణమగు పోకచే, కోరకిత=మొగ్గతొడిగిన, నవ=క్రొత్తదగు, మాలతీలతిక=మాలతీలత, అనంగక, కాంతిక=ప్రకాశముతో, చెన్నారి = సొగసునంది, వికసితస్వాంత అగుచుక=వికసించినమది కలదై, కలఁక=కలఁతను, ఎంతయుక=మిక్కిలి, దిగక త్రోచి = విడిచి, చెలువము=అందము, ఎసఁగక=ఒప్పఁగా, చేరక = దగ్గఱకు, వచ్చిన = ఏతెంచిన, ప్రియభామక = ప్రియకాంతను, గారవించి = సమ్మానించి, ఉన్నయత్తఱిక = ఉన్నయా సమయమున, మురవైరిసన్నిధికిని = శ్రీకృష్ణునిసమీపమునకు. మునుపటిపద్యముతో నన్వయము.

భా. మబ్బుతొలఁగుటచేఁ బ్రకాశించు చంద్రకళయట్లు మాత్సర్యము తొలఁగుట కతన సత్య ప్రకాశించె ననియు, రేయి కడచుటచేఁ జెందిన వికాసపరిమళములు గల పద్మిని విధమున విరహవిరామమున సత్య ప్రకాశసంతసముల నంది చెలువారె ననియు, దంతా వళ సంక్షోభము తొలఁగుటకతన మఱల నతిస్వచ్ఛ మై మించు సరసుకరణి సత్యభామ క్రోధాపగమమున తిరుగ నెప్పటిరీతిని సైర్మ్యము నంది నదె ననియు, గ్రీష్మ కాలము చనుటచే మొగ్గతొడిగినమాలతీలతికచందమున సాత్రాజితి సంతాపము పోవుటంజేసి యత్యుత్సా హము కల దయ్యె ననియు భావము. సత్య మనసుకు వికాసమును నంగమునకుఁ బ్రకా శమును గల్గె నని తాత్పర్యము.

వ్యా-విశే. అ+తఱిఁ = అత్తఱిఁ. త్రికంబుమోఁది యసంయుక్తహల్లునకు ద్విత్వము బహుళముగఁ గల్గును. ఊష్మ రేఫంబులకుఁ గలుగదు. అలం. రూపకానుప్రాణి తోత్ప్రేక్ష, ఉల్లేఖము; యథాసంఖ్యమును.

సత్యభామకడకు నారదుఁడు వచ్చుట

క. చనుదెంచెఁ గలహభోజన,ముని రుక్మిణి వీడుకొల్ప మున్నీటిజలం
బున మజ్జనాదిమాధ్యం,దినకృత్యము లాచరించి నిష్ఠాపరుఁ డై. 16

టీ. కలహభోజనముని = జగడముతిండిగాఁగలజడదాతి, రుక్మిణి, వీడుకొల్పఁ = పంపఁగా, మున్నీటిజలంబునఁ = సముద్రోదకమున, మజ్జనాదిమాధ్యందినకృత్యములు= స్నానము మున్నగు మధ్యాహ్నసమయమునఁ జేయనగుకార్యములు, ఆచరించి = చేసి, నిష్ఠాపరుఁ డై=నియమపరుం డై, చనుదెంచెఁ=వచ్చెను.

వ్యా-విశే. ముందు+నీరు=మున్నీరు. మున్నీరు+జలము=మున్నీటిజలము. సమా సమునఁ బ్రాఁతాదులతొలియచ్చుమోఁదివర్ణములకెల్ల లోపమును వానికిఁ బరుషేతరములు పరము లగునపుడు ద్విత్వమును, బిదప వృత్తి నౌపవిభక్తికటివర్ణము నీరు శబ్దములోని రువర్ణమునకుఁ గల్గెను.

చ. అతనికి సత్యభామయు మురాసురవైరియు నాతిథేయస
త్కృతు లొనరించి యుండఁగ సతీమణు లిద్దఱు పళ్లెరంబు వే
ట్టితి మని విన్నవించినఁ దటిల్లతయు న్జలదంబు యామినీ
పతి వెనుకొన్నకైవడిఁ దపస్వియుఁ దామును భుక్తిశాలకున్. 17

టీ. అతనికిఁ = ఆనారదునకు, ఆతిథేయసత్కృతులు = అతిథియోగ్యము లగు సత్కారములు, ఒనరించి=చేసి, ఉండఁగఁ, ఇద్దఱు సతీమణులు=ఇర్వురు వనితారత్న ములు, పళ్లెరంబు పెట్టితిమి = భోజనపాత్రముల నమర్చితిమి, అని, విన్నవించినఁ = విజ్ఞాపనసేయఁగా, తటిల్లతయుఁ = మెఱుపుఁదీఁగయు, జలదంబుఁ = మేఘమును, యామినీ

పతిక్ =చంద్రుని, వెనుకొన్నకైవడిక్ =వెంబడించినరీతిని, భుక్తిశాలకుక్ =భోజనగృహమునకు, (మహానసమునకు.)

విశే. తెల్లనినారదుఁడు చంద్రునివలెను, నాప్రని వన్నంటి చను మెఱుఁగుఁబోడి సత్యయు నీలనీరదగాత్రుఁడు కృష్ణుఁడును విద్యుల్లతాజలదములభంగిని నుండిరని తాత్పర్యము. భార్యాభర్తలఁ దటిన్నేఘములుగను దదనుసరణమున్ గల ధవళదేహుని నారదుఁ జంద్రునిగను బోల్చుట యెంతయు హృద్య మైయున్నది. అలం. ఉపమ.

మ. చని గారుత్మతరత్న పాత్రికలఁ గంసద్వేషి సాంబాదినం
దనులు న్సాత్యకిముఖ్యసోదరులు నానాబంధుసంతానమున్
దన మ్రోల న్వసియింప మౌనిపతిచెంతం దాను నర్హాసనం
బున నుండె న్భుజియింప వీవనల నంభోజేక్షణ ల్వీవఁగన్. 18

టీ. చని=ఏఁగి, కంసద్వేషి=కంసవైరి శ్రీకృష్ణుఁడు, గారుత్మతరత్న పాత్రికలక్ = గరుడపచ్చలచేసైన పాత్రలందు, సాంబాదినందనులక్ =సాంబుఁడు మొదలగు, కుమారులును, సాత్యకిముఖ్యసోదరులు = సాత్యకి మొదలగు నన్నదమ్ములును, నానాబంధుసంతానమక్ =వివిధబంధుసమూహమును, తన మ్రోలక్ = తనసన్నిధిని, వసియింపక్ = నివసింపఁగా, తాను, మౌనిపతిచెంతక్ =ముసీశునిసమీపమున, అర్హాసనంబునక్ = ఉచితాసనమున, భుజియింపక్ = భోజనము సేయఁగా, వీవనలక్ =తాళవృంతములచే, అంభోజేక్షణల్ =పద్మేక్షణలు, వీవఁగక్ =విసరఁగా, ఉండెన్.

వ్యా-విశే. భుజియింపక్. రూ. అ. భుజింపన్.

సీ. శాకపాకంబులచవులు వక్కాణించు
గతిఁ గంకణంబులు గల్లు మనఁగ
నతివేగ మిడుఁడు మీ రనుమాడ్కి మేఖలా
కీలితరత్నకింకిణులు మెరయఁ
గలమాన్న రుచితోడఁ గలహించుజాడ్య దు
వ్వలువ[1]పింజెలు ఫెళఫెళ యనఁగ
నారగింపుఁడు మీక లని ప్రియం బొనరాడెడు
పొలుపున మెట్టియ [2]ల్లులుకరింప
తే. నలరుఁబోఁడులు వడ్డింప నచటఁ గలహ
భోజియును దాను బహుభక్ష్యభోజ్య లేహ్య

1. పింజలు. 2. గిలుకరింప.

చోష్యపానీయముల మధుసూదనుండు
సారెఁ గొనియాడుచును వేడ్క నారగించె. 19

టీ. శాకపాకంబులవవులు = కూరలయొక్కయు వంటకములయొక్కయు రుచులు, వక్కాణించుగతిక్ =చెప్పెడురీతిని, కంకణంబులు=ముంజేతినగలవిశేషములు, గల్లు మనఁగ్ =గల్లు మని శబ్దింపఁగా, అతివేగము=మిగులవేగముగా, ఇడుఁడు= పెట్టుఁడు, మీరు, అనుమాడిక్ = అనువిధముగ, మేఖలాకీలితరత్నకింకిణులు-మేఖలా=నడుమున కీలిత=స్థాపింపఁబడిన, రత్న=రత్నవికారములగు, కింకిణులు= చిఱుగంటలు, మొరయ్ =ధ్వనిచేయఁగా, కలమాన్నరుచితోడ్ =వరియన్నపుఁగాంతితో, కలహించుజాడ్ =వాదుఁగాడురీతిని, దువ్వలువపింజెలఁ=కట్టుబట్టయొక్కకుచ్చెలు, ఫెళఫెళ యనంగ్ =ఫెళఫెళయనఁగా, ఫెళఫెళ ధ్వన్యనుకరణము. మీరలు,ఆరగింపుఁడు= భుజింపుఁడు, అని, ప్రియ=ప్రియవాక్యము, ఆడెడుపొలుపునన్ =పలెక్కడుచందమున, మెట్టియలు=మట్టెలు (పాదపుత్రేళ్ళులకమర్చునాభరణవిశేషములు), గులకరింపన్ =శబ్దింపఁగా, అలరుఁబోఁడులు=పుష్పమువలె మనోజ్ఞములైనయొప్పిదము గలయువతులు, వడ్డింపన్ = కావలసినశాకపాకములఁబాత్రముల నిడఁగా, అచటన్ = అచ్చోట, కలహభోజియును=జగడముతిండిగాఁగల జడదారియును, తానును, మధుసూదనుండున్ =శ్రీకృష్ణుఁడును, బహు...పానీయములన్ -బహు=అనేకములగు, భక్ష్య = కొఱికితినఁదగినవానిని, (అప్పడములు వడియములు మొదలగునవి), భోజ్య=భుజింపఁదగినవానిని (అన్నాదులు), లేహ్య=నాలుకచేనాస్వాదింపఁదగినవానిని (పచ్చడులుమున్నగునవి), చోష్య = పీల్చఁదగినవానిని (ఫలరసములు మొదలైనవి), పానీయములు=త్రాగఁదగినవానిని (పాయసమున్నగునవి), సారెక్ =మాటిమాటికి, కొనియాడుచున్ =పొగడుచు, వేడ్కన్ = సంతసముతో, ఆరగించెన్ =భుజించెను.

భా. యువతులు వడ్డించునపుడు కల్గిన కంకణములగల్లనుశబ్దము శాకపాకముల రుచులం దెల్పురీతి నుండెననియు, మేఖలయందలి చిఱుంగటలమ్రోత యతివేగ వడ్డింపుఁడని పల్కుచున్న ట్లుండె ననియు, దువ్వలువపింజెల ఫెళఫెళలు వరియన్నపుఁగాంతితోఁ గలహించుగతి నొప్పె ననియు, మెట్టియలమ్రోఁతలు భుజింపుఁడని ప్రియముఁబల్కుచున్న ట్లుండె ననియు భావము.

వ్యా-విశే. కలహభోజియును దానును సంఖ్యాభిధాయివచనంబు తద్విశేషణక్రియల కగుననుపద్ధతిననుసరించి యిచ్చోఁ గ్రియ తానుశబ్దమునకే సంబంధించురీతి నేకవచనముగఁ బ్రయుక్త మయ్యెను. ఆత్మార్థక మగు తాను శబ్దము నామజాదేతద్వ్యతిక్రమప్రయోగంబులకుఁ బునర్గ్రహణంబునఁ బ్రథమాం నారగించె. ఆత్మార్థంబభిహితమగునపుడు తల్లింగ

తంబై పూర్వపరంబులుగ నభిహిత మగు ననుపద్ధతి నిచ్చో నామవాచక మగు మధు సూదన పదమునకుఁ బూర్వమునఁ బ్రయుక్త మయ్యెను. ఇందు 'పింజలు' అని పాఠము గానంబడెడి. 'పింజ'అనుదానికి 'కుచ్చె' అనునర్థము కోశముల గానరాదు, కాన 'పింజెలు' అని పాఠముండఁదగును. అలం. ఉత్ప్రేక్ష.

తే. వామనేత్రికరాంచలావర్జ్యమాన
కనకభృంగారుకర్కరికాముఖాగ్ర
గళితగంధోదకంబులఁ గంసవైరి
[1]చేతులను వార్చె బాంధవశ్రేణితోడ. 20

టీ. కంసవైరి=శ్రీకృష్ణుఁడు, వామనేత్రీ...కంబులన్-వామనేత్రీ = చక్కని కన్నులుగలవనితలయొక్క, కర=హస్తములయొక్క, అంచల=కొనలనుండి, ఆవర్జ్యమాన=వంచఁబడుచున్న, కనక=బంగారువికారములగు, భృంగారు = గిండ్లయొక్క, కర్కరికా ముఖ=ద్వారాగ్రముయొక్క, అగ్ర=కొసనుండి, గళిత=జాఱునట్టి, గంధోదకంబులన్ = పరిమళోదకముల చేత, చేతులను, వార్చెన్ = కడుగుకొనెను.

క. అప్పుడు తాంబూలంబులు, గప్పురమును జాలవల్లికలఁ బడఁతులచే
నిప్పించె బంధుకోటికి, నప్పద్మదళాయతాక్షుఁ డంతట సతియున్. 21

టీ. అప్పద్మదళాయతాక్షుఁడు = ఆతమ్మిరేకులంబోలె దీర్ఘములై నకన్నులు గల శ్రీకృష్ణుఁడు, జాలవల్లికలన్ =చిత్రంపుఁబనులు చేసిన తమలపాకులపళ్లెరములతో, బంధు కోటికిన్ = చుట్టములగుమికి, తాంబూలంబును, కప్పురమును, ఇప్పించెన్ = ఇచ్చునట్లు చేసెను.

వ్యా-విశే. కప్పురము. ప్ర. కర్పూరము.

తే. అంతిపురమున నుచితకృత్యములు దీర్చి
చంద్రశాలాస్థితుం డైనశౌరికడకు
సంతసంబున వచ్చి [2]యాసంయమీంద్ర
నడుగులకు నెఱఁగుడు నతఁ డాదరమున. 22

టీ. అంతిపురమునన్ =శుద్ధాంతమున, ఉచితకృత్యములు = అర్హములగుకార్యము లను, తీర్చి=చక్కఁ బెట్టుకొని, చంద్రశాలాస్థితుండైన=శిరోగృహమం దున్న, శౌరికడ

1. చేతులనుదేర్చె. 2. వాచంయమీంద్ర, నడుగుల కెఱఁగుడును నతఁ.

కుఁ=శ్రీకృష్ణునిసమీపమునకు, సంతసంబునఁ=సంతోషముతో, వచ్చి, కర్తసత్యభామ యధ్యాహార్యము. సంయమీంద్రునడుగులకుఁ=ముసీశునిపాదములకు, ఎఱఁగుడుఁ = నమస్కరింపఁగా, అతఁడు=ఆనారదుఁడు, ఆదరమునఁ=మన్ననతో, ముందట 'ఇట్లనియెఁ' అనువాక్యముతో నన్వయము.

వ్యా-విశే. సంతసము. ప్ర. సంతోషము. సంయమీంద్రునడుగులకుఁ=షష్ఠీసమాసమున నుకార బుకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.

వ. ఇట్లనియె. 23

మ. పతి నీవై విహరింపఁగా జనము సంభావింపఁగా బంధుసం
తతి నిన్నుం గొనియాడఁగా సవతికాంత ల్సూచి లజ్జింపఁగా
నతులప్రాభవవైభవోన్నతులప్రోవై యిట్లు వర్తించునీ
కితరస్త్రీజనబుద్ధి దీవనలు నే నే మిచ్చెద న్మానినీ ! 24

టీ. మానినీ=మానవతీ ! ఇయ్యది సాభిప్రాయము. పతి=భర్త, నీవు+ఐ = నీవై, విహరింపఁగాఁ, అనన్యసామాన్యమగు భర్తృవాల్లభ్యము సూచితము. జనము=లోకము, సంభావింపఁగాఁ=మన్ననసేయఁగా, లోకశ్లాఘ్యచరిత్రము సూచితము. బంధుసంతతి=చుట్టములసమూహము, కొనియాడఁగాఁ = నుతింపఁగా, బంధ్వాదరణము సూచితము. సవతికాంతలు=సపత్నులు, లజ్జింపఁగాఁ = సిగ్గుపడఁగా, సవతులెల్లరిలో నెల్లవిషయముల గొప్పందనము కర్హయుండుట సూచితము. అతుల...న్నతులప్రోవు—అతుల = సాటిలేని, ప్రాభవ=ప్రభుత్వముయొక్క, వైభవ = విభవముయొక్కయు, ఉన్నతుల = అభివృద్ధులయొక్కయు, ప్రోవు=పోక, లేదా ప్రభుత్వవిభవాభివృద్ధుల పోక, ఐ=అయి, ఇట్లు=ఈగతిని, వర్తించు=ఉండునట్టి, నీకుఁ, ఇతరస్త్రీజనబుద్ధిఁ=అన్యవనితాజనసంభావనను, దీవనలు=ఆశీస్సులు, నేను, ఏమిచ్చెదఁ=ఏమీయఁగలను ?

భా. పతి నీవై విహరించుటంజేసి నీకు భర్తృవాల్లభ్యమా నిండుగఁగలదు. జనము నిను బహూకరించుటంజేసి జనశ్లాఘయూ యమరియున్నది. బంధుసంతతి నినుఁ బొగడుటంజేసి చుట్టాలసురభివై యొప్పియుంటివి. సవతులు నినుఁ గాంచి సిగ్గుపడుచుండుటంజేసి సపత్నులెల్లరిలో మేటివగుట స్పష్టము. ఇట్లు స్త్రీకిఁ గావలయు ప్రాభవవైభవోన్నతులన్నియు సమరియుంట సామాన్యవనితాబుద్ధిని నే నేమి నీకు దీవన లిత్తును ?

విశే. పతి నీవై యనుటంజేసి స్వాధీనభర్తృకతయు, నతులప్రాభవవైభవోన్నతుల ప్రో వనుటంజేసి తత్సమృద్ధ్యతిశయమును గర్హ్యవిజ్ఞాపీగుటయు వ్యంగము లగుచున్నవి. మానిని యనుట ప్రకృతావస్థాసూచకము.

మ. అనికైనం బతి నిన్నుఁబాసి చనెనో ప్రాణంబు ప్రాణంబుగా
నిను మన్నింపఁడొ నీమనోరథముల న్నెయ్యంబుతోఁ జేయఁడో
చనవు ల్నీవలె నెవ్వఁకేఁ గనిరొ నీసౌభాగ్య మింతంతయే
నినుఁ బోలంగల రబ్జగంధు లన వించే యెందు సాత్రాజితీ ! 25

టీ. పతి = మగఁడు, అనికిక్ + ఐనక్ = యుద్ధమునకైనను, నిన్నుక్ + పాసి= నిన్ను విడిచి, చనెనో = వెళ్లెనో? ప్రాణంబు ప్రాణంబుగాక్ = ప్రాణాధికముగా, నినుక్, మన్నింపఁడొ=సమ్మానింపఁడో? నీమనోరథములక్ = నీకోర్కులను, నెయ్యం బుతోక్ = స్నేహముతో, చేయఁడో = ఒనర్పఁడో? నీవలెక్, ఎవ్వఁకేక్ =ఎవ్వరైనను, చనవుల్ = ప్రేమతోడిస్వాతంత్ర్యములను, కనిరొ = పొందిరో? నీసౌభాగ్యము = నీ ప్రియవాల్లభ్యము, ఇంతంతయే=ఇంతప్రమాణ మంతప్రమాణమా? కొలఁది లేని దనుట. అబ్జగంధులు=పద్మగంధులు, నినుక్, పోలక్ + కలరు, అనక్ = అనఁగా, సాత్రాజితీ = సత్యభామా! ఎందుక్ =ఎచ్చటనైనను, వింటి + ఏ-వింటే=వింటివా?

విశే. నరకాసురునిపై నల నాఁ డేఁగునదనున నిను విడువ లేదు. నేఁడు పారి జాతమును గొనునదనునఁ గూడ నిను శ్రీకృష్ణుఁడు విడువఁబోడు. అని "అనికైనక్ బతి నిన్నుఁబాసి చనెనో" అనువాక్యమునూలమున జరిగినదానిని జరుగఁబోవుదానిని గథాం శమును సూచించె. నీవల నాఁడు నరకాసురయుద్ధమున నొనర్చిన యుపకృతి ననుసరించి నినుఁ బ్రాణాధికగాఁ జూచుట సంభవించె. మఱియు నీ వెద్దానిం గోరిన నద్దానిం దప్పక కూర్చు ననుటం జేసి పారిజాతము నీకు సులభమే యనునంశము సూచితము. శ్రీకృష్ణుని చనవును జూఱఁగొనిన నిండుసౌభాగ్యమున మించునీకుఁ బారిజాతము దుర్లభము గాదు సుమా యనియు నుత్తరార్ధమున సూచించెను.

వ్యా-విశే. వింటివి+ఏ. లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు. ఎవ్వ రేక్ =ఎవ్వరేని, అపిశబ్దార్థక హ్రస్వైకారమునకు లోపం బగు. లోపింపఁగా మిగిలిన నకారపొల్లు ద్రుత మని యంగీకరింపఁదగియు.

క. అటులైనను గానిమ్మో, కుటిలాలక ! నీకు మగఁడు గోరినకోర్కుల్
ఘటియించుఁగాక తా నెం,తటికార్యం బైన *డించి నాదీవనలన్. 26

టీ. అటులైనను = వనితలకు వలయునన్నియుఁ గలిగియున్నను, ఓకుటిలాలక = ఓవక్రములైన కుంతలములు గలదానా, మగఁడు, నీకు, గోరిన కోర్కులు, తాను, ఎంతటి

---

* దీర్చి.

కార్యంబైనను = ఎంతగొప్పపనియైనను, డించి = దించి, విడిచి, నాదీవనలన్ = నా యాశీర్వాదములచే, ఘటియించుఁగాక=సమకూర్చుఁగాక.

విశే. వక్రకుంతల యనుటంజేసి వక్రబుద్ధిగలదాన వనియు, దాన నిను బుజ్జగిం తం జేయఁ మగఁ డిట్టరములు వీడి గూడ నీకోర్కుల సర్వథా కూర్పక మానఁ డనియు, నొకవేళ యం దేమేని పొరపాటు కల్గు నని నీకు సందేహము గలదేమో యట్టి సంది యముగూడ నవితథవచనుఁడ నగు నా యాశీఃప్రభావమున నడుగఁటు ననియు, సత్యా శీలమును, దనప్రభావమును బ్రకటించుచు, మాని ప్రసంగించె. దీనఁ బారిజాతసుమము నీకుఁ గర్హ మనుమాటయు సూచిత మయ్యె. రుక్మిణీసత్యలయొద్దనాడిన పైవాక్యములు కలహప్రియతం జాటుచు, నారదునకుఁ గల కలహాశనసంజ్ఞ నన్వర్థముగఁ జేయుచున్నవి.

క. అని పలికి శౌరిఁ గనుఁగొని
దనుజాంతక! పోయివచ్చెదను మఱువకుమీ
నసు నాపుడు గోపవధూ
జనవంచకుఁ డనియెఁ గార్యసంఘటనేచ్ఛన్. 27

టీ. శౌరిన్ = శ్రీకృష్ణుని, కనుఁగొని = చూచి, దనుజాంతక = రాక్షసాంతక, పోయివచ్చెదను = వెళివత్తును, నసున్, మఱువకుమీ = విస్మరింపకుమీ, నాపుడున్ = అసినపిదప, గోపవధూజనవంచకుఁడు = ప్రేఁతల మోసగించువాఁడు - శ్రీకృష్ణుఁడు, కార్యసంఘటనేచ్ఛన్ = (తలఁచిన)పనిని కూర్చుకోర్కితో, అనియెన్.

వ్యా-విశే. పారిజాతాపహరణరూపకార్యసంఘటనము నన్ను మఱచిన మఱుఁగు పడుం గాన నన్ను మఱవకు మనియె. మఱియు రుక్మిణీసత్యలయొద్దఁ దా నొనర్చిన ప్రసంగము శ్రీకృష్ణునకుఁ గోపకారణ మై త న్ను పేక్షించునేమో యనియుఁ, దన్ను మఱవకు మని యన్వాని పల్కె. పోవు నని పల్కుట యమంగళమాటఁ బోయివత్తు ననుట లోకవ్యవహారప్రసిద్ధము. నాపుడు అనుధా త్వానంతర్యార్థకరూపము.

చ. అదితి మొఱంగి కుండలము లానరకుండు హరించె వాని నే
గదనములోనఁ ద్రుంచి యవి గైకొని దాఁచితి నాఁటనుండియుం
బదిలముగాఁగ నన్నడుగఁ బంపనికారణ మేమి లాఁతినే
యిదె చనుదెంచి యిత్తు ననుమీ శతమన్యునితోడ సంయమీ! 29

టీ. అదితిన్ = దేవతలతల్లిని, మొఱంగి = వంచించి (మోసపుచ్చి), ఆనర కుండు = ఆనరకాసురుఁడు, కుండలములు=కర్ణాభరణములు, హరించెన్ =దొంగిలించెను, వానిన్, నేను, కదనములోనన్ = యుద్ధములో, త్రుంచి=చంపి, అవి=ఆకుండలములు

కైకొని=తీసికొని, నాఁటనుండియుఁ = నాఁడుమొదలుకొని, పదిలముగాఁగఁ = జాగరూకముగాఁగ, దాఁచితిఁ, నన్నుఁ, అడుగఁ=(వాని నీయు మని) అడుగుటకుఁ, పంపని=(ఏవానినైన) అనుపని, కారణ మేమి=హేతు వేమి? లాఁతినే = అన్యుఁడనా? సంయమీ=ఓమునీ, ఇదె=ఇదిగో (త్వర సూచితము), చనుదెంచి=వచ్చి, ఇత్తును=ఇచ్చెదను, అని, శతమన్యునితోడఁ=దేవేంద్రునితో, అనుమీ=పల్కుమీ !

విశే. మఱువకుండు మని పల్కినారదున కీశ్రీకృష్ణప్రసంగము సంతోషదాయక మగుంగదా ! శతమన్యుఁడు-నూఱుయజ్ఞములు చేయువాఁడే యింద్రపదార్హుఁడగుట, దేవేంద్రునకు శతమన్యుసంజ్ఞ సంభవించె.

చ. అని వినయంబుతోడఁ గలహాశనసంయమి వీడుకొల్పి యం
గనయును దాను నచ్చట జగత్పతి జూదపువేడ్క సున్న చో
దినకరమండలం బపరదిగ్గిరికూటముఁ జేరె [1]యాదవీ
జనమదిరారసారుణవిశాలదృగంచలవంచకచ్ఛవిన్. 29

టీ. అని, వినయంబుతోడఁ=అడఁకువతోడ, కలహాశనసంయమిఁ = జగడము తిండిగాఁగలమునిని (నారదుని), వీడుకొల్పి=పోవ ననుజ్ఞనిడి, అంగనయును = సత్యభామయు, తానుఁ, జగత్పతి=జగన్నాథుఁడగు శ్రీకృష్ణుఁడు, అచ్చటఁ =అచ్చోట, జూదపువేడ్కఁ =ద్యూతోత్సాహమున, ఉన్నచోఁ =ఉన్నసమయమున, దినకరమండలము= సూర్యమండలము, యాదవీజన.....ఛవిఁ -యాదవీజన= యాదవాంగనాసమూహము యొక్క, మదిరారస=మద్యరసము చే, అరుణ=ఎఱ్ఱనైన, విశాలదృగంచల = పెడ ల్వగు దృష్టులకొనలను, వంచక=వంచించు (తిరస్కరించు), ఛవిఁ = కాంతితో, అపరదిగ్గిరి కూటముఁ = అస్తాద్రిశిఖరమును, చేరెఁ = పొందెను.

భా. ఇట్లని నారదుని వీడుకొల్పి శ్రీకృష్ణుఁడు సత్యభామతో జూదమాడుచు నచ్చోఁ నుండునదనున, సూర్యమండలము మద్యరసాస్వాదమున నరుణము లగు యాదవాంగనల కనుకొనలఁ దిరస్కరించు కాంతిఁ గని యస్తాద్రిం జేరెను.

## సాయంకాలవర్ణనము

ఉ. ఆయతతేజము ల్దఱిఁగి యంబుజబాంధవుఁ డస్తసీమకుం
బోయినఁ జూచి [2]వేచినతమోవిభుఁ డంప దినాంతయోధుఁ డీ
ఛాయఁ దదీయపత్నిఁ బెలుచం బడ నీడిచికొంచుఁ బోయెడిం
గో యనుమాడ్కి [3]సంతట శకుంతరవంబు చెలంగె నెల్లెడన్. 30

---

1. ఘూర్జరీ. 2. లేచిన. 3. నత్తఱి.

టీ. అంబుజబాంధవుఁడు=పద్మబంధు వగుసూర్యుఁడు, ఆయతతేజముల్=దీర్ఘము లైన కిరణములు, తఱిఁగి=తగ్గి (నశించి), అస్తసీమకుఁ=అస్తాద్రిప్రదేశమునకు, పోయినఁ=పోఁగా, చూచి, వేచిన = కాచికొనియున్న, తమోవిభుఁడు=చీఁకటి యనురాజు, అంపఁ=పంపఁగా, దినాంతయోషుఁడు=సాయంకాల మనెడుజోదు, తదీయపత్నిఁ= ఆసూర్యపత్నిని, ఈచాయఁ = ఈఛాయాదేవిని (ఈనీడను), పెఱుచఁ=క్రూరముగా, పడఁ=భూమిపైఁ బడునట్లుఁ ఈడిచికొంచుఁ=లాఁగికొనుచు, పోయెడిఁ=పోవుచుండెడిని, అంతటఁ=ఆసమయమున, (ఆమె) కోయనుమాడ్కిఁ=కోయని కుయివెట్టునట్లు, ఎల్లెడఁ=అంతటను, శకుంతరవంబు=పక్షులధ్వని, చెలంగెఁ=ఒప్పెను.

భా. తనకుఁ బగతుఁడగు ప్రభాకరుఁ డెపుడు నిస్తేజస్కుఁడగు నెపు డాక్రమించెదనా యని కాచికొనియున్న చీఁకటిరాజు, ప్రభ దఱిఁగి పగటిరాజస్తాద్రిని మఱుఁగువడఁగా, నప్పగతుని జాయను చాయను క్రూరముగ భువిం బడఁద్రోసి లాఁగికొని పోవుచుండె ననియు, నయ్యదను నామె పెట్టుకుయిలో యనుమాడ్కి పక్షులరవ మంతటఁ జెలంగె ననియు భావము. సాయంకాలమైనతోడనే ఛాయలు దూరదూరములై నశించుటయుఁ, బక్షులరవము లెల్లయెడల మిక్కుటముగ రేఁగుటయు నైజ మగుటంజేసియు, చాయశబ్దమునకు ఛాయానాతపము లర్థము లగుటంజేసియు, ఛాయ సూర్యపత్నిగాఁ జెప్పుట ప్రసిద్ధవిషయ మగుటంజేసియు, తేజస్తిమిరములు పరస్పరవిరోధులగుటం జేసియుఁ, గవి యట్లూహింప నవకాశము గల్గె నని గ్రహించునది.

అలం. శ్లేషమూలకరూపకోత్థాపితోత్ప్రేక్ష.

చ. ఇనుదెసఁ జూడ నోడి తల లెత్తక సీటఁ దదీయబింబమున్
గని వగ జక్కవల్లొగమొగంబులు సూచుచుఁ గుంది మూర్ఛఁ జెం
దినదెసఁ జూడలేక జలదేవత హా! యని కన్ను మోడ్చె నా
వనరుహము ల్దుడింగె సహవాసులదుఃఖము నెయ్య రోర్తురే? 31

టీ. జక్కవలు=చక్రవాకద్వంద్వములు, ఇనుదెసఁ=సూర్యునివైపు, చూడఁ=చూచుటకు, ఓడి = అసమర్థములై, తలలు=శిరస్సులు, ఎత్తక=మోఁది కెత్తక, సీటఁ=ఉదకమున, తదీయబింబమున్ = ఆసూర్యునిబింబమును, కని = చూచి, వగఁ = దుఃఖముతో, మొగమొగంబులు=ఒకరి మొగము నొకరు, చూచుచుఁ, కుంది = దుఃఖించి, మూర్ఛఁ=విస్మృతిని (నిశ్చేష్టతను), చెందినదెసఁ=పొందినదిక్కును, జలదేవత=జలాధిదేవత, చూడలేక=చూడఁజాలక, హా=అయ్యో, అని, కన్ను = నేత్రము, జాత్యేకవచనము. మోడ్చెఁ=మూసికొనెను. నాఁ=అనునట్లు, వనరుహముల్ = నీటఁబుట్టినపద్మ

ములు, ముడిం గెన్ =ముకుళించెను. నెయ్యారు=స్నేహితులు, సహవాసుల దుఃఖమున్ = తమతోఁ గలసిమెలసియున్నవారివగను, ఓర్తురే=సహింతురా ?

భా. తమ్మును గలిసి సుఖముం జేకూర్చు తమహితుఁడు సూర్యుఁడు తేజము తఱిఁగి యుండ నాతనిం గాంచలేక చక్రవాకద్వంద్వములు తలలు దుఃఖమున దించికొని నీట నుండె ననియు, నైన నపుడు నీటఁ బ్రతిబింబించిన సూర్యబింబము కనులఁబడ దమహితు నకుఁ గల్గినవ్యసనమునకై పరస్పరము మొగములం జూచికొని దుఃఖించి మూర్ఛఁజెం దె ననియు, నట్లు మూర్ఛనందిన గలసిమెలసి మెలఁగు మిత్రముల జలదేవత కన్నులఁ గాంచఁజాలక తననేత్రపద్మముల మూసికొనెనో యనుగతిని తామరలు ముకుళించె ననియు భావము.

చక్రవాకములకుఁ బవలు సంయోగమును రేయి వియోగమును గల్గుట ప్రసి ద్ధము. మఱియు రేయి పద్మములు ముకుళించుటయు నైజము, కావునఁ బైవిషయములను గని పైరీతిగఁ జమత్కరించి వర్ణించెను. నేత్రముల పద్మములతోడఁ బోల్చుట సం ప్రదాయమగుట, జలాధిదేవతకు వానిం గన్నులుగాఁ జెప్పుట సంభవించెను.

అలం. అర్థాంతరన్యాసోత్ప్రేక్షలు.

చ. తనువున నంధకారపుమదం బలమి న్నసు భద్రదంతికి
నొనసినఁ జిందరేఁగి తపనుం డనుమావుతుఁ గ్రుంకుమెట్టలో
య నురల వైచిన న్నొగిలి యచ్చట నెత్తురు గ్రక్కెనో యనం
గనుఁగవ గోరగింపఁ బొడకట్టె సముజ్జ్వలసాంధ్యరాగముల్. 32

టీ. తనువునన్ =శరీరమున, అంధకారపుమదంబు = చీఁకటియనుమదము, అల మిన్న = అప్రసిద్ధమగునాకాశము, అను=అనునట్టి, భద్రదంతికిన్ = భద్రగజమునకు, మొనసినన్ =క్రమ్మఁగా, చిందరేఁగి=విజృంభించి, తపనుం డనుమావుతున్ =సూర్యుఁ డను మావటివానిని, క్రుంకుమెట్టలోయన్ =అస్తాద్రికోనలో, ఉరలన్ =బ్రద్ద లగునట్లు, వైచి నన్ =పడఁద్రోయఁగా, నొగిలి=నొచ్చి, అచ్చటన్ = ఆకోనలో, నెత్తురు=రక్తమును, గ్రక్కెనో, అనన్ =అనునట్లు, కనుఁగవ=నేత్రద్వంద్వము, గోరగింపన్ =మూసికొనునట్లు, సముజ్జ్వలసాంధ్యరాగముల్ = దేదీప్యమానము లగు సంధ్యాకాలపు టరుణకాంతులు పొడకట్టెన్ =చూపట్టెను.

భా. ఆకాశమను భద్రగజము మేన మదము వ్యాపించుటకతన మదించి విజృం భించి తన్నధిరోహించియున్న మావటీని సూర్యు నస్తాద్రిలోయం జిదుగఁద్రోయ నమ్మావ టీఁడు నొచ్చి నెత్తురు గ్రక్కుకొనె ననియు, నా రక్తకాంతులే యివి యేమో యను నట్లు సాయంసంధ్యారుణకాంతులు చెలంగె ననియు భావము.

సాయంసమయమున నాకాశమునఁ జీఁకటి యలమికొనుటయు, నరుణరాగములు చెలంగుటయుఁ బ్రసిద్ధము లగుట, నవ్వానినే యీగతిని గవి చమత్కరించి వర్ణించె నని యెన్ననది.

మ. ఒకభృంగంబు పరాళినీమదనతంత్రోన్మాది ప్రాణేశ్వరిఁ
మకరందాసవమత్త నబ్జగృహసీమల బెట్టి తాఁ బోయి సం
జకడ న్వచ్చి తదానమన్కుళ మేజాడం జొర న్రాక యా
మికుఁడో నాఁ దిరిగెం గొలంకురమకున్ మే లెంతహీనంబొకో! 33

టీ. పరాళినీమదనతంత్రోన్మాది = పరకీయ యగు నాఁడుతుమ్మెదతోడి మదన, వ్యాపారములచే వెఱ్ఱిదైన, ఒకభృంగంబు=ఒకతుమ్మెద, మకరందాసవమత్తఁ =పూఁదేనె యనుమద్యపానముచే మదించినదానిని, ప్రాణేశ్వరిఁ = భార్యను, అబ్జగృహసీమఁ = పద్మమను నింటియొక్కకడను, పెట్టి=ఉంచి, తాఁ, పోయి=వెడలి, సంజకడఁ=సంధ్యాసమయమున, వచ్చి, తదానమన్కుళము=ఆవంగియున్న తమ్మిమొగ్గను, మేజాడఁ = మీతీరుగను, జొరఁ =ప్రవేశించుటకు, రాక=వీలులేక, కొలంకురమకున్ = సరోలక్ష్మికి, యామికుఁడో=శలవరియో, నాఁ =అనఁగా, తిరిగెఁ =భ్రమించెను. మేలు=ఉపకారము, ఎంతహీనంబొకో=ఎంతశూన్యమోకదా!

భా. ఒకతుమ్మెద పరకీయ యగు నాఁడుతుమ్మెదతోడి మదనక్రీడలం దవిలి తన జాయను దమ్మియింట నిడిపోయి సాయంకాలమున రాఁగా నత్తమ్మి యపుడు ముకుళించుటకతన నందుఁ జొరరామి రేయి తలవరి యూరిచుట్టుం దిరుగునట్లు సరస్సుచుట్టును బరిభ్రమించి సరోలక్ష్మికిఁ గావరి యగుశలవరి యయ్యెనని భావము. మఱియు సరోలక్ష్మి కుపకారబుద్ధియే యున్నయెడలఁ దన్ను యామికుఁ డై యరయువాని నెట్లేని ప్రాణేశ్వరితోఁ గూర్పకుండునా యని యర్థాంతరన్యాసమూలమున సరోలక్ష్మికిఁ గల యుపకారబుద్ధిశూన్యతను వెల్లడించె. దేహళీదత్తదీపన్యాయమున కొలంకురమపదము రెండు పక్షముల నన్వయించును. తుమ్మెద యొకపద్మమున నిలువక పరిభ్రమించుట నైజము. సాయంసమయమునఁ బద్మమున ముకుళించుటయు నందుఁ దుమ్మెదలు తగులొక్కుటయు వెలుపల నుండునవి చొర వీలులేమియు నైజము. వానినే కవి యీరీతిగఁ జమత్కరించె.

అలం. ఉల్లేఖ. అర్థాంతరన్యాసము.

## అంధకారవర్ణనము

సీ. దినవారిరాశి మా పనుమాని గ్రోలంగ
నడుగునఁ గనుపట్టునస లనంగఁ

గ్రుంకు మెట్టడవిఁ గారొ్కనినసంధ్యావహ్నిఁ
బొడమినదట్టంపుఁబొగ యనంగఁ
దనమణి పడిపోవ ధరణీతలంబున
నెమకంగ వచ్చిన నింగి యనఁగ
వలచుక్క లనియెడివలరాజు గెలుపుప్రాల్
ద్రెలియఁ బూసినమషిలేప మనఁగ
తే. వృద్ధవారవిలాసినీవిసరమునకు
నపలితంకరణౌషధం బనఁగ జార
నలినముఖుల కదృశ్యాంజనం బనంగ
నంధకారంబు జగ మెల్ల నాక్రమించె. 34

టీ. దినవారిరాశిక్ =పగలనుసముద్రమును, మా పనువాని = రేయి యనుమును, క్రోలంగక్ =త్రాఁగఁగా, అడుగునక్ =క్రిందను, కనుపట్టు=కనుపడెడు, అసలు = బురద, అనంగక్ =అనునట్లుగాను, క్రుంకుమెట్టడవిక్ =అస్తాద్రి వనమున, కారొ్కనిన=క్రమ్మిన, సంధ్యావహ్నిక్ = సంజయనునగ్నియందు, పొడమిన=పుట్టిన, దట్టంపుఁబొగ=తఱచైన ధూమము, అనఁగక్, తనమణి=తనమాణిక్యము, పడిపోవక్ =జాఱిపోఁగా, ధరణీతలం బునక్ =భువియందు, నెమకంగక్ =వెదకుటకు, వచ్చిన, నింగి = ఆకాశము, అనఁగక్, (సూర్యుఁడు నభోమణిగదా) అలచుక్కలు = ఆనక్షత్రములు, అనియెడు, వలరాజు గెలుపుప్రాలు=మన్మథునివిజయాక్షరములు, తెలియక్ =విశదమగుటకు, పూసిన=రాఁచిన, మషిలేపము=మసిపూఁత, అనఁగక్, వృద్ధవారవిలాసినీవిసరమునకుక్ = ముసలివేశ్యలకు, అపలితంకరణౌషధము= నెరయకుండున ట్లౌనర్చుమందు, అనఁగక్, జారనలినముఖుల కుక్ =వ్యభిచారిణులకు, అదృశ్యాంజనము = అగపడకుండఁజేయుకాటుక, అనంగక్, అంధకారంబు=చీఁకటి, జగమెల్లక్ =లోకమంతయు, ఆక్రమించెక్.

భా. వెలుఁగుకఱిగి చీఁకటియే భువి నగపడుటంజేసి బురదంబోలె నున్నదనియుఁ, బశ్చిమాద్రిం బొడకట్టు నరుణకాంతులందును గలఁదిగఁ జీఁకటి తోఁచుటంజేసి నగ్ని యం దుద్భవించినపొగను బోలియున్నదనియు, భువిఁ జీఁకటి యలముకొనుట నల్లని నింగి భువి కేతెంచిన ట్లున్న దనియుఁ, జుక్కలకాంతినిగూడ ధిక్కరించుచు క్రమ్ముటకతన తెల్లయక్షరములు బాగుగా నగపడుటకుఁ బూసినమసిపూఁతవలె నున్న దనియు, నెఱి సినవెండ్రుకలనుగూడ నల్లగా నొనర్చునంతటి నల్లందనముగలదిగాన నపలితంకరణౌషధ మనియు, నొకరిమో మొకరి కగపడకుండురీతిని గాఱుకొనియున్నదిగాన నదృశ్యాంజన ముగను గవి యూహించెను. అలం. ఉల్లేఖము. ఉత్ప్రేక్ష.

సీ. చిలుకతేరును నల్ల చెఱకువిల్లును గల్వ
విరితూపు నిత్తుము మరుఁడ! నీకు
వనమాలికయు నూత్న వంశనాళమును బిం
ఛము సమర్పింతుము శౌరి! నీకుఁ
గప్పుఁగప్పడమును గస్తూరియును గాటు
కయు నివేదింతుము కాళి! నీకు
నేరేడుఁబండ్లు వినీలచామరలు దూ
ర్వలు నొసంగుదు మిభవక్త్ర! నీకు

తే. నిట్టిలోకోపకారికి నిరులుదొరకుఁ
జంద్రసూర్యాదిదుర్దోషశాంతి వొదలి
నిత్యత వహింపఁజేయంగ నేర్తురేని
యనుచుఁ బ్రార్థించి రభిసారికాబ్జముఖులు. 35

టీ. అభిసారికాబ్జముఖులు = ప్రియునిఁగూర్చి సంకేతమున కేఁగుస్త్రీలు, ఇట్టి లోకోపకారికిక్ =ఇటువంటి లోకోపకార మొనర్చువాఁడైన, ఇరులుదొరకుక్ =చీఁకటి జేనికి, చంద్రసూర్యాది దుర్దోష శాంతి = చంద్రుఁడు సూర్యుఁడు మొదలగువారను దుష్టదోషములయొక్కనివారణము, పొందలి=ఒప్పి, సంభవించి, నిత్యతక్ = శాశ్వతస్థితిని, వహింపక్ =పొందునట్లు, చేయఁగక్ =చేయుటకు, నేర్తురేని=ఓపుదురేని, మరుఁడ=మన్మథుఁడ, నీకుక్, నల్లచెఱకువిల్లును=అసితేక్షుచాపమును, చిలుకతేరును= శుకరథమును, కల్వవిరితూపును=కలువపూబాణమును, ఇత్తుము=ఒసంగుమము, శౌరి = కృష్ణ,నీకుక్, వనమాలికయుక్ =అకులనుసుమములనుగూర్పఁబడిన తోమాలె. (వనమాల= విష్ణునిమెడయందలి పుష్పమాల) నూత్నవంశనాళంబును=కొత్తపిల్లనఁగ్రోవిని, పింఛమును = నెమిలికుంచెను, సమర్పింతుము=ఇచ్చుకొందుము. కాళి, నీకుక్, కప్పుఁగప్పడమును= నల్లనియాచ్ఛాదనమును (దుప్పటిని), కస్తూరియుక్ =మృగమదమును, కాటుకయుక్ = అంజనమును, నివేదింతుము=సమర్పించుకొందుము. నేరేడుఁబండ్లు = జంబూఫలములు. వినీలచామరలు=నల్లనిచామరములు. దూర్వలు=గడ్డిపోఁచలు, ఇభవక్త్ర=గజానన, నీకుక్, ఒసంగుదుము=ఇత్తుము. అనుచుక్, ప్రార్థించిరి=వేఁడిరి.

విశే. ఇట నభిసారికలు తత్తద్దేవతలకుఁ గాన్కగా వారివారి కిష్టము లగునల్లని వానినే యిత్తు మని వేఁడుటకు నల్లనివాని నొసంగినచో వారును దమకట్టివానినే ప్రసాదింపఁ దలంతురనియుఁ దన్మూలమునస్వాభీష్టాంధకారశాశ్వతిని వారు తప్పక కూర్చవలసి

వచ్చు ననియు, వారు మది నెంచుటయే కారణ మని యొన్నవలయును. 'ఇరులు' చీఁకటి యనునర్థమున నియ్యది బహువచనముగానే ప్రయుక్తమగును. 'ఇరులు గెలిచినయంతఃపురేందుముఖుల కురులు,' అని శ్రీనాథుఁడు నైష. 'ఇరులఁ గెలిచినతుమ్మెదగఱులఁ డెగడు' అని పోతన భాగ. చిలుకరంగు పచ్చనిదైనను దాని నలుపుగానే వర్ణించుట కవిసమయ మైయున్నది.

చ. మొనసినదీపికానికరము ల్గృహకార్యగతాభిసారికా
వనితలయూర్పుగాడ్పులనెవంబునఁ గంపముకొంద నోడకుం
డని తిమిరంబు తా నభయహస్తము లిచ్చె ననంగ వానిపైఁ
గనుఁగొనఁ బొల్చె నంకురితకజ్జలము ల్నవధూమమాలికల్. 36

టీ. గృహకార్య...నెవంబునఁ-గృహకార్య=గృహకృత్యములందు, గత=ప్రవర్తించిన, అభిసారికావనితల=అభిసారికాస్త్రీలయొక్క, ఊర్పుగాడ్పుల=నిశ్వాసవాయువులయొక్క, నెవంబునఁ=మిషచే, మొనసినదీపికానికరము=ఱుఁడినదీపములమొత్తము కంపమునఁ=చలనమును, ఒందఁ, తిమిరంబు = చీఁకటి, తాను, ఓడకుండుఁ=భయపడకుఁడు. అని, అభయహస్తముల్ ఇచ్చెఁ=భయముమాన్పుటకై హస్తావలంబము లిచ్చెను, అనంగఁ=అనునట్లు, వానిపైఁ = ఆదీపములపై, కనుఁగొనఁ=చూడఁగా, అంకురిత...మాలికల్-అంకురిత=పుట్టిన, కజ్జలముల్=కాటుకకల, నవ=క్రొత్తవైన, ధూమమాలికల్=పొగచాలులు, పొల్చెఁ=ఒప్పెను.

భా. నాయకులయొద్దకుఁబోవ సమయము గామించేసి యభిసారికలు నిశ్వసించుచుఁ గృహకృత్యముల నిర్వర్తించుచుండి రనియు, నవ్వారినిశ్వాసమారుతహతి నపుడుంచఁబడిన దీపములు కంపము నందుచుండె ననియు, నట్లు కంపించుదీపముల భయపడవల దని యభయహస్తప్రదానమునఁ జీఁకటి యోడార్చుచున్నరీతి నాదీపములపైఁ జూపట్టు ధూమమాలికలు పొల్చుచుండె ననియు భావము.

అలం. ఉత్ప్రేక్షాపహ్నవములు.

## నక్షత్రవర్ణనము

సీ. కారొక్కన్నకటికిచీఁకటిమొగుల్లోత్తంబు
గురిసినవడగండ్లగుంపు లనఁగఁ
గవజక్కవలు వాయఁ గరనాళములఁ జందు
రుం డూఁదు పటికంపుటుండ లనఁగ

నెల్లెడ మిన్నేటియిసుమున నచ్చర
కొమ లిడ్డ వెన్నెలకుప్ప లనఁగఁ
దెలివివెన్నెల[1]వెండితీవెలు నిగిడించు
చదలుకమ్మచ్చుబెజ్జము లనంగ
తే. జగము గెల్వంగ దండెత్తుమగనిమోఁద
లీల రతి చల్లుదీవనఁబ్రా లనంగ
వేఁడివెలుఁగెండఁ గ్రాఁగినవిన్న మేన
[2]నెకొ్కను చెమటబొట్లునాఁ జుక్క లమరె. 37

టీ. చుక్కలు = నక్షత్రములు, కారొ్కన్న ... మొత్తంబు-కారొ్కన్న = క్రమ్ముకొనిన, కటికిచీఁకటి = గాఢాంధకార మను, మొగుల్మొత్తంబు = మేఘసమూహము, కురిసిన = వర్షించిన, వడగండ్లగుంపులు = కరకలగుంపులు, అనంగన్ = అనునట్లు కవజక్కవలు = చక్రవాకద్వంద్వములు, పాయన్ = విడిపోవుటకై, కరనాళములన్ = కిరణము లనుగొట్టములచే, చందురుండు, డోఁదు = చిమ్మునట్టి, పటికంపుటుండలు = స్ఫటికపుగుండ్లు, అనంగన్, ఎల్లెడన్ = ఎల్లచోటులను, మిన్నేటియిసుమునన్ = ఆకాశగంగానదియొక్కయిసుక యందు, అచ్చరకొమలు = అప్సరస్త్రీలు, ఇడ్డ = పెట్టిన, వెన్నెలకుప్పలు = వెన్నెలప్రోవులు, (బాల్యక్రీడలు) అనఁగా, తెలివివెన్నెల = స్వచ్ఛమైనవెన్నెలయును, వెండితీవెలు = వెండితీఁగలను, నిగిడించు = సాగించునట్టి, చదలుకమ్మచ్చు = ఆకాశమనుకమ్మచ్చుయొక్క (కమ్మచ్చు = కంసాలి తీఁగెలుతీయ నుపయోగించుపనిముట్టు) బెజ్జములు = రంధ్రములు అనఁగన్, జగమున్ = లోకమును, గెల్వంగన్ = జయింపఁగా, దండెత్తుమగనిమోఁదన్ = దండెత్తినభర్తపై, లీలన్ = విలాసముగా, రతి చల్లు, దీవనఁబ్రాలు = ఆశీర్వాదాక్షతలు, అనంగన్, వేఁడివెలుఁగెండన్ = సూర్యాతపముచే, క్రాఁగిన = తప్తమైన, విన్న మేనన్ = ఆకాశముయొక్క శరీరమున, నెకొ్కను = తొవ్వుఁగొన్న, చెమటబొట్లు = స్వేదబిందువులు, నాన్ = అనఁగా, అమరెన్ = ఒప్పెను.

భా. సాయంసమయమునఁ జీఁకటిం దోఁచిన తారకలు, కటికిచీఁకటి యను మేఘబృందము వర్షించు వడగండ్లవలెను, చక్రవాకద్వంద్వముల నెడఁబాపఁ జంద్రుఁడు కిరణములను గొట్టములద్వారమునఁ జిమ్మిన స్ఫటికగుళికలవలెను, నచ్చరలు మిన్నేటియిసుకంబఱపివ వెన్నెలప్రోవులవిధమునను, స్వచ్ఛమైనవెన్నెల యను వెండితీవల సాగించునాకాశమును కమ్మచ్చుయొక్క రంధ్రములవలెను, దనభర్త మన్మథుఁడు లోకముం గెల్వ

1. వెండితీఁగలు. 2. నెకొ్కనివ చెమ్మబొట్లునాఁ.

దండెత్తఁగా రతి, పతిపై సవిలాసమా గాఁజల్లు సేసఁబ్రాలవలెను, సూర్యాతపసంతప్తమగుట కతన నాకాశము మేనం దోఁచిన స్వేదబిందుసమితివలెను చెలంగె నని భావము.

వ్యా-విశే. మొగులు. ప్ర. మేఘు. చందురుఁడు. ప్ర. చంద్రుఁడు. పటిక. ప్ర. స్ఫటిక. అచ్చర. ప్ర. అప్సర. పటికము + ఉండలు=పటికంపుటుండలు. కర్మాధారయం బుల మువర్ణమునకుఁ బుంపు లగు. కర్మధారయంబులం దుత్తున కచ్చు పర మగునపుడు టుగాగమం బగు. కమ్మి + అచ్చు = కమ్మచ్చు. మిన్నేరు + ఇసుము=మిన్నేటియిసుము. సమాసమున నౌపవిభక్తికటివర్ణము కల్గెను. అలం. ఉత్ప్రేక్షోల్లేఖములు.

## చంద్రోదయాదివర్ణనము

ఉ. యామవతీకళత్రసుదయావసరంబునకంటెఁ బాండిమ
శ్రీ మును దోఁచెఁ దూర్పుదెస సిద్ధము కృష్ణుఁడు పారిజాతమున్
భామినికై హరించు నని పాయనినెవ్వగ నింద్రరాజ్యల
క్ష్మీముఖమండలంబున వసించినవెల్లఁదనంబుకైవడిన్. 38

టీ. సిద్ధము = నిశ్చయముగా, కృష్ణుఁడు, పారిజాతమున్ = కల్పవృక్షమును, భామినికై = సత్యభామకై, హరించును=తీసికొనును, అని, పాయనినెవ్వగన్ =విడువని నిండుదుఃఖముచే, ఇంద్రరాజ్యలక్ష్మీముఖమండలంబునన్ = ఇంద్రరాజ్యలక్ష్మియొక్క ముఖమండలమున, వసించిన=కూడిన, వెల్లఁదనంబుకైవడిన్ =పాండిమమురీతిని, తూర్పు చెసన్ = తూర్పుదిక్కున, యామ...సరంబునకంటెన్ = చంద్రోదయసమయమున కంటె, మును = ముందుగా, పాండిమశ్రీ=తెల్లనికాంతిసంపద, తోఁచెన్ = సంభవించెను (చూపట్టెను).

భా. తనరాజ్యమందలికల్పకము నింక సత్యకై కృష్ణుఁడు హరింపక మానఁడని యెంచి యింద్రరాజ్యలక్ష్మి సెవ్వగఁ జెందుటకతన నామె మోమున వెల్లందనము కల్గెనో యనునట్లు ప్రాచిని బాండురచ్ఛాయ చంద్రోదయమునకన్న మున్నుగఁ జూపట్టె నని భావము.

వ్యా-విశే. అవసరంబునకంటె - అవసరము + కంటె. కంటెవర్ణకము పరమగునపుడును గొన్నియెడల నగాగమంబు చూపట్టెడిని. అలం. ఉత్ప్రేక్ష.

సీ. కెరలి చీఁకటిప్రాను గెడపంగ నిక్కిన
సమయగజంబుదంతము లనంగఁ
జదలుగేదఁగితూర్పుతుదకొమ్మ నరవిరి
యై కానిపించు పూరేకు లనఁగఁ

బొడుపుగుబ్బలినేలపురిటింటియిడుపునఁ
జఱచినగంధంపుఁజట్ట లనఁగ
మరునిముందఱ బరాబరి సేయుకంచుకి
కులముచేతుల వెండిగుదె లనంగఁ
తే. గైరవములకు వెన్నెలనీరు వఱపఁ
బూని చేర్చిన పటికంపుదోసు లనఁగఁ
గ్రమముతో శీతకరమయూఖములు గగన
భాగమునఁ గొన్ని యల్లనఁ బ్రాఁకు దెంచె. 31

టీ. కెరలి=విజృంభించి, చీఁకటిమ్రాను=అంధకారమనువృక్షమును, కెడపంగ = నిశింపఁజేయుటకై, నిక్కిన = చాఁచిన, సమయగజంబుదంతములు = కాల మను నేనుఁగు యొక్కదంతములు, అనంగ, చదలుగేదఁగితూర్పుతుదకొమ్మ=ఆకాశ మను మొగిలి చెట్లయొక్క తూర్పుదిక్కునందైన శాఖయొక్కతుదిని, అరవిరియై=సంగోరు విడినదై, కానిపించు = అగపడునట్టి, పూరేకులు = పూరెమ్మలు, అనఁగ, పొడుపు...పురిటింటి యిడుపునఁ=ఉదయాద్రియనుచంద్రసూతికాగృహముయొక్క గోడయిరుపార్శ్వముల మీఁదిభాగములందు, చఱచిన=అంటించిన, గంధంపుఁజట్టలు=గంధముయొక్కపూఁతలు, అనఁగ, మరునిముందఱ = మన్మథునిముంగల, బరాబరి సేయు = హెచ్చరిక చేయు, కంచుకికులము=కావలివారియొక్క, చేతులఁ =హస్తములందైన, వెండిగుదెలు = వెండి బెత్తములు, అనంగ, కైరవములకుఁ =కలువలకు, వెన్నెలనీరు=వెన్నెలయనుసుదకము, పఱపఁ =పాఱించుటకై, పూని = యత్నించి, చేర్చిన = కూర్చిన, పటికంపుదోసులు= స్ఫటికవికారములగునరిణలు (నీరు పాఱించుటకై యేర్పడు సాధనవిశేషము) అనఁగ, క్రమముతో, శీతకరమయూఖములు=చంద్రకిరణములు, గగనభాగమునఁ = ఆకసమున, కొన్ని, అల్లనఁ = మెల్లఁగా, ప్రాఁకు దెంచెఁ = ప్రాఁకెను.

భా. కాల మనుగజ మంధకార మనువృక్షమును నిర్మూలింపఁగాఁ జాచిన దంత ములో యనునట్లును, నాకాశ మను మొగిలిచెట్టుదైన తూర్పుకొమ్మను సంగోరువిడి కాని పించుపుష్పము యొక్క రేకులవలెను, నుదయాద్రి యను చంద్రసూతికాగృహమున గోడలమీఁదఁ బూసిన గంధపుఁబూఁతలవిధమునను, మన్మథునిముందు బరాబరుల నొన ర్చు సేవకులయొక్క చేతులందలి వెండిబెత్తములవలెను, గలువలకు వెన్నెలనీరు పాఱింప నేర్పఱిచినస్ఫాటికపుదోసులవలెను జంద్రకిరణము లేర్పడె నని భావము. (గజము చీఁకటి చెట్టును దమాలమును నిర్మూలించుటయు సైజము.) అలం. ఉత్ప్రేక్షాలంకారములు.

తే. అమరు లమృతాంబునిధిలోని యమృతరసము
వెండిచేరులఁ బటికంపుఁగుండ కట్టి
చేదుకొనియెదరో నాఁగ శీతరోచి
మెఱుఁగుమెయితోన యల్లన మిన్ను ప్రాకె. 40

టీ. అమరుఁబు = దేవతలు, అమృతాంబునిధిలోని యమృతరసముక్ = అమృత సముద్రమునందలి యమృతరసమును, వెండిచేరులక్ =వెండిత్రాళ్ళతో, పటికంపుఁగుండక్ =స్ఫటికపాత్రను, కట్టి, చేదుకొనియెదరో = తోడుకొనెదరో, నాక్ =అనఁగా, శీతరోచి = చల్లనికిరణములుగల చంద్రుఁడు, మెఱుఁగుమెయితోన = తళతళ మను దేహముతో, అల్లనక్ =మెల్లఁగా, మిన్ను=ఆకాశమును, ప్రాఁకెక్ =ఎక్కెను.

విశే. వెండిత్రాళ్ళవలె కిరణములును, స్ఫటికపాత్రవలెఁ జంద్రబింబమును మించెనని గ్రహించునది. చేదుట స్త్రీలు చేయుపనిగాన 'అమరులు = సురవనితలు' అనియు నర్థము చెప్పనగును. అమరి. ఏ. రూ. అలం. రూపకము, ఉత్ప్రేక్ష.

ఉ. అమరులబోనపుట్టిక సహస్రమయూఖునిజోడుకోడె సం
తమసము వేరువిత్తు కుముదంబులచక్కిలిగింత పుంశ్చలీ
సమితికిఁ జుక్కవాలు నవసారసలక్ష్మికొలంగుబావ కో
కములకు గుండెతల్లడము కైరవమిత్రుఁడు దోఁచెఁ దూర్పునన్. 41

టీ. అమరులబోనపుట్టిక = దేవతలభోజనపదార్థములగంప, సహస్రమయూఖుని జోడుకోడె=సూర్యునకు సమానమగుకోడె, తమసము వేరువిత్తు = చీఁకటియొక్కనాశకుఁడు, కుముదంబుల చక్కిలిగింత=కలువలను నవ్వఁజేయువాఁడు, పుంశ్చలీసమితికిక్ = జారిణీసమూహమునకు, చుక్కవాలు = ఎదుటిచుక్క, నవసారసలక్ష్మి = నూతనపద్మలక్ష్మిని, కొలంగుబావ = మఱలఁజేయునట్టిబావ, కోకములకుక్ = చక్రవాకములకు, గుండెతల్లడము=గుండెదడ, ఐన, కైరవమిత్రుఁడు=చంద్రుఁడు, తూర్పునక్, తోఁచెక్ = కన్పట్టెను.

వ్యా-విశే. సురలు రోజున కొక్కొకకళచొప్పున వంతు ననుసరించి చంద్రకళను ద్రావుదు రని పురాణములు నుడువును గానఁ జంద్రుఁడు దేవతలయాహారముల గంప యయ్యెను. సూర్యుఁడు చనినపిదప జగమును వానివలె దీపింపఁజేయువాఁడు చంద్రుఁడు గాన సూర్యునిజోడుకోడె చంద్రుఁడగు. చంద్రోదయమగుడుం గలువలు వికసించుఁగానఁ జంద్రుఁడు కలువల నవ్వఁజేయువాఁ డయ్యె. చంద్రుఁ డాకసమునఁ బ్రకాశించుచుఁ బ్రియసంకేతముల కేఁగుజారిణుల నెల్లర కగపడంజేసి వారి కరిష్టమును గూర్చువాఁ డగు

టయు నెదుటిచుక్కయు నరిష్టముంగూర్చున దౌట నీవిషయమునఁ జంద్రబింబమునట్టి దానింగా నూహించుట సంభవించె. బావ యన భర్తయన్న. ఆతఁడు వచ్చునపుడు క్రొత్తమఱదలు దూరముగ హాసాదుల వీడి తొలంగునట్లు చంద్రుఁడు రాఁగా, నవసారస లక్ష్మి వికాసము మాని యొప్పుటకతనఁ జంద్రుఁడు సారసలక్ష్మికి బావగా భావితుఁ డయ్యె. చంద్రునిరాకంజేసి చక్రవాకములకు వియోగము కల్గును. దాన వానికి గుండెపడం జేయు వాఁడు చంద్రుఁ డని యెన్నవలయు. బోనము. ప్ర. భోజనము. వేరువిత్తు=నాశకము.

ఉ. పొందుగఁ బశ్చిమాబ్ధితటభూస్థలి నంశుమదంశుమత్కులా
కందము వాసరాంతహలికప్రవరుం డిడ సాంధ్యవారిభృ
త్కందళము ల్తమోదళయుతంబులు నై గెల పండి వ్రాలఁ బూ
ర్ణేందునివేఁక బ్రాచి నది హేతువు వెన్నెలకల్మికల్మికిన్. 42

టీ. పొందుగన్=చక్కఁగా, పశ్చిమాబ్ధితటభూస్థలిన్ = పశ్చిమసముద్రతీరదేశమున, అంశుమదంశుమత్కులాకందము - అంశుమత్=సూర్యుఁడు, అంశుమత్కులా = అరఁటియొక్క, కందమున్ =దుంపను, వాసరాంతహలికప్రవరుండు=దినాంత మనుకృషీవలశ్రేష్ఠుఁడు, ఇడన్ =నాటఁగా, సాంధ్యవారిభృత్కందళములు-సాంధ్య-సంధ్యాసమయమునంపైన, వారిభృత్ = మేఘము లను, కందళములు= మొలకలు, తమోదళయుతంబులు నై-తమః=చీఁకటియను, దళ=ఆకులతో, యుతంబులునై =కూడినవియునై, పూర్ణేందుని పేరన్ =పూర్ణచంద్రుఁడనుమిషతో, గెల, పండి, ప్రాచిన్ = తూర్పున, వ్రాలెన్ =ఒఱఁగెను, వెన్నెలకల్మికల్మికిన్ =వెన్నెలయనుసంపదయొక్క కలుగుటకు, అది = ఆతూర్పున గెల పండి వ్రాలుట, హేతువు=కారణము.

భా. అరఁటిచెట్టు తూర్పునకు గెలవేయుట సంపదకల్గుటకుఁ గారణమని యార్యులంద్రు. పశ్చిమసముద్రతీర మను వ్యవసాయభూమిని వాసరాంత మను కృషీవలుఁడు రవియనునరఁటిమొక్కను నాట, సంధ్యాకాలారుణమేఘము లను మొలకలెత్తనది చీఁకటియనుపర్ణములతో మించి తూర్పుదెసం గెలవేసె ననియు, నా గెలపండుటఁజేసి వ్రాలెననియు నట్లు తూర్పుదెస నాచెట్టు గెలవేయుటకతననే వెన్నెల యనుసంపద సంభవించెననియు భావము. అనఁగాఁ బశ్చిమసముద్రతీరము వ్యవసాయభూమివలెను, సాయంసమయము కృషీవలునివలెను, నస్తమించుసూర్యుఁడరుణుండై యరఁటిగడ్డవలెను, వాని యస్తమించుట కృషీవలుఁ డరఁటిదుంపను నాటుటవలెను, సంధ్యాకాంతిప్రసారమున నరుణములగుజలదము లరఁటిమొలకలవలెను, నపుడలమినచీఁకటు లరఁటియాకులవలెను,

నరుణకాంతులు చెలంగ నుదయించుచంద్రబింబము పండినయరఁటిగెలవలెను నుండె నని గ్రహింపవలయును. అట్టిగెల తూర్పునం దోఁచుటంజేసి వెన్నెల యనుసంపద సంభవించె నని యెన్నవలయును.

అలం. రూపకోత్థాపితోత్ప్రేక్ష. కావ్యలింగము.

చ. సమయవిలాసి శోణమణిసంగతమౌక్తికచారుహారముం
గ్రమమునఁ గూర్చుచో నరుణరత్నముఁ దా మును సాంధ్యరశ్మిసూ
త్రమునఁ బొసంగ గ్రుచ్చి యెడతప్పునఁ ద్రోచి పిఱుందఁ జేర్చుము
త్తైమురీతిఁ దోఁచె నయ్యమృతదీధితి లాంఛనరంధ్రసంగతిన్. 43

టీ. తాను, సమయవిలాసి = కాలమనువిలాసవంతుఁడు, శోణమణిసంగతమౌక్తిక చారుహారమున్ -శోణ=ఎఱ్ఱనైన, మణి = మాణిక్యములతో (కెంపులు), సంగత=కూడిన, మౌక్తికహారమున్ = ముత్యాలహారమును, క్రమమునన్ = వరుసగా, కూర్చుచోన్ = గ్రుచ్చునపుడు, మును = ముందుగా, అరుణరత్నమున్ = సూర్యుఁడనుమాణిక్యమును, సాంధ్యరశ్మిసూత్రమునన్ -సాంధ్య = సంధ్యాకాలమందైన, రశ్మి=వెలుఁగను, సూత్ర మునన్ =దారమున, పొసంగన్ =ఒప్పునట్లుగా, గ్రుచ్చి, ఎడ=స్థానము, తప్పుటంజేసి = తప్పిపోవుటచే, త్రోచి = త్రోసివైచి, పిఱుందన్ =వెనుకను, చేర్చు = చేర్చిన, ముత్తైము క్రియన్ =మంచిముత్తైమురీతిగ, అయ్యమృతదీధితి = ఆయమృతకిరణుఁడగుచంద్రుఁడు లాంఛనరంధ్రసంగతిన్ - లాంఛన = నల్లమచ్చ యను, రంధ్ర = బెజ్జముయొక్క, సంగతిన్ =కూడికతో, తోఁచెన్ =కన్పట్టెను.

భా. కాల మను విలాసి కెంపులను ముత్యములఁగూర్చి యొకహారముం గూర్చు చుండె ననియు, నందు సాంధ్యకిరణసమేతుండగురవి తొలుత గ్రుచ్చఁబడినమాణిక్యము వలె నొప్పియుండెనని యు, నపుడైనసూర్యాస్తమయ మెడతప్పుట దానిం దొలఁగఁద్రోసిన ట్లుండె ననియుఁ, దరువాతఁ దోఁచిన నల్లనిమచ్చగలచంద్రుఁడు బెజ్జముతోఁగూడిన మంచిముత్తైమువలెను నాత్రనినుండి వెలువడుకిరణములు దారములవలెను నమరియుండె ననియు భావము.

విశే. అరుణుఁడనునరుణరత్న మనియు శ్లిష్టరూపకము గ్రహింపనగును. అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

చ. దినపరిణామలక్ష్మికిఁ బ్రతీచి తగం గయిసేయువేడుక
న్వనరుహామిత్రబింబ మనువర్తులలాక్షికపట్టికం బలో

ధినడుమఁ దోఁచి సాంధ్యనవదీప్తిరసంబు హరించి పాఱవై
చిన వెలిదూదియో యనఁగ శీతకరుం డుదయించె నత్తటిన్. 44

టీ. ప్రతీచి=పశ్చిమదిశ (ఒకానొకయువతి), దినపరిణామలక్ష్మికిన్ = సాయంకాలమనులక్ష్మికి, తగన్ = ఒప్పునట్లు, కయిసేయువేడుకన్ = అలంకరించు నుత్సాహముతో, వనరుహ.....పట్టికన్ = సూర్యబింబ మను గుండ్రని లత్తుకపట్టెను, పయోధినడుమన్ = సముద్రమధ్యమున, తోఁచి=ముంచి, సాంధ్యనవదీప్తిరసంబున్ -సాంధ్య=సంధ్యాకాలమందైన, నవ = క్రొత్తదైన, దీప్తి = ప్రకాశ మను, రసంబున్ =రసమును, హరించి=తీసికొని, పాఱవై చినవెలిదూదియో=పాఱవేసిన తెల్లనిదూదియో, అనఁగన్ = అనునట్లు, అత్తటిన్ = ఆసమయమున, శీతకరుండు = చంద్రుఁడు, ఉదయించెన్.

భా. అస్తగతుఁడుగా నున్నరవి ప్రతీచి యనువనిత సాయంసంధ్యాలక్ష్మి నలంకరించునుత్సాహమున గ్రహించినలాక్షికపట్టికవలెను, సూర్యాస్తమయ మాపట్టికను సంధ్రమున ముంచుటవలెను, సంధ్యారుణప్రభలు నిండఁగా దూదినుండివెలువడురక్తోదకములవలెను, జంద్రుఁడు లత్తుకనీరు పిండఁగా శేషించిన తెల్లనిదూదివలెను నుండెనని భావము.

అలం. రూపకోత్థాపితోత్ప్రేక్ష.

మ. కడఁక నేచలిగట్టుపట్టి దను వేడ్కం గూర్ప నేతెంచి పై
జడిగాఁ జుక్కలతూపు లేయఁ గినుక న్జాబిల్లిముక్కంటి దా
బొడుపుం గెం పనువేఁడికంట నిరు లన్మోవిల్తుమే నేర్చి చొ
ప్పడఁ దద్భాతి యలందె నానపుడు బింబం బొప్పెఁ బాండుద్యుతిన్.

టీ. కడఁకన్ = పూన్కితో, రేచలిగట్టుపట్టి-రే=రాత్రి యను, చలిగట్టుపట్టి=శీతాచలపుత్రిని (పార్వతిని), తనున్ = ఈశ్వరుని, వేడ్కన్ = ఉత్సాహముతో, కూర్పన్ =కలుపుటకు, ఏతెంచి=వచ్చి, పైన్ =మోఁదను, చుక్కలతూపులు = నక్షత్రము లను బాణములను, ఏయన్ = ప్రయోగింపఁగా, కినుకన్ = కోపముతో, జాబిల్లిముక్కంటి=చంద్రుఁడను త్రిలోచనుఁడు (ఈశ్వరుఁడు), తాను, బొడుపుంగెంపు=ఉదయరాగము, అను=అనునట్టి, వేఁడికంటన్ =వేఁడిగలకంటిచే (మూఁడవక న్ననుట), ఇరులు అన్ పూవిల్తుమేను=చీఁకటి యనుపుష్పబాణునిశరీరమును, ఏర్చి=దహించి, చొప్పడన్ = అనువుగా, తద్భాతిన్ = ఆమన్మథశరీరసంబంధమైనబూడిదను, అలందెన్నాన్ =పూసికొనెనో యనునట్లు, అపుడు = ఆసమయమున, బింబము = చంద్రబింబము, పాండుద్యుతిన్ = తెల్లనికాంతితో, ఒప్పెన్ = అమరెను.

భా. రాత్రి పార్వతివలెను, చంద్రుడు ఫాలాక్షునివలెను, చీఁకటి మదనుని వలెను, నక్షత్రములు పార్వతిని బరమేశునితోడంగూర్ప మదనుఁడేసిన పుష్పబాణముల వలెను, జంద్రునియుదయరాగము పరమేశుని ఫాలనేత్రానలారుణజ్వాలవలెను, నంధకార వినాశము మన్మథనాశమువలెను, జంద్రునిపాండురప్రభ .యాశుని మేన మించు భస్మావ లేపమువలెను నుండెనని భావము. ఈశ్వరుండు పార్వతితోఁ దన్ను సురలప్రార్థన ననుస రించి కూర్ప నెంచువాని మదనుని ఫాలాక్షాగ్నిజ్వాలచే దహించె ననుపురాణగాథ నిట ననుసరింపవలెను.

వ్యా-విశే. పార్వతి నల్లనిదిగాన నల్లటిరేయిని బార్వతిగా నెన్నుట సరసము. మదనుని బాణములు సుమము లగుటను, దారకాసుమములకు సాదృశ్యము సహజ మాటను దారకల మన్మథబాణములుగాఁ జెప్పుట హృద్యము. ఇట్లే తక్కుంగలవర్ణనవిషయమును సహజమధురమై సమయోచితగతి కర్థ్యంట నెంతయు హృదయంగమ మగును. 'ముక్కంటి' బహువ్రీహిని సమాసాంతకార్యంబులు చూపట్టెడిని. మూఁడు+కన్ను-డువర్ణలోపదీర్ఘత్వములు. అలం. రూపకోత్థాపితోత్ప్రేక్ష.

చ. తొలుమలఁతితో నొరయుతూరుపుదొయ్యలిముత్తియంపుఁగుం
డలమున మానికంబు పడినం గనుపట్టెదులక్కగూఁడునాఁ
జలువలఁజేనియప్పాదుపుఁజాయఁ దొఱంగినకందు దోఁచె రే
చెలువ కనుంగవం గమియఁ జెందినకాటుకకప్పుకై వడిన్. 46

టీ. తొలుమలఁతితోన్ = తూర్పుకొండయొక్కశిలతో, ఒరయు=రాపాడు తూరుపుదొయ్యలిను త్తియంపుఁగుండలమునన్ = తూర్పుదిక్కునవనితయొక్క ముక్తా మయకర్ణాభరణమునందలి, మానికంబు = మాణిక్యము, పడినన్ = జాఱిపోఁగా, కను పట్టెదు=అగపడెడు, లక్కగూఁడు నాన్ =లక్కగలచోటు అనునట్లు, చలువలఁజేని... చాయన్ -చలువలఁజేని=చంద్రునియొక్క, అప్పాదుపుఁజాయన్ = ఆయుదయరాగ మును, తొఱఁగినకందు=తొలఁగినమచ్చ, రేచెలువ=రాత్రి యనుయువతి, కనుంగవన్ = నేత్రద్వంద్వమున, కమియన్ = క్రమ్మునట్లుగా, చెందిన = పొందిన (పెట్టుకొనిన), కాటుకకప్పుకైవడిన్ = అంజనమునొక్క నలుపువలె, తోఁచెన్ =అగపడెను.

భా. ఉదయరాగము పూర్ణముగఁ దొలంగినపిదప నగపడునట్టి చంద్రునియంచైన మచ్చ ప్రాచీదిగంగనాకర్ణాభరణమునందలి మానికము జాఱి పడిపోఁగా నగపడు లక్క గూడువలెను, రాత్రీరామనేత్రద్వయము కమియ నిడికొనిన కాటుకచైన నలుపువలెను మించె నని భావము. చంద్రబింబము, ప్రాగ్రామాకర్ణాభరణముగతిని, వానియుదయరాగము ర్ణాకభరణమందలి మానికమురీతిని వర్ణితము లయ్యె నని గ్రహించునది.

మ. అమృతంబాసవ మంగరాగముదయోద్యత్కాంతిచేలంబు చి
హ్నాముసుం గా శశిరేవతీరమణుఁ డున్మాదంబు మీఱం దమో
యమున న్భంగము నొంది పాఱఁ గరసీరాలోడితం జేయ వ
చ్చె మరుద్వాహిని దానిఁ దేర్పఁ నన మించెం జంద్రికాపూరముల్.47

టీ. అమృతంబు=సుధ, ఆసవము=మద్యముగాను, ఉదయోద్యత్కాంతి = ఉదయ కాలమం దొప్పుకాంతి, అంగరాగము = మైపూఁతగాను, చిహ్నము = మచ్చ, చేలంబు గాఁ=వస్త్రముగాను, (కాఁ అనుదాని కాసవాంగరాగచేలపదములతో సంబంధముం గల్పించునది.)శశిరేవతీరమణుఁడు = చంద్రుఁ డనుబలరాముఁడు, ఉన్మాదంబు = మైపు, మీఱఁ = అతిశయింపఁగా, తమోయమునఁ = అంధకార మను యమునానదిని, భంగమున్ = అవమానమును, ఒంది=పొంది, పాఱఁ = పరుగెత్తునట్లు, భంగమున్ = అలలను, ఒంది, పాఱఁ = ప్రవహించునట్లు, (అని నదీపరమగునర్థము), కరసీరాలోడి కఁ -కర=కిరణము లను, సీర = లాంగలముచే, ఆలోడితఁ = క్షోభపెట్టఁబడినదానినిగా, చేయఁ =చేయఁగా, కర=చేతియందలి, సీర = నాఁగలిచే, ఆలోడితఁ = సంక్షోభపెట్టఁ బడినదానినిగా, అని బలరామపర మగునర్థము. దానిఁ = ఆయమునానదిని, తేర్పఁ = ఆశ్వాసింపఁగా, మరుద్వాహిని = గంగానది, వచ్చెఁ =పోఁతెంచెను, అనఁ = అనునట్లు, చంద్రికాపూరముల్ =వెన్నెలలప్రవాహములు, మించెఁ =ప్రకాశించెను.

భా. చంద్రికాపూరములు గంగాప్రవాహమువలె ధవళములై యతిశయించెనని భావము.

విశే. చంద్రుఁడు తెల్లనివాఁడు. బలరాముఁడును ధవళగాత్రుఁడే. కావునఁ జంద్రుని బలరామునిగా నూహించుట హృద్యము. అట్లే చంద్రసుధను మద్యముగను, నుదయరాగమును మైపూఁతగను, జంద్రకిరణములు చీఁకటులం బాఱఁద్రోలుటను బల రాముఁడు కరంగములతోడి యమునానదిని దనహలాయుధముచే లేవఁ జెత్తుటగను, నంధ కారము నశింపఁగాఁ జెలంగు వెన్నెలలపూరము యమునానదికి సంభవించిన విపత్తును గాంచి యామె నాశ్వాసింప నేతెంచిన తత్ప్రియసఖి గంగానదిగను, దలంచుట యెంత యు మనోహరము. అలం. రూపకక్లేషమూలకోత్ప్రేక్ష.

తే. తారకాధీశుకిరణకదంబకంబు
చిలికెఁ బలుచనివలిపంపుజిలుఁగు మించుఁ
గైరవశ్రీవధూకరగ్రహణవేళ
వెలికిఁ గ్రమ్మిన సాత్త్వికస్వేద మనఁగ. 48

టీ. తారకాధీశుకిరణకదంబకంబు = చంద్రునికిరణములగుమి, కైరవశ్రీ.... వేళక్-కైరవశ్రీ=కుపలయలక్ష్మియను, వధూ = స్త్రీయొక్క, కరగ్రహణవేళక్ =పాణిగ్రహణకాలమున, వెలికిక్ =బయటికి, క్రమ్మిన=వ్యాపించిన, సాత్త్వికస్వేదము=సాత్త్వికభావ మగుచెమట, అనఁగక్ = అనునట్లు, పలుఁచని...మంచు-పలుచని = దట్టముగాని, వలిపంపు=ధవళమైన, జిలుఁగు=సూక్ష్మమైన, మంచు=నీహారము, చిలికెక్ =చల్లెను.

భా. చంద్రకిరణములనుండి వెలువడు పలుచనిమంచు చంద్రుఁడు కుపలయలక్ష్మీ పాణిగ్రహణమును జేయునవసరమున వెలికిఁగ్రమ్మిన సాత్త్వికస్వేదమో యన నొప్పెనని భావము. అలం. ఉత్ప్రేక్ష.

సీ. విరహులమై సోఁకి వేఁడి యా వెన్నెలఁ
బచ్చివెన్నెల నులివెచ్చఁ జేసి
కలువపుప్పొళ్లచేఁ గసకైనవెన్నెల
వలిపవెన్నెలలోన వడిచి తేర్చి
చంద్రకాంతపునీట జాలైనవెన్నెల
ముదురువెన్నెల జుఱ్ఱఁ బదను చేసి
సతులమైపూఁతం బిసాళించువెన్నెలఁ
దనుపువెన్నెల రసాయనము గూర్చి

తే. చిగురువిలుకానిజాతర చేయఁ బూని
కొలముసామంచ నందఱఁ గూడఁబెట్టి
వంతు గలయంగ బువ్వంపుబంతివిందు
పెట్టి రెలమిఁ జకోరపుఁబేరటాండ్రు. 40

టీ. ఎలమిక్ =సంతోషముతో, చకోరపుఁబేరటాండ్రు=చకోరములయిదువలు, (చకోరజాయలు), చిగురువిలుకానిజాతర = మన్మథోత్సవము, చేయక్ = చేయుటకు, పూని=యత్నించి, విరహులమైక్ = వియుక్తులశరీరమును, సోఁకి=స్పృశించి, వేఁడియా =ఉష్ణమైన, వెన్నెలక్ =చంద్రాతపమును, పచ్చివెన్నెలక్ = (చల్లని) తడిగల వెన్నెల తోడ, (కూర్చి) నులివెచ్చ=కవోష్ణముగా, చేసి = ఒనర్చి, కలువపుప్పొళ్లచేక్ =కుముదపరాగములచే, కసటైనవెన్నెలక్ =మలిన(కలుష)మగు వెన్నెలను,వలిపవెన్నెలలోనక్ = సన్ననివెన్నెలలోపల, వడిచి=వడియఁగట్టి, తేర్చి = స్వచ్ఛముగాఁజేసి, చంద్రకాంతపు నీటక్ = చంద్రకాంతమణులసంబంధమగు నుదకముచే, జాలైనవెన్నెలక్ =ప్రవాహమైనవెన్నెలను, ముదురువెన్నెలక్ =(తీక్ష్ణమైన) పండువెన్నెలచేత, జుఱ్ఱక్ = త్రాపు

టకు, పదను=అనువుగా చేసి, సతులమైపూఁతక్ = స్త్రీలయంగరాగముచే, పిసాళించు = పరిమళించు, వెన్నెలక్, తనుపువెన్నెలక్ =తృప్తిసందించుచంద్రికతో, రసాయనమున్ = ఔషధవిశేషమును (ద్రవాహారము) కూర్చి, ఘటించి, కొలముసాములక్ అందఱిక్ = కులముపెద్దలసెల్లను, కూడక్ పెట్టి = ఒక్కచోఁ జేర్చి, వంతు=నరుస, కలయంగక్ = కూడునట్లుగా, బువ్వంపుబంతివిందుక్ =చుట్టములై నయాఁడువారును మగవారును గలిసి భుజించుట యనువిందును, పెట్టిరి=ఇడిరి.

విశే. చకోరములు వెన్నెలలం ద్రావుననుట ప్రసిద్ధము. దానినే కవి యీగతిని జమత్కరించి వర్ణించినాఁడు.

సీ. కామినీమానమేఘశ్రేణి విరియంగఁ
దొగఁజెల్లుగుంపులు దొంగలింప
సాంధ్యరాగావిలచంద్రికాంబులు దేఱి
నిరులుమొత్తపుటసలివురఁ బాఱ
యువజనరాగపయోరాసు లుప్పొంగ
వెలిదమ్మి జాజిపువ్వులు ముడుంగ
మదచకోరమరాళమండలి చెలరేఁగఁ
బఱచుచేడియ లనుమెఱపు లడఁగ

తే. నభినవశరత్సమాగమం బనఁగ మించు
నట్టిరాకానిశావేళ నలరువింట
గొనయ మెక్కించి వలరాజు కీనుక మీఱ
విరహిజనములపై దంపువెడలె నపుడు. 50

టీ. కామినీమానమేఘశ్రేణి-కామినీ = మదవతులగు వనితలయొక్క, మాన = పురుషులయెడఁగల్గు కోపవిశేష మను, మేఘ=మేఘములయొక్క, శ్రేణి = పంక్తి, విరియంగక్ = విడిపోఁగా, తొగఁజెల్లుగుంపులు = కలువ లనుజెల్లుపూవులగుములు, తొంగలింపక్ = ప్రకాశింపఁగా, సాంధ్య...అఁబులు-సాంధ్యరాగ = సంధ్యాకాలరక్తిమచే, ఆవిల=కలుషములైన, చంద్రికాంబులు = వెన్నెలయనునీళ్ళు, తేఱిక్ =స్వచ్ఛముగా, ఇరులుమొత్తపుటసలు=చీఁకటులగుంపనుబురద, ఇవురఁబాఱిక్ = ఇంకఁబాఱఁగా, యువజన...రాసులు-యువజన = యౌవనవంతులయొక్క, రాగ = అనురాగ మను, పయోరాసులు=సముద్రములు, ఉప్పొంగక్ =పొంగఁగా, వెలిదమ్మిజాజిపువ్వులు = తెల్లదామరలను జాజిపూవులు, ముడుంగక్ = ముకుళింపఁగా, మదచకోరమరాళమండలి = మత్తి

లినచకోరములను హంసలగుంపు, చెలరేఁగఁ = విజృంభింపఁగా, పఱచుచేడియ లను మెఱపులు = (ప్రియసంకేతమునుగూర్చి)పరువులిడువనితలను విద్యుత్తులు, అడఁగఁ = నశింపఁగా, అభినవశరత్సమాగమంబు = క్రొత్తశరత్కాలపురాక, అనఁగఁ = అనునట్లు, మించు=ప్రకాశించునట్టి, అట్టిరాకాసిశావేళఁ = అటువంటి పూర్ణిమారాత్రిసమయ మున, ఆలరువింటఁ = పుష్పకోదండమున, గోనయము=నారిని, ఎక్కించి, పలరాజు= మన్మథుఁడు, కినుక=కోపము, మీఱఁ =అతిశయింపఁగా విరహిజనములపైఁ = వియు క్తులమీఁదికి, అపుడు=ఆసమయమున, దండువెడలెఁ =యుద్ధము సేయఁబోయెను.

విశే. శరత్సమయమునఁ దెల్లనై జలదములు విరియఁబొఱుటయు, తెల్లపూవులు పెల్లుగనొప్పుటయుఁ, జంద్రికలచ్ఛములై యమరుటయు, జలమమలంబై మించుటయుఁ, బయోనిధు లుప్పొంగుటయుఁ, జాజిపూవులు ముకుళించుటయు, వెన్నెలం ద్రావఁగోరు చకోరములును నమలజలము నాశించునంచపిండును సంతసముమీఱ విజృంభించుటయు, మెఱపు లుడుగుటయు నైజములు. అట్టి శరత్కాలసహజధర్మములతోఁ జంద్రోదయ ధర్మములు పోల్పఁబడి హృద్యములై వర్ణితము లయ్యెను.

ఉ. అనలినాయతాక్షుగడియారమునం దభిసారికాజిఘాం
సానిరత ప్రసూనశరచాపగుణధ్వనులో యనంగ ఘుం
టానినదంబు లయ్యెడ వినంబడియెం గుపితాబ్జలోచనా
మానసము ల్చలింపఁ బ్రథమప్రహరాపగమప్రశంసులై. 51

టీ. అనలినాయతాక్షు గడియారమునందుఁ = ఆపద్మములవలె దీర్ఘములగు కన్నులుగల శ్రీకృష్ణుని కాలప్రమాణముఁ దెల్పు యంత్రవిశేషమున,ఘంటానినదంబులు= గంటలచప్పుడులు, అభిసారికా...ధ్వనులు + ఒ-అభిసారికా = కాంతులం గలయఁబోవు కాంతలయొక్క, జిఘాంసా=హింసించుటయందు, నిరత=మిక్కిలియాసక్తిగల, ప్రసూ నశర=పూవిలుకానియొక్క, చాప = ధనువుయొక్క, గుణ = అల్లెత్రాటిసంబంధమైన, ధ్వనులో=శబ్దములో, అనంగఁ =అనునట్లుగా, కుపిత...మానసముల్ - కుపిత=కోపించిన, అబ్జలోచనా=స్త్రీలయొక్క, (తమ్ములంబోలుకనులుగలవారు) మానసముల్ =మనస్సులు, చలిపఁ = సంక్షోభమునందఁగా, ప్రథమ...ప్రశంసులై - ప్రథమ = తొలిదైన, ప్రహర=యామమునయొక్క, అపగమ=అతిక్రమించుటను, ప్రశంసులై = తెల్పునవియై, అయ్యెడఁ =ఆసమయమున, వినంబడియెఁ =వినయయ్యెను.

భా. తొలిజాము పోకడంఁ దెల్పు గడియారపుచప్పుడులు కాంతులం గవయ సంకే తమున కేఁగుకాంతల హింసింప మదనుఁడు ధనువు చేఁబూని చేయు నారిటంకారధ్వనులో

యనంగ సమరిప్రణయకలహకలుషితాంతఃకరణలగు కాంతలమదుల నల్లలనాడించునట్లై చెలఁగె నని భావము.

విశే. ప్రథమ యామ మతిక్రమించెఁగాన నభిసారికలు తమిమీఱి నభిసరణ మొనర్పఁబోవుటయుఁ గుపితలమది చలించుటయు సహజము. లనఁదగు. అట్టితఱిని గన్గిన గడియారపుచప్పుడుల మదనధనుష్టంకారములుగను గుపితమానినీమానససంచలన కారణములుగను నూహించుట యెంతయు హృద్యము. అక్కాలమునఁగూడ కాలప్రమాణ సూచకములగు గడియారములు కల్గుట దీన సూచితము. అలం. ఉత్ప్రేక్ష.

## చంద్రికావిహారములు

చ. వలిపము గట్టి హారములు వైచి పటీరము మై నలంది జా
దులు నెఱిగొప్పనందుఱిమి త్రోవనె పోయితిమేని తాఁకియుం
దలఁచెడువారు లేరని మనంబుకలంకలు దేర్చి జారకాం
తల సమయస్థలంబులకుఁ దార్చిరి దూతిక లట్టివెన్నెలన్. 52

టీ. వలిపము = సన్నని తెల్లనిబట్టను, కట్టి = ధరించి, హారములు = ముత్యాల హారములను, వైచి=వేసికొని, పటీరము = మంచిగంధము, మైన్ = శరీరమున, అలంది= పూసికొని, జాదులు=జాజిసుమములు, నెఱిగొప్పన్ =రమ్యమైనతురుమున, తుఱిమి = ముడిచి, (నెఱి=నిండు, అనిన లెస్స) త్రోవనె=మార్గమందె, పోయితిమేని=నీఁగితిమేని, (పోయినను) తాఁకియున్ =తగిలియు, తలఁచెడువారు=తగిలె నది యేమి యని భావించు వారు, లేరు=ఉండరు. అని, దూతికలు = ప్రియులంగలుపుచెలులు, మనంబుకలంకలు = మనస్సునందైన సందియములను, తేర్చి = పోఁగొట్టి, జారకాంతలన్ = జారిణులను, సమయస్థలంబులకున్ =నిర్ణీతప్రదేశములకు, అట్టివెన్నెలన్ = ఆవెన్నెలలో, తార్చిరి = పొందించిరి.

భా. ధవళములగు నలంకారముల ధరించి ధవళమగువెన్నెలలో రాజమార్గమునఁ బోయినను నందొకపు డెవరేని తాఁకినను, మీరు వారిచూడ్కి-కి లక్ష్యముగాకయే పోఁగలరని దూతికలు జారిణులమదినైన సందియములఁబాపి ధవళాలంకారముల ధరింపఁ జేసి సంకేతస్థలములను బొందించుచుండిరని భావము. ఇట్లు ధవళాలంకారముల ధరించి, వెన్నెలల జారిణులు విహరించుట కార్యప్రసిద్ధవిషయము.

వ. వెండియుం దుహినకరమండలంబునం గురియు నప్పండువెన్నెలలు సాయంతననటనచటులమహానటనికటాట్టహాసభాసంబుల కనుప్రాసం బులై, పూర్వపారావారపులినతలవిహారమాన్యై రావణకరపుష్ప-

రోద్ధూతవాలుకాధూళిపాళికలకుం బ్రత్యాదేశంబులై, యంధకార బలీంద్రనిబ్బంధనధురంధర సమయమధుమథనచరణాంగుష్ఠనిష్ఠ్యూత గగనసరిదంబుపూరంబుల కనుబింబంబులై, చంద్రకాంతమణినిర్మిత హర్మ్యహిమవన్మహీధరశృంగపతితంబు లగుచుం బెనువెల్లువలు గట్టి యతివిషమమానినీమానప్రతీరంబు లురలం ద్రోయుచు, వియోగవేదనాభరాక్రందద్రథాంగకంఠగుహా కుహారముఖంబుల ముంపుకొని [1]మెఱయుచు, నరవిరిచెంబొగమొగడలం బడి [2]సుడియుచుఁ, [3]దనుకరువలిం గదలువిరులం దొరుఁగుపుప్పొడితిప్పలం బొరలి తెట్టువ గొంచుఁ, గనకడోలావిహారలీలాయత్తమత్తకాశినీ కపోలథాళధళ్యంబుల [4]పెల్లునం గడలుకొని యుప్పొంగుచుఁ, గటికిచీఁకటితరులం దెరలం జేయుచు, సకలభువనతలాప్లావనంబు గావించి, యజాండకరండంబు [5]వెండిజలపూఁత గావించిన తెఱంగున నంగీకరించె నప్పుడు దమయందు నెప్పుడెప్పుడు నింతురో యనుచు నువ్విళ్లూరుచందంబునఁ జంద్రికాకిరణకంబళికలం గరంగు రేవెలుంగు రాచిప్పలం గప్పురంపుఁ గుప్పెలం గొప్పరించిన సరసమధురసంబులు నించి యించినవేడ్కలఁ గొండొరుపుల కెంజిగురాకుమోవినంజలం జవిగొనుచుఁ గ్రొత్తి సోలి పూఁజవికలఁ బొంపిరివోవుకామినీకాము కులును, వలరాచకేలి సలుపునెడల [6]నంగంబుల చకచకలు వెలివోవ కుండ నిండార లేపంబులు సేయుచొప్పునఁ గర్పూరకస్తురికాసంకు మదమిళితచందనపంకంబు లొకొళ్లొకళ్లమేనులం గలయ నలందు కొని చలువచప్పరంబులందీర్చిన పుప్పొడితిన్నెల విశ్రమించుసతీపతు లును, బ్రోడలగు నెచ్చెలులు జీరాడుసిగ్గుల నీడిగిలంబడ నెట్టకేలకుఁ ద్రోపు త్రోపాడుచుం దార్చి కూర్చి మరలుటయు మరుం డొనర్పఁ గలకోల్తలకుం దివురుతమకపుముంగలిపొఁజులు నిగిడించు క్రొవ్వాఁడి తూపులరూపున నొండొరువుల నుఱుపెట్టి చూచునెలగోలుచూపుల నితరేతరధైర్యంబులు గంటివడ నొంటిం బచ్చెనమోవరుల వసి యించువధూవరులును, బేరుకొనుకోరికలు దారుకొన డాయునెడం

---

1. మొఱయుచు. 2. సుడిగొనుచుఁ. 3. జిఱుకరువలిం. 4. పైజల్లునం. 5. వెండిజలపోసనంబు. 6. నందంబులతెగలు పొలివోవ.

బొంగినయంగంబులం బరస్పరబాహుపాశంబుల బిగియారం గౌఁగి
లించుకొని కరంగినడెందంబుల రెంటి నొక్కటిగ నత్తించుపోలిక
నత్తమిల్లి పగలు తమపాసిన [1]యెడలం బొడము మనోజవికారంబుల
నవిరళతరకపోలంబుగాఁ జెప్పికొనుచు హంసతూలికాతల్పంబుల
నల్వేతరానందంబులం బొరలు తరుణీతరుణులును, దొలుతటిపాల
యలుకయెడం జనించినవియోగశిఖి నిండారు రేయెండవేఁడిమి నగ్గ
లించినం దాలిమి దెమలం దమక తామ తమకించి కలసికొని నెచ్చె
లులక బేలువెట్టి తొట్టినవేడ్కలం బొదరింట్లకందువలం బొదలు
రమణీరమణులును, మబ్బుకొను వయసు [2]గుబ్బల నిబ్బరంబుగ
నివుడు తివుటలం బెచ్చుపెరుఁగుమచ్చరంబుల నొక రొకరి మెచ్చక
పచ్చవిలుతుంపు విచ్చలవిడిం దనకై దువులు ముప్పదిరెంటం దోడు
సూపె నన బహువిధకరణాసనభేదంబులం బెనఁగుచు మణిసౌధం
బులం గ్రీడించు యువతీయువజనంబులును, గ్రిక్కొసిన మక్కువల
నిక్కువలఁ గమియం [3]జొక్కులచెయ్వులఁ ద్రొక్కుడు[4]వడి రతి
శాస్త్రరహస్యతత్త్వానుభవంబున వెలిమఱచిన వలరాచతపసులపోలికం
దెలిరాకట్టునెలవులం బవ్వళించి యున్న నాయికానాయకులును,
నెడపడనివేడుకపనుల నలసి జడియునవయవంబులపై సొలయు
నెమ్మనంబులతో నొయ్యనొయ్యనం గదలు తూఁగుటయ్యలలం
గన్ను మొగిచి యున్నవిలాసినీవిలాసులునుం గలిగి యున్నగరంబు
శంబరాంతకుసామ్రాజ్యంబు ననుకరించె ; నయ్యెడ నయ్యదువల్ల
భుండు సత్యయుం దాను ననర్ఘ్యమణిదీపితంబును విమలదుకూల
వితానసందానితంబును బ్రాలంబముక్తాగుళుచ్ఛచ్ఛవిచ్ఛాదితవలభి
విలసితంబును వివిధ విచిత్రపటఘటితస్ఫటికభిత్తిభాగభాసురంబును
మృదులహంసతూలికాకల్పిత తల్పసంచన్నమణిమంచకాంచితంబును
ధవళఘణిలతాదళక్రముకఖండమండిత మరకతమణిభాజనవిభ్రాజితం
బును మృగమదమిళితపటీరపంకాంకితమాక్తికశుక్తిపరికల్పితంబును
దరవికచలతాంతతాలవృంతకాంతంబును గోమలబిసతంతుసంతాన

---

1. యడలునం బొడముచెయ్వులనవిరళ. 2. గబ్బుల. 3. జిక్కుల. 4. వడ
నన్ను కొని వలరాచ.

నిబద్ధకుసుమదామ రమణీయంబును సురభికృష్ణాగరుధూపధూపితం
బును బరిమళమిళితశిశిరసలిలపూర్ణకనకగళంతికా సమంచితంబును
మంజుగుంజత్పారావతపతంగగళరవభరితంబును మాణిక్యసమున్న
తాదర్శ దర్శనీయంబును నగు శయనాగారంబున వినోదకేలిం దేలి
నిద్రాముద్రితనేత్రుడై శయనించె నయ్యవసరంబున. 53

టీ. వెండియుక్ = మఱియు, తుహినకర మండలంబునక్ = చంద్రమండ
లమునుండి, కురియు=జాఱునట్టి, అప్పుండువెన్నెలలు = ఆముదురువెన్నెలలు, సాయంతన
.....భాసంబులకుక్ - సాయంతన = సాయంకాలమందైన, నటన = నృత్యముచే,
చటుల=కదలునట్టి, మహానట=శివునియొక్క, వికట=విశాలమైన, అట్టహాస = పెద్దనవ్వు
యొక్క, భాసంబులకుక్ =కాంతులకు, అనుప్రాసంబులై = సవర్ణములై; అనగా బాడు
వెన్నెలలు నాట్యావసరమున శివునినుండి వెలువడువిశాలాట్టహాసకాంతులం బోలియున్న
వని భావము. శివుఁడు తెల్లనివాఁడు. చంద్రుఁడును ధవళగాత్రుఁడే. కావునఁనే చంద్ర
బింబమునుండి వెలువడుపుండువెన్నెలలు శివుని యట్టహాసకాంతులంబోలి యున్నవని
చెప్పుట కనువుపడియె. పూర్వపారావార...పాళికలకుక్ -పూర్వపారావార = తూర్పు
సంద్రముయొక్క, పులినతల = ఇసుకదిబ్బలతావుల, విహారమాణ = విహరించు
నట్టి, ఐరావణ=ఐరావతముయొక్క, కరపుష్కర=తుండాగ్రముచే, ఉద్ధూత = ఎగురఁ
గొట్టఁబడిన, వాలుకాధూళి = ఇసుకసంబంధమైన పరాగములయొక్క, పాళికలకుక్ =
పంక్తులకు, ప్రత్యాదేశంబులై =బదులుగాఁ గన్నినవై (అనఁగా వానిని మించినవై యని
భావము.)ఐరావణము దేవేంద్రుని పట్టపుటేనుఁగు. దేవేంద్రుఁడు ప్రాగ్దిగధిపతి. కావునఁనే
యాతనిగజము ప్రాక్సముద్రపులినతలముల విహరించును. మఱియు నైరావతము ధవళము.
అది చిమ్మువాలుకాధూళియు ధవళమే. కావునఁనే తెల్లనియైరావతము తుండాగ్రమునఁ
జిమ్మువాలుకాధూళిపాళికలవలె ధవళగాత్రుండగుశశినుండివెలువడుధవళములగు వెన్నెలలు
మించియున్నవనుట సంభవించె. పుష్కరము కరిహస్తాగ్రవాచకమైనను, మఱియ హస్తి
హస్తవాచకమగుకరశబ్ద మిందుఁజేర్చుట స్పష్టార్థము. కాని యైరావణతుండసామ్యమును
జంద్రకిరణములకుఁ దోఁపఁజేయ నట్లు కవి కరశబ్దము నిందుఁ గూర్చెనే మోయని యూ
హించుట కవకాశ మొక్కింత గలదు. అంధకార...పూరంబులకుక్ -అంధకార=చీఁకటి
యను, బలీంద్ర=బలిచక్రవర్తియొక్క, నిర్బంధన = బంధించుటయొక్క, ధురంధర =
భారమును వహించు, సమయ=కాల మను, మధుమథన = విష్ణునియొక్క, చరణాంగుష్ఠ=
కాలిబొటనవ్రేలినుండి, నిష్ష్యంద = వెడలునట్టి గగనసరిత్ =మరున్నదియొక్క, అంబు
పూరంబులకుక్ = ఉదకప్రవాహములకు, అనుబింబములై =ప్రతిబింబములై; గంగానది

తెల్లనిది. దానిపూరములును దెల్లనివే. బలిని బంధింపఁ గాలు గట్టిగాఁ బూనుటకతన నాశ్రనియంగుష్ఠమునఁ గలగంగకు బహిఃప్రసారము కల్గెను. ప్రకృతము తెల్లనిగంగానదీ ప్రవాహములవలెఁ బండువెన్నెల లమరెనని భావము. చీఁకటిని రాక్షసరాజగుబలీంద్రుని గాను; దానియడఁగుటను వానిబంధనముగాను, వెన్నెలలయదురుటను వానిబంధించు భారము బూనియున్నవిష్ణుని కాలిబొటనవ్రేలినుండి జాఱుగంగాపూరముగాను జెప్పుట యెంతయు సరసము. చంద్రకాంత...పతితంబులు - చంద్రకాంతమణి = చంద్రకాంత మాణిక్యముల చే, నిర్మిత=కట్టఁబడిన, హర్మ్య=మేడలను, హిమవన్మహీధర=హిమవత్పర్వ తముయొక్క, శృంగ = శిఖరములనుండి, పతితంబులు=పడునట్టివి, అగుచున్, పెను వెల్లువలు=పెద్దప్రవాహములు, కట్టి=నిర్పడి, అతివిషమ...ప్రతీరంబులు = అతివిషమ = మిగులఁ గఠినములగు, మానినీ = స్త్రీలయొక్క, మాన = మాన మను, ప్రతీరంబులన్ = తీరదేశములను, ఊరలన్ = పడునట్లు, త్రోయుచున్ = కూల్చుచు, చంద్ర కాంతమణినిర్మితములగుసౌధముల యున్నతశిఖరదేశములనుండి జాఱు నీటివెల్లు వలంగూడి క్రిందికిఁ బడుటకతన వెన్నెలలు హిమవన్నగశిఖరముల నుండి జాఱుప్రవాహములవడువున మించె నని యెన్నవలయును. ప్రవాహము తీరము నురలంద్రోయుట ప్రసిద్ధము. ఈచంద్రికారూపప్రవాహమును మానినీమాన రూపమగుప్రతీరమును గూలఁద్రోయుచున్నది. కావునచే దీనికిఁ బ్రవాహత్వౌల్యము కవి సంఘటించె. చంద్రోపలములు చంద్రకరస్పర్శను ద్రవించుటయు మానినులు మాన మును వీడి చంద్రోదయముగాఁ బ్రియులఁ గలిసికొనుటయు సైజములు. వానిచే కవియీ గతిని వర్ణించె. వియోగ...ముఖంబులన్ - వియోగవేదనా = విరహబాధయొక్క, భర=భారముచే, ఆక్రందత్ = పరిదేవనముసేయు, రథాంగ = చక్రవాకములయొక్క, కంఠ=కుత్తుకలయొక్క, గుహాకుహర = గుహలంబోలు బిలములయొక్క, ముఖంబు లన్ =అగ్రముల, ముంపుకొని = ముంచి, మెఱయుచున్ = ప్రకాశించుచు, (లేక) మెఱయుచున్ = శబ్దించుచు; నదీపూరము పర్వతమునుండి భువిఁబడునపుడు తద్గుహా ముఖంబుల ముంచి ధ్వనించును. అట్లే చంద్రికాపూరమును విరహవేదన నెలుఁగెత్తి యఱచుచక్రవాకముల కంఠకుహరములఁ బ్రవేశించి మెఱయుచున్నదివలె నుండె నని యెన్నవలయును. కావునఁ బ్రవాహసామ్యము సార్థకమయ్యెను. చక్రవాకములకు రేయి వియోగము కలుగుట ప్రసిద్ధము. కావున నవి రాత్రుల నెలుఁగెత్తి యాక్రం దించు సపుడవ్వాని తెఱువఁబడిననోళులఁ జంద్రికలు ప్రవేశించుట సంభవించును. అరవిరి చెందొగమొగడలన్ = సంగోరువిడిన యెఱ్ఱికలువ మొగ్గలందు, పడి, సుడియు చున్ = తిరుగుచు; ఇపుడే చంద్రోదయ మగుటఁ గలువమొగ్గలు సంగోరుమాత్రమే

వికసించె ననియు, నట్టి సంగోరువిడినవానిం జొచ్చి శీఘ్రము మఱలి రాఁజాలక చంద్రి కలు వానిలోఁ దిరుగుచుండె ననియు భావము. తనుకరువల్క = పిల్లగాలిచే, కదలువిరు ల్క =చలించుపూవులయుండి, తొరఁగుపుప్పొడి తిప్పలక =జాఱుపరాగముల తిన్నెలందు, పొరలి=దొర్లి, తెట్టువక = తెఱచు; మిసిమి నగుట, కొంచుక = స్వీకరించుచు; మంద మారుతాహతిని విరులు మెల్లఁగఁ గదలుచుండె ననియు, నట్టిచలనముకతన, విరుల పరాగము జాఱి తిప్పలుగా నేర్పడె ననియు, నట్టిధవళము లగు పుప్పొడితిప్పలఁ బొర్లుట కతన ధవళము లగు వెన్నెలలకు మఱింత ధావళ్యము సంభవించె ననియు భావము. కనకడోలా...పెల్లునక -కనకడోలా = బంగారపుటుయ్యెలలసంబంధ మైన, విహార లీలా=విహారవిలాసమందు, ఆయత్త = అధీనలైన, మత్తకాశినీ = మదవతులయొక్క, కపోల = చెక్కిళుల సంబంధమైన, ధాళధళ్యంబుల = తళతళలయొక్క, పెల్లునక = అతిశయము చే, కడలుకొని=వృద్ధినంది (దిక్కుల ముట్టి) ఉప్పొంగుచుక = అతిశయిం చుచు; అమ్మనోహర చంద్రోదయకాలమున యువతులు బంగరపుటుయ్యెలల సంతసము మీఱి విహరించుచుండి రనియు, నమ్మానినుల యచ్ఛము లగుచెక్కిళుల తళతళలతో మేళ వించుట కతనఁ జంద్రికలు మిగుల ధవళము లై పెంపొందె. ననియు భావము. కటికిచీఁకటితరులక = గాఢాంధకార మనుపృక్షములను, తెరలక = కూలునట్లు, చేయు చుక =ఒనర్చుచు; ప్రవాహ మొడ్డులం గలచెట్టులఁ గూలఁద్రోయునట్లు చంద్రికాపూ రము గాఢాంధకారము నున్మూలించుచున్న దని భావము. సకలభువనతలాప్లావనంబునక = సమస్తభూతములయొక్క ముంచుటను, కావించి=చేసి, అజాండకరండంబుక =బ్రహ్మాండ మను బరిణెను, వెండిజలపూఁత=వెండిమొలామును, కావించినతెఱంగునక =చేసినవిధమున, అంగీకరించెక =సమ్మతించెను. బరిణెకు వెండిగిల్టువేసినచందమున వెన్నెల యజాండ మను కరండమును ధవళముగఁ జేసె నని భావము. అప్పుడు=ఆసమయమున, తమయందుక = రేవెలుంగు రాచిప్పలందు, ఎప్పుడెప్పుడు=ఇది కాలాతిక్రమణమును సహింపలేకపోవు టకు సూచకము. నింతురో=నిండింతురో, అనుచుక, ఉవ్విళ్లూరుచందంబునక = ఊట లూరువిధమున, చంద్రికాకిరణకందళికలక = వెన్నెలవెలుంగుమొలకలచే, కరంగు=ద్రవీ భవించునట్టి, రేవెలుంగురాచిప్పలక = చంద్రకాంతశిలాపాత్రములందును, కప్పురంపుఁ గుప్పెలక =కర్పూరపాత్రవిశేషములందును, కొప్పరించిన = అతిశయించిన, సరసమధు రసంబులు=సరసములగుమద్యములు, నించి=నింపి, ఇంచినవేడ్కలక = మీఱినయుత్సా హములతోడ, ఒండొరువుల...నంజలక -ఒండొరువుల = అన్యోన్యముయొక్క, కెం జిగురాకు మోవి=ఎఱ్ఱనిచిగురుటాకులంబోలు నధరము లనునట్టి, నంజలక = ఉపదంశము (నంజుకొనువస్తువు)లచే , చవిగొనుచుక =రుచిచూచుచు, క్రోలి=త్రావి, సోలి=వివశులై

వ్రాలి, పూఁజవికల్ = పూఁజప్పరములందు; పొంపిరివోవు=సంతోషించునట్టి, కామినీ కాముకులును=యువతీయువకులును; చంద్రకిరణములతాఁకునఁ జంద్రకాంతశిలలు ద్రవీభవించుట సైజము. ప్రకృతము చంద్రకిరణస్పర్శమునఁ గరఁగు చంద్రకాంతపాత్రములు తమయందు మద్యము నెపుడు నింపుదురో యని యువ్విళ్లూరువిధమున నుండెనని గ్రహించునది. అటు లూటలూరు చంద్రకాంతపాత్రములందును గప్పురపుఁగుప్పెలందును మధురసమును నింపి కామినీకాముకు లొండొరులయధరములను ముద్దుగొనుచుఁ బ్రాపి వివశులై పూఁజప్పరముల సుఖించుచుండిరని భావము. భుజించునపుడు పచ్చడులు మున్నగువానిని నంజుగా నుపయోగించురీతి నొండొరులయధరములను మద్యపాన సమయమునఁ గామినీకాముకులు నంజుడుగా నుపయోగించికొని రని తెలియునది. వలరాచకేలి=మన్మథక్రీడ, సలుపు నెడలక్ = చేయుసమయమున, అంగంబులచకచకలు = అవయవములఁ బ్రవహించుశోభావిశేషము, వెలివోవకుండక్ =బయలుపాటుగాకుండ, నిండారక్ = (మేను) నిండునట్లు, లేపంబులు=పూఁతలు, సేయుచొప్పునక్ = చేయురీతిగ, కర్పూ...పంకంబులు - కర్పూర = ఘనసారము, కస్తూరికా = కస్తురి, సంకుమద = జవ్వాది; వీనిచేక్, మిళిత = కూడిన, చందనపంకంబులు=చందనపుటడుసులు, ఒకొళ్లొకళ్లమేనులక్ = పరస్పరగాత్రములందు, కలయక్ = అంతటను, అలందుకొని = పూసికొని, చలువచప్పరంబులక్ = చలువపందిళులందు, తీర్చిన = దిద్దినట్టి, పుప్పొడితిన్నెలక్ = పుష్పపరాగవేదికలపై, విశ్రమించు=డొరడిల్లు, సతీపతులును=దంపతులును; దంపతులు తమయంగములశోభావిశేషములు బయలుపాటు గాకుండఁ బూసికొనినపూఁతలవలెఁ గర్పూరము కస్తూరి జవ్వాదిఁ గలిపిన చందనపంకమును బూసికొనుటయొప్పె నని భావము. అట్లు మైపూఁతలం బూసికొని చలువపందిళులం గల పుప్పొడితిన్నెలపై విశ్రమించి రనియుఁ దాత్పర్యము. ప్రొడలగు నెచ్చెలులు=ప్రౌఢలై నచెలికత్తెలు, (కర్తలు)జీరాడుసిగ్గులక్ =పొరలిపడునట్టిలజ్జలచే, ఈడిగిలంబడక్ = ముందునకుఁబోవక వెనుకకుఁ దగ్గుచుండఁగా, (నూత్నవధూవరు లనుట) ఎట్టకేలకున్ = అతిప్రయాసమున, త్రోవుత్రోపాడుచున్ =బలాత్కారముగాఁ ద్రోయుచు, తార్చి=చేరువం జేర్చి, కూర్చి=కలిపి, మరలుటయున్ ,= పోయినతరువాత, మరుండు = మన్మథుఁడు, ఒనర్పంగలకోల్తలకున్ =చేయంగలయుద్ధసన్నాహములకు, తివురు = త్వరపడునట్టి, తమకపుముంగలిపాఁజులు=తమకము కల ముందున్న సేనలు, నిగిడించు=ప్రసరింపఁజేయు, క్రొవ్వాఁడితూపుల రూపునన్ =అతినిశితబాణములవిధమున, ఒండొరువుల్ = అన్యోన్యము, మఱువెట్టి = మఱుఁగువెట్టి (కప్పి యనుట) చూచు, ఎలగోలుచూపుల్ = ముందునడచుదృష్టులచే, ఇతరేతర ధైర్యంబులు=ఒండొరులధైర్యములు, గంటివడక్ =గంటుపడఁగా, (నశింపఁగా

నుట)ఒంటిక్ =అసహాయముగా, బచ్చెనయోవరుల్ = రంగులలోపలిగదులందు, ససియించు = ఉండునట్టి, వధూవరులును = నూత్నదంపతులును; నూత్నవధువులు సిగ్గుచేఁబ్రియుల డగ్గఱిం గొంకి రాక యీడిగిలంబడుచుండఁ బ్రౌఢ లగుచెలికత్తెలు వారిసెట్లో యెట్టకేలకుఁ ద్రోయుచుఁ దీసికొనిపోయి ప్రియులతోడఁ గలిపి చని రనియుఁ, బిదప ననోన్యము పఱగించికొనువాఁడిచూపుల వారిధైర్యము తఱిఁగి చిత్రనర్ణచిత్రితములైన శయ్యాగృహములం జేరి రనియుఁ దాత్పర్యము. మరుండు తమపైకి దండెత్తివచ్చి సేనాసమూహముచేఁ బ్రయోగింపించుబాణములసమూహ మనునట్లవ్వధూవరుల దృష్టులు మించె నని గ్రహించునది. మన్మథబాణములవలె దృష్టుల వర్ణించుట ప్రసిద్ధము. పేరుకొను=ఘనీభవించిన, కోరికలు=వాంఛలు, తారుకొనఁ =కదియఁగా, డాయుసెడఁ =సమీపించుసమయమున, పొంగినయంగంబులఁ = ఉబ్బినయవయవములతో, పరస్పరబాహుపాశంబులఁ =ఒండొరుల త్రాళులంబోలుచేతులతో, బిగియారఁ =బిగువగునట్లు, కౌగిలించుకొని = ఆలింగనముచేసికొని, కరంగినడెందంబులఁ = ద్రవించినమనస్సులను, రెంటిఁ =రెండింటిని, ఒక్కటిగఁ =ఏకమగునట్లు, అత్తించుపోలికఁ =అంటించువిధమున, అత్తమిన్నిగ=అంటుకొని (ఒఱఁగి)పగలు=పగటిభాగమున, తమపాసినయెడలఁ =తా మెడఁబాయుసమయమున, పొడము=పుట్టిన, మనోజవికారంబులఁ =మదనవికారములను, అవిరళంబుగాఁ =సాంద్రముగా, చెప్పికొనుచుఁ, అల్పేతరానందంబునఁ = అధికసంతోషముతో, హంసతూలికాతల్పంబులఁ = హంసలమృదురోమములచే నిర్మితములైనశయ్యలందు, పొరలు=దొరలునట్టి, తరుణీతరుణులును=యువతీయువకులును; యువతీయువకుల కోరికలు మీఱఁ దమపగలింటివిరహమువిధమును బరస్పరము ముచ్చటించుకొనుచు మేనుమేనుం జేర్చుకొని యొక్కటై హంసతూలికామృదుతల్పముల నధికానందమున శయనించి రని తాత్పర్యము. తొలుతటి పొలయలుకయెడఁ =పూర్వపు ప్రణయకలహముయొక్క కాలమున, జనించిన=పుట్టిన, వియోగాగ్ని = విరహాగ్ని, నిండారుచేయొండవేడిమిఁ =పూర్ణమగువెన్నెలకాఁకచే, అగ్గలించినఁ = అధికముకాఁగ, తాలిమి=ధైర్యము లేక సహనము, తెమలఁ =పోఁగా, తమకతామ=స్వయముగా, తమకించి=త్వరపడి, కలసికొని=కూడి, నెచ్చెలులఁ =చెలికత్తెలును, బేలువెట్టి=వంచించి, తొట్టినవేడ్కలఁ =అతిశయించినయుత్సాహములతో, పొదరిండ్లకందువలఁ =లతాగృహరహస్యప్రదేశములందు, పొదలు=వర్తించు, రమణీరమణులును=కాంతాకాంతులును; తొల్లి సంభవించినప్రణయకలహమువలన వియోగాగ్ని రమణీమణులకుఁ గల్గె ననియుఁ, దాన వారు ప్రియులం డగ్గఱక యుండి రనియు, రేయెండతాఁకున నవ్వీరహాగ్ని యతిశయింప చెలికత్తెల వంచించి వారంతటవారే చని పొదరిండ్ల రమణులం గూడి సుఖించి రనియు భావము.

మబ్బుకొను=మదించిన, వయసుగుబ్బలన్=ప్రాయపుస్తనములందు, నిబ్బరంబుగన్=అధికముగా, నివుడు=సాగునట్టి, తివుటలన్=కోర్కులచే, పెచ్చుపెరుఁగు = మిక్కిలి యభివృద్ధినందిన, మచ్చరంబులన్ = మాత్సర్యములతో, ఒకరు+ఒకరిన్ = పరస్పరమును, మెచ్చక=మెచ్చికొనక, పచ్చవిలుతుఁడు=మన్మథుఁడు, తనకై దువులు ముప్పదిరెంటన్ = తనముప్పదిరెండాయుధములతో (మనసున కాయుధము లై జేయైనను వీరసామాన్యముగ పరశుపట్టిసభిండివాలాదులాయుధములు ముప్పదిరెండుండు ననుట ప్రసిద్ధ మగుటంజేసి యిట్లు చెప్పె ననియుఁ గాన నియ్యది వీరసామాన్యోక్తి యనియు గ్రహించునది. మఱియు నిది యనంగసంగర మగుట మదనుని వీరవరునిగఁ జెప్పుట యుచిత మె.) తోడు సూపెన్=తోడ్పడెను, అనన్=అనునట్లు, బహువిధకరణాసనభేదంబులన్=అనేకవిధములగు గాత్రాసనాదిభేదములను,(అనఁగా రతిబంధాదు లనుట) పెనంగుచున్=పెనఁగొనుచు, ప్రాయపుమదమున కామినీకాముకులు బహువిధబంధవిశేషములఁ గ్రీడించుచుండి రని భావము. మణిసౌధంబులన్=రత్ననంపు మేడలను, క్రీడించు, యువతీయువజనంబులును = తరుణీతరుణులును, క్రిక్కిఱిసినమక్కువలన్=సాంద్ర మగుననురాగములతో, ఇక్కువలన్=సంకేతస్థలములను, కమియన్=పొందఁగా, జొక్కులచెయ్వులన్=కష్టములగుచేష్టలచే, త్రొక్కుడువడి=నలఁగి, రతిశాస్త్రరహస్యతత్త్వానుభవంబునన్=కళాశాస్త్రరహస్యతత్త్వముయొక్క యనుభవముచే, వెలి=బాహ్యమును, మఱచి, వలరాచతపసులపోలికన్ మదనమానులవిధమున, (అనఁగా, మదనపరతంత్రులగు మానులవిధమున ననుట) తెలిరాకట్టుసెలవులన్=చంద్రకాంతశిలాప్రదేశములందు, పవ్వళించియున్న=శయనించియున్న, నాయికానాయకులును = దంపతులును; తాపసులు రతిశాస్త్రరహస్యతత్త్వానుభవమున బాహ్యమును మఱచినవిధమున, మదనతంత్రములచేఁ బ్రేమ పైకొనఁ గ్రీడించి నాయికానాయకులలసి సొలసి చంద్రకాంతశిలాస్థలుల శయనించి రని భావము. ఎడపడనివేడుకపనులన్=అంతరములేని వినోదకృత్యములచే, అలసి=శ్రమాసము నంది, జడియు=వడఁకునట్టి, అవయవంబులతోన్=అంగములతో, సొలయు=మూర్ఛనందు, నెమ్మనంబులతోన్=హృదయములతోడ, ఒయ్యనొయ్యనన్=మెల్లమెల్లఁగ, కదలు=తూఁగాడు. తూఁగుటయ్యెలలన్=డోలలయందు, కన్ను మొగిచి=కను మూసి, ఊన్న, విలాసినీవిలాసులును = సుందరీసుందరులును, కలిగి, అన్నగరంబు=అపట్టణము, శంబరాంతకుసామ్రాజ్యంబున్ = మన్మథసామ్రాజ్యమును, అనుకరించెన్ = పోలెను. (శంబరుఁడను నసురుఁ జంపుటకతన మన్మథున కీనామము కల్గెను.) అయ్యెడన్=ఆసమయమున, అయ్యదువల్లభుండు=ఆశ్రీకృష్ణుఁడు, సత్యయున్ = సత్యభామయును, తానున్, అనర్ఘ్యమణిదీపదీపితంబును = అమూల్యములగు మణులదీపములచేఁ బ్రకాశిత మగునదియును, విమల...

దానితంబును-విమల=స్వచ్ఛమైన, దుకూలవితాన = పట్టు మేలికట్టుల చే, సందానితంబును= కూర్పఁబడినదియును, ప్రాలంబ.....విలసితంబు-ప్రాలంబ = వ్రేలాడు, ముక్తాగుళుచ్ఛ= ముత్తియంపుకుచ్చులయొక్క, ఛవి=కాంతిచే, ఛాదిత=కప్పఁబడిన, వలభి = కొణిగల చే, విలసితంబును = ప్రకాశించునదియును, వివిధ...భాసురంబును - వివిధ = పలురకములగు, విచిత్ర=విచిత్రములైన, పట=చిత్రపటములతోడ, ఘటిత=కూర్పఁబడిన, స్ఫటిక=స్ఫటిక వికారములగు, భిత్తి=గోడలయొక్క, భాగ=ప్రదేశముల చే. భాసురంబును=ప్రకాశించు నదియును, మృదుల...చితంబును-మృదుల = మిక్కిలిమెత్తనైన, హంసతూలికా = హంసలయొఁకల చే, కల్పిత=నిర్మింపఁబడిన, తల్ప=పఱుపు చే, సంఛన్న = కప్పఁబడిన, (పఱుపఁబడిన) మణిమంచక = రత్నంపుమంచముతో, అంచితమును = కూడినదియు, ధవళ...భ్రాజితంబును-ధవళ = తెల్లనైన, ఫణిలతాదళ=నాగవల్లీదళములతోడను, తెల్లని తములపుటాకు లనుట. క్రముకఖండ=(పోఁక)వక్కలతోడను, మండిత = అలంకరింపఁ బడిన, మరకతమణిభాజన = మరకతమణినిర్మితపాత్రముల చే, విభ్రాజితంబును = ప్రకా శించునదియును, అనఁగాఁ బండుతములపుటాకులును బోఁకలును గలపల్లెరములు గల వనుట. మృగమద...పరికల్పితంబును-మృగమద=కస్తూరితో, మిళిత=కూడిన, ఘటీరపంక= చందనపంకము చే, అంకిత=కూడియున్న, ముక్తికశుక్తి = ముత్తెపుఁజిప్పల చే, పరికల్పితం బును=అలంకృతమైనదియు; కస్తూరితో చందనమును గలిపి యాచందనమును ముత్తెపుఁ జిప్పలలో నిడి యాశయ్యాగృహమున నిడి రని భావము. దరవికచ...కాంతంబును-దర= కొంచెము, వికచ=వికసించి, లతాంత=పుష్పముల చే నిర్మిత మైన, తాలవృంత=వీవనల చే కాంతంబును=సుందర మైనదియు, ఇంచుక విడినపూవుల చే నిర్మితము లగు వీవనలందుఁ గల వని భావము. కోమల...రమణీయంబును-కోమల = మృదువైన, బిసతంతుసంతాన= తామరతూండ్లదారములగుంపు చే, నిబద్ధ=కూర్పఁబడిన, కుసుమదామ = పూవులదండల చే, రమణీయంబును=సొగసైనదియు, మృదువైన తామరతూండ్లదారముల చేఁ బూలదండలం గూర్చి యందుంచి రని భావము. సురభి...ధూపితంబును-సురభి=పరిమళించునట్టి, కృష్ణా గరుధూప = కాలాగరుధూపము చే, ధూపితంబును = పరిమళింపఁజేయఁబడినదియు, పరి మళ...సమంచితంబును - పరిమళ = సుగంధముతో, మిళిత=కూడిన, శిశిరసలిల = చల్లని నీటితో, పూర్ణ=నిండిన, కనకగళంతికా=బంగారుజాడీలతో (పాత్రవిశేషములు)సమంచి తంబును=ఒప్పునదియు; పరిమళించు చల్లనినీట నింపి హేమపాత్రవిశేషముల నందిడి రని తాత్పర్యము. మంజు...ధ్వనితంబును-మంజు=సొగసుగా, గుంజత్=ధ్వని చేయు, పారావత, పతంగ=పావురములు మొదలగుపక్షులయొక్క, గళరవ=కంఠధ్వని చే, భరితంబును=నిండి నదియు; ఆశయ్యాగృహమునఁ బావురములు మొదలగుపక్షులకలరవము నిండియుండె

నని భావము. మాణిక్య...దర్శనీయంబును-మాణిక్య=రత్నవికారము లైన, సమున్నత=ఎత్తైన, ఆదర్శ=అద్దములచే, దర్శనీయంబును = చూడఁదగినదియు, మణివికారము లైన నిలువుటద్దము లందుఁ గల వని భావము. అగు=అగునట్టి, శయనాగారంబునన్ =పడకటింటి యందు, వినోదకేళిన్ = వినోదక్రీడను, తేలి = ఓలలాడి, నిద్రాముద్రితనేత్రుఁడై =నిద్రచే మూసికొనంబడిన నేత్రములు గలవాఁడై, శయనించెన్ =నిద్రించెను. అయ్యవసరంబునన్ =ఆసమయమున.

మ. నలినాప్తుండు మదీయబంధులను తా నక్షత్రసంఘంబులం
గలఁప న్వచ్చుచు నున్నవాఁ డనుచు ము న్గల్గంగ నాత్మీయశి
ష్యుల మందేహులఁ బోరొనర్పఁ జనుఁ డంచుం బంపి యేతెంచెనాఁ
బొడమె న్వేగురుఁజుక్క కాలఫణభృద్భోగోల్లసద్రత్న మై. 54

టీ. నలినాప్తుఁడు=సూర్యుఁడు, తాను, కర్త. మదీయబంధులను=నాచుట్టాలను; అనఁగాఁ దనసంతతివా రనుట. నక్షత్రసంఘంబులన్ =చుక్కలగుమిని, కలఁపన్ =క్షోభ పెట్టుటకు, వచ్చుచున్నవాఁడు = ఏతెంచుచున్నవాఁడు, అనుచున్, ము న్గల్గంగన్ = ముందుగా, ఆత్మీయశిష్యులన్ =తనశిష్యులను, మందేహులన్ = మందేహు లను రాక్షసులను, పోరు=యుద్ధము, ఒనర్పన్ =చేయుటకై, చనుఁడు=పోవుఁడు, అంచున్, పంపి = పంపించి, ఏతెంచెన్ నాన్ =వచ్చెనో యనునట్లు, వేగురుఁజుక్క=వేకువజాముననుదయించుచుక్క (శుక్రగ్రహము), కాలఫణభృత్...రత్నమై-కాల = కాల మను, ఫణభృత్ = సర్పముయొక్క, భోగ = పడగయందలి, ఉల్లసత్=ప్రకాశించు, రత్న మై = మాణిక్య మై, పొలిచెన్ = ఒప్పెను.

భా. సూర్యునిరాకను నక్షత్రములు శోభావిహీనము లగుట సహజము. సాధారణముగ వేకువం దూర్పుగ బొడముచుక్క శుక్రగ్రహ మై యుండును. ప్రకృతము నక్షత్రరూపుఁడగు శుక్రుఁడు తనసంతతివగు నక్షత్రముల రవి గలంపవచ్చుచుంట నెఱింగి మున్నుందు తనశిష్యుల మందేహుల నాక్రమితోఁ బోరొనర్ప నంపి పిదప తా నేతెంచె నేమో యన్నట్లును, కాలసర్పశిరస్థితమాణిక్య మో యన్నట్లును వేగుఁజుక్క యుదయించె ననిభావము. కాలగతి నవసరించి గ్రహతారకలగతియుఁ గల్గుచుండుటఁ జేసి, కాలముసర్పముగాను వేగుఁజుక్కను దచ్ఛిరోమాణిక్యముగాను గవి తలంచెను. మఱియు మందేహులరాక్షసులు సూర్యునిపైఁ బడుదు రనియు, వారలబారిని ద్విజదత్తార్ఘ్యముల రనివారించుకొను ననియు శ్రుతులు నుడువును. కావున నిచ్చోట మున్నుందు మందేహుల నంపి పిదప తా నేతెంచె వేగుఁజుక్కనుట యొంతయు హృద్య మగు. అలం. ఊహ్యోక్తి.

## శ్రీకృష్ణుని మేల్కొలుపుట

క. వై తాళికు లప్పుడు మృదు
గీతామృతవచనరచన గీలుకొన యశో
దాతనయు మేల్కొలుపఁ బ్రా
భాతికరమణీయరాగఫణితులు *సెలఁగెన్. 55

టీ. అప్పుడు = ఆసమయమున, వై తాళికులు = వందిమాగధులు; ప్రభాతమునఁ బ్రభువుల మేలుకొలుపుస్తుతిపాఠకులు. గీతామృతవచనరచన - గీత = గానరూపము లగు, అమృత = అమృతమయము లైన, వచనరచనలు = పలుకులరచనలు, కీలుకొనఁ =ఒప్పునట్లుగా, యశోదాతనయుఁ =శ్రీకృష్ణుని, మేల్కొలుపఁ = ప్రబోధింపఁగా, ప్రాభాతిక...ఫణితులు-ప్రాభాతిక = ఉదయకాలమున నగు, రమణీయ = సొగసైన, రాగ = భూపాలాదిరాగయుతము లగు, ఫణితులు=మాటలు, చెలఁగెఁ = ఒప్పెను.

విశే. భూపాలరాగాదులు ప్రాభాతికము లని సంగీతశాస్త్రవేత్త లందురు.

మ. జయ గోవింద! ముకుంద! చక్రధర! కంసద్వేషి! సాత్రాజితీ
ప్రియ! నారాయణ! కౌస్తుభాభరణ! కుంభిత్రాణపారీణ! కా
ళియదర్పఘ్న ! పతంగవాహా! వనమాలీ! కృష్ణ! వైకుంఠ! శౌ
రి! యశోదాత్మజ! భక్తవత్సల! మురారీ! గోపికావల్లభా! 56

టీ. జయ=సర్వోత్కర్షను మీఱియుండుము. గోవింద, ముకుంద, ఇవిమున్నగు నవి శ్రీకృష్ణునకు సంబుద్ధులు, చక్రధర = చక్రము దాల్చువాఁడ, కంసద్వేషి=కంస హంత, సాత్రాజితీప్రియ = సత్యభామాప్రియుఁడ, ప్రకృతము సత్యాప్రియుండై పరలుటంజేసి యిట్లనుట హృద్యము. నారాయణ = ఉదకమునకుఁ దావైనవాఁడా, గంగ విష్ణుపాదోద్భవ యగుటంజేసియు, శ్రీకృష్ణవిష్ణువు లభిన్న లగుటంజేసియు,నిట్లనుటపొసఁగెను. కౌస్తుభాభరణ = కౌస్తుభ మలంకారముగాఁ గలవాఁడ, కుంభిత్రాణపారీణ=ఏనుఁగును, అనఁగా గజేంద్రుని రక్షించుటయందు సమర్థుఁడా, గజేంద్రుఁడు మొసలిబారిం బడి మొరవెట్ట విష్ణు వాతని రక్షించెం గాన నిట్లు నుతించుట పొసఁగెను. కాళియదర్పఘ్న =కాళియనిగర్వమును బోఁగొట్టినవాఁడా, పతంగవాహ = గరుడవాహన, వనమాలీ = వనమాలగలవాఁడ, కృష్ణ, వైకుంఠ, శౌరి, యశోదాత్మజ = యశోదాతనయ, భక్తవత్సల=భక్తులయందు వాత్సల్యముగలవాఁడ, మురారీ = మురద్వేషి, గోపికావల్లభా = గోపికాప్రియ!

---

* వొలిచెఁ.

విశే. జయపదం బనుకరణరహితముగను బ్రయోగింప నగును.

మ. శరధిక్రోడవివేశ! శార్ఙ్గధర! శిష్టధ్యేయ! శీతాంశుభా
స్కరనేత్రద్వయ! శుభ్రపంకరుహభాస్వన్నాభ! శూరాన్వయా
భరణా! శేషశయాన! శైలధర! శోభారమ్యసర్వాంగ! శౌ
ర్యరసోదంచిత! శంఖచక్రధర! శర్వాణీసహాయప్రియా! 57

టీ. శరధిక్రోడనివేశ - శరధి = సముద్రముయొక్క, క్రోడ = నడుమభాగము, వివేశ = ఆవాసముగాఁగలవాఁడ, శార్ఙ్గధర=శార్ఙ్గమనుచాపవిశేషమును దాల్చినవాఁడ, శిష్టధ్యేయ = సజ్జనులచే ధ్యానింపఁబడువాఁడ, శీతాంశు...ద్వయ=చంద్రసూర్యులు నేత్రములుగాఁగలవాఁడ, శుభ్ర...నాభ = స్వచ్ఛమైనపద్మమ్మిచేఁ బ్రకాశించుబొడ్డుగలవాఁడ, శూరా...భరణా=శూరకులమున కలంకారమైనవాఁడా, శేషశయాన=శేషునిపైఁ బవ్వళించువాఁడ, శైలధర=గోవర్ధనోద్ధార, శోభారమ్యసర్వాంగ=కాంతిచే మనోహరమగు సర్వావయవములుగలవాఁడ, శౌర్యరసోదంచిత=శూరత్వముచే నొప్పువాఁడ, శంఖచక్రధర=శంఖచక్రములను ధరించువాఁడ, శర్వాణీసహాయప్రియా = ఈశ్వరునకుఁ బ్రియమైనవాఁడ!

విశే. ఇందు గుణిపక్రమము ననుసరించి ప్రతిసంబుద్ధ్యాదిమపర్ణములు నెలకొల్పఁబడినవి.

క. మేల్కానుము దేవ! యివె రా
చిల్కలు కనుమొగిచి యున్న చెలువలఁ దమకుం
బల్కులు నేర్పఁగ ముద్దులు
గుల్కెడుపల్కులను మేలికొలిపెడుఁ గృష్ణా! 58

టీ. దేవ=ప్రభూ, మేల్కానుము=ప్రబుద్ధుఁడవుకమ్ము. ఇవె, రాచిల్కలు=మగచిలుకమిన్నలు, కనుమొగిచి=కనుమూసి, ఉన్న, చెలువలక్ = స్త్రీలను, తమకుక్, పల్కులు=మాటలు, నేర్పఁగక్ = నేర్పుటకై, ముద్దులు, గుల్కెడు, పలుకులను = మాటలతో, కృష్ణా! మేలుకొలిపెడుక్ = మేలుకొలుపుచున్నవి.

విశే. తెల్లవారుసమయమునఁ జిలుకలు మున్నగుపక్షులు కలకలరవము గావించుట సహజమాట నిట్లు చెప్పెను.

సీ. చరమాద్రిదావాగ్ని సంపుష్టసురసార
భేయీకరీశైకపిండ మనఁగ

బహూచకోరకదంశపరిపీతచంద్రికా
ఔ్రద్ర నీరసమధుచ్ఛత్ర మనంగ
ప్రత్యఙ్ముఖోచ్చలద్రాత్రి వర్షీయసీ
పలితపాండురకేశబంధ మనంగ
గగనసౌధాలేపకరకాలశిల్పిని
ర్యుక్తసుధావస్త్రముష్టి యనంగ
తే. సుమహితజ్యోత్స్నికాలతాసుమగుచ్ఛ
మనంగ నతిధూసరచ్ఛాయ నబ్జవైరి
చెలువు వోనాడి బింబావశిష్టుం డగుచు
నల్లనల్లన ప్రాలెడు నంబుజాక్ష ! 51

టీ. అబ్జవైరి=చంద్రుడు, చరమాద్రి...పిండము-చరమాద్రి = పడమటికొండ యంతైన, దావాగ్ని=దవాగ్ని (కార్చిచ్చు) చేత, సంష్లుష్ట=బాగుగాదగులంబెట్టబడిన, సురసారభేయీ = కామధేనువుయొక్క, కరీషైకపిండము=పేడముద్ద, అనంగక=అనునట్లుగను, బహు...ఛత్రమున్-బహు=అనేకములైన, చకోరక = చకోరపక్షులనెడు, దంశ=తేనెటీగలచే, పరిపీత=త్రాగబడిన, చంద్రికా=వెన్నెల యనెడు, ఔ్రద్ర=తేనెగల దగుటంజేసి, నీరస=నిస్సారమైన, మధుచ్ఛత్రము=తేనెపట్టు, అనంగక, ప్రత్యఙ్ముఖ... బంధము-ప్రత్యఙ్ముఖ = పశ్చిమదిశనుగూర్చి, ఉచ్చలత్=చనుచున్న, రాత్రి = రేయి యను, వర్షీయసి=వృద్ధాంగనయొక్క, పలిత = నెరసిన, పాండుర=తెల్లనైన, కేశ బంధము=శిరోజములముడి, అనంగక, గగన...ముష్టి-గగన=అంతరిక్ష మనెడు, సౌధ= మేడకు, ఆలేపకర = పూతబూయువాడగు, కాల=కాల మను, శిల్పి=శిల్పకారునిచే, నిర్యుక్త=విడువబడిన, సుధావస్త్రముష్టి = సున్నపుగుడ్డముద్ద, అనక, సుమహిత...గుచ్ఛము-సుమహిత=శ్రేష్ఠమైన, జ్యోత్స్నికా = వెన్నెల యనెడు, లతా=తీగయొక్క, సుమగుచ్ఛమును = పుష్పగుచ్ఛము, అనంగక, అతిధూసరచ్ఛాయన్=మిగుల బూడిద రంగైనకాంతితో, చెలువున్=చక్కందనముమ పోనాడి = పోగొట్టుకొని, బింబావశిష్టుడు = బింబమే మిగులుగాంగలవాడు, అగుచున్, అంబుజాక్ష = శ్రీకృష్ణ! అల్ల నల్లనన్=మెల్ల మెల్లగ, ప్రాలెడున్=అస్తమించెడును.

భా. ఇం దిందునియస్తమయసమయము వర్ణింపబడినది, అస్తాద్రియందలి కార్చిచ్చుచే దగ్ధమై మించు వేల్పుటాపు పేడముద్దవడుచునను, జకోరము లనుతేనెటీగలు వెన్నెల యనుతేనెం ద్రావి నిస్సారముగ నొనర్చిన తేనెపట్టుచందమునను, బశ్చిమదిక్కు

నకుఁ బ్రయాణమొసర్చురాత్రి యనువృద్ధాంగన చైన పలితకేశబంధముపోల్కిని, జద
లనుసౌధమునకుఁ గాల మనుశిల్పి సున్నపునీటఁ బూఁతపూసి పిండి పాఱులై చిన గుడ్డముద్ద
వలెను, వెన్నెల యనులత చైన సుమగుచ్ఛమువిధమునను జంద్రుఁడు చెలువేది బూడిద
రంగుఁ గల్గి బింబావశిష్టుఁ డయ్యె నని భావము.

విశే. కాలినపేడముద్ద ధూసరవర్ణమై యొప్పుటయుఁ దేనెలేనితేనెపెర వెల
వెలఁబోఁయుటయు, వృద్ధాంగనాకేశబంధము నెరయుటకతన బూడిదరంగును దాల్చు
టయు, సున్ననున ముంచి పిండి పాఱువైచినగుడ్డ వెలవెలంబోఁటి ముద్దగా నేర్పడు
టయు, సుమగుచ్ఛమచ్ఛమై యొప్పుటయు, సైజము లగుటంజేసి, కవి వానిని జెలువేది
ధూసరచ్ఛాయం బొలుచు చంద్రునకు సాటిచేయుట యొంతయుఁ బగి యున్నది.
మఱియుఁ గార్చిచ్చు కొండలఁ దుండుటయుఁ, జకోరములు వెన్నెలఁ ద్రావుటయుఁ,
దూర్పున నెలుంగులు తోఁపఁ జీఁకటులు పశ్చిమదిశ కరుగుటయుఁ, బ్రభాతమునఁ
జదలు ధవళకాంతిని దేదీప్యమాన మగుటయు, వెన్నెల తీవవలె సోఁగఁగ నుండుటయు
సహజము లగుట, నిందలి రూపకములు హృద్యములై వెలయుచున్నవి. అలఁ. రూపకో
ల్ప్రేక్షలు.

చ. జలరుహామిత్రుఁ డాత్మరుచిసంపదఁ జీఁకటిబంధకానికిం
గలఁగుచు వీనిలోన నిడి కైకొన నమ్మికకాఁపు లంచుఁ జు
క్కలవోర యెండఁదాడి విని గ్రక్కునఁ దానును గాంతి వీనిలో
పల నెలకొల్పె నాఁ బలుకఁబోఁటె నిశాంతనిశాంతదీపముల్. 60

టీ. జలరుహామిత్రుఁడు=సూర్యుఁడు, ఆత్మరుచిసంపదన్=తనకాంతి యనుధన
మును, చీఁకటిబంధకానికిన్ = అంధకార మనుదొంగకు, కలఁగుచున్ = భయపడుచు,
వీనిలోనన్ = ఈనిశాంతదీపములందు, ఇడి=ఉంచి, కైకొనన్ =స్వీకరింపఁగా, చుక్క
లవోర=చంద్రుఁడు, ఎండఁదాడిన్ = ఎండ దండెత్తుటను, విని, నమ్మికకాఁపులు = నమ్మక
మైనరక్షకులు, అంచున్, గ్రక్కునన్ =శీఘ్రముగా, తానును, కాంతిన్ =తనకాంతిని,
వీనిలోపలన్ =ఈనిశాంతదీపములలో, నెలకొల్పెన్ =నిల్పెను, నాన్ =అనునట్లు, నిశాంత
నిశాంతదీపముల్ = వేఁకువజామునంచైన గృహదీపములు, పలుకఁబోఁటెన్ = వెల్ల
నయ్యెను.

భా. సూర్యుఁడు తానస్తమించునపుడు తనతేజము నగ్నియం దుంచి యరుగునని
శ్రుతులు పలుకును. మఱియు వేకువను దీపములు చెలువేది వెలవెలఁబోఁయుట సైజము.
ఈవిషయములనే కవి యీగతిం జమత్కరించి వర్ణించుచున్నాఁడు సూర్యుఁడు చీఁకటి
యనుతస్కరునకు భయపడి తనతేజస్సంపదను గృహదీపములకడఁ దాఁచుకొని మఱిలఁ
బ్రభాతమునఁ దీసికొనఁగాఁ, జంద్రుఁడును నెండదాడి కడలి, విశ్వసింపఁదగిన రక్షకు

లగుటను సూర్యసంపదం దిరుగ వానికిఁ జెక్కుచెదరకుండున ట్లర్పించుటంబట్టి గ్రహించి తానును దనతేజస్సంపద నవ్వానిలోపలనె దాఁచుకొనెనో యనునట్లు వేగుఁబోక గృహదీపములు వెలవెలంబాఱె నని భావము. అలం. ఉత్ప్రేక్ష, కావ్యలింగము.

మ. దరమీలన్నయనంబు లై గృహబహిర్ద్వారంబుల న్యామకుం
జరము ల్గండమదభ్రమద్భ్రమరికాఝుంకారసంగీతవి
స్ఫురణ ల్మానపుచుఁ గర్ణతాళనినదంబు ల్మించ నీమాగధో
త్కరమున్ బోలుచుఁ జూడ నొప్పె నివె హస్తన్యాసముల్మీఱఁగన్.

టీ. దరమీలన్నయనంబులై = ఇంచుకమూసినకన్నులు గలవై, గృహబహిర్ద్వారంబుల్ = ఇంటివెలుపటివాకిళులందు, యామకుంజరముల్ = జాములందుఁ గాపుండు నేఁగులు, గండ...స్ఫురణల్ - గండ = చెక్కిళులందలి, మద=మదమునకై భ్రమత్ =తిరుగునట్టి, భ్రమరికా = ఆఁడుతుమ్మెదలయొక్క, ఝుంకార = ఝుంకార మనెడు, సంగీత=గానములయొక్క, విస్ఫురణల్ = ప్రకాశములను, చూపుచున్ = అగపఱచుచు, కర్ణతాళనినదంబుల్ =చెవు లనెడు తాళములశబ్దములు, మించన్ = అతిశయింపఁగా, హస్తన్యాసముల్ = తుండములచాలనములు, మీఱఁగన్ =మించఁగా, ఈమాగధోత్కరమున్ = ఈస్తుతిపాఠకసమూహమును, పోలుచున్ = అనుకరించుచు, చూడన్ =చూచుటకు, ఒప్పెన్ =అందమయ్యెను.

భా. వేగుఁబోకను స్తుతిపాఠకులు గీతములను బాడుచుఁ దాళధ్వనులు చెలఁగఁ జేతులన్యాసములు మించ మించుగతిని బ్రతియామమునను నింటివెలుపలఁ గాపుండు గజములు తమగండములందలి మదము నాస్వాదింప మూఁగిన భ్రమరులఝుంకార మను గానములు చెలఁగఁ, జెవులు కదల్చినపుడు కల్గినచప్పుడులను తాళధ్వనులు మించఁ, తుండములచాలనము లను హస్తన్యాసము లతిశయింప నొప్పుచు, స్తుతిపాఠకులనే బోలి యమరె నని భావము. అలం. రూపకము, ఉత్ప్రేక్ష.

మ. సమయాభీరకుమారుఁ డేపునఁ దమిస్రారూపనక్తంచరిం
గమఁగారి స్తనమండలాంకమిషసంక్రాంతప్రభాదుగ్ధపూ
రముతో రూపఱఁజేయ శోషిలుచుఁ దారల్మోల నిట్టూర్పు సాం
ద్రముగా నూర్చె సనంగఁ బెల్లెసఁగెఁ బ్రాతఃకాలవాతూలముల్. 63

టీ. సమయాభీరకుమారుఁడు=కాల మనుగొల్లపిల్లవాఁడు (శ్రీకృష్ణుఁడనిభావము) ఏపునన్ = విజృంభణముతో, తమిస్రారూపనక్తంచరిన్ = చీఁకటిరూపమైనరాక్షస

స్త్రీని, (పూతన నని భావము), కమలారి...పూరముతోక్ -కమలారి=చంద్రుఁడనెడు, స్తనమండల=కుచమండలమందైన, అంక=కళంక మనెడు, విష=గరళముతో, సంక్రాంత=మిళితమైన, ప్రభా = కాంతి యను, దుగ్ధపూరముతోక్ = క్షీరప్రవాహముతో, రూపఱిక్ = నశించినట్లు, చేయక్ = చేయఁగా, మోషిలుచుక్ = మూర్ఛనందుచు, తారల్ =కనుగ్రుడ్డులు; నక్షత్రములు, సోలక్ =వివశమైవ్రాలఁగా, సాంద్రముగాక్ = దట్టముగా,డొరిచ్చెక్ =నిట్టూర్పు విడిచెను, అనంగక్ =అనునట్లు, ప్రాతఃకాలవాతూలముల్ = ప్రభాతవాతములు, పెల్లు=విస్తారముగా, ఎసఁగెక్ =ఒప్పెను.

భా. గరళాంకిత మగుస్తనముపోల్కి కళంకసహిత మగుచంద్రుఁడుంట చీఁకటి పూతనభాతి నొప్పె ననియు, విషమిశ్రదుగ్ధపూరము చందమునఁ గళంకయుతచంద్ర కాంతిపూరము పొల్చుట పూతనాస్తనమునుండి వెలువడుపాలవెల్లువవలె నమరె ననియుఁ, గాలవశమునఁ జీఁకటులు తారకలును దొలఁగుట కృష్ణుఁడాపూతనావిషమిశ్రదుగ్ధ ప్రవాహముం బీల్చి యారాక్షసీప్రాణములఁ గ్రోలి మూర్ఛనందింప నామె వివశయై కనుగ్రుడ్డుల వ్రాల్చుటవలెఁ బొల్చె ననియుఁ, బ్రభాతవాతముల పెల్లైసంగుట మరణ కాలమున విడిచిన పూతనాప్రాణవాయువులవలె మించె ననియు భావము.

విశే. తారలను తారలని శ్లిష్టరూపకము చేయవలెను. అలం. రూపకోత్ప్రేక్షలు.

క. మంచునఁ దోఁగినపల్లవ, సంచయము భవద్వియోగసంతాపరుద
చ్చంచలనయనాబాష్పక, ణాంచితబింబోష్ఠలీల నలరె ను పేంద్రా! 63

టీ. ఉపేంద్రా = (ఇంద్రునితమ్ముఁడ పగు) కృష్ణా, మంచునక్ = హిమమున, తోఁగిన=ముసింగిన, పల్లవసంచయము = చిగురులమొత్తము, భవత్ ...లీలక్ -భవత్ = నీసంబంధమైన, వియోగ=విరహముచేసైన, సంతాప=దుఃఖముచే, రుదత్ =ఏడ్చుచున్న, చంచలనయనా = స్త్రీలయొక్క, బాష్పకణ = కన్నీటిచుక్కలతో, అంచిత=కూడు కొనిన, బింబోష్ఠ=దొండపండువంటి వాతెరలయొక్క, లీలక్ =విలాసముతో, అలరెక్ = మించెను.

విశే. యువతులవాతెరలను చిగురులతోఁబోల్చుట సహజము. హిమకణాంకమైన చివురులను బాష్పకణాంచిత మైన యువతులవాతెరలుగా నెంచు టెంతయుఁ దగి యున్నది. మఱియు నేఁడు కృష్ణుఁడు సత్యాగృహమునకే నిశ్చయించుటఁ బెఱవనితలకు విరహదుఃఖము సంభవించుటయు, దానఁ గన్నీ రొలికిఁ బెదవులపైఁ బడి మంచునీటఁ దోఁగాడు చివురుల ననుకరించుటయు, సంభవించె నని గ్రహించునది. అలం.నిదర్శనము.

తే. కస్తూరిగుళికలు తమ్మిలేమ
నిదురమంపునఁ బుక్కిట నించి మేలు
కాంచి వేకువ నుమిసె నాఁ గమలముకుళ
కోటరంబుల నెలదేఁటికొదమ లెగసె. 61

టీ. తమ్మిలేమ=పద్మ మనువనిత, కస్తూరిగుళికను=పరిమళించుకస్తూరిగుటికలను, నిదురమంపునక = నిద్రయొక్కపైకము చే, పుక్కిటక =పుక్కిలియందు, నించి=ఇడికొని, మేలుకాంచి=లేచి, వేకువక = వేగుఁబోకను, ఉమిసెక =ఉమ్మివైచెక, నాక = అనఁగ, కమలముకుళకోటరంబులక = తామరలమొగ్గలనడుమకుండి, ఎలదేఁటికొదమలు= లేఁబ్రాయంపుమగతుమ్మెదలు, ఎగసెక = వెలువడియెను.

భా. తామరమొగ్గలనడుమ నెసఁగు లేఁబ్రాయంపుమగతుమ్మెదలు పద్మ మను యువతి రేయి దాను బుగ్గనిడికొనినట్టియు, నిద్దురపైకమున నమలుటను మఱచుటఁజేసి యెప్పటియాకృతితోడనే యొప్పునట్టియు, వేగుఁబోక లేచి యుమ్మివైచినట్టియు, కస్తూరిగుళిక లేమొ యన్న ట్లొప్పెనని భావము. ఆపుడపుడే పద్మములు వికసించుచుండుటం జేసి యందు రాత్రి తగులొక్కినియున్న తుమ్మెదలు వెడలి పైకివచ్చుచుండె నని తాత్పర్యము. అలం. రూపకము. ఉత్ప్రేక్ష.

మ. వినయయ్యం గృకవాకుకూజితము లుద్యోలంబు లై సూరసూ
తనవోద్యత్కరకుంచికావిఘటిత*ధ్వాంతారకక్రియా
స్వనము లై కైరవిణీప్రసూనపృథుకస్వాపక్రియాలోలిక
ద్దినకృన్మార్గనివారణత్వరితమం దేహోగ్రసింహధ్వనుల్. 65

టీ. సూర...స్వనములు-సూరసూత = సూర్యునిసారథి యగు ననూరునియొక్క, నవ=క్రొత్తగా, ఉద్యత్ =ఎగయుచున్న, కర=కిరణములను, కుంచికా=తాళపుఁజెవిచేత, విఘటిత= తెఱవఁబడిన (నశింపఁజేయఁబడిన), ధ్వాంత=చీఁకటి యనెడు, అరర = తలుపు గడియసంబంధమైన, క్రక్రియాస్వనముల్ =కఱకఱవ్యాపారము గలచప్పుడు లై నట్టియు, కైరవిణీ...లోలికల్ -కైరవిణీ=కలువతీఁగలయొక్క, ప్రసూన=పూవనెడు, పృథుక= శిశువుయొక్క, స్వాపక్రియా = నిద్రపుచ్చుటయందలి, లోలికల్ = నాలికను బెదపులమూలలకుఁ దాఁకించిచేయు 'లుచ్, లుచ్' అనుధ్వనులై నట్టియు, దినకృత్ ... ధ్వనుల్ -దినకృత్ =సూర్యునియొక్క, మార్గ=త్రోవను, నివారణ = అడ్డగించుటయందు, త్వరిత=వేగముగల, మందేహ=మందేహు లను పేరు గలరాక్షసు లనెడు, ఉగ్రసింహ =

* ధ్వాంతారకక్రియా.

భయంకరసింహములయొక్క, ధ్వనుల్ =గర్జలై నట్టియు, కృకవాకుకూజితములు=కోడి కూఁతలు, ఉద్వేలంబు లై = అధికములై, వినవయ్యెన్ =వినఁబడెను.

భా. వేగుఁబోక నైన కోడికూఁత లనూరుఁడు తనకిరణరూప మగుహస్తములంటిన తాళపుఁజెవిచేఁ జీఁకటి యను పేటికం దెఱవ నపుడు జనించిన యాపెట్టెతలుపు సంబంధ మగుక ఱక ఱశబ్దమో యనునట్లును, గలువనిసువుల నిద్రబుచ్చఁ గైరవిణు లొనర్చు దవుడచప్పుడులో యనునట్లును, సూర్యునిమార్గ మడ్డగింప నేతెంచిన మండేహులను రాక్షససింహములగర్జలో యనునట్లును ఉండె నని భావము.

విశే. ప్రభాతమునఁ జీఁకటులు విఱిగిపాఱుటయుఁ, గలువలు ముకుళించుటయు, మండేహులను రాక్షసులు సూర్య నడ్డగించి బాధించుటయు సంభవించును. వానినే కవి పైరీతిని జమత్కరించి వర్ణించెను. మండేహులను రాక్షసులు సూర్య నడ్డగింతు రనియు, ద్విజదత్తార్ఘ్యముల సూర్యుఁడు వారిని జయించు ననియు శ్రుతులు నుడువును. చూ. 2 ఆ. 54 ప.

తే. రాజు వీడెత్తి చనినఁ వారకభటాలి
యంబరాభోగనిజ*శిబిరాంగణమునఁ
గాలుకొల్పినపావకజ్వాల లనఁగఁ
బ్రాచి గనుపట్టె నవసాంధ్యరాగరుచులు. 66

టీ. రాజు=చంద్రుఁడు (రాజు) వీడెత్తి=శిబిరమెత్తికొని, చనినన్ =పోఁగా, తారకభటాలి = నక్షత్రము లను భటులమొత్తము, అంబర...అంగణమునన్ -అంబర= ఆకాశముయొక్క, ఆభోగ = విస్తృతి యనెడు, నిజశిబిర = తమవిడిదలప్రదేశముల యొక్క, అంగణమునన్ = తావునందు, కాలుకొల్పిన = ప్రజ్వలింపఁజేసిన, పావక జ్వాలలు=అగ్నిమంటలు, అనఁగన్ = అనురీతిని. ప్రాచిన్ =తూర్పున, నవసాంధ్యరాగ రుచులు = క్రొత్తలగుసంధ్యాలపు టెఱ్ఱనికాంతులు, కనుపట్టెన్ = చూపట్టెను.

భా. తమరాజు శిబిర మెత్తికొనిపోఁగాఁ దారకభటాలి తమవిడిదలప్రదేశముల రగులొక్కల్పినయగ్నిమంటలో యనునట్లు ప్రాభాతికసంధ్యారాగములు చెలఁగె నని భావము. చంద్రుఁ డస్తంగతుఁడుగా నక్షత్రములును మాయ మగుటయుఁ, ప్రభాత కాలారుణకాంతు లెసంగుటయు నైజములు. వానినే కవి యీరీతిని జమత్కరించి వర్ణించెను. అలం. ఉత్ప్రేక్ష.

---

* శిబిరాంచలమునఁ.

తే. కమలినీజృంభికలకు దిక్కాంత లెల్ల
హ స్తతాళంబు లొనరించి రనఁగఁ జెలఁగె
లలిత కాసారకూలకులాయచలిత
శకునపక్షిజపటపటస్వనము లధిప. 67

టీ. కమలినీజృంభికలకున్ = పద్మినీసంబంధమైన యావులింతలకు, దిక్కాంత లెల్లన్ = దిశాంగనలెల్లను, హ స్తతాళంబులు = కరతాళములు (చిటికెలు), ఒనరించిరి = చేసిరి, అనఁగన్ = అనునట్లు, లలిత...స్వనములు-లలిత=సొగసైన, కాసార = సరస్సుల యొక్క, కూల=ఒడ్డులందైన, కులాయ=గూఁడులందు, చలిత=సంచరించునట్టి, శకున = పక్షులయొక్క, పక్షిజ = ఱెక్కలనుండి పుట్టిన, పటపటస్వనములు = పటపటధ్వనులు, చెలఁగెన్ = ఒప్పెను.

భా. ప్రభాతమునఁ గమలినులు వికసింపఁదొరఁకొనుటయుఁ, బక్షులు ఱెక్కలు దులుపుకొనుచు లేచుటయు సైజములు. వానినే యీ క్రిందిరీతిని గవి చమత్కరించెను.

ఆవులింత కల్గునపుడు చిటికెలువేయుట యాచారము. ప్రకృతము కమలిని యావులించుడు దిశాంగనలు చిటికెలువేయుగతిని దీర్ఘ శకుంతపక్షిధ్వనులు చెలఁగె నని భావము. ఆలం. ఉత్ప్రేక్ష.

సీ. యామినీసమయంబు నాశాతటప్రదే
శంబుఁ బ్రసన్నభావంబు నొందెఁ
బ్రియచుంబితాంగనాబింబాధరంబులు
నుడురాజు నపరాగయుక్తిఁ దోఁచె
నఖిలవస్తువులుఁ బ్రాగచలకూటవిటంక
తలములు నతిరోహితంబు లయ్యె
నుత్తుంగపురగోపురోపరిస్థలులు సా
రసములు నాత్తసౌరభము లయ్యెఁ

తే. దరుణగోతర్ణకంబులు సురపథాంత
రంబులును విచ్యుతప్రగ్రహంబు లయ్యె
నియమపరతంత్రభూదేవచయముఁ గౌశి
కప్రజంబు సమాధియోగమునఁ బరఁగె. 68

టీ. యామినీసమయంబున్ = నిశాసమయమును, ఆశాతటప్రదేశంబున్ = దిగంతప్రదేశములును, ప్రసన్నభావంబున్ -ప్ర+సన్న=అత్యంతము క్షీణ మైన, భావ

మును=ధర్మమును, అనఁగా నత్యంతక్షీణభావము నని రాత్రిపర మగు నర్థము. ప్రసన్న భావంబున్ =సైర్మల్యమును, అనఁగాఁ బ్రకాశము నని దిక్తటప్రదేశపర మైన యర్థము. ప్రియచుంబితాంగనాబింబాధరఁములున్ = ప్రియులచే ముద్దుపెట్టుకొనఁబడిన యువతుల దొండపండువఁటివా తెఱలును, ఉడురాజును = చంద్రుఁడును, అపరాగయుక్తిన్ - అపరాగ = పోయినరక్తిమయొక్కకూడికతో అని యధరపరము. అపరాగ = పశ్చిమాద్రియొక్క, యుక్తిన్ =కలయికతో, (అపర+అగ) అని చంద్రపరము. అఖిలవస్తువులున్ = సమస్తపదార్థములును, ప్రాగచలకూటవిటంకతలములు=పూర్వాద్రిశిఖరాగ్ర ప్రదేశములును, అతిరోహితంబులు - అ+తిరోహితంబులు = మఱుఁగుపడినవిగానివై, అయ్యెన్ అని వస్తుపరము. అతి+రోహితంబులు=మిగుల నెఱ్ఱనైనవి, అయ్యెన్ అని యద్రిశిఖరాగ్రపరము. ఉత్తుంగపురగోపురోపరిస్థలులున్ = ఎత్తైన పట్టణప్రాకారము యొక్క పైభాగములును, సారసములున్ = పద్మములును, ఆకృతసౌరభములు = ఆకృత+సౌర+భములు, ఆకృత=పొందఁబడిన, సౌర=సూర్యసంబంధమైన, భములు = కాంతిగలవి, అని పురగోపురోపరిస్థలపరము. ఆకృత=పొందఁబడిన, సౌరభములు = పరిమళముగలవి అని పద్మపరము. తరళగోతర్ణకంబులున్ = చపలములగునాలదూడలును, సురపథాంతరంబులను=ఆకాశమధ్యములును, విచ్యుతప్రగ్రహంబులు-విచ్యుత=వదలుపఁబడిన, ప్రగ్రహంబులు=మెడకట్టుపలుపులుగలవి అని గోతర్ణకపరము, విచ్యుత=పోయిన, ప్రగ్రహములు=శుక్రుఁడు మున్నగు గొప్పగ్రహములు గలవి అని సురపథాంతరపరము. నియమపరతంత్రభూదేవచయమున్ =నియమాసక్తులగు బ్రాహ్మణులసమూహమును, కౌశికవ్రజంబున్ = గుడ్లగూబలగుమియు, సమాధియోగమునన్ = మనోలయరూప మగు యోగవిశేషముతో అని భూదేవపరము. సమాధి = నిశ్చలత్వముయొక్క, యోగమునన్ = సంబంధముతో, పరఁగెన్ =ఒప్పెను. అని కౌశికవ్రజపరము.

భా. రాత్రి క్షీణించె ననియు, దిగంతములు ప్రకాశవంతము లయ్యె ననియు, యువతులవాతెఱలరక్తిమ వదలె ననియుఁ, జంద్రుఁడు చరమాద్రిశిఖరము జేరె ననియు, సమస్తవస్తువులు సుగోచరము లగు చుండె ననియు, నద్రిశిఖరము లరుణకాంతిని బరఁగె ననియుఁ, బట్టణప్రాకారాగ్రములు సూర్యకాంతిఁగన్ని యొప్పె ననియుఁ, బద్మములు వికసించి పరిమళము గల వయ్యె ననియు, నాలదూడలమెడకట్టులు దన్నిపాలం గుడువ వదలుపఁబడె ననియు, నాకాశమున గ్రహరాజములు మాయమయ్యె ననియు, బ్రాహ్మణులు సమాధియోగమునఁ బరఁగుచుండి రనియు, గుడ్లగూబలు నిశ్చలముగ నిద్రఁజెందుచుండె ననియు భావము.

విశే. నియమ మనఁగా శౌచస్నానతపోదానాదిరూప మగు శాస్త్రవిహితకర్మాను ష్ఠానము. అలం. శ్లేషానుప్రాణితతుల్యయోగిత.

మ. కమలాప్తోన్నమదంశుజాలములు దిగ్భాగంబులం గ్రమ్మినం
గుముదాంతఃస్థితలక్ష్మి యెండవడసోఁకు లైనఁగా లేక ప
త్రముల స్తాటుగఁ జేసి కప్పుకొనియెం దత్కాలసంకోచన
క్రమదంభంబున రాజవల్లభ లసూర్యంపశ్య లౌదు ర్గదా. 69

టీ. కమలాప్తోన్నమదంశుజాలములు-కమలాప్త=సూర్యునియొక్క, ఉన్నమత్=దీర్ఘముగ వ్యాపించు, అంశు=కిరణములయొక్క, జాలములు=సమూహాములు, దిగ్భాగంబులన్ = దిక్ప్రదేశములందు, క్రమ్మినన్ =వ్యాపింపఁగా, కుముదాంతఃస్థితలక్ష్మి = కలువల నడుమ నున్నలక్ష్మీదేవి, ఎండవడసోఁకుల్ = ఆతపతాపముయొక్క స్పర్శలకు; అనఁగాఁ దీక్ష్ణాతపస్పర్శ ననుట. సైఁపఁగాన్ =సహింపఁగా, లేక=సమర్థురాలుగాక, తత్కాలసంకోచనక్రమదంభంబునన్ -తత్కాల=ఆసమయమునందైన, సంకోచనక్రమ = మూసికొను రీతి యను, దంభంబునన్ =మిషచే, పత్రములన్ = రేకులను, మాటుగన్ =అడ్డుగ, చేసి = చేసికొని, కప్పుకొనియెన్ = మఱుఁగుపఱచుకొనెను. రాజవల్లభలు = రాజభార్యలు, అసూర్యంపశ్యలు = సూర్యునిఁజూడనివారు; ఎండక నెన్నఱుంగనివారు. ఔదుర్గదా = అగుదురుకదా! అని రాణులపరము. రాజవల్లభలు=చంద్రభార్యలు; అనఁగాఁ గుముదిను లనుట. అసూర్యంపశ్యలు = సూర్యునిఁజూడ నోడువా రగుదురుగదా! అని కుముదినీ పరము.

భా. ఎండసోఁకునఁ గుముదములు ముకుళించుట నైజము. దానినే కవి యీ క్రిందిరీతిని జమత్కరించెను. సూర్యాతపతీక్ష్ణస్పర్శమున కోర్వలేక కుముదిని ముకుళించుట యనువ్యాజమున రేకులం దనకు మాటుగఁ జేసికొని తనరూపమును మఱుఁగుపఱచుకొనె ననిభావము. రాజదారలు సూర్యుం జూడ నోడుదురు గాన, రాజభార్య యగు కుముదినియు, దా సూర్యుం జూడ నిచ్చగింపక తనరూపును మఱుఁగుపఱచుకొనె ననియుఁ దాత్పర్యము. అలం. శ్లేషోత్థాపితార్థాంతరన్యాసము. అపహ్నుతి.

చ. కొలకొలమంచు మేఁతలకు గూఁడుల వెల్వడుపక్షిరావము
ల్కలమృదువాక్యవై ఖరులుగా నలవేకువపూవుఁబోఁడి వే
డ్కలు దళుకొత్త దోహదమిడం దొలిగుబ్బలికొండగోఁగు పూ
గొల యలరించె నాఁ బొడిచెఁ గోకనదాప్తుఁడు పాటలద్యుతిన్. 70

టీ. కొలకొలమంచున్ = కొలకొలమని; ఇది ధ్వన్యనుకరణము మేఁతలకున్ = ఆహారములకు, గూఁడులన్ =గూఁడులనుండి, వెల్వడు=బయటికివచ్చు, పక్షిరావముల్ =

పక్షులధ్వనులు, అలవేకువపూవుఁబోఁడి = ఆవేకువయనుయువతి, కలమృదువాక్యవై ఖరులు=మధురములైన మృదులములైన మాటలయొక్కరీతులు, కాఁక=సంభవించునట్లుగా, వేడ్కలు=ఉత్సాహములు, తళుకొత్తఁగ = ప్రకాశించునట్లు, దోహదము = పుష్పించుటకై చేయువ్యాపారము, ఇడఁగా=చేయఁగా, తొలిగుబ్బలికొండగోఁగు = తూర్పుమల యనెడికర్ణికారము, పూగొల = పుష్పగుచ్ఛమును, అలరించెఁ = ప్రకాశింపఁజేసెను, నాఁగ=అనునట్లు, కోకనదాప్తుఁడు = పద్మాప్తుఁడగుసూర్యుఁడు, పాటలద్యుతిఁ=ఎఱ్ఱని కాంతితో, పొడిచెఁ=ఉదయించెను.

భా. వేకువ యనువనిత పక్షికులారావము లనుపల్కుల కలధ్వనులు చెలంగ దోహదమొనర్ప తూర్పుమల యను కర్ణికారము పుష్పించెనో యన నరుణకాంతుల తోడ నరుణకిరణుఁడుదయించె నని భావము.

వ్యా-విశే. 'సల్లాపతః కర్ణికారః' అనుయుక్తి ననుసరించి కర్ణికారము వనితలసల్లాప రూపమగు దోహదముచేఁ బుష్పించు నని గ్రహింపవలెను. 'కొలకొల+అంచు' ధ్వన్యనుకరణశబ్దముల కనుధాతువు పరంబగుచోఁ గొన్నియెడల ముగాగమం బగు. 'కొలకొల మంచుఁ' ఇట్లే సలసలమను మొదలగునవి. అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

## శ్రీకృష్ణుని ప్రయాణసన్నాహము

వ. అని యివ్విధంబునం బలుకుమాగధులమధురవాక్యంబు లాకర్ణించుచు మేలుకాంచి యప్పంచశరగురుం డహర్ముఖోచితకృత్యంబులు నిర్వర్తించి పురోహితవృద్ధామాత్యసహితంబుగా నాస్థానమంటపంబున కరిగి యుగ్రసేనవసుదేవబలభద్రాదిగురుజనంబులకు నమస్కరించి సాత్యకిసారణప్రభృతిసోదరుల నాదరించి ప్రద్యుమ్నసాంబానిరుద్ధాది కుమారవర్గంబుమ్రొక్కులు గైకొని యదువృష్ణికురుభోజాంధక ప్రముఖులగుబంధుసందోహంబుల సంభావించి సింహాసనాసీనుండై తగువారి నుచితాసనంబుల నుండ నియమించి, వేరోలగంబుండి కార్యత్వరాసముత్సాహదోహలితాంతరంగుండై పతంగపుంగవుం దలంచుటయును.

టీ. అని, ఇవ్విధంబునఁ = ఈరీతిగ, పలుకు = పల్కుచున్న, మాగధులమధుర వాక్యంబులు = స్తుతిపాఠకులయొక్క తియ్యనిమాటలను, ఆకర్ణించుచుఁ = వినుచు, అప్పంచశరగురుండు-ఆ+పంచశరగురుండు = ఆమన్మథునకుఁ దండ్రియైన శ్రీకృష్ణుఁడు, అహర్ముఖోచితకృత్యంబులు = ప్రాతఃకాలమునకుఁ దగినకార్యములను, నిర్వర్తించి =

చేసి, పురోహితవృద్ధామాత్యసహితంబుగాఁ = పురోహితులతోడను వృద్ధబ్రాహ్మణుల తోడను గూడినట్లుగా, ఆస్థానమంటపమునకుఁ = సభాస్థానము, అరిగి=చని, ఉగ్ర సేనవసుదేవబలభద్రాదిగురుజనంబులకుఁ = ఉగ్రసేనుఁడు వసుదేవుఁడు బలభద్రుఁడు మొదలగు పెద్దలకు, నమస్కరించి, సాత్యకిసారణప్రభృతిసోదరులఁ = సాత్యకి, సారణుఁడు మొదలగుతమ్ములను, ఆదరించి = గౌరవించి, ప్రద్యుమ్నసాంబానిరుద్ధాదికుమార వర్గంబుమ్రొక్కులు = ప్రద్యుమ్నుఁడు, సాంబుఁడు, అనిరుద్ధుఁడు మొదలగుకుమారుల సమూహముయొక్క నమస్కారములను, కైకొని = స్వీకరించి, యదువృష్ణిభోజాంధక ప్రముఖులగు=యదువులు, వృష్ణులు, భోజులు, అంధకులు మొదలైన (ఇవి యాదవ కులభేదములు), బంధుసందోహంబులఁ = చుట్టాలసమూహమును, సంభావించి = మన్నించి, సింహాసనాసీనుఁడై =సింహాసనమునఁ గూర్చున్నవాఁడై, తగువారిఁ = అర్హులను, ఉచితాసనంబులఁ = (వారివారికి) తగినఆసనములందు, ఉండఁ =ఉండఁగా, నియమించి=ఆజ్ఞాపించి, పేరోలగంబుండి= పెద్దసభయందుండి, కార్య...అంతరంగుఁడై - కార్య = (పారిజాతమును నాకమునుండి తెచ్చుట యను) కార్యమందలి, త్వరా = వేగముచేతనైన, సముత్సాహ=అధికోత్సాహము చే, దోహళిత=మిగులఁ జలిత మగు, అంత రంగుఁ డై = మనస్సు గలవాఁడై, పతంగపుంగవుఁ = గరుత్మంతుని, తలంచుటయుఁ = తలంపఁగా.

వ్యా-విశే. భావార్థకటవర్ణకము యువర్ణపరకంబై యానంతర్యార్థక మగును.
'తలంచుటయును' పేరు + ఓలగము = పేరోలగము.

సీ. వజ్రంబునకు నీఁక వైచినబలశాలి
గజకచ్ఛపాశనఘాతుకుండు
జననిదాస్యంబు నీఁగినకులశ్రేష్ఠుండు
దుర్లభామృతపశ్యతోహరుండు
కమలాప్తసారథిగారాబుఁదమ్ముండు
గశ్యపకృతపుణ్యకర్మఫలము
సకలశకుంతౌఘసామ్రాజ్యధౌరేయుఁ
డహిమ్మగయావ్యసనాకులుండు

తే. మింటిపాళెంబు లేర్చుముక్కంటితూపు
గతి నిపాతితరోహిణస్కంధుఁ డనిల

హూనసాతీతవేగసంపద్ధనుండు
తాగ్నుఁ డేతెంచె దానవధ్వంసికడకు. 72

టీ. వజ్రంబునకుఁ=వజ్రాయుధమునకు, ఈఁక = వెండ్రుకను, వైచిన = వేసిన, బలశాలి = బలిష్ఠుఁడు, గజకచ్ఛపాశనఘాతుకుండు-గజకచ్ఛప = గజకచ్ఛపులనువారు, అశన = ఆహారముగాఁగల, ఘాతుకుఁడు = హింసయొనర్చువాఁడు; అనఁగా వజ్రాయుధము ధృణీకరించినవాఁడనియు, శాపవశమున గజకచ్ఛపరూపములం దాల్చిన విప్రుల సమయించినవాఁడనియు భావము. అమృతముం దెచ్చునపుడు వజ్రాయుధమున కీతఁడు లోఁబడకుండుటంజేసి వజ్రాయుధమున కీఁక యిడినవాఁడని యెన్నఁబడెను. 'విభావసుఁడు, సుప్రతీకుఁడు' అను నిర్వురు విప్రసోదరులు శాపవశమున గజకచ్ఛపరూపములం దాల్చిరనియును, వారి నీతఁడాహారముగఁ గొనెనని యును నాంధ్రభారతాదిపర్వమున ద్వితీయాశ్వాసమునఁ గలకథ నిచట ననుసంధింపవలయును. జననిదాస్యంబుక్ = తల్లిబానిసతనమును, ఈఁగిన = పోఁగొట్టిన, కులశ్రేష్ఠుండు=వంశశ్రేష్ఠుఁడు, దుర్లభామృతపశ్యతోహరుండు=పొందరానియమృతమును జూచుచుండఁగనే దొంగలించినవాఁడు; అనూరుని శాపముచేఁ దనతల్లి యగువినతకు సవతియైనకద్రువ కూడిగముచేయునటికాఁగ, స్వర్గమునకేఁగి యమృతముం గొనివచ్చి మాతృదాస్యముం బాపె ననుకథ నిచ్చో ననుసరింపవలెను. ఎల్లరుం జూచుచుండఁగనే యమృతము నపహరించుటంజేసి పశ్యతోహరుఁ డయ్యెను. కమలాప్తసారథిగారాబుఁదమ్ముండు=సూర్యునితేరుగడుపువాఁడగు ననూరుని ప్రియానుజుఁడు, కశ్యపకృతపుణ్యకర్మఫలము = కశ్యపమహాముని యొక్క పుణ్యంపుఁబనులఫలము. సూర్యప్రియానుజన్ముండును కశ్యపమాని పుణ్యకర్మలఫలము నని భావము. పెక్కు పుణ్యకర్మల నాచరింపఁ దత్ఫలమై యాత్మఁ డుదయించె నని తాత్పర్యము. సకల...ధారేయుఁడు-సకల=సమస్తమైన, శకుంత + ఓఘ = పక్షిసమూహము యొక్క, సామ్రాజ్య=ఆధిపత్యము యొక్క, ధారేయుఁడు = భారమును వహించినవాఁడు, అహి...కులుఁడు - అహిమృగయా=పామువేట యను, వ్యసన=దుష్టకృత్యమందు, ఆకులుఁడు = లోలుఁడు; పక్షిరాజనియుఁ బాములం జంపుటయం దాసక్తుఁడనియు భావము. మింటిపాశెంబులు= ఆకాశమునసైనపట్టెలను (త్రిపురములను), వీర్చు = దహించెడు, ముక్కంటితూపు = శంకరునిబాణమైన విష్ణునియొక్క, గఱి = ఱెక్క; ఈశ్వరుఁడు త్రిపురముల నాశమొనర్చుతఱిని నారాయణుని బాణముగఁ జేసికొనెనని యును, నపుడు గరుడుఁ డాబాణమునకు ఱెక్క యయ్యెనని యుఁ బురాణములు తెల్పును. నిపాతితరోహిణస్కంధుఁడు= పడఁద్రోయంబడిన రోహిణవృక్షము యొక్క స్కంధముగలవాఁడు. గజకచ్ఛపముల రోహిణవృక్షముశాఖపై నిల్పి తినునపు డారోహిణవృక్షశాఖలు గరుడునిభారమును

సై ఁపనోపక కూ లె నను భారతగాథ నిచ్చో ననుసంధింపవలయును. మానసాతీతవేగసంప
ద్ఘనుండు-మానస = మనస్సును, అతీత = అతిక్రమించు, వేగసంపత్ = వేగసంపదగల
ఘనుండు=గొప్పవాఁడు; మనోవేగమును మించు గమనవేగము గలవాఁ డని తాత్పర్యము.
తార్క్ష్యుఁడు=గరుడుఁడు, దానవధ్వంసికడకుక్ =(రాక్షసనాశకరుఁ డగు శ్రీకృష్ణునిదరికి,
ఏ తెంచెక్ =వచ్చెను.

వ్యా-విశే. గరుడుఁ డొనర్చినకృత్యముల కనురూపమగుగతి నిందుఁ దద్విశేష
ణములంతటను నిల్పఁబడినవి. వజ్రాయుధమును దృణీకరించినయోధుఁడు గాన నాతని
బలశాలి యని పేరొక్కొనెను. ఇట్లే యంతటను సారస్యముం గ్రహించునది. పశ్యతో
హరతీతి పశ్యతోహరః-కృద్వ్యుత్తి.

క. మిన్ననుండి భరంబున, బన్నగపతితలలు చదియఁబడ ధారుణిమీఁ
ద న్నిలిచి వైనతేయుఁడు, వెన్ననిపదములకు వినయవినతియొనర్పన్.

టీ. మిన్ననుండి = ఆకాశముననుండి, భరంబునక్ = భారముచే, పన్నగపతి
తలలు=శేషునితలలు, చదియఁబడక్ = అదుమఁబడునట్లుగా, ధారుణిమీఁదక్ = భువి
పైని, నిలిచి, వైనతేయుఁడు = వినతాపత్యము గరుడుఁడు, వెన్ననిపదములకుక్ = శ్రీ
కృష్ణునిపాదములకు, వినయవినతి = అడఁకువతోఁగూడిన నమస్కారము, ఒనర్పక్ =
చేయఁగా.

భా. పదవిన్యాసభరముకతన శేషునితల లదుమంబడునట్లుగ గరుడుఁడు భువిపై
నిల్చి సవినయముగఁ గృష్ణునకు నమస్కారమొనర్చె నని భావము.

విశే. వెన్నుఁడు. ప్ర. విష్ణు. అలం. అతిశయోక్తి.

చ. మునిపతిరాకయుం గుసుమముం దన కిచ్చినలాగు రుక్మిణీ
వనితకుఁ దా నొసంగుటయు వంచనఁ బొంచినబోటి సత్యకుక్
మనమెరియంగఁ జెప్పుటయు మానినికోపము వేఁడికొంటయుం
దనదుప్రతిజ్ఞయుం దెలిపెఁ దార్క్ష్యున కెంతయు నాదరంబునన్. 74

టీ. మునిపతిరాకయుక్ = నారదమాని వచ్చుటయును, కుసుమముక్ = పారి
జాతపుష్పమును, తనకుక్, ఇచ్చినలాగుక్ =ఇచ్చినవిధమును, రుక్మిణీవనితకుక్, తాను,
ఒసంగుటయుక్ = ఇచ్చుటయును, వంచనక్ =కపటముతో, పొంచిన = దాఁగియున్న,
బోటి=చెలి, సత్యకుక్, మనము, ఎరియంగక్ = మండునట్లుగ, చెప్పుటయుక్, మానిని
కోపముక్ = సత్యభామయొక్కయాగ్రహమును, వేఁడికొంటయుక్ (తాను) ప్రార్థిం
చుటయును, దనదుప్రతిజ్ఞయుక్ = తానొనర్చినశపథమును (పారిజాతముం గొనివత్తు

నని చేసినశపథ మనుట), ఎంతయుఁ=మిక్కిలి, ఆదరమునఁ=ప్రేమతో, తార్క్ష్యునకుఁ =గరుడునకు, తెలిపెఁ=తెలియఁజేసెను. (శ్రీకృష్ణుఁ డనుట).

ఉ. సంతసమంది జాదులు ప్రసాదము నయ్యె నటంచుఁ బొంగి నా
గాంతకుఁ డంబుజోదర! బలాసురవైరి మదీయపక్షమున్
బంతముగొన్న వాఁ డశనిపాతమున న్మను నాఁటనుండియు
స్వాంత మనంబులోఁ జనదు నాపఁగ నీఁగెద నేఁడు నీక్పన్. 75

టీ. నాగాంతకుఁడు = సర్పనాశకుఁ డగుగరుడుఁడు, సంతసము = సంతోషము, అంది=పొంది, జాదులు ప్రసాదమున్=జాజిపూవులు (?) భగవత్ప్రసాదమును; ప్రసాద మనసిచ్చో దైవార్చనంజేసి తలను ధరింప నొసంగెడు సుమ మనియర్థము. అయ్యెన్=దొరకెను, అటంచున్=అట్లనుకొనుచు, పొంగి = ఉబ్బి, అంబుజోదర=కృష్ణ! బలాసుర వైరి=దేవేంద్రుఁడు, అశనిపాతమునన్ = వజ్రాయుధపుప్రేఁతచే, మదీయపక్షమున్ = నావైపున (నాపెక్షను), పంతమున్ = చలమును (పంతముతో), కొన్నవాఁడు = స్వీకరించినవాఁడు, విను = వినుము, నాఁటనుండియున్ = నాఁడు మొదలుకొని, వంత = దుఃఖము, మనమున్లోన్ = మనస్సులో, చనదు=పోదు. నేఁడు, నాపగన్ = నాశత్రుత్వమును, నీక్పన్=నీదయ చే, ఈఁగెదన్=నశింపఁజేసికొందును; తీర్చికొందు ననుట.

భా. కృష్ణుఁ డట్లన జాజిపూవులును మఱియు నవి దేవపూజాకుసుమములును వైదొరకినట్లుగ గరుడుఁడు సంతసించి, దేవ! వజ్రపాతమున నాపక్షమును బంతమూని కొన్ననాఁడొట నింద్రునిపై నాకుఁ గలకోపము నేటికిని నామదిని మెఱుగుచు నేయుండును. నేఁడు నీదయంజేసి యాకోపము దీర్చికొందు నని పల్కె నని భావము.

విశే. 'దెప్పి తన్నినట్లును, దేవుని మొక్కినట్లును నగు' నను మున్నగుసామెతల వలె 'జాదులు ప్రసాద' మనునడియు నొకసామెతయే. శ్రీకృష్ణకార్యము సాధింప నేగుటయుఁ దన పగతీర్చికొనుటయు సంభవించుంగాన గరుడుఁడు, జాదుల ప్రసాదము సంభవించిన ట్లనుకొనె నని యెన్నవలయును. ప్రభువగు శ్రీకృష్ణుని కార్యసాధనము జాదులుగను, దా నింద్రునిపైఁగల పగతీర్చికొనుట ప్రసాదముగను గరుడుఁ డూహించె నని గ్రహించునది.

వ్యా-విశే. అంబుజ+ఉదరుఁడు=పద్మ ముదరమునఁగలవాఁడు. బలాసురవైరి - బల+అసుర+వైరి=బలుఁ డనురాక్షసునకు శత్రువు.

చ. అసుటయు నంతవాఁడవె కదా యని మిక్కిలి గారవించి య
వ్వానరుహలోచసుండు దగువారి సుహృజ్జనబంధుకోటి రా

బనిచి నిజప్ర యాణమును బట్టణర క్షయుఁ జెప్పి వారిచే
ననుమతి గాంచి యె క్కె విహగాధిపుఁ దానును సత్య భామయున్ .76

టీ. అనుటయున్ =అనఁగానే, అవ్వనరుహలోచనుండు = ఆశ్రీకృష్ణుఁడు, అంత వాఁడవెకదా = అంతటివాఁడవేకదా, అని, మిక్కిలి, గారవించి, తగువారిన్ = అర్హులను, సుహృజ్జనబంధుకోటిన్ = మిత్రులను బంధుసమూహమును, రాన్ = వచ్చుటకు, పనిచి = ఆనయిడి; అనఁగా రావించి యనుట, నిజప్ర యాణమును = తనపయనమును, పట్టణరక్షయున్ =పట్టణరక్షణమును, చెప్పి, వారిచేన్, అనుమతిన్ = అంగీకారమును, కాంచి = పొంది, తానును, సత్యభామయున్, విహగాధిపున్ =గరుడుని, ఎక్కెన్ = అధిరోహించెను.

వ్యా-విశే. పనరుహలోచనుఁడు=పద్మాక్షుఁడు. తాను శబ్దము ప్రయుక్తమగుటం జేసి తదనుకూలముగనే క్రియ యేకవచనమునఁ బ్రయుక్తమయ్యెను.

ఉ. ఆవిహగావతంసము నిజాంసమునైఁ బ్రియభామతోడ నిం
ద్రావరజుండు నిల్చుటయు నాతతపక్షమహానిలంబు లం
భోవహపంక్తిఁ దూలములపోలికఁ దూల్పఁగఁ దద్దిశాముఖుం
డై వినువీథికి న్నెగసె నద్భుతకారిమనోజవంబునన్. 77

టీ. ఆవిహగావతంసము = ఆపక్షిశ్రేష్ఠుఁ డగుగరుడుఁడు, నిజాంసమునైన్ = తనభుజమునిూఁద; అనఁగా మూఁపుపై ననుట. ఇంద్రావరజుండు=ఉపేంద్రుఁడు, ప్రియభామతోడన్ = ప్రియాంగనతో, నిల్చుటయున్ = నిల్వఁగా, ఆతతపక్షమహానిలంబులు = విస్తృతములైన పెక్కులవలనిగొప్పగాలులు, అంభోవహపంక్తిన్ = మేఘపంక్తిని, తూలములపోలికన్ = దూదులవలె, తూల్పఁగన్ = ఎగురఁగొట్టఁగ, తద్దిశాముఖుండై =ఆయింద్రునిదిక్కున కభిముఖుండై, అద్భుతకారిమనోజవంబునన్ = ఆశ్చర్యమునుగొలుపు మనోవేగముతో, వినువీథికిన్ = ఆకాశమార్గమునకు, నెగసెన్ = ఎగసెను.

క. ఇరుగ్రేవల నందక శా
ర్జ్గర థాంగగదాయుధములు రాఁ దొడఁగె ఖగే
శ్వరపక్షజనితవాతా
కురపూర్తిని శంఖ మపుడు ఘుమఘుమ మ్రోసెన్. 78

టీ. ఇరుగ్రేవలన్ = రెండుప్రక్కలను, నందకశార్జ్గరథాంగగదాయుధములు= నందకాద్యాయుధచతుష్టయము, రాఁదొడఁగెన్ = వచ్చుచుండెను. ఖగేశ్వర...

పూర్తిని-ఖగేశ్వర=గరుడునియొక్క, పక్ష=ఱెక్కలవలన, జనిత = పుట్టిన, వాతాంకుర = పిల్లగాలియొక్క, పూర్తిక్ =నిండుటచే, శంఖము = నందకము, అప్పుడు, ఘుమఘుమ = మ్రోసెక్ = శబ్దించెను.

విశే. నందకము = శ్రీవిష్ణునిశంఖము, శార్ఙ్గము = ఆజనిధనువు, రథాంగము = చక్రము, గదా = ఆజనిగద.

తే. అంబుధరజాలము క్తంబు లయినజలక
ణములు సాత్రాజితీకై శికమునఁ బొలిచె
గగనతలలక్ష్మి పోరచిగాఁగ నిడినఁ
జాల నొప్పారు మౌక్తిక స్తబక మనఁగ. 79

టీ. అంబుధరజాలము క్తంబులైన జలకణములు= మేఘసమూహమునుండి జాఱిన యుదకబిందువులు, సాత్రాజితీకై శికమునక్ =సత్యభామయొక్క కేశబంధముపై, గగన తలలక్ష్మి=ఆకాశలక్ష్మి, పోరచిగాఁగక్ = కానుకగా, ఇడినక్ = ఉంపఁగా; ఈయఁగా, చాలక్ =మిగుల, ఒప్పారు=సొగసగుమౌక్తిక స్తబకము=ముత్తియములగుత్తి, అనఁగక్ = అనునట్లు, పొలిచెక్ =ఒప్పెను. అలం. ఉత్ప్రేక్ష.

భా. ఆకాశమార్గమున నరుగునపుడు మేఘములందుండి సత్యాకేశబంధము పైఁబడిన నీటిబొట్టులు గగనలక్ష్మి కానుకగా నిడిన ముత్తెములగుత్తి యనం దనరె నని భావము.

క. తళతళని మెఱుఁగుఁదీఁగలు
గలుగుఘనాఘనచయంబు గనుఁగొనఁగా నిం
పొలయుఁచెఁ బసిఁడికామల
నలరెడునీలములగొడుగు లనఁగా హరికిన్. 80

టీ. తళతళని = తళతళమనిప్రకాశించు, మెఱుఁగుఁదీఁగలు = తీఁగలాబోలు సన్నసిమెఱుఁగులు, కలుగు=కల, ఘనాఘనచయంబు = వార్షికమేఘబృందములు, కనుఁగొనఁగాక్ =చూచుటకు, పసిఁడికామలక్ =బంగరుకాడలతో; కట్టి లనుట. అలరెడు = ఒప్పెడు, నీలములగొడుగులు = ఇంద్రనీలచ్ఛత్రములు, హరికిక్, అనఁగాక్, ఇంపొలయించెక్ = సొంపుజేకూర్చెను. మేఘము లింద్రనీలచ్ఛత్రములవలెను మెఱుఁగుఁదీఁగలు గొడుగు బంగరుకట్టులవలెను నొప్పె నని భావము. అలం. ఉత్ప్రేక్ష.

క. కమలదళాక్షుని దేహో
ద్యమదతిసాంద్రచ్ఛవిప్రవాహము వొలిచెం

దమతండ్రి భాసుఁ గనుఁగొన
యమునానది గగనవీథి కరిగెడు ననఁగన్. 81

టీ. కమల...ప్రవాహము, కమలదళాక్షుని = శ్రీకృష్ణునియొక్క, దేహ = శరీరమునుండి, ఉద్యమత్ = వెడలివచ్చునట్టి, అతిసాంద్ర = కడుదట్టమైన, ఛవి = కాంతియొక్క, ప్రవాహము = వెల్లువ, తమతండ్రిక్ = తమజనకుఁడైన, భానుక్ = సూర్యుని, కనుఁగొనక్ = చూచుటకై, యమునానది, గగనవీథికిక్ = ఆకాశమార్గమునకు, అరిగెడుక్ = పోయెడు, అనఁగక్, పొలిచెక్ = ఒప్పెను.

విశే. శ్రీకృష్ణుని నీలశరీరమునుండి వెడలు నీలంపుఁగాంతిపూరములు నల్లని యమునాప్రవాహమువలె మించుటంజేసి యమునానదిగఁ గని తలంచెను. సూర్య తనయ యమున యగుట ప్రసిద్ధము. కాన దండ్రిగారి గాంచ యమున వినువీథి కరుగు చున్నట్లు కవి యెంచుట యెంతయుఁ దగియున్నది. అలం. ఉత్ప్రేక్ష.

చ. ఖగకులనాథుపక్షములగాడ్పు సహింపఁగ లేక రజ్జుప
న్నగములు దేరి క్రిందికిఁ జన న్సరసీరుహమిత్రరథ్యముల్
నొగలఁ దొఱంగి నిల్వ నరుణుండు రయంబునఁ జక్కఁ గట్టుచుక్
గగనపథంబునం దటమేఁ గాలవిలంబన మందకుండఁగన్. 82

టీ. ఖగకులనాథుపక్షములగాడ్పుక్ = గరుడునిఱెక్కలయొక్కగాలిని, సహింపఁగక్ = సైఁచుటకు, లేక = చాలక, రజ్జుపన్నగములఁ = త్రాళ్ళులైనపాములు, దేరి క్రిందికిక్ = రథముక్రిందికి, చనక్ = పోఁగా, సరసీరుహమిత్రరథ్యముల్ = సూర్యరథాశ్వములు, నొగలక్ = కూబరముల; కాఁడిమాసికాధారమై బండి మొదలగువానిమొదట నుండెడు నిడుపాటికఱ్ఱను నొగ యని శబ్దరత్నాకరము. తొఱఁగి = తొలఁగి, నిల్వక్ = నిల్చిపోఁగా, అరుణుండు = అనూరుఁడు, (సూర్యసారథి), చక్కక్ = చక్కఁగా, కట్టుచుక్, కాలవిలంబనము = కాలముయొక్కజాగు, అందకుండఁగక్ = పొందకుండఁగ, గగనపథంబునక్ = ఆకాశమార్గమున, తటమేమెక్ = తోలెను.

క. నతిసేసె వైనతేయుఁడు, గతిభేదములోన నన్నఁ గనుఁగొని యతఁడుక్
*గతిలోనన దీవించినఁ, జతురతకు న్మెచ్చిరపుడు సత్యయుహరియున్. 83

టీ. వైనతేయుఁడు = గరుడుఁడు, గతిభేదములోనక్ = గమనభేదములోనే, అన్నక్ = అనూరుని, కనుఁగొని = కాంచి, నతి = నమస్కారము, చేసెను. అనఁగా గరుడుఁడు తన గమనభేదమునందే యన్నకుఁజేయునమస్కారమును సూచించె నని భావము.

---

* మతిలోనన.

తనవివిధము లగుగతులలో నమస్కారసూచకనమ్రగతి నపుఁడాత్మఁ డవలంబించె నని తాత్పర్యము. అత్తఁడున్ = అనూరుఁడును, గతిలోనన = గమనములోనె, దీవించినన్ = ఆశీర్వదింపఁగా; అనూరుఁడును గరుడుని యట్లే రథగమనభేదముమూలమున నాశీర్వదించె నని భావము. అనఁగా నాశీర్వాదసూచగతిభేదము నపు డాత్మఁ డగపఱచె నని తాత్పర్యము. చతురత్తకున్ = అన్నదమ్ములచాతుర్యమునకు, అపుడు, సత్యయున్, హరియున్, మెచ్చిరి.

క. మురమర్దనుఁ డివ్విధమున,గరుడునిపై గగనపథము గడచి యరుగుచుం
దరళాయతాక్షి కిట్లను, సరసస్మితవచనరచనచాతురి మెఱయన్. 84

టీ. మురమర్దనుఁడు = మురాసురునిమర్దించిన శ్రీకృష్ణుఁడు, ఇవ్విధమునన్ = ఈరీతిగ, గరుడునిపైన్, గగనపథమున్ = ఆకాశమార్గమును, కడచి=దాఁటి, అరుగుచున్ = పోవుచు, సరసస్మితవచనరచనచాతురి = మనోహరము లగు చిఱునగవుతోడిమాటల యొక్కనేర్పు, మెఱయన్ = ప్రకాశించునట్లు, తరళాయతాక్షికిన్ = చంచలములగు దీర్ఘములైన కన్నులుగలదానికి; సత్య కనుట, ఇట్లు, అనున్ = అనెను.

అది కృష్ణుఁడు సత్యభామకు మేరువును వర్ణించి చెప్పుట

చ. కువలయపత్రనేత్ర! కనుఁగొంటివె కన్నులపండువయ్యె రెం
డవవినతాతనూభవునియందమునం గమనీయకాంచన
చ్ఛవికవచీకృతంబు కులిశక్షతపక్షము నైనరత్నసా
నువు నిజయామికీకృతివినోదపరాయణచంద్రభానువున్. 85

టీ. కువలయపత్రనేత్ర=నల్లనికలువరేకులంబోలు కన్నులుగలదానా; సత్యభామ యనుట. రెండవవినతాత్తనూభవునియందమునన్ = రెండవగరుడుని చక్కందనముతోడ, కమనీయ...కృతంబున్ -కమనీయ=సొగసైన, కాంచనచ్ఛవి=బంగారుకాంతిచే, కవచీకృతంబున్ =వర్ముకలదిగాఁ జేయఁబడినదియు; కప్పఁబడిన దనుట కులిశక్షతపక్షమున్ = వజ్రాయుధముచే నఱుకఁబడిన ఱెక్కలు గలదియును,నిజ...భానువున్ -నిజ=తమసంబంధమైన, యామికీకృతి = జాములవంతునఁ గాచునట్టివాని వ్యాపారమునొక్క (అనఁగాఁ దలారికృత్యమనుట.)వినోద=వేడుకయందు, పరాయణ=ఆసక్తమగు, చంద్రభానువున్ = చంద్రసూర్యులుగలదియును, ఐన, రత్నసానువున్ = మేరుపర్వతమును, కనుఁగొంటివె= చూచితివే, కన్నులపండువ=నేత్రోత్సవము, అయ్యెన్ =సంభవించెను.

భా. ఓ సత్యభామా! బంగరునాకృతిని రెండవగరుడునింబోలుదాని, కాంచన కాంతి నావృతమైనదాని, వజ్రాయుధముచే గృత్తమైన ఱెక్కలుగలదాని, విడువక చంద్రసూర్యులు తలవరులవలెఁగాచువాని, నేత్రపర్వ మగుదాని బంగరుకొండను గనుము.

విశే. మేరుపర్వతశిఖరము నాశ్రయించి గ్రహజ్యోతిశ్చక్రములు బ్రవర్తిలు నని పురాణములు నుడువుచు. రత్నసానువు:—రత్నమయములైన చఱియలు గలది.

సీ. జీర్ణపర్ణద్రుసంకీర్ణాహిమణివిభామాయాకిసలవంచ్యమానపికము
శశికాంతరుచిమృషాసలిలసంస్ఖలనశ్లథవిషాణోద్విగ్నసైరిభంబు
గోమేధికప్రభాంకూరమిథ్యామధుద్రవలిలిక్షూమిళద్భల్లుకంబు
నీలగండప్రస్తరాళీకగజభేదశీర్ష్యన్నఖక్షుబ్ధసింహకులము

తే. గారుడాశ్మచ్ఛవిచ్ఛటాకపటయవస
పూలికాచర్వణవ్యగ్రబాలమృగని
లంఘ్యమానాబ్జరాగశిలావిశాన
కూటదావాగ్ని యామరుత్కుధర మబల! 86

టీ. అబల=ఓసత్య! జీర్ణపర్ణ...పికము-జీర్ణ=పండిన, పర్ణ=ఆకులుగల, ద్రు = చెట్లులందు, సంకీర్ణ=వ్యాపించిన (అనఁగా నున్న యని భావము.)అహి=పాములయొక్క, మణి=రత్నములయొక్క, విభా=కాంతు లనెడు, మాయాకిసల=కృత్రిమము లగుచిగురు లచే, వంచ్యమాన = మోసపుచ్చఁబడుచున్న, పికము=కోయిలలుకలది; మేరునగము నందలి వృక్షములయాకులు పండి రాలె ననియు, నట్టివృక్షముల సర్పములు చేరుటఁజేసి యాసర్పముల శిరలందలి మాణిక్యములకాంతులు చివురులభ్రాంతి నచటికోయిలలకుఁ గలుగఁజేయుచున్న వనియు భావము. శశికాంత...సైరిభంబు - శశికాంత = చంద్ర కాంతమాణిక్యములయొక్క, రుచి=కాంతి యనెడు, మృషాసలిల = అసత్యోదకమున, సంస్ఖలన=లెస్సగా కొట్టుటచేత, శ్లథ=జాఱిన, విషాణ=కొమ్ములు గల వగుటచే, ఉద్విగ్న= అవ్యవస్థములైన, సైరిభంబు=అడవిదున్నను గలది; మేరుపర్వతమునందలి చంద్రకాంత మాణిక్యముల కాంతిం గాంచి యెనుబోతు లుదక మనుభ్రమం జెంది కొమ్ములతోఁ గ్రమ్ముటకతన, విషాణములు విస్రస్తములై వేదనపా లయ్యె ననిభావము. గోమేధిక... భల్లుకంబు-గోమేధిక = గోమేధికరత్నములసంబంధమైన, ప్రభా-కాంతులయొక్క, అంకూర=మొలక లనెడి, మిథ్యామధుద్రవ = అసత్య మగు తేనెనీటియొక్క, లిలిక్షూ= నాకుటయందలికోరిక్కతో, మిళత్=కూడిన, భల్లుకంబు = ఎలుగుబంట్లు గలది; గోమే ధికరత్నప్రభలం గాంచి తేనె యనుభ్రాంతి నంది యెలుఁగుబంట్లు నాకుటకుఁ జేర నని

భావము. నీలగండ...సింహకులమ-నీల = నీలరత్నములయొక్క, గండప్రస్తర = గండశిల లనెడు, అళీకగజ = అసత్యపుటేనుఁగులయొక్క, భేద=భేదించుటచే, శీర్యత్ = వదలిన, నఖ=గోళ్లుకల వాటచే, తుబ్ధ=కలఁతనొందుచున్న, సింహకులము=సింహసమూహముకలది; సింహములు నల్లని నీలరత్నగండశిలలం గాంచి యేనుఁగు లను భ్రాంతినంది వానిని భేదింప గోళ్లు బ్రద్దలై జారి కలఁతనొందుచున్న వని భావము, గారుడాశ్మ... దావాగ్ని-గారుడాశ్మ = గరుడపచ్చలరాళ్లయొక్క, భవిచ్ఛటా=కాంతులగుంపనెడు, కపటయవసపూలికా = అసత్యములగు తృణములకట్టలను, చర్వణ = భుజించుటయందు, వ్యగ్ర=ఆసక్తములైన, బాలమృగ=పిల్లలేళ్ల చేత, విలంభ్యమాన=దాఁటఁబడుచున్న, అబ్జ రాగశిలావితాన = పద్మరాగమాణిక్యపు రాళ్ళగుమి యనెడు, కూటదావాగ్ని=కృత్రిమమైన దవానలము గలది; గరుడపచ్చలకాంతులగుమిం గాంచి పిల్లలేళ్లు తృణపూలిక లను భ్రాంతినంది యవ్వానిం భుజించునాసక్తిమెయి దవానలభ్రాంతి నొదవించు పద్మరాగరత్న శిలల నుల్లంఘించుచుండె నని భావము.

ఈమరుత్కుధరము = ఈదేవతలకొండ యగు మేరువు.

విశే. మేరుపర్వతమున నుత్తమములగు రత్నములు గల వనియుఁ, వివిధము లగు మృగము లున్న వనియుఁ గవి తెల్పినాఁడు. సీసపాదము లన్నియు గీతమంతయు నొక్కొక్క సిద్ధసమాసముతో నడిపినాఁడు. అలం. భ్రాంతిమదలంకారము. ఉదాత్తము. రూపకము.

ఉ. వంచనఁ బొంచి చేరువకు వచ్చిన చంద్రునిజింక నేసి హా
ర్షించియుఁ దత్సుధారసనిషేచనచే నది చావకున్కి వీ
క్షించియు నేటు దప్పె నని చేవిలునమ్ములుఁ బాఱవైచి ల
జ్జించి చరించుచుండుదురు చెంచెత లగ్గిరిసానుభూములన్. 87

టీ. చెంచెతలు=శబరకాంతలు, వంచనన్=వంచనతో, పొంచి = డాగి, చేరువకున్=దగ్గరకు, వచ్చిన=వీ తెంచిన, చంద్రునిజింకన్ = చంద్రునిదైనజింకను (చంద్రునందైన లేడి నని భావము), ఏసి=శరప్రయోగముచేసి, హర్షించియున్=సంతసించియు, తత్సుధారసనిషేచనచేన్-తత్ = ఆచంద్రునియొక్క, సుధారస = అమృతరసము యొక్క, నిషేచనచేన్ = తడుపుటచేత, అది=ఆజింక, చావక, ఉన్కిన్=ఉండుటచే, వీక్షించియున్=చూచియు, ఏటు=దెబ్బ, తప్పెను, అని, చేవిలునమ్ములు = చేత నున్న ధనుర్బాణములను, పాఱవైచి=విసరివైచి, లజ్జించి=సిగ్గునంది, అగ్గిరిసానుభూములన్ = ఆమేరుగిరియొక్క సానుప్రదేశముల, చరించుచున్ = సంచరించుచు, ఉండుదురు.

భా. శబరకాంతలు చంద్రునిలేడిం గాంచి బాణమునేసి చచ్చినది యనితొలు దొల్త సంతసించిరి గాని యది యాచంద్రామృతరసాసేకమునఁ జావకుండుటకుఁ బిదప నెంతయు వగచుచు చేత చున్నపిల్లమ్ములు పాఱవైచి తమ లక్ష్యగ్రహణాపాటవమును దలంచుకొని చింతిలి యప్పర్వతసానుప్రదేశముల విహరించుచుండు రని భావము. అలం. అతిశయోక్తి.

విశే. అగ్గిరివరమున కనతిదూరముగనే చంద్రుఁడు పోవుచుండు నని సూచించి నాఁడు. చంద్రునందలిమచ్చ నిట్లు కవులు లేడిగను, వరాహముగను నూహించుట సహజము.

వ. వెండియు నప్పసిండికొండ గండశిలామండలంబుల నుద్దండ వేదండంబు లొండొండ గండతలంబు లొరసికొన నిండిన మదజలాంజనమషిం గొని వనదేవతోపభుక్తాటంకతాళీదళంబులం బ్రియసందేశంబులు లిఖియించు గంధర్వసౌగంధికగంధులవలన, నత్యంతనిర్మలస్ఫటికాధిత్యకలం గానవచ్చు పాతాళవాతాశిప్రతిబింబంబులం గనిమును తమకఱచిన యురగంబులం బాఱ విడిచి వానిం దమచంచుపుటంబులం బొడిచియు గరుదంచలంబుల నడఁచియుఁ బదంబులం దాఁచియు నేచినకోపంబుల విఫలప్రయత్నంబు లగు బాలశిఖావళంబులం గని తమవరులకుం జూపి పరిహసించు గరుడతరుణీనివహంబుల వలన, నెలయేటిచిలుపచిలుపనీరు పగలు గగనమణి ధగధగని కిరణముల మిగుల సెగ లెగయు రవికాంతశిలాతలంబులం దెకతెక లుడుకెత్తి జాలువాఱఁ గరంగిన కజ్జలవ్యాదికొలంకులం బడి కెలంకులందేరి తెట్టువలు గట్టి చపలకపికులచలితతటతరుపతిత కుసుమవిసర పరిమళపరంపరావాసితం బై ఘుమఘుమం బిసాళింప నలందుకొని రతిశ్రమంబు లపనయించు యమునాపక్ష్మలాక్షులవలనఁ, గేసరికిశోరనఖముఖవిదారితకుంభం బైనవనగజంబును వనగజదంతఘాతయాతనాభ్రాంత వరాహంబును వరాహదంష్ట్రాటంకఖండితకీచకనిచయంబును గీచక శిఖాజర్జరిత పర్జన్యంబును బర్జన్యోదరపరిచ్యుత శంఖశుక్తిసంఘుంబును నొక్కయెడన పడఁ దత్తదుత్పన్నంబు లగుమౌక్తికంబుల వేఱు వేఱు నేకి పేరులు గ్రుచ్చు సాధ్యమిథ్యామధ్యలవలనను, నభిరామం

* భుక్తముక్తాటంక.

బై; మఱియు నొక్కొక్కచోట సురపతి తఱుచు మెఱుఁగు లడరు కఱకుభిదురముఁ గొని తఱిమి యెఱుకలు విఱుగ నఱికినయెడల సెలలకు నిడిన జలగలపొలుపునం జఱుల నెరగొని పాకలు జరఠజగర నికరంబులును, ఖచరగణ గోష్ఠిస్థానంబులం బఱిచినరత్నకంబళంబుల విధంబున విశాలశిలాతలంబుల నిద్రించుశార్దూలంబులును, మృగాంక మండలంబు సగము కబళించిన రాహుగ్రహభూమికలచందంబున నందంద తిరుగుబొల్లిమోరభల్లూకంబులును గలిగి; సుధర్మాప్రదేశం బునుంబోలె శక్రపురమహీశాలి *కుచచందనసుగంధాగురువాత పోతమేదురంబును, జలనిధియునుంబోలె నీలనలపనసకీలితతుంగసేతు సహితంబును, వల్లకియునుం బోలె లలితప్రవాళకకుభంబును, భారతం బునుంబోలె శతపర్వచమత్కృతంబును, సమరతలంబునుంబోలెఁ గలితానేకపాటనంబును, శబ్దశాస్త్రంబునుంబోలె ధాతుగణ విదోష్యి తంబును, సంగీతంబునుంబోలె నిషాదభరితంబు నయి, గ్రావనిబద్ధ ఘనౌఘుంబయ్యును గ్రావనిబద్ధఘనౌఘుంబై, గవయస్థానం బయ్యును నగవయస్థానంబై వైణవారావాసితం బయ్యు నవైణవారావాసి తంబై, మెఱయు నిది; మఱియును. 88

టీ. వెండియుఁ = మఱియు, అప్పసిండికొండ = అబ్బగరుకొండయొక్క (మేరువు), గండశిలామండలంబులఁ = పెద్దబాళ్లగుంపునందు, ఉద్దండవేదండంబులు= విజృంభించునేనుఁగులు, ఒండొండఁ = అన్యోన్యము, గండతలంబులు=చెక్కిళులప్రదే శములు, ఒరసికొనఁ = రాచుకొనఁగా, నిండిన = పూర్ణమైన, మదజలాంజనమషిఁ = దానోదకమనెడిమసిని (కాటుకరసము), కొని=స్వీకరించి, వనదేవతా...దళంబులఁ = వనదేవతా=వనదేవతలచే, ఉపభుక్త = అనుభవింపఁబడిన, తాటంక=కర్ణాభరణములైన, తాళీదళంబులఁ = తాటియాకులందు, ప్రియసందేశంబులు=ప్రియులకుఁబంపునార్తలు, లిఖించు=వ్రాయునట్టి, గంధర్వసౌగంధికగంధులవలనఁ =గంధర్వస్త్రీలపలనను, (సౌగం ధికగంధి = కలువపరిమళముంబోలఁ పరిమళముగలది స్త్రీ.) ఇంతవఱ కొకవాక్యము. అభిరామంబై యనుదానితో దీనికన్వయము. గంధర్వాంగనలు గజములమదజల మను సిరాతో వనదేవతలు కర్ణాభరణములుగ నుపయోగించికొని విడిచినతాళపత్రములఁ బ్రియసందేశముల నందు వ్రాయుచుండి రని భావము. మత్తిలినయేనుఁగు లందుఁ గల

* కుచలికుచచందన.

వనియు, వనదేవత లందలివస్తువుల నాభరణముగఁ జేసికొని సవిలాసముగ సంచరింతు రనియు, గంధర్వాంగన లందు లీలమీఱి విహరింతు రనియుఁ దాత్పర్యము. అత్యంత... ఆధిత్యకలర్ -అత్యంత=మిక్కిలి, నిర్మల=స్వచ్ఛమైన, స్ఫటిక=స్ఫటికవికారము లైన, ఆధిత్యకలర్ = గిరిశిఖరభూములందు, కానర్ వచ్చు = కనఁబడునట్టి, పాతాళ, వాతాశిప్రతిబింబంబులర్ = పాతాళమందలినాగముల మాఱురూపులను, కని=మాచి మును=తొల్లి, తమకఱిచిన=తాము నోటఁబట్టుకొనిన, ఉరగంబులర్ = పాములను, పాఱ విడిచి=పాఱవైచి, వానిర్ = ఆప్రతిబింబములను, చంచుపుటంబులర్ = దొప్పలవంటి ముక్కులచేత, పొడిచియుర్, గరుదంచలంబులర్ = ఱెక్కలకొనలచేత, అడఁచి యుర్=అడఁగఁజేసియు, పదంబులర్=పాదములచే, తొఁచియుర్=తన్నియు, ఏచిన= వృద్ధినందిన, కోపంబులర్ = ఆగ్రహములతో, విఫలప్రయత్నంబులు = సఫలముగాని ప్రయత్నములుగలవి, అగు = అయినట్టి, బాలశిఖావళంబులర్ = లేసెమిళ్ళులను, కని = కాంచి, తమవరులకుర్=తమపతులకు, చూపి=అగపఱచి, పరిహసించు=పరిహాసమొనర్చు నట్టి, గరుడతరుణీనివహంబులవలనర్ = గరుడయువతులసమూహములవలనను; అయ్యద్రి స్ఫాటికోపరిభూములఁ బాతాళనాగములరూపులు ప్రతిఫలింప నవ్వానిఁగని యధికరోష మున బాలశిఖావళములు తాము మున్ను నోటఁ గఱచి పట్టికొనినపాములఁ బాఱవైచి యానాగప్రతిబింబములను నిజసర్పములుగా భావించి ముక్కులతోఁ బొడిచి, ఱెక్కలతో నడఁచి, పాదములతోఁ దన్ని విఫలప్రయత్నములు గలవి గాఁగ, నక్కొండయం దుండు గరుడాంగన లాశిఖావళములఁ దమప్రియులకుం జూపి పరిహసించుచుండి రని భావము. అగ్గిరివరమున నచ్ఛము లగు స్ఫాటికప్రదేశములు గల వనియు, నెమిళ్ళులు, గరుడాంగన లును నందు విహరించుచుందు రనియుఁ దాత్పర్యము. సెలయేటిచిలుపచిలుపనీరు=కొండ యేటి యత్యల్పజలము, పగలు = దినభాగమున, గగనమణిధగధగనికిరణములర్ = సూ ర్యుని ధగధగాయమాన మగురశ్ములచే, సెగలు=వేడులు, ఎగయు=పైకివచ్చు, రవికాంత శిలాతలంబులర్ = సూర్యకాంతపురాళ్ళయొక్కప్రదేశముచేత, తెక తెక=కుతకుత మని, ఉడుకెత్తి=కెరలి మఱిఁగి, జాలువాఱర్ = పాఱునట్లు, కరంగిన = ద్రవీభవించిన, కఱ్ఱి జవ్వాదికొలంకులర్ = నల్లనిజవ్వాదిచెఱువులందు, పడి, దీనికిఁ గర్త సెలయేటిచిలువ చిలుపనీరు. కెలంకులర్ = ఒడ్డులందు, తేలి, తెట్టువలు=పెఱలు, కట్టి, చపల...వాసి తంబై-చపల=చంచలమైన, కపికుల = కోఁతులగుమిచే, చలిత=కదల్పఁబడిన, తటతరు= ఒడ్డులందలివృక్షములనుండి, పతిత = పడిన, కుసుమవిసర = పుష్పసమూహముయొక్క, పరిమళపరంపరా = సుగంధసమూహముచే, వాసితంబై =పరిమళింపఁజేయఁబడినదై, ఘుమ ఘుమర్ = ఘుమఘుమ మనునట్లు, పిసాళింపర్ =పరిమళింపఁగా, అలందుకొని=పూసికొని,

రతిశ్రమంబులు = సంభోగమువలని యాయాసములను, అపనయించు = పోఁగొట్టుకొను, నట్టి, యక్షపక్ష్మలాక్షులవలన = యక్షాంగనలవలనను: పగలు సూర్యునితీక్ష్ణములైన కిరణములచేతఁ జంద్రకాంతమాణిక్యములనుండి మంట లెగసె ననియు, నాజ్వాలల సోఁకున నల్లని జవ్వాదిచెఱువులు కఱఁగి జాలువాఱె ననియు, నట్టి కొలఁకులందు సెలయేటి యత్యుల్బోదకము పడి పెఱలుగట్టి తీరతరువులందలి చపలకపికులముచే రాల్పఁబడిన సుమముల పరిమళముచేఁ బరిమళింపఁజేయఁబడె ననియు, నట్టి సుగంధనిర్ఝరసలిలము నలందికొని యక్షాంగనలు రతిశ్రమ మపనయించుకొనుచుండిరనియు భావము. అప్పర్వత శ్రేష్ఠమున మనోజ్ఞములగు జవ్వాదికొలఁకులు, చంద్రకాంతశిలలు గల వనియు, నందు యక్షాంగనలు విహరించుచుందు రనియుఁ దాత్పర్యము. కేసరికిశోర...కుంభంబైన-కేసరికిశోర=సింహపుఁబిల్లలయొక్క, నఖముఖ=గోళ్లకొనలచే, విదారిత = బ్రద్దలుచేయఁబడిన, కుంభంబైన = శిరోభాగముకలదైన, వనగజంబును = అడవియేనుఁగును, వనగజ... వరాహంబును-వనగజ=అడవియేనుఁగులయొక్క, దంతఘాత = దంతములపోటుచేనైన, యాతనా=బాధచే, భ్రాంత = కలఁగెడు, వరాహంబును=అడనిపందియును, వరాహా... నిచయంబును-వరాహా = అడవిపందులయొక్క, దంష్ట్రాటంక = ఈలులవంటికోరలచే, ఖండిత = నఱుకఁబడిన, కీచకనిచయంబును = బొంగువెదుళ్లసమూహమును, కీచక... పర్జన్యంబును-కీచకశిఖా=బొంగువెదుళ్లకొనలచే, జర్జరిత = కంపఁబడిన, పర్జన్యంబును= మేఘములుమ, పర్జన్యోదర...సంఘంబును-పర్జన్య = మేఘములయొక్క, ఉదర = మధ్యభాగమునుండి, పరిచ్యుత=పడినట్టి, శంఖశుక్తిసంఘంబును = శంఖములయు ముత్తెపుఁజిప్పలయు సమూహములను, ఒక్కయెడన=ఒకేసలమున, పడక =పడఁగా, తత్తదుత్పన్నంబులగు=వానివానినుండిపుట్టునట్టి, ముక్తికంబులక = ముత్తెములను, వేఱువేఱక = కలసిపోకుండునట్లు, ఏఱి, పేరులు=హారములు, గ్రుచ్చు=కూర్చునట్టి, సాధ్యమిథ్యామధ్యల వలనను = సాధ్యులవనితలవలనను; ఆపర్వతమున సింహకిశోరనఖములచే ప్రయ్యలైన కుంభములు గలయేనుఁగులును, హస్తిదంతములపోటులచే వ్యధ నందు నడవిపందులును, నడవిపందుల వాడికోరలచే బ్రద్దలుచేయఁబడిన వెదుళ్లును, వెదుళ్లకొనలచే విదారింపఁబడిన మేఘములనుండి జాఱిన శంఖశుక్తిసమూహమును నొక్కచోఁగూల, నాయాపదార్థమునుండి పుట్టి పడిన మంచిముత్తెముల నొకజాతిదానితో నొకటి కలయకుండురీతి సాధ్యస్త్రీలు హారములు కూర్చుచుందు రని భావము. అనఁగా నందు మంచిముత్తెములు విస్తారముగ లభించు ననియు, నవ్వాని హారములుగఁ గూర్చి యలంకరించికొని సవిలాసముగ సాధ్యాంగనలు విహరింతు రనియు, సింహగజవరాహాదులందుఁ గల వనియుఁ దాత్పర్యము. "కరీంద్రజీమూతవరాహశంఖముక్తాన్యహీశుక్త్యుద్భవవేణుజాని" అనువాక్యము ననుస

రించి మంచిముత్తెములు, గజేంద్రములనుండియు, మేఘములనుండియు, వరాహముల నుండియు, శంఖములనుండియు, ముత్తెపుఁజిప్పలనుండియు, వెదుళ్లు మున్నగువాని నుండియు పుట్టునని యెన్నవలయునను. అభిరామంబై =మనోహరమై, లలసలతో నొప్పు, మోఁదివాక్యములన్నింటితో దీని కన్వయము. మఱియు, ఒక్కొక్కచోటన్ = ఒక్కొక స్థలమున, తఱచుమెఱుఁగులు = దట్టములగుకాంతులు, అడరు = వ్యాపించునట్టి, కఱకు భిదురమున్ = వాఁడియగువజ్రాయుధమును, కొని = పట్టి, తఱిమి = తోలి, ఎఱకలు = ఱెక్కలు, విఱుగన్ =విఱుగునట్లు, నఱికినయెడలన్ =నఱికినచోటులందు, సెలలకున్ = పుండుబెజ్జములందు, ఇడిన=ఊంచిన, జలగలపొలుపునన్ = జలగలతీరున, (జలగ=ఊదక సర్పవిశేషము-జలూక), చఱులన్ =గిరిప్రాంతప్రదేశములందు, ఎరన్ =ఆహారమును, కొని= గ్రహించి, పొరలు=దొర్లుచుండు, జరదజగరనికరంబులును = ముసలికొండచిలువగుములును; ఎరగొని యగ్గిరిప్రాంతదేశమున దొర్లుచుండు కొండచిలువలు, దేవేంద్రుఁడువజ్రాయుధమున నక్కొండ ఱెక్కలం దఱిగి యాప్రణరంధ్రముల రక్తముం బీల్చి నిడిన జలగలో యనునట్లు పొల్చె నని భావము. ఖచర...స్థానంబులన్ -ఖచరగణ=సురలయొక్క, గోష్ఠీస్థానంబులన్ = మాటలాడుకొనుచోటులందు, పఱచిన, రత్నకంబలాంబులవిధంబునన్ = రత్నకంబళులతీఱున, విశాలశిలాతలంబులన్ = విశాలములైనప్రాగ్భాగప్రదేశములందు, నిద్రించు=శయనించెడి, శార్దూలంబులును=బెబ్బులులును; పఱపైనప్రాగ్భాగనిద్రించు మువ్వన్నెమెకములు వివిధవర్ణములనెసఁగు రత్నకంబళులవలెనున్న వనియు, నాకంబళులు సురలు స్వేచ్ఛగఁ గూర్చుండి మాటలాడుకొనుటకై పఱుపఁబడిన ట్లమరియున్న వనియు భావము. మృగాంకమండలంబున్ = చంద్రమండలంబును, సగము = సంగోరు, కబళించిన = మ్రింగిన, రాహుగ్రహభూమికలచందంబునన్ = రాహుగ్రహావేషములవిధమున, అందంద=అచ్చటచ్చట, తిరుగు=సంచరించునట్టి, బొల్లిమోరభల్లూకంబులును = తెల్లని ముట్టెగల యెలుఁగుబంటులును; బొల్లిమోర సంగోరు మ్రింగిన చంద్రబింబమువలెను, తక్కిన నల్లనిభాగము రాహుగ్రహమువలెను నొప్పియుండుటంజేసి, భల్లూకములు సగమున్మ్రింగిన చంద్రమండలము గల రాహుగ్రహములవలెఁ బొల్చియున్న వని గ్రహించునది. కలిగి=కలదై, కర్త-మేరువు. 'కలిగి' అను దీనికిఁ బూర్వమునఁ గల ద్వితీయాంతము లన్నింటితో నన్వయము. సుధర్మాప్రదేశంబునుం బోలెన్ = దేవసభాప్రదేశము వలె (దేవసభకు సుధర్మ యనిపేరు.) శక్ర...మేదురంబును-శక్రపుర = ఇంద్రపట్టణమందలి (అమరావతి), మహిళాళి = స్త్రీసమూహముయొక్క, కుచ = స్తనములందైన చందనసుగంధాగురు = చందనము పరిమళించునట్టి యగురుగల, వాతపోత = పిల్లగాలులచే, మేదురంబును = బలిసినదియు, అని యింద్రసభాపర మగునర్థము. అనఁగా నింద్ర

సభయందు సురాంగనల కుచములందలి సుగంధద్రవ్యముల సుగంధమును వహించిన పిల్ల గాలు లొలయునని భావము. శక్ర=అంకుడుచెట్లు, పుర=గుగ్గులువృక్షములు, మహిళా= ప్రియంగులతలు, లికుచ=నిమ్మచెట్లు, చందన=మంచిగంధపుఁజెట్లు, సుగంధాగురు = పరిమళించు నగురువృక్షములు, (వీని చేతను), వాతపోత=పిల్లగాలుల చేతను, మేదురంబు = సాంద్రమైనది. అని మేరుపర మగునర్థము. జలనిధియునుంబోలెఁ = సముద్రమువలె, నీలనలపనసకీలితతుంగ సేతుసహితంబును = 'నీలుఁడు, నలుఁడు, పనసుఁడు' అను ప్లవంగమవీరులచేఁ గట్టఁబడు నెత్తైన యానకట్టతోఁ గూడినది. అని సముద్రపర మగునర్థము. నీలనల=నల్లనిగడ్డితోడను, పనస=పనసచెట్లతోడను, కీలిత = కూడియున్న, తుంగ=చిన్న గుట్టలతోడను, సేతు = నీటికట్టలతోడను, సహితంబును=కూడినదియు, అని మేరుపరమగు నర్థము. వల్లకియుంబోలెఁ =వీణవలె, లలితప్రవాళకకుంభంబును - లలిత = సొగసైన, ప్రవాళ=దండమును,కకుభంబు=ముఖమును గలదియు.అని వీణాపరము. లలిత సొగసైన, ప్రవాళ=చివురులుగల, కకుభంబు=అర్జునవృక్షములు గలదియు, అని మేరుపరము. వీణా దండమునకుఁ బ్రవాళ మనియు, వీణాముఖమునకు కకుభ మనియుఁ బేర్లు. భారతంబునుం బోలె = భారతమువలె, శతపర్వచమత్కృతంబును - శతపర్వ = నూరుపర్వముల చే, (నూఱులక్షణములు లేక నూఱు ప్రస్తావనలు) చమత్కృతంబును=మనోహరమైనది. అని భారతగ్రంథపరము. శతపర్వ=నూఱుగనుపుబుగల వెదుళ్ల చే, చమత్కృతంబును=మనోహరమైనది. అని మేరుపరము. సమరతలంబునుంబోలెఁ = యుద్ధరంగమువలె, కలితానేక పాటనంబును,కలిత=ఒప్పుచున్న, అనేక=అనేకులయొక్క,పాటనంబును బ్రద్దలు చేయుట కలదియు అని సమరతలపరము. కలిత = ఒప్పెడు, అనేకప = ఏనుఁగులయొక్క, అటనము = సంచారముగలది. అని మేరుపరము. శబ్దశాస్త్రంబునుంబోలెఁ = వ్యాకరణ శాస్త్రమువలె, ధాతుగణవిద్యోతితంబును ధాతుగణ = భ్వాదిధాతుగణముల చే, విద్యోతితంబును = ప్రకాశితమును, అని వ్యాకరణపరము. ధాతుగణ = గిరికాదిధాతుసమూహముచే, విద్యోతితము=ప్రకాశితము, అని మేరుపరము. సంగీతంబునుంబోలెఁ =సంగీతమువలె (గానమువలె), నిషాదభరితంబును-నిషాద = స్వరభేదముచే, భరితంబును = పూర్ణమైనదియు, అని గానపరము. నిషాద=కిరాతులచే, భరితంబును = నిండినది, అని మేరుపరము. గ్రావనిబద్ధఘనౌఘంబయ్యును-గ్రావ = కొండలందు (శిఖరములం దనుట), నిబద్ధ = కూర్పఁబడిన, ఘనౌఘము = మేఘబృందము గలది, అయ్యును = అయినను, అగ్రావనిబద్ధ ఘనౌఘంబై-అగ్రావని = ఎదుటిభూమిని, బద్ధ=కూర్పఁబడిన, ఘన = గొప్పదైన, ఓఘం బై=ఉదకప్రవాహముగలదై, గవయస్థానంబయ్యును = గవయమృగములకు స్థానమైనను, అగవయస్థానంబై-అగ=వృక్షములకును, వయ = పక్షులకును, స్థానంబై=తావై, వైణ

వారావాసితంబయ్యును-వై ణవ = బొంగువెదుళ్లయొక్క, ఆరావ = ధ్వనికి, ఆసితము = స్థానము, అయ్యుక్ = అయినను, నవై ణ...వాసితంబై -నవ = క్రొత్తయైన, లేతయైన. ఏణవార=జింకలగుంపుకు. ఆవాసితంబై =వాసస్థానమై, ఇది=ఈ మేరువు, మెఱయుక్ = ప్రకాశించును. మఱియును.

విశే. ఇందు, సుధర్మాప్రదేశ మను వాక్యము మొదలుకొని నిషాదభరిత మనువాక్య మువఱకుఁగల వాక్యములలో సభంగాభంగరూపమగు శ్లేషయు, గ్రావనిబద్ధమను వాక్యము మొదలుకొని, ఏణవారానాసితంబై అనువాక్యమువఱకుఁగల వాక్యములలో విరోధాభాసమును వెలయించుచున్నవి.

సామజముగాన వేదండమను పేరు హస్తికిఁగల్గెను. వేద + అండ=వేదండ, వాతాశి =గాలిని దినునది గానఁ బాముననకు వాతాశి అని పేరువచ్చెను. ఉరగము = పక్షముతోఁ బ్రాకును గాన దీని కీపేరు కల్గెను. గగనమణి=ఆకాశమునకు మాణిక్యముపోలి నొప్పు వాఁడు గాన రవి కీనామము కల్గెను. మిథ్యామధ్యులు = లేనినడుముగలవారు. అనఁగా సన్నని నడుముగలవా రనుట.

ఉ. కిన్నరకంఠి! చూచితివె కిన్నరులం గలధౌతభూధరా
భ్యున్నతశృంగభాగముల నుత్పలగంధులుఁ దామఁ గల్పకో
త్పన్నమధుప్రసంగతులఁ బాడెద రింద్రునిమోఁదిగీతముల్
కిన్నర లొయ్యనొయ్యఁ బలికించుచుఁ దారతరస్వనంబులన్. 89

టీ. కిన్నరకంఠి = వీణాస్వరముంబోలు స్వరముగలదాన (సత్య!) కలధౌత... భాగములన్-కలధౌతభూధర = బంగరుకొండ యగు మేరువుయొక్క, అభ్యున్నత = ఎత్తైన, శృంగ=శిఖరములయొక్క, భాగములన్ = ప్రదేశములందు, ఉత్పలగంధులు = స్త్రీలు, కల్పకోత్పన్నమధుప్రసంగతులన్-కల్పక = కల్పవృక్షములనుండి, ఉత్పన్న = పుట్టిన, మధు = మద్యముయొక్క, ప్రసంగతులన్ = ఉత్కృష్టమగు సంబంధముచే, కిన్నరలు = వాద్యవిశేషములను, ఒయ్యనొయ్యన్ = మెల్లమెల్లఁగా, పలికించుచున్ = మీటుచు, తారతరస్వనంబులన్ = మిక్కిలి హెచ్చైనస్వరములతో, ఇంద్రునిమోఁది గీతముల్ = ఇంద్రాంకితము లగుపాటలను, పాడెదరు = పాడుచున్నారు. చూచితివె = కంటివే!

భా. ఓసత్యభామ! కల్పవృక్షసంబంధమైన మద్యములం ద్రావి యామైకమునఁ దమప్రభు వగునింద్రునిమోఁది పాటలను బాడుచున్నా రదెగంటివే యని శ్రీకృష్ణుఁడు సత్యభామంగూర్చి పల్కె నని భావము.

ఉ. ఆయతభూర్జపత్రముల నామరధేనుదధిప్రయుక్తపా
థేయము లారగించి వడ దేఱుగ శీతలకల్పకద్రుమ
చ్ఛాయల నిల్చినిల్చి సరసంబులు వల్కుచు వెండికొండకుం
బాయక కూడి యేగెదరు భామిని! చూడుము సిద్ధపాంథులన్. 90

టీ. ఆయతభూర్జపత్రములన్ = పొడవైన భూర్జవృక్షపుటాకులందు, ఆమరధేనుదధిప్రయుక్తపాథేయములు - ఆమరధేను = సురలసంబంధమైనయావుయొక్క, దధి=పెరుగుచే, ప్రయుక్త=కల్పితములైన, పాథేయములు=దారిబత్తెములను, ఆరగించి=భుజించి, వడలేఱుగన్ = శ్రమతీర్చుకొనుటకై, శీతలకల్పకద్రుమచ్ఛాయలన్ =చల్లని కల్పవృక్షములనీడలందు, నిల్చి నిల్చి=ఉండియుండి, సరసంబులు = సరసములగుమాటలు, పల్కుచున్ =ఆడుచు, పాయక = ఒండొరులనెడబాయక, కూడి = కలిసి, వెండికొండకున్ =కైలాసమునకు, ఏగెదరు=పోయెదరు; సిద్ధపాంథులన్ =సిద్ధులను బాటసారులను, చూడుము. భుజించి, కూడి, నిల్చి మున్నగు నసమాపకక్రియలకు, సిద్ధపాంథపదమే కర్త యని గ్రహించునది.

భా. ఓసత్యభామా! సిద్ధులదె తాము తెచ్చికొన్న వేల్పుటావుపెరుగుతోఁ జేయఁబడిన దారిబత్తెముల విశాలభూర్జపత్రముల నిడికొని కల్పవృక్షములనీడల శ్రమ మపనయించుకొని గుమికూడి కైలాసమున కేఁగుచున్నవారు గనుము-అని భావము.

శా. ఏణీశాబవిలోలనేత్ర! కనుఁగొంటే వీరు విద్యాధరు
ల్మాణిక్యోజ్జ్వలరత్నకుండలులు సంబద్ధాసిధేను ర్రణ
ద్వీణాపాణులు చంద్రికామలశిరోవేష్టు ల్త్రిపుండ్రాంకితు
ల్నాణీయస్తరతారహారులు శివధ్యానై కనిష్ఠాపరుల్. 91

టీ. ఏణీశాబవిలోలనేత్ర! = బాలకురంగమువలెఁ జలించు నేత్రములుగలదాన! మాణిక్యోజ్జ్వలరత్నకుండలులు = రత్నములచేఁ బ్రకాశించు రత్నకుండలములుగలవారు, సంబద్ధాసిధేనుల్ -సంబద్ధ=కట్టుకొన్న, అసిధేనుల్ =కత్తులుగలవారు, రణద్వీణాపాణులు= ధ్వనిచేయువీణియలు హస్తములందుఁగలవారు, చంద్రికామలశిరోవేష్టుల్ =వెన్నెలవలె స్వచ్ఛమైన తలపాగకలవారు, త్రిపుండ్రాంకితుల్ =భస్మముచేఁ దీర్చిన మూఁడురేకలచేఁ జిహ్నితులైనవారు, నాణీయస్తరతారహారులు-నాణీయస్తర=మిక్కిలి గొప్పవగు, తారహారులు = ముత్యాలహారములు గలవారు, శివధ్యానై కనిష్ఠాపరుల్ =శివధ్యాన మను ముఖ్య మగునియమమునం దాసక్తిగలవారు, వీరు, విద్యాధరులు, కనుఁగొంటే=చూచితివే.

భా. ఓకురంగలోలవిలోచన ! వారే విద్యాధరులు రత్నకుండలాలంకృతులై కత్తు లం గట్టుకొని, వీణియలం బూని, తెల్లనిశలపాగల ధరించి, నొసటఁ ద్రిపుండ్రములం దిద్ది కొని, గొప్ప ముత్తియంపుం దేరులం దాల్చి శివధ్యాన మను ముఖ్యమగునిష్ఠయందే కేవల మాసక్తి గ్ని కైలాసమునకుం బోవుచున్నారు. అదే గనుము.

వ్యా-విశే. అణీయస్ + తర-అణీయస్తర=మిక్కిలి సూక్ష్మమైనది. న + అణీయస్తర= నాణీయస్తర=సూక్ష్మముకానిది. 'అణు' అనుపదమునకుఁ దరప్ప్రత్యయరూపము. 'అణీ యస్' దీనిపై మఱల తరప్ ప్రత్యయముచేసి కవి ప్రయోగించుట యిచటివిశేషము.

మ. కనుఁగొంటే సకలేందుబింబముఖి ! యీగంధర్వులం బంకజా
సనగేహిన్యుపదిష్టగీతరచనాసర్వంకషప్రజ్ఞులం
గనదుత్తుంగవిమానచారులఁ దురంగగ్రీవుల న్నిర్జరీ
జనతాన్నృత్తసహాయలాలసుల యక్షగ్రామవాస్తవ్యులన్. 92

టీ. సకలేందుబింబముఖి = పూర్ణచంద్రవదన ! పంకజాసన...ప్రజ్ఞులన్ - పంకజాసనగేహినీ = సరస్వతిచే (బ్రహ్మపత్ని), ఉపదిష్ట = కఱిపఁబడిన, గీత = గానము యొక్క, రచనా=తిరుగఁబాడుటయందు, సర్వంకష=సంపూర్ణమైన, ప్రజ్ఞులన్ = బుద్ధి కలవారలను, కన...చారులన్ - కనత్ =ప్రకాశించునట్టి, ఉత్తుంగ = ఎత్తైన, విమాన= విమానములందు, చారులన్ = సంచరించువారిని, తురంగగ్రీవులన్ = హయగ్రీవులను, నిర్జరీ...కారులన్ - నిర్జరీ = దేవతాస్త్రీలయొక్క, జనతా = సమూహముయొక్క, నృత్త=నాట్యములయొక్క, సహాయ = తోడ్పాటువిషయమున, లాలసులన్ = ఆసక్తి గలవారిని, యక్షగ్రామవాస్తవ్యులన్ =యక్షులగుంపుతోనుండువారిని, గంధర్వులన్ = గంధర్వులను, కనుఁగొంటే = చూచితివే.

విశే. సకలేందు = కళ లన్నింటితోఁ గూడినచంద్రుఁడు.

సీ. యక్షులు వీర లోయతివ ! మేళము గూడి
పాడుచుండుదురు దిక్పాలసభల
గుహ్యకు 2ల్వీర లోకొమ్మ ! హాస్యరసాధి
నాయకు లభ్రలంగీశనర్తసఖులు
గరుడులు 3వీర లోతరుణి ! విష్వక్సేన
పరిచితు ల్నాగారిపరమహితులు

---

1. గ్రామవాస్తవ్యులన్. 2. వీరుగో యతివ ! 3. వీరుగో కొమ్మ !. 4. వీరు గోతరుణి !

చారణు [1]ల్వీర లోసతి! విచిత్రకథేతి
హాసజ్ఞు లఖిలలోకాధ్వనీను
తే. లమరపతిఁ గొల్వఁ జనువార లతివ! యెపుడు
నుబుసు వుత్తురు వివిధోపయోగ్య [2]కళల
మనలఁ జూచెద రాశ్చర్యమగ్ను లగుచు
వీరిఁ గనుంగొంటె గంభీరవేదిగమన! 13

టీ. ఓయతివ=ఓవనిత! వీరు=వీరు, యత్నులు, మేళము=జక్క, కూడి, దిక్పాల సభలన్ = దిక్పతులసభలందు, పాడుచుందురు=గానము చేయుదురు. ఓకొమ్మ=ఓస్త్రీ! వీరలు, గుహ్యకులు, హాస్యరసాధినాయకుల్ = హాస్యరసాధిపతులు, భృంగీశసఖ్యసఖులు = భృంగీశునిరహస్య మిత్రులు, ఓతరుణి=ఓయువతి, వీరలు, గరుడులు, విష్వక్సేనపరిచితులు = విష్వక్సేనునిస్నేహితులు, నాగారిపరమహితులు = గరుడునకుఁ బ్రియమిత్రులు, ఓసతి=ఓపతివ్రత! వీరలు, చారణులు, విచిత్ర...హాసజ్ఞులు-విచిత్ర=మిక్కిలిచిత్రములైన, కథా=కొంచెము సత్యమైన కల్పితకథలను, ఇతిహాస=ప్రాచీనచరిత్రము లను, జ్ఞులు=తెలిసినవారు, అఖిలలోకాధ్వనీనులు=అన్నిలోకములందు సంచరించువారు, అమరపతిన్ =దేవేంద్రుని, కొల్వన్ = సేవించుటకు, చనువారలు=పోవుచున్నవారు, అతివ=సత్య, ఎపుడు=ఎల్లపుడు, వివిధోపయోగ్యకళలన్ =అనేకవిధములగు నుపయుక్తములైన విద్యలచే, ఱుబుసు=పనిలేనికాలమును, పుత్తురు=గడపుదురు. ఆశ్చర్యమగ్నులు = ఆశ్చర్యమున మునిఁగినవారు, అగుచున్, మనలన్, చూచెదరు = చూచుచున్నారు. గంభీరవేదిగమన-గంభీరవేది = మదగజమువంటి, గమన=నడకగలదాన! వీరిన్, కనుఁగొంటె = చూచితివే!

విశే. తోలూడినను, రక్తము కారినను, మాంస మూడివచ్చినను, దన్నుఁ దా నేది యెఱుంగక మత్తిలి తిరుగునో, బహుకాలమునకుఁగాని యేది శిక్షితమై వశముకాదో యట్టియేనుఁగును గంభీరవేది యందురు.

లయగ్రాహి.—

అంగన! కనుంగొను మనంగహారమాళితట
రంగనటి జహ్నుమునిపుంగవవిశాలో
త్సంగశిశువుం గపిలునింగలపుఁజూపుసెక
లం గలయునాసగరువంగడము మోత్తో

---

1. వీరుగో సతి. 2. కథల.

త్తుంగమణిసౌధమునకుం గడపుఁ దాప గగ
నాంగణమహీతలభుజంగనిలయంబుల్
జంగగొనునేర్పరిఁ బతంగజయసుంగుఁజెలి
యం గనఖలాచలయుగంగ సురగంగన్. 94

టీ. అనంగ...నటిక్ -అనంగహర=మన్మథహంత యగు నీశ్వరునియొక్క, మౌళి తట=శిరోభాగ మనెడు, రంగ=నాట్యభూమియందు, నటిక్ =నర్తకియైనదానిని, జహ్ను ముని...శిశువుక్ - జహ్ను మునిపుంగవ= జహ్ను వను బుషిశ్రేష్ఠునియొక్క, విశాలో త్సంగ=పఱపైనతొడయందలి, శిశువుక్ =పాపయైనదానిని, కపిలు...సెకలక్ -కపిలు= కపిలమహాముని యొక్క. ఇంగలపుఁజూపు = అగ్నికణములరూప మగు దృష్టియొక్క, సెకలక్ =మంటలందు, కలయు=కలసిపోయిన, ఆసగరువంగడమ్ముక్ = ఆసగరునివంశ మును, మోక్షోత్తుంగమణిసౌధమునక్ = మోక్ష మనెడి యెత్తైనమేడకు, కడపు = చేర్చినట్టి, తాప=నిచ్చెనయైనదానిని, గగనాంగణమహీతలభుజంగనిలయంబుల్ =స్వర్గ మర్త్యపాతాళములను, జంగగొను=లంఘించునట్టి, నేర్పరిక్ =నేర్పుకలదానిని, పతంగజ యసుంగుఁజెలియక్ -పతంగజ = సూర్యతనయయగుయమునకు, అనుంగు చెలియక్ = ప్రియసఖయైనదానిని, కనఖలాచలయుగంగక్ -కనఖల=కనఖలయనుకొండతో,యుక్ = కూడిన, అంగక్ =శరీరముగలదానిని,సురగంగక్ =మందాకినిని, అంగన, కనుంగొనుము= చూడుము.

విశే. ఈశ్వరుఁడు భగీరథునిప్రార్థనంజేసి గంగను మౌళిఁ దాల్చుటకత్తన నందు గంగ విహరించుట కల్లెను. దాన నీశుమౌళి గంగనర్తనమునకు రంగ మయ్యెఁ. జహ్నుముని యుద్రేకమున వచ్చు గంగం ద్రావి మఱల దానిం దాఁబుట్టించుటంబట్టి గంగ జహ్నుసుత యై జాహ్నవీనామము నందెను. వేయిమంది సగరసుతులు యాగపశువును వెదకం బాతా ళముపఱకు భూమిం ద్రవ్వి పాతాళముం జొరఁబాఱి యచ్చోఁ గపిలమునివరుని నేత్రా గ్నిజ్వాలల దగ్ధులైరి. వారిని గంగోదకమునం దడిపి యుత్తమగతిం బొందింప భగీరథుఁడు యత్నించి గంగం బుడమికిఁ దెచ్చి కృతకృత్యుఁడయ్యెఁ. గంగ సగరసుతుల నుత్తమగతి నొందించుటకత్తన సగరవంశమువారిని మోక్ష మనుసౌధము నెక్కించుటలో నిచ్చెన యయ్యెను.

విష్ణుపాదమునుండి వెలువడినగంగ మూఁడుచీలిక లయ్యె ననియు, నందొక పాయ స్వర్గమున, నొకటి భువిని, నొకటి పాతాళమునఁబడి ప్రవహించె నని పురాణములు చెప్పును గాన, గంగ మల్లోకములజంగగొనునదయ్యెను. యమువానదింగూడి ప్రవహించు నది గానఁ బతంగజప్రియసఖి యయ్యెఁ. కనఖలాచలమనుకొండ గంగాద్వారమునఁగలదు.

అందొకతీర్థమున గంగ యావిర్భవించుటంజేసి గంగ కనఖలాచలయుగంగ యయ్యెను. ఇది లయగ్రాహి యనువృత్తము. ఇరువదియారుచందములలోఁ బుట్టినదిగామి నిది యిరువదిమూరక్షరముల కెక్కుడుగ నక్షరములు గలపాదము గల్గియుండును. ఇట్టివానికి లక్షణకర్త లక్ష్మీపతియనే 'ఉద్ధురమాలావృత్తములు' అను పేరిడినారు. దీని ప్రతిపాదమునకు 39 మాత్ర లుండును. ప్రతిపాదము,భ,జ,స,న,భ,జ,స,న,భ,య, అను గణములతో నడచును. ప్రతిపాదమునను, 11,21,31, మాత్రలపైఁ బ్రాసయతి యుండును. యతి వేయరాదు; ప్రాసయతియే నిల్పవలెను.

మ. అవె దివ్యర్షినికేతనంబు లనసూయారుంధతీకర్ణపూ
రవివృద్ధార్భకకృష్ణసారగతిసంరంభంబు లింద్రద్రుమో
ద్భవనానావిధవల్కలాంచితబహిర్ద్వారప్రదేశంబు లా
హవనీయాదిహుతాశధూమపటలశ్యామీభవత్ప్రాంతముల్. 15

టీ. అనసూయా...సరంభంబులు - అనసూయా = అత్రిపత్నియొక్కయు, అరుంధతీ=వసిష్ఠునిభార్యయొక్కయు, కర్ణపూర = కర్ణాభరణములైన బాలకృణాదుల చేత, వివృద్ధ=పోషింపఁబడిన, అర్భక = పిల్లలుగల, కృష్ణసార = నల్లనిచాఱలుగలలేళ్ల యొక్క, గతి=నడకయొక్క, సంరంభంబులు = త్వరలుగలవియు; అనసూయారుంధతులు తాము కర్ణాభరణములుగఁ జేసికొనినకృణాదుల నాహారముగ నిడి పిల్లలేళ్లఁ బ్రేమతోఁ బెంచుచుండ నాపిల్లలకేళ్లు లగుజింక లవ్వారియాశ్రమముల స్వేచ్ఛగ విహరించుచున్న వని భావము. ఇంద్రద్రుమ...ప్రదేశంబులు - ఇంద్రద్రుమ=కల్పవృక్షమునుండి, ఉద్భవ=పుట్టిన, నానావిధ=వివిధములైన, వల్కల=నారచీరలతో, అంచిత=ఒప్పుచున్న, బహిర్ద్వారప్రదేశంబులు = వాకిళులతలములు గలవి, ఆహవనీయాది...ప్రాంతముల్ - ఆహవనీయాది=ఆహవనీయము మొదలైన, హుతాశ=అగ్నులయొక్క, ధూమపటల = పొగలగుమిచే, శ్యామీభవత్ = నల్లనగు, ప్రాంతముల్ = సమీపప్రదేశములుగలవి, దివ్యర్షినికేతనంబులు = దేవర్షులగృహములు, అవె=అవిగో.

విశే. 'ఆహవనీయము,గార్హపత్యము, దాక్షిణాగ్ని' అని అగ్నులు మూఁడెఱంగులు.

అలం. స్వభావోక్తి.

ఉ. అచ్చెర పువ్వుఁబోండ్లు సరసామృతధారయుఁ గల్పవాటియున్
లచ్చియుఁ జంపమామయుఁ దలంపులమానికముం దలంపఁ బై

పెచ్చులు దీనికి న్నెమరువెట్టుచు నందినియట్టి నాకుచుం
బచ్చికఁ దెండి యున్నయది భామిని! వేలుపుటావుఁ జూచితే. 96

టీ. అచ్చరపువ్వుఁబోఁడ్లుక్ = అప్సరస్త్రీలును, సరసామృతధారయుక్ = సరసమగునమృతపుధారయు, కల్పవాటియుక్ = కల్పవృక్షపంక్తియు, లచ్చియుక్ = లక్ష్మియును, చందమామయుక్ = చంద్రుఁడును, చేలంపులమానికముక్ = చింతామణియు, తలంపక్ = ఆలోచింపఁగ, దీనికిక్ = ఈకామధేనువునకు, పైపెచ్చులు = కొసరులు, నందినియట్టుక్ = నందిని యను తనదూడయొక్కకంఠమును, నాకుచుక్, నెమరువెట్టుచుక్ = నెమరువేయుచు, పచ్చికక్ = పచ్చికగలనేల, పండి = శయనించి, ఉన్నయది, భామిని = సత్య, వేలుపుటావుక్ =సురలయావగు కామధేనువును, చూచితే = కాంచితివే.

వ్యా-విశే. అచ్చరలు, అమృతము, కల్పవృక్షములు, లక్ష్మి, చందమామ, చింతామణి, కామధేనువు-ఇవన్నియు సముద్రమునసే పుట్టినవి. కాని యీకామధేనువునకుఁ దక్కినవన్నియు కొసరులే యగుచున్నవి. అనఁగా దీనితో నయ్యవేవియు సాటినొందఁజాలవనిభావము. పైపెచ్చు = కొసరు; అనఁగాఁ బ్రధానముగ నొకవస్తువుంగొని పిదప నాకొన్నదానికై కొసరుగాఁ బుచ్చుకొనిన చిల్లరవస్తువు.అచ్చర. ప్ర. అప్సరాశ. పువ్వుఁబోఁడి=పుష్పమువలె మనోజ్ఞమైన యొప్పిదముగలది. పూవుఁబోఁడి. పువుఁబోఁడి. రూ. అ. పూఁబోఁడి.

చ. కనకమహీధరేంద్రునలిక స్థితపర్వతరాజపట్టబం
ధనమును బోనికోటయు ఘనం బగు తన్మకుటంబుకైవడిం
దనరెడువైజయంతమును దవ్వులఁ గానఁగవచ్చెఁ జూచితే
యనిమిషరాజధాని యిది హాయనమాత్రకురంగలోచనా! 97

టీ. హాయనమాత్రకురంగలోచనా = ఒకసంవత్సరమాత్రమే వయసుకలలేడివంటి కన్నులుగలదాన, కనకమహీధరేంద్రు...బంధమునుబోని = కనకమహీధరేంద్రు = మేరుగిరివరమునొక్క, అలిక = ఫాలప్రదేశమున, స్థిత = ఉన్నటువంటి, పర్వతరాజపట్టబంధనమునుబోని = పర్వతరాజత్వమును బ్రకటించుపట్టమునొక్క కట్టును బోలిన, కోటయుక్ = కోటయును, ఘనంబగు=గొప్పదైన, తన్మకుటంబుకైవడిక్ = ఆపర్వతరాజుయొక్కకిరీటమువలె, తనరెడు=ఒప్పునట్టి, వైజయంతమును = వైజయంతమను మేడయు, దవ్వులక్ = దూరమునుండి, కానఁగవచ్చెక్ =కాన్పించెడిని. ఇది, అనిమిషరాజధాని = దేవేంద్రముఖ్యపట్టణమగునమరావతి, చూచితే = చూచితివా?

---

1. బండి, తేఁడి. 2. స్థలసుస్థిరపట్టసూత్రబంధనమును.

భా. మేరుపర్వతశిఖరమున నున్న దేవేంద్రునికోట పర్వతరాజునొసట గట్టిన పట్టబంధమువలెను, నాతనిప్రాసాదమగు వైజయంతమప్పర్వతరాజుశిరమునఁ బ్రకాశించు కిరీటమువలెను నొప్పుచున్న వని భావము.

విశే. రాజునొసటఁ బట్టాభిషేకాదులఁ బట్టము గట్టుట యాచారము. అనిమిషులు=ఱెప్పపాటు లేనివారు. జయంతము—ఇది యింద్రునిమేడపేరు.

ఉ. శ్రీలఁ జెలంగు నీసురపురిం గమనీయమహానుభావతం
బోలఁగ లేవ యోటములఁ బొంది భజింపఁగ వచ్చినట్టు లు
త్తాలదుకూలకల్పితపతాకలతోఁ గడు నొప్పు నన్యది
క్ష్వాలపురంబులో యనఁగఁ బార్శ్వములం దివిషద్విమానముల్. 8

టీ. శ్రీలన్ = సిరులచే, చెలంగు = ఒప్పునట్టి. ఈసురపురిన్ = ఈయమరావతిని, కమనీయమహానుభావతన్ = సొగసైనగొప్పమహిమవిషయమున, పోలఁగన్ = సాటిఁజొందుటకు, లేక = చాలక, ఓటములన్ = అపజయములను, పొంది, (దిక్ష్వాలపురంబులు, భజింపఁగన్ = సేవించుటకై (అమరావతికి) వచ్చినట్టులు = వచ్చినరీతిగ. ఉత్తాల...పతాకలతో-ఉత్తాల = మిక్కిలిపొడవైన, దుకూల = పట్టుబట్టలచే, కల్పిత= నిర్మింపఁబడిన, పతాకలతోన్ = ధ్వజములతోడ, కడున్ = మిక్కిలి, ఒప్పు, ప్రకాశించు, అన్యదిక్ష్వాలపురంబులో = ఇతరదిక్ష్వాలురపట్టణములో, అనఁగన్ = అనునట్లు, పార్శ్వములన్ = కెలంకులందు, దివిషద్విమానములు = సురలవిమానములు, ఒప్పును.

భా. అమరావతీపార్శ్వములఁ గల దేవవిమానములు సురపురిమాహాత్మ్యమున కోడి దానిని సేవింపవచ్చిన యన్యదిగీశులపట్టణములో యనునట్లొప్పె నని భావము. అలం. ఉత్ప్రేక్ష.

చ. మరలక జన్యభూమి నణుమాత్రభయంబును లేనివీరు ల
ధ్వరము లనేకము ల్విధియుతంబుగఁ జేసినభూసురేంద్రు లు
ద్ధురభవపాశబంధములఁ ద్రుంచినయోగికులావతంసు లీ
సురపుర*కామినీవదనచుంబనమాత్రకృతార్థమానసుల్. 99

టీ. జన్యభూమిన్ = యుద్ధరంగమున, మరలక=వెనుదీయక, అణుమాత్రభయంబును = స్వల్పమైనభయమును, లేని = లేనట్టి, వీరులు = శూరులు. అధ్వరములు = యజ్ఞములు. అనేకములు = పెక్కులు, విధియుతంబుగన్ = యథావిధిగ, చేసిన = ఒనర్చిన, భూసురేంద్రులు=బ్రాహ్మణశ్రేష్ఠులు, ఉద్ధుర...బంధములన్ -ఉద్ధుర=మిక్కిలి బలముకలవైన, భవపాశబంధములన్ =సంసారరజ్జువులకట్టులను, త్రుంచిన=త్రెంపికొన్న,

* దారికావదన.

యోగికులావతంసులు=మునికులశ్రేష్ఠులు, ఈసుర...మానసుల్-ఈసురపురకామినీ = ఈ స్వర్లోకస్త్రీలయొక్క, వదనచుంబనమాత్ర = మోము ముద్దుగొనుటమాత్రము చేతనే, కృతార్థ = ధన్యమైన, మానసుల్ = మదిగలవారు.

భా. యుద్ధభూమిని వెను చూపక పోరాడిప్రాణములఁ గోల్పోవువారును, యథా విధి యజ్ఞము లాచరించిన మహీసురవరులును, సంసారపాశములకట్టులఁ ద్రెంపికొన్నమునిపుంగవులును, దేవతల మోముల ముద్దుగొనుట మాత్రమునసే తమ్ము తాము ధన్యులంగాఁ దలంచుకొందురు. అనఁగాఁ బైకృత్యముల కిదే ఫల మని తాత్పర్యము.

వా-వి శే. 'ఈసురపురి' అను సమాసపదమునందలి 'ఈ' అనునది 'సురపురి' అను సిద్ధసమాసైకదేశమగుపదముతో నన్వయించుచున్నది. సమాసైకదేశమగుపదముతో నన్వయించుగతిని విశేషణము నిబ్బుటకే యేకదేశాన్వయ మందురు. ఇట్టివి నన్నెచోడాది మహాకవులగ్రంథములఁ గన్పట్టుచున్నవి.

శా. సారంగాక్షుల*చూపుచోఁగముల న్జన్గొండల న్మోహదు
ర్వారావర్తముల న్మునింగి దరిఁ జేరన్రాక యుప్పొంగు సం
సారాంభోనిధి సత్క్రియాతరణి నిశ్శంక న్సము త్తీర్ణుఁడై
చేరు న్సజ్జనసావికుండు మదిరాక్షీ! యీపురద్వీపమున్. 100

టీ. మదిరాక్షీ = మదముకప్పిన కన్నులుగలదాన! సజ్జనసావికుండు=సత్పురుషుఁడను నోడగడపువాఁడు, సారంగాక్షులచూపుచోఁగములన్ = లేడికన్నులంబోలు కన్నులుగల వనితలయొక్కదృష్టి లను చేఁపలగుంపునందును, చన్గొండలన్ =కుచము లను కొండలందును, మోహదుర్వారావర్తములన్ = మోహ మను ననివార్యములగు సుడులందును, మునింగి=మునిఁగి, దరిన్ =ఒడ్డును, చేరన్ =చేఁబట్టుకు, రాక=వీలులేక, ఉప్పొంగు=వృద్ధినందునట్టి, సంసారాంభోనిధిన్ = సంసార మనుసముద్రమును, సత్క్రియాతరణిన్ =సత్కర్మలనుపడవచే, నిశ్శంకన్ =నిర్భయముగా, సము త్తీర్ణుఁడై = దాఁటినవాఁడై, ఈపురద్వీపమున్ = ఈపట్టణ మనుదీవిని, చేరును=పొందును.

భా. ఓసత్యభామ! సముద్రమునఁ బడినవాఁడు చేఁపలకును, గొండలకును, సుడులకును జిక్కి యొడ్డుఁజేరక చింతించుగతిని మనుజుఁడు, వనితలదృష్టి లను చేఁపలకును, జన్ను లనుకొండలకును, మోహ మనుసుడులకును వశుఁడై సంసార మను సాగరమును దాఁటఁజాలకయుండును. అట్టివానిని దరిఁజేర్చసత్కర్మకలాపము తరణి యగును. అ త్తరణి మూలమున నీభవసాగరముఁ దాటి యవ్వాఁడీపుర మనుదీవినే చేరుంజుమా! సత్కర్మకలాపమే స్వర్గముఁ జేర్చ నలఁతి యని తాత్పర్యము. అలం. రూపకము.

---

* చూపుచోఁగములన్.

క. అని నాకపురమహత్త్వము
వనితకుఁ దెలుపుచును హర్షవశమానసుఁ డై
దనుజకులవైరి చని యొ
య్యనఁ గాంచనమేదినీధరాగ్రక్షోణిన్. 101

టీ. అని, దనుజకులవైరి = రాక్షసవంశశత్రువు, నాకపురమహత్త్వముక్ = స్వర్గపట్టణమాహాత్మ్యమును, వనితకుక్ = సత్యభామకు, తెలుపుచును, హర్షవశమానసుఁడై = సంతోషాయత్తచిత్తుఁడై, చని=అరిగి, ఒయ్యనక్ = మెల్లఁగ, కాంచనమేదినీధరాగ్రక్షోణిక్ = బంగరుకొండయొక్కశిఖరముల ప్రదేశములందు, 103-వ పద్యముతో నన్వయము.

చ. పతగవిభుండు మింటికయి భంజలికామురళీ[1]సుధాల వ
ల్గితముల రా నెదుర్పడినఖేచరవర్గము లోసరించి య
ద్భుతముగ మ్రొక్క లేనగవుతోఁ గనుఁగొంచు వదాన్యనై చికీ
శితఖురటంకచంద్రకితసిద్ధసరిత్తటమార్గసీమలన్. 102

టీ. పతగవిభుండు=గరుత్మంతుఁడు, మింటిపయిక్ = ఆకాశముపై, భంజలికా మురళీసుధాలవల్గితములక్ = "భంజలిక, మురళి, సుధాల" అనుగతివిశేషములచే, రాక్ =రాఁగా, ఎదుర్పడిన ఖేచరవర్గములు = ఎదురుగా వచ్చు దేవతలసమూహాములు, ఓసరించి=ఒదిగి (ప్రక్కఁబోఁటి), అద్భుతముగక్ =అచ్చెరువుగ, మ్రొక్కక్ =నమస్కరింపఁగా, లేనగవుతోక్ = మందహాసముతో, కనుఁగొంచుక్ =చూచుచు, వదాన్య... సీమలక్ -వదాన్య = మిక్కిలి దానముచేయునట్టి, నైచికీ=ఆవుయొక్క (కామధేనువు యొక్క), శిత=వాఁడియైన, ఖురటంక = డెక్కలను నులుచేత, చంద్రకిత=నెమలిపురి కన్నుల యాకారముగల గుండ్రనిజాడకలదిగాఁ జేయఁబడిన, సిద్ధసరిత్తట = గంగాతీర మందలి, మార్గసీమలక్ =బాటలప్రదేశములందు, ముందటిపద్యముతో నన్వయము.

విశే. భంజలిక-మురళి మొదలగునవి యశ్వగతివిశేషములు. ఏనను నెవరి కెయ్యది వాహన మగునో యద్దాని వారి వారువముగనే భావించి యీగతివిశేషముల దానియందు వర్ణించుట నైజమయ్యె.

క. సరసబిసవిసరముహ[2]రా,హరణోద్ధురహంసిసంసదారవదీర్ఘి
కరణచణగంధవహాములు, శరీరములసేద దేర్పఁ జనుదెంచె రహిన్.

---

1. స్మృతాల. 2. రుద్ధరణో.

టీ. సరస....గంధవహాములు-సరస = రసవంతములగు, (వాడని), బిసవిసర = తామరతూడులసమూహమును, ముహుఃమాటిమాటికి, ఆహరణ=తినుట చేత, ఉద్ధుర = విజృంభించునట్టి, హంససంసత్ = హంసగుంపుయొక్క, ఆరవ=ధ్వనులను, దీర్ఘీకరణ= పొడిగించుటయందు, చణ=సమర్థములైన, గంధవహాములు = కమ్మగాలులు, శరీరముల సేదక్ = ఒడలులయాయాసము, తేర్పక్ =పోగొట్టగా, రహిక్ = ఆనందముతో, చనుదెంచెక్ = వచ్చెను. కర్త-దనుజకులవైరి. 101-102-103 పద్యముల కొకే యన్వయము.

విశే. 'ముహురాహరణ' అనుచో 'ముహురుద్ధరణ' అను పాఠము గానంబడి యెడి, 'ఉద్ధరణ=పెల్లగించుట' అనియాపఱిమున నర్థము. తామరతూండ్లు నాహరించు హంసములయూరవముల వృద్ధినొందించున దనుటంజేసి యీవాయువు పద్మాకరములమీది నుండియే యే తెంచుచున్న దని విశదమగుచున్నది. పద్మాకరములపైనుండి వచ్చుటకతన నీగాలియందు శైత్యమును, సౌరభ్యమును గలవని విశదమయ్యెను. హంసలకు మిగుల సంత సము సంభవింపఁజేయకున్న హంస లధికముగ నారావములు గావించుట పొసఁగదు కావునను, నట్టిసంతోషమునకు మందమారుతమే కారణము కా నోపుటకతననను, హంస సంసదారవపదము చే మాంద్యమును సూచిత మయ్యెను.

శా. సమ్మర్దక్షమ ! ధీనిబంధనవిధాసంక్రందనాచార్య ! శూ
రమ్మన్యాచలవజ్రపాత ! జగతీరక్షాంబుజాక్ష ! శర
ధ్యమ్మార్గస్థదశాస్యరాజ్యసమసహ్యప్రోద్భవాతీరభా
గుమ్మత్తూరి శివంసముద్రపురవ ప్రోన్మూలనాడంబరా ! 104

టీ. సమ్మర్దక్షమ = యుద్ధమందు శక్తుఁడా ! ధీనిబంధనవిధాసంక్రందనాచార్య - ధీ=బుద్ధియొక్క, నిబంధన=ఏర్పాటుయొక్క, విధా = రీతివిషయమున, సంక్రందనా చార్య=బృహస్పతియైనవాఁడా; శూరమ్మన్య...పాత-శూరమ్మన్య=శూరుల మని యను కొనువారలనే, అచల=కొండలకు, వజ్రపాత=వజ్రాయుధప్రహారమైనవాఁడా ! జగతీ రక్షాంబుజాక్ష = భూపాలనమున విష్ణువైనవాఁడా ! శరధ్యమ్మార్గస్థ...డంబరా-శరధి= సముద్రముయొక్క, అమ్మార్గస్థ-అప్=నీళ్ళయొక్క, మార్గ = జాడను, స్థ=ఉన్నట్టియు, దశాస్య=రావణునియొక్క, రాజ్య=రాజ్యముతో, సమ = తుల్యమైనట్టియు, సహ్య = సహ్యపర్వతములయందు, ప్రోద్భవ=పుట్టినదగు కావేరీనదియొక్క, తీర=ఒడ్డును, భాక్ = పొందినట్టియు, ఉమ్మత్తూరు శివసముద్రపుర = 'ఉమ్మత్తూరు, శివసముద్రపురము' అనెడు పట్టణములయొక్క, వప్ర=ప్రాకారమును, ఉన్మూలన = పెల్లగించుటయొక్క, ఆడంబరా = విజృంభణముగలవాఁడా !

వ్యా-విశే. ఇందుఁ గృష్ణరాయల దక్షిణదేశవిజయము ప్రకటితమైనది. ఈరమ్మన్య. రూ. అ. ఈరమాని.

క. తిరుమలదేవీవల్లభ !, కరుణామయహృదయ ! రాజకంఠీరవ ! యీ
శ్వరనరసభూపురందర, వరనందన ! బాసదప్పవరగండాంకా ! 105

టీ. తిరుమలదేవీవల్లభ = తిరుమలదేవికిఁ బ్రియుఁడా ! కరుణామయహృదయ= దయాప్రచురమగు మదిగలవాఁడ ! రాజకంఠీరవ=రాజసింహ ! ఈశ్వరనరసభూపురందర వరనందన = ప్రభువగు నరసరాజను భూలోకదేవేంద్రునియొక్క యుత్తమపుత్రుఁడా! బాసదప్పవరగండాంకా='బాసదప్పవరగండ' అనెడు బిరుదముగలవాఁడా !

స్రగ్విణి.—

నాగమాంబాధిభూనారసింహాత్మజా !
భోగలీలాపరాభూతసంక్రందనా !
త్యాగవిద్యానిషద్యాయితప్రాభవా !
సాగరాంతక్షమాసంపదేకాస్పదా !

టీ. నాగమాంబా...త్మజా-నాగమాంబా = నాగమాంబయొక్క, అధిభూ = అధిపతియైన (పతియైన), నారసింహ = నరసింహరాజునకు, ఆత్మజా = కుమారుఁడైన వాఁడా ! భోగ...సంక్రందనా - భోగలీలా = భోగములవిలాసము, పరాభూత = తిరస్కృతమైన, సంక్రందనా = దేవేంద్రుఁడుగలవాఁడ ! త్యాగ...ప్రాభవా - త్యాగవిద్యా=దానవిద్యకు, నిషద్యాయిత=అంగడియైన, ప్రాభవా = మహిమగలవాఁడ ! సాగరాంత...స్పదా - సాగరాంత = సముద్రము తుదిగాఁ గల, క్షమా = భూమియందలి, సంపత్ = ఐశ్వర్యములకు, ఏక=ముఖ్యమైన, ఆస్పదా=స్థానమైనవాఁడా !

విశే. ఇది స్రగ్విణీవృత్తము. 4 రగణము లొకపాదమున కుండును. ఇట్లే తక్కిన మూఁడుపాదము లుండును. ప్రతిపాదమున మూఁడవగణము మొదటియక్షరము యతిస్థానము.

గద్యము. ఇది శ్రీమదుమామహేశ్వరవరప్రసాదలబ్ధ సారసార
స్వతాభినంది నందిసింగయామాత్యపుత్ర కౌశిక
గోత్రపవిత్ర సుజనవిధేయ తిమ్మయనామ
ధేయప్రణీతం బైనపారిజాతాపహరణం
బను మహాప్రబంధంబునందు
ద్వితీయాశ్వాసము.

# తృతీయాశ్వాసము



మహితగేహా ! యుత్కల
భూమాధవదర్పహరణభుజసార ! సుధా
ధామకులజలధికౌస్తుభ !
రామాపాంచాల ! కృష్ణరాయనృపాలా ! 1

టీ. శ్రీ...గేహ-శ్రీ=సంపదలతో, మహిత=కూడియున్న, గేహ=గృహములకల వాఁడా, ఉత్కల...సార-ఉత్కలభూమాధవ = ఉత్కలదేశపురాజుయొక్క, దర్ప = గర్వమును, హరణ = నశింపఁజేయునట్టి, భుజసార = భుజములబలముగలవాఁడా, సుధా ధామ...కౌస్తుభ-సుధాధామకుల=చంద్రవంశ మనెడి, జలధి=సముద్రమునకు, కౌస్తుభ= కౌస్తుభరత్నమైనవాఁడా! రామాపాంచాల=స్త్రీలకుఁ బాంచాలజాతిపురుషుఁడైనవాఁడా! కృష్ణరాయనృపాలా=కృష్ణరాయభూపా !

తే. అవధరింపుము జనమేజయక్షితీశ,వరున కిట్లను నమ్మానివల్ల భుండు
గగనగంగా ప్రతీరోపకంఠభూమి, నల్లనల్లన నేతెంచునవసరమున. 2

టీ. అవధరింపుము=సావధానముగ నాకర్ణింపుము. అమ్మానివల్లభుండు = ఆమునిశ్రేష్ఠుఁడగు వైశంపాయనుఁడు, జనమేజయక్షితీశవరునకున్ =జనమేజయుఁడను రాజశ్రేష్ఠునకు, ఇట్లు=ఈరీతిగ, అనున్ =అనెను. గగన...భూమిన్ -గగనగంగా = మందాకినియొక్క, ప్రతీర = ఒడ్డుయొక్క, ఉపకంఠభూమిన్ = సమీపప్రదేశమున, అల్లనల్లనన్ =అంతంత, ఏతెంచు=వచ్చునట్టి, అవసరమునన్ =సమయమున.(కృష్ణుఁడు కర్త.)

ఉ. అంతకు మున్న నారదమహాముని చే మఘువుండు కంసుఁ డై
త్యాంతకురాక దా నెఱిఁగి యభ్రమువల్లభు నెక్కి సంభ్రమా
క్రాంతమనస్కుఁ డై యెదురుగాఁ జనుదెంచె జయంతుఁడుం దిశా
కాంతులు మేనకాదిగణికానివహంబులు వెంటఁ గొల్వఁగన్. 3

టీ. అంతకున్ మున్న = అంతకుఁబూర్వమే, మఘువుండు=ఇంద్రుఁడు, నారద మహాముని చే కంసుఁ డైత్యాంతకురాకన్ = శ్రీకృష్ణునిరాకను, తాన్ =ఎఱిఁగి, అభ్రము

వల్లభుఁ = ఐరావతమును ('అభ్రము' అనునది యైరావతనుభార్యపేరు). సంభ్రమాక్రాంతమనస్కుఁడై = త్వరచే నాక్రమింపఁబడిన మది గలవాఁడై, జయంతుఁడు (ఇంద్రునికుమారుఁడు), దిశాకాంతులు = దిక్పతులును, మేనకాదిగణికానివహంబు = మేనక మొదలైన దేవవేశ్యలసమూహమును, వెంట, కొల్వఁగ = సేవింపఁగా, ఎదురుగా, చనుదెంచె = వచ్చెను.

### స్వర్గమున శ్రీకృష్ణు నింద్రాదులు సేవించుట

చ. అమరవిభుండు దూరమున నంబుజనాభునిఁ గాంచి సంభ్రమో
ద్గమమునఁ జేతియంకుశముఖంబునఁ గుంభము లూఁది కుంచితా
గ్రిమచరణంబున న్మదకరిఁ డిగి యంసవిలంబికల్పచే
లము నడుమ న్బిగించుచు నిలానిహితాత్మ శిరఃకిరీటుఁ డై. 4

టీ. అమరవిభుండు = దేవేంద్రుఁడు, దూరమునఁ, అంబుజనాభునిఁ = శ్రీకృష్ణుని, కాంచి=చూచి, సంభ్రమోద్గమమునఁ = త్వరయొక్క పైకిలేచుటచే, చేతియంకుశముఖంబునఁ =హస్తమునందలి యంకుశాగ్రముచే, (ఏనుఁగును గుంభము నదిమి వశీకరించికొనుసాధన మంకుశము), కుంభములు = కుంభస్థలములను (ఏనుఁగుతల నడుమం గలపల్లమున కిరువంకలనుండు నెత్తైన రెండు ప్రదేశములను రెండుకుంభములు గా వ్యవహరింతురుగానఁ గుంభము లని బహువచనము ప్రయుక్తమయ్యెను.) ఊఁది = అణఁచిపట్టి, కుంచితాగ్రిమచరణంబునఁ =వంచఁబడిన ముందటికాలియం దుండి, మదకరిఁ =ఐరావతమును, డిగి=దిగి, (ఏనుఁగుముందటి పాదమును వంచఁగాఁ బిదప నేనుఁగుపైనున్నవాఁడాపాదముపైనుండి క్రిందికి దిగుట సహజము), అంసవిలంబికల్పచేలమునఁ =భుజములనుండి వ్రేలాడు కల్పవృక్షసంబంధమగువస్త్రమును, నడుమఁ =మధ్యమందు, బిగించుచుఁ =బిగియునట్లు కట్టుచు, ఇలా...కిరీటుఁడై-ఇలా=భూమియందు, నిహిత=ఉంచఁబడిన, ఆత్మ=తనయొక్క, కిరీటుఁడై = కిరీటముగలవాఁడై, (అనఁగా శిరసు భువి నంటునటుల నమస్కరించె ననుట.)

భా. ఇంద్రుఁడు దూరమునుండియే శ్రీకృష్ణుఁ గాంచి యంకుశాగ్రముచే నైరావతముశిరసు నదిమి యది మోఁకాలు వంచఁగా నద్దానినుండి దిగి భుజముపై నుండువస్త్రమును నడుమునకుఁ గట్టి తనవెంటఁ దనయుఁడును, దిక్పతులును, దేవవేశ్యలును రాఁగ, నెదురేఁగి శిరస్సు భూమి నింటునట్లు నమస్కరించెను.

విశే. నడుమునకు వస్త్రమును గట్టి నమస్కరించునాచారము విజయనగరరాజుల యాస్థానముల మర్యాదయై యున్నట్లు తెలియవచ్చెడిని. ఇట్లే విజయనగరరాజులకాలములో నుండుకవులు వర్ణించిరి కాన నిది తప్పక యప్పటియాచారమే యన నొప్పును.

చ. జడిగొని సమ్మదాశ్రుకణజాలము లొల్కఁగ రోమహర్షముల్
బడిబడి మేనఁ బాదుకొన భక్తినివేశతరంగితాత్ముఁడై
యడుగులమీఁద వ్రాలె దివిజాగ్రణి తత్కుశలంబు నెమ్మితో
నడిగెడురీతి మాళికుసుమాగతషట్పదపంక్తి మ్రోయఁగన్. 5

టీ. దివిజాగ్రణి=ఇంద్రుఁడు, జడిగొని=ధారగొని, సమ్మదాశ్రుకణజాలములు = ఆనందబాష్పబిందుసమూహములు, ఒల్కఁగన్ =జారఁగా రోమహర్షముల్ = హర్షము వలనిపులకలు, మేనన్ =శరీరమున, బడిబడిన్ =వరుసగా, పాదుకొనన్ = నిల్వఁగా, భక్తి నివేశతరంగితాత్ముఁడై = భక్తియొక్కపొందిక చేత నుప్పొంగినమదిగలవాఁడై, తత్కుశలంబున్ =ఆ శ్రీకృష్ణునిక్షేమమును, నెమ్మితోన్ =ప్రేమతో, అడిగెడురీతిన్ =ప్రశ్నించుగతిని, మాళికుసుమాగత...పంక్తి - మాళి = శిరస్సునందలి, కుసుమ = పుష్పములనుండి, ఆగత=వచ్చిన, షట్పద = తుమ్మెదలయొక్క, పంక్తి = వరుస, మ్రోయఁగన్ = ధ్వనిచేయఁగా, అడుగులమీఁదన్ =పాదములపైని, వ్రాలెన్ =ఒరఁగెను.

భా. ఇంద్రుఁడపుడానందబాష్పధారలొలుక, సంతసమునఁ బులకలు మైజాదుకొన, శిరసున నలంకారముగ నునిచికొనినపుష్పములనుండి యేతెంచు తుమ్మెదలయూరవము శ్రీకృష్ణునికుశలము నడుగు మాటలసద్దువలె నొప్ప, భక్తిమాఱి శ్రీకృష్ణునియడుగులపైఁ బడెను. అలం. ఉత్ప్రేక్ష.

ఉ. ఆదనుజాపహర్తయు భుజార్గళము ల్వేసఁ జాఁచి యంచితా
మోదవికాసవన్నయనముగ్ధసరోరుహపంక్తిఁ బూజల
త్యాదరలీలఁ జేయునమరాధిపుఁ గౌఁగిటఁ జేర్చె నూతనాం
భోదము సానుమచ్ఛిఖరము ర్వభసంబునఁ గప్పుకైవడిన్. 6

టీ. ఆదనుజాపహర్తయున్ =ఆరాక్షసాంతకుఁడగుకృష్ణుఁడును, భుజార్గళముల్ = గడియలఁబోలుభుజములను, వేసన్ =శీఘ్రముగా, చాఁచి, అంచితా...పంక్తిన్ -అంచిత= ఒప్పుచున్న, ఆ మోద=సంతోషముచేత, వికాసవత్ =వికాసముగల, నయన = నేత్రములనే, ముగ్ధ = సుందరమైన, సరోరుహపంక్తిన్ =పద్మములచాలుచే, (అని నేత్రపరము) అంచిత=ఒప్పుచున్న, ఆ మోద = పరిమళముగలవియు, వికాసవత్ = వికాసముగలవియునగు, నయనముగ్ధసరోరుహ=కన్ను లనెడు సుందరములైన పద్మములయొక్క, పంక్తిన్ = చాలుచే, (అని పద్మపరము.) పూజలు=అర్చనలు, అత్యాదరలీలన్ =మిగుల గౌరవముతో, చేయు=ఒనర్చునట్టి, అమరాధిపున్ =దేవేంద్రుని, నూతనాంభోదము = క్రొత్తమేఘము (వార్షికమేఘు మనుట), సానుమచ్ఛిఖరమున్ =పర్వతశిఖరమును, రభసంబునన్ =శీఘ్రముగ, కప్పుకైవడిన్ =ఆచ్ఛాదించురీతిని, కౌఁగిటన్ =కౌఁగిలియందు, చేర్చెన్.

విశే. సహస్రాక్షుఁడు గాన నేత్రపద్మములచాలనెను. సానుమచ్ఛిఖరముపగిది దేవేంద్రుఁడును నంభోదమువలె శ్రీకృష్ణుఁడును నుండిరని యెన్మనది. అలం. శ్లేషోత్థాపితరూపకము. ఉపమ.

మ. అనలుం డంజలిసేసె నంతకుఁడు సాష్టాంగంబు గావించె మ్రొ
క్కె నిశాచారి ప్రచేతసుండు దెలచెం గేల్మోడ్చె సారంగవా
హనుఁ డర్థేశుఁడు వందనం బిడియె నీహారాంశుకోటీరుఁడుఁ
వినతుం డయ్యె యదుప్రవీరునకు నుద్వేలప్రమోదంబునన్. 7

టీ. అనలుండు=అగ్నిదేవుఁడు, యదుప్రవీరునకున్=యదువంశోత్తమవీరుఁడగు శ్రీకృష్ణునకు, ఉద్వేల ప్రమోదంబునన్=అధికమగుసంతోషముతో, అంజలి = దోసిలిని, చేసెన్=ఒనర్చెను. అనఁగా నమస్కరించె ననుట. అంతకుఁడు=యముఁడు, సాష్టాంగము=సాష్టాంగనమస్కారము, కావించెన్ = చేసెను. నిశాచారి=నైరృతుఁడు, మ్రొక్కెన్, ప్రచేతసుండు = వరుణుఁడు, తెలచెన్ = నమస్కరించెను. సారంగవాహనుఁడు=లేఁడి వాహనముగాఁ గలవాయువు, కేల్మోడ్చెన్ = అంజలియొనర్చెను. అర్థేశుఁడు = ధనపతి యగు కుబేరుఁడు, వందనంబు=నమస్కృతి, ఇడియెన్ = పెట్టెను, నీహారాంశుకోటీరుఁడున్-నీహారాంశు = చంద్రుని, కోటీరుఁడు = కిరీటమునఁ గలవాఁడు, ఈశానుఁడు, వినతుండయ్యెన్=నమ్రుఁడయ్యెను.

విశే. నిశాచారి = రాత్రిసంచరించువాఁడు = రాక్షసుఁడు = నైరృతి. సాష్టాంగము:—వక్షము, శిరస్సు, దృష్టి, మనస్సు, మాట, పాదములు, చేతులు, జానువులు ఇవి యష్టాంగములు. వీనితోఁజేయు నమస్కృతి సాష్టాంగము.

శా. వారిం జూచి రథాంగపాణి సరసవ్యాహారలీలన్దర
స్మేరాపాంగవిలోకనక్రియల సంప్రీతాత్ములం జేసి గో
త్రారి! రమ్ము గజమ్ము నెక్కు మని నాగారాతిపై నెక్కఁ దా
రారంభాకరచామరానిలము మార్గశ్రాంతిఁ దూలింపఁగన్. 8

టీ. రథాంగపాణి = చక్రము హస్తమందుఁ గల శ్రీకృష్ణుఁడు, వారిన్ = ఆ నమస్కరించువారిని, చూచి, సరస...లీలన్-సరస=రసయుతమైన, వ్యాహార = మాటల యొక్క, లీలన్ =విలాసముచేతను, దరస్మేర...క్రియలన్-దరస్మేర = మందహాసయుత ములైన, అపాంగవిలోకన = క్రేగంటిచూపులయొక్క, క్రియలన్ = వ్యాపారముల చేతను, సంప్రీతాత్ములన్ = సంతుష్టినందింపఁబడిన మదిగలవారినిగా, చేసి, గోత్రారీ =

కొండలకు శత్రువగు నోయింద్రా! రమ్ము, గజమ్ముక్ =నీనుఁగును, ఎక్కుము, అని, నాగా రాతిపైక్ = పాములకు శత్రువగు గరుడునిపై, తారా...నిలము-తారారంభా = తార, రంభ అను నప్సరస్త్రీలయొక్క, కర=హస్తములందలి, చామర = విజామరములసంబంధమైన, అనిలము=గాలి, మార్గశ్రాంతిక్ =మార్గాయాసమును, తూలింపఁగక్ =పోఁగొట్టఁగ, ఎక్కెక్ =అధిష్ఠించెను.

భా. శ్రీకృష్ణుఁడు తనకు నమస్కరించు కొందఱను సరసంపుఁబలుకుల చేతను, గొందఱను గ్రేఁగంటిచూపుల ప్రసారముల చేతను గారవించి, యింద్రుని గజము నెక్కుమని యానతిడి, రంభాద్యప్సరసలు తన్ను విజామరములువట్టి వీచుచు సేవింప నెలమితోడ గరుడు నధిష్ఠించెను.

క. తక్కినదిశాధినాథులు,నెక్కిరి నిజవాహనముల నెసఁగె హుడుక్కా
ఢక్కాపటహాధ్వానము, లక్కజముగఁ బొంగి నింగి యఱచినభంగిన్.

టీ. తక్కిన=మిగిలిన, దిశాధినాథులుక్ = దిక్పతులును, నిజవాహనములక్ = స్వవాహనములను, ఎక్కిరి, హుడుక్కా...ధ్వానములు - హుడుక్కా, ఢక్కా, పటహ అను వాద్యవిశేషములయొక్క, ధ్వానములు = శబ్దములు, పొంగి=నిండి, నింగి = ఆకాశము, అఱచినభంగిక్ =కూసినరీతిని, అక్కజముగక్ =ఆశ్చర్యముగ, ఎసఁగెక్ = అతిశయించెను.

ఉ. ఆయెడ సిద్ధకింపురుషయక్షవసుప్రముఖామరావళిం
బాయఁ దొలంగు మంచు శతమన్యుఁడు సందడివో బరాబరు
ల్సేయఁగ నల్లనల్ల నతసీకుసుమాసితదేహుఁ డేఁగె వై
హాయసవీథి నారదముఖామరసంయమికీర్తనీయుఁ డై. 10

టీ. ఆయెడక్ =ఆసమయమున, సిద్ధకింపురుషయక్షవసుప్రముఖామరావళిక్ = సిద్ధులు, కింపురుషులు, యక్షులు, వసువులు మున్నగు దేవతలపంక్తిని, పాయక్ = పాయఁగా, (అనఁగా నడుమ దారియుండునట్లు), తొలంగుము=మానులుము, అంచుక్, శతమన్యుఁడు = నూఱుయజ్ఞములంజేసిన దేవేంద్రుఁడు, సందడి = సమ్మర్దము, పోక్ = పోవునట్లు, బరాబరుల్ = హెచ్చరికలు, చేయఁగక్ = చేయఁగ, అల్లనల్లక్ = మెల్ల మెల్లఁగా, అతసీకుసుమాసితదేహుఁడు = నల్లని యవిసెపూవులవలె నల్లనైన శరీరముగలవాఁడు; శ్రీకృష్ణుఁడు, నారదముఖా...నీయుఁడై-నారదముఖ = నారదుఁడు మొదలైన, అమరసంయమి = సురమునులచే, కీర్తనీయుఁడై = నుతిచేయఁబడువాఁడై, వైహాయసవీథిక్ =ఆకాశమార్గమున, ఏఁగెక్ =చనెను.

ఉ. అప్పుడు శౌరిఁ జూచుప్రమదాతిశయంబు హృదంతరంబులం
జిప్పిల సంభ్రమించి కయిసేయుతెఱం గయథాతథంబుగాఁ
*గుప్పనఁ గూరి యొండొరులఁ గూడఁగనీక కడంగి వేలుపుం
గప్పురగందు లెక్కిరి ధగద్ధగితోన్నతహర్మ్యరేఖలన్. 11

టీ. వేలుపుంగప్పురగందులు = దేవతాస్త్రీలు, అప్పుడు=ఆసమయమున, శౌరిన్ = శ్రీకృష్ణుని, చూచుప్రమదాతిశయంబు=చూడవలె ననుసంతోషాతిశయము, హృదంతరంబులన్ =మదిలో, చిప్పిలన్ =నిండఁగా, సంభ్రమించి=త్వరపడి, కయిసేయుతెఱంగు= అలంకరించుకొనురీతి, అయథాతథంబుగాన్ = తొఱుమాఱుకాఁగ, కుప్పనన్ =పోకగా, కూరి=కూడి, ఒండొరులన్ =పెఱవారిని, కూడఁగనీక=చేరఁగానీయక, కడంగి=యత్నించి, ధగద్ధగితోన్నతహర్మ్యరేఖలన్ = ధగధగమని మెఱయుచున్న యెత్తైన హర్మ్యపంక్తులను, ఎక్కిరి.

విశే. యథాస్వేయథాయథమ్. యథాయథముకానిది యయథాయథము.

చ. అలఁదినచందనంబు వృథ యాఁ జెమరింపఁగ సమ్మదాశ్రులన్
దొలఁచినయట్లు వోయెడుఁ గనుంగవకాటుక బేటులెత్తుఁ జె
క్కుల మకరీవిలాసము గగుర్పొడువన్ హరిఁ జూచువేళ నో
చెలి! కయిసేయకమ్మ యని చేడియయొక్కతె పిల్చె నెచ్చెలిన్. 12

ఇప్పద్యము మొదలుకొని 21-వ పద్యమువఱకు దేవవనితలకు శ్రీకృష్ణుని సందర్శించుటలోఁ గల త్వరాతిశయ ముత్సాహము మున్నగునవి వర్ణితము లగుచున్నవి. సంస్కృతాంధ్రకావ్యములం దిట్టివర్ణనములు సదృశములై సాధారణముగ గోచరించును.

టీ. హరిన్ =శ్రీకృష్ణుని, చూచువేళన్ = చూచెడుసమయమున, అలఁదినచందనంబు=రాచుకొనినగంధము, చెమరింపఁగన్ = చెమ్మటపుట్టఁగా, వృథ=వ్యర్థము, పోన్ = అగును. కనుంగవకాటుక = నేత్రద్వంద్వముయొక్కయంజనము, సమ్మదాశ్రులన్ = ఆనందబాష్పములచే, తొలఁచినయట్లు = కడిగివేసినరీతిని, పోయెడున్ = నశించెడిని, జెక్కులమకరీవిలాసము=చెక్కిళ్లయొక్క మకరికాపత్రరచనలసొగసు, గగుర్పొడువన్ =రోమాంచము జనింప, పేటులెత్తున్ = పొరలెత్తును, ఓచెలి = ఓసఖీ! కయిసేయకమ్మ=అలంకరించుకొనకమ్ము, అని, ఒక్కతె, చేడియ=వనిత, నెచ్చెలిన్ = ప్రియసఖిని, పిల్చెన్ =రమ్మని పిల్చెను.

భా. ఓసఖీ! శ్రీకృష్ణునిఁ జూచుసపుడు స్వేదము జనింపకమానదు. దాన మైపూఁత కరఁగిపోవును. కాటుక యానందబాష్పధారలచే కడిగివేయఁబడును. మకరికాపత్రరచ

---

* గుప్పలఁ గూరి.

నలు పులకలులేచుట పొరలెత్తును. కావున నలంకరించుకొనుటలోఁ బ్రయోజన మగ పడదు. అక్కారణమున నాప్రయత్నము మాని వేగ హరిఁ జూడ రమ్మని యొకచేడియ తనగాదిలిసఖిం బిలిచెను.

వ్యా-విశే. అగు=అవు=డో. కయి=కై. కయిసేయకమ్మ = కై సేయకుము + అమ్మ. శ్రీకృష్ణునిం జూచునపుడు స్వేదోద్గమము, సాత్వికోదయము మున్నగునవి తప్పక కల్గ ననుటంజేసి శ్రీకృష్ణుఁడు సర్వమహాపురుషలక్షణలక్షితుం డగు సుందరుం డని తెలియ నయ్యెడు.

చ. వనిత యొకర్తు మునొ్కని గవాక్షతలంబున నింతు లుండుటం
గనుఁగొనఁ జోటు లేమి నొకకార్యముపేరిట బాలనోర్తు వం
చనఁ దొలఁగంగఁ బిల్చి రభసంబునఁ దత్సతిజాలకంబు చె
కొని హరిఁ జూచెఁ గేకిసలుగొట్టుచు బోఁటులు దాని నవ్వఁగన్. 13

టీ. ఒకర్తు వనిత=ఒకస్త్రీ, మునొ్కని = ముందుగొని, గవాక్షతలంబునన్ =కిటికీ యందు, ఇంతులు=స్త్రీలు, ఉండుటన్ =ఉండుటచే, కనుఁగొనన్ =(శ్రీకృష్ణుని) చూచు టకు, చోటు=స్థలము, లేమిన్ = లేకపోవుటచే, ఒకకార్యముపేరిటన్ =ఒకానొకపని పేరుతో, ఓర్తు బాలన్ =ఒకకన్యను, వంచనన్ = మోసముతో, తొలఁగంగన్ = మరలి వచ్చినట్లుగా, పిల్చి, రభసంబునన్ =శీఘ్రముగ, తత్సతిజాలకంబు=తద్వనిత (కూర్చుండి యున్న) గవాక్షదేశమును, బోఁటులు=(ఇతర)వనితలు, దానిన్ =ఆతావును బోఁగొట్టు కొనినవనితను, కేకిసలు = కరతాళములు, కొట్టుచున్, నవ్వఁగన్ =పరిహాసముచేయఁగా, హరిన్ =శ్రీకృష్ణుని, చూచెన్.

భా. ఒకవనిత శ్రీకృష్ణునిం జూడఁ గిటికీదరి కేఁగి యందు స్త్రీలు నిండియుంటఁ దావుదొరకమి నొకముగ్ధను బాలిక నొకానొకపనిసెపమునఁ బిల్చి యయ్య దాతావు వీడిరాఁగ నాస్థానమును దాఁబోయి యాక్రమించికొని, వంచితయైనబాలికను బెఱి వనితలు చప్పటలుగొట్టి పరిహసించుచుండఁగా శ్రీకృష్ణునిం గాంచెను.

వ్యా-విశే. ఓర్తు, ఒకర్తు, ఒకరిత, ఒకర్త. ఇత్యాదు లూహ్యములు. లేమి - వ్యతిరేకభావంబున మిడి యగును. ఇట్లే రామి, కామి, డొహ్యాములు. బాల గావునసే వంచనకు లోఁబడియె నని సారస్యము సెన్నునది.

ఉ. కాళియభేదిఁ జూచుతమకంబున మజ్జన మాడి యాడి నీ
లాలక యొర్తు గంధసలిలార్ద్రకచంబులు చన్నుదోయిపై
వ్రాలిన సందిటం బొదివి రాజపథంబున కేఁగుదెంచె గో
పాలకమూర్తిఁ గాన శిఖబర్హము కాసుక దెచ్చెనో యనన్. 14

టీ. ఓర్తు=ఒకతె, నీలాలక=నల్లనిముంగురులుగలది, కాళియభేదిక్ = కాళియుఁడను సర్పరాజును భేదించిన శ్రీకృష్ణుని, చూచుతమకంబునక్ = చూచుటయందలి తొందరచే, మజ్జనము=స్నానము, ఆడియాడి = చేసిచేసి, గంధసలిలార్ద్రకచంబులు=పరిమళించు నుదకముచేఁ దడిసిన తలవెండ్రుకలును, చన్నుదోయిపైక్ = స్తనద్వంద్వముపై, వ్రాలినక్ =పడఁగా, సందిటక్ = రెండుచేతులమధ్యను, పొదివి = అణఁచిపట్టికొని, శిఖబర్హము=నెమిలిపించెము, కానుక=సూడిద, తెచ్చెనో అనక్ = తెచ్చెనో యనునట్లు, గోపాలకమూర్తిక్ =గోపాలకుఁడగు నాకృష్ణుని యాకృతిని, కానక్ =చూచుటకై, రాజపథంబునక్ =రాజమార్గమున, వీఁగుదెంచెక్ = వచ్చెను.

భా. ఒకవనిత తా స్నానమాడి యూడి శ్రీకృష్ణునిరాక విని త్వరచే తడియారని కురులను స్తనములపైఁ బడుచుండువానిని, సందిటఁబట్టి గోపాలునకు శిఖిపించము కానుక తెచ్చుచున్నదో యనురీతిని రాజమార్గమున శ్రీకృష్ణుఁ జూడ నేతెంచెను.

విశే. గోపాలకమూర్తిని గానవచ్చెడు గాన నవ్వనిత యాతనికిఁ బ్రియమైన శిఖిపించము కానుక తెచ్చె నని చెప్పుట యొంతయు హృద్యము. మఱియు నీలాలకములు గంధసలిలార్ద్రములు నెమ్మిపించియమువలె నున్న వని గ్రహించునది. కాన నీలాలకపదము సాభిప్రాయ మని యెన్నునది.

ఉ. ఉన్నతసౌధ మెక్కి యనృతోదరి యొక్కతె పద్మనాభుఁ జూ
డన్నిజదేహవల్లికఁ గడలొక్కనుసాత్త్వికలీలఁ జూచునా
సన్నసఖీజనంబు గని సౌధశిఖాగమనశ్రమంబునం
గన్నియలార ! మేన్బడలెఁ గంటిరె నాకని బొంకె నేర్పునన్. 15

టీ. ఒక్కతె, అనృతోదరి = అసత్యమైననడుము గలది, ఉన్నతసౌధము = ఎత్తైనమేడ, ఎక్కి, పద్మనాభుక్ =తమ్మిబొడ్డునంగల శ్రీకృష్ణుని, చూడక్ =చూడఁగా, నిజదేహవల్లికక్ =తీఁగంబోలు తనశరీరమునందు, కడలొక్కను=వ్యాపించునట్టి, సాత్వికలీలక్ = సాత్వికవిలాసమును, (అనఁగాఁ గగుర్పాటు ననుట), చూచు = చూచుచున్న, ఆసన్నసఖీజనంబు=సమీపమున నున్న చెలికత్తెలగుమిని, కని = చూచి, సౌధ...శ్రమంబునక్ సౌధశిఖ=ప్రసాదశిఖరమునకు, ఆగమన = వచ్చుటయందలి, శ్రమంబునక్ = ఆయాసముచే, కన్నియలార=ఓకన్యలార ! నాకుక్, మేను=శరీరము, బడలెను = అలసెను. కంటిరే=చూచితిరే, అని, నేర్పునక్ =నైపుణితో, బొంకెను=అసత్యము పలికెను.

భా. ఒక సూక్ష్మమధ్య శ్రీకృష్ణని గాంచినకతన తనమెయి వ్యాపించిన సాత్వికలీల నెత్తైనమేడ యెక్కుటచే శరీరమునకుఁ గర్ణనశ్రమచేఁ గల్గె నని యాసాత్వికలీలం గాంచు, తోడుచేడియలకుఁ దెల్పుచు నద్దాని మఱుఁగుపఱిచికొన యత్నించెను.

విశే. అన్యతోదరి కావునసే యన్యతమురు బల్కఁజాలె నని సారస్యము నెన్నునది. సన్ననినడుము గలిగియుండుటయు దేహము వన్నికవలె నమరియుండుటయు నున్నత సౌధారోహణము శ్రమజనక మయ్యె ననుటలోఁ గారణములుగ నెన్న నగును. అలం. వ్యాజోక్తి.

ఉ. వేడుక నీకె కాని మఱి వేఱొకయింతికి నైన లేదె త్రో
పాడెద *వేల మచ్చర మొకప్పుడు మానక పోయి తీవు పెం
బ్రోడవు గాన నిన్నె కనుఁబో యతఁ డెవ్వరిఁ జూడఁ డంచు నో
నాడె సపత్ని నొక్కఁతె మురారిఁ గనుంగొనువేళ నీసునన్. 16

టీ. వేడుక=ఉత్సాహము, నీకె, కాని, మఱి, వేఱొకయింతికిన్ = అన్యవని తకు లేఁదె? త్రోపాడెదవు+ఏల=త్రోసివేయుచుంటి వెందులకు? ఈవు, ఒకప్పుడున్ = ఒకసమయమునను, మచ్చరము=మాత్సర్యము, మానకపోయితి = విడిచితివి గావు, పెన్ బ్రోడవు = పెద్దబ్రోడవు = మహాప్రౌఢురాలవు, కానన్ = కాఁబట్టి, నిన్నె, అతఁడు, కనుఁబో=చూచునుజుమ్ము, ఎవ్వరిన్, చూడఁడు, అంచున్ =అని పలుక్కుచున్, ఒక్కతె మురారిన్ = మురద్విషుఁడగు శ్రీకృష్ణుని, కనుంగొనువేళన్ =శ్రీకృష్ణుం జూచుసమయమున, సపత్నిన్ =సవతిని, ఈసునన్ = ఈర్ష్యచే, నోన్ = నొచ్చునట్లుగా, ఆడెన్ = పలికెను.

భా. ఒకవనిత వేడ్కతోఁ గొంచెము ముందున్న సపత్నిం ద్రోసికొనుచు శ్రీకృష్ణునిం జూడ నుంకింప నామెసవతి యసూయతో, "ఓసీ! ఒకపుడును నీవు మత్సరమును మానలేదు. పెద్దప్రౌఢవు గాన నిన్నే యాత్రఁడు చూచును గాని వేఱొకతెం జూడఁడు." అని సాధిక్షేపముగ మది నొచ్చునట్లు సపత్నింగూర్చి పలికెను.

వ్యా-విశే. 'నిన్నే చూచు. పెఱవనితను జూడఁడు.' అనుయుక్తి మానవతిమదిని నోవఁజేయున దని యెన్ననది. పో. రూ. అ. పొమ్ము. ఇది నిశ్చయార్థకము. నోన్ - నొచ్చుధాతునుజ్యంతరూపము. రూ. అ. నోవన్. ఊరకే యతినిష్ఠురముగఁ బల్కిన కతన యసూయ తెల్లమగుచున్నది.

చ. అలికులవేణి యొక్కతె మురారిఁ గనుంగొని ప్రానుపాటుమై
నెలకొన నున్న చో సడలునీవిక లేఁజెమ రంటి నిల్పె నం
జలిపరిపూర్ణలాజలను సాధ్వసకంపము దాన చల్లెన
చ్చెలువకు సాత్త్వికోదయము చేసినమే లిఁక నేమి చెప్పుదున్. 17

* వేలె.

టీ. ఒక్కతే, అలికులవేణి = తుమ్మెదగుమింబోలు జడగలది, మురారిన్ = శ్రీకృష్ణుని, కనుంగొని=చూచి, మ్రానుపాటు = స్తంభము (నిశ్చలత), మైన్ = శరీరమున, నెలకొనన్ =నిల్వఁగా, ఉన్నచోన్ =ఉండుసమయమున, సడలుసీవికన్ = వదలినవస్త్రగ్రంథిని, లేఁజెమరు=చిఱుచెమ్మట, అంటి=హత్తి, నిల్పెన్ =నిలిపెను. సాధ్వసకంపము = భయముచేనైనవణఁకు, అంజలిపరిపూర్ణలాజలము = దోసిలియందు నిండియున్నపేలాలను, తాన=తానే (స్వయముగానే) చల్లెను, అచ్చెలువకున్ =ఆస్త్రీకి, సాత్వికోదయము= స్తంభప్రళయరోమాంచాదులపుట్టుక, చేసిన=ఒనర్చిన, మేలు, ఇఁకన్, ఏమి చెప్పుదును?

భా. ఒకవనిత శ్రీకృష్ణుం గాంచి నిశ్చలయై నిల్చియుండెను. అపు డామెకు మేనఁ జెమ్మటయుఁ గంపము నుదయమయ్యెను. అందుఁ జెమ్మట వస్త్రగ్రంథి జాఱినను దానంటుకొని జాఱకుండఁజేసెను. కంప మవ్వనిత చేత నున్న లాజలను తనంతతానే యామె కాపనిమూలమున నైనశ్రమ కలుగఁజేయక చల్లెను. ఇట్లు స్వేదము కంపము మున్నగు సాత్వికము లెంతయు నుపకరించెను. అనఁగా నీవి జాఱినను జెమ్మటయంటియుంట జాఱ లే దనియుఁ, బ్రయత్నింపకయే కంపమువలన చేతనున్నలాజలు చల్లఁబడె ననియు భావము.

వ్యా-విశే. స్తంభము, ప్రళయము, రోమాంచము, స్వేదము, వైవర్ణ్యము, వేపథువు, అశ్రువు, వైస్వర్యము అనునీయెనిమిదియు సాత్వికములు. ఆ + చెలువ=అచ్చెలువ.

క. మదవతి యొకతె పరాకునఁ
బదాంగదము గంకణముగఁ బాణిఁ దొడిగెన
య్యదువల్లభుఁ గనుఁగొనుచుం
దుది నదియును మేను వొంగి తుత్తుము రయ్యెన్. 18

టీ. ఒకతె, మదవతి=మదముగలపడఁతి, పరాకునన్ =ఏమఱుపాటుతో, అయ్యదువల్లభున్ = ఆశ్రీకృష్ణుని, కనుఁగొనుచున్ =చూచుచు, పదాంగదము = కాలియందెను, కంకణముగన్ =హస్తాభరణ మగునట్లు (కడియ మగునట్లు) పాణిన్ =హస్తమున, తొడిగెన్ =ధరించెను. తుదిన్ =అంతమున, అదియును = ఆకంకణముగా హస్తమునకుఁ దొడిగినకాలియందెయు, మేను=శరీరము, పొంగి=ఉబ్బి, తుత్తుమురు=చిన్న చిన్న ముక్కలు, అయ్యెన్.

భా. ఒకతె కాలియందెను చేతికిఁ గంకణముగా నిడఁగ నది శ్రీకృష్ణుని జూచుట కతన శరీర ముబ్బుటంజేసి తునియ లయ్యెను. అనఁగా శ్రీకృష్ణసందర్శనజాతసంతోషాతిశయమున మే నుబ్బె ననియుఁ, నక్కతన నంతకుమున్ను వదలుగ నున్న యందియ యపుడిటుకై యుండనవకాశము చాలక తునియ లయ్యె ననియు భావము.

వ్యా-విశే. మదవతికావునసే పరాకునఁ బదాంగదము చేతికిఁ దొడుగుకొను టయు, శ్రీకృష్ణుం గాంచినంతనే యుబ్బినశరీరముగలదగుటయు సంభవించె నని సారస్యము నెన్నునది. తుమురు + తుమురు=తుత్తుమురు. ఆమ్రేడితము పరమగు డంబదుకు ప్రభృతులు యథాప్రయోగముగ గ్రాహ్యములు.

చ. దనుజవిరోధిమీఁద నొకతన్వి కరంబున లాజ లెత్తి చ
ల్లిన నెఱిచేణి యీసునబలె న్వికిపూవులఁ జల్లెఁ జల్లె లో
చనములు సమ్మదాశ్రువులఁ జల్లె లలాటము ఘర్మబిందువుల్
చనుఁగవ సల్లె సంభ్రమవశత్రుటితామలమౌక్తికావళుల్. 19

టీ. ఒకతన్వి = ఒకయువతి, దనుజవిరోధిమీఁదన్ = రాక్షసవిరోధి యగు కృష్ణునిపై, కరంబునన్ = చేతిచే, లాజలు = పేలాలు, ఎత్తి = సేకరించి, చల్లినన్, నెఱిచేణి = మనోహర మగు కొప్పు, ఈసునన్ = ఈర్ష్యచేతనువలె, విరిపూవులన్ = వికసించినపుష్పములను, చల్లెన్. లోచనములు = నేత్రములు, సమ్మదాశ్రులన్ = ఆనందబాష్పములను, చల్లెన్, లలాటము = నుదురు, ఘర్మబిందువుల్ = చెమ్మటబొట్టులను, చల్లెన్. చనుఁగవ = స్తనములజంట, సంభ్రమ.....వళుల్ - సంభ్రమవశ = తొందరపాటుచే, త్రుటిత = తెగిన, అమల = స్వచ్ఛమైన, మౌక్తికావళుల్ = మంచి ముత్తియములవరుసను, చల్లెన్.

భా. ఒకానొకతన్వి శ్రీకృష్ణునిపై లాజలను జేతితోఁ జల్లఁగా, నామె కొప్పును నేమాత్రము చల్లలేనా? ఆమెకంటె వేగముగ నే చల్లెద ననుసీసుమై వికసించిన పూవులఁ జల్లె ననియు, నాపై నేత్రము లానందబాష్పములఁ జల్లె ననియు, నంత నెన్నుదురు ఘర్మకణములఁ జల్లె ననియు, నాపిదప స్తనద్వంద్వము సంభ్రమమున తెగినముత్యముల చాలుం జల్లె ననియు భావము.

వి. అత్తన్వి లాజలం జల్లినపిదప మదనపరవశ యగుట, నామె కొప్పు వీడి యందలి సుమములు రాలె ననియుఁ, లోచనములు బాష్పోదయముతో సంకలితము లయ్యె ననియు, సాత్వికోదయముకతన నెన్నుదురు చెమ్మటం దడిసె ననియు, స్తనసంభ్రమాదుల కతన ముత్తియములు హారములనుండి తెగి పడియె ననియు నెన్నవలయును. ఇందు కాము కీధర్మము ప్రకాశితము. పేలాలు, విరిపూవులు, బాష్పకణములు, చెమటబొట్టులు, ముత్తియములు ఇవి పరస్పర మచ్ఛము లగుట సదృశములని కవి యెన్నెను. అలం. సముచ్చయము.

చ. జలరుహనేత్రుఁ గాంచి సరసత్వము మీఱఁగ నొక్కవేలుపుం
జిలుకలకొల్కి రాచిలుకచేఁ బిలిపించిన సత్యభామ కా

కలికితెఱంగు శౌరి కడకన్నులసన్నలఁ జూపెఁ గోపక
న్దళకలుషాయితాక్షివలనంబుల నాసతి దన్నదల్పఁగన్. 20

టీ. ఒక్కవేలుపుంజిలుకలకొల్కి=ఒకదేవవనిత; సురాంగన, జలరుహనేత్రుర్ = పద్మనాభుని, కాంచి = చూచి, సరసత్వము = శృంగారరసము, మీఱఁగ = అతిశయించునట్లుగాఁ, రాచిలుకచేఁ = చిలుకమిన్న చేత, పిలిపించిన = పిలుచునట్లు చేయఁగా, శౌరి=శ్రీకృష్ణుఁడు, ఆకలికితెఱంగు = ఆస్త్రీయొక్కజాడను, సత్యభామకు, కడకన్నులసన్నల్ = కన్గొనలసంజ్ఞలచే, ఆసతి=ఆవేల్పుపడఁతి, తన్ను=శ్రీకృష్ణు ననుట. కోప...వలనంబుల = కోపాంకురదళ=కోపాంకురముల చే, కలుషాయిత=కలఁతనందు, అక్షి= నేత్రములయొక్క, వలనంబుల = చాలనముల చే, అదల్పఁగ = భయపెట్టుచుండ, చూపెన్ = అగపఱిచెను.

భా. ఒకవేల్పుజాణ శ్రీకృష్ణుని సరసముగఁ బెంపుడుచిలుకమిన్న చేఁ బిలిపింప నాపసితజాడను, దన్నావేల్పుపడఁతి కోపాంకూరముల కలఁతనందిన నేత్రములచాలన మున భయపెట్టుచుండ, సత్యకు శ్రీకృష్ణుఁ డగపఱిచె నని భావము.

విశే. చిలుక 'కృష్ణ! కృష్ణ!' యని పల్కుట సైజము. మఱియుఁ బిలువు మని ప్రోత్సహింపఁ దనకు నిసర్గసిద్ధమగుమాటనే ముద్దుగఁ బల్కె నని యెన్నునది. ఎంతటి మోహ మున్నను జెఱివనితకుఁ దన మోహపుఁజెయిదమును బయలుపఱుప మానిను లిచ్చ గింపకుండుట సహజము. అందును దన మోహామునకుఁ దావలపైనవాఁడే తనభార్యతోఁ దన మోహపుఁగృత్యమును బయలుపఱచునపుడు వానిని సహించుట యరిది. కావునఁ నే యవ్వేలుపుజాణ శ్రీకృష్ణు నదల్చినది. శ్రీకృష్ణుఁ డిట్లు సురాంగనాకృత్యము సత్యకుఁ జూపుట తనసౌందర్యమహిమాప్రకాశనార్థము, దన్మూలమున సత్యానురాగము మఱింత యతిశయింపఁ జేయుటకొఱకును సైన దని యెన్నవలెను.

క. అనిమిషపురజాలకములు
వనితాజనతామయములు వనితలహృదయం
బనురాగరసమయం బ
య్యనురాగము శౌరిమయము నయ్యెడ నయ్యెన్. 21

టీ. అనిమిషపురజాలకములు=అమరావతీపురమునందలి గవాక్షములు, వనితాజన తామయములు=స్త్రీజనసమూహముచేఁ బూర్ణములై నవి, వనితలహృదయంబు=స్త్రీలమది, అనురాగరసమయంబు=శృంగారరసపూర్ణము. అనఁగాఁ (ప్రేమచే నిండిన వనుట) అయ్యను

రాగము=ఆప్రేమ, శౌరిమయమున్=శ్రీకృష్ణమయమును, అయ్యెన్; దీని కన్నివాక్యములతో నన్వయము.

భా. అమరావతీనగరమునందలి యిండ్లగవాక్షములెల్లను స్త్రీలతో నిండియున్నవనియు, నాస్త్రీలనురాగపూర్ణులై యొప్పిరనియు, నయ్యనురాగము శ్రీకృష్ణమయమైపరఁగె ననియు భావము. అనఁగా నందలిస్త్రీలెల్లరు శ్రీకృష్ణవిషయకానురాగమునఁబూర్ణులై పరఁగి రని తాత్పర్యము.

చ. కనుఁగొన వేడ్కలం బొడమఁ గాయ్వుల నచ్చర లీసడించుట
ల్వినుచుద రస్మితం బొలయ వెన్నుఁడు రాజపథంబు దాఁటి య
య్యనిమిషనాథు గేహబహిరంగణభూస్థలి డిగ్గి వైనతే
యుని మణిచిత్ర వేత్రకరహుంకృతి దిక్కులు పిక్కటిల్లఁగన్. 22

టీ. కనుఁగొనన్=చూచుటకై, వేడ్కలన్=ఉత్సాహముల చేత; పొడము=పుట్టునట్టి, కాయ్వులన్=అనురాగములతో, ఈసడించుటల్=నిందించికొనుటలను, వినుచున్, వెన్నుఁడు=శ్రీకృష్ణుఁడు, దరస్మితంబు=మందహాసము, ఒలయన్=వ్యాపింపఁగా, రాజపథంబున్=రాజమార్గమును, దాఁటి = అతిక్రమించి, అయ్యనిమిషనాథు = దేవేంద్రునియొక్క, గేహ=ఇంటియొక్క, బహిరంగభూస్థలిన్ = ముంగిలివాకిలియందు, మణిచిత్రవేత్రకరహుంకృతిన్=మణిఖచితములైన చిత్రములగు బెత్తములఁ బట్టుకొన్నవారియొక్క హుంకారము చే, దిక్కులు = దిశలు. పిక్కటిల్లఁగన్ = బ్రద్దలుకాఁగ, వైనతేయునిన్=గరుడుని, డిగ్గెన్=దిగెను. గరుడుఁడుండి యని యర్థము.

వ్యా-విశే. విష్ణుఁడు-వి. వెన్నుఁడు. వైనతేయుఁడనఁడి దిగును. ఉండిపదము పరమగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికముగ నగు. వైనతేయుని డిగ్గెను.

క. ఆదరమున శతమన్యుఁడు
కైదండ యొసంగ యామకరిదానఝరీ
మేదురకక్ష్యత్రితయము
నాదనుజవిరోధి గడచి యటుఁ జని యెదుటన్. 23

టీ. ఆదరమునన్ =ప్రేమతో, శతమన్యుఁడు=ఇంద్రుఁడు, కైదండ=చేయూఁత, ఒసంగన్ =ఈయఁగా, ఆదనుజవిరోధి=శ్రీకృష్ణుఁడు, యామ...త్రితయమున్-యామకరి=జాముకావలియేనుంగులయొక్క, దానఝరీ=మదప్రవాహము చే, మేదుర=సాంద్రమైన, కక్ష్యత్రితయమున్ =మూఁడుకక్ష్యలను, కడచి=అతిక్రమించి, అటన్ =అచ్చోటికి, చని, ఎదుటన్ =ముందుపద్యముతో నన్వయము.

శ్రీకృష్ణుఁడదితినిఁ జూచుట

సీ. తొడలపైఁ జాఁచిన యడుగుఁగెందమ్ముల
నొయ్యనఁ బౌలోమి యొత్తుచుండఁ
బార్శ్వభాగంబునఁ బంకేరుహాసను
కామినీరత్నంబు కతలు సెప్పఁ
బనిఁబూని యంతంత వినయావనతవృత్తి
సప్తర్షికాంతలు సంచరింప
వీజనచామరవీటీకరండాది
కములు దిక్పతిసతీగణము దాల్ప

తే. విమలచింతామణీమయవేదిమీఁదఁ
గల్పకలతాంతకల్పితతల్పసీమ
నధివసించిన నిఖిలలోకైకవంద్య
నమరమాన్యికశుక్తి నయ్యదితిఁ గనియె. 24

టీ. తొడపైక్ = ఊరువులపైని, చాఁచిన, అడుగుఁగెందమ్ములక్ = పాదపద్మములను, ఒయ్యనక్ = మెల్లఁగా, పౌలోమి=ఇంద్రునిభార్యయగుశచి, ఒత్తుచుండక్, పార్శ్వభాగంబునక్ =ప్రక్కను, పంకేరుహాసను కామినీరత్నంబు=బ్రహ్మభార్య యగు సరస్వతి, కతలు=కథలు, చెప్పక్, పనిఁబూని=ఆజ్ఞనుసరించి, అంతంతక్ = దగ్గఱ దగ్గఱ, వినయావనతవృత్తిక్ = అడఁకువచే నమ్రమైనరీతితో, సప్తర్షికాంతలు = సప్తర్షులభార్యలు=అరుంధత్యాదులు, సంచరింపక్ = తిరుగాడఁగా, వీజన చామర వీటి కరండాదికములు = విసనకఱ్ఱ చామరము తాంబూలపుఁబేటిక మొదలగువానిని దిక్పతి సతీగణము=దిక్పాలురభార్యలు, తాల్పక్ = పట్టుకొనఁగా, విమలచింతామణీమయవేది మీఁదక్ =స్వచ్ఛమైన చింతామణిచే ప్రచురమైన యరుఁగుపైని, కల్పకలతాంతకల్పిత తల్పసీమక్ =కల్పవృక్షసుమములచే నిర్మితమైన శయ్యాప్రదేశమున, అధివసించిన = అధిష్ఠించియున్నట్టి, నిఖిలలోకైకవంద్య=ప్రజలెల్లరిచే నమస్కరింపఁదగినదానిని, అమరమాన్యికశుక్తిక్ = దేవతలనుముత్తైములకు ముత్తెపుఁజిప్పయైనదానిని; దేవతలు గన్నతల్లి యనుట, అయ్యదితిక్ = అదితియనుదేవమాతను, కనియెక్ =చూచెను.

భా. పౌలోమి తొడలపై నిడిన తనపాదపద్మముల మెల్లన పట్టుచుండఁగా, సరస్వతి యాయాయికథలం జెప్పుచుఁ దన్నలరించుచుండఁగా, సప్తర్షులభార్యలు వినయముమెఱయ సేవావృత్తిఁబూని యాజ్ఞావశలై దగ్గఱ మెలంగుచుండఁగా, వీవన, వింజామరము, తాంబూలకరండము మున్నగువానిం బూని సప్తర్షికాంతలు సంచరించు

చుండఁగా, జింతామణి ప్రచురమైనవేదికపై నేర్పఱుపఁబడిన కల్పవృక్షసుమశయ్య నదితి గూర్చుండె ననియు, నట్టిదేవమాత్రను శ్రీకృష్ణుఁడు చూచె ననియు భావము.

విశే. సర్వసురాధిపతియగు నింద్రునకు భార్య శచి. అదితి కామె పెద్దకోడలు. ఆమె యత్తగారి యడుఁగుందమ్ముల నొత్తునట్లు చెప్పుట యామెశీలమునకేగాక యదితి పెద్దతనమునకును వచ్చెయే యగును. వాగ్దేవి కానఁ గత్రలు చెప్పుచు నత్త నలరించుట యుచిత్రము. సప్తర్షికాంతలు, దిక్పతీ సతీగణము, సేవావృత్తి నూనినట్లు చెప్పుట కతన నదితి దగు కోడండ్రసంబంధమైన వశీకరణమును, గోడండ్ర కత్తయెడలఁ గల భక్తియు సూచితము లయ్యె. చింతామణివేదిని కల్పసుమశయ్య నధిరోహించుట వైభవ సూచకము.

వ్యా-వి. శయ్యాయం దధివసించె ననుటకుమాఱుగా శయ్య నధివసించె ననుట అధిపూర్వక శీఙ్ స్థా ధాతువులయాధారము కర్మసంజ్ఞక మగు ననువ్యాకరణసూత్రము ననుసరించియే యని గ్రహించునది. స'ప్తర్షులు;—కశ్యపుఁడు, అత్రి, భరద్వాజుఁడు, విశ్వామిత్రుఁడు. గౌతముఁడు, జమదగ్ని, వసిష్ఠుఁడు.

మ. కని సత్యారమణీయుతంబుగ నమస్కారంబు గావించి భా
మనిశాటాహృతకుండలద్వయము నాత్మస్వర్ణ చేలాగ్రబం
ధనము నీడ్చి యొసంగ నందుకొని మోదంబంది యానందనం
దను దీవించుచుఁ జెంగట న్నిలిపెఁ జింతారత్నపీఠంబునన్. 25

టీ. కని=చూచి (శ్రీకృష్ణుఁడు కర్త.) సత్యారమణీయుతంబుగన్=సత్యభామా సంయుతముగా, నమస్కారంబున్, గావించి=చేసి, భామనిశాటాహృతకుండలద్వయమున్=భూమిసుతుండైన నరకాసురుఁడను రాత్రించరునిచే నపహృతమైన కుండలముల జతను, ఆత్మస్వర్ణచేలాగ్రబంధనమున్ = తనబంగరుబట్టచెఱఁగుముడిని; వీడ్చి = విప్పి, ఒసంగన్=ఈయఁగా, అందుకొని=పుచ్చుకొని (అదితి కర్త) ఆనందనందనున్ = ఆనంద కుమారుని, దీవించుచున్ = ఆశీర్వదించుచు, చెంగటన్=సమీపమున, చింతారత్నపీఠంబునన్=చింతామణీపీఠమున, నిలిపెన్=కూర్చుండఁజేసెను.

విశే. కుండలములజంట నదితి కొసంగెడిసెపమునకే శ్రీకృష్ణుఁడు స్వర్గమున కేతెంచెను గాన, గడుసరియుఁ గార్యసాధననిపుణుండును నగు శ్రీకృష్ణుఁడు తొలుదొల్త నాకృత్యమునే నిర్వర్తించి, తన కదితిపైఁ గలభక్త్యతిశయమునుగూడఁ బ్రకాశిత మొనర్చుకొనియెను.

అదితి శౌరియవతారముల వర్ణించుట

క. మే నిమిరి శిరసు మూర్కొని
దానవపరిపంథి! యెంత ధన్యనో నియత
ధ్యానపరు లయినమునులుం
గాననినినుఁ గంటి మంటి గతకల్మష నై. 26

టీ. మే=శరీరమును, నిమిరి = చేతితో రాచి, శిరసుక్ =తలను; మూర్కొని = ఆఘ్రాణించి, (కర్త అదితి) దాననపరిపంథి=రాక్షసశత్రువ వగుకృష్ణా! ఎంతధన్యనో= ఎంతకృతార్థనో?, నియతధ్యానపరులు=నియమముతోఁగూడినధ్యానమునం దాసక్తులగు వారు, అయిన, మునులుక్ , కానని=చూడలేని, నినుక్ ; కంటిక్ =చూచితిని, గతకల్మ షనై=పోయినపాపములు గలదానసై, మంటిక్ =బ్రదికితిని.

విశే. మే నిమురుటయు శిరసు మూర్కొనుటయు వాత్సల్యాతిశయసూచకము లని గ్రహింపవలయును. తల్లులు తమ పిల్లలవిషయమున నిట్లు ప్రవర్తించుట సైజము.

ఉ. సర్గమొనర్తు బ్రహ్మ యన సత్కృపఁ బెంతు జనార్దనుండు నా
భర్గుఁ డనంగఁ గ్రమ్మఱఁగఁ బారణ సేయుదు విజ్జగంబు నై
సర్గికలీల నొక్కమఱి సౌఖ్యము నొందుదు కేవలంబు దో
ర్దండభూషణీకృతరథాంగ! నినుం గొనియాడ నేర్తునే. 27

టీ. దోర్దండ...రథాంగ-దోర్దండ = గడియలం బోలుచేతులకు, భూషణీకృత= ఆభరణముగాఁ జేయఁబడిన, రథాంగ = చక్రాయుధము గలవాఁడ, బ్రహ్మ = సృష్టికర్త, అనక్ =అనునట్లుగా, సర్గము=సృష్టిని,ఒనర్తు= చేయుదువు, జనార్దనుండు=విష్ణువు, నాక్ = అనునట్లు, సత్కృపక్ =మంచివయతో, పెంతు = పోషింతువు భర్గుఁడు=ఈశ్వరుఁడు, అనంగక్ =అనునట్లు, క్రమ్మఱఁగక్ =మఱలను, పారణ=మ్రింగుట, చేయుదువు = ఒనర్తువు, మఱి=మఱియు, సైసర్గికలీలక్ = సహజమగువిలాసముతో, కేవలంబుక్ = నిజరూపివై, సౌఖ్యముక్ =సుఖమును, ఒందుదు=పొందుదువు. నినుక్ , కొనియాడక్ = నుతింపఁగా, నేర్తునే = చాలుదునే?

భా. ఓకృష్ణ! సృష్టికర్తవై సృజించువాఁడవు నీవే; విష్ణువవై పాలించువాఁడవును నీవే; శివరూపివై సంహరించువాఁడవును నీవే; కేవల మాత్మారాముండవై సహజలీల సుఖించువాఁడవుకూడ నీవే. ఓత్రిమూర్తిరూపీ, నిన్గొనియాడ నేఁ జాల నని భావము.

విశే. పరమాత్మఁ డొక్కఁడే యాయాయిరూపముల సృష్టిస్థితిలయములఁ గావించు నని శాస్త్రములు నుడువును. ఈవిషయమున కాళిదాసు కుమారసంభవమున

రెండవసర్గ నిట్లే "తిసృభిస్త్వమవస్థాభి ర్మహిమాన ముదీరయన్, ప్రళయస్థితిసర్గాణా మేకః కారణతాం గతః" అని ప్రతిపాదించి యున్నాఁడు.

ఇది మొదలుకొన విష్ణుని యవతారములు వర్ణితము లగును. ఇం దందు మొదటి దగు మత్స్యావతారము వర్ణితము.—

ఉ. వాలముతాఁకున న్నిగురులు వజ్రనిపాతము సంస్మరింపఁ బె
న్వాలుగవై మహార్ణవమునం దొలుఁబల్కులవొంగరక్కసున్
వాలికవంకవాఁడిగఱి ప్రచ్చి వెస న్నిగమాలిఁ దమ్మిపూఁ
జూలికిఁ దెచ్చి యీవె త్రిదశుల్గొనియాడ మురాసురాంతకా! 28

టీ. మురాసురాంతకా = ఓమురద్వేషీ! వాలముతాఁకునన్ = తోఁకదెబ్బ చే గిరులు = పర్వతములు, వజ్రనిపాతమున్ = వజ్రాయుధపుదెబ్బను, సంస్మరింపన్ = జ్ఞప్తికిఁ దెచ్చుకొనఁగా, పెన్వాలుగవై = పెద్దచేపవై, మహార్ణవమునన్ = పెద్దసముద్ర మున, తొలుఁబల్కుల దొంగరక్కసున్ = వేదచోరుఁ డగురాక్షసుని, వాలికవంకవాఁడి గఱిన్ = దీర్ఘమైన ప్రక్కనున్న తీక్ష్ణమైన ఱెక్కచేత, ప్రచ్చి = చీల్చి, వెసన్ = శీఘ్రముగా, నిగమాలిన్ = వేదములసమూహమును, తమ్మిపూఁజూలికిన్ = పద్మోద్భవు నకు (బ్రహ్మకు), తెచ్చి, త్రిదశుల్ = దేవతలు, కొనియాడన్ = నుతింపఁగా, ఈవె = ఒసంగవే!

భా. మత్స్యరూపి యగువిష్ణుని తోఁకతాఁకుడు సముద్రమందలి గిరులకు వజ్రా యుధప్రహారమును జ్ఞప్తికిఁ దేఁగ నవ్వేదచోరుని రక్కసుని వాఁడిఱెక్కచేఁ జీల్చి వేదరాశి నజునకు సురలు నుతింప నొసంగె నని భావము.

వ్యా-విశే. సోమకుఁ డనునసురుఁడు వేదముల నపహరించి సముద్రమున డాఁగఁగా నాతని శ్రీమహావిష్ణువు మత్స్యరూపముం దాల్చి సంహరించి వేదముల బ్రహ్మకు మఱల నిచ్చె ననుపురాణగాథ ననుసంధింపవలెను. ఇచ్చుము + ఎ=ఇచ్చునకు సర్వంబునకీ యగును. ఎదాదులు పరంబగునపుడు ముజ్జు నకు వుజే రుజే యగు. ఈవె. అలం. స్వభావోక్తి.

చ. సురనికరంబు రక్కసులుఁ జుట్టములై యమృతాభిలాష మం
దరగిరిఁ జిల్వరాచతరిత్రాట బిగించి పయఃపయోధి ని
ర్భరగతిఁ ద్రచ్చుచో నడుగువట్టినతద్గిరి యెత్తవే ధురీ
పరిపృష్ఠమూర్తివై కపటపద్మముఖీత్వవిమోహితాసురా! 29

టీ. ఇందుఁ గూర్మావతారము వర్ణితము.—కపటపద్మముఖీత్వవిమోహితాసురా! =కృత్రిమస్త్రీత్వముచే మిగుల వివేకశూన్యులుగఁ జేయఁబడిన రక్కసులు గలవాఁడ!

సురనికరంబుక్ = త్రిదశసమూహమును, రక్కసుల్ = రాక్షసులును, చుట్టములై = బంధువులై (పరస్పరము మిత్రులై యనుట), అమృతాభిలాషక్ = అమృతమందలి కోర్కితో, మందరగిరిక్ = మందరపర్వతమును, చిల్వరాచపరిత్రాటక్ = పాఁపరాజగు వాసుకిరూపమైన కవ్వపుఁద్రాటితో, బిగించి=బిగియఁగట్టి, పయఃపయోధిక్ = పాల కడలిని, నిర్భరగతిక్ = భారశూన్యమైనరీతితో (అనాయాసముగా ననుట), త్రచ్చు చోక్ = మథించునపుడు, అడుగువట్టిన = మునిఁగి క్రిందఁ జేరిన, తద్గిరిక్ = ఆమంథర మును, ధూలీపరివృఢమూర్తివై = మేటికూర్మరూపముం బొందినవాఁడ వై, ఎత్తవే = ఉద్ధరింపవా!

విశే. అమృతమును సురలకును, నసురులకును బంచిపెట్ట మోహినీరూపముం దాల్చి యసురుల వంచించుటంజేసి, యీసందర్భమున నక్కథాంశమును సూచించు 'కపట పద్మముఖీప్రవి మోహి తాసురా!' అనుసంబుద్ధి నిల్పుట యెంతయు సరసము. చిలు = చీలిన, వా=నోరుగలది. లేక, చిలు -చిలుము=విషము గల, వా=నోరు గలది. చిల్వ. నలువ. మొ.

క. విలయోల్బణజలనిధిప
ల్వలమున నిల మునుఁగ నేకలమ వై దంష్ట్రా
చలమునఁ దాల్పవె నీ వా
బలిసద్మము దూఱి భుజగపర్యంకశయా! 30

టీ. ఇందు వరాహావతారము వర్ణితము.—భుజగపర్యంకశయా=శేషతల్పమున శయనించినవాఁడా! విలయోల్బణ...పల్వలమునక్ - విలయ = ప్రళయకాలమున, ఉల్బణ=ఉబ్బొంగిన, జలనిధి=సముద్ర మనెడు, పల్వలమునక్ =నీటిగుంటయందు, ఇల= భూమి, మునుఁగక్, ఏకలమ వై=వరాహమ వై, దంష్ట్రాంచలమునక్ = కోఱికొనచే, నీవు, ఆబలిసద్మమున్ = ఆపాతాళమును, దూఱి=చొచ్చి, తాల్పవె=ధరింపవా!

విశే. ఒక్కొకపద్యముతో నొక్కొకయవతారమును వర్ణించుచు నీసందర్భమున వరాహావతారమునుమాత్రము రెండుపద్యములతో వర్ణించుటకు హేతువు చింత్య మనఁ దగును. మఱియు వృత్తములతో నవతారములు వర్ణితములైన ట్లీసందర్భము విశదీ కరించుచుంట నడుమంగల యీచిన్నికందపద్యము ప్రక్షిప్త మైయుండునేమో యని సందియము పొడమించెడిని.

చ. పెకలి యజాంతకర్వరము బీటలువాఱఁగ మేనువెంచి యా
మకరనికేతనోదరనిమగ్నమహీమహిళాలలామఁ గే

తకముకుళాగ్రసంగతమదభ్రమరీసమరీతి గాఁగఁ గొ
మ్మకొనఁ దగిల్చి యెత్తఁ గిటిమూర్తిని దాల్చితిగా జనార్దనా! 31

టీ. జనార్దనా = ఓకృష్ణా! అజాండకర్పరము = బ్రహ్మాండభాండము, పెకలి=పగిలి, బీటలు వాఱఁగఁ=బ్రద్దలగునట్లుగా, మేను=శరీరమును, పెంచి=విజృంభింపఁజేసి, ఆమకర...లలామఁ - ఆమకరనికేతన = ఆసముద్రముయొక్క, ఉదర = నడుమను, నిమగ్న=మునిఁగిన, మహీ=భూమి యను, మహిళా లలామఁ=స్త్రీ రత్నమును, కేతక... రీతి-కేతకముకుళ = మొగలిమొగ్గయొక్క, అగ్ర=శిఖరమును, సంగత = కూడియున్న, మదభ్రమరీ=మత్తిలిన యాఁడుతుమ్మెదతో, సమ=తుల్యమైన, రీతి = విధము, కాఁగఁ = సంభవించునట్లుగా, కొమ్మకొనఁ = దంతాగ్రమునందు, తగిల్చి = లగ్నముగాఁజేసి, ఎత్తఁ=ఉద్ధరించుటకు, కిటిమూర్తిని=వరాహాకృతిని, తాల్చితిగా=ధరించితివిగదా!

భా. సముద్రమున మునింగిన భూమిరామను పల్లకొనచే నుద్ధరించునదమునఁ బల్లు తెల్లఁగను, భువి నల్లఁగను నుటంజేసి, కేతకీముకుళాగ్రమున నుండు మదభ్రమరిం బోలి యున్న దని భావము. భువియందు స్త్రీత్వ మారోపిత మగుటంజేసి, భువి కాఁడుతుమ్మె దతో సామ్యము నిరూపితము. అలం. రూపకోపమలు.

చ. *సటలిట మానురోరి! హరిసర్వమయుండటె యంచుఁ బట్టితోఁ
జిటచిటలాడి యిందుఁ గనఁజేయుము నీవని దైత్యుఁ డాడినం
బటపట తాతికంబ మిరువాయలుగా నరసింహమూర్తివై
కుటిలనఖాగ్ర కుంచికల గ్రువ్వవె వానియురఃకవాటమున్. 32

టీ. ఇందు నరసింహావతారము వర్ణితము.—సటలు=కుశలోక్తులు; నేర్పుమాట లనుట. ఓరి, మానుర=వదలుర, ఓరి; ఇది ప్రహ్లాదునిఁగూర్చి తండ్రిపల్కనసంబుద్ధి, హరి=శ్రీవిష్ణువు, సర్వమయుండటె = సర్వవ్యాపియా? అంచుఁ, పట్టితోఁ = కుమారుఁడగు ప్రహ్లాదునితో, చిటచిటలు=కోపోక్తులు, ఆడి=పల్కి, ఇందుఁ = ఈస్తంభమున, నీవు, కనఁ=అగపడునట్లుగా, చేయుము; కనఁబఱుపు మనుట. అని, దైత్యుఁడు = హిరణ్యకశిపుఁడు, ఆడినఁ=పలుకఁగా, పటపట = ఇది ధ్వన్యనుకరణము, తాతికంబము = శిలాస్తంభము, ఇరుపాయలు కాఁ=రెండుచెక్కలుకాఁగా, నరసింహమూర్తివై=నరమృగరాజరూపధారివై, కుటిలనఖాగ్రకుంచికలఁ -కుటిల = వక్రములైన, నఖాగ్ర = గోళ్లకొనలచెడు, కుంచికలఁ = తాళపుఁజెవులచే, వానియురఃకవాటమున్ = వానిగుండె యను తలుపును, గ్రువ్వవే = గ్రుచ్చి తెరువవే?

---

* సటలివి.

వ్యా-విశే. రౌద్రరసోచిత మగు దీర్ఘసమాసభూయిష్ఠ మగురచన యిందు లే కున్నను పరుషాక్షరయుతమగురచన పొసఁగియుండుటంజేసి సందర్భము సంగత మే యగు. మఱియు శార్దూలాదివృత్తములఁ బొందుపఱుపక చంపకమును నిల్పుట చింత్యము. కాని పరుషాక్షరరచనయే రసప్రకాశనసమర్థ మైయుంట వృత్తనియమనుం గవి పరిత్యజించె నేమో యని యూహ పొడమెడిని. రాఁ: ఇది వచ్ఛాతు మధ్యమపురుషరూపమున మువర్ణకము లోపింప మిగిలినరూపము. ఇది చెప్పరా. చేయరా. ఇత్యాదులకొనందవిలి ప్రేమను నీచత్వమునుగూడ బోధించున దగు నని తోఁచెడిని. కాని నిజముగ నరయ చేయుము, రమ్ము. అనియే యిట్టివాని కర్థముగ నెన్నఁదగు నని తోఁచెడిని.

మ. ననుఁ నాకశ్యపకామినీమణులలోన నన్యఁగాఁ జేయ మ
త్తనయవ్యాజము దాల్చి వామనునిచందాన న్బలి న్నట్టవే
ఘనమార్గోన్నమితాంఘ్రిపద్మమునకుం గంజాప్తుఁ డంశుప్రజం
బనుకింజల్కపరంపర లెఱయ నుద్యత్కర్ణికం బోలఁగన్. 33

టీ. ననుఁ, ఆకశ్యపకామినీమణులలోనఁ = ఆకశ్యపమూని భార్యారత్నము లలో 'దితి అదితి' అను నిర్వురభార్యలలో ననుట, ధన్యఁగాఁ = కృతార్థురాలినిగా, చేయఁ = చేయుటకు, మత్తనయవ్యాజము=నాకొమరుఁ డనుమిషను, దాల్చి=వహించి, వామనునిచందానఁ = పొట్టివానివిధమున, ఘన...పద్మమునకుఁ -ఘనమార్గ = మేఘ మార్గమగు నాకాశమునకు, ఉన్నమిత=ఎత్తఁబడిన, అంఘ్రిపద్మమునకుఁ = పాదపద్మ మునకు, అంశుప్రజంబు=కిరణసమూహము, అను=అనునట్టి, కింజల్కపరంపరఁ = కేసర ములపంక్తులు, మెఱియఁ=ప్రకాశింపఁగా, కంజాప్తుఁడు=సూర్యుఁడు, ఉద్యత్కర్ణికఁ = ప్రకాశించుతామరగద్దెను, పోలఁగఁ=అనుకరింపఁగా, బలిఁ=బలిచక్రవర్తిని, మట్టవే= మోసవే.

విశే. ఆకసమునకుఁ జాచినచరణము సరసిజమువలె నుంట నద్దానికి సూర్యకిరణ ములు కింజల్కములవడువునను సూర్యుఁడు తామరలోనుండు మిద్దెగతిని గూర్చుటఁ బద్మత్వము పూర్ణముగ సంపాదితమయ్యెను. అలం. రూపకోపమలు.

మ. ఘనదోర్దండనటత్కుఠారమున వీఁక క్రౌంజహంసాలిఁ దు
త్తునియల్సేసియుఁ గ్రౌంచరంధ్రమునఁ దోడ్తో రాజహంసాలి మే
దినికిం దెచ్చితి కార్తవీర్యభుజపంక్తిం జక్కఁ గావించి తం
బునిధిం గ్రొత్తగ నాశ్రమంబునకు నిమ్ముం గొంటి వీ వమ్మునన్. 34

టీ. ఇందుఁ బరశురామావతారము వర్ణ్యము.— ఈవు = నీవు, ఘనదోర్దండనటత్కుఠారమునన్ -ఘన=గొప్పదగు, దోర్దండ=దండమువంటిచేతియందు, నటత్=చలించు నట్టి, కుఠారమునన్ =గొడ్డలిచేత, వీఁకన్ = పరాక్రమమున, రాజహంసాళిన్ = రాజశ్రేష్ఠులను, తుత్తునియల్ = ముక్కముక్కలు చేసియున్ = ఒనర్చియు, క్రౌంచరంధ్రమునన్ = క్రౌంచపర్వతబిలమునందుండి, తోడ్తోన్ = వెనువెంటనే; వరుసగా ననుట. రాజహంసాళిన్ = రాయంచలపంక్తిని, మేదినికిన్ =భువికి, తెచ్చితి=తీసికొనివచ్చితివి. కార్తవీర్యభుజపంక్తిన్ = కార్తవీర్యార్జునుని భుజములచాలును, చక్కఁగావించితి = నఱికితివి. అంబునిధిన్ = సముద్రమునందు, క్రొత్తగ, ఆశ్రమంబునకున్ = నివాసమునకు నై, అమ్మునన్ =బాణముచే, ఇమ్మున్ =స్థానమును, కొంటివి స్వీకరించితివి.

విశే. పరశురాముఁడు ముమ్మ్యేడుమాఱులు రాజశ్రేష్ఠులఁ దునిమెను. విలువిద్యా విషయమునఁ గుమారస్వామియందలి యీసుచేఁ క్రౌంచాచలమును భేదించి బిలమునొనర్చి రాయంచలకు మానససరోవరమునకై రాకపోకలకు మార్గముం గల్పించెను. కార్తవీర్యార్జునునిసహస్రభుజములను భేదించెను. బాణప్రయోగమున సముద్రమునుదకముం దొలఁగఁద్రోసి యాశ్రమ మచ్చోఁ నేర్పఱిచుకొనెను. పైనివ్రాసిన యాతని చర్యలం గొనికవి యీగతిని వర్ణించెను. రాజహంసలు దుత్తునియ లైనయు రాజహంసాలిని క్రౌంచాచలరంధ్రమునుండి భువికి రావించుట విచిత్రమును విరుద్ధమును నగువిషయము. రాజశ్రేష్ఠులఁ దునిమి రాయంచలఁ దా నొనర్చిన క్రౌంచరంధ్రమార్గమునుండి భువికి రావించె ననని పరిహారము. అలం. విరోధాభాసము.

మ. అరవిందాననఁ గోలుపోయిన యవజ్ఞావాప్తిచే వీరవా
నరసైన్యప్రకరంబు నేలి జలధి న్బంధించి లంకాపురీ
శ్వరకంఠాటవి నేర్చి రాప్యగిరిలజ్జాపంకమున్ గీర్తిని
ష్ఠురపూరంబులచేఁ దొలంచితిగదా రామాభిధానంబునన్. 35

టీ. ఇందు శ్రీరామావతారము వర్ణితము.—అరవిందాననన్ =పద్మముఖి యగు సీతను, కోలుపోయిన=నష్టపడిన, అవజ్ఞావాప్తిచేన్ =అవమానప్రాప్తిచేత, వీరవానరసైన్యప్రకరంబున్ =శూరులగు కపిసేనాసమూహమును, ఏలి = పాలించి, జలధిన్ = సముద్రమును, బంధించి=కట్టి; అనఁగాఁ సముద్రముపై సేతువుం గట్టియనుట. లంకాపురీశ్వరకంఠాటవిన్ = రావణుని కంఠము లనెడునడవిని, ఏర్చి = దహించి, రాప్యగిరిలజ్జాపంకమున్ = కైలాసమునొక్కసి గ్గనుబురదను, కీర్తినిష్ఠురపూరంబులచేన్ = కీర్తియనెడుసెలయేటి వెల్లువలనీటిచే, రామాభిధానంబునన్ = రాముఁడను పేరితో, తొలంచితిగదా = కడిగితివిగదా !

విశే. తొల్లి రావణునిచేఁ గైలాసము పెకలింపఁబడుటకతనఁ గైలాసమునకు సిగ్గు కల్గె ననియు, నట్టి సిగ్గనుబురదను శ్రీరాముఁ డారావణుని సంహరించి తనకుఁ గల్గిన యశఃపయఃపూరంబులఁ గడిగివేసె ననియు తాత్పర్యము. అలం. రూపకము.

చ. అలుకఁ బ్రలంబదానవునిప్రాణము గొంటి కళిందనందనా
సలిలభర ప్రవాహరభసంబు మరల్చితి పట్టిఁ బ్రోవ నాఁ
గలిమొన హస్తినాపురి పెకల్చితి కౌరవవీరు లెల్ల బె
గ్గిల నల రేవతీరమణికిం బతివై యదువంశమౌక్తికా ! 36

టీ. ఇందు బలరామావతారము వర్ణితము. యదువంశమౌక్తికా = యదువంశమను వెదురునకు ముత్యమైనవాఁడా! అలరేవతీరమణికిక్ =ఆరేవతీదేవికి, పతివై =భర్తవై, అలుకక్ = కోపముతో, ప్రలంబదానవునిప్రాణముక్ = ప్రలంబాసురుని జీవమును, కొంటివి=స్వీకరించితివి; చంపితి వనుట. కళింద...రభసంబుక్ -కళిందనందనా=యమునానదియొక్క, సలిలభర=నీరులభారము కల్గిన, ప్రవాహ = వెల్లువయొక్క, రభసంబుక్ = వేగమును, మఱిల్చితి=త్రిప్పితివి, పట్టిక్ =సుతుని, ప్రోవక్ =రక్షించుటకై, నాఁగలి మొనక్ =లాంగలాగ్రమున, హస్తినాపురిక్ =హస్తినాపట్టణమును, కౌరవవీరులెల్లక్, బెగ్గిలక్ =భయపడఁగా, పెకల్చితి=పెల్లగించితివి.

విశే. లక్ష్మణను దుర్యోధనుని చెల్లెలం బరిగ్రహించి సాంబుఁడు పారిపోవుచుండ దుర్యోధనాదులు వానిం జెఱఁబెట్టఁగా, బలరాముఁ డాతని విడువఁగోరె ననియు, దుర్యోధనాదు లందుల కంగీకరింపక మీఁదు మిక్కిలి యాతని దూఱి రనియు, నక్కతన బలరాముఁడు కోపించి హస్తినాపురిని నీటఁగలుప నెంచి నాఁగేటిపాతమునఁ దల్క్రిందుగాఁ జేసె ననియు భాగవతము నుడువును.

మ. త్రిపురస్త్రీలఁ బతివ్రతామణుల సారెం బుంశ్చలీవర్తనం
బుపదేశం బొనరించి బేల్పడిచి వధ్యుల్గాని తద్భర్తలక్
దీపచర్తాంబరచూపుటింగలమున న్వే త్రోచి పాటింపవే
కపటశ్రీజినరూపము న్భువనరక్షాజాగరూకేక్షణా ! 37

టీ. భువనరక్షా జాగరూకేక్షణా ! = లోకముల రక్షించుటయందు మేల్కొనియుండు కన్నులుగలవాఁడా! పతివ్రతామణులక్ =పాతివ్రత్యసంపన్నులగు స్త్రీరత్నములైన, త్రిపురస్త్రీలక్ = త్రిపురాసురపట్టణములందలి వనితలను, సారెక్ =మాటిమాటికి, పుంశ్చలీవర్తనంబు=జారత్వమును, ఉపదేశంబు=బోధించుట, ఒనరించి=చేసి, బేల్పడిచి= వంచించి, వధ్యుల్ = చంప శక్యమైనవారలు, కాని=కానట్టి, తద్భర్తలక్ = ఆత్రిపుర

స్త్రీలపతులను, ద్విపచర్మా...టింగలమునక్ -ద్విపచర్మ = ఏనుఁగుచర్మము; గజాసురచర్మ మనుట. అంబరు=వస్త్రముగాఁగలశివునియొక్క, చూపుటింగలమునక్ = నేత్రాగ్నియందు; శివునకు మూఁడవ కన్నగ్నిరూపమగుట ప్రసిద్ధము. వే=శీఘ్రముగ, ఇది కళ. త్రోసి=పడఁద్రోసి, కపటశ్రీజినరూపమక్ = కృత్రిమమగుశోభాయుక్తమైన బుద్ధరూపమును, పాటింపవే=తాల్పవే, ఇందు బుద్ధావతారము వర్ణ్యము.

విశే. మున్ను 'తారకాక్షుఁడు, కమలాక్షుఁడు, విద్యున్మాలి' అను మూఁగురు దానవులు తపమొనర్చి యవధ్యత నజునివలనఁ బడసి త్రిపురముల నిర్మించికొని తామును దమపత్నులును వేదవిహిత ధర్మానుష్ఠానపరులై దేవతలఁ బీడించుచు నవధ్యులై యుండ, విష్ణువు కృత్రిమ బుద్ధసన్యాసిరూపమున నారక్కసులకు దురాచారములఁగఱపి యవ్వారి జాయలకు జారత్వ ముపదేశించిచెఱపి భగ్నసద్ధర్ములనుగా నొనర్చె ననియుఁ, బిదప నష్ట సదాచారులగువారి నీశ్వరుఁడు తన మూఁడవకంటిమంటఁజే దేవతలసాహాయ్యమునఁ ద్రిపురములతోడం గూల్చె ననియు, భాగవతపాద్మపురాణములు చెప్పుచున్నవి. కావున నిందు వర్ణితుఁడైన బుద్ధుఁడు విష్ణ్వంశసంభూతుఁడుకాని కపిలవస్తునగరమున మాయాశుద్ధోదనుల కుదయించినవాఁడుగాఁ డని విశదమగుచున్నది. కొందఱు శౌద్ధోదనియే దశావతారములలోఁజేరిన బుద్ధుఁ డని తలంతురది యిందుఁ బొసఁగదు. మఱియు బలరాముని స్థానముఁ గృష్ణు నవతారదశకమునఁజేర్తురు. కొందఱు బలరాముంజేర్తురు. ఏదియెట్లున్నను బలరాముం జేర్చుటయే ప్రాచీనసంప్రదాయము. ఇందు యుక్తిమాత్రము చింత్యము.

గణసమకదండకము:—

యదుతిలక! జగత్త్రయానిర్మితిప్రక్రియా కర్మశేందిందిరోద్భాసినాభీ
సరఃపద్మ! పద్మాసతీపాదపీఠాకృతిప్రస్ఫురత్కౌస్తుభాంకూరితాళీక
బాలాతపద్యోత! పద్మోత్తరంగిణ్యదక్షాళితైణాంకభృత్పాంసులక్లిష్ట
వేల్లజ్జటాజాల! జాలంధరోడ్డీణమూలాఖ్యబంధత్రయీబంధసం
ధుక్షితస్పర్శనస్పర్శ నిర్గ్రంథితగ్రంథిషట్కాంత రోన్నిద్రకద్రూసుత
శ్రీముఖజ్వాలవల్లీపరిస్రంసమాణ్డేందునిష్యందసర్వాంగ నిష్పందయో
గీంద్రహృద్వేది కావాస! యీవాసవాదు ల్సరోజాసనున్ మున్ను
గాఁజేసి 'సర్వంసహాభీరుభారంబుఁ బోఁద్రోయవే' యంచుఁ బ్రార్థిం
చిన న్దేవకీదేవిగర్భంబునం దుద్భవంబంది బాహాద్వయద్వంద్వమున్నం
దకస్యందనాంగాబ్జకామోదకీశార్జ్గముఖ్యాయుధవ్రాతముం బీతకాశే

యము న్వత్సభాగంబునన్మించుశ్రీవత్సముం జూపినం దల్లి భీతిల్లుచుం
'గావు కావంగదే'యన్న నీవంతలోఁ గావు కావంచు నేమ్పు ల్లలిర్పం
గసుంగందవై తండ్రియత్నంబున న్నందగోష్ఠంబునం దున్నచో ద్రోత
గై చేతిపాల్గోల్ప నేతెంచునాపూతనాభూతనారీకుచం బగ్రహ స్తం
బునం బట్టి తత్ప్రాణనిర్వాణశంఖంబుపూరించుచందంబునం గ్రుక్కల
నొక్కిమక్కించియు [1]నబ్బండిరాకాసిఁ గీలూడఁగాఁ దన్నియు న్వేన్న
వేమాఱు గొల్లాడఁగా గొల్లయిల్లాంధ్ర నందారవిందాస్యతో ఱట్టు
గావించిన న్నిక్కపుంబట్టివే యంచు నిబ్బట్టి చక్రోలితోఁ గట్టిన
నిట్టివై కిట్టి పెన్నుద్దిమద్దు ల్వడం ద్రోచియు న్మైశవంబు న్వీడం
బింపవే, లేఁగలు న్గోపబృందంబు బృందావనారణ్యవాటి న్నటింపం
జలత్కాకపక్షంబుతో బర్హిబర్హావతంసంబుతో మంజుగుంజాఫలో
ద్దామదామంబుతోఁ దానమూనక్రియాశంసివంశంబుతో నేపు దీపించు
[2]నీప్రాపు వ్రేపాపలం గ్రేపుల నైప్యపరీత్యంబుగాఁ బాపి యాపద్గజుం
డొక్కచో డాఁచిన న్వానిరూపంబు నీవైపునస్సన్నఁజిట్టి నాస్రష్టగర్వంబు
ఖర్వంబుగాఁ జేయవే, తోయవేగోచ్చలద్వీచికా మర్దళధ్వాన మూగు
బ్బుగా నుబ్బునం గేళిఁ గాళిందిలోఁ గాళియాహిస్ఫటారంగమధ్యం
బునం డాండవం బాడవే, తోడిగోపాలకశ్రేణికి న్నీకు జన్నంబుల
న్నీఁదుగా నున్నయన్నంబుల న్వంచితాత్తేశ లై పంచలం జల్లు లందీ
మునిస్త్రీలకు న్లీలఁ గైవల్యముం గొల్ల యీవే, పెనుంజిల్వ గ్రొ బల్వ
డిం జంగిలి న్మ్రోంగువై తేయువాత న్వడిం జొచ్చి మై వెంచి తత్కా
యము న్రెండు వాయ ల్వడం జించి గోపం క్తిఁ బోషింపవే, గుంపు లై
యింపులం గూడి యాభీకు లాదేవతానేతకు న్జాతర ల్సేయ వారించి
తత్పూజన ల్నీవు గైకొన్న మేకొన్న పేరల్కతోఁ బుష్కలావ ర్త
కాబ్దంబులం బంపఁగా నంపజాలంబుగాఁ గొండ లుర్లంగ వర్షించినం
గాండిశీకత్వముం బొందఁనామందలం బ్రోవ గోవర్ధనం బెత్తవే, మత్త
వేదండ ముద్వృత్తి నెత్తమ్మి పూవెత్తురీతి న్నిలింపానికారిష్టదారిష్ట
మాయాబలీవర్ధముం బట్టి మర్దించి తంచు న్వడి న్మూకలాశాస్వికృతిం
డాసినం గేశిజీవానిలంబు ల్భజాదండశోకంబునం గ్రోలి సీ

---

1. బండిపెన్రక్కసుం గండడంగించియఁ. 2. నీ కాపుప్రేపాపలన్.

యూపనోద్యద్భుజాగర్వముం జూపవే, శరదభినవసాంద్రచంద్రప్రభా
ధౌతభాస్వత్కలిందాత్మజాసైకతోత్సంగవీథిం[1]ద్రిభంగ్యాకృతిన్నిల్చి
యాకుంచితభ్రూవిలాసంబుతో మోము వామాంసముం జేరఁగా
శోణదంతచ్ఛదాంతంబున న్వేణునాళంబు సంధించి రంధ్రాంతరన్యస్త
హస్తాంగుళీపల్లవాగ్రంబు లల్లాడ ప్రేయించిన స్తుక్తరోమంథ
నిష్పందగోబృందము న్వ్యక్తగోవర్ధనగ్రావనిష్యందము న్మందమం
దాంశుమన్నందనావేగముం గందళన్నీరసారణ్యజీర్ణాగముంగాఁ గదం
బించుతత్పంచమారావము న్వించు నయ్యంచువిల్కానికిం జిక్కి
రాధాదిగోపావరోధాంగన ల్లాసిన న్రాససంక్రీడ మాయాసముల్లాసి
వై సౌఖ్యవారాశి నోలార్పవే, దర్పితాశేషదోషాచరాధీశదుస్సా
ధ్యమై యున్న నీవిక్రమక్రీడ వీక్షింప నక్రూరచే మామ పిల్పించినం
బోవుచోఁ ద్రోవ భావాతిగం బైన నీదివ్యరూపంబుఁ జూపం బరి
భ్రాంతుఁ డై యున్న మన్నింపవే వాని నీవానిఁగా, భోజభూజాని
యుద్యోజనం బందఁ దద్రాజధానిం బ్రవేశించి యేతెంచుచో ముం
దటం జందనాలేపము న్దర్శనం బిచ్చిన న్నుజ్జ్వలప్రోయాలికి న్నుజ్జకం బైన
యందంబు నొందింపవే, యూగపూజార్చితం బైనకోదండము న్ఖండ
ఖండంబుగాఁ జేయుచుండ్ధనుర్దండరక్షాభటస్తోమమ స్తంబులం బెల్లుగా
డొల్లఁగా ప్రేయుచు న్మల్లగర్జాభుస్ఫాలనాభీలమై యుల్ల
సద్దిండిమారావవాచాలమై నిగ్రహాయాతరక్షోభటోదగ్రమైయున్న
యయ్యుగ్రసేనాత్మజాస్థానిఁ జొ త్తేరఁ దత్తోరణశ్రోణి నాధోరణుం
డుద్ధతిం బైపయిం గొల్పినం బట్టపేనుంగుఁ జెండాడి గండ
స్రవద్దానపంకంబునం బుండ్రముం గుంభనిర్ముక్తముక్తావళిం గర్ణ
దామంబున న్గట్టి రక్తంబునం బట్టి మైపూఁతయుం బ్రాఁతిగాఁ
బూసి తద్దంతకాండంబు కేల న్గదాదండమై యుండఁగా జెట్టివై గిట్టి
చాణూరుజానూరువు ల్మూఁటిమూఁటి ల్వడిం ద్రిప్పి నీ వప్పళింప
న్భయభ్రాంతుఁడై పాఱి సుంకించునక్రించుఁ గంసుం ద్రిలోకీనృ
శంసు న్నియుద్ధక్రియాపద్ధతిం గిక్కెస న్గొంతుక్రో ల్మొక్కవే,
దేవతాదుందుభివ్రాత ధింధింధిమి ధ్వానగాన స్వరోత్కర్ష హర్షం

---

1. ద్రిభంగీగతిఁ. 2. ల్మొక్కమికించి నద్దిక్కులఁ దేవతాదుందుభివ్రాత.

బులం గల్పక ద్రుప్రసూనాతివర్ణంబులం బెల్లుగా నెల్లలోకంబు
లుల్లాసముం బొందఁగా వాసిరాజ్యంబునం బూజ్యఁగా నుగ్రసేనుం
బ్రతిష్ఠాపితుం జేయవే, దుష్టు నష్టాదశాక్షౌహిణీవాహినీదుర్మదాంధు
జరాసంధు భీమాపదేశంబునం జేసి శాసించి కాంతేయుచే రాజసూ
యంబు సేయించుచో జాత్యసగాయ స్వభయంబేది చేదిక్షమావల్లభుం
డెంతయుఁ ద్రుళ్లునం బ్రల్లదం బొడినం బల్లెరం బెత్తి చిత్రంబుగాఁ
దచ్ఛిరఃకర్తనప్రౌఢి వర్తించి ధాత్రి న్వ్యథావాసుదేవప్రతాచండ
శౌండీర నప్పాంద్రుఁ జక్రాహతిం జక్కఁగాఁజేసి యాశౌనుఁ బోర
న్మహాసేననాగాననవ్యూహసన్నాహము ల్వీడ నెన్నాడి బాణాసుర
స్ఫారబాహా సహస్రచ్ఛిదాకేళిమై వాలిలోకంబుఁ బాలింపవే, ఘోర
భామా సురగ్రామణీశిక్షకా! కారవాకర్షితద్రౌపదీరక్షకా! ఖేదసం
దగ్ధసాందీపసూనుప్రదా! వేదశాఖాశిఖాంచత్ప్రివాళత్పదా! మా
ధవా! సత్యభామాధవా!

టీ. దండకము: కృష్ణావతారవర్ణనము.——యదుతిలక = యదువంశశ్రేష్ఠ, జగ
త్త్రయా...సరఃపద్మ-జగత్త్రయా=మూఁడులోకములయొక్క, నిర్మితిప్రక్రియా=సృజిం
చుటయందు, కర్మఠ=ఆసక్తుఁడగు బ్రహ్మ యనెడు, ఇందిందిర=తుమ్మెదచే; బ్రహ్మచేననుట.
ఉద్భాసి=ప్రకాశించు, నాభిసరఃపద్మ = బొడ్డనెడుకొలఁకునందలి తమ్మిగలవాఁడ! పద్మ
నాభుని నాభిపద్మమున బ్రహ్మపుట్టుటంజేసి యాతఁడాతనినాభిపద్మమునఁ దుమ్మెదభాతి
నుండె ననియు నాతనినాభి లోఁతై కొలఁకువలె నమరియుండె ననియు భావము. పద్మాసతీ
...ద్యోత్ర-పద్మాసతీ = లక్ష్మీదేవియొక్క, పాదపీఠాకృతి = పాదవిన్యాసపీఠముయొక్క
యాకారముతో, ప్రస్ఫురత్=ప్రకాశించు, కౌస్తుభ = కౌస్తుభమాణిక్యమునుండి, అంకు
రిత=మొలక లెత్తిన, అళీక = కృత్రిమము లైన, బాలాత్రప=లేయెండ లనెడు, ద్యోత్ర=
కాంతిగలవాఁడ! శ్రీవిష్ణునియురమునఁగల కౌస్తుభమం దుండు లక్ష్మికిఁ బాదపీఠమువలె
నుండె ననియు, నద్దానికాంతులు లేయెండలం బోలి మించుచుండె ననియు భావము.
పద్యో...జాల-పత్=పాదమునందైన, ద్యోతరంగిణీ=ఆకాశగంగాసంబంధ మైన, ఉద=
నీటిచే, క్షాళిత=కడిగివేయఁబడిన, ఏణాంకభృత్ = జింకచిహ్నముగాఁగల చంద్రునిభరిం
చినశివునియొక్క, పాంసుల ధూళిచే నిండిన, క్లిష్ట=చిక్కువడిన, వేల్లత్=చలించుచున్న,
జటాజాల=జడలసమూహముగలవాఁడ! తొలుఁదొల్త, గంగ విష్ణుపాదమున నుద్భవించి
పిదప నీశ్వరునిశిరసునఁ బడి క్రమముగ ముల్లోకముల వ్యాపించెను. దానంజేసి గంగోదకము
శివునిపాంసులజటాజూటమును శుభ్రపఱుపఁజాలె నని గ్రహించునది. జాలంధర...

ఆవాస - జాలంధరోడ్యాణ మూలాఖ్యబంధత్రయా = 'జాలంధరము, ఉడ్యాణము, మూలము' అను పేరుగల మూఁడుబంధములయొక్క, బంధ = నిర్బంధముచే, సంధుక్షిత=విజృంభితమైన, స్పర్శన=గాలియొక్క, స్పర్శ=తాఁకుటచే, నిర్గ్రంథిత = ముడిలేని విగాఁజేయఁబడిన, విప్పఁబడిన యనుట. గ్రంథిషట్క=ఆఱుగ్రంథులయొక్క; మూలాధారాది షట్చక్రములయొక్క యనుట. అంతర = నడుమను, ఊన్నిద్ర = మేలొక్కని యున్న, కద్రూసుత=సర్పముయొక్క; కుండలినీశక్తియొక్క యనుట. శ్రీముఖ=శోభాయుక్తమైన మొగమునంటిన, జ్వాలవల్లీ=కాంతిలతనుండి, పరిస్రంసమాణ=అంతట జాఱుచుండు, ఇందునిష్యంద = అమృతముచే నైన సర్వాంగనిష్పంద = సమస్తావయవముల స్థైర్యముగల, యోగీంద్ర=యోగిశ్రేష్ఠులయొక్క, హృద్వేదికా=మనఃపీఠములు, ఆవాస=వాసస్థానములుగాఁ గలవాఁడా! జాలంధరాదిబంధముల నిర్బంధవశమున గాలి రేఁగి తాఁకుటకతన గ్రంథిషట్కము విప్పఁబడు ననియు,దాన నాగ్రంథిషట్కమున నడుమంగల కుండలినీశక్తి మేలొక్కను ననియు, నపుడద్దానినుండి యమృతము జాఱు ననియుఁ, దదాస్వాద పరాయణులై యోగులు నిశ్చలులై యుందు రనియు,నట్టియోగులమదులను బరమాత్ముఁడు తావుగాఁ గొనియుండు ననియు భావము. 'మూలాధారము,స్వాధిష్ఠానము, మణిపూరము, అనాహతము, విశుద్ధము, ఆజ్ఞ' అని షట్చక్రములకుఁ బేరులు. ఇందే గ్రంథిషట్కము ముండు నని యెన్నవలయును. బ్రహ్మగ్రంథి, విష్ణుగ్రంథి, రుద్రగ్రంథి-మున్నగునవి గ్రంథులకుఁ బేరులు. ఈవాసవాదుల్ = ఈడేవేంద్రాదులు, సరోజాసనుఁ = బ్రహ్మను, మున్నగాఁ=ముందగునట్లుగా, చేసి=ఒనర్చి; బ్రహ్మను ముందిడికొని యనుట, సర్వంసహా భీరుభారంబుఁ =భూమి యను భయపడినదానియొక్కబరువును, పోఁ =పోవునట్లుగా, త్రోయవే=తొలఁగింపవే, అంచుఁ =అనుచు, ప్రార్థించినఁ =వేఁడఁగా, దేవకీదేవిగర్భంబునఁ =దేవకీదేవియొక్కకడుపున, ఉద్భవంబు=పుట్టుకను, అంది=పొంది, బాహుద్వయద్వందద్వముఁ =నాలుగుచేతులును, నందక...వ్రాతముఁ -నందక=నందక మనుకత్తియు, స్యందనాంగ=చక్రమును, అబ్జ=శంఖమును, కౌమోదకీ=కౌమోదకి యనుగదయు, శార్ఙ=శార్ఙ్గ మనుధనువును, ముఖ్య=మొదలగు, ఆయుధవ్రాతముఁ = ఆయుధములసమూహమును, పీతకౌశేయముఁ = పీతాంబరమును, వక్షఃస్థలంబునఁ = వక్షస్థలమున, మించు = ప్రకాశించునట్టి, శ్రీవత్సముఁ = శ్రీవత్స మనులాంఛనమును, చూపినఁ =అగపఱుపఁగా, తల్లి = దేవకీదేవి, భీతిల్లుచుఁ = భయపడుచు, కావు కావంగదే = రక్షింపవే రక్షింపవే, అన్నఁ =అనఁగా, నీవు, అంతలోఁ, కావుకావంచుఁ =కావుకావుమనుచు; శిశురోదనధ్వన్యనుకరణము.ఏడ్పులఁ =రోదనములు, తలిర్పఁ =ఒప్పఁగా, కసుంగందవై = పసిపాపవై, తండ్రియత్నంబునఁ = తండ్రియొక్కప్రయత్నముచే, నందగోష్ఠంబునఁ

=నందునియావులసాలలో, ఉన్నచోట=ఉండునపుడు, ప్రేతయై=గొల్లదియై, చేతిపాలు =చేదుపాలు; విషక్షీర మనుట. క్రొల్వక=త్రావించుటకై, ఏతెంచు=వచ్చిన, ఆపూత నాభూతనారీకుచంబు=ఆ పూతన యను రాకాసిపడతియొక్కస్తనమును, అగ్రహస్తం బునక = చేతికొనచే, పట్టి, తత్ప్రాణనిర్వ్యాణశంఖంబు = ఆవనితయొక్కప్రాణములు పోవునపుడైనచిందమును, పూరించుచందంబునక=నిండించువిధమున, గ్రక్కలక=డొ ర్పులను, నొక్కి=అణంచి, మక్కించియుక=చంపియు, బండిరాకాసిక=శకటాసురుని, కీలు=సంధి, డొడగాక=వదలునట్లుగా, తన్నియుక, వెన్నక=నవనీతమును, వేమాఱు= పలుమాఱు, కొల్లాడగాక = దొంగిలింపగా, గొల్లయిల్లాండ్రు = గోపికలు, నందార విందాస్యతోక = నందునిపద్మముఖతో, ఱట్టు=నింద, కావించినక = చేయగా, నిక్కపుంబట్టివే=నిజముగ సుతుడవే, అంచుక, నిక, పట్టి=పట్టుకొని, చట్రోలితోక = బాతిరోటితోడ, కట్టినక=బంధింపగా, దిట్టవై=శూరుడవై, కిట్టి=సమీపించి, వెన్నుద్ది మద్దుల్ = గొప్పవగుజంటమద్దులను; యమళార్జునుల ననుట. పడక, త్రోచియుక, శైశవంబుక = బాల్యమును, విడంబింపవే = అనుకరింపవే. దేవకీదేవి యనుపదము మొదలుకొని యింతవఱ కేకవాక్యము. ఇందు దేవకికి శ్రీకృష్ణుడుదయించి తన నిజ రూపమును జూపుట, నందునింటి కంపబడుట, పూతనను జంపుట, శకటాసురుని హతునిగావించుట, నవనీతమును ముచ్చిలుట, తల్లి రోటం గట్టగా దానిం గిట్టుట, యమళార్జునుల భంజించుట మున్నగు శ్రీకృష్ణుని శైశవవిలాసములు వర్ణితము లయ్యెను. లేగలుక = ఆలదూడలును, గోపబృందంబుక = గోపాలకసమూహమును, బృందావనారణ్య వాటిక = బృందావన మనెడి యడవియొక్కప్రదేశమున, నటింపక=సంచరింపగా, చలత్కాకపక్షంబుతోక = కదలునట్టి పిల్లజుట్టుతోను, బర్హిబర్హావతంసంబుతోక = నెమిలిపించెమురూపమగు శిరోభూషణముతోడను, మంజు...దామంబుతోక-మంజు= అందమైన, గుంజాఫల=గురివిందలయొక్క, ఉద్దామ = అధికమైన, దామంబుతోక = దండతోను, తానమానక్రియాశంసివంశంబుతోక = స్వరాంతరప్రవర్తనావ్యాపార మును బ్రకటించు పిల్లనగ్రోవితోను, ఏపు=అతిశయమును, దీపించు = ప్రకాశింపజేయు, నీప్రాపు=నీరక్షణము గల, ప్రేపాపలక=గొల్లపిల్లలను, క్రేపులక=ఆలమందలను, వైప రీత్యంబుగాక = వ్యత్యస్తమగునట్లుగా; అనగా వేఱుపడునట్లుగా, పాపి=ఎడబాయ జేసి, ఆపద్మజుడు=ఆబ్రహ్మ, ఒక్కచోక = ఒకానొకప్రదేశమున, డాచినక = దాపగా, వానిరూపంబు = ఆ గోపాలకులయొక్కయు నాలమందలయొక్కయు స్వరూపము, నీవై = నీవే యయి; అనగా నీవే గోపాలకులయుఁ, గ్రేపులయు రూపును ధరించినవాడవై యనుట. పునస్సృష్టిక = ప్రతిసృష్టిచేతను, ఆసృష్టగర్వంబుక =

ఆబ్రహ్మగర్వమును, ఖర్వంబుగాన్ =హ్రస్వమైనదిగా, చేయవే=ఒనర్పవే. బ్రహ్మగోపాలురను మందలను దాచివేసి మాయముచేయఁగా, శ్రీకృష్ణుఁడు తానే వానిరూపముం దాల్చి వునస్సృష్టి యొనర్చి సృష్టికర్తయగు బ్రహ్మగర్వము నడంచె నని భావము. తోయవేగ... ధ్వానము-తోయవేగ = ఉదకవేగముచేత, ఊచ్చలత్ =లేచిన, వీచికా = తరంగములనెడు, మర్దళ=మద్దెలలయొక్క, ధ్వానమ=ధ్వని, ఆగబ్బుగాన్ = అతిశయింపఁగా, ఉబ్బునన్ =సంతోషముతో, కేళిన్ = విలాసముతో, కాళిందిలోన్ = కాళిందియను మడువులో, కాళియాహి...మధ్యంబునన్ - కాళియాహి = కాళియమనునాగము యొక్క, స్ఫటా=పడగ లనెడు, రంగ=నాట్యభూమియొక్క, మధ్యంబునన్ , నడుమను, తాండవంబు=నృత్యమును, ఆడవే=చేయవే, తోడిగోపాలకశ్రేణికిన్ =నీతోఁ గలిసిమెలసియున్న గోపాలురకును, నీకున్ , జన్నంబులన్ =యజ్ఞంబులందు, మ్రోఁదుగాన్ =ముందుగా, ఉన్న=ఉంచిన, అన్నంబులన్ , పంచితాత్మేశలై =మోసపుచ్చిన పతులుగలవారై పంచలన్ =గృహపార్శ్వదేశముల, చల్దులు, అందీన్ =అందింపఁగా; ఇది శబ్దపల్లవ మని యందురు. మునిస్త్రీలకున్ =మునిపత్నులకు, లీలన్ =విలాసముతో, కైవల్యము = మోక్షమును, కొల్ల=అనివార్యముగా, ఈవే=ఒసంగవే. మునిపత్నులు తమ పతులకుం దెల్పక దేవతలకై ముడుపుగా నుంచిన యన్నమలం దెచ్చి శ్రీకృష్ణునకును, నాతనితోడిగోపాలురకును నొసంగ వాని నారగించి వారికి మోక్షముం గృపచేసె నని భావము. సర్వదేవతాస్వరూపుఁడును, యజ్ఞపురుషుఁడును నగు శ్రీకృష్ణుఁ డిట్లొనరించుటలో వింత యేమి? తత్ప్రీణనమునకేగదా యజ్ఞాదు లేర్పడినవి. పెనుంజీల్వయై=పెద్దపామయి, బల్విడిన్ = ఉద్ధతితో, జంగిలిన్ =ఆలమందను, మ్రింగు వైతేయవాతన్ = రాక్షసునినోటను, వడిన్ =వేగముగ, చొచ్చి=ప్రవేశించి, మై=శరీరమును, పెంచి=వృద్ధినందించి, తత్కాయమున్ = ఆసర్పరూపియగు రక్కసునిశరీరమును, రెండుపాయల్ = రెండుచీలికలు, పడన్ =పడునట్లుగా, చించి=చీరి, గోపంక్తిన్ =ఆలచాలును, పోషింపవే = రక్షింపవే. గుంపులై =సమూహములై, ఇంపులన్ = ప్రేమలతో, కూడి=కలసి, ఆభీరులు = గొల్లలు, ఆదేవతానేతకున్ = ఆదేవేంద్రునకు, జాతరల్ = ఉత్సవములు, సేయన్ , వారించి = వలదని, తత్పూజనల్ =ఆయ్యర్చనలను, నీవు, కైకొన్నన్ =స్వీకరింపఁగా, మేకొన్న=అంగీకృతమైన, పేరల్కతోన్ =పెద్దకోపముతో, పుష్కరావర్తకాబ్దంబులన్ = పుష్కరావర్తకములను మేఘములను, పంపఁగాన్ ,అంపజాలంబుగాన్ =బాణసమూహమగునట్లుగా, కొండలు, ఉర్లంగన్ = పెకలింపఁబడునట్లు, వర్షించినన్ , కాందిశీకత్వమున్ = భయపడి పాఱిపోవుటను, పొందు=పొందిన, ఆమందలన్ =ఆలమందలను, ప్రోవన్ = రక్షించుటకొఱకై, గోవర్ధనంబు = గోవర్ధన మనుకొండను, ఎత్తవే=పైకెత్తితివిగావా! గొల్ల

లెల్ల దేవేంద్రున కుత్సవం బొనర్ప నెంచి సర్వసంభారములం గూర్చికొని సిద్ధముగనుండ శ్రీకృష్ణుఁడు వారి నింద్రునకై జాతర సేయవల దని వారించి తత్సంభారములను దత్పూ జనములను, దత్థానమునఁ దానే పొందఁగా నింద్రుఁడు కోపించి పుష్కలావర్తముల ననిపి మహోపద్రవముగ వర్షింపించిన గోవులును గోపకులును గాందిశీకులు గాఁగ గోవర్ధనము గొడుగువడువున నెత్తి దానిక్రింద గోవులను గోపకులను నుంచి రక్షించె నని తాత్పర్యము. మత్తవేదండము=మదగజము, ఊర్ధ్వోత్థితిక్ =ఊర్ధ్వతితో, నెత్తమ్మిపూవు=మనోజ్ఞమగు పద్మమును, ఎత్తురీతిక్ = ఊర్ధ్వరించుగతిని, నిలింపా...వర్ధమక్ - నిలింప = దేవతలకు అనిశ=ఎల్లపుడును, అరిష్ట=ఆపత్తును, ద=ఇచ్చునట్టి, అరిష్ట=అరిష్టమను పేరుగల, మాయా బలీవర్ధమక్ = కృత్రిమవృషభమును, పట్టి, మర్దించితి = కొట్టితివి. అంచుక్, వడిక్ = శీఘ్రముగ, శూకలాశ్వాకృతిక్ = మదించినయశ్వము నాకారముతో, డాసినక్ = సమీపింపఁగా; రూ. అ. బాయు. దకారమునకు డకారము కల్గె. కేశిజీవానిలంబుల్ = కేశి యనురాక్షసుని ప్రాణవాయువులను, భుజాదండశూకంబునక్ = చెయి యనుసర్పముచే, క్రోలి=త్రాగి, నీయీవనోద్యద్భుజాగర్వముక్ =నీసంబంధమైన ప్రాయమువలన నుదయించిన భుజములమదమును, చూపవే=అగపఱుపవే! సర్పము వాయుభక్షకమగుటం జేసి ప్రాణవాయుభక్షణసమర్థనార్థము భుజమునందు సర్పత్వ మారోపిత మయ్యెను. శరదభినవ...వీథిక్ -శరత్ =శరత్కాలముచే, అభినవ = నూతనమైనదియు, సాంద్ర=తఱచై నదియు నగు, చంద్రప్రభా=వెన్నెలచే, ధౌత=తెల్లనైన, భాస్వత్ =ప్రకాశించునట్టి, కళిందాత్మజా=యమునానదియొక్క, సైకత=ఇసుకతిన్నెయొక్క, ఊర్ధ్వసంగవీథిక్ = అంకభాగమున, త్రిభంగ్యాకృతిక్ = మువ్వంకయైనయాకారముతో, నిల్చి = ఉండి, ఆకుంచితభ్రూవిలాసంబుతోడక్ = గఱివంకబొమలయొక్కఅందముతో, మోము = ముఖము, వామాంసమక్ = ఎడమబుజమును, చేరఁగా=చెందఁగా, శోణాదంతచ్ఛదాంతంబునక్ =ఎఱ్ఱనైన పెదవియొక్కకొనచే, వేణునాళంబుక్ =పిల్లనగ్రోవిని, సంధించి = పట్టి, రంధ్రాంతర...గ్రంబులు - రంధ్రాంతర = బిలములమధ్యలందు, న్యస్త=ఉంచఁబడిన, హస్త = చేతులయొక్క, అంగుళీపల్లవ = చిగురులంబోలు వ్రేళ్ళులయొక్క, అగ్రంబులు=కొసలు, అల్లాడక్ =చలింపఁగా, మ్రోయించినక్ = వాగునట్లు చేయఁగా, ముక్త...బృందమక్ -ముక్త = విడువఁబడిన, రోమాంచ = నెమరుకలదియు, నిష్పంద= చలింపనిదియు నగు గోబృందమక్ = ఆవులసమూహమును, వ్యక్త...నిష్యందమక్ - వ్యక్త=ప్రకటిత మగు, గోవర్ధనగ్రావ = గోవర్ధనపర్వతపురాలయొక్క, నిష్యందమక్ = స్రవించుటయు, మంద...వేగమక్ -మందమంద = మిగుల మందమైన, అంశుమన్నం దనా=సూర్యునికూఁతు రగు కాళిందియొక్క, వేగమక్ =త్వరయును, కందళిత్ .....

గమక్ - కందళిత్ = మొలకలెత్తు (చిగుర్చు), నీరసారణ్య = ఎండినయడవియందలి, జీర్ణాగమక్ = ముసలిమ్రాకులు గలదియు, కాకక = అగునట్లుగా, కదంబించు = వాసించునట్టి, తత్పంచమారావమక్ = ఆవేణునాదసంబంధ మగు పంచమధ్వనిని, వించుక్ =ఆకర్ణించుచు, అయ్యించువిలాక్కనికిక = ఆమన్మథునకు, చిక్కి = వశలై, రాధాదిగోపావరోధాంగనల్ = రాధ మున్నగుగోపాలురభార్యలు, డాసినక = చేర రాఁగా, రాససంక్రీడక = రాసక్రీడచే, మాయాసముల్లాసివై = మాయానందముగల వాఁడవై, సౌఖ్యవారాశిక =సుఖసముద్రమున, ఓలార్పవే = ఈఁదఁజేయవే. శరచ్చంద్రికచే మిగుల ధవళితమైన యమునాపులినోర్విని శ్రీకృష్ణుఁడు మువ్వంకగా నిల్చి గజీవంక బొమ లమర మోము వామాంసమున నమరిచి పెదవులందు మురళి నమర్చి మురళీబిలముల ప్రేళులు చలింపఁ బంచమనాద మెలర్ప వాయింప, నాలమందలు నెమరువేయుట మాని నిశ్చలములై నిల్చె ననియు, గోవర్ధనగిరిశిలలు కరంగె ననియు,యమునాప్రవాహవేగముం గూడ మిగుల మెల్లనయ్యె ననియు, మ్రోడులు చిగిర్చె ననియు, రాధాదిగోపాంగనలు మన్మథవశ లై యాతనికడ కేతెంచి రనియు, వచ్చినవారలను రాసక్రీడావిశేషమునఁ గృత్రిమానందపరవశుఁడై యానందాబ్ధి నోలలాడించె ననియు భావము. అనఁగా శ్రీకృష్ణుని మురళీగానమాధురిని రాలు గరఁగె ననియు, నావులుగూడ పరవశములయ్యె ననియు, గోపికలు మన్మథవశలైరనియు యచేతనమగు యమునాప్రవాహముంగూడఁ బరవశమయ్యె ననియు, మ్రోడులుగూడఁ జిగిర్చె ననియుఁ దాత్పర్యము. గోపికలసమూహమున నొక్కొక్కద్వంద్వముతో శ్రీకృష్ణుఁడు తా నొక్కఁడే పలురూపములం దాల్చి మండలాకృతిని విహరించుట రాసక్రీడావిశేషముగాఁ దెలియుచున్నది. దర్పితా...దుస్సాధమై-దర్పిత=గర్వితులైన, అశేష=సమస్తమైన, దోషాచరాధీశ=నిశాచరపతులకును, దుస్సాధమై=సాధింపరానిదై, ఉన్న నీవిక్రమక్రీడక =నీపరాక్రమక్రీడను, వీక్షింపక = చూచుటకై,అక్రూరు చేక =అక్రూరుఁడనువానిచే, మామ = మామయగుకంసుఁడు, పిల్పించినక =పిలిపింపఁగా, పోవుచోక =ఏఁగునపుడు, త్రోవక =మార్గమున, భావాతిగంబు = డోహింపరానిది, ఐన, నీదివ్యరూపంబుక = నీమంగళరూపమును, చూపక = అగపటు పఁగా, పరిభ్రాంతుఁడై=విమోహితుఁడై, ఉన్నక =ఉండఁగా, వానిక =ఆయక్రూరుని, నీవానిఁగాక =నీభక్తునిఁగా,మున్నింపవే=గారవింపవే.కంసుఁడు శ్రీకృష్ణుని పరాక్రమముం జూడ నక్రూరునిచేఁ బిలిపింపఁగా శ్రీకృష్ణుఁ డేఁగుచు దారిలో నక్రూరునకుఁ దన దివ్యరూపముం జూపె ననియు, దాన నాతఁడు భ్రాంతుఁడుగా వాని మన్నించె ననియు భావము. భోజభూజాని = కంసుఁడు, ఉద్వేజనంబు = భయమును, అందక = పొందునట్లుగా, ప్రభ్రాజధానిక = ఆతని ముఖ్యపట్టణమగుమధురను, ప్రవేశించి = చొచ్చి,

ఏతెంచుచోక్ =వచ్చునపుడు, చందనాలేపమున్ = చందనపంకమును, దర్శనంబు = కాన్కగా, ఇచ్చినన్ =ఒసఁగఁగా, గుజ్జుప్రయోజనికిన్ = కుబ్జ యనుగృహిణికి, సజ్జకం బైన=మనోజ్ఞమైన, అందంబున్ =సొగసును, ఒందింపవే=పొందునట్లు చేయలేదా! చందనాలేపము నాకుగా నొసంగఁ గుబ్జకు సుందరరూపముం గృష్ణుఁడు కృపచేసె నని భావము యాగపూజార్చితంబైన = యజ్ఞార్చనచేఁ బూజితమైన, కోదండమున్ =ధనువును, ఖండఖండంబుగాన్ = తుత్తునియలుగా, చేయుచున్, తద్ధనుం...మస్తంబులన్ - తద్ధనుర్దండ = ఆకోదండమునియొక్క, రక్షా=రక్షించుటకల, భటస్తోమ = భటసమూహా ములయొక్క, మస్తంబులన్ =శిరస్సులను, పెల్లుగాన్ = అధికముగా, డొల్లఁగాన్ = జాఱునట్లు, ప్రేయుచున్ =కొట్టుచు, మల్ల...భీలమై-మల్ల = జెట్టులయొక్క, గర్జా = సింహనాదములతోడను, భుజాస్ఫాలన=భుజముల యప్పళించుటలతోడను, ఆభీలమై = భయంకరమై, ఉల్లసత్ ...వాచాలమై-ఉల్లసత్ = ఒప్పుచున్న, డిండిమారావ=డిండిమ మను వాద్యవిశేషముయొక్కధ్వనిచే, వాచాలమై = ధ్వనించుచున్నదై, నిగ్రహా... దగ్రమై-నిగ్రహ=శిక్షించుటకై, ఆయాత=వచ్చిన, రక్షోభట = రక్షకభటులచే, ఊద గ్రమై=అధికమైనదై, ఉన్న, అయ్యుగ్రసేనాత్మజాస్థానిన్ = ఆకంసుని యాస్థాన భూమిని, చొత్తేరన్ =ప్రవేశింపఁగా, తత్తోరణక్ష్మోణిన్ = ఆసభాభవనబహిర్ద్వారప్రదే శమున, ఆఘోరణుండు=మావటీఁడు, ఉద్ధతిన్ = అతిశయముతో, పైపయిన్ = మీఁద మీఁద, కొల్పినన్ =పురికొల్పఁగా, పట్టపేనుంగున్ = పట్టపుగజమును; కువలయాపీడ మనుదానిని, చెండాడి=చంపి, గండ...పంకంబునన్ -గండ=చెక్కిళులనుండి, స్రవత్ = జాఱుచున్న, దాన=మదమును, పంకంబునన్ =బురదచే, పుండ్రమున్ =తిలకమును, కుంభ నిర్ముక్తముక్తావళిన్ =కుంభస్థలమునుండిజాఱినముత్తెములసమూహమును చే, కర్ణదామంబున్ =చెవుల కలంకారమగుదండను, కట్టి = కూర్చికొని, రక్తంబునన్ =ఆయేనుఁగు నెత్తుటిచే, పట్టై=సాంద్రమగు, మైపూఁతయున్ =శరీరలేపమును (చందనపుఁబూఁతవంటిదానినను ట), ప్రీతిగాన్ =సొగసుగా, పూసి=పూసికొని, తద్దంతకాండంబు=ఆయేనుఁగుయొక్క దండమంబోలుదంతము, కేలన్ =హస్తమున, గదాదండమై=గదరూపమగు నాయుధవిశే షమై, ఉండఁగాన్, జెట్టివై = మల్లుఁడవై, చాణూరు=చాణూరుని, జానూరువుల్ = మోఁకాళ్లను దొడలను, నూఱుమాఱుల్ =నూఱుపర్యాయములు, వడిన్ = శీఘ్రముగ, త్రిప్పి=గిరగిరఁద్రిప్పి, గిట్టి=చంపి, నీవు, అప్పళింపన్ =చఱువఁగా; భుజోర్వాస్ఫాలన మొనర్పఁగా ననుట. భయభ్రాంతుఁడై = భయముచేఁ దెలివితప్పినవాఁడై, పాఱన్ = పాఱిపోవుటకు, ఊంకించు=యత్నించునట్టి, అక్రూరున్ =ఆరాక్షసుని, కంసున్ = కంసుని, త్రిలోకీనృశంసున్ = ములోకములకు హింసకుఁడైనవానిని, నియుద్ధక్రియా

పద్ధతిక్ = బాహుయుద్ధవ్యాపారముయొక్కమార్గమున, కిక్కిసక్ = మిక్కితి నొక్కుటచేత, గొంతుక్రోల్ =కంఠనాళమును, నొక్కవే = అదుమవే! దేవతా... హర్షంబులక్ -దేవతా = సురలసంబంధమైన, దుందుభివ్రాత=దుందుభులను వాద్యవిశేషములగుమియొక్క, ధింధింధిమిధ్వాన = ధింధింధిమియనుధ్వనితోడగూడిన, గానస్వర= గీతస్వరములయొక్క, ఉత్కర్ష=అతిశయముచేసైన, హర్షంబులక్ =సంతోషములతో, కల్పకద్రు...వర్షంబులక్ - కల్పకద్రు = కల్పవృక్షసంబంధమైన, ప్రసూనాతినర్షం బులక్ =పుష్పరూపములగు విపులమైనవర్షములచే, పెల్లుగాక్ =అధికముగా, ఎల్లలోకం బులుక్ =సమస్తలోకములు (అనఁగా వానియందలిజను లనుట), ఉల్లాసముక్ =సంతోష మును, పొందఁగాక్ = పొందునట్లుగా, వానిరాజ్యంబునక్ = ఆకంసునిరాజ్యమున, పూజ్యుఁగాక్ =పూజింపఁదగువానినిగా, ఉగ్రసేనుక్ =ఉగ్రసేనుఁడను కంసునితండ్రిని, ప్రతిష్ఠాపితుక్ =నెలకొల్పఁబడినవానినిగా, చేయవే=ఒనర్పవే, కంసునిరాజధానిం బ్రవే శించునపుడు బహిర్ద్వారమున మావటీఁడు మదగజముం గువలయాపీడమున దనపైఁ బురి కొల్ప శ్రీకృష్ణుఁడద్దానిం జంపి దానిమదమునఁ దిలకమును దిద్దికొని దాని కుంభస్థలము నందలి ముత్యములఁ గర్ణపూరముగఁజేసికొని దానిరక్తము మైపూఁతగ నొనర్చి దాని దంతముం గదాదండముగఁజేకొని భయదమైన కంసాస్థానభువిం జొచ్చి చాణూరుని ముష్టికుని మడియఁజేసి కంసుని కంఠనాళమును నొక్కి చంపి యాత్రనిపట్టణమున నాత్రని తండ్రి నుగ్రసేనుం దేవదుందుభులు ప్రాయం బ్రతిష్ఠించె నని భావము. దుష్టుక్ =దుర్మా ర్గుని, అష్టాదశాక్షౌహిణీవాహినీదుర్మదాంధుక్ = పదునెనిమిది యక్షౌహిణులపరిమా ణము కల సేనచేసైన దుష్టమైనగర్వముచే గ్రుడ్డివాఁడైనదానిని; పదునెనిమిదక్షౌహిణులు గల వని గర్వించి కన్నుగాననివాఁ డనుట.జరాసంధుక్ =జరాసంధుఁ డనువానిని, భీమాప దేశంబునంజేసి=భీమునిమిష చే, శాసించి=చంపి, కౌంతేయుచేక్ =ధర్మరాజుచే, రాజ సూయంబు = రాజసూయ మనుయజ్ఞంబును, చేయించుచోక్ =ఒనరింపఁజేయునపుడు, జాత్యసూయక్ =జాతియందైనయసూయచే;తానుత్తమక్షత్రియుండననియుఁగృష్ణుఁడు కాఁ డనియు ననుసీర్ష్యచే ననుట. భయంబు=వెఱపును, ఏది = విడిచి, చేదిక్షమాపల్ల భుండు=చేదిదేశాధీశుఁ డగు శిశుపాలుఁడు, ఎంతయుక్ =మిక్కిలి, త్రుళ్లునక్ =మిడిసి పాటుచే, ప్రల్లదంబు = దుష్టాలాపములు, ఆడినక్ =పలుకఁగా, పల్లెరంబు = పల్లెరముం బోలుచక్రమును, ఎత్తి=పైకెత్తి, తచ్ఛిరఃకర్తనప్రౌఢిక్ = ఆతని తలనఱుకుటయందలి ప్రౌఢత్వముతో, వర్తించి=ఒప్పి, పదునెనిమిదక్షౌహిణులు తనకుఁ గలవని గర్వించియున్న జరాసంధుని శ్రీకృష్ణుఁడు భీమునిచేఁ జంపించి శత్రుశూన్యముగ భువినొనర్చి శత్రుజయా

నంతరమునఁ జేయఁదగినరాజసూయ మనుయాగముం గాంతేయాగ్రజుచేఁ గావించి యం దర్ఘ్యప్రదానవిషయమునఁ దన్నర్హునిగ నెన్నికొనఁగా శిశుపాలుఁడు తన్నుత్తమ క్షత్రియుఁడవు గావని దుర్భాషలాడినఁ, జక్రాహతి నాతని తలం దునిమె ననిభావము. రెండుశకలములుగ నుదయించినవానిని జర యనుదేవత సంధించి యొకటిగఁ జేయుటం జేసి జరాసంధనామ మాచేదీశునకుఁ గల్గెను, అక్షోహిణి యనియు నోకారమధ్యముగఁ గవు లుపయోగించియున్నారు. 'సహస్రాక్షోహిణు లట్లు మీరు చూడరె యెందుఁ' అని తిక్కన. ఇరువదియొకవేయియు నెనిమిదినూర్ల డెబ్బదిరథములును, నన్నియె గజము లును నఱువదియేను వేలయాఱునూర్ల పదిగుఱ్ఱములును, నొకలక్షయుఁ దొంబదిమూఁడు వేలమూఁడువందలయేఁబది కాల్బలమును గల్గినవాహిని యక్షోహిణి నాఁబడు నని యాది పర్వము. రాజసూయము = రాజులఁ జంపినకారణముగాఁ జేయునది. ధాత్రిక్ =భువిని, వృథావాసు.....శౌండీరుక్ -వృథా=వ్యర్థముగా, వాసుదేవ=వాసుదేవుఁడను, ప్రథా =ప్రసిద్ధిగల, చండ = దుష్టుఁడైన, శౌండీరుక్ =గర్వితుఁడైనవానిని, అపాఁయిండ్రుక్ = ఆపాఁయిండ్రకుఁ డనువానిని, చక్రాహతిక్ =సుదర్శనమనుచక్రంపుదెబ్బచే, చక్కఁగాక్ = ముద్దగా, చేసి; చంపి యనుట. శ్రీకృష్ణుఁడు వసుదేవాపత్యముగాన వాసుదేవుఁ డనుపే రాతనియెడల నన్వర్థ మగును. పౌండ్రకుఁ డట్లుగాక తగనిరీతిని దావాసుదేవుఁ డనుతన నామముం దాల్చి దుష్టుఁడై పరఁగుచుంట శ్రీకృష్ణుఁ డాతనిం జంపె నని తాత్పర్యము. పోరక్ =యుద్ధమున,మహాసేన...సన్నాహముల్ -మహాసేన=కుమారస్వామియొక్కయు, వాగానన=గజాననునియొక్కయు, వ్యూహసన్నాహముల్ = సేనాసన్నివేశపుఁగ్రమములు, వీడక్ =విచ్చిపోవునట్లుగా, ఈశానుక్ =శంకరుని, వెన్నాడి=తఱిమి, బాణాసుర... కేళిమైక్ - బాణాసుర=బాణుఁ డనురక్కసునియొక్క, స్ఫార = విస్తారమైన, బాహా సహస్ర=వేయిచేతులయొక్క, చిదాకేళిమైక్ =నఱకుట యనునాటచేత, వాలి=మించి, లోకంబు=జగమును, పాలింపవే=రక్షింపవే. శ్రీకృష్ణసుతుఁ డనిరుద్ధుఁ డుషాసఖి యగు చిత్రలేఖ దగుమంత్రబలమున బాణతనూజ యైన యుష యనుకన్యకదగునంతిపురంబు నకు గొనిపోఁబడి యామెతోడం గూడియుండ నంత నామెకు గర్భమొదవఁ దత్క్ర న్యాసఖులు భయపడి బాణున కావిషయమును నివేదించిరి. అంత నారాక్షసరాజనిరుద్ధుఁ గారాగారమున నిరుద్ధుఁజేసెను. శ్రీకృష్ణుఁ డాతని విడువు మని కోరినను నాతఁడు విడువ కుండెను. బాణునితపమునకు మెచ్చి శివుఁ డాప్రనివాకిటఁ గాపరియై యుండువాఁడు గాన శ్రీకృష్ణాదులు బాణునిపై దండెత్తినపుడు శివుఁడు తనభక్తునకుఁ గుమారస్వామి తోడను గజముఖునితోడను బ్రమథగణసమేతుఁడై తోడుసూపెను. అయ్యుదనున జన్య మున శ్రీకృష్ణుఁ డాకుమారబలమును గజముఖునిబలమును గాంచిశీక మొనర్చి యీశు

నోడించి బాణుం జంపి యుషానిరుద్ధులం గొని పురికేఁగి వారికిఁ గల్యాణమొనర్చె నను కథ యిచట ననుసంధింపఁదగును. ఘోరభ్రామాసురగ్రామణీశిక్షకా = భయంకరుఁడైన భూమిసుతుఁడైన నరకాసురుం డనురాక్షసశ్రేష్ఠుని శిక్షించినవాఁడా, కౌరవాకర్షిత ద్రౌపదీరక్షకా = కౌరవునిచే నీడ్వంబడు ద్రౌపదిని రక్షించినవాఁడా! ఖేదసందగ్ధసాందీ పసూనప్రదా=దుఃఖముచేఁ బరితప్తుఁ డైన సాందీపునకుఁ గుమారుఁ నొసంగినవాఁడా, (ఉజ్జీవింపఁజేసినవాఁ డనుట) వేదశాఖాశిఖాంచత్ ప్రవాళప్రదా=వేదము లనుకొమ్మల యొక్క యగ్రముల నొప్పునట్టిచిగుళ్లవలె నాచరించుచున్న పాదములు గలవాఁడ; వేదాంతవేద్యుఁ డని భావము. మాధవా = శ్రీకృష్ణా(లక్ష్మీపతీ), దీనిచే రుక్మిణీపతిత్వము సూచితము. సత్యభామాధవా=సత్యభామకుఁ బతియైనవాఁడా.

విశే. ఇందు శ్రీకృష్ణునిశైశవాద్యవస్థలం దగుకృత్యములు సరసముగ వర్ణితములు అందు ముఖ్యముగ దుష్టశిక్షణ మిందు సూచిత మగుటంజేసి, యాతనివిష్ణుత్వమును సమర్థిత మగుచున్నది. దీనిం దండకం బండ్రు. ఇది యుద్ధరమాలావృత్తములలోఁ జేరును. తొలుఁదొల్త నగణములు రెండు నిల్పి పిదప నన్నియు రగణములే నిల్పుట యొకలక్షణము. ఒక నగణము తొలుతను, బిదప నన్నియుఁ దగణములే నిల్పుట వేఱొకలక్షణము. అన్నియుఁ దగణములే నిల్పుట యొండొకలక్షణము. ఇందేదేని స్వీకరింపనగును. ఈ దండకమునఁ దొలుత రెండునగణములును బిదప రగణములును నిల్పఁబడినవి. కాన మొదటవ్రాసినలక్షణమునకె యియ్యది లక్ష్యమగుచున్నది. సమాన మగు గురు లఘువులు గలరగణములతోనే కూర్పఁబడిన దౌట దీని గణ సమకదండక మనఁ జనును. మనోహరము లగు ననుప్రాసాదిశబ్దాలంకారములతోడను స్వభావోక్త్యాద్యర్థాలంకారములతోడను, మృదుమధురపదసందర్భముతోడను, నిది హృద్యంబై వెలయుచున్నది. ముక్కుతిమ్మనార్యముద్దుపల్కుం దాయూయీసందర్భముల మనోజ్ఞమై యమరియున్నది.

### కృష్ణుఁడు వైజయంతమున విడియుట

చ. అని కొనియాడి విశ్వభువనైకధురంధర! నేఁడు రేపు నీ
వనితయు నీవు నిచ్చట నవశ్యము మజ్జనభోజనాదిపూ
జనములు గైకొన న్వలయు సమ్మతిమై నని పల్క దేవతా
జననికి మ్రొక్కి యియ్యకొని జంభవిరోధి మొగంబుఁ జూచినన్. 39

టీ. అని, కొనియాడి = నుతించి, విశ్వభువనైకధురంధర = సమస్తప్రపంచము నకు ముఖ్యుఁడైనభారవాహకుఁడా; నీవనిక్రియ, నీవు, నేఁడు = ఈదినము

నను, రేపుక్ = మఱుచటిదినమునను, ఇచ్చటక్, అవశ్యముక్ = తప్పక, మజ్జన భోజనాదిపూజనములు = స్నానము భోజనము మున్నగుసపర్యలు, సమ్మతియిమ్మె = అంగీకారముతో, కైకొనక వలయును = స్వీకరింపవలెను, అని, పల్కక్ = అనఁగా, దేవతాజననికిక్ = దేవతలకుఁ దల్లియైనయదితికి, మ్రొక్కి=నమస్కరించి, (కృష్ణుఁడు కర్త), ఇయ్యకొని = అంగీకరించి, జంభవిరోధిమొగంబుక్ = జంభశత్రువగు నింద్రుని మోమును, చూచినక్ =తిలకింపఁగా.

భా. సుగమము.

వ్యా-విశే. మెయి. మయి. మై. ఇవి తృతీయాప్రత్యయార్థకములు.

చ. అమరవిభుండు సేరి వినయానతుఁడై విడిపట్టు వైజయం
తమునను జిత్తగింపు మన నవ్వుచుఁ దద్బలదైత్యవైరిహా
స్తముఁ గయిదండ గొంచు గిరిశప్రముఖాఖిలలోకపాలకుల్
క్రమమునఁ జేరి కొల్వఁ జని కాంచెఁ దదున్నతసౌధరాజమున్. 40

టీ. అమరవిభుండు = దేవేంద్రుఁడు, చేరి=సమీపించి, వినయావనతుఁడై=అడఁకువచే నమ్రుఁడై, విడిపట్టు=విడిదల, (బస) వైజయంతమునక్ =వైజయంత మనుప్రాసాదమును, ఇంద్రుఁడుండు మేడ కిది పేరు. చిత్తగింపుము = అనుగ్రహింపుము, అనక్, నవ్వుచుక్, తద్బలదైత్యవైరిహస్తముక్ = ఆ బలాసురశత్రువగు నింద్రునిచేతిని, కయిదండ=డాఁక, కొంచుక్ =స్వీకరించుచు, గిరిశప్రముఖాఖిలలోకపాలకుల్ =ఈశానుఁడు మొదలగులోకపాలురు, క్రమమునక్ = వరుసగా, చేరి=సమీపించి, కొల్వక్ = సేవింపఁగా, చని=ఏఁగి, తదున్నతసౌధరాజముక్ =అయ్యింద్రునిసౌధశ్రేష్ఠమును, కాంచెక్ = చూచెను.

భా. సుగమము.

వ్యా-వి. కయి. రూ. కై . కయి=చేతికి, దండ-ఆశ్రయము=కైదండ.

## వైజయంతవర్ణనము

వ. అదియును నామరసరిదుపహృత హేమతామరసస్తోమతోరణతామ
రామణీయకసూచితసౌదామనీవిలసితంబును, గనత్కనకకింకిణీకులసం
కులక్వాణముగ్ధమధురాలాపనృత్యన్నిజాపత్య మూర్ధ్వావహాపార్శ్వ
ప్రవర్తమానవిమానసంతానంబును, నర్థిజనాభిమతదానార్థసంగ్రహ
సంశయాపాదిసమస్తవస్తుప్రతిబింబసంభావితశేఖరీకృత చింతారత్నంబు
ను, నక్షీణసహస్రాక్షమణిగవాక్షావళీసాక్షాత్కృతనాకలక్ష్మీకటాక్ష

వీక్షాసిశేషంబును, ననర్ఘ్యమణిస్తంభ ప్రతిబింబితనృత్యదప్సరస్సహస్ర ప్రదర్శ్యమానలాస్యావలోకన సారస్యాగతగృహదేవతాశతసన్నిధానంబును, పులోమనమురుచి జంభపాకవృత్రబలప్రముఖదైత్యవిధ్వంసన సన్నద్ధశతమన్యుజన్యసన్నాహోనుకారిచిత్రకర్మవిచిత్రతభిత్తిభాగంబును, వళితరుచిరరుచి నిరంతరస్ఫాటికకూటాంతరవిశ్రాంతైరావతోచ్చైశ్రవస్సూచ్యమాన క్షీరసాగరస్నానక్రమంబును, దరంగితమణి[1]భృంగారకవీటికా కరండతాలవృంతచామరదర్పణకళాచికాపాదుకాదిపరికరప్రపంచ సంచితకాంచల[2]విశ్వకర్మనిర్మితయంత్రపాంచాలికాసంచయ వంచితపరమార్థపరిచారికాసార్థంబును, నిరంతరసంతానానోకహాదుకూలమయపతాకాశతాకారితాకాశగంగాచటుల తరంగావతరణంబును, సమంతతస్తంతన్యమానతోయకర్కాంతికనిర్ముక్తమందారవిటపి మకరందగంధసలిలసేకాతిరేకశీతలమణివేదికాప్రదేశంబును, బహిర్ద్వారవితర్దికాప్రకోష్ఠప్రతిష్ఠాపితాష్టాపదఖట్వాస్తీర్ణ హరిచందన సాలబాలపల్లవోల్లసితసంథ్యారాగసంథానంబును, నవిరళకల్ప ప్రసవ రజఃపటల పటవాస పాంసు వాసిత కౌశేయ వితాన పటీ ప్రకటీకృత చంద్రాతపపరిపాటికంబు నగుచుఁ, జతురతరశచీకరవిరచితంబు లై మణికుట్టిమతల ప్రతిబింబితతారకాకుటుంబంబుల విడంబించు పారిజాతకుసుమోపహారంబులవలన, స్వాహాబాహాంచలావాహితంబు లై మహారజతపాత్రంబులఁ జిత్రంబులుగా వెలుంగునారాత్రికాదీపకళికలవలన, యమకామినీధూమోర్ణాతీక్ష్ణంబు లై విస్ఫీర్ణంబుగా నెగయు మలయజకాలాగురుధూపధోరణులవలన, యాతుధానావరోధవధూ విధీయమానంబు లై విలసిల్లు గృహప్రవేశసమయసముచితబలివిధాన సంవిధానంబులవలనఁ, బౌశధరమత్తకాశినీసూత్రితంబు లై విలోకనపాత్రంబు లగు లలితప్రవాళలతావందనమాలికలవలనఁ, బవమానమానవతీనియుక్తంబు లై బాలికాజనంబులకరతలంబులం బరిభ్రమించు కర్పూరతాలవృతంబులవలన, నరథరసథరిణీనిర్మితంబు లగునిధానకల్పితశంఖపద్మమకరాకారరంగవల్లీమత్ల్లికలవలన, నయ

---

1. భృంగారదుకూలవీటికా. 2. కాంచనమయయంత్ర.

నోత్సవం బొవహిలం బ్రవేశించి వాసవ వహ్ని వైవస్వత వాసతేయా చరణ వరుణ వాయు వసు వల్లభ వామదేవుల వరుస వీడ్కొల్పి సత్యభామాసహితుం డై యథోచితకృత్యంబు లాచరించి యనంత రంబ.

టీ. ఈగద్యమున దేవేంద్రుని వైజయంత మను ప్రాసాదము వర్ణితము.—అమర సరిత్ .....విలసితంబును - అమర = సురలసంబంధమైన, సరిత్ = నదినుండి; అనఁగా మందాకినినుండి యనుట, ఉపహృత = తీసికొనిరాఁబడిన, హేమతామరసస్తోమ=బంగరు పద్మములసమూహములచే నైన, తోరణదామ=తోరణమాలికలయొక్క, రామణీయక = అందముచే, సూచిత=ప్రకటిత మగు, సౌదామనీ= మెఱుఁగులయొక్క, విలసితంబును = ప్రకాశము గలదియు; అవైజయంతమున హాటకపద్మనిర్మితము లగు తోరణములు గట్టఁ బడెననియు, నయ్యవి మెఱుంగుఁదీవలంబోలి తళతళలాడుచుండె ననియుఁ దాత్పర్యము. కనత్కనక...సంతానంబును-కనత్ = ప్రకాశించునట్టి, కనకకింకిణీకుల = బంగరుచిఱు గంటలగుమియొక్క, సంకుల=క్రమహీనమైన, క్వణ=మ్రోఁత లనెడు, ముగ్ధ=మనోజ్ఞ మైన, మధుర=తీయని, ఆలాప = పల్కులతో, నృత్యత్ = నాట్యమొనర్చునట్టి, నిజా పత్య=తనసంతానములయొక్క, మూర్తి=ఆకృతులను, ఆవహ = భరించుచున్న (అనఁగా దనసంతానముల భ్రాంతి నొదవించున దనుట), పార్శ్వ = కెలఁకులందు, ప్రవర్తమాన= ఒప్పుచున్న, విమానసంతానంబును=విమానసమూహము గలదియు; వైజయంతపార్శ్వ భాగముల విమానము లుంపఁబడె ననియుఁ, వానికి బంగరుఁజిఱుగంటలు నిబద్ధములై యొప్పు ననియు, నాబంగరుచిఱుగంటలు పలువిధముల శబ్దించుచుండు ననియుఁ, నట్టి శబ్దముల వెదఁజల్లుబంగరుఁజిఱుగంటలతో మించు నవ్యవిమానములు మధురాలాపముల తోడ నృత్యమొనర్చు వైజయంతపుసంతానములవలె నొప్పె ననియు భావము. అనఁగా విమానములు వైజయంతసదృశములై యుండె నని తాత్పర్యము. అర్థిజన...చింతా రత్నంబును-అర్థిజన=యాచకులకు, అభిమత=కోర్కెలను, దాన = ఇచ్చుటకొఱకైన, అర్థ సంగ్రహ=వస్తుసంపాదనమును, సంశయ=సందేహమును, ఆపాది = కలుగఁజేయు, సమస్త వస్తు=సకల పదార్థములయొక్క, ప్రతిబింబ = ప్రతిరూపములచే, సంభావిత = ఒప్పు చున్న, శేఖరీకృత=శిరోభూషణముగాఁ జేయఁబడిన, చింతారత్నంబును=చింతామణి గలదియు, అవైజయంతమునశిఖరమున నలంకారముగఁ జింతామణి యమర్పఁబడియుండె ననియు, నందు సర్వవస్తువులుఁ బ్రతిఫలించుచుండె ననియు, నావస్తుప్రతిబింబములు చింతామణియర్థుల నభిమతార్థములం దనుప సేకరించిన వివిధపదార్థములో యనునట్లు మించె ననియు భావము. అక్షీణ.....వీక్షావిశేషమును-అక్షీణ=అధికమైన, సహస్రాక్ష

మణి=ఇంద్రనీలమాణిక్యముల చేసైన, గవాక్షావళీ=కిటికీలవరుస చే, సాక్షాత్కృత=కనుల కగపఱుపఁ బడినదిగాఁ జేయఁబడిన, నాకలక్ష్మీ = స్వర్గలక్ష్మియొక్క, కటాక్షవీక్షావిశేషం బును=క్రీగంటిచూపుల యతిశయము గలదియు; ఆప్రాసాదమున నింద్రనీలమణినిర్మిత గవాక్షము లనేకములు గల వనియు, వానినుండి వెడలు నల్లనికాంతులు నాకలక్ష్మికటా క్షములవడువున నున్న వనియు భావము. స్త్రీలకటాక్షములను నల్లగా నుండునట్లు వర్ణించుట కావ్యప్రసిద్ధవిషయము. అనర్ఘ...సన్నిధానంబును-అనర్ఘ = అమూల్యములైన, మణిస్తంభ=మణినిర్మితస్తంభములయందు, ప్రతిబింబిత=ప్రతిఫలించిన, నృత్యత్=నర్తనమొనర్చునట్టి, అప్సరస్సహస్ర=అనంఖ్యాక లగునచ్చరలచే, ప్రదర్శ్యమాన=చూపఁబడు, లాస్య=నృత్యభేదముయొక్క, అవలోకన=చూచుటయందలి, సారస్య=రసికత చే, ఆగత=ఏతెంచినట్టి, గృహదేవతాశత = లెక్కలేనియిలువేల్పులయొక్క, సన్నిధానంబును = సాక్షాత్కారము గలదియు; ఆమేడయందలి రత్నకంబముల నాట్యమొనర్చునచ్చరలు ప్రతిఫలించి రనియు, నవ్వారియాప్రతిబింబములు, నర్తనమొనర్చునచ్చరల నాట్యవిశేషముం జూడ నేతెంచిన యిలువేల్పులో యన మించె ననియు భావము. పులోమ... భాగంబును=పులోమ, నముచి, జంభ, పాక, వృత్ర, బల, ప్రముఖ=మొదలగు, దైత్య=రాక్షసులను, విధ్వంసన=చంపుటయందు, సన్నద్ధ = సంసిద్ధుఁడైన, శీతమన్యు=ఇంద్రుని యొక్క, జన్యసన్నాహ=యుద్ధప్రయత్నమును, అనుకారి=అనుకరించునట్టి, చిత్రకర్మ=చిత్తరువుంబనులచే, విచిత్రిత=విచిత్రముగాఁ జేయఁబడిన; అనఁగా నట్టిపటములచే నలంకృత మైన యనుట, భిత్తిభాగంబును=గోడలప్రదేశము గలదియు దేవేంద్రుఁడు పులోమాదిరక్కసులఁ జంప సిద్ధముగ నున్నరీతిని జిత్రములం జిత్రించి గోడల నాచిత్రములచే నలంకరించి రని భావము. వళితరుచిర...స్నానక్రమంబును-వళిత = గుండ్రముగా వ్యాపించు, రుచిర=మనోహరమైన, రుచి=కాంతులచే, నిరంతర=దట్టమై, స్ఫాటికకూట=స్ఫటికవికారము లగు శిఖరములయొక్క, అంతర = నడుమను, విశ్రాంత = విశ్రమించియున్న, ఐరావత=ఇంద్రునిపట్టపేనుఁగుచేతను, ఉచ్చైశ్శ్రవస్ = ఇంద్రునిగుఱ్ఱముచేతను, సూచ్యమాన=ప్రకాశిత మగుచున్న, క్షీరసాగరస్నాన = పాలకడలియందలిస్నానముయొక్క, క్రమంబును = ప్రకారముగలదియు; వైజయంత మను నాప్రాసాదశిఖరములు స్ఫటికమయములై యుండె ననియు, వానినుండి తెల్లనికాంతులు వలయాకృతిని సాంద్రముగ వ్యాపించియుంట నప్పుడేశము క్షీరసముద్రమువలె నుండె ననియు నట్లు శుభ్రకాంతులచే దంతురితమైన ప్రదేశమున శయనించిన ఐరావతమును నుచ్చైశ్శ్రవమును బాలకడలిలో స్నానమొనర్చువానివలె నున్న వనియు భావము. తరంగితమణి.....సార్థంబును-తరంగిత=చలితము లగు, మణీభృంగారక = మణినిర్మితములైన సజారీలు, వీటికాకరండ = తాంబూలపేటికలు, తాళవృంత=వీవనలు, చామర=వింజామరములు, దర్పణ=అద్దములు

కళాచికా = తమ్మపడిగెలు, పాదుకా = పాపలు, ఆది = మొదలగు, పరికర = ఉపకరణములయొక్క, ప్రపంచ = సమూహముతో, సంచిత = కూడియున్న, కరాంచల = హస్తాగ్రములు గల, విశ్వకర్మనిర్మితయంత్రపాంచాలికా = విశ్వకర్మచే సృజింపఁబడిన యంత్రపుబొమ్మలయొక్క (మరలబొమ్మ లనుట) సంచయ = గుంపుచే, వంచిత=మోసపుచ్చఁబడిన, పరమార్థపరిచారికా = నిజమైనపరిచారికలయొక్క, సార్థంబును=సమూహము గలదియు; మణిభృంగాలకాదుల చేతఁ బూనియున్న విశ్వకర్మనిర్మితములైన యంత్రపుత్రిక లందుఁ గల వనియు, వానిచేత నున్న నాయాయీ మణిభృంగార కాదులు యంత్రబలమునఁ గదలుచుంట నవ్వానిం గాంచి నిజపరిచారికలు వంచిత లగుచుండి రనియు భావము. అనఁగా వానిం గాంచి యవియే నిజపరిచారిక లేమో యని భ్రమపడి రని భావము. నిరంతర...అవతరణంబును-నిరంతర=సాంద్రమైన, సంతానోకహ = కల్పవృక్షములసంబంధ మైన, దుకూలమయ = తెల్లపట్టుబట్టలవికార మైన, పతాకాశత=లెక్క లేని జెండాలచే, ఆకారిత = పిలువఁబడిన, ఆకాశగంగా = మిన్నేటి యొక్క, చటులతర = మిగులఁ జలించునట్టి, తరంగ = కెరటములయొక్క, అవతరణంబును=దిగుటగలదియు; వై జయంతమునకుఁ గట్టిన తెల్లని పట్టుటెక్కెములు చలించుచు మిన్నేటి నాహ్వానించునవిధ మొనరించెనని యు,నవ్వానియాహ్వానము ననుసరించి మిన్నేటి యలలవడి మీఱి నేతెంచునట్లు పైపై నెగురు మందాకినీతరంగము మించె ననియు భావము. సమంతతక...ప్రదేశంబును - సమంతతక = అంతటను, తంతన్యమాన=విస్తృతి నొందింపఁబడుచున్నదియు, తోయకర్మాంతిక=నీటి నాయాయి ప్రదేశములకుఁ బాఱునట్లు చేయు భృత్యులచేత, నిర్ముక్త=విడువఁబడినదియు నగు మందారవిటపిమకరంద=కల్పవృక్ష మరందము లనెడు, గంధసలిల=పరిమళోదకముయొక్క, సేకాతిరేక = తడుపుటయొక్క యతిశయమున, శీతల=చల్లనైన, మణివేదికాప్రదేశంబును = మణినిర్మితము లగు నరుఁగు లతావులు గలదియు; వై జయంతపార్శ్వనులఁగల మణివేదికలను నీరుగట్టువారు కల్పవృక్షమకరంద మను సుగంధజలమున నభ్యంతరము తడుపుటఁజేసి యవి మిగుల చల్లనై యుండె నని భావము. బహిర్ద్వార...సంధానంబును - బహిర్ద్వార = బయటిద్వారముల యందలి, వేదికా = వేదికలు గల, ప్రకోష్ఠ=ముంగిళ్ల యందు, ప్రతిష్ఠాపిత=నెలకొల్పఁబడిన, అష్టాపదఖట్వా=బంగరుమంచములందు, ఆస్తీర్ణ = పఱుపఁబడిన, హరిచందనసాల బాలపల్లవ=కల్పవృక్షసంబంధమైన లేఁజిగుళ్ల చే, ఉల్లసిత=ప్రకాశితమైన, సంధ్యారాగ సంధానంబును = సంజయెఱుపుయొక్కకూర్పు గలదియు; అవ్వైజయంతపు ముఖద్వారములందలి తిన్నెలు గల ముంగిళ్లయందు బంగరుమంచములు గల వనియు, నందుఁ గల్పకబాలపల్లవములు పఱుపంబడియుండె ననియు, నవ్వానినుండి ప్రచురించు కెంపు

చాయలు సంజమెఱుంగులం గూర్చుచున్నట్లుండె ననియు భావము. అవిరళ...పరిపాటి కంబును-అవిరళ=సాంద్రమైన, కల్పప్రసవ = కల్పవృక్షపుష్పములయొక్క, రజఃపటల= పరాగసమూహ మనెడు, పటవాస = పరిమళద్రవ్యములయొక్క, పాంసు = ధూళిచే, వాసిత=పరిమళింపఁజేయఁబడిన, కౌశేయ = దుకూలముచేనైన, వితానపటీ = చాందినీ బట్టలచేత, ప్రకటీకృత = ప్రకాశితమైన, చంద్రాతప = వెన్నెలయొక్క, పరిపాటికం బును=రీతి గలదియు, అగుచున్; ఆమేడయందుఁ గల్పకసుమపరాగ మను పరిమళద్రవ్య ముచే వాసితములైన దుకూలములచే మేల్కట్లు సవరింపఁబడె ననియు, నవి ధవళము లగుటంజేసి వెన్నెలపడువునఁ బ్రకాశించుచుండె ననియు భావము.చతురతర...వలనన్ - చతురతర = మిగులఁ గుశలములై, శచీకర = ఇంద్రునిభార్యయగు శచియొక్కచేతుల చేత, విరచితంబులై = చేయఁబడినవియు, మణికుట్టిమతల = మణినిర్మితభూతలములందు, ప్రతిబింబిత=ప్రతిఫలించెడు, తారకాకుటుంబంబులన్ = నక్షత్రసమూహమును, విడం బించు = అనుకరించునవియు నగు, పారిజాతకుసుమోపహారంబులవలనన్ = కల్పవృక్ష సుమరూపములైన కానుకలవలనను; ఆవై జయంతమునందలి మణినిర్మితభూతలములందు శచి నేర్పుమీఱ కల్పసుమములఁ జల్లె ననియు నాకుసుమములు మణిభూములఁ బ్రతిఫలిం చిన నక్షత్రసమూహములవలె నొప్పియుండె ననియు భావము. ఇది మొదలుకొని మఱల్గి కలవలన ననునంతవఱకును వలనలుఅంతమందుఁగల పంచమ్యంతవాక్యములకు 'నయనో త్సవం బావహిలంజేయ' అనుదానితో నన్వయ మని తెలియునది. స్వాహా...వాహి తంబులై -స్వాహా = అగ్నిభార్య యగు స్వాహాదేవియొక్క, బాహా = చేతులయొక్క, అంచల=కొనలచేత, ఆవాహితంబులై =పూజింపఁబడినవై, మహారజతపాత్రంబులన్ =గొప్ప బంగరుపాత్రములందు, చిత్రంబులుగాన్ = ఆశ్చర్యముగా, వెలుంగు=ప్రకాశించు, ఆ రాత్రికాదీపకళికలవలనన్ =మొగ్గలంబోలు నారతిదివ్వెలవలనను, ఆవై జయంతమున నగ్ని భార్య యగు స్వాహాదేవి బంగరుపళ్లెరముల హారతిరూపము లగు కర్పూరదీపికల నిడె నని చాతుర్యము. అగ్నిభార్య తేజోరూపముల నిచ్చినట్లు చెప్పుట హృద్యము. ఇట్లే సురపతి భార్యయు హారముల నిడె ననుట సరసము. యమకామినీ...వితీర్ణంబులై -యమకామినీ= యమునిజాయయగు, ధూమోర్ణా=ధూమోర్ణాదేవిచేత, వితీర్ణంబులై = నిల్పఁబడినవై, విస్తీర్ణంబుగాన్ =విశాలముగ, ఎగయు=వ్యాపించెడు, మలయజ=చందనసంబంధమైనట్టియు, కాలాగురు=నల్లయగరుసంబంధమైనట్టియు, ధూప=ధూపములయొక్క, సౌరణులవలనన్ =పద్ధతులవలనను; యమపత్ని ధూమోర్ణాదేవి యాప్రాసాదమునఁ జందనకాలాగురు ధూపముల నెలకొల్పె నని భావము. యముఁడసితుఁడు. వానిపత్ని ధూమోర్ణ. కాన నల్ల నిధూపధూమముల నామె యిడినట్లు తెల్పుట సముచిత మనఁదగును. యాతుధాన.

...విధీయమానంబులై -యాతుధాన=నిర్ఋతియొక్క, అవరోధవధూ=అంతఃపురస్త్రీ చేత; భార్యచేత ననుట. విధీయమానంబులై =పరికల్పితములై, విలసిల్లు=ప్రకాశించెడు, గృహప్రవేశసమయసముచిత=ఇంటఁ బ్రవేశించునపనుకర్మములైన, బలివిధాన=బలులుంచుటలయొక్క, సంవిధానంబువలనన్ =కూర్పులచేతను; నిర్ఋతిభార్య గృహప్రవేశసమయార్హములైన బలుల సావై జయంతమునఁ గూర్చెనని తాత్పర్యము. యాతుధానునిజాయ కీకృత్య మెంతయు నర్హమేగదా! బలులను గైకొనువానిభార్యకు బలిప్రదానకౌశలము గల్గుట సైజముగదా! పాశధర...సూత్రితంబులై -పాశధర = వరుణునియొక్క, మత్తకాశినీ=కామినిచే, సూత్రితంబులై = గ్రువ్వఁబడినవై, విలోకనపాత్రంబులగు = దర్శనీయములైన; మనోజ్ఞము లనుట.లలిత=సొగసైన, ప్రవాళలతా=పగడపుఁదీఁగలచేసైన, వందనమాలికలవలనన్ = తోరణములవలనను; వరుణభార్య పవడములతోరణములచే వైజయంతము నలంకరించె నని తాత్పర్యము. పవడములతీవలు సముద్రమునయుండును. వరుణుఁడు జలాధిదేవత. కాన నట్టివానిభార్య యిట్టికృత్యమును నిర్వర్తించినట్లుచెప్పుట సుసంగతము.పవమానమానవతీనియుక్తంబులై =వాయుదేవునిభార్యచే నాజ్ఞాపింపబడినవై, బాలికాజనంబుల కరతలంబులన్ =కన్యకలహస్తతలములందు, పరిభ్రమించు = చలించుచున్న, కర్పూరతాలవృంతంబులవలనన్ =కర్పూరపు నీవనలవలనను; వాయుదేవునిభార్య యాజ్ఞాపింపఁగా బాలికాజనములచేతులందలి కర్పూరపువీవనలు తిరుగుచున్నవని తాత్పర్యము. వాయుదేవునిభార్యను దాళవృంతచలనమున శాసకురాలనుగాఁ జెప్పుట యెంతయు సరసము. నరధర్మసధర్మిణీసిద్ధంబులగు=కుబేరునిభార్యయగు బుద్ధిచేఁ గల్పింపఁబడినవగు, సిద్ధానకల్పిత=నిధులయుండి కూర్పఁబడిన, శంఖపద్మమకరాకారరంగవల్లీమత్తల్లికలవలనను= శంఖ పద్మమకరాకృతులుగల శ్రేష్ఠములగు ముగ్గులవలనను; కుబేరునిభార్య యీప్రాసాదమును శంఖపద్మ మకరాకృతులుగల ముగ్గులఁ గుటించి యలంకరించె నని భావము. శంఖపద్మాది నిధులకధిపతి కుబేరుఁడు అతనిభార్య శంఖ పద్మాకృతులంబొల్చు ముగ్గులఁ గుటించెనను మిక్కిలి సరసము. ఈశానసిభార్య నిందుఁ బేరొక్కనకుండుటకు గారణము మృగ్యము. నయనోత్సవంబు=కన్నులపండువు, అవహిలన్ =సంభవింపఁగా, ప్రవేశించి = చొచ్చి, వాసవ.....వామదేవులన్ -వాసవ=ఇంద్రుఁడు, వహ్ని=అగ్ని, వైవస్వత = యముఁడు, వాసతేయాచరణ = నిశాచరుఁడగునిర్ఋతి, వరుణ=వరుణుఁడు, వాయు = వాయువు, వసువల్లభ=ధనపతి యగుకుబేరుఁడు, వామదేవుఁడు = ఈశానుఁడు; వీరలను; అనఁగా నష్టదిక్పతుల ననుట. దిక్పాలురసతులను దిక్పతులను బేరొక్కనుటలో బ్రాగ్దిగధిపతియగునింద్రునిభార్యను దొల్తఁ బేరొక్కని పిదపఁ బ్రదక్షిణక్రమము ననుసరించి తక్కినవానిం బేరొక్కనె నని గ్రహించునది. కళ్ళు లీదికుక్కలంగూర్చికాని తత్పతులం

గూర్చికాని యేమేని చెప్పవలసివచ్చినపు డిట్లే క్రమము ననుసరించుట సహజము. తొలిదిక్కున కధిపతియు సర్వకాలకాధీశుఁడును నగునింద్రు మొట్టమొదటఁ జెప్పుట యుచితముగదా! తరువాతఁ దక్కుంగలవారి నపసవ్యమగుక్రమమున నుత్తర దిశ ననుసరించి చెప్పుటకంటె సవ్యక్రమమునఁ బ్రదక్షిణవిధిని దక్షిణదిశ ననుసరించి తెల్పుటయే సరస మని కవు లెన్నినట్లు తోఁచెడిని. పరుసన్ = క్రమముగా, వీడొక్కల్వి= సెలవిచ్చిపంపి, సత్యభామాసహితుఁడై = సత్యభామతోఁ గూడినవాఁడై, యథోచిత కృత్యంబులు=అర్హములైనకార్యములను, ఆచరించి=చేసి, అనంతరంబ=తరువాత.

విశే. ఇక్కవిత్తల్లజుఁడు ముక్కతిమ్మన తాఁ గన్నారు గాంచిన విద్యానగర ప్రభువర్యుని కృష్ణరాయని వాససౌధ మగు మలయకూటమునందము నీగతిని బ్రకటించి యుండునేమో యని యూహ పొడమెడు.

శా. ఆరామప్రియసోదరుం డపుడు దివ్యారామ మంభోరుహా
క్షీ! రమ్యం బదె చూత మే యని ఘృతాచీమేనకామంజుఘో
షారంభాహరిణీముఖత్రిదివయోషారత్నము ల్గొల్చి రా
నారూఢోత్సవచిత్తుఁడై గగనకుల్యాతీరదేశంబునన్. 42

టీ. ఆరామప్రియసోదరుండు = బలరాముని యాయసుఁగుందమ్ముఁడు, అపుడు= యథోచితకృత్యముల నాచరించినపిదప, అంభోరుహాక్షీ! = పద్మములవంటి నేత్రములు గల సత్యభామా, రమ్యంబు = మనోహర మగు, దివ్యారామము = సురలయుపవనమగు నందనము, అదె=అదిగో, చూత మే=తిలకింత మే (ఉభయకర్తృకము) అని. ఘృతాచీ... రత్నముల్ - ఘృతాచీ, మేనకా, మంజుఘోష, రంభ, హరిణి, ప్రముఖ= మొదలైన. త్రిదివయోషారత్నముల్ = దేవతాస్త్రీమత్పల్లికలు, కొల్చి=సేవించి, రాన్ =రాఁగా (వెంటనంటిరా ననుట), ఆరూఢోత్సవచిత్తుఁడై=పొందఁబడిన సంతోషముగల మదిగల వాఁడై, గగనకుల్యాతీరదేశంబునన్ =ఆకాశ గంగానదియొక్క తీరతలమున - 44-వ పద్యమందలి 'డాయం జనియెన్' అనుదానితో నన్వయము.

విశే. కల్పకోత్పాటనరూపముఖ్యోద్దేశమునకు బీజము నిల్పఁబడినది. మఱియు సర్గవైభవాతిశయాలోకమునను మనోజ్ఞవైజయంతవాసమునను దాఁవచ్చినపనిని మఱువ లేదని సత్య కీమూలమునఁ దెల్పుచు నాపెయందుఁ దనకుఁగల రాగాతిశయమును శ్రీ కృష్ణుఁడు వెల్లడించె నని గ్రహించునది. సామాన్యముగఁ గుల్య యన నలంతినీటికాలువ యగుం గాని యిందు నదీపరముగఁ బ్రయుక్త మగుట వింత.

క. చందనహరిచందనమక,రందసరిద్బిందుశీకరప్రమదవనేం
దిందిర పక్షస్పందన, కందళితమరుత్కుమారకంబులు వొలయన్. 43

టీ. చందనహరి...కికోరకంబులు - చందన = మంచిగందపుఁజెట్లయొక్కయు, హరిచందన = కల్పవృక్షములయొక్కయు; లక్షణచేఁ దత్పుష్పములయొక్క యనుట. మకరందసరిత్ = తేనెయేఱులంట్రైన, బిందు = కణములయొక్క, శీకర = తుంపురులుగల్గి నట్టియు, ప్రమదవనేందిందిర = ఉపవనమందలి తుమ్మెదలయొక్క, పక్షస్పందన = ఱెక్కలకదలికచే, కందళిత = మొలకలెత్తినవియు; అనఁగా నుద్భూతములైనవనుట. మరుత్కుమారకంబులఁ=పిల్లగాలులు (వాతపోతములు) వొలయక్ = వ్యాపింపఁగా.

విశే. తేనెయేఱులకణములు గగ్గినదనుటచే శైత్యమును, నా తేనెకణములు చందవహరిచందనవృక్షములసంబంధమైన వనుటచే సౌరభ్యమును, భ్రమరపక్షచలమున మొలకలెత్తిన వనుటచే మాంద్యమును బ్రకటీకృతములయ్యె నని యెన్నునది. ఏకసమాసముతో గాలి సిట్లు వర్ణించుట ప్రబంధకర్తల సంప్రదాయమై యున్నది.

సీ. రంభామహోరోజకుంభపరిరంభకుసుమిత ప్రత్యగ్ర కురవకంబు
మంజుఘూోషావక్త్రకంజాతచకచక స్తబకితచంపకక్ష్మారుహాంబు
హరిణీముఖప్రసూనాసవార్పణకోరకితలతావేల్లిత కేసరంబు
సుర్వశీనవయూవకోజ్జ్వలాంఘ్రినివేశపుష్పితకంకేళిభూరుహాంబు
తే. మేనకామోదనిశ్వాసమృదుసమీర
కుట్మలితసిందువారంబు కుధరధరుఁడు
ప్రేయసియుఁ దాను నల్లన డాయఁ జనియె
ద్వైవతాధీశనందనోద్యానసీమ. 44

టీ. ఇందు నందనోద్యానము వర్ణ్యము.—రంభా...కురవకంబు-రంభా = రంభయను నచ్చరయొక్క, మహోరోజకుంభ = కుంభములంబోలు గొప్పస్తనములయొక్క, పరీరంభ=ఆలింగనముచే, కుసుమిత=పుష్పించిన, ప్రత్యగ్ర=నూత్నమైన, కురవకంబు = ఎట్టిగోరంటచెట్లుగలదియు; వనిత యాశ్లేషించిన గోరకము పుష్పించు ననుట కావ్యప్రసిద్ధవిషయము. అనఁగా స్త్రీ ఆలింగనము కోరకమునకు దోహదమని యెన్నవలయును. మంజుఘూోషా...క్ష్మారుహాంబు - మంజుఘూోషా=మంజుఘూోష యనునప్సరసయొక్క, వక్త్రకంజాత = ముఖపద్మముయొక్క, చకచక = కాంతులత్రళత్రళలచేత, స్తబకిత = పుష్పగుచ్ఛములుగలదిగాఁ జేయఁబడిన, చంపకక్ష్మారుహాంబు = సంపెఁగచెట్లుగలదియు; స్త్రీముఖకాంతిప్రసారము చంపకమునకు దోహదమని తెలియుచున్నది.

హరిణీ...కేసరంబు-హరిణి=హరిణి యనునప్సరసయొక్క, ముఖ = మొగమునందైన; అనఁగా నోటియందున్నయనుట. ప్రసూనాసవ=సుమమద్యముయొక్క; పూలరసమున నిర్మితమయిన మద్యమనుట, అర్పణ=ఇచ్చుట చేత; అనఁగా నోటినుండి యుమియుట చేసినుట. కోరకిత=మొగ్గతొడిగిన, లతావేష్టిత=తీఁగలచేఁ జుట్టఁబడిన, కేసరంబు = పొగడ చెట్లుగలదియు; అందలిపొగడచెట్లు హరిణీముఖమద్యార్పణమున మొగ్గలెత్తె నని భావము. ముఖమద్యార్పణము పొగడకు దోహదమని తెలియవచ్చెడి. ఊర్వశీ...భూరుహంబు-ఊర్వశీ=ఊర్వశియను దేవవేశ్యయొక్క, నవ=క్రొత్త దగు, యావక = లాక్షారసముచే, ఉజ్జ్వల=ప్రకాశించునట్టి, అంఘ్రి=పాదములయొక్క, నివేశ=ఉంచుట చేత; అనఁగాఁ దన్నుట చేత నగుట. పుష్పిత=పూచిన ట్లొనర్పఁబడిన, కంకేళిభూరుహంబు = అశోకవృక్షములు గలదియు; అందున్నయశోకము ఊర్వశీచరణాహతిని గుసుమితము లయ్యెనని భావము. స్త్రీపాదాహతి యశోకదోహదము. మేనకా...సిందువారంబు - మేనకా = మేనకయనుసచ్చరయొక్క, ఆమోదనిశ్వాస = సుగంధముగునిట్టూర్పు నెడు, మృదుసమీర=సిల్లగాలిచే, కుట్మలిత=మొగ్గతొడిన, సిందువారంబు = వావిలిచెట్లుగలదియు; అందలి వావిలిచెట్లు సుగంధమేనకామృదుముఖమారుతప్రసారమున మొగ్గలెత్తె నని భావము. స్త్రీముఖమారుతప్రసారము సిందువారదోహదము. దైవతాధీశనందనో ద్యానము = ఇంద్రునినందనవనమును, అపుడు = ఆయ్యదనున, కుధరధరుఁడు=గోవర్ధనధారి యగు శ్రీకృష్ణుఁడు, ప్రేయసియుఁ=సత్యయు, తానుఁ, అల్లనఁ = మెల్లఁగా, డాయఁ, చనియెఁ=సమీపించెను. (చేరఁజనెను.)

చు. మహీభృద్భేదివనాంతసీమమునఁ బద్మాజాని సత్యావధూ
సహితుం డై యనిమేషవారవనితాసందోహము ల్లోల్వఁగా
విహరింపం జనుదెంచినాఁ డనుచు సేవింపంగ వర్షాశర
స్నిహికాశీతవసంతఘర్మ్మఋతువు ల్నిండెం దదుద్యానమున్. 45

టీ. పద్మాజాని=లక్ష్మీదేవిభార్యగాఁ గల శ్రీకృష్ణుఁడు, మహీభృద్భేదివనాంతసీమమునఁ=కొండలఁ భేదించిన యింద్రునియొక్క నందనారామప్రదేశమున, సత్యావధూసహితుండై = సత్యభామతోఁ గూడినవాఁడై, అనిమేషవారవనితాసందోహముల్=దేవవేశ్యాసమూహములు, కొల్వఁగాఁ = సేవింపఁగా, విహరింపఁ, చనుదెంచినాఁడు = వచ్చినవాఁడు, అనుచుఁ, సేవింపంగఁ, వర్షాశరస్నిహికాశీతవసంతఘర్మ్మఋతువుల్ = వర్షా, శర, హేమంత, శిశిర, వసంత, గ్రీష్మములను నాఱుఋతువులు, తదుద్యానమున్ = ఆనందనోద్యానమును, నిండెఁ.

భా. శ్రీకృష్ణుని నందనోద్యానమున సత్యాయుతుఁడై విహరించువాసిని సేవింప షడ్ఋతువులునందు సాక్షాత్కరించెనని భావము. షడ్ఋతువులు నేకకాలమున సాక్షాత్కరించినట్లు వర్ణించుట కావ్యప్రసిద్ధవిషయము.

వ్యా-విశే. సిద్ధములగు బహువ్రీహిసమాసముల జాయాశబ్దములోని యకారమునకు సియనున దాదేశమగు.

సీ. కనుపట్టె నొకచోట ఘనఘనాఘనరంగ
విద్యున్నటీనాట్యవిలసనములు
చూపట్టె నొకచాయ వాపికాజలజాత
జాలవాచాలహంసవ్రజంబు
తలచూపె నొకవంక దరదళత్సేవంతి
కాగంధినీహారకణభరములు
పొడచూపె నొకచక్కఁ బుష్పితఫలినీల
వంగవాసితశైత్యవైభవములు
తే. నెఱసె నొకయెడఁ దాస్రపర్ణిజలార్ద్ర
చందనాచలపవమానకందళములు
మొనసె నొకకడ సామిసంఫుల్లమల్లి
పాటలిచంపకోత్పలప్రాఫిమములు. 46

టీ. ఒకచోటన్ = ఒకానొకచోట, ఘనఘనా...విలసనములు-ఘన = గొప్పదైన, ఘనాఘన=వార్షికమేఘుమనెడు, రంగ=నాట్యభూమియందు, విద్యున్నటీ=మెఱుపనెడు నర్తకియొక్క, విలసనములు=ప్రకాశములు, కనుపట్టెన్ =అగపడెను; వసన్తర్తుధర్మమిందు సూచితము. ఒకచాయన్ =ఒకవైపున,వాపికా...వ్రజంబు-వాపికాజలజాతజాల= దీర్ఘికలందలి పద్మసమూహములందు, వాచాల = ధ్వనినిజేయుచున్న, హంసవ్రజంబు= హంసలసమూహము, చూపట్టెన్ =అగపడెను; దీర్ఘికాపద్మములందు శబ్దించునంచగుము లొకవైపున నగపడెననిభావము. ఇందు శరద్ధర్మము సూచితము. ఒకనంకన్ =ఒకదిక్కున, దరదళత్...భరములు-దరదళత్ = కొంచెముగా వికసించిన, సేవంతికా = చేమంతిపూవులచే, గంధి=పరిమళముగల, నీహారకణభరములు=మంచుబొట్టుల యతిశయములు, తలచూపెన్ =అగపడెను; కొంచెము విడిన చేమంతిపూల గంధముగ్గిన మంచుబొట్లొకచో నగపడెనునిభావము. హేమంతర్తుధర్మమిందుఁ బ్రకాశితము. ఒకచక్కన్ = ఒకప్రదేశమున, పుష్పిత...వైభవములు-పుష్పిత = పుష్పించిన, ఫలినీ=ప్రేంకణవృక్షములచేతను, లవంగ=లవంగవృక్షముల చేతను, వాసిత=పరిమళము గలదిగాఁజేయఁబడిన,

శైత్య=చల్లఁదనముయొక్క, వైభవములు=విభవములు, పొడసూపెన్ = కనఁబడెను: ప్రేంకణాలవంగవృక్షములు పూచినవై సుగంధసాంద్రములగు చల్లందనములఁ గల్గించె ననితాత్పర్యము. ఇందు శిశిరర్తుధర్మము ప్రకటీకృతము. ఒకయెడన్=ఒకచో, తామ్ర పర్ణీ.....కందళములు-తామ్రపర్ణీ=తామ్రపర్ణి యనునదియొక్క, జల = ఉదకము చేత, ఆర్ద్ర=తడిసిన, చందనాచలపవమాన = మలయమారుతముయొక్క, కందళములు = మొలకలు, అనఁగాఁ బిల్లగాలు లనుట. సెలసెన్ = వ్యాపించెను; ఇందు వసంతధర్ము ప్రకాశితము. ఒక కడన్ = ఒకదిక్కున, సామి.....ప్రౌఢిమములు - సామి= సంగోరు, సంఫుల్ల=వికసించిన, మల్లి=మల్లియొక్కయు, పాటలీ = పాటలీకుసుమముల యొక్కయు, చంపక=సంపెఁగపూవులయొక్కయు, ఉత్పల=నల్లకలువలయొక్కయు, ప్రౌఢిమలు=అతిశయములు, మొనసెన్ = చేరెను. ఇందుగ్రీష్మర్తుధర్మము విశదీకృతము. ఇట్లూఱుబుతువులు నొక్కచో సాక్షాత్కరించియుండుట నందు శ్రీకృష్ణుఁడుగాంచె.

క. మలయానిలసంగతిఁ జూ
తలతికలంకూరజాలదౌహృదవతు లై
యలయిక సడలించినసొ
మ్ములకైవడిఁ బొండుపత్రములు వెసజాలెన్. 47

టీ. చూతలతికలు = మామిడితీఁగలు, మలయానిలసంగతిన్ = మలయమారుత సంబంధముచే, అంకూరజాలదౌహృదవతులై = మొలకలసమూహములను గర్భధారణ లక్షణములు గలవారై, అలయికన్ = ఆయాసముచే, సడలించిన = జార్చిన; ఊడ్చిన యనుట. సొమ్ములకైవడిన్ = ఆభరణములవిధమున, పాండుపత్రములు = పండినతెల్లని యాకులు, వెసన్ =శీఘ్రముగా, జాలెన్ = రాలెను.

విశే. మామిడులు వసంతప్రాదుర్భావమునఁ బొండుపత్రముల రాల్చి చిగురు దొడుగఁగా, వాని చిగురుదొడుగుటను మలయమారుతుని కూడిక చేసైన గర్భధారణ చిహ్నములుగాను, పొండుపత్రములరాల్చుటను నాయాసముచేసైన భూషణముల సడ ల్చుటగాను, గవి నిరూపించి లతికాశబ్దస్త్రీలింగసారస్యమును సరసముగఁ బోషించెను.

అలం. ఉత్ప్రేక్ష.

క. గురివెందఁ జైత్రుఁ డొందఁగఁ
గర మలుక న్మావి యపుడు కఱచిన నునువా
తెరమీఁదఁ గాననగు పలు
వరుస యన న్మనలు పల్లవముపై మొనసెన్. 48

టీ. గురివెందన్ = గురివెందచెట్టును; మాధవ యని సంస్కృతనామము, చైత్రుఁడు=వసంతుఁడు, ఒందగన్ = పొందఁగా, కరము=మిక్కిలి, అలుకన్ = కోపముతో, మావి=మామిడి, అవుడుకఱచినన్ = పెదవికఱవఁగా, నునువాతెఱమోఁదన్ = నున్ననైన పెదవిపైని, కాననగు=అగపడునట్టి, పలువరుస = దంతములచాలు, అనన్ = అనునట్లుగా, పల్లవములపైన్ = చిగుళ్లపైని, ననలు = పుష్పములు, మొనసెన్ = వ్యాపించెను.

భా. లోకమున నొకవనిత తనకాంతుఁడన్యాంగనాసక్తుఁడు కాఁగాంచి, యధికకోపమునఁ బెదవిఁగొఱుకునట్లు మామిడి, వసంతుఁడు మాధవిం జెనకఁగాఁ, గోపమున నవుడుగఱఁచె ననియుఁ, బెదవిఁగఱచునపు డందు దంతపంక్తి యేర్పడుట సహజము గావున జిగురునాతెఱను, ననలను దంతపంక్తి చెలంగె ననియు భావము. అనఁగా వసంతసంబంధమున గురివెందలును జూతములును జిగిర్చి పుష్పించె నని తాత్పర్యము.

విశే. ఇఁదు నెఱ్ఱనిజిగురును బెదవిగాను, దానిపై మించుననలను దంతపంక్తిగాను భావించుట యెంతయు హృద్యము. మానిని ఖండితనాయికగా నిందుఁ బేర్కొనె నని యెన్నునది. 'గురివెంద, మావి' అను స్త్రీసమములసారస్య మిందు మనోజ్ఞ మగురీతిని బ్రకాశితము. అలం. ఉత్ప్రేక్ష.

క. తలిరాకుగుత్తిఁ దమిఁ గో
యిల చంచునఁ జించి క్రొల్చె నీరీతి వియో
గులగుండియ లవియింపుదు
బలువిడి నని మరునియెదుటఁ బచరించె ననన్. 49

టీ. కోయిల=పికము, తలిరాకుగుత్తిన్ = చివురుజొంపమును, తమిన్ = అనురాగముతో, చంచునన్ =ముక్కుతో, ఈరీతిన్ = ఈప్రకారముగ, వియోగులగుండెలు= విరహులహృదయములను, బలువిడిన్ = ఉద్ధతితో, అవియింపుదున్ = బ్రద్దలుచేయుదును, అని, మరునియెదుటన్ =మన్మథునియెదుట, పచరించెన్ =ప్రకటించెను, అనన్ = అనునట్లుగా, చించి=చీల్చి, క్రొల్చెన్ =కూసెను.

భా. కోయిలవసంతమునఁ జిగుళ్లనుజీల్చి వానిరసమును ద్రావి కూయుట సహజము. అట్టిదానికృత్యమును గవి యిట్లుత్ప్రేక్షించినవాఁడు. కోయిల చిగుళ్లండీల్చుట యిట్లే విరహులహృదయములం జీల్తు నని మన్మథునకుఁ జెప్పుచున్న ట్లుండె నని భావము. వసంతమునఁ బికకూజితశ్రవణమున విరహులు మిగుల బాధనందుట కావ్యప్రసిద్ధవిషయము. పికకూజిత ముద్దీపనభావముగదా. అలం. ఉత్ప్రేక్ష.

చ. మలయసమీరణచ్యుతసమంచితపాండుపలాశలైనపా
దులనునుసోగతీఁగలు యదుప్రభునిం దలపించె బాలచా
పలహృతతీరవస్త్రలయి పంకరుహాకరమధ్యసీమలన్
నిలిచిన ముగ్ధగోపరమణీరమణీయవిలాసరేఖలన్. 50

టీ. మలయ.....పలాశలైన - మలయసమీరణ = మలయమారుతునిచేత, చ్యుత=జాఱిన, పాండుపలాశలైన = పండుటాకులుగల, పాదులనునుసోగతీఁగలు = పాదులందలి నున్ననైన పొడవైనతీగలు, బాలచాపల హృత తీరవస్త్రలయి-బాల=చిన్న వానియొక్క, చాపల=చపలత్వముచేత; అనఁగాఁ జిన్నతనపుఁ జపలత్వముచేత ననుట. హృత=దొంగిలింపఁబడిన, తీర=ఒడ్డునందలి, వస్త్రలు = బట్టలుగలవారలు, అయి, పంకరుహాకర మధ్యసీమలన్ =సరస్సుల మధ్యప్రదేశములందు, నిలిచిన=నిలిచియున్న, ముగ్ధగోప...రేఖలన్ -ముగ్ధ=సుందరులైన, లేక యితికర్తవ్యతా మూఢలైన యనియు నన నగును. గోపరమణీ=గోపికలయొక్క, రమణీయ = మనోహరమైన, విలాస=లీలలుగల, రేఖలన్ =ఆకృతులను, తలపించెన్ =జ్ఞప్తికిఁ దెచ్చెను.

భా. మలయమారుతప్రసారమున నానందనమునందలి పాదులందైన పాండు పర్ణములను రాల్చినతీవలు శ్రీకృష్ణునకు, బాల్యచాపలమునఁ దాను తీరవస్త్రములం దొంగిలింపఁ గమలాకరమధ్యదేశముల నిల్చియున్న గోపికాబృందమును జ్ఞాపకమునకుం దెచ్చెనని భావము.

విశే. పండుటాకుల రాల్చినతీవలు వివస్త్రలగుగోపికలవలెను, బాదులం దుండుట కమలాకరమధ్యదేశముల నిల్చుటవలెను నుండె నని గ్రహించునది. అలం. ఉత్ప్రేక్ష.

స్మరణము.

సీ. పరువంబు గాక చొప్పడనిమామిడితేనె
లాన నాసాస నట్టాడునవియుఁ
దమకించి చిగు రాకు గమిచి నో రొగ రెనఁ
గడఁగి గొజ్జెఁగనీటఁ గడుగునవియు
సంపం గెపొదరింటిచక్కి గోరఁటఁ గాంచి
యుసు రంచు *మగిడి నోరూరునవియుఁ
గలిగొట్టుపసరు మొగ్గలఁ గోర్కి పొలివోయి
మునుపటి మొల్లల మూఁగునవియు

---

*మగిడియు నొఱలునవియుఁ.

ఆ. నగుచుఁ దేఁటికదువు లామనిఁ దలసూపేఁ
జూపుదనుక నెల్లచోటఁ దోఁట
యందుఁ దామ యగుచు నమ్మరునెలగోలు
పోఁజు లనఁగఁ జూడ్కిపండు వగుచు. 51

టీ. పరువంబుగాక = పరిపక్వముగాక, చొప్పడని = వలనుగాని; ఆనపీలులేని యనుట, మామిడితేనెలు = చూతమరందములను, ఆనర్ = క్రొలుటకై, ఆసాస = ఆశ గానిఁమాశతో; అనఁగా పనికిరానియాశతో ననుట, అట్టాడునవియుర్ = మిక్కిలి పరి భ్రమించునవియు; అనఁగా మామిడిపూవులు లెస్సగ వికసింపకుండుటంజేసి యందలి మరందమాన వీలులేమిని దానిఁ గ్రోలంజాలకయు, నట్లని వాని విడువ నిచ్చపుట్టకయు నడియాసతోఁ దుమ్మెదలు తిరుగుచుండెనని భావము. తమకించి=త్వరపడి, చిగురాకుర్ = పల్లవమును, కమిచి=ఆక్రమించి; కొఱికి యనుట. నోరు, ఒగరు=చేదు, ఐనర్ =కాఁగా, కడఁగి=పూని, గొజ్జెఁగసీటర్ = గులాబిసీటిచే, కడుగునవియుర్ =ప్రక్షాళనము చేసికొను నవియును; అనఁగాఁ గొన్నితుమ్మెదలు పుష్పోద్భవము గాకుండఁగనే వేగిరపాటునఁ గిసల యములం గొఱికె ననియు, దాన వానినోళ్లు చేదెక్కి ననియు, వట్టి చేదైననోళ్లను గొజ్జగిసీటఁ జేదువోవుటకై కడుగుకొనుచుండెనని యు భావము. తుమ్మెదలు త్వరచేఁ జిగుళ్లంజీల్చియు నందు మరందము లేమి వీడి గొజ్జగిసీటిని గంధిలమగుదాని నానుచుండె నని గ్రహించునది. సంపెంగపొదరింటిచక్కర్ = చంపకనికుంజప్రదేశమందైన, గోరఁ టర్ =గోరంటచెట్టును, కాంచి=చూచి, ఉసురంచుర్ = ఉసు రనుచు; అనఁగా భయ ముచే నుపయోగింపఁ బనికిరాదయ్యెఁగదా యని నిట్టూర్పువిడుచుచనుట. మగుడర్ = మఱల, నోరూరునవియుర్ = నోటినుండి నీరు గార్చునవియును; ఏదేనివస్తువును దిన వలె ననుగోర్కియుండి యది యగపడి లభింపనపుడు నోటినుండి నీరూరుట నైజము. సంపెఁగవాసనతుమ్మెదలకుఁ బ్రాణాపాయముగల్గించునది. కురవకము సంపెఁగపొంతనుంట నచ్చోటికి భ్రమరములు పోఁజాలక యయ్యో గోరఁటపూవులమరందము గ్రోల వీలులేక పోయెఁగదాయని నోట నీరూర నుస్సురనుచుండెనని భావము. కలిగొట్టుపసరుమొగ్గలర్ = పాటలవృక్షసంబంధమైన పూపమొగ్గ లందలి; పసరుమొగ్గలనఁగాఁ బరిపాకదశనందని మొగ్గ లనుట. కోర్కి=కాంక్ష, పోలివోయి=పోయి, మునుపటిమొల్లలర్ = పూర్వపు మొల్లపూవులండే, మూఁగునవియుర్ = క్రమ్మునవియు; అనఁగాఁ దుమ్మెదలు కలిగొట్టు మొగ్గలకడకు మరందముం గ్రోల నేఁగె ననియు, నవి యప్పటికి వికసింపక పసరుఁ గ్రక్కినవగుటంజేసి మగిడి తామ మున్నెచ్చట మరందముం గ్రోలినవో యామొల్ల పూవులనే చేరె ననియు భావము. అగుచుర్, తేఁటికదుపులు = తుమ్మెదమందలు,

ఆవనిక్ =వసంతకాలమున, చూపుదనుకక్ =దృష్టివ్యాపించునంతవఱకు, తామె, అగుచుక్ =ఉండుచు, అమ్మరు నెలగోలుపాఁజులు = ఆమస్థునియొక్క కోల్తలసేయు సేనలు; అనఁగా వీరాలాపములతోడ ముందునడచుసేన లనుట. అనఁగక్ = అనునట్లు, చూడ్కిపండువు=నేత్రోత్సవము, అగుచుక్, ఎల్లచోటక్ = సర్వప్రదేశములందును, తోఁటయందుక్ = ఆనందనారామమున, తలసూపెక్ =అగపడెను; ఎచట దృష్టి నిడిన యచ్చట దుమ్మెదమంద లేయుండుటం జేసియు, మఱియు దృష్టి వ్యాపించునంతవఱకు కవియే కన్పట్టుచుండుటం జేసియు, వసంతునిపరివారమును మన్మథసైన్యముగాఁ బేర్కొనుట కవి సంప్రదాయసిద్ధమగువిషయ మగుటం జేసియుఁ, దుమ్మెదదొమ్మిమూఁకలను మన్మథు సెల గోలుపాఁజులుగఁ గవి నిరూపించినవాఁడని గ్రహించునది. అలం. స్వభావోక్తి. పాఁజు లనుచోట నుత్ప్రేక్ష.

క. నందప్రియనందనుఁ డా
నందన మఖిలర్తునందనం బయి నయనా
నంద మొనరింప నమరీ
బృందంబులు గొలువఁ జనుచుఁ బ్రియసతి కనియెన్. 52

టీ. నందప్రియనందనుఁడు = నందుని గారాబుకొమరుఁడు శ్రీకృష్ణుఁడు, ఆనందనము=ఆనందనారామము, అఖిలర్తునందనంబు = సమస్తర్తులచేతను సంతోషదాయకంబు, ఐ=అయి; షడ్రుతుసమావేశమున నానందదాయకం బగుచున్న దనుట. నయనానందము = నేత్రములకు సంతోషమును, ఒనరింపక్ = చేయఁగా. అమరీబృందంబులు= దేవవధూటీసమూహములు, కొలువక్ = సేవింపఁగా, చనుచుక్ =పోవుచు, ప్రియసతికిక్ = ప్రేయసికి సత్యభామకు, అనియెక్; సత్యభామనుగూర్చి పల్కె ననుట, అలం. వృత్త్యను ప్రాసము. సుకరప్రాసము.

చ. సరసిజనేత్ర! చూచితె వసంతుఁడు నీవనవాటికారమా
తరుణియుఁ బాణిపీడనవిధాసమయంబునఁ గేలుదోయి నొం
డొరుపయి సమ్మదంబు లిగురొత్తఁగ మాటికిఁ జల్లు సేసఁ బ్రా
ల్నెరసె ననంగ ప్రాలెఁ గుహళీవిగళన్నవకోరకావళుల్. 53

టీ. వసంతుఁడుక్, ఈవనవాటికారమాతరుణియుక్ = ఈనందనవన శ్రీయను యువతియును; ఈనందనవనప్రదేశపుశోభ యను వనితయనుట. పాణిపీడనవిధాసమయంబునక్ = పాణిగ్రహణవిధానకాలమున; పెండ్లిజరుగుసమయమున ననుట. కేలుదోయిక్ =రెండు చేతులతోడను, ఒండొరుపయిక్ =ఒకరిమీఁదనొకరు, సమ్మదంబులు =

సంతసము, ఇగురొత్తఁగఁ=మొలకెత్తఁగా, మాటికిఁ=వేమఱు, చల్లు=చల్లుకొన్న, సేసఁ బ్రాలు=శుభాక్షతలు, నెరసెఁ=వ్యాపించెను, అనంగఁ=అనునట్లుగా, కుహళీ...వళుల్-కుహళీ=పోకపొత్తులనుండి, విగళత్=జాఱిన, నవ=క్రొత్తవైన, కోరక=మొగ్గలయొక్క, ఆవళుల్=పంక్తులు, వ్రాలెఁ=క్రిందఁబడెను. సరసిజనేత్ర=తమ్మికంటీ! చూచితె=కనుఁగొంటివా?

భా. పోఁకపొత్తులనుండి నేలఁజాఱిన నూతనకోరకములు, నందవనశ్రీవసంతుల కల్యాణకాలమున నానూతనదంపతు లొండొరులపైఁ బోసికొనినట్టియు, నేలఁబడి వ్యాపించినట్టియు శుభాక్షతలం బోలి యొప్పె నని భావము.

విశే. పూగుత్తులనుండి పూఁచినసుమములు జాఱును గాని నూతనకోరకములు జాఱవు గానఁ, గుహళీశబ్దమునకుఁ బోఁకపొత్తని యర్థము చెప్పుటయే యుచిత మని తోఁచెడి. మఱియు నిందు వసంతతరుణీశబ్దసారస్యము ననుసరించి యువతీవివాహమే క్షత్రియోచితపద్ధతిని నిరూపితమయ్యె నని యూహింపఁదగును. ఇది మొదలు 57-వ పద్యమువఱకును శ్రీకృష్ణుని సరసోక్తులు వర్ణితములు. అలం. ఊహ్యేక్షి.

చ. చిలుకలు వాఁడిచంచువులఁ జించినచో లవలీదళంబులఁ
ఫలరసరేఖ లంటి కనుపట్టెడుఁ జూడుము చైత్రుఁ డీలతా
లలనలగండదర్పణతలంబులఁ గుంకుమపత్రభంగముల్
చెలువుగ వ్రాసెనో యన నలిప్రకరాద్వయవాదికైశికా! 54

టీ. అలిప్రకర...కైశికా - అలిప్రకర = తుమ్మెదగుంపుతో, అద్వయ = అభేదమును, వాది=పలుకునట్టి, కైశికా = కొప్పుగలదాన, లవలీదళంబులఁ = లవలీపత్రములందు, చిలుకలు, వాఁడిచంచువులఁ = సూదిముక్కులతో, చించినచోఁ =,చీల్చినచోటులందు, లేక, చీల్చినపు డనియు నర్థము చెప్పనొప్పును. ఫలరసరేఖలు=పండ్లరసము యొక్కచిహ్నములు, అంటి=అంటుకొని, చైత్రుఁడు=వసంతుఁడు, ఈలతాలలనలగండ దర్పణతలంబులఁ = ఈతీవలను విలాసినుల యద్దములవంటి చెక్కిళ్లతావులందు, కుంకుమ పత్రభంగముల్ = కుంకుమచే రచితమైన మకరికాదిపత్రరచనలను, చెలువుగఁ = అందముగ, వ్రాసెనో = దిద్దెనో, అనఁ = అనునట్లుగా, కనుపట్టెడుఁ = అగపడెడిని, చూడుము = తిలకింపుము.

భా. చిలుకలు పండ్లను మొదట ముక్కులతోఁ జిదిమి పిదపఁ దద్రసయుక్తమైన ముక్కులతో లవలీదళములం జీల్పఁగా, నాదళములం బాముక్కులందంటియున్న ఫలరస మంటె ననియు, నట్లు దళముల నంటి నిల్చిన ఫలరసరేఖలు వసంతుఁడు లతావనితల

చెక్కిళ్లను వ్రాసిన కుంకుమపత్రరచనలవలె నున్న వనియు భావము. చిలుకలు ఫలములను ముక్కుతోఁ బొడువఁగా వానినుండి చిప్పిలిజాఱినరస మాఫలవృక్షముల నల్లుకొనియున్న లవలీలతలయాకులపైఁ బడియుండె ననియు, నవి వసంతుఁడు లతాలలనల చెక్కిళులనొన ర్చిన కుంకుమపత్రరచనలవలె మించె ననియైనను భావము చెప్పనొప్పును. లవలీదళములను ఫలరస మంటియుండుముక్కుతోఁ జిలుకలు పొడచినకతన ఫలరసచిహ్నము లేర్పడె వనుటకన్న లతలు చెట్టుల కల్లికొనియుండుట సహజమగుటంజేసియుఁ బండ్లకు బిల మేర్పడినఁ దద్రసము చిప్పిలి జాఱుట సైజమగుటంజేసియు, ఫలరసము లవలీపల్లవముల జాఱి యంటె ననుటయే యుచితమని తోఁచెడి, ఊరకే లవలీపల్లవచ్ఛేదనమంగీకరింపనేల?

వ్యా-విశే. లవలీపల్లవములు తెల్లగాఁ దళతళలాడుచుండు నని వర్ణించుటయువానిని వనితాగండదేశముల కుపమానములుగఁ బేరొక్కటయుఁ గవులసంప్రదాయ మై యున్నది. "లవలీపల్లవపాండురంబు లగుగల్లక్షోణులక" అని పాండురంగమాహాత్మ్యము. లవలీ పల్లవములు తెల్లనివిగావున నే దర్పణములవంటిచెక్కిళులకు సమానములు గాఁగల్గిన వని గ్రహించునది. పరికింపఁగా లవలీపల్లవము లనఁగాఁ దమలపుటాకు లని విశదమగు చున్నది. అందు, బండుతమలపుటాకు లిచ్చో గ్రహింప నగును. అలఁ. "గండదర్పణ ములు లతాలలనలు" అనుచో రూపకము. లవలీపల్లవములందలి ఫలరసములఁ గుంకుమ మకరికా పత్రరచనలుగా నూహించుటంజేసి యుత్ప్రేక్ష.

ఉ. పాదపనూతనాంబుధరపంక్తివిముక్తమరందవర్షసం
పాదితశక్రగోపములభావము నందుచు నోయదృష్టసిం
హోదరసన్నివేశ! కడు నొప్పెడు డాడిమబీజము ల్మదో
న్మాదితరాజకీరవదనత్రుటితోరుఫలచ్యుతంబు లై. 55

టీ. ఓయదృష్ట సింహోదరసన్నివేశ=ఓకానరాసిసింహమధ్యముం బోలు నడుము కూర్పుగల సత్యభామ, మదోన్మాది.....చ్యుతంబులై-మద = మదముచే, ఉన్మాదిత = మత్తిలిన, రాజకీర = చిలుకమిన్నలయొక్క, వదన=నోళ్ల చేత, త్రుటిత=త్రుంపఁబడిన, ఊరు=గొప్పవైన, ఫల = పండ్లనుండి, చ్యుతంబు లై=జాఱినవై, డాడిమ బీజముల్ = దానిమ్మగింజలు, పాదప.....భావముల్-పాదప = వృక్షము లనెడు, నూతనాంబుధర పంక్తి = క్రొత్తమేఘములచాలునుండి, విముక్త = విడువఁబడిన, మరందవర్ష=పూఁదేనె యనెడు వర్షము చే, సంపాదిత = సమకూర్చఁబడిన, శక్రగోపములభావముల్ =ఇంద్ర గోపము లను పురుగులధర్మమును; అనఁగా నారుద్రపురువులవిధము ననుట. అందుచుల్ = పొందుచు, కడుల్ = మిక్కిలి, ఒప్పెడుల్ = ప్రకాశించెడును.

భా: మదించినరాచిలుకలు ముక్కులచే దాడిమఫలములఁ ద్రుంపఁగా వానినుండి జాఱిన యెఱ్ఱనిబీజములు వానకారునఁ దోఁచు నింద్రగోపముల పోల్కి నుంట నయ్యవి వృక్షపంక్తి యను జలదమాలికచేఁ గూర్పఁబడిన యింద్రగోపములే మో యన్న ట్లుండె నని భావము. అలం. రూపకము. ఉత్ప్రేక్ష.

క. తలిరాకుమెఱుంగువాతెఱు
కలకంఠవిటుండు గమువఁగా జూతలతా
లలన విదిర్చెను గంటివె
యలికంకణముఖరవిటపహస్తముల సతీ! 56

టీ. సతీ = ఓపతివ్రతా! కలకంఠవిటుండు = కోకిల యనువిటుఁడు, తలిరాకు మెఱుంగువాతెఱ్ = చిగురుటాకును ప్రకాశించుపెదవిని, కమువఁగాఁ = ఆక్రమింపఁగా, అవఁగాఁ గొఱుకఁగా ననుట, చూతలతాలలన=మామిడితీవయనువిలాసిని, అలికంకణముఖర.....హస్తములఁ = అలి=తుమ్మెద లనెడు, కంకణ=హస్తాభరణములచే, ముఖర=ధ్వనించుచున్న, విటప=శాఖలనెడు, హస్తములఁ = చేతులచే, విదిర్చెఁ = తొలఁగించెను.

భా. మామిడిచివురుం దినఁ గోయిల వచ్చియు నళిఝుంకారయుతము లగు తచ్ఛాఖల చలనమునకు భయపడి మెసవుట మానిపోయె నని తాత్పర్యము. పైనిర్వ్రాసిన విషయమును గవి, చివురును వాతెఱ గాను, నళులఁగంకణములుగాను, వానిధ్వనిని గంకణారావముగాను, విటపముల హస్తములుగాను రూపించి, మామిడితీవకు స్త్రీత్వ మొసంగి స్త్రీనిఁజేసి, కోయిలను విటునిగా నెన్ని దానికి పురుషత్వ మారోపించి పురుషుఁజేసి, కోయిల చిగురునాక్రమించుటను భుజంగుఁడు పెదవి గఱచుటగా నెన్ని, తుమ్మెదరొదల నొప్పుశాఖాచలనమును గామిని గంకణధ్వను లెసంగుచేతులతోఁ బెదవిఁ గఱచువానిఁ ద్రోయుటనుగాఁ బల్కి, సరసముగ గామినీకాముకవ్యాపారముగ మార్చి వర్ణించెను. ఇందు ముగ్ధావ్యాపారము ప్రకాశితము. వాయి + తెఱ = వాతెఱ అలం. రూపకము.

చ: తనుఁ గనుఁబ్రామి యొండొకలతం బతి వేఱొకతేఁటిబోఁటిపా
త్రున విరిదేనె *గ్రోలఁ గని తూలుచు సంపఁగితావివెల్లిలోఁ
గనలునఁ గూలఁబోవునలికామినిసాహస మేమి సెప్పనా
య్యనుఁగుఁబ్రియుండు నెచ్చెలులు నాఁగిన మాన దరాళకుంతలా!

టీ. అరాళకుంతలా = వక్రములగునలకములు గలదాన; సత్య! కుటిలాలకములు గల్గుట స్త్రీకొకవన్నెగాఁ గవులు వర్ణించుట నైజము, పతి=భర్తయైన పురుషభృంగము, తనుఁ, కనుఁబ్రామి=వంచించి; కనుమొఱఁగి యనుట, ఒండొకలతఁ = వేఱొకలతయందు,

---

* గ్రోలఁగ నెదుర్పడి.

వేఱొకతేఁటిబోటి పొత్తునఁ=మఱొకభ్రమరాంగనయొక్క స్నేహముతో, విరిదేసెఁ=పుష్పాసవమును, గ్రోలఁక = త్రావుచుండఁగా, కని=చూచి, తూలుచుఁ = వంతచేఁ దడబాటు నందుచు, సంపఁగితావివెల్లిలోఁ = చంపకపరిమళప్రవాహమున, కనలునఁ =కోపముతో, కూలఁ =పడుటకు, పోవు=ఏఁగునట్టి, అలికామినిసాహసము = భ్రమరాంగనయొక్క సాహసమును, చెప్పఁ ఏమి=చెప్పుట కేమున్నది? అయ్యనుఁగుఁ బ్రియుండుఁ = ఆ వేఱొక భ్రమపొత్తునఁ దేనెఁద్రావు నాభ్రమరిభర్తయును, నెచ్చెలులుఁ = చెలికత్తెలును, ఱిఁగినఁ = అడ్డగించినను మానదు.

భా. ఒకపురుషభ్రమరము తనజాయను వీడి వేఱొకయూఁడుతుమ్మెదతోఁ బుష్పమరందమును గ్రోలుచుండఁగా, నామగతుమ్మెదజాయ యూజాడం గాంచి మానక్రోధము లగ్గలముగాఁ దా జీవితముం ద్యజింపఁ జంపకగంధప్రవాహమునఁ బడఁబోవుచుండె ననియు, దానిమగఁడగు కొదమతుమ్మెదయు, దానిచెలులును వలదని యెంతవారించినను నది యూ యత్నమును విడువకుండె ననియు భావము. చంపకగంధము సారంగప్రాణాపాయకర మనుట సహజము. తుమ్మెద లిచ్చోఁ టిచ్చోఁ టనక ప్రాణములమీఁదియాసను గూడ వీడి సంచరించుచున్న వని ఫలితార్థము.

విశే. శ్రీకృష్ణుఁ డీమూలముగ స్త్రీలకుఁ గలసాహసము, పట్టుదల మున్నగువానిని సత్యకు సూచించుచు, నీవును నిట్టిదానివే యనునంశమును నిపుణముగఁ దెలియఁబల్కి నని యెన్నునది. పారిజాతమును రుక్మిణి కొసంగినకతమున సత్య శ్రీకృష్ణునిపై నలుకఁ బూనుట యనుసత్యావృత్తాంత మిందు శ్రీకృష్ణుఁడు సత్యకు సాకూతముగఁ దెలియఁజేసె నని గ్రహించునది.

ఇందు "గ్రోలఁ గని తూలుచు" అనుచో "గ్రోలఁగ నెదుర్వడి" అనుపాఠాంతర మగపడు. అప్పుడు గ్రోలఁగఁ=త్రావఁగా; ఎదుర్వడి=ఎదురై" అని యర్థము చెప్పవలెను. అనఁగా భ్రమరి యెచటనుండియో వచ్చుచు నెదురై చూచె నని భావము.

చ. అనుచుఁ బ్రియాంసపీఠి నిజహస్తతలంబున నూఁది గల్పకా
వనిజదుకూలమార్జనల వంజులపుష్పమరందసేచనఁ
దనదువిహారవైఖరికి నందనదేవత యాయితంబు సే
సినగతి నొప్పుదివ్యవనసీమ ముదంబున సంచరించుచున్. 58

టీ. అనుచుఁ=పల్కుచు, శ్రీకృష్ణుఁడు కర్త. ప్రియాంసపీఠిఁ = ప్రేయసి యొక్క విశాలమగుమూఁపును, నిజహస్తతలంబునఁ = తనచేతితో, ఱోఁది=పట్టుకొని; అనఁగా మూఁపునఁ జేయిఁడి యనుట. కల్పకావనిజదుకూలమార్జనలఁ -కల్పకావని=కల్ప

వృక్షములసమూహమునుండి, జ=పుట్టిన, దుకూల=పట్టుబట్టల చేనైన, మార్జనలక్=తుడుచుటల చేతను, వంజులపుష్పమరంద సేచనక్ - వంజులపుష్ప=అశోకకుసుమములసంబంధమైన, మరంద=తేనెయొక్క, సేచనక్=తడుపుట చేతను, తనదువిహారవైఖరికిక్ = తన విహారపురీతికి, నందనదేవత=నందనవనదేవత, అయితంబు=సిద్ధము, చేసినగతిక్ = చేసిన రీతిగ, ఒప్పు=ఒప్పునట్టి, దివ్యవనసీమక్ = దేవవనతలమున, ముదంబునక్ = సంతోషముతో, సంచరించుచుక్=విరుగుచు.

భా. కల్పకదుకూలములచేఁ దుడువఁబడి యశోకసుమమరంద సేచనమున మించు నవ్వనము శ్రీకృష్ణవిహారమునకై తగురీతినందనవనదేవత సిద్ధముచేసినట్లుండెననియు,నందు సత్యాంసమును జేతితో నూఁది శ్రీకృష్ణుఁడు విహరించె ననియు భావము.భుజమువైఁజేయు వైచి నడుచుట కూర్మిని సూచించునదియు శృంగారపుఠీవినిఁ బ్రకటించునదియు నగును.

శా. అర్చిష్మత్ప్రతిమప్రతాప! మహనీయత్యాగ! వైత్యాభియా
తశ్యరోచ్ఛ్వచ్చతురర్ణవాంతసకలజ్యాభోగ! జాగ్రద్యశ
శ్చర్చాసాంద్ర*దిగంగనాంగ! మదనశ్యామాసహాయేంద్రభూ
పర్చస్తేనశరీరమోహితజగద్వామా! కళామానసా! 59

టీ. అర్చిష్మత్ప్రతిమప్రతాప=సూర్యునితోసాటియైనప్రతాపముగలవాఁడ, మహనీయత్యాగ=గొప్పయీవిగలవాఁడ, వైత్యాభియాత....భోగ-వైత్యఅభియాతి=రాక్షసశత్రు వగు విష్ణునియొక్క, అర్చా=పూజచేత, ఉద్యత్=సంభవించిన, చతుర్ణవాంత=నాలుగుసముద్రములు హద్దుగాఁ గల్గిన, సకలజ్యా=సమస్తభూమియొక్క; భోగ=అనుభవముగలవాఁడ, జాగ్రత్.....దిగంగనాంగ-జాగ్రత్=సర్వోత్కర్ష మన్న, యశ = కీర్తి యనెడు, చర్చా = మైపూఁతచే, సాంద్ర=దట్టములైన, దిగంగనాంగ=దిక్కన్యల యవయవములు గలవాఁడ, మదన.....జగద్వామా-మదన = మన్మథునియొక్కయు, శ్యామాసహాయ=నిశాసహాయుఁడగుచంద్రునియొక్కయు, ఇంద్రభూ=ఇంద్రునికొడుకగు జయంతునియొక్కయు, వర్చస్ = తేజస్సులకు, స్తేన = దొంగయైన, శరీర = శరీరముచే, మోహిత=మోహింపఁజేయఁబడిన, జగత్ = లోకమునందలి, వామా=వనితలు గలవాఁడ, కళామానసా=విద్యాయుక్తమైన మదిగలవాఁడ.

భా. కృష్ణరాయఁడు సూర్యతుల్యప్రతాపుఁడనియు, మహాదాత యనియు, విష్ణుపూజాధురంధరత్వమున సంప్రాప్తమైనరాజ్యవైభవము గలవాఁడనియు, దిగంతవ్యాప్త యశస్కుఁడనియుఁ, జంద్రకంతుజయంతులకన్నఁ జక్కనివాఁడగుట నాత్రసించి స్త్రీ లెల్లరును మోహముం జెందుచుందు రనియు భావము.

---

* దిగంతరాళ!

విశే. చతుర్ణపరీతభూవలయమంతయు వశపడకున్నను వశపడినట్లు చెప్పుట యతిశయోక్తి. ప్రతాపవిషయమున సూర్యునితోఁ బోల్చుట సామాన్యముగఁ గవిసంప్రదాయ మూట నిచ్చో 'అర్చిష్మత్' పదమునుండి యగ్నియనుసర్థ ముద్ధరింప వీలున్నను నట్లొనర్పలేదు. అగ్నికాంతికి సూర్యుఁడేగదా కతము!

క. విదళితకాలింగమదా,స్పదసింధురకుంభరత్నశర్కరిలారా
దుదయగిరికొండవీటీ, పదవీస్థల! మండలీకభాస్కరబిరుదా! 60

టీ. విదళిత...పదవీస్థల - విదళిత = బ్రద్దలుచేయఁబడిన. కాళింగ = కళింగ దేశాధిపతిసంబంధమైన, మదాస్పద=మదమునకుఁ దావులైన; అనఁగా మదించిన వనుట. సింధుర = ఏనుంగులయొక్క, కుంభ = కుంభస్థలములందలి, రత్న=రత్నములచే, ఏనుఁగు కుంభములను బొంగువెదుళ్లను మంచిముత్తెము లుండు ననుట కవిసంప్రదాయమగుట, నిచ్చో రత్నపదమునకు మంచిముత్తెము లని యర్థము. మఱియు నవరత్నములలో మంచి ముత్తె మొకటి యీట రత్నపదవ్యవహార మవిరుద్ధము. శర్కరిల=కఱకుటిసుకగలదిగాఁ జేయఁబడిన, ఆరాత్=సమీపమునం దున్న; అనఁగాఁ బట్టణసమీపమున నున్న వనుట. ఉదయగిరి కొండవీటిపదవీస్థల='ఉదయగిరి','కొండవీడు' అనుపట్టణముల ప్రదేశములు గల వాఁడ;అనఁగాఁ గృష్ణరాయఁ డుదయగిరికొండవీడులప్రాంతదేశములఁ గళింగరాజపాలిత ములను నారాజులసంబంధమైన మదపుటేనుంగుల కుంభములం జీల్చి యందలి ముత్తెము లచే నిసుకగలవానినిగాఁ జేసెనని భావము. యుద్ధభూములు పట్టణబాహ్యముల నుండుట సహజముగదా. మండలీకభాస్కరబిరుదా='మండలీకభాస్కర' అను బిరుదము గలవాఁడ.

వా-విశే. సిద్ధసమాసమునఁ జొనుపుచు నందుఁ బట్టణనామ మగు కొండవీడు పదము నాపవిభక్తికముగాను 'కొండవీటీ' అని యాకారాన్త స్త్రీలింగశబ్దముగాను ప్రయోగించుట వింత. లేదా కొండవీటీశబ్దమే ప్రాతిపదిక మనవలెను.

పంచచామరము.

మరుద్వృధాతటస్థశత్రుమండలీగళాంతర
ఝరన్నవాసృగాపగాభిసారికాదృతాంబుధీ!
మరుత్పతిస్వరుక్షతిక్రమత్రుటత్కృభృద్వర
స్ఫురద్ధ్వనిప్రవృద్ధియుద్ధపుంఖితానకార్భటీ! 61

టీ. మరుద్వృధా...అంబుధీ-మరుద్వృధా = కావేరియొక్క, తటస్థ=తీరమం దున్న, శత్రుమండలీ = శత్రుసమూహముయొక్క, గళాంతర = కంఠమధ్యమునుండి,

ఉరత్ = కారుచున్న, నవాసృక్ = క్రొత్తనెత్తురనెడు, ఆపగా = నదీరూపమైన, అభిసారికా = కాంతునిబొందఁబోవు స్త్రీలచే, ఆదృత = ఆదరింపఁబడిన; సంతోషపెట్టఁబడినవాఁడనుట. అంబుధీ = సముద్రుఁడుగలవాఁడ, మరుత్పతి...ఆనకార్భటీ-మరుత్పతి = దేవేంద్రుని యొక్క, స్వరు = వజ్రాయుధసంబంధమైన, ఝతి = దెబ్బలచే, క్రమ = క్రమముగా; అనఁగా నొకటిశరువాత నొకటి యనుట. త్రుటత్ = నేలఁగూలుచున్న, కుభృద్వర = పర్వతశ్రేష్ఠములయొక్క, స్ఫురత్ = ప్రకాశమాన మగు; అనఁగా వెలికి వెడలిన దనుట. ధ్వని=చప్పుడువలె, ప్రవృద్ధ=అతిశయించిన, యుద్ధ=యుద్ధమునకు సంబంధించిన, పుంఖా తానక=క్రమముగా నొప్పునట్టి భేరీవిశేషములయొక్క, ఆర్భటీ=ధ్వనులుగలవాఁడ.

భా. కృష్ణరాయఁడు గావేరీతీరస్థశత్రుసమూహమును గూర్చి వారిక్రొన్నెత్తురు టేరులచే సముద్రు నుప్పొంగించె ననియు, వజ్రాయుధహతిచే గుబాలున నేలం గూలు పర్వతముల యారావములవలె నాతని జయభేరీధ్వను లెసఁగె ననియు భావము.

విశే. సముద్రుఁడు నదీపతి యగుట నతనిం గాంతునిగాను, వానిం జెందఁబోవు రక్తనదుల నభిసారికలనుగాను గవి పేర్కొనుట యుచిత మనఁ దగును. ఇది పంచచామర మనువృత్తము. దీని కొకపాదమునకు జ.ర. జ. ర. జ. గ. అనుగణము లుండును. దశమాక్షరము యతిస్థానము. ఇట్లే తక్కుంగలపాదము లుండును. దీనినడకగూడ వర్ణ్యమగు భేరీధ్వనినే యనుకరించుచున్నది.

గద్యము. ఇది శ్రీమదుమామహేశ్వరవరప్రసాదలబ్ధ సారసార్వ
భౌమాభినంది నందిసింగయామాత్యపుత్ర కౌణిక
గోత్రపవిత్ర సుజనవిధేయ తిమ్మయనామ
ధేయప్రణీతం బైనపారిజాతాపహరణం
బను మహాప్రబంధంబునందుఁ
దృతీయాశ్వాసము.

# చతుర్థాశ్వాసము



వేంకటగిరివల్లభ
సేవాపరతంత్రహృదయ ! చిన్నమదేవీ
జీవితనాయక ! కవితా
ప్రౌఢిణ్యాఫణీశ ! కృష్ణరాయమహీశా ! 1

టీ. శ్రీవేంకట...హృదయ-శ్రీవేంకటగిరివల్లభ=శ్రీవేంకటాచలేశునియొక్క, సేవా=అర్చనయందు, పరతంత్ర=ఆసక్తమైన, హృదయ = మనస్సుగలవాఁడ, చిన్నమదేవీజీవితనాయక = చిన్నమదేవీప్రాణేశ్వరుఁడా, కవితాప్రౌఢిణ్యాఫణీశ = కవిత్వనైపుణి విషయమున శేషుని బోలువాఁడ, కృష్ణరాయమహీశా = కృష్ణరాయభూమీశ.

భా. కృష్ణరాయఁడు తిరుమలేశుం డగు వేంకటేశ్వరుని గొల్చుటయందే మిగుల నాసక్తి గలవాఁ డనియుఁ, జిన్నమదేవికిఁ బ్రియుఁ డనియుఁ, గవిత్వనైపుణికి శేషు ననుకరించువాఁ డనియు భావము. కృష్ణరాయని కవితానైపుణి యిందుఁ బ్రకాశితము.

## పారిజాతము

తే. అవధరింపుము జనమేజయక్షితీశ
వరున కిట్లను నమ్మానివల్లభుండు
వనవిహారంబు సలుపుచు వచ్చి వచ్చి
పారిజాతంబు గాంచి సంభ్రమ మెలర్ప. 2

టీ. అవధరింపుము, జనమేజయక్షితీశవరునకుఁ, అమ్మానివల్లభుండు = ఆమునిశ్రేష్ఠుఁడు, ఇట్లనుఁ =ఇట్లనెను. వనవిహారంబు, సలుపుచుఁ =చేయుచు, వచ్చివచ్చి;కొంతదవ్వు వచ్చి యనుట. కృష్ణుఁడు కర్త. పారిజాతంబుఁ =పారిజాతవృక్షమును, గాంచి=చూచి, సంభ్రమము=త్వర, ఎలర్పఁ =అతిశయింపఁగా, ముందటిపద్యముతో నన్వయము. శ్రీకృష్ణునికర్తవ్యాభినివేశ మీసందర్భమునఁ గవి తెల్లము గావింప నెంచినవాఁడు గానఁ బ్రారంభమునఁ జే సంభ్రమ మెలర్ప నని బీజమును నాటినాఁడు.

మ. అమరారాతివిభూతి సత్యఁ గని, కాంతా! చూచితే పారిజా
తము భూమీరుహచక్రవర్తి త్రిజగత్సంపూజ్యసౌరభ్యకీ
ర్తి మరుల్లోక మలంకరించునది గౌరీనాథు జూటస్థలం
బు మృగాంకుండు రమామనోరమునురంబుం గౌస్తుభంబుంబలెన్. 3

టీ. అమరారాతివిభూతి = రాక్షసహంత యగు శ్రీకృష్ణుఁడు, సత్యఁ = సత్య భామను, కని = చూచి, కాంతా! భూమీరుహచక్రవర్తి = వృక్షరాజమైనదియు, త్రిజగత్సంపూజ్యసౌరభ్యకీర్తి = ముల్లోకముల చేతను నర్చింపఁదగిన పరిమళ మను యశము గలదియు, గౌరీనాథుజూటస్థలంబున్ = శివునిమూళిభాగమును, మృగాంకుండున్ = చంద్రుఁడును, రమామనోరమునురంబున్ = విష్ణువక్షస్థలంబును, కౌస్తుభంబుం బలెన్ = కౌస్తుభమాణిక్యమువలెను, మరుల్లోకమున్ = స్వర్గమును, అలంకరించునది = విభూషించునది, పారిజాతమున్ = పారిజాతవృక్షమును, చూచితే = చూచితివా?

ఇందలి 'కని' అను నసమాపకక్రియకు 11-వ పద్యమునందలి 'నావుడున్' అను దానితో నన్వయము.

భా. కౌస్తుభము విష్ణువక్షస్థలము నలంకరించుపగిదిని, జంద్రుండు శంకరుని మూళిభాగమును విభూషించువిధమున, స్వర్లోకము నలంకరించునదియు, ముల్లోకముల వారిచేఁ గీర్త్య మగు పరిమళ మను కీర్తి గలదియు, వృక్షములలోనెల్ల నుత్తమమైనదియుఁ గల్పనగ మని భావము.

విశే. ఇందుఁ బారిజాతమునకు నిల్పఁబడినవిశేషణములు తద్ధనతను వెల్లడింప సమర్థములై సత్యభామకుఁ దద్విషయకాభిలాష నతిశయింపఁజేయుచున్నవి. ఇది మొదలుకొని 11-వ పద్యమువఱకుఁగల శ్రీకృష్ణసంభాషణ మిట్లే పారిజాతవృక్షమహిమాప్రకాశకమై సత్యకుఁ దద్విషయమగుకోర్కి నతిశయింపఁజేయునదై తచ్ఛీలప్రకాశనబీజభూతమై యొప్పుచున్నది.

వ్యా-విశే. కౌస్తుభంబుంబలెన్. ఇది సమస్తపదము. 'ఉపమేయము ప్రథమాంత మగునపుడు బలె పరంబగుచో నామతచ్ఛబ్దార్థములకుఁ బ్రథమ యగు' అను ప్రౌఢవ్యాకరణసూత్రము ననుసరించి బలెపరముగా నామమగుకౌస్తుభమునకుఁ బ్రథమ వచ్చె. పిదప "ప్రథమాంతములమీఁద పోలెబలెపోనిశబ్దములు ద్రుతపూర్వకంబులు విభాష నగు" అను సూత్రమునుంచి 'బలె' అనుదానికి పూర్వము 'ను' కగ్గి తరువాత ద్రుతకార్యము బిందుపరాఁ బైరూపము సిద్ధించె. అలం. ఉపమ.

క. తరుణీ! యీతరుశాఖాం, తరలోలదుకూలమారుతము లింద్రాణే
పరివారవారసతులకుఁ, బరువపువిరికోఁతఁ బొడమముబడలిక నడఁచున్.

టీ. తరుణీ=యువతీ! ఈతరు...మారుతములు-ఈతరు = పారిజాతముయొక్క, శాఖాంతర=కొమ్మలనడుమను, లోల=కదలుచున్న, దుకూల = పట్టుబట్టలచేనైన, మారుతములు=గాలులు, ఇంద్రాణీపరివారవారసతులకున్ = శచీదేవియొక్క పరిచారికలగు దేవవేశ్యలకు, పరువపువిరికోఁతన్ = వికసించినపూవులను గోయుటచే, పొడము=పుట్టిన, బడలిక = ఆయాసమును, అడఁచున్ = పోఁగొట్టును.

విశే. 'ఏషాం పల్లవమంశుకాని' అని శక్తిభద్రుని యాశ్చర్యచూడామణి శ్లోకపాదము ననుసరించి కల్పకపల్లవములే దుకూలము లని యెన్నవలసియున్నది. ఇందలి 'ఈతరుశాఖా' అను సమాసమునందు మొదటఁగల 'ఈ' శబ్దము మారుతపదమునకే విశేషణమని గ్రహింపవలయును. అట్లైనచో నిం దేకదేశాన్వయమునకుఁ దావు గలుగదు.

ఉ. మానిని! దీనిరత్నకుసుమస్తబకమ్ముల కాంతిఁ గమ్మఁబూఁ
దేనియ యంచుఁ గ్రోలఁ జనుదెంచినయాయెలదేఁటిదాఁటు లో
నూనినడప్పి మూఁగఁబడి యున్నతచంచలచంచుకోటిచే
నానెడుఁ జూడు మందగరుదంచలఝుంకృతు లుల్లసిల్లఁగన్. 5

టీ. మానిని = ఓమానవతీ! ఇది సాభిప్రాయము. దీనిరత్నకుసుమస్తబకమ్ముల కాంతిక్ = ఈకల్పకవృక్షసంబంధమైన మాణిక్యపుష్పగుచ్ఛములప్రభను, కమ్మబూఁదేనియ=కమ్మనిమకరందము, అంచుక్ = తలంచుచు, క్రోలక్ =త్రాగుటకు, చనుదెంచిన=వచ్చిన, ఆయెలదేఁటిదాఁటు=ఆ లేఁదేంట్లసమూహము, లోక్ = లోపల, డూనిన=పుట్టియున్న, డప్పిక్ =దప్పిచే (తృషచే నని యర్థము), మూఁగఁబడి, ఉన్నత...కోటిచేక్ - ఉన్నత=దీర్ఘమైన, చంచత్ =కదలుచున్న, చంచు=ముక్కులయొక్క, కోటిచేక్ =కొనలచేత, మంద...ఝుంకృతులు-మంద = మెల్లనైన, గరుదంచలఝుంకృతులు = తొక్కల కొసలయొక్క ఝుంకారధ్వనులు, ఉల్లసిల్లఁగక్ = ప్రకాశితముగాఁగ, ఆనెడుక్ = త్రాగును, చూడు=చూడుము.

. భా. ఎలదేఁటిగుమి కల్పవృక్షరత్నపుష్పగుచ్ఛకాంతి గాంచి కమ్మని మరంద మను భ్రాంతిని దృషతో దానిం గ్రోల నేతెంచి యల్లనల్లన తొక్కలాడించుచుఁ జంచుకోటిచే నానుచున్న పడె కాంచు మని భావము.

విశే. విశేషణముల నిగాగమమునకు బిందువుసున్నసోఁకునఁ బరుషము సరళమునయ్యెను. కమ్మఁబూఁదేనె. అలం. భ్రాంతిమత్తు.

క. ఈతరుశాఖల ప్రేలెడు, మేతొడవుల కాంతిలోన మెలఁగెడుపక్షి
వ్రాతము నెఱుఁగరు నిర్జర, కాతరలోచనలు పలుకఁగా వినకున్నన్.

టీ. ఈతరుశాఖలన్ = ఈచెట్టుకొమ్మలందు, వ్రేలెడు=వ్రేలాడునట్టి, మేతొడవుల కాంతిలోనన్ =శరీరాలంకారములకాంతిలో, మెలఁగెడు = సంచరించునట్టి, పక్ష్మవ్రాతమున్ =పక్షులసమూహమును, నిర్జరకాతరలోచనలు=దేవతాస్త్రీలు, (కాతరలోచన = భీతనేత్ర), పలుకఁగాన్ =శబ్దమొనర్పఁగా, వినకున్నన్ =వినకపోయినచో, ఎఱుంగరు= తెలిసికొనఁజాలరు.

భా. కల్పవృక్షశాఖలందు శరీరాభరణములు గల పనియుఁ నందునివసించుపక్షులును. వానిపోల్కి కలిగియేయుండుటంజేసి యివి యాభరణము లియ్యవి పక్షులని పోల్చుకొనుటకు వీలులేకపోయె ననియు, నైనను బక్షులు కలకలధ్వనులు గల్గియుంటంజేసి దేవతాస్త్రీలు మైతొడవులను తెలిసికొనఁజాలి రనియు భావము.

క. తనపాదుజలములోనం, గనుపట్టెడునీడ నీనగము విలసిల్లున్
మనకన్న మున్న తా మే,దినికిం డిగి యేఁగుచున్న తెఱఁగునఁ దరుణీ!

టీ. తరుణీ=యువతీ! తనపాదుజలములోనన్ =తనయొక్కయాలవాలమునందలి నీటిలో, కనుపట్టెడు = అగపడునట్టి, నీడన్ =ప్రతిబింబము చే, ఈనగము = ఈకల్పకము, మనకన్నమున్న = మనకన్నముందుగానే, తాను, మేదినికిన్ =భూమికి, డిగి=దిగి, యేఁగుచున్న తెఱఁగునన్ = పోవుచుండువిధమున, విలసిల్లున్ = ప్రకాశించుచున్నది.

భా. జలవాలోదకమునఁ బ్రతిఫలించిన కల్పవృక్షాకారము సత్యా శ్రీకృష్ణుల కన్న ముందుగానే కల్పకము భువికిఁ బోవుచున్న ట్లున్న దని భావము.

విశే. కల్పకము భువికిఁ గొనిపోవుట తప్ప దనుసంశయమును సత్యకు సూచించియబ్బుఁ గల్గించుటకును, నామెకుఁ దద్గ్రహణవిషయమున సంభ్రమాతిశయమును బుట్టించుటకును నిట్లు శ్రీకృష్ణుఁడు ప్రసంగించె ననఁదగును.

ఉ. వారణరాజయాన! సురవల్లభుఁ డాశచి నంకపీఠమున్
జేరిచి సోగవెండ్రుకలఁ జిక్కులు వాపి వియన్న దీనవాం
భోరుహనాళసూత్రములఁ బొందుగ దీనిలతాంతముల్సరు
ల్గా రచియించి నించుఁ గుతుకంబున వీఁగుమెఱుంగుక్రొవ్వెదన్. 8

టీ. వారణరాజయాన=గజరాజగమన; (సత్య) సురవల్లభుఁడు=దేవేంద్రుఁడు, ఆశచిన్ = ఆశచీదేవిని, అంకపీఠమునన్ = ఊరుదేశమును, చేరిచి=పొందించి, సోగవెండ్రుకలన్ =పెన్నెఱులంటైన, చిక్కులు=మేలికలు, వాపి = పోఁగొట్టి, వియన్నదీనవాంభోరుహనాళసూత్రములన్ =మిన్నేటికొత్తతమికాడలదారములందు, పొందుగన్ =ఒప్పునట్లుగా, దీనిలతాంతముల్ = ఈకల్పవృక్షపుష్పములు, సరుల్ = దండలు, గాన్ =అగునట్లు, రచియించి = చేసి, (దండలను గుచ్చి) కుతుకంబునన్ = సంతోష

ముతో, వీఁగుమెఱుఁగుర్వెదర్ = గొప్పదై తళతళలాడుకొప్పున ఱదుఁనించుక్ = నింపును. (ముడుచు ననుట.)

విశే. ఇట్టిభాగ్యము నీ కెపుడు గల్గునో యని సత్యను శ్రీకృష్ణుఁ డువ్విళులూరింప నిట్లు ప్రసంగించె నని గ్రహించునది.

మ. వినుమింతు ల్దిలకంబుఁ జంపకమునుఁ గ్రోవి న్సింధువారంబుఁ బ్రేం
కనమున్ మామిడి గోఁగుఁ బొన్నఁ బొగడుం గంకేళి మూహించి క
న్గొన మోమెత్తఁగఁ గౌఁగిలించుకొన మూర్కొఁ బాడఁ జేనంటఁ బ
ల్క నగం గల్గుమియంగఁ దన్న ననుచుం గల్పాగమాయాఁవిరుల్. 9

టీ. ఇంతుల్=స్త్రీలు, తిలకంబుక్, చంపకమున్=సంపెఁగను, క్రోవిక్, సిందువారంబుక్, ప్రేంకనమున్, మామిడిక్, గోఁగుక్, పొన్నక్, పొగడక్, కంకేళిక్, ఈచెట్టులను, ఊహించి = మదిం దలంచికొని, క్రమముగా, కన్గొనక్ = చూడఁగా. మోమెత్తఁగక్ = మొగమెత్తఁగా, కౌఁగిలించికొనక్=ఆశ్లేషింపఁగా; మూర్కొక్ = ఆఘ్రాణింపఁగా, పాడక్ = గానము సేయఁగా, చేనంటక్ = చేతితోఁ దాఁకఁగా, పల్కక్ = మాటాడఁగా, నగక్=నవ్వఁగా, కల్గు+ఉమియంగక్ = కల్గు నుమ్మఁగా, తన్నక్=కాలిచేఁ దన్నఁగా, కల్పాగము = కల్పవృక్షము, ఆమూవిరుల్ = (వారుదేని నూహించి పైఁజెప్పినరీతిని దోహద మాచరించిరో) యావృక్షసుమములను, ననుచుక్ = పుష్పించును.

విశే. ఇందుఁ గ్రమము ననుసరించి వృక్షవాచకశబ్దముల నొక్కొక్కయసమాపక క్రియతో సంబంధింపఁజేసి యన్వయము నరయునది. కాఁగా, తిలకవృక్షమునకు వీక్షణము, సంపెఁగకు ముఖరాగము, గోరంట కాలింగనము, సిందువారమునకు ముఖానిలము, ప్రేంకనమునకు గానము, మామిడికిఁ గరస్పర్శము, కర్ణికారమునకు సల్లాపము, పొన్నకు నవ్వు, పొగడకు ముఖార్పితమద్యము, అశోకమునకుఁ జరణతాడనము దోహద విశేషము లని తెలియుచున్నది. ఆయావృక్షము లాయాయాసమయములందే పుష్పించుట ఫలించుట కలదు. కాలముకాని కాలమునఁ బుష్పింపవలెను, ఫలింపవలె నన్న పైనిజెప్పిన దోహదముల నాచరింపవలె నని తాత్పర్యము. ఈదోహదవిశేషములు స్త్రీకృతములే గావలె నని యందురు. కల్పవృక్షము తక్కినచెట్లవలెఁగాక యేవృక్షమును మదిఁ దలంచి దోహద మొనర్తురో యావృక్షములసుమములఁ దలఁచినక్షణమునఁ బ్రసాదించు నని గ్రహించునది. అనఁగా నన్నివృక్షములరూపమును దానే దాల్చి యాయాసుమముల నుద్భవింపఁజేయు నని యెన్నునది. అలం. యథాసంఖ్యము.

చ. కనఁ దిలకంబుఁ గేసరము: గల్లుమియ న్రహిఁ బాడఁ బ్రేంకనం
బు నిముర మావి నవ్వ సురపొన్న ముఖాంబుజ మెత్తఁ జంపకం
బు నెఱుగవుంగిలం గొరవి మూర్కొన వావిలి దన్న వంజుళం
బు నుడువ గోఁగునై తరుణి! పూచు సుర ద్రుమ మిన్ని పువ్వులన్. 10

టీ. కనన్ = చూడఁగా, తిలకంబున్ = తిలకవృక్షమును, కల్లు=మద్యము, ఉమియన్ = ఊస్మఁగా, కేసరమున్ = పొగడచెట్టును, రహిన్ = మధురముగా, పాడన్ = గానము సేయఁగా, ప్రేంకనంబున్ = ప్రియాళువృక్షమును, నిమురన్ = కరస్పర్శనము చేయఁగా, మావిన్ = మామిడియు, నవ్వన్ = హసింపఁగా, సురపొన్న = సురపొన్న చెట్టును, ముఖాంబుజము = మోముఁదామర, ఎత్తన్ = ఎత్తఁగా; అనఁగా ముఖరాగ ప్రసారమున ననుట. చంపకంబున్ = సంపెఁగచెట్టును, నెఱిన్ = పూర్ణముగా, కవుంగిలన్ = ఆలింగనము చేయఁగా, కొరవి = గోరంటయును, మూర్కొనన్ = ఆఘ్రాణింపఁగా, వావిలి, తన్నన్ = పాదాహతి యొనర్ప, వంజుళంబున్ = అశోకమును, నుడువన్ = మాటలాడఁగా, గోఁగును, ఐ=అయి; అనఁగా మీఁద నుడివిన చొప్పున దోహదమొనర్ప, నాయా దోహదవిశేషముల కనురూపముగ నాయాచెట్లు తానే యొ యనుట. తరుణి= యువతి, సురద్రుమము = కల్పవృక్షము, ఇన్ని పువ్వులన్ = ఇన్ని చెట్లులవ్రూవులను, పూచున్ = పుష్పించును.

విశే. పూర్వపద్యమున నాయావృక్షములం దలంచి దోహదమొనర్చిన నాయా వృక్షసుమములను గల్పాగమొసఁగునని వర్ణితమయ్యె ననియు, నిందు నాయావృక్షముల మదిం దలంపకయే యాయావృక్షములకు సంబంధించిన దోహదములనుమాత్ర మొన ర్చుటకతనఁ గల్పవృక్ష మాయావృక్షసుమములఁ బ్రసాదించు నని వర్ణిత మయ్యె ననియు గ్రహించునది. పూర్వపద్యమున నుక్తములైన దోహదవిశేషములే యిందుఁ బేరొక్కనఁ బడినవి.

ఉ. నావుడు సత్యభామ నిజనాథున కిట్లను నేల తామసం
బీవిబుధాధినాయకమహీరుహమున్ బెకలించి లోకసం
భావిత మైననీపలుకుఁ బంతము సెల్ల మదీయగేహ కే
ళీవనవాటి వేడుక దలిర్పఁగ నిల్పుము జీవితేశ్వరా! 11

టీ. నావుడున్ = అనఁగానే, శ్రీకృష్ణుఁడు కర్త. సత్యభామ, నిజనాథునకున్ = తనపతికి, ఇట్లను, అనున్ = అనెను. జీవితేశ్వరా = ప్రాణేశ్వరా! తామసంబు = ఆలస్యము, ఏల = ఎందులకు? ఈవిబుధాధియక మహీరుహమున్ = ఈదేవేంద్రుని

చెట్టును; కల్పవృక్షము ననుట. పెకలించి = పెల్లగించి, లోకసంభావితమైన=లోకపూజ్యమైన, నీపలుకుక్ = నీమాటను, పంతమ్ము = శపథమును; ప్రతిజ్ఞ యనుట. చెల్లక్ = సాగఁగా, మదీయకేళీవనవాటిక్ = నాక్రీడావనప్రదేశమున, వేడుక=సంతసము, తలిర్పఁగాక్ = ఒప్పునట్లు, నిల్పుము = స్థాపింపుము.

విశే. "నీపలుకును లోకులు గౌరవింతురు. కాన నిపుడు నీవాడినమాటను దక్ష్యముగాఁ జేసికొని శ్రీకృష్ణుఁడు సత్యసంధుఁ డనుమాట నిల్వఁబెట్టుకొనుము. మఱియు నీమూలమునఁ గృతకృత్యుఁడవై సత్యప్రతిజ్ఞుఁడవు గమ్ము" అని సత్యభామ శ్రీకృష్ణునుత్సుకుం జేయ, నిట్లు ప్రసంగించెను. శ్రీకృష్ణుఁ డామెశీలమును గనుఁగొననాడిన పూర్వపద్యములందలిమాటలు వెనువెంటనే యామె త్వరపాటుగల స్వభావమును వలచినదానిని సాధించువిషయమున నామెకుఁ గలపట్టుదలను బ్రకటింప సమర్థము లయ్యెఁ. మఱియు నామె యాకృత్యమును నెఱవేర్చనపుడు నీపలుకు లోకసంభావితము గాఁజాల దనియు నీవకృతప్రతిజ్ఞుఁడ వనుదూఱుకుఁ దావల మగుదు వనియుఁగూడ సూచించుచు, నిర్బంధించి యాపనిచేఁ దనపనిని జక్కఁబెట్టించికొన యత్నించె ననియుఁ దోఁచెడును.

మ. అనినం గైటభదైత్యవైరి దరహాసాంకూరము ల్మోవిపై
మొనయం గొండొక నిల్చి యివ్వనమున న్మోదంబుతో నిర్జరీ
జనము ల్గొల్వఁగ క్రీడ సల్పి భవదిష్టం బేను గావింతు నం
గన! యంచాతరురత్నగుచ్ఛ మిడియెం గర్ణావతంసంబుగన్. 12

టీ. అనినన్ = అనఁగా, సత్యకర్త. కైటభదైత్యవైరి = కైటభాసురశత్రువగు శ్రీకృష్ణుఁడు, దరహాసాంకూరముల్ = చిఱునగవు మొలకలు, మోవిపైన్ = అధరముపై! మొనయన్ = వ్యాపింపఁగా, కొండొక = కొంచెము సేపు, నిల్చి, అంగన = కాంతా, ఇవ్వనమునన్ = ఈయారామమున, మోదంబుతోన్ = సంతోషముతో, నిర్జరీజనముల్ = దేవతాస్త్రీలు, కొల్వఁగన్ = సేవింపఁగా, క్రీడ, చల్వి = చేసి, భవదిష్టంబు = నీకోర్కిని, ఏను, కావింతున్ = ఒనర్తును, అంచున్, ఆతరురత్నగుచ్ఛము = ఆకల్పకరత్న పుష్పస్తబకమును, కర్ణావతంసంబుగన్ = కర్ణాభరణముగ, ఇడియెను = పెట్టెను.

విశే. శ్రీకృష్ణునకు మందహాసముగల్గుటలో సత్యత్వరపాటును నామెపూర్వోక్తమార్గమునఁ దన్ను నిరోధించుటయుఁ గారణములుగా గ్రహించునది.

ఉ. ఈపగిది న్మురారి హృదయేశ్వరి నూఱడఁ బల్కి నిర్జరేం
ద్రోపవనస్థలంబునఁ బయోరుహనేత్రయుఁ దానుఁ జేరి పు
ష్పాపచయప్రమోదభరితాత్మకుఁ డై చిరమె న్లతాంతముల్
గోపవధూకుచ స్తబకలోలనిశాతనఖాంకురంబులన్. 13

టీ. ఈపగిదిన్ = ఈరీతిగా, మురారి = మురద్వేషి శ్రీకృష్ణుడు, హృదయేశ్వరిన్ = ప్రాణేశ్వరిని, ఊఱడన్ = ఆశ్వాసమునందునట్లుగా, పల్కి = ఆడి, నిర్జరేంద్రోపవనస్థలంబునన్ = దేవేంద్రుని యారామప్రదేశమున, పయోరుహనేత్రలన్ = పద్మనేత్రలైన దేవతాస్త్రీలును, తానున్, చేరి=గుమికూడి, పుష్పావచయ.....త్సుకుఁడై-పుష్పావచయ = పూవులను గోయుటయందైన, ప్రమోద = సంతోషముచే, భరిత = పూర్ణమైన; నిండిన యనుట, ఔత్సుకుఁడై=మనస్సుగలవాఁడై, గోప.....అంకురంబులన్-గోపవధూ = గోపికాస్త్రీలయొక్క, కుచస్థబక = పూగుత్తులం బోలు స్తనములందు, లోల=ఆసక్తములైన, నిశాత=తీక్ష్ణములైన; వాడి యైన యనుట. నఖ=గోళులయొక్క, అంకురంబులన్ =కొనలచేత, లతాంతములన్ = పూవులను, చిదిపెన్ =గిల్లెను.

విశే. గోళులను గోపవధూకుచస్థబకలోలము లనుటకు సారస్యము చింత్యము. శృంగారాతిశయసూచకము. లతాంతము=లతయొక్క తుది నుండునది. పూవే తుది నుండునది గాన దాని కీపేరు గల్గెను.

మ. ఎలదేఁటు ల్దమవాలుఁగన్నవలపై నిందీవరభ్రాంతిచే
మెలఁగం జేవలఁ గప్పుకోనలవి గామిం *జీఁదఱిం జెంది యి
చ్చలఁ గాంక్షించిరి నిర్నిమేషజలజాస్యల్ మానుషత్వంబు న
య్యలిభీతి స్తుకుళీకృతాక్షి యగుసత్యాకాంత నీక్షించుచున్. 14

టీ. నిర్నిమేషజలజాస్యల్ = అనిమిషస్త్రీలు; దేవతాస్త్రీ లనుట. ఎలదేఁటుల్ = లేఁబ్రాయంపుఁదుమ్మెదలు, తమవాలుఁగన్నవలపైన్ = తమదీర్ఘము లగు కన్గ్రోయిలమీఁద, ఇందీవరభ్రాంతిచేన్ = నల్లకలువపూవులను భ్రమచేత, మెలఁగన్ = సంచరింపఁగా, చేరలన్ = చాఁచినతమచేతులచేత, కప్పుకోన్ = కప్పుకొనుటకు, అలవి = శక్యము కామిన్ = కాకుండుటచే, చీఁదఱిన్ = చికాకును, చెంది=పొంది, ఇచ్చలన్ =మనస్సులందు, అయ్యలిభీతిన్ = ఆతుమ్మెదలవలనిభయముచే, ముకుళీకృతాక్షి=మూసికొనఁబడిన కన్నులుగలది, అగు = అగునట్టి, సత్యాకాంతన్ = సత్యభామను, ఈక్షించుచున్ = చూచుచు, మానుషత్వంబున్ = మనుష్యధర్మమును, కాంక్షించిరి=కోరిరి.

భా. అట్లు పుష్పావచయ మొనర్చు ననిమిషాంగనల నేత్రములను గాంచి తుమ్మెదకొదమలు నల్లకలువపూవు లనుభ్రమం జెంది యందు వ్రాలం జొచ్చె ననియు, నవ్వానిబాధ వారించికొనఁ జేరలకు మాఱి తమ నేత్రము లుండుట చేతఁ జేరలచేఁ గప్పికొన వశముగామిఁ జేసియుఁ గనులు మూఁతవడనివా రగుటఁ జేసియుఁ, నాసురాంగన లసమర్థ

---

* లజ్జలం.

లై రనియు, నట్టిభ్రమరబాధమ సత్యాకాంత యపుడు కనులుమూసి వారించికొనుటం గాంచి మనుష్యులకువలెనే తమకును గనులు మూఁతవడుట సంభవించిన బాగుండును గదా యని తలంచి రనియు భావము.

విశే. ఇట్లు చెప్పుటకతనఁ గనులు నల్లకల్వలవలెఁ జేరలకు మించియున్న వని విశద మయ్యెను. ఇం దనిమిషకాంతలు మానుషత్వమును గాంక్షించిరి గాని పొందఁ జాలక పోయిరనుట తెల్లము. ఇప్పట్టును మనుచరిత్రకర్త యనిమిషాంగనకు మానుషత్వ మును మనుష్యభావనచే సంఘటించి సంస్కరించె నని తోఁచెడిని.

ఉ. అంబరచారిపంకజదళాక్షులు చంపకపుష్పరేణుజా
లంబులయందు సర్వశుభలక్షణరేఖలఁ బొల్చునట్టి పీ
తాంబరుపాదపంకజము లంటినతావులు ద్రొక్క నోడి పా
ర్శ్వంబుల సంచరింతురు పరస్పరకేళివచఃప్రసంగతిన్. 15

టీ. అంబరచారిపంకజదళాక్షులు = ఆకాశమున సంచరించెడి సురాంగనలు, దేవతలకు భువిపైఁ బాదములు మోపకుండుట సహజము. దాన దేవత లంబరచారు లనుట. చంపకపుష్పరేణుజాలంబులయందున్ = సంపెఁగ పుష్పాడులందు, సర్వశుభ లక్షణరేఖలన్ = ఎల్లశుభచిహ్నముల యాకృతులతోడను, పొల్చునట్టి = ఒప్పునట్టి, పీతాంబరుపాదపంకజములు = శ్రీకృష్ణుని యడుగుఁదమ్ములు, అంటిన = లగ్నమైన, తావులు=స్థలములు, త్రొక్కన్ = మట్టుటకు, ఓడి=జంకి, పరస్పరకేళివచఃప్రసంగతిన్ = అన్యోన్యవినోదాలాపప్రసక్తితో, పార్శ్వంబులన్ = కెలఁకులందు, సంచరింతురు = తిరుగుదురు.

వృషభగతిరగడ.—

కొమ్మ! వేగిర మేటికే కొనగోర గోరఁటవిరులు గిల్లుము
తమ్మిపువ్వులమోఁద జలములదార తారక యుండఁ జల్లుము
మృగవిలోచన! మేను చుఱుకన మేలమే లత నిటులు వ్రేయఁగ
వగవ నేటికిఁ జూడుమీ గొరువంకవంకఁ బ్రియుండు డాయఁగ
నలుగ నేటికి ముడుపుమీ చెలువార వారణయాన! మొల్లలు
పొలఁతి! సైఁపవు మాకు నీకయ పోలుఁబో లులివడినకల్లలు
పన్నిదం బిడఁ బ్రేంకనమునన్ బొడి పాడి దొఱంగి తెచ్చితిఁ
బొన్న మొగ్గలఁ గంటసరి పూఁబోఁడి పోఁడిమిగాఁగ గ్రుచ్చితి
వడుగనేటికి దీనివిరులు దురాశ రా శఫరీవిలోచన!

జడఁ బరాగము నిండెఁ దుమ్మెద రసాలసాలమరందసేచనఁ
జామరో! సురపొన్నలకు నీచాయఁ జాయలఁ బల్క నేటికి
భామ! కోయకు వేగపడి పూఁబాళ బాళము గాదు నేఁటికి
మగువ! పలుమఱు దిగిచి చూచుట మానుమా నులివడియె దండలు
మగిడి చనుఁ డిఁక నేల యీయెలమావి మావి హరించుదండలు
పలుకకుము తుచ్ఛములు పలుమఱు బొల బొలకి యన్నఁ దిట్టితి
వలసగమనముఁ జూపి చెలి! నీ వంచ వంచన నేసి వట్టితి
తావి బుగులుగొనంగఁ దొడఁగె ఘృతాచి తాఁచితె యీయశోకము
రావె తేనియ కంచుఁ బలికెదు రంభ! రంభలలో ననేకము
ననలు వేఁడిన మొఱఁగి తప్పుదు నాలి నాలికుచంబు ముట్టకు
మెనయు ప్రాణపదంబుగాఁ దలఁ తీవ తీవ తలంగ మెట్టకు
మంజుఘోష! సువర్ణలత లనుమానమా నందనవనంబున
నంజ దిది యెలదేఁటి కన నే మఱచె మఱచెద మే మనంబున
నమృతమధురములై నఫలరసమాని మానిని! త్రుళ్లె శుకములు
గుముదులగు లేమావిచిగురులు గోయఁ గోయని కూసెఁ బికములు
గుమగుమని వాసనల గేదఁగికొమ్మ కొమ్మకు నందె దోఁటికి
రమణి! గొజ్జఁగిపూదలు గడు దూరమ్ము రమ్ము చలమ్ము లేటికి. 16

టీ. ఇందు సరసాలాపములు మాఱు యువతులు పుష్పావచయ మొనర్చుట వర్ణితము:

కొమ్మ=జీవనిత, వేగిరము=త్వర, ఏటికే=ఎందులకే? కొనగోరఁ = గోటికొనచే, గోరఁట విరులు=గోరంటపూవులు, గిల్లుము=కోయుము. తమ్మిపువ్వులమోఁదఁ = పద్మములపైని, జలములదార=నీళ్లధార, తారక ఉండఁ = చేరకుండునట్లుగా, చల్లుము. నీరు కర్మ. మృగవిలోచన = లేడికన్నులంబోలు కన్నులుగలదాన! మేను=శరీరము, చుఱుకనఁ = నొచ్చునట్లుగా, లతఁ =తీవను, ఇటులు = ఈరీతిగ, ప్రేయఁగఁ =కొట్టఁగా, మేలమే= పరిహాసమా! వగవఁ = విచారింపఁగా, ఏటికిఁ = ఎందులకు? గోరువంకవంకఁ = గోరువంకపక్షివైపు, చూడుమీ! ప్రియుండు = మనోహరుఁడు, డాయఁగఁ =సమీపింపఁగా, అలుగఁ =కోపింపఁగా, ఏటికిఁ, వారణయాన = గజగమనా! చెలువారఁ = అందమగునట్లుగా, మొల్లలు = మొల్లపూవులు, ముడువుమీ=కొప్పునఁ దుఱుమవమ్మా! పొలఁతి=జీవనిత, మాకుఁ, సైఁపవు = ఇష్టపడవు. నీకయ=నీకే, లులివడినకల్లలు=నీచములైన యసత్యపుమాటలు, పోలుఁబో = సరిపడునుజుమ్ము. పన్నిదంబు = పందెము,

ఇడక్ = పెట్టఁగా, పాడి = న్యాయమును, తొఱంగి = వీడి, పాడి = గానముచేసి, ప్రేంకనమునక్ = ప్రియాళిపుష్పమును, తెచ్చితిక్, పొన్న మొగ్గలక్ = పొన్న మొగ్గలతో, కంటసరిక్ = కంఠాభరణరూపమగుహారమును, పూఁబోఁడి = పుష్పమువలె మనోజ్ఞమైనదాన, పోఁడిమిగాఁగక్ = ఒప్పిదమునగునట్లుగా, గ్రుచ్చితివి = కూర్చితివి. శఫరీవిలోచన = మీననేత్ర! దీనివిరులు = దీనిపూవులు, దురాశక్ = త్వగనియాసతో, అడుగక ఏటికిక్? రా=రమ్ము. జడక్ = జడయందు, పరాగము=పుప్పొడి, నిండెక్ = పూర్ణమయ్యెను. రసాలసాలమరంద సేచనక్ = తీయమామిడి పూఁదేనియచే, తుడువుము = పోఁగొట్టుము. చామరో = ఇంతిరో, సురపొన్నలకుక్ = పొన్నపూవులకై, ఈచాయక్ = ఈరీతిగా, చాయలక్ = వేఱువేఱుమార్గములతో, పల్కక్, ఏటికిక్? భామ=వనితా, వేగపడి, త్వరపడి, పూఁబాళిక్ = పూఁగుత్తిని, కోయకు = కోయకుము. నేఁటికిక్ = ఈరోజునకు, పాళము = పరిపక్వమైనది, కాదు. మగువ = కాంతా, పలుమఱుక్ = మాటిమాటికి; తిగిచి=తీసి, చూచుట, మానుమా = విడువుమా, దండలు = పుష్పమాలలు, నులివడియెక్ = చిక్కఁబడెను. మగిడి = మరలి, చనుఁడు = పొండు. ఇఁక నేల=ఇంక నెందులకు? ఈయెలమావి= ఈలేమామిడిచెట్టు, మా విహరించు దండలు= మేము విహరించుటకుఁ దావులు. పలుమఱుక్ =మాటిమాటికి,తుచ్ఛములు=నీచపుమాటలు, పలుకకు=ఆడకుము. బాల! బాలకి=బాలకి యని, అన్నక్, తిట్టితి = దుర్భాషలాడితివి. అలసగమనమున్ =మందగమనమును, చూపి=అగపఱచి, చెలి! నీవు, అంచక్ =హాసను, వంచన చేసి=వంచించి, పట్టితి=పట్టుకొంటివి. తావి=పరిమళము, బుగులుకొనంగక్ = దట్టముగ వ్యాపించునట్లు, తొడంగెక్ =పూనెను. ఘృతాచి! ఈయశోకమున్ =ఈయశోక వృక్షమును, తాచితె=తన్నితివే? తేనియకుక్ =మరందమునకై, రావే=రమ్ము, అంచుక్, పలికెదు = పలికెదవు. రంభ! రంభలలోక్ = అరటులలో, అనేకము = విస్తారము. ననలు=పూవులు, వేడినక్ =కోరఁగా, నాలిక్ =కపటముతో, అప్పుడు, మొఱఁగితి = దాఁగితివి. నా లికుచంబుక్ =నా నిమ్మను,ముట్టకుము=అంటకుము.ఎనయుక్, ప్రాణపదంబుగాక్ =ప్రాణతుల్యముగ, ఈవ=నీవే, తలఁతు=తలంతువు, తీవ=తీఁగను, తలంగక్ =తొలఁగునట్లు, మెట్టకు=త్రొక్కకుము. మంజుఘోష!, నందనవనంబునక్ =నందనోద్యానమున, సువర్ణలతలు=బంగారుతీవలు, అనుమానమా=సందేహమా? అనుమానపదమునకు సంస్కృతమున నూహా యర్థము. తెలుగున సందేహ మను నర్థమునఁగూడ నిది ప్రయుక్తమయ్యె. "అనుమానము లేక తిరిగె నతఁ డెల్లెడలక్" అని తిక్కన. చూ.ఉద్యో. ప. ఇది, ఎల దేఁటికిక్ =లేఁదేఁటికి, అంజదు=భయపడదు, అనక్ =అనఁగా, ఏమి, అఱచెక్ = శబ్దించెనో, మనంబునక్ =మదియందు, మఱచెదమే=విస్మరింతుమే. మానిని=మానవతీ!, శుక

ములు=చిలుకలు, అమృతమధురమునైన=సుధవలెఁ దీయనైన, ఫలరసము=పండ్లరసమును, ఆని=త్రావి, త్రుళ్ళెక్=గంతులిడెను. గుమురులగు=జొంపములగు, లేమావిచిగురులు=లేఁత మామిడిచిగుళ్లను, కోయక్=త్రుంపఁగా, పికములు=కోయిలలు, కో యని, కూసెక్ = అఱచెను. గేదఁగికొమ్మ=మొగిలిచెట్టుశాఖ, గుమగుమనివాసనలక్=కమ్మనిపరిమళములతో, కొమ్మకు=(ఆ) స్త్రీకి, దోఁటికిక్=అందనివానింగోయ నుపకరించుకొంకికట్టికు, అందెక్. దోసెగట్టి యని వ్యవహారము. రమణి=కాంతా; గొజ్జఁగిపొదలు=గులాబీపొదలు, కడు దూరమ్ము=మిగులదూరము, చలమ్ములు=పంతములు, ఏటికిక్, రమ్ము.

విశే. ఇందు రమణుల యూలాపములు నైజముగ వర్ణితములు. వ్యవహారమునఁ బరస్పరము సంబంధశూన్యముగఁ బల్కురీతి యిందుఁ జెల్లముచేయఁబడినది. దీనిని వృషభగతిరగడ యందురు. దీనిప్రతిపాదమునకును 28 లఘువు లుండును. 15-వలఘువు యతిస్థానము. రెండురెండేసిపాదముల కంత్యప్రాసమును, రెండేసియక్షరములకు ఛేకానుప్రాసమును గవులప్రయోగముల నగపడెడిని. రెండేసిపాదములకుఁ బ్రాసైక్యము వృత్తములలోవలెనే యిం దుండవలెను. అలం. స్వభావోక్తి.

మ. అనుచుం గాంతలు వల్లికారచితడోలాందోళనప్రక్రియం
గనకాంభోరుహకర్ణికాహృతిఁ బరాగక్షేపలీలాగతిక్
వనకేళీపరతంత్రవృత్తిఁ దిరుగన్మార్తాండబింబంబు ని
ల్చెనభోమధ్యమునం గఠోరకిరణశ్రేణీదురాలోకమై. 17

టీ. అనుచుక్=ఇట్లు మాటలాడుకొనుచు, కాంతలు=స్త్రీలు, వల్లికా.....ప్రక్రియక్ - వల్లికా=తీఁగలచే, రచిత=కూర్పఁబడిన, డోలా=ఉయ్యాలలయందు, ఆందోళన=డోఁగుటయొక్క, ప్రక్రియక్=వ్యాపారము చేతను, కనకాంభోరుహ..... హృతిక్ - కనకాంభోరుహ=బంగరుపద్మముల సంబంధమైన, కర్ణికా=మిద్దెలయొక్క, ఆహృతిక్=ఆకర్షణము చేతను, 'కందుకాహృతిక్' అని పాఠము కొన్నిప్రతులలోఁ జూడనయ్యెఁ. ఆపక్షమున, "కనకాంభోరుహకందుక=బంగరుపద్మనిర్మితమైన బంతులయొక్క, ఆహృతిక్=దెబ్బచే" అని యర్థము. బంగరుతమ్ములనిర్మితములైన బంతుల నాడుటచేనైన దెబ్బచే నని భావము. పరాగ.....గతిక్ -పరాగ=పుప్పొడియొక్క, క్షేప=చిమ్ముటయొక్క, లీలా=విలాసముయొక్క, గతిక్=రీతిచేతను; పుప్పొడిని బరస్పరము మోఁదఁ జల్లికొనుటచే నని భావము. వన.....వృత్తిక్ -వన=ఉద్యానవనమునందైన, కేళీ=ఆటలయందు, పరతంత్ర=ఆసక్తమైన, వృత్తిక్=వ్యాపారముతో, తిరుగక్ = సంచరింపఁగా, మార్తాండబింబంబు = సూర్యబింబము, కఠోర...దురాలోకమై-కఠోర = తీక్ష్ణములైన,

1. కందుకాహతిఁ. 2. నరుగక్.

కిరణ=రశ్ములయొక్క, శ్రేణీ=పంక్తిచేత, దురాలోక మై=చూడశక్యముగానిదై, నభో మధ్యమునన్ = ఆకాశమునడుమను, నిల్చెన్ =ఉండెను! మట్టమధ్యాహ్న మయ్యె నని భావము.

భా. ఆదేవకాంత లట్లు ప్రసంగించికొనుచుఁ దీవయుయ్యెల లూఁగుచు, మిన్నేటి బంగరుఁదమ్ముల గద్దెల నాహరించుచుఁ, బుప్పొడుల నొండొరులపైఁ జల్లికొనుచు వన విహారమునందె యేకాగ్రచిత్తలై విహరించుచుండ,సూర్యుఁడు గగనమధ్యదేశము నందె నని భావము.

చ. వదలిననీవిబంధముల వాడినమోముల జాఱుకొప్పులం
జెదరినపత్రభంగములఁ జిక్కులుగొన్న మణీసరంబులం
బొదలినయూర్పుఁదెమ్మెరలఁ బుప్పొడిఁ గెంపగు వాలుగన్నులం
ద్రిదశమృగాయతాక్షులు రతిశ్రమఖిన్నలఁ బోలి రందఱున్. 18

టీ. వదలిన నీవిబంధములన్ =జాఱినబట్టకట్టుముడుల చేతను, వాడిన మోములన్ = మ్లానములైన ముఖముల చేతను, జాఱుకొప్పులన్ = వీడినకేశబంధముల చేతను, చెదరిన పత్రభంగములన్ =చెదరిపోయిన మకరికా పత్రరచనల చేతను, చిక్కులుగొన్నమణీ సరంబులన్ =చిక్కువడినమణిహారముల చేతను, పొదలినయూర్పుఁదెమ్మెరలన్ = ఒప్పిన నిట్టూర్పుగాడ్పుల చేతను, పుప్పొడిన్ =పుష్పపరాగము చే, కెంపగు = ఎఱ్ఱనైన, వాలుఁగన్నులన్ =దీర్ఘములైన నేత్రముల చేతను, త్రిదశమృగాయతాక్షులు = దేవతాస్త్రీలు, అందఱున్ =ఎల్లరును, రతిశ్రమఖిన్నలన్ =సంభోగమువలని యాయాసము చేఁ గుందిన వనితలను, పోలిరి=అనుకరించిరి.

విశే. పోఁకముడులు వీడుట, మోము వాడుట, మకరికాపత్రములు చెదరుట, మణిహారములు చిక్కువడుట, నిట్టూర్పులు నిగుడుట; జాగరణముకతనఁ గన్ను లెఱ్ఱ వడుట యనుసీధర్మములు రతిశ్రమవలన సంభవించిన వగుటఁ జేసియు, ప్రకృతము దేవకాంతలయం దీలక్షణములు చూపట్టుచుండుటఁ జేసియు,సురకాంతలు రతిశ్రమఖిన్న లను బోలి రని గవి యూహించినాఁడు. మణిశబ్ద మీకారాంతముగను సంస్కృతమునఁ గలదుగాన మణీసరంబు లని కవి ప్రయోగించెను. రతిశ్రమఖిన్నలనుగా దేవకాంతలను భావించుటకుఁ బై నున్న తృతీయాంతము లెల్లను హేతువు లగుచున్నవి.

క. బెడిద మగు నెండసోఁకునఁ
దొడిమలు వసివాడి ననలు దొరఁగె లతల నె

లైడ వనదేవత మేనం
బొడమిన లేఁగమ్మచెమటబొట్టు లనంగన్. 19

టీ. బెడిద మగు=తీక్ష్ణ మగు, భయంకరమైన యని భావము. ఎండసోఁకునన్ = ఎండతాఁకుచే, తొడిమలు=మూడికలు; వృంతము లని యర్థము. వసివాడి = మిక్కిలి వాడి, ననలు=పూవులు, లతలన్ =లతలనుండి, ఎల్లెడన్ =అన్ని చోటులందును, వనదేవత మేనన్ = వనదేవతాశరీరమున, పొడమిన = పుట్టిన, లేఁగమ్మచెమటబొట్టులు = పరిమళించు చిఱుచెమ్మటబిందువులు, అనంగన్ = అనునట్లు, తొరఁగెన్ = జాఱెను.

భా. కఠోరాతపాహతిని వృంతములు వసివాడుటకతన లతలనుండి జాఱుపూవులు వనదేవతగాత్రమునుండి జాఱు పరిమళించు చిఱుచెమటబొట్టులవలె నొప్పియుండె నని భావము.

విశే. కవి వనస్థలిని వనదేవతగను జాఱుగంధసుమములను వాసిత మగు స్వేదబిందువులుగాను భావించె నని గ్రహించునది.

శా. తూఁగెం జల్లనిగాడ్పు లేమి ఫణిసందోహంబు వేరాఁకటన్
లోఁగెం దప్తసరోజశీధురసముల్ గ్రోలన్మదాళిచ్ఛటల్
గ్రాఁగెన్*నీరుగఁ గాంచనాచలతటీగండోపల వ్రాతముల్
డాఁగెన్ వల్వలపంకసీమ బకజాలత్రస్తపాతీనముల్. 20

టీ. ఫణిసందోహంబు=పాములగుంపు, చల్లనిగాడ్పు=చల్లనిగాలి, లేమిన్ = లేక పోవుటచే, వేరాఁకటన్ =మిక్కిలియాఁకలితో, తూఁగెన్ =ఒఱఁగెను, మదాళిచ్ఛటల్ = మత్తిలినతుమ్మెదలగుంపులు, తప్తసరోజశీధురసముల్ = క్రాఁగిన తమ్ములమరందములను, గ్రోలన్ =త్రాగుటకు, లోఁగెన్ = భయపడెను. కాంచనా.....వ్రాతముల్ - కాంచనాచల= మేరుపర్వతమయొక్క, తటీ=ప్రదేశములందైన, గండోపలవ్రాతముల్ =గండశిలలగుములు, నీరుగన్ =ద్రవమగునట్లు, క్రాఁగెన్ =సంతప్తములయ్యెను. 'నీఱుగన్' అను పాఠ మిచటఁ గననగు. కాంచనాచలశిలలు భస్మమయ్యె ననుటకంటె నీరయ్యె ననుటయే సరసముగాన నీభస్మమయ్యె నను నర్థమిచ్చుపాఠము సరసముగా దని చెప్పనగును. బక జాలత్రస్తపాతీనముల్ =కొంగలవలన భయమందిన చేపలు, పల్వలపంకసీమన్ =పడియలందలి బురదలందు, డాఁగెన్ =దాఁగెను.

భా. కఠోరకిరణుని మట్టమధ్యాహ్నసమయమునందైన తీక్ష్ణాతపస్పర్శమున గాలి తప్తమయ్యె ననియు, నట్టివేఁడిగాలి హాస్యాదింపఁజాలక వాయుభుక్కులు సర్పములు

* నీఱుగఁ.

తుద్బాధను గుందుచుండె ననియు, మదాళులు తమ్ములమరందము సంతప్త మగుటఁ గ్రోలంజాలక భయమందుచుండె ననియు, మేరుశిలలు తప్తము లై ద్రవీభవించుచుండె ననియు, కొంగలు తమ్ముఁ జంప నొడ్డునఁ గనుపెట్టికొనియుండుటం జేసియు (నీరు సల సల మని తెఱలుచుండుటం జేసియు) నీటిలోఁ దిరుగఁజాలక పడియలందలి బురదలందుఁ జేఁపలు దాఁగుచుండె ననియు భావము. అలం. స్వభావోక్తి.

చ. కనుఁగవ మ్రాన్పడంగ నెఱుక ల్వారియంబడ బోర మోవ నెం
డినవదనంబులం దెఱచి నిక్కినయట్టులు దల్లడించుటల్
గనఁబడ నూరుపు ల్దళముగా నిగుడ న్వడఁ[1]గంది యీరెలుం
గునఁ దమవానిఁ బిల్చుచు శకుంతము లయ్యెడ నిల్చె మ్రాఁకులన్.

టీ. శకుంతములు=పక్షులు, కనుఁగవ=నేత్రద్వంద్వము, మ్రాన్పడంగన్=నిశ్చేష్టత నందఁగా, ఎఱుకలు=ఱొక్కలు, విరియన్ పడన్=విడినట్లుపడిపోఁగా, బోర=పక్షిస్థలము, మోవన్=అంటఁగా, (చెట్టుకొమ్మ కనుట) ఎండినవదనంబులన్=(దప్పిచే)శుష్కించిన నోళులను, తెఱచి = విప్పి, నిక్కినయట్టులు=మోది కెగసిన కంఠములు, తల్లడించుటల్=పరితపించుటలు, కనఁబడన్=వెల్లడికాఁగా, ఊరుపుల్=నిట్టూరుపులు, దళముగాన్=సాంద్రముగా, నిగుడన్=ప్రసరింపఁగా, వడన్ = ఎండవేఁడిమిచే, కందిన=వివర్ణమై, ఈరెలుంగునన్=సన్ననికంఠధ్వనితో, తమవానిన్=సజాతిపక్షులను, పిల్చుచున్, అయ్యెడన్=ఆమట్టమధ్యాహ్నకాలమున, మ్రాఁకులన్=చెట్టులందు, నిల్చెన్=నిల్చియుండెను. అలం. స్వభావోక్తి.

చ. ఒకయెడఁ జక్రవాకము పయోరుహమిత్రునివేఁడియెండచే
దెకతెకఁ గ్రాఁగు తమ్మివిరితేనియ ఱొక్కలఁ జల్లనార్చి కాం
తకుఁ దనుపార నిచ్చెఁ బరితాపము వాయ మృణాళవల్లరీ
శకలము మాటికిం గమిచి చంచుపుటంబున[3]నందనిచ్చుచున్. 22

టీ. ఒకయెడన్=ఒకచోటున, చక్రవాకము = పురుషరథాంగము, పయోరుహమిత్రుని వేఁడియెండచేన్ = అంభోజబంధువగు సూర్యునివేఁడియైన యెండచేత, తెకతెకన్ = సలసల మని, క్రాఁగు = మరుగునట్టి, తమ్మివిరితేనియన్ = పద్మమకరందమును, ఱొక్కలన్=ఱొక్కలచే, చల్లన్=చల్లనగునట్లుగా, ఆర్చి = ఆరఁజేసి: చల్లార్చి యనుట. కాంతకున్=ప్రియురాలికి, తనుపారన్=తృప్తియగునట్లుగా, పరితాపము = సంతాపము, పాయన్ = పోవుటకై, మృణాళవల్లరీశకలమున్ = తామరతూఁటి తీవయొక్కముక్కను, చంచుపుటంబునన్=ముక్కుకొనచే, కమిచి=ఆకర్షించి, మాటికిన్=వేమఱు, అందన్ ఇచ్చుచున్ = అందించుచు, ఇచ్చెన్ = ఒసఁగెను; పద్మమరందము ననుట.

---

1. గుంది. 2. దనివార. 3. నందియిచ్చుచున్.

విశే. పురుషవిహంగ మిందనుకూలనాయకుఁడుగను, స్త్రీవిహంగము స్వాధీనపతికగను వర్ణితులైరి. కాని యీయనురాగము తిర్యగ్గత మగుటకతన దీని నాలంకారికులు రసాభాసముగఁ బరిగణించిరి. శ్లో. "ఏకత్రైవానురాగశ్చేత్ తిర్యఙ్ మ్లేచ్ఛగతోఽపి వా, యోషితో బహుసక్తిశ్చేద్రసాభాసస్త్రిధా మతః" అని ప్రతాపరుద్రీయము. అలం. స్వభావోక్తి.

తే. ఆతపగ్లానిఁ బడలినయభ్రమువును
నిజకరాగ్రజలంబుల నెఱయఁ జల్లి
శ్రవణయుగతాలవృంతసంజాతశీత
వాతములఁ దేర్చె గీర్వాణవారణంబు. 23

టీ. గీర్వాణవారణంబు=సురహస్తియగు నైరావతము, ఆతపగ్లానిన్=ఎండవలని యాయాసముచే, బడలిన = ఆయాసపడిన, అభ్రమువును = "అభ్రము" అనుతన భార్యను, నిజకరాగ్రజలంబులన్ = తనతొండము కొనయందలినీటిని, నెఱియన్ = పూర్ణముగా; అంతట ననుట. చల్లి, శ్రవణ...పోత్రములన్-శ్రవణయుగ = రెండుచెవులనెడు, తాలవృంత = విసనకఱ్ఱలవలన, సంజాత=పుట్టిన, శీతవాతములన్ =చల్లనిగాలుల చేత, తేర్చె = పోయిన యాయాసముగలదానినిగాఁ జేసెను.

విశే. ఇందును దివ్యగ్గతశృంగారమే వర్ణితముగాన నిదియు రసాభాసమే యగును. అలం. స్వభావోక్తి.

క. అపుడు జగత్పతి సత్యా
చపలాక్షియుఁ దాను వెడలె జలకేలికి న
య్యపవనతరుకుసుమలతా
తపత్రములు పూని వేల్పుఁదరుణులు గొల్వన్. 24

టీ. అపుడు=ఆసమయమున, జగత్పతి = లోకనాథుఁడు శ్రీకృష్ణుఁడు, సత్యాచపలాక్షియున్ = సత్యభామయును, తానున్, అయ్యపవనతరుకుసుమలతాత్రపత్రములు = ఆయుద్యానమందలి చెట్టులంపైన పుష్పలత లనుగొడుగులను, పూని = పట్టి, వేల్పుఁదరుణులు = దేవతాస్త్రీలు, గొల్వన్ = సేవింపఁగా, జలకేళికిన్ = జలక్రీడకు, వెడలన్ = బయలుదేరెను.

వా-విశే. ఇందుఁ దాను శబ్దము ప్రయుక్తమయ్యెఁ గానఁ గ్రియయేకవచనముగానే ప్రయుక్తమయ్యెను.

చ. చనుఁగవప్రేఁకము నృఘనచక్రభరంబును మోవలేక యొ
య్యనఁ బదపంకజంబు లలసాలసవైఖరి మోపుచుఁ జనా

ర్దనుభుజ మూఁతకాఁగ వనితామణి యేఁగె బరస్పరాంగమే
ళనమున రోమహర్షపుకుళవ్రజ మొండొరుమేన నిండఁగన్. 25

టీ. వనితామణి = కాంతారత్న మగు సత్యభామ, చనుఁగవవ్రేఁకముక్ = స్తన ద్వంద్వపుభారమును, జఘనచక్రభరంబును = చక్రాకార మగు కటియొక్కభారమును, మోవక్ = మోయుటకు, లేక = శక్తురాలు గాక, ఒయ్యనక్ = మెల్లమెల్లఁగా, పదపంకజంబులు = పాదపద్మములు, అలసాలసవైఖరిక్ = మందమంద మగురీతితో, మోపుచుక్ = భువియం దుంచుచు, జనార్దనభుజము = శ్రీకృష్ణునిభుజము, ఊఁత = అవలంబము, కాఁగక, పరస్పరాంగమేళనమునక్ = ఒండొరుల శరీరములకలయికచే, ఒండొరుమేనక్ = ఒండొరులశరీరములందు, రోమహర్షమాకుళవ్రజము = మొగ్గలం బోలు గగుర్పాటుగుములు, నిండఁగక్ = పూర్ణముగాఁగ, ఏఁగెక్ = వెడలెను.

విశే. ఇందు సత్యా సౌకుమార్యము తీవి యంగసౌష్ఠవము సూచితములు.

చ. ఇనకరతాపవేదన సహింపఁగలేక నిజోదకంబులక్
మునిఁగి వినీలకుంతలసమూహము నారఁగ విచ్చె నాఁగ వీ
చినికరచాలనం దరులఁ జేరిన జొంపపునాఁచుఁదీఁగలం
దనరు నభోనదిం గనియె దానవలోకవిరోధి యత్తటిన్. 26

టీ. ఇనకరతాపవేదనక్ = సూర్యునికిరణములచేనైన సంతాపమువలని దుఃఖమును, సహింపఁగక్ = ఓర్చుటకు, లేక=చాలక, నిజోదకంబులక్ =తననీళ్లను; మునిఁగి, వినీలకుంతల సమూహముక్ =మిగులనల్లనైన తన తలవెండ్రుకల గుంపును, ఆరఁగక్ = ఎండుటకు, విచ్చెక్ = విప్పెను, నాఁగక్ = అనునట్లుగా, వీచినికరచాలనక్ =తరంగ సమూహముల చలనముచే, దరులక్ = ఒడ్డులను, చేరిన = పొందిన, జొంపపు నాఁచుఁదీఁగలక్ =గుబురగు నాఁచుఁదీఁగెలచే, తనరు = ఒప్పునట్టి, నభోనదిక్ = మిన్నేటిని, అత్తటిక్ = ఆసమయమున, దానవలోకవిరోధి = రాక్షసుల గుంపునకు శత్రువైన శ్రీకృష్ణుఁడు, కనియెక్ = చూచెను.

భా. అలలచలనముచే నొడ్డులందుఁ జేరిన నాఁచుజొంపములు తీక్ష్ణాతపబాధకుఁ దాళఁజాలక తననీఁటఁ దానమాడి మిన్నేరు తడియార విప్పిన కొప్పేమో యన నొప్పెనని భావము. అలం. ఉత్ప్రేక్ష.

తే. కాంచి చేరంగఁ జని మధుకైటభారి
రత్నసోపానకలితమార్గములు డిగ్గి

కులసతియుఁ దాను వేలుపుఁగొలను దటిసె
నొండొరులకేలుఁదమ్ముల నూఁతఁ గొనుచు. 27

టీ. కాంచి = చూచి, మధుకైటభారి = మధుకైటభశత్రువగు శ్రీకృష్ణుఁడు, చేరఁగన్ = దగ్గఱగా, చని=పోఁగి, రత్నసోపానకలితమార్గములన్ = రత్ననిర్మితములైన మెట్లయొక్క శ్రోవలనుండి, డిగ్గి = దిగి, కులసతియున్ =భార్యయగు సత్యభామయు, తానున్, ఒండొరుల కేలుఁదమ్ములన్ = ఒకరిహస్తపద్మము నొకరు, డోఁతన్ =అవలంబముగా, కొనుచున్ =స్వీకరించుచు, వేలుపుంగొలనున్ =దేవసరస్సును; మందాకిని ననుట. తటిసెన్ =సమీపించెను.

విశే. ఇందు "తటిసిరి" అని పాఠ మగపడెడి ఇందుఁ దాను శబ్దము ప్రయుక్త మగుటఁజేసి "తటిసె" అని క్రియ యేకవచనముగానే యుండవలయును. కాన "తటిసిరి" అనుపాఠము ప్రామాదిక మనంజనును. వియద్గంగ నదియైనను దానిం గొలనుగాఁ గవి పేర్కొనియున్నాఁడు. ఇట్లే కవులు దేవతలు జలక్రీడ సేయునదియాటం గావలయు దానిని 'దేవదీర్ఘిక, దేవసరస్సు' అని వ్యవహరించుట సంప్రదాయమైనది.

చ. తొడవులు పుచ్చి నిర్జరవధూటులు వేలుపుమ్రాని *చీనిపా
వడలు ధరించి దేహరుచివైభవము ల్నవమల్లికారుచిం
దొడర నితంబచక్రములతో నెఱివాలు మెఱుంగుఁగప్పుబె
న్నడ లొరయంగఁ దద్గగనశైవలినిం దగఁ జొచ్చి రందఱున్. 23

టీ. నిర్జరవధూటులు = సురయువతులు, తొడవులు = ఆభరణములను, పుచ్చి = సడలించి, వేలుపుమ్రాని చీనిపావడలు = కల్పవృక్షసంబంధమైన సన్నసివలువలను, ధరించి=కట్టి, దేహరుచి వైభవముల్ = దేహకాంతి విభవము, నవమల్లికారుచిన్ = క్రొత్తమల్లీ సుమములయొక్క కాంతిని, తొడరన్ =ఎదిరింపఁగా, నెఱివాలుమెఱుంగుఁగప్పుపెన్నడలు-నెఱి = మనోహరమైన, వాలు=దీర్ఘములైన, మెఱుంగు = తళతళలాడు నట్టి, కప్పు=నల్లందనముగల, పెన్ జడలు = పెద్దజడలు, నితంబచక్రములతోన్ =గుండ్రనగు జఘనములతో, ఒరయంగన్ = రాపాడఁగా, అందఱున్ = ఎల్లరును, తద్గగనశైవలినిన్ =ఆమందాకినీనదిలో, తగన్ =ఒప్పునట్లుగా, చొచ్చిరి=ప్రవేశించిరి.

విశే. దేవకాంతలు తెల్లని దేహప్రభ గలవా రనియుఁ, గటిదేశమువఱకు ప్రేలాడు దీర్ఘమైన కొప్పుగలవా రనియుఁ దెలియనగును. పూర్వపద్యమునందువలెనే యిందును మిన్నేటిని 'శైవలిని' యని కవి వ్యవహరించినాఁడు. నదియందు నాచుం

---

* జీనిపావడలు.

డుట పద్మము లుండుట మొదలగునవి కానము. సరసుల నుండుట సహజము. కాని కావ్యములమాత్రము నదీవర్ణనమున నిట్టివిషయములు గాన నగును. కాన నిట్టివానిని గవిప్రౌఢోక్తిసిద్ధములుగా నెన్నవలయు నని తోఁచెడిని.

మ. మరుదంభోరుహనేత్ర లంబరధునీమధ్యంబున న్నిల్వ ని
ష్ఠురతత్పీనపయోధరాహతి జలస్తోమంబు నల్వంకలం
దెరల న్నాభిచయంబు లోఁగొనియె దానిం జూలగాంభీర్యశీ
లురు సంక్షోభము నొందువారి నెచటఁ లోఁగొంచు వర్తింపరే. 29

టీ. మరుదంభోరుహనేత్రములు = దేవతాస్త్రీలు, (అంభోరుహనేత్రలు = తమ్మిఱేకులం బోలు కనులు గలవారు) అంబరధునీమధ్యంబునన్ = మిన్నేటినడుమను, నిల్వన్ = ఉండఁగా, తత్పీనపయోధరాహతిన్ = వారి బలిసిన స్తనములదెబ్బ చే, జల స్తోమంబు=జలరాశి, నల్వంకలన్ =నాలుగుదిక్కులకు, తెరలన్ =మఱలఁగా, దానిన్ = ఆజలమును, నాభిచయంబు = బొడ్డులగుమి, లోఁగొనియెన్ =లోపలికిఁ జేర్చుకొనెను, ఐక్యపఱచుకొనె ననుట, చాలన్ =మిక్కిలి, గాంభీర్యశీలురు = గంభీరభావముగలవారు, (లోఁతుగల వని నాభిపర మగు నర్థాంతరము) సంక్షోభమున్ =కలఁతను, ఒందువారిన్ = పొందినవారిని, ఎచటన్ = ఎచ్చోటనైనను, లోఁగొంచున్ =క్రమలోఁ జేర్చుకొనుచు; అనఁగాఁ దమప్రాపు నొసంగి యనుట. లోపలికిఁ జేర్చుకొను చని నాభి పరార్థాంతరము. వర్తింపరే=మెలంగరా?

భా. లోకమున గంభీరభావులకుఁ గలఁతలొందినవారిని దమయాశ్రయ మొసంగి తమలోఁ జేర్చికొని రక్షించుట నైజము. కావుననే గంభీరభావముగల (లోఁతైన) సురస్త్రీలనాభులును స్తనహతిచేఁ జెదరి కలఁతనంది పాఱిన జలరాశిం దమలోఁ జేర్చికొని యరసిన వని భావము.

విశే. నాభి గాంభీర్యము వ్యంగ్యము. అలం. అర్థాంతరన్యాసము.

చ. ఘనకుచకుంభము ల్బయలుగా విబుధాలయవారభామినీ
జనకరిణీసమూహములు సల్లె యదూద్వహకుంజరంబుపై
వనజవనీపరాగపరివాసిత మైనసభ స్తరంగిణీ
ఘనతరభంగతోయకణికాచయము ల్గరపుష్కరంబులన్. 30

టీ. విబుధాలయ వారభామినీ జనకరిణీ సమూహములు=దేవవేశ్యా సమూహము లను నాఁడు నేనుంగుగుంపులు, ఘనకుచకుంభముల్ = గొప్పవైన స్తనము లనెడు కుంభ స్థలములు, బయలుగాన్ =ప్రకాశ మగునట్లుగా, యదూద్వహకుంజరంబుపైకిన్ =శ్రీకృష్ణుఁ

డను మగయేనుఁగుపై, వనజవనీపరాగ పరివాసిత మైన=పద్మసమూహముల సంబంధమైన పుప్పొడిచేఁ బూర్ణముగాఁ బరిమళింపఁ జేయఁబడిన, నభస్తరంగిణీ...చయముల్ -నభస్తరంగిణీ=ఆకాశగంగాసంబంధ మైన;ఘనతర=మిగులగొప్పవైన, భంగ=తరంగముల సంబంధమైన, తోయకణికా=ఉదకబిందువులయొక్క, చయముల్ =సమూహమును, కరపుష్కరంబులల్ = చేతు లను కరిహస్తాగ్రముల చేత, చల్లెన్ = చిమ్మెను.

విశే. పుష్కరశబ్దమునకు నేనుఁగుతొండము చివరయే గాక పద్మమును నర్థమగుటంజేసియు, హస్తములకుఁ బద్మసామ్యము ప్రసిద్ధమగుటంజేసియు, నద్దాని నేకదేశ వివర్తిరూపకముగాఁ దలంచిన పద్మములం బోలు హస్తములను తొండములకొనలచేనియు నర్థము లభించును. ఇట్లే పూర్ణకుంభములను స్తనములను సాటిచేయుట సహజమగుటంజేసి యచ్చోఁగూడఁ బైనిర్వాసినప్రకారముగఁ దలంచినఁ గుంభములంబోలు స్తనము లనెడు కుంభస్థలము లని యర్థము సిద్ధించును. కుంజరశబ్దము శ్రేష్ఠవాచకమగుట నా స్థలమునఁగూడ యదుశ్రేష్ఠుఁడైన శ్రీకృష్ణుఁ డను పురుషగజ మను నర్థము లభించెడు. ఏనుఁగుతల కిరువంకలనుండి నెత్తైన రెండు ప్రదేశములను రెండు కుంభములుగాఁ గవులు వర్ణించియున్నారు. కావునఁ నేస్తనద్వంద్వమున కవి సాటి యగుటయుఁ గుంభము లని బహువచనముగా వ్యవహృత మగుటయుఁ బొసఁగెను. "ఘనకుచకుంభముల్ దొరసి తారొక్కని యొప్పునకై యసూయమై" అని యెట్టా ప్రగడ నృసింహపురాణము. "తత్కుంభహస్తద్యుతుల్, నగజాచారుకుచోరువైఖరులఁ దెల్పన్" అని వసుచరిత్రము. అలం. రూపకము.

క. వారణయానలు కరముల
నీ రడిచినరవము మురజనిస్వనముగఁ జె
న్నారఁగఁ బద్మిను లాడెను
వారిజహస్తముల మధుపవలయము లులియన్. 31

టీ. పద్మినులు = పద్మలతలు, (పద్మినీజాతి స్త్రీ లని యర్థాంతరము.) వారణయానలు=గజగమన లగు సురస్త్రీలు, కరములన్ =హస్తములచే, నీరడిచినరవము = నీటిసి గొట్టఁగాఁ బుట్టినచప్పుడు, మురజనిస్వనముగన్ = మద్దెల ధ్వనిగాఁగా, చెన్నారఁగన్ =అందముగా, వారిజహస్తములన్ = పద్మములనే చేతులందు, (వారిజములవంటి చేతులం దని యర్థాంతరము) మధుపవలయములు=తుమ్మెద లను కంకణములు. (వలయాకారము లగు తుమ్మెదలను కంకణము లనియు గ్రహింపనగును.) ఉలియన్ =శబ్దింపఁగా, ఆడెను = నాట్యము చేసెను.

భా. సురతరుణులు నీటిని జేతితోఁ గొట్టఁగా నా నీట నున్న తామరతీవల గుములును, దామరులును జలించె నని భావము.

విశే. నీటిని జేతితో నడుచునపుడు పుట్టిన ధ్వనిని మద్దెల మ్రోఁతగను, నీరజముల హస్తములుగాను, మధుపములఁ గంకణములుగాను రూపించి పద్మినీశబ్దముపలనఁ గల్గు నర్థాంతరము నాధారముగఁ గొని, పద్మినీనాట్యమును గవి విశదీకరించినాఁడు. తుమ్మెద లను గంకణములుగా రూపించుటచేఁ నీకంకణములు నల్ల వని చెప్పవలసియున్నది. దాన నియ్యవి యింద్రనీలనిర్మితములో యని యూహింపవలసియున్నది. లేక వలయాకృతి నొక్కదానినిబట్టియే కంకణత్వ మూహించెనో యని యనుమానింపవలసి యున్నది. లోకమునందలి స్త్రీనాట్యము గమ్యము. అలం. రూపకము.

క. ప్రోడతనంబులు మీఱఁగఁ
జేడియ లదుగులును మొగముఁ జేతులు మెఱయ
న్వేడుక నీఁదఁగ నపు డా
మ్రేడితజలజాత మయ్యె మిన్నే ఱెల్లన్. 32

టీ. చేడియలు=సురతరుణులు, ప్రోడతనంబులు = ప్రౌఢత్వములు, మీఱఁగన్ = అతిశయించునట్లుగా, అడుగులును=పాదములును, మొగమున్ =ముఖమును (మొగము లని యర్థము) చేతులున్ =హస్తములును, మెఱయన్ = ప్రకాశింపఁగా, వేడుకన్ = సంతోషముతో, ఈఁదఁగన్ =ఈఁతకొట్టఁగా, అపుడు = ఆసమయమున, మిన్నేఱెల్లన్ = మందాకినియంతయు, ఆమ్రేడితజలజాతము = ద్విగుణముగాఁ జేయఁబడిన పద్మములు గలది, అయ్యెన్ = ఆయెను.

భా. పాదమునకును, మోమునకును, జేతులకును, బద్మముల సాటి చేయుట సహజము. ప్రకృతము నీటనీఁదులాడు స్త్రీలపాదములు మొగములు చేతులు నీటఁదేలి తమ్ము లంబోలి యున్నవగుటంజేసి ఆకాశగంగయందుఁ బద్మములు ద్విగుణీకృతములైనట్లు తోఁచె నని భావము.

విశే. నీట నీఁదులాడునపుడు పాదాదులు తేలియే యుండునీఁత వెలికలఁబడి యీఁదునీఁతగా నెన్నవలసియున్నది. బోరఁగిలఁబడి యీఁదునీఁతయందు హస్తపాదముల కొకమాఱు మునుంగుటయు నొకమాఱు తేలుటయు సంభవించును గాన నపు డా మ్రేడితజలజాతత్వము సరిగా సరిపడ దని తోఁచెడిని. అలం. ఉపమ గమ్యము.

తే. తామరల వ్రేటు లాడుచోఁ దరుణు లెత్తు
కరరుహాంకిత బాహువల్లరులు వొలిచె

బిరుదవర్ణావళీపరిస్ఫురిత మైన
పల్లవాస్త్రజయ స్తంభపటలి యనఁగ. 33

టీ. తామరలక్ =పద్మములచే, వ్రేటులాడుచోక్ = (పరస్పరము) కొట్టుకొను నపుడు, తరుణులు = యువతులు, ఎత్తు = పైకెత్తిన, కరరుహాంకిత బాహువల్లరులు - కరరుహ=గోళ్లచే, అంకిత=చిహ్నితములైన, బాహువల్లరులు = తీఁగలం బోలు బాహు వులు, బిరుద...స్ఫురితమైన-బిరుదవర్ణ = బిరుదాక్షరములయొక్క-, ఆవళీ = పంక్తులచే, పరిస్ఫురితమైన = ప్రకాశింపఁజేయఁబడిన, పల్లవాస్త్ర...పటలి-పల్లవాస్త్ర = మన్మథుని యొక్క-, జయస్తంభ=విజయసూచకములగు స్తంభములయొక్క-, పటలి = సమూహము, అనఁగన్ = అనునట్లు, పొలిచెన్ = ఒప్పెను.

భా. తామరలచే ననోన్యము కొట్టుకొనునపుడు పైకెత్తిన తెల్లనిగోళ్లతో నొప్పు బాహువులు మన్మథుని విజయసూచకములగు స్తంభంబులం బోలి యొప్పె నని భావము. చేతులు స్తంభములవలెను నందలిగోళ్లు బిరుదాక్షరములవలెను ఒప్పె నని తాత్పర్యము. అలం. ఉత్ప్రేక్ష.

చ. దానవవైరి దివ్యవనితానికురుంబముతోడ జహ్నుక
న్యానవపంకజాతనివహంబులఁ గందుకకేళి సల్పుచు
న్నేనఁ దదబ్జపత్రములు నిండఁగ నంటిన నొప్పు నెంతయుం
దాను నుపేంద్రుఁ డౌట నయనంబులు పెక్కులు దాల్చెనో యనన్.

టీ. దానవవైరి = రాక్షసవైరి యగుశ్రీకృష్ణుఁడు, జహ్నుకన్యానవపంకజాత నివహంబులన్ =మిన్నేటి క్రొత్తతమ్ములగుంపునందు (అనఁగా జాహ్నవియం దపుడపుడే వికసించిన పద్మసమూహము ననుట) కందుకకేళి=బంతులాట, సల్పుచున్ = చేయుచు, మేనన్ =శరీరమున, తదబ్జపత్రములు=ఆకందుకరూపములైన పద్మములరేకులు, నిండఁగన్ =అంతటను, అంటినన్ =అంటుకొనఁగా, తాన్, ఉపేంద్రుఁడు=ఉపేంద్రుఁడను పేరుగలవాఁడు; ఇంద్రునితమ్ముఁడు-ఔటన్ =అగుటచే, పెక్కులు = అనేకములు, నయనములు= నేత్రములు, తాల్చెనో=ధరించెనో, అనన్ =అనునట్లు, ఎంతయున్ =మిక్కిలి, ఒప్పున్ =ఒప్పెను.

భా. తామరరేకులను గన్నులకు సాటిగాఁ జెప్పుట ప్రసిద్ధము. ఇంద్రుఁడు వేయికన్నులవేలుపు. శ్రీకృష్ణుఁడు బంతులాడునపుడు మేనెల్లనంటిన పద్మదళములతో సహస్రాక్షుఁడగు నింద్రునివలె నుండె ననియుఁ, దాను నింద్రునకుఁ దమ్ముఁడును నుపేంద్రుం డును గాన నట్టిరూపము నాతఁడు కోరి ధరించిన ట్లుండె ననియుఁ దాత్పర్యము. అలం. ఉత్ప్రేక్ష.

తే. తనమనోవల్లభునిభుజా స్తంభ మూఁది
సలిలవిహారణ మొనరించె సత్యభామ
యలసవైఖరి వీచిడోలాంతరావి
హారసంగతనవ రాజహంసి యనఁగ. 35

టీ. సత్యభామ, తనమనోవల్లభుని భుజా స్తంభము = తనమనోహరుని స్తంభము వంటి భుజమును, ఊఁది=పట్టి, అలసవైఖరిన్ = మందమైనరీతితో, వీచి...హంసి-వీచి డోలా=తరంగము లనెడు నుయ్యాలలయొక్క, అంతర=మధ్యభాగములం చైన, విహార= విహారములతో, సంగత = కూడియున్న (తరంగడోలికావిహారాసక్తమైన యనుట) నవ రాజహంసి=క్రొత్తరాజహంసాంగన, అనఁగన్ =అనునట్లు, సలిలవిహారణము = జలక్రీడ, ఒనరించెన్ = చేసెను.

భా. శ్రీకృష్ణునిభుజ మూఁతగాఁగొని జలక్రీడ యొనర్చు సత్యభామ యలసభావ మలర తరంగడోలికలఁ గ్రీడాసక్త మగు రాజహంసాంగనపగిది నొప్పె నని భావము. అలం. ఉత్ప్రేక్ష. 'వీచిడోలా' అనుచో రూపకము.

క. అవతంసితశైవల గ్గై, వివలద్వేణి యయి కోకవిస్ఫుటకుచ యై
దివిషన్నది నాకపురీ, ధవఁగాములలోన *నన్యతమ యనఁ బొల్చెన్.

టీ. దివిషన్నది=మిన్నేరు, అవతంసిత శైవల యై = శిరోభూషణముగఁ జేయఁ బడిన నాఁచు గలదై; మిన్నేరునకుఁ బైనిదేలియాడు శైవలము శిరోభూషణమువలె నున్న దని గ్రహించునది. వేణి ప్రవాహముగాన దానిపైఁ గలనాఁచు శిరోభూషణ మయ్యె నని యెన్ననది. సురవనిత లానదిని దేలియాడుట వారిశిరసుల నాఁచు లగ్న మయ్యె నని యెన్నవలయు. ఇట్లే యిందలివిశేషణములు సురవనితా సురనదీ సాధారణ ములు. వివలద్వేణి యయి=పాఱుప్రవాహము గల దై యని నదీపరము. పీడినకొప్పు గలది యని సురవనితాపరము. కోకవిస్ఫుటకుచయై = చక్రవాకములనెడు తెల్ల మగు స్తనములు గలది యని నదీపరము. చక్రవాకములవంటి ప్రస్ఫుట మగు స్తనములు గలది యని సురవనితా పరము. నాకపురీ ధవళాక్షులలోనన్ =దేవతాస్త్రీలలో, అన్యతమ ఒకతె, అనన్ = అనునట్లుగా, పొల్చెన్ = ఒప్పెను.

భా. నాకవనితలు జలక్రీడకతనఁ గొప్పున నంటిన నాఁచుగలవారును, పీడినవారును, బయల్పడిన కుచములుగలవారును నై రనియు, సాదృశ్యము నును నట్టిదే యగుటంజేసి యన్నదియు నాదేవతాస్త్రీలనే బోలి వారి

---

* నన్యతమయుంబోలెన్.

నొప్పె ననియుఁ దాత్పర్యము. జడకు ప్రవాహమును, గుచములకుఁ జక్రవాకములను సాటి చేయుట సహజముగదా!

విశే. నాఁచును, శిరోభూషణముగాఁ జెప్పుటంజేసి దమనము మున్నగుల్మణముల రూపమగు శిరోభూషణమునే గవి భావించె నని యెన్నవలయును. అలం. రూపకము. ఉల్లేఖ.

చ. పెరిగినహారరత్నములపెల్లున నొక్కెడఁ దామ్రపర్ణి యై
నెరసినసోగపెన్నెఱులనిగ్గున నొక్కెడ భానుకన్య యై
గురుకుచలిప్తమైన నవకుంకుమ నొక్కెడ శోణ యై నభ
శ్చరనది యొప్పె దివ్యజలజాతముఖుల్జలకేళి సల్పఁగన్. 37

టీ. దివ్యజలజాతముఖుల్ = సురవనితలు, జలకేళి = జలక్రీడ, సల్పఁగన్ = చేయఁగా, పెరిగిన=త్రెగిపడిన, హారరత్నముల పెల్లునన్ = ముత్యాలహారముల సంబంధమైన ముత్తెములయొక్క యాధిక్యముచే, ఒక్కెడన్ = ఒకచోటను, తామ్రపర్ణియై= తామ్రపర్ణినదియై (తామ్రపర్ణినదీరూపము గలదై యనుట.), నెరసిన సోగపెన్నెఱుల నిగ్గునన్ = వ్యాప్తములై నిడుదలైన పెద్దశిరోజములకాంతిచే, ఒక్కెడన్ =ఒకప్రదేశమున, భానుకన్యయై=యమునానదియై (తత్స్వరూపము గలదై యనుట) గురుకుచలిప్తమైన = లావైన స్తనములందుఁ బూయఁబడిన, నవకుంకుమన్ = క్రొత్తకుంకుమముచే, ఒక్కెడన్ = ఒకతావున, శోణయై = శోణనదియై, (శోణనదీరూపము దాల్చినదై యనుట.) నభశ్చరనది = ఆకాశగంగ, ఒప్పెన్ = ప్రకాశించెను.

భా. సురవనితలు జలకేళి యొనర్చునపుడు వారి ముత్యాలహారములు త్రెగి వానినుండి ముత్తెము లొక్కెడ రాలె ననియుఁ, దామ్రపర్ణినది ముత్తెముల కాకర మని నానుడి గలదు గాన దాని ననుసరించి యాముత్తెములతోడి తావు గల యన్నది తామ్రపర్ణివలె నొప్పె ననియు, దేవభామినుల శిరోజముల యసితకాంతు లొకతావున వ్యాపించి జలమును నల్లగాఁజేయ నన్నది నల్లనియుదకముగల యమునను బోలె ననియు, దివ్యకాంతల కుచలిప్తమైన క్రొత్తకుంకుమము జలకేళివేళ కరఁగి యొక్కెడ జలము నెఱ్ఱగాఁ జేయ నెఱ్ఱనియుదకముతోఁ గూడిన యాయాకాశగంగ యెఱ్ఱనినీటితో [illegible] శోణనదిగతి నొప్పె ననియు భావము.

[illegible]శే. నవరత్నములలో ముత్తెమును నొకటి గాన ముత్యమునకు రత్నశబ్దమును గ్రహింపనగును. మఱియు నట్టిరత్నములు గలహారము ముత్యములహారమే యగలెను. "తామ్రపర్ణీసమేతస్య ముక్తాసారంమహోదధేః" అని కాళిదాస [illegible]తామ్రపర్ణినది ముత్తెముల కాకర మని యెన్నవలసియున్నది. దాన నీ

పద్యమందలి హారమణిశబ్దములు ముక్తాహార ముక్తాఫలము లర్థముగాఁ గల వనియే యెన్నవలెను.

అలం. తనగుణము వీడి పరనదీగుణమును వియన్నది దాల్చినట్లు వర్ణించుటకతనిఁ దద్గుణాలంకారము. ఒక్కమిన్నేటినే తామ్రపర్ణీ యమునా శోణలుగా వర్ణించుటంబట్టి యుల్లేఖాలంకారము. "తద్గుణస్స్వగుణత్యాగాదనోత్కృష్టగుణాహృతి, ఏకస్య బహు ష్వుల్లేఖో....."అని యలంకారలక్షణములు.

చ. అలకలు నాసికామణియు నన్నువకౌనుఁ గుచద్వయంబుఁ గుం
డలములుఁ జంచలింప జతనంబున హస్తము లూఁది జీర్కుబం
డల దిగజాఱి రొండొరుకడం దరలాక్షులు దోనివింట బిం
జలు గొన నేయువుష్పశరుసంపెఁగవాలికతూపులో యనన్. 38

టీ. తరళాక్షులు=సురచపలనయనలు; అలకలుక్=కురులును, నాసికామణియుక్=ముక్కుఱతనమును, అన్నువకౌనుక్=సన్నని నడుమును, కుచద్వయంబుక్=స్తనద్వయమును, కుండలములుక్ = కర్ణాభరణములును, చంచలింపక్=సంచలింపఁగా, జతనంబునక్=యత్నముతో, హస్తములు=చేతులు, ఊఁది = పట్టుకొని, జీర్కుబండలక్ = జరుగుడుతాలమీఁద; ఒండొరుకడక్=ఒకరివెనుక నొకరు, దోనివింటక్=వంగినధనువుచే, పింజలుగొనక్=ఒకదాని నొకటి యంటునట్లుగా (పుంఖానుపుంఖముగ ననుట.) వీయుఁ=ప్రయోగించు, పుష్పశరుసంపెఁగవాలికతూపులో = మన్మథుని సంపెఁగపూవుల రూపమగు దీర్ఘము లగు బాణములో, అనక్ = అనువట్లు, దిగజాఱిరి = క్రిందికి జాఱిరి.

భా. సురవనిత లొకరిచేతుల నొకరు పట్టుకొని జరుగుడుబండపైనుండి క్రిందికి జాఱి రని భావము, జరుగుడుబండపైనుండి క్రిందికి నొకరిదరువాత నొక రంటి జాఱుచుండుటంజేసియు జాఱునపుడు చలనము నవ్వారుగల్గియుండుటంజేసియు, స్త్రీలను మన్మథ బాణములుగాఁ బలుక్కట కవిసంప్రదాయప్రసిద్ధవిషయ మగుటంజేసియు, సుర వనితలు సంపెఁగపూవుజిగినిబోలు శరీరకాంతి గలవారగుటంజేసియుఁ, బుంఖానుపుంఖముగఁ జలించుచుఁబోవు మన్మథుని సంపెఁగవాలికతూపులంబోలి యొప్పిరని తాత్పర్యము.

మ. బలివిధ్వంసియుఁ బెక్కుభంగుల మరుత్పద్మాకరాంతంబునఁ
సలిలక్రీడ యొనర్చి నిర్భరమద స్తంబేరమప్రక్రియఁ
వెలలే నత్యయుఁ దాను మజ్జనవిధావిభ్రాంతకౌటిల్యకుం
తలసంక్రాంతనితంబ లై దివిజకాంతారత్నము ల్గొల్వఁగా

టీ. బలివిధ్వంసియుక్=బలి నడఁచిన శ్రీకృష్ణుఁడును, పెకు.
రీతులతో, మరుత్పద్మాకరాంతంబునఁ=దేవసరోవరమధ్యమున,

ఱనర్చి=చేసి, నిర్భర.....ప్రక్రియన్-నిర్భర = స్వేచ్ఛగాఁ దిరుగు,మద...క్రియన్-మదపుస్తంభేరమ = మదపుటేనుఁగుయొక్క; ప్రక్రియన్=ప్రకృష్టవ్యాపారముతో, సత్యభామయన్=సత్యభామయును, తానున్, మజ్జన.....నితంబలై-మజ్జనవిధా=స్నానవిధిచే, విభ్రాంత=తిరుగుడువడిన (అనఁగా వ్యత్యస్తము లైన యనుట;) కౌటిల్య=వక్రములైన, కుంతల = తలవెండ్రుకలచే, సంక్రాంత=ఆక్రమింపఁబడిన, నితంబలై=పిఱుఁదులు గల వారై, దివిజకాంతారత్నములన్ = దేవతాస్త్రీమతల్లికలు, కొల్వఁగన్ = సేవింపఁగా, వెలయన్ = వెడలెను.

వ్యా-విశే. స్తంభేరమ మనఁ దృణములందుఁ గ్రీడ యొనర్చున దని వ్యుత్పత్త్యర్థము గాని యిచ్ఛామాత్ర మయ్యర్థ మిశబ్దమునకు సరిపడ దనియు నేనుఁ గనుసామాన్యార్థమే గ్రాహ్య మనియుఁ దోఁచెడిని. లేదా నాఁచుతీవ లంటియున్న శ్రీకృష్ణుఁడు తృణక్రీడాసక్తమైన యేనుఁగువలె నున్నవాఁ డనియేని గ్రహింపవలెను. వెలలెను: రూ. అ. వెడలెను.

తే. నెఱులఁ దడియార్చి క్రొవ్విరు ల్దుఱిమి మేనఁ
గలపము లలంది తొడవు లంగములఁ బూని
కల్పవృక్షదుకూలాంశుకములు గట్టి
రంగనలు మారునొఱతోడియలుఁగు లనఁగ. 40

టీ. నెఱులన్ =తలవెండ్రుకలను, తడియార్చి = చెమ్మనారఁజేసి, క్రొవ్విరుల్ = క్రొత్తపూవులను, తుఱిమి = ముడిచి, మేనన్ =శరీరమున, కలపములు = చందనాది సుగంధలేపములను, అలంది = రాచుకొని, తొడవులు=అలంకారములు, అంగములన్ = అవయవములందు, పూని=ధరించి, కల్పవృక్షదుకూలాంశుకములు = కల్పవృక్షసంబంధమైన పట్టుబట్టలను, అంగనలు=సురవనితలు, మారునొఱతోడియలుఁగులు = మన్మథుని యొక్క యొఱతో నున్నములుక్కలు; అనఁగన్ =అనునట్లు, కట్టిరి=ధరించిరి.

భా. చందనాదిచర్చలచేతను దుకూలములచేతను నాచ్ఛాదితగాత్రలైన దేవతా ఱొతోడి మన్మథబాణములవలె మించియుండి రని భావము. మన్మథబాణములు లగుటంజేసి కుసుమములవలె మృదువైనశరీరములు గలవా రని తాత్పర్యము.

కల్పవృక్షశాఖాంతరములందు దుకూలము లున్నవిధము 3 ఆ. 41 గద్య 'ంతరసంతానోకహదుకూలమయపతాకా' అనుపదము మూలముగను, ునందలి "ఈతరుశాఖాంతరలోలదుకూలమారుతము" లను పదము ుయ్యెను.

చ. జలరుహపత్రనేత్రుఁడును సత్యయుఁ దానును ననర్ఘ్యదివ్యభూ
షలు ధరియించి నిర్జరనిశాకరబింబముఖు ల్భజింపఁ ద
ద్బలపరిపంథిబాహుపరిపాలిత మైనపురంబు సొచ్చె ని
శ్చలతరనేత్రపౌరజనసంతతి హర్మ్యము లెక్కి చూడఁగన్. 41

టీ. జలరుహపత్ర నేత్రుఁడును=పద్మాక్షుఁడును, సత్యయుఁ, దానుఁ, అనర్ఘ్య దివ్యభూషలు=అమూల్యములగు మణినుయాలంకారములను, ధరియించి, నిర్జరనిశాకర బింబముఖుల్=సురచంద్రవదనలు, భజింపఁ=సేవింపఁగా, తద్బలపరిపంథిబాహుపరిపాలితమైన=ఆబలరిపుండైన దేవేంద్రునిబాహువులచే రక్షితమైన, పురంబుఁ=పట్టణమును; సురనగరి నమరావతి ననుట. నిశ్చలతరనేత్రపౌరజనసంతతి=అనిమేషులగు పట్టణవాసుల సమూహము; స్వర్గమునందలివా రెల్లను ననిమిషులే. ప్రకృతము శ్రీకృష్ణుం జూడ నుత్సుకులై యుంట నిశ్చలతరనేత్రులైరని గ్రహింపవలయును. హర్మ్యమును=మేడలు, ఎక్కి=అధిరోహించి, చూడఁగఁ, చొచ్చెఁ=ప్రవేశించెను.

### సూర్యాస్తమయాదివర్ణనము

క. దినరాజత్తఱిఁ బంకజవనములఁ జరియించుకాంతివర్గము దానుఁ
వనధి జలకేళి సలుపఁగఁ, జనియె నన న్వారుణీదిశాతటిఁ బొల్చెన్. 42

టీ. దినరాజు=పగటిరాజు; సూర్యుఁడు, అత్తఱిఁ=ఆసమయమున, పంకజవనములఁ=పద్మవనములందు, చరియించు=సంచరించునట్టి, కాంతివర్గము=ఛాయాసమూహమును, తానుఁ, వనధిఁ=సముద్రమున, జలకేళి=జలక్రీడ, చలుపఁగఁ=చేయఁగా, చనియెఁ=ఏఁగెనో, అనఁ=అనునట్లు, వారుణీదిశాతటిఁ=పశ్చిమదిక్తటమున, పొల్చెఁ=ఒప్పెను.

భా. ఛాయలు సూర్యభార్యలు. ప్రకృతము స్త్రీలతోఁగూడి జలకేళియొనర్చిన శ్రీకృష్ణుని గాంచి తానును దనవనితలతో పశ్చిమాంభోధియందు జలకేళి సవరింప నేఁగెనో యనునట్లు ప్రతీచీదిశ నొప్పె నని భావము. అనఁగా రవి యస్తమింపఁ జేరె నని తాత్పర్యము.

తే. వేల్పుఁజిగురాకుఁబోఁడులవీఁగుఁజన్నుఁ
గవలపైఁ గుంకుమచ్ఛాయ గడలుకొలిపి
పసిఁడిగట్టున కొకవింత [1]మిసిమి నించి
నెఱసెఁ [2]గడసావిముదుసలి తెఱపయెండ. 43

---

1. పసిమి. 2. గడసారిముసలితఱపియెండ.

టీ. వేల్పుఁజిగురాకుఁబోఁడులవీఁగుఁజన్నుఁగవలపైనక్ =సురతరుణుల బరువైన స్తనద్వంద్వములమీఁద, కుంకుమచ్ఛాయ=అరుణమైనకాంతిని, కడలుకొలిపి = వ్యాపింపఁ జేసి, పసిడిగట్టునకుక్ =బంగరుకొండకు, ఒకవింతమిసిమి = ఒకవింతయగు తేజును, నించి = నిండించి, కడసావి.....యెండ-కడ = తుదిసైన, సావి = కాలమునందలి, ముదుసలి= వృద్ధమైన, తెఱివ=తైక్ష్ణ్యములేని, ఎండ = ఆతపము; అనఁగా సాయంసమయమునసైన జరతాతప మనుట. నెఱిసెక్ = వ్యాపించెను.

విశే. 'మిసిమి'యనుచోఁ 'బసిమి'యని పాఠ మగపడెడి.అపుడు పసిమి యనఁగాఁ బసుపుఁదళు కని యర్థ మని గ్రహించునది. వేల్పువనితలస్తనములు తెల్లని వౌట నందుఁ బడిన జరతాతప మరుణముగ నుండె ననియు, బంగరుకొండ పసుపుకాంతులు గల దౌట నందుఁదావు గొనిన ముసలియెండ నొకవింతజిగిని దానికిఁ గల్గించె ననియు గ్రహింపవలెను.

ఆ. వేల్పుగట్టుగవుల వెలువడి వడ దేఱఁ
జదలువాఁకనీట జలకమాడి
వైజయంతహార్మ్యవలభినీడంబులఁ
గ్రందుకొనియెఁ గిన్నరద్వయములు. 44

టీ. వేల్పు.....గవులక్ -వేల్పుగట్టు=దేవతల కొండయగు మేరువుయొక్క, గవులక్ =గుహలనుండి. వెలువడి=బయలుదేఱి, వడ=తాపము, తేఱిక్ =పోవునట్లుగా, చదలువాఁకనీటక్ =మిన్నేటిజలమున, జలకమాడి = స్నానముచేసి, కిన్నరద్వయములు= కిన్నరమిథునములు, వైజయంతహార్మ్యవలభినీడంబులక్ = వైజయంతమను ప్రాసాదము యొక్క కొణిగెగూడులందు, క్రందుకొనియెక్ =గుంపులుగాఁ జేరెను.

క. ఘనసాంధ్యరాగవినతా
తనయగరుత్సమితికడిఁదితాఁకున ధర వ్రా
లినగగనఫణిఫణామణి
యన రవిమండలము పశ్చిమాంబుధిఁ గ్రుంకెన్. 45

టీ. ఘన.....తాఁకునక్ -ఘన=గొప్పవైన, సాంధ్యరాగ=సంజకెంజాయ యను నట్టి, వినతాతనయగరుత్సమితి=వినతాసుతుం డగు గరుడునియొక్కలగుమిసంబంధమైన, కడిఁదితాఁకునక్ =క్రూరమైన దెబ్బచే, ధరక్ =భూమియందు, వ్రాలిన=పడిన, గగనఫణి ఫణామణి=ఆకాశ మను సర్పముయొక్క పడగయందలి మాణిక్యము,అనక్ =అనునట్లుగా, రవిమండలము = సూర్యమండలము, పశ్చిమాంబుధిక్ =పడమటిసంద్రమున, క్రుంకెక్ = అస్తమించెను.

విశే. గరుడునియొక్క లెట్టినివాట సంజకెంజాయను గరుడపక్షములుగా నెన్నుట సరసము, గగనమును ఫణిగా రూపించుటనుబట్టి యియ్యది కృష్ణసర్పముగా నెన్ననగును. గరుడవిక్రమమూలక మగు భావికథాంశము సూచితము.

మ. మరుదీశద్విపదానశోభ శిఖిధూమ్యారోచిఁ గీనాశకా
సరదేహప్రభ *రాక్షసాసిలతికాంచద్దీధితి న్వారిధీ
శ్వరకేతుద్యుతి మాతరిశ్వహరిణచ్ఛాయ ధనాధ్యక్షనీ
లరుచిక ధూర్జటికంఠకాంతిఁ దమము ల్వ్యాపించె దిగ్భత్తులన్. 46

టీ. మరుదీశ...శోభక -మరుదీశ = దేవేంద్రునియొక్క, ద్విప = ఏనుఁగైన, ఐరావతముయొక్క, దాన=మదముయొక్క, శోభక = కాంతివంటి కాంతితోడను, శిఖి...రోచిక -శిఖి = అగ్నిహోత్రునియొక్క, ధూమ్యా = పొగగుంపుయొక్క, రోచిక = తేజస్సువంటి తేజస్సుతోడను, కీనాశకాసరదేహప్రభక =యముని యొను పోతుయొక్క శరీరకాంతివంటి కాంతితోడను, రాక్షస...దీధితిక -రాక్షస=నైరృతుని యొక్క, అసిలతికా=లతవంటి కత్తియొక్క, అంచత్=ఒప్పునట్టి, దీధితిక =ప్రభవంటి ప్రభతోడను, వారిధీశ్వరకేతుద్యుతిక = వరుణునియొక్క టెక్కెముయొక్క శోభ వంటి శోభతోడను, మాతరిశ్వహరిణచ్ఛాయక = వాయుదేవునిలేఁడియొక్క కాంతి వంటి కాంతితోడను, ధనాధ్యక్షనీలరుచిక = కుబేరునినీలములప్రభవంటి ప్రభ తోడను, ధూర్జటికంఠకాంతిక = ఈశానుని కుత్తుకశోభవంటి శోభతోడను, తమముల్ = చీఁకట్లు, దిగ్భత్తులక =దిక్కులగోడలందు; అనఁగా దిక్తటములం దనుట. వ్యాపించెను = వ్యాపించెను.

విశే. అష్టదిక్కుల నాక్రమించినచీఁకటి యాయాదిగీశుల నల్లనివస్తువుల కాంతు లుగాఁ గవి యూహించుట సరసము. యమవాహనము మహిషము, వాయువాహనము జింక. అలం. రత్నావళి.

మ. వనజశ్రీధనపశ్యతోహరుఁడు జీవంజీవజీవంబు ప
చ్చనివిలాకానికి మామ చల్వగని పశ్యత్ఫాలజూటాగ్రమో
హనరత్నంబు సుధాకరుం డపుడు స్రాగ్దిగ్ధలీవీథి నొ
య్యనఁ దోతెంచె వియత్తటీకషణలీలానీతశంఖాకృతిన్. 47

టీ. వనజశ్రీ...హరుఁడు-వనజశ్రీ = పద్మములశోభ యనెడు, ధన=ధనమునకు, పశ్యతోహరుఁడు = చూచుచుండఁగనే దొంగిలించువాఁడు, జీవంజీవజీవంబు = చకోర

*రాక్షసాసితిలకాం.

ములకుఁ బ్రాణమైనవాఁడు; పచ్చనివిల్కానికిఁ=మన్మథునకు, మామ=మేనమామయు, చల్వగని=శైత్యములకు గనియైనవాఁడు, పశ్యత్ ...రత్నంబు-పశ్యత్ఫాల = చూచునట్టి నుదురు గలవాఁడగు నీశ్వరునియొక్క; అలికమున నేత్రము గలవాఁడు గాన నీశుఁడు పశ్యత్ఫాలుఁ డయ్యె. జూటాగ్ర=జడలముడికొసయందు; మోహనరత్నంబు = సుందరమైన మాణిక్యమైనవాఁడు, సుధాకరుండు = చంద్రుఁడు; అమృతమునకు స్థానమైన వాఁడు. అపుడు=ఆసమయమున, వియత్తటీకషణ—కృతిఁ - వియత్తటీ=గగనదేశము నందు, కషణలీలా=ఒరయువిలాసముచే, ఆనీత=పొందింపఁబడిన, శంఖ=శంఖముయొక్క, ఆకృతిఁ = ఆకారముతో, ప్రాగ్దిగ్భలీవీథిఁ = తూరుపుకొండదేశమున, ఒయ్యనఁ = మెల్లఁగా, తోఁతెంచెఁ = తోఁచెను; అగపడెను.

విశే. మన్మథుఁడు లక్ష్మీపుత్రుఁడు. లక్ష్మికిఁ,జంద్రుఁ డన్న. కావున, మన్మథునకుఁ జంద్రుఁడు మామ యయ్యె.

క. ఆరాత్రి సత్యఁ గూడి ము
రారి ముదం బెసఁగ వైజయంతమున మనో
భూరాజ్యసౌఖ్యనిద్రా
పారీణత నుండుచోఁ బ్రభాతం బయ్యెన్. 48

టీ. ఆరాత్రి=ఆరేయి, సత్యఁ, కూడి, మురారి=శ్రీకృష్ణుఁడు, ముదంబు = సంతోషము, ఎసఁగఁ = అతిశయింపఁగా, వైజయంతమునఁ = దేవేంద్రప్రాసాదమున, మనోభూరాజ్యసౌఖ్యనిద్రాపారీణతఁ = మన్మథరాజ్యసుఖనిద్రాపూర్తితో, ఉండుచోఁ = ఉండఁగా, ప్రభాతంబు = ప్రాతఃకాలము, అయ్యెఁ.

సీ. మొగుడుఁదమ్ములఁ జిక్కుమగతేఁటియలుఁగులు
సడలిపోఁ జేయు విశల్యకరణి
కాలవశంబునఁ గడచన్న వాసర
శ్రీఁ గ్రమ్మఁజేంచు సంజీవకరణి
రే యనువాలునఁ బాయ లైనరథాంగ
తతుల హత్తించు సంధానకరణి
తిమిరంబుచే సొంపు సమసిన దిశలకు
వన్నియ నొసఁగు సావర్ణకరణి
తే. మించుబీఱెండయగ్నిఁ బుట్టించునరణి
కలుషఘోరపయోరాశిఁ గడపుతరణి

తోఁచెఁ బ్రాచీమహీధరోత్తుంగసరణిఁ
బ్రాఁజదువుమానికంబులబరణి తరణి. 49

టీ. మొగుడుఁదమ్ములక్ = ముకుళించినపద్మములందు, చిక్కఁ = చిక్కఁబొన్న, మగతేఁటియలుగులు = కొదమతుమ్మెద లను బాణాగ్రములను, సడలిపోక్ = వదలి పోవునట్లుగా, చేయు = చేయునట్టి, విశల్యకరణి=విశల్యకరణి యమ నోషధీవిశేషము. (విశల్యకరణి = శల్యములను నిశ్శేషముగ నూడఁదీయునది.) విశల్యకరణి యను నోషధి విశేషము శల్యములఁ బెఱికివేయుపగిదిని సూర్యుఁడు ముకుళించినపద్మములందుఁ జిక్కిన తేటులను సడలించు నని భావము. అనఁగా సూర్యోదయము కాఁగానే పద్మములు వికసించుట సహజ మగుట నపు డందున్న తేంట్లు వెలుపలికి వెడలు నని తాత్పర్యము. కాలవశంబునక్ =కాలగతిచేత, కడచన్న=నశించిన, వాసరశ్రీక్ =దినలక్ష్మిని, క్రమ్మఱించు= మఱిలించునట్టి; అనఁగా నుజ్జీవింపఁజేయునట్టి యనుట. సంజీవకరణి=సంజీవకరణి యను నోషధి విశేషము. (సంజీవకరణి మృతుని బునర్జీవితుం జేయునది), సంజీవకరణి చచ్చిన వానిని దిరుగ బ్రతికించుపగిదిని సూర్యుఁడు గతించిన దినలక్ష్మిని దిరుగ నుజ్జీవింపఁజేయు నని భావము. సూర్యుఁడుదయింపఁగనే దినశోభ తేజరిల్లు నని తాత్పర్యము. రే = రాత్రి, అను=అనెడు, వాలునక్ =కత్తిచేత, పాయలు=చెక్కలు, ఐన, రథాంగతతుల్ = చక్రవాకసమూహములను, హత్తించు = అంటఁజేయునట్టి, సంధానకరణి=సంధానకరణి యను నోషధివిశేషము. (సంధానకరణి = విడినవానిం గలుపునవి) సంధానకరణి విడిన వానిని గలుపువిధమున సూర్యుఁడు రాత్రిని పాయలైన రథాంగములఁ గలుపు నని భావము. అనఁగాఁ జక్రవాకములకు రాత్రి వియోగదాయక మగుటంజేసి రథాంగములను బాయలుగాఁ జేయువిషయమున రేయిని గత్తిగాను, నట్లు పాయలుగా నేర్పడినవి మఱల సూర్యోదయము కాఁగానే కలిసికొనుటంజేసి సూర్యుని సంధానకరణిగాను గవి పేర్కొనె నని గ్రహింపవలెను. తిమిరంబుచేక్ = చీఁకటిచేత, సొంపు = అందము. సమసిన= పోయిన, దిశలకుక్ =దిక్కులకు, వన్నియక్ = శోభను, ఒసఁగు = ఇచ్చునట్టి, సౌవర్ణ కరణి=సౌవర్ణకరణి యను నోషధివిశేషము. (సౌవర్ణకరణి=సువర్ణశోభను గలుగఁజేయు నది.) సౌవర్ణకరణి పోయిన సువర్ణశోభను మరలఁ గల్గించుగతిని సూర్యుఁడు చీఁకటిచే నందము చెడి దిక్కులకు శోభను గల్గించె నని భావము. సూర్యుఁడస్తంగతుఁడుకాఁగాఁ జీఁకటి వ్యాపించి దిశలశోభను దిరోహిత మొనర్చె ననియు, సూర్యుఁడుదయింపఁగనే దిశ లెప్పటియట్లు శోభావంతము లయ్యె ననియుఁ దాత్పర్యము. సూర్యుఁడు దిక్కులకు శోభను మఱలఁ గల్గించినకతన నాతనిని సౌవర్ణకరణిగాఁ గవి పేర్కొనెను. మించు= అతిశయించునట్టి, బీఱొండయగ్నిక్ = తీక్ష్ణాతప మనునగ్నిని, పుట్టించు=ఉద్భవింపఁజేయు

అరణి=అగ్నిమంథనదారువు, అగ్నిని మథించుదారువునుండి యగ్ని యుద్భవిల్లుపగిదిని సూర్యునినుండి తీక్ష్ణాతప ముదయించె నని భానము. అగ్నింబోలు తీక్ష్ణాతపము సూర్యుని నుండి యుద్భవించును గాన సూర్యుని మంథనదారువుగాఁ గవి పేర్కొనెను. కలుష ఘోరపయోరాశిన్ = పాప మను భయంకరమైన సముద్రమును, కడపు = దాఁటించు నట్టి, తరణి=ఓడ. ఓడ సముద్ర మును దాఁటించి దరింజేర్చునట్లు సూర్యుఁడు పాపముల నుండి మనుజుని విముక్తుం జేసి మోక్షపారముం జేర్చు నని గ్రహించునది. దరిఁజేర్చు వాఁడు గాన సూర్యుని నోడగాఁ గవి పేర్కొనెను. ప్రాఁజదువుమానికంబులబరణి = వేదము లను మాణిక్యములకు బరణి యగువాఁడు. అనఁగా వేదస్వరూపుఁ డనుట. తరణి= సూర్యుఁడు, ప్రాచీమహీధరోత్తుంగసరణిన్ = తూర్పుకొండయొక్క యెత్తైనత్రోవ యందు, తోఁచెన్=అగపడెను; ఉదయించె ననుట.

వ్యా-విశే. ఇం దంత్యానుప్రాసనియమ మన్ని పాదములందును గననగును. అలం. ఒక్కసూర్యుని యిన్నివిధములుగ నెన్నుటంజేసి యుల్లేఖాలంకారము.

## పారిజాతాపహరణము

క. హరి యపుడు పారిజాతా
హరణోద్యోగమున నందనారామము ని
ర్భరగతిఁ జొచ్చె విహగవర
పరివృఢుపయి నెక్కి సత్యభామయుఁ దానున్. 50

టీ. హరి=శ్రీకృష్ణుఁడు, అపుడు=ఆసమయమున; సూర్యోదయకాలమున ననుట. సత్యభామయున్, తానున్, పారిజాతాహరణోద్యోగమునన్ - పారిజాత=పారిజాత వృక్షముయొక్క, ఆహరణ=హరించుటయందైన, ఉద్యోగమునన్ = ప్రయత్నముతో, విహగవరపరివృఢుపయిన్ =పక్షిరాజగు గరుడునిమీఁద, ఎక్కి=అధిరోహించి, నందనారామమున్ =నందనవనమును, నిర్భరగతిన్ =పూర్ణమగుగతితో, చొచ్చెన్ =ప్రవేశించెను.

చ. సకలసురైకవంద్యుఁ డగుచక్రధరుం డిదె నేఁడు దన్ను ను
ర్వికిఁ గొనిపోవ వచ్చె నని వెక్కసమైనమనఃప్రభూతకా
తుకమునఁ బోలె సంభ్రమముతో నటియించె నభీష్టవస్తుదా
యకతరుచక్రవర్తి యపు డాతతవాతవిధూతశాఖ మై. 51

టీ. సకలసురైకవంద్యుఁ డగు = దేవతలెల్లరకు ముఖ్యముగ నమస్కరింపఁదగిన వాఁడగు, చక్రధరుండు = చక్రమును ధరించు శ్రీకృష్ణుఁడు, ఇదె=ఇదిగో, నేఁడు=ఈ దినమున, తన్నున్, ఉర్వికిన్ =భూమికి; కొనిపోవన్ =తీసికొనిపోవుటకు, వచ్చెన్, అని,

వెక్కసమైన=అధికమైన, మనఁ్రప్రభూతకౌతుకమునఁబోలెఁ=మది నుబయించిన సంత సము చేతవలెను, అభీష్టవస్తుదాయకతరుచక్రవర్తి=కోరినవస్తువుల నిచ్చెడు వృక్షశ్రేష్ఠము, అపుడు=ఆసమయమున, ఆతతవాతవిధూతశాఖమై = విస్తారమైనగాలిచేఁ గదలునట్టి కొమ్మలుగలదై, సంభ్రమముతోఁ, నటియించెఁ = చలించెను.

భా. సురవంద్యుఁడమ్మహాత్ముఁడు శ్రీకృష్ణుఁడు తన్ను భువికిఁ దీసికొనిపోవు నను నధికసంతసమున నావృక్షరాజము నటించెనో యనునట్లు గాలిచేఁ గదలు కొమ్మలు గల్గి యొప్పె నని భావము. అలం. ఉత్ప్రేక్ష.

క. శౌరి యిదె పారిజాతముఁ
గోరికఁ గొని చనుచు మనలఁ గొనిపోఁ డని లోఁ
గూరిననెవ్వగఁ దక్కిన
భూరుహములు మధురసాశ్రుపూరము నించెన్. 52

టీ. శౌరి=శ్రీకృష్ణుఁడు, ఇదె=ఇదిగో, పారిజాతమున్, కోరికన్ =కాంక్షతో, కొని=స్వీకరించి, చనుచున్ =పోవుచు, మనలన్, కొనిపోఁడు=తీసికొనిపోఁడు, అని; లోన్ =మనస్సులో, కూరిన=కూడినట్టి, నెవ్వగన్ =సంపూర్ణమైనదుఃఖము చే, తక్కిన భూరుహములు=తక్కినచెట్లు, మధురసాశ్రుపూరమున్ =పూఁదేనె యను కన్నీటిప్రవాహ మును, నించెన్ = నిండించెను.

మ. సురలోకాభిమతప్రదానసమతాసూయన్బలెం గంసఘు
స్మరుఁ డత్యుద్ధతిఁ బారిజాతధరణీజాతంబు గోవర్ధనో
ద్ధరణప్రస్తుతమైనహస్తమున నుత్పాటించి లీలాగతిన్
గరుడస్కంధముమీఁద నిల్పి నిలిపెం గౌతూహలం బింతికిన్. 53

టీ. కంసఘుస్మరుఁడు=కంసహంత యగు శ్రీకృష్ణుఁడు, సుర...సూయన్బలెన్ - సురలోక=దేవతలసమూహమునకు, అభిమత=కోరికలను, ప్రదాన = ఇచ్చుటయందైన, సమతా=సమత్వముచేతనైన; అనఁగాఁ దానును గల్పకమువలెనే దేవతలకు సర్వాభిమత ముల నొసంగువాఁడనుట. అసూయన్ బలెన్ =ఈర్ష్య చేతవలెను, అత్యుద్ధతిన్ =మిక్కిలి గర్వముతో, పారిజాతధరణీజాతంబున్ = పారిజాతభూరుహమును, గోవర్ధనోద్ధరణ ప్రస్తుతమైన=గోవర్ధనగిరి నెత్తుటచే నుతింపఁబడునట్టి, హస్తమునన్ = చేతితో, ఉత్పా టించి=పెల్లగించి, లీలాగతిన్ =సవిలాసముగా, గరుడస్కంధముమీఁదన్ = గరుడుని మూఁపుపై, నిల్పి=ఉంచి, ఇంతికిన్ = సత్యభామకు, కౌతూహలంబు = సంతోషము, నిలిపెన్ =నెలకొల్పెను. అలం. ఉత్ప్రేక్ష.

చ. జలరుహనాభుఁ డిట్లు రభసంబున నందనపారిజాతమున్
బలిమిఁ బెకల్చి యెత్త విటపంబుల వ్రేలుదుకూలపల్లవం
బులు వడిఁ బట్టి యాడ్చుఁ గొనిపోవఁగ నీక పెనంగులీలఁ గ
ల్పలతిక లెల్ల వల్లభలు ప్రాణవిభుం బెడఁబాయ నేర్తురే. 54

టీ. జలరుహనాభుఁడు = పద్మమును నాభియందుఁగల శ్రీకృష్ణుఁడు, ఇట్లు = ఈరీతిగా, రభసంబునన్ = వేగముతో, నందనపారిజాతమున్ = నందనవనమందలి కల్ప వృక్షమును, బలిమిన్ = బలముచే, పెకల్చి = పెల్లగించి, ఎత్తన్ = మోఁది కెత్తఁగా, కల్పలతిక లెల్లను = కల్పవృక్షపుఁదీఁగలన్నియు, విటపంబుల్ = శాఖలందు, వ్రేలు = వ్రేలాడు నట్టి, దుకూలపల్లవంబులు = పట్టుబట్టలరూప మైన చిగుళ్ళను, వడిన్ = శీఘ్రముగ, పట్టి = పట్టుకొని, కొనిపోవఁగన్ = తీసికొనిపోవుటకు, ఈక = అవకాశ మొసంగక, పెనంగులీలన్ = అడ్డగించువిధమున, ఈడ్చున్ = వెనుకకు లాఁగెను. వల్లభలు = భార్యలు, ప్రాణవిభున్ = ప్రాణనాథుని (భర్త ననుట), పెడఁబాయన్ = విడుచుటకు, నేర్తురే = చాలుదురా?

భా. శ్రీకృష్ణుఁడు పారిజాతమును బెల్లగించి పైకెత్తి నావృక్షము నాశ్రయించి యల్లికొనియున్న తీఁగలన్నియు నందలి దుకూలపల్లవములం బిగియఁబట్టి వెనుక కీడ్చి నను యత్నించి నట్లని వెనుకకు లాఁగుట శ్రీకృష్ణుఁ డావృక్షమును దీసికొనిపోకుండ నడ్డ గించుటవలె నున్న దనియు, లోకమున భార్యలు ప్రాణనాథు నెడఁబాయఁజాలనట్లు లతి కలు కల్పనగమును దమనాథుని వీడఁజాలక యట్లొనర్చె ననియు భావము.

విశే. లతికాశబ్ద స్త్రీలింగసారస్యము ననుసరించియుఁ, గల్పవృక్షశబ్ద పుంలింగ సాస్యము గమనించియు, లతికాకల్పనగ సంబంధమును బరికించియు భార్యాభర్తృ భావమును గవి యూహించె నని గ్రహించునది. అలం. అర్థాంతరన్యాసము.

చ. గరుడునిఱెక్కలం బొడముగాడ్పులసోఁకునఁ దక్కువేలుపుం
దరువులుఁ బెల్లగిల్లి గగనంబునఁ దోడన వెంట నంటి రా
నరిగెడుపారిజాత హరణాచరణవ్యసనైకలోలు నా
హరిఁ గని యడ్డమై పలికి రచ్చటినందనపాలు రందఱున్. 55

టీ. గరుడునిఱెక్కలన్ = గరుడునిఱెక్కలనుండి, పొడము = పుట్టినట్టి, గాడ్పుల సోఁకునన్ = గాలులతాఁకుచే, తక్కువేలుపుందరువులు = మిగిలిన దేవవృక్షములును, అనఁగా "మందారము, పారిజాతము, హరిచందనము, సంతానము, కల్పవృక్షము" అను నైదింటిలో మొదటి నాల్గు ననుట. పెల్లగిల్లి = పట్టువదలి, గగనంబునన్ = ఆకాశమున,

1. బిగఁబట్టి. 2. మహిహరణవ్యస.

తోడన=తనతోడనే, వెంటన్, అంటి=అనుసరించి, రాన్ = రాఁగా, అరిగెడు = చను నట్టి, పారిజాత...లోలున్ -పారిజాత = కల్పవృక్షముయొక్క, హరణ = హరించుట యొక్క, ఆచరణ = చేయుట యనెడు, వ్యసన=కష్టకార్యమున, వీక = ముఖ్యముగా, లోలున్ =ఆసక్తుఁడైన, ఆహరిన్ =ఆశ్రీకృష్ణుని, కని=చూచి, అచ్చటినందనపాలురు = అచ్చోఁగల నందనవనరక్షకులు, అందఱున్ =ఎల్లరును, అడ్డమై, పలికిరి.

చ. తగునె యదుప్రవీర! యిటు ధార్ష్ట్యము నీ వొనరించి యీమరు
న్నగము హరించి వంచనఁ జనన్ దివిజాగ్రణి దీని నిచ్చె ద
క్కుగ నిజకాంతకాకుసుమకోమలయాజ్ఞ భయంబు నొందుఁ దే
టిగములు దీనిచెంగట నటింపను బువ్వులతావిఁ గ్రోలఁగన్. 56

టీ. యదుప్రవీర = ఓయాదవవీరుఁడా! ఇటు=ఈరీతిగ, నీవు, ధార్ష్ట్యమున్ = ధూర్తత్వమును; దుండగము ననుట. ఒనరించి = చేసి ఈమరున్నగమున్ = ఈదేవతరువును, హరించి=దొంగిలించి, వంచనన్ = మోసముతో, చనన్ = పోవుట, తగునె = న్యాయమా? దివిజాగ్రణి=దేవేంద్రుఁడు, దీనిన్ =ఈపారిజాతమును, నిజకాంతకున్ = తనభార్యయగు శచీదేవికి, దక్కుగన్ = స్వాధీనమగునట్లు, ఇచ్చెన్. ఆకుసుమకోమల యాజ్ఞన్ = ఆపూఁబోఁడియాజ్ఞచే, తేఁటిగములు=భ్రమరబృందములు, దీనిచెంగటన్ = ఈవృక్షముసమీపమున, నటింపను=తిరుగుటకును, పువ్వులతావిన్ = పుష్పపరిమళమును, క్రోలఁగన్ =అనుభవించుటకును, భయంబున్ =భీతిని; వెఱపు ననుట. ఒందున్ =పొందును.

విశే. ఈపద్యము కొన్నిప్రతులలోఁ గానవచ్చెడి నని భారతి వ్రాయుచున్నది. కానఁ దదనుసారముగ వ్యాఖ్య వ్రాయఁబడినది.

*క. అట్టిసురతరువు నెఱుఁగక
చుట్టపుమేలమునఁ గొంచు సురిఁగెడుమది నీ
కెట్లు జనియించె మరలం
బెట్టుము బలభేది విన్న మేలే నీకున్. 57

టీ. అట్టి సురతరువున్ = ఆరీతి నున్న కల్పవృక్షమును; అనఁగా దేవేంద్రుఁడు తనభార్య కిచ్చినట్టియు నామెఁయాజ్ఞ చేఁ దేఁటిగుంపులుకూడఁ జేరనరుగనట్టియు ననుట. ఎఱుఁగక=తెలిసికొనక; తెలివిమాలి యనుట. చుట్టము మేలమునన్ = బంధుహాస్యము చే, కొంచున్ = స్వీకరించుచు, సురిఁగెడు=మాయమయ్యెడు, మది=మనస్సు, నీకున్, ఎట్లు = ఏలాగున, జనియించెన్ = పుట్టెను? మరలన్ =తిరుగ, పెట్టుము = స్థాపింపుము.

---

1. నిందులతావిఁ, * ఈపద్యము కొన్నిప్రతులలోఁ గనఁబడదు.

బలభేది=దేవేంద్రుఁడు, విన్నఁ = వినిచో, నీకుఁ, మేలే = మేలా? నీకు మేలు లే దనుట.

ఉ. నా విని సత్యభామ వదనంబున లేనగ వంకురింప నే
మే వచియింపఁ బూనుహృదయేశ్వరునిం గరసంజ్ఞ మాన్చి చ
న్నోవల జాఱుకొంగు సవరించుచు వీడినకోప్పుఁ బల్మఱుం
జే వెడదోఁపుచుం బలికెఁ జెందొవచూపులు క్రేళ్ళుదాఁటఁగన్. 58

టీ. నాఁ=అనఁగా, విని, సత్యభామ, వదనంబునఁ = మోమున, లేనగవు= మందహాసము, అంకురింపఁ =పుట్టఁగా, నేమే =ఏదో యొకదానిని, వచియింపఁ =పల్కఁ టకు, పూను=సిద్ధమైన, హృదయేశ్వరునిఁ = ప్రాణనాథుని; శ్రీకృష్ణుని, కరసంజ్ఞ = హస్తసంజ్ఞచే, మాన్చి=మానునట్లుచేసి; అనఁగా మాటలాడకుండ నొనర్చియనుట. చన్నో వలఁ = స్తనపార్శ్వములందు, జాఱు=సడలునట్టి, కొంగుఁ =చెఱఁగును, సవరించుచుఁ = చక్కఁదిద్దికొంచు, వీడినకోప్పుఁ =వదలినకొప్పును, పల్మఱుఁ =మాటిమాటికి, చేఁ = హస్తముతో, వెడదోఁపుచుఁ =ఇంచుక దిద్దికొనుచు, చెందొవచూపులు=ఎఱ్ఱనిచూపులు, క్రేళ్ళుదాఁటఁగఁ = గంతులువేయుచుండఁగా, పలికెఁ.

విశే. చన్గొంగును సవరించుకొనుటయుం వీడినకొప్పును వెడదోఁపుకొనుటయు బదులు పల్కుటయందలి సంభ్రమము నుద్ధతిని బ్రకటించుచున్నవి. చెందొవచూపులుం. కోపాతిశయసూచకములు. శ్రీకృష్ణుని మాటలాడనీయక తానే యుద్యానపాలకులతోఁ బ్రసంగించుట కుద్యమించుటకతన సత్యదిట్టతనమును గర్వమును బ్రకాశితము లయ్యెను.

సీ. వినుఁడు సురేశ్వరవనపాలకులు! వారిఁ
బొడమినయాదివ్యభూరుహమున
కింద్రాణి యెవ్వతె యింద్రుండు నెవ్వఁడు
తోడియిందిరను గౌస్తుభము నెవ్వఁ
డధిపుఁడై ధరియించె నతఁడె చేకొనుఁగాక
తెకతేర యిది యేమి యొకరిసొమ్మె
యిదె నాదువిభునిచే నీవదాన్యనగంబు
నొడియించుకొని యేఁగుచున్న దానఁ
తే. బలుకు లేటికిఁ దా వీరపత్ని యేని
మీ శచీదేవి తనదుప్రాణేశుఁ డైన

1. నతఁ డిచ్చుఁగొనుఁగాక. 2. తెకతెక.

మఘువు నిటఁ బంపి సత్యభామావిధేయు
వలన మరలంగఁ గొనుటెపో వాసితనము. 59

టీ. సురేశ్వరువనపాలకులు=ఓదేవేంద్రుని యుద్యానమును రక్షించెడువారలార, వినుఁడు=ఆలకింపుఁడు; వార్ధిసముద్రమున, పొడమిన = పుట్టిన, ఈదివ్యభూరుహము నకున్ = ఈసురతరువునకు, ఇంద్రాణి = ఇంద్రునిభార్య శచి, ఎవ్వతె? ఇంద్రుండున్, ఎవ్వఁడు? శచికిఁగాని యింద్రునకుఁగాని యిం దధికార మేమి కలదనుట. తోడియింది రను=ఈకల్పవృక్షముతోడఁబుట్టినలక్ష్మిని, కౌస్తుభమున్ =కౌస్తుభమాణిక్యమును, ఎన్వఁడు= ఏశ్రీకృష్ణుఁడు, అధిపుఁడై=ప్రభువై, స్వామియై, ధరియించెన్ =తాల్చెనో, అతఁడె= ఆశ్రీకృష్ణుఁడే, చేకొనుక కాక=స్వీకరించునుగాక. ఈకల్పకముతోడఁ జన్మించినలక్ష్మిని గౌస్తుభమణి నెవండు స్వామియై గ్రహించె నాతఁడే యీకల్పకమునుగూడఁ జేకొన నర్హుఁడని భావము. తెకతేర=అచ్చముగా, ఇది=ఈకల్పకము, ఒకరిసొమ్మె ఏమి=ఒకరి ధనమా? ఇదె = ఇదిగో, నాదువిభునిచేక = నాస్వామిచేత, ఈవదాన్యనగంబున్ = ఈయాపులవృక్షమును, ఒడియించికొని=హరించికొని, ఏగుచున్నదానన్ =పోవుచున్న దానను, పలుకులు=మాటలు, ఏటికిన్ =ఎందులకు? మాశచీదేవి=మాయింద్రునిభార్యయైన శచీదేవి, తాను, వీరపత్నియేని = వీరుఁడు భర్తగాఁ గలదైనచో, తనదుప్రాణేశుఁడైన= తనప్రాణనాథుఁడైన, మఘవున్ =దేవేంద్రుని, ఇటన్ =ఇచటికి, పంపి=పంపించి, సత్య భామావిధేయువలనన్ = సత్యభామకువిధేయుఁడైన కృష్ణునివలన, మరలంగన్ =తిరుగ, గొనుటె=స్వీకరించుటె, వాసితనము పో=పౌరుషము సుమ్ము.

వ్యా-విశే. నావిభునిచే నేను హరించికొనిపోవుచుంటి ననుటయు, సత్యభామా విధేయుఁడని శ్రీకృష్ణుని తనచేత నున్నవానినిగాఁ బల్కుటయు, సత్యకు మగనిపైఁ గల స్వాతంత్ర్యమును సూచించుచున్న వితక్కుంగలయుక్తులు గర్వాతిశయప్రకాశకములు వినుఁడు సురేశ్వరువనపాలకులు:—ఇచ్చో "మధ్యమపురుషయోగంబునం దారఁగా గమంబు విభాస నగు" అనుపద్ధతి ననుసరించి 'వినుఁడు' అను మధ్యమపురుష క్రియా యోగము వనపాలకు లను సంబుద్ధికిఁ గలుగుటంజేసి వనపాలకు లను సంబుద్ధి కారగా గమంబు గలుగ దయ్యెను. రూ. అ. వినుఁడు వనపాలకులార!

## యుద్ధోద్యోగము

క. అని పలికినగర్వోక్తులు, విని వనపాలకులు చాల విస్మితు లగుచుం
జని చెప్పిరంతయును వా,రనిమిషపతికిం బులోమజాస్వీతునకున్. 60

టీ. అని, పలికిన = ఆడిన, గర్వోక్తులు=గర్వముతోఁగూడిన మాటలు, విని, వన పాలకులు = ఉద్యానరక్షకులు, చాల, విస్మితులు = ఆశ్చర్యమునందినవారు, అగుచున్,

తారు = వారు, చని=పోయి, అంతయున్ =జరిగినదెల్లను, పులోమజానీ్వతునకున్ = శచీదేవితోఁ గూడియున్నవానికి, అనిమిషపతికిన్ =దేవేంద్రునకు, చెప్పిరి.

విశే. సత్యమాటలనుండియె గర్వ ముట్టిపడుచుండుటంబట్టి గర్వము సుప్రకాశితము. ఆఁడుది దిట్టతనము వహించి భయము వీడి యింద్రుని శచిని గూడ సరకు సేయకతమయెదుట నట్లు పల్కినందులకు వా రాశ్చర్యము నొంది రని యెన్నవలయును. పులోమజానీ్వతునిగా నింద్రునిఁ బేరొక్కనుట శచీసమక్షమునఁ బరిభవమునంది సురపతి యతిక్రోధము నందుటకై యని యెన్నఁదగును.

శా. ఆమాట ల్వినిపాకశాసనుఁడు రౌద్రాకారుఁడై పేర్చి యే
మేమీ కృష్ణుఁడు *మందలోబలెనె తానింద్రద్రుమోత్పాటనం
బిమ్మై నిచ్చటఁ జూపవచ్చె నిది మేలే తార్క్ష్యుఁడైనన్మదీ
యామోఘాశనిపాత మిట్టి దని యాహా తెల్పఁడాయెం జుమీ. 61

టీ. ఆమాటలు=ఆసత్యభామ పల్కినట్లుగాఁ జెప్పినపల్కులు, విని పాకశాసనుఁడు=పాకాసురశిక్షకుఁ డగుదేవేంద్రుఁడు; ఇది శూరత్వసూచకము. రౌద్రాకారుఁడై; మూర్తీభవించిన రౌద్రమువలె నున్నవాఁ డనుట. పేర్చి = అతిశయించి, ఏమేమీ—ఏమి+ఏమీ: ఇది పల్కుల నాలకించినపిదప గలసంభ్రమమును సూచించును. కృష్ణుఁడు, మందలోబలెనె = ఆలమందలోవలెనె. తాను, ఇంద్రద్రుమోత్పాటనంబున్ = కల్పవృక్షముయొక్క పెల్లగించుటను; ఇంద్రద్రుమ మన మద్దిచెట్టు గాన నర్జునవృక్షముయొక్క పెల్లగించుట ననియు నర్థాంతరము: ఈమ్మై = ఈవిధముగా, ఇచ్చటన్, చూపన్ = అగపఱచుటకు. వచ్చెన్, ఇది=ఈకృత్యము, మేలే=మంచిదా? తార్క్ష్యుఁడైనన్ =గరుడుఁడైనను, మదీయామోఘాశనిపాతము మదీయ = నాసంబంధమైన, అమోఘ=వ్యర్థముగాని, అశని=వజ్రాయుధముయొక్క, పాతము = దెబ్బ, ఇట్టిది = ఈవిధమైనది, అని, తెల్పఁడాయెన్ చుమీ= తెల్పలేదుసుమ్ము? ఆహా=ఆశ్చర్యము.

భా. శ్రీకృష్ణుఁ డాలమందలో నింద్రద్రుమమును బెల్లగించుటవలె నిందును నింద్రద్రుమోత్పాటనము సేయ నేతెంచెను. ఇది సుకరమా? తనకు మేలు గలుగఁ జేయునా? ఇకార్యమునఁ గొంతవఱకుఁ బొల్గొనిన యాగరుడుఁడేని తనస్వామితో నా వజ్రాయుధపుదెబ్బ యిట్టి దని తెల్పఁడాయెనుగదా? ఆశ్చర్యము.

విశే. నిక్కముగ నివి యిట నింద్రునిగరోక్తు లని యెన్నఁదగును. యమళార్జునభంజనమును శ్రీకృష్ణుఁ డొనర్చెను. అర్జునవృక్షమున కనఁగా మద్దికి సురద్రుమ మనియు నామాంతరము. కాన నింద్రద్రుమోత్పాటనం బనుచో శ్లేషము.

---

* మందలోనబలె.

మ. అని పౌలోమిమొగంబుఁ జూచి వినుమోయబ్జాస్య! నీ కింతమా
త్రన విన్నంబడ నేల పోదు నిదె సత్యాగర్వభారంబు ది
వ్యనగంబు నిర్వడిపించి వత్తు నని సాహంకారుఁడై లేచి చ
య్యన శుద్ధాంతగృహంబు వెల్వడి సుధర్మాస్థానమధ్యస్థుఁడై. 62

టీ. అని, పౌలోమిమొగంబున్ = శచీదేవిమోమును, చూచి, ఓయబ్జాస్య = ఓపద్మముఖీ, వినుము. నీకున్, ఇంతమాత్రన=ఇంతమాత్రముచేతనె, విన్నంబడన్ = వైన్యమునుబొందుట, ఏల=ఎందులకు? ఇదె=ఇదిగో, పోదున్ =వెళ్లెదను , సత్యాగర్వ భారంబున్ = సత్యభానుయొక్క గర్వసంబంధమైనబరువును, దివ్యనగంబున్ = సుర తరువును, విడిపించి=వదలించి, వత్తును=వచ్చెదను. అని, సాహంకారుఁడై = అహంకార ముతోఁ గూడినవాఁడై, లేచి, చయ్యనన్ =శీఘ్రముగా, శుద్ధాంతగృహంబున్ =అంతఃపురమునుండి, వెల్వడి = వెడలివచ్చి, సుధర్మాస్థానమధ్యస్థుఁడై =సుధర్మ యను కొలువు కూటముయొక్కనడుమ నున్నవాఁడై, ముందటి పద్యమునందలి 'పట్టినన్' అనుదాని తోడ నన్వయము.

ఉ. తానఁటె పారిజాతవసుధారుహమున్ గొనిపోవువాఁడు క
న్గానఁడు యాదవుం డనుచుఁ గన్నులు వేయును జేవుఱింప వై
శ్వానరధర్మదైత్యవరవారిధిపానిలయక్షనాయకే
శానులదిక్కు చూచి కులిశంబు కరంబునఁ బూఁచి పట్టినన్. 63

టీ. తానఁటె=తానా? ఇది యింద్రుని యలక్ష్యభావమును సూచించును. పారిజాత వసుధారుహమున్ = పారిజాత భూరుహమును, కొనిపోవువాఁడు=తీసికొని పోవువాఁడు, యాదవుండు = యదువంశోద్భవుఁడు; శ్రీకృష్ణుఁడు, ఇది కులహీన సూచకము. కన్గానఁడు=కన్నఁదెలియనివాఁడు; మదాంధుఁడనుట. అనుచున్, కన్నులు, వేయును=సహస్రమును, జేవుఱింపన్ =ఎఱ్ఱవారఁగా, వైశ్వానర...దిక్కు-వైశ్వానర = అగ్నిదేవుఁడు, యక్షనాయక = కుబేరుఁడు, ఈశాన=ఈశానుఁడు, వీరలయొక్క, దిక్కు=వైపు, చూచి, కులిశంబున్ = వజ్రాయుధమును, కరంబునన్ = హస్తమున, పూఁచి=పూని, పట్టినన్ =ధరింపఁగా, ముందటిపద్యముతో నన్వయము.

విశే. యుద్ధము సేయఁదలంచినవాఁడుగాన నింద్రుఁడాస్థానము జేరి యష్ట దిక్పతుల సమ్మతి నందుట యుచితమె.

ఉ. కోణపరంపరాహతులఁ గూరినవేదననో సమస్తని
ర్మాణభృతిప్రణాశకరు మాధవునిం జెనకంగఁ బోవుగీ
ర్వాణులఁ బోకుఁ డంచు మొఱవై చెనొకో యన మ్రోసెనంత ని
స్వానము పాకశాసనుహజారమునం గదనాభిశంసి యై. 64

టీ. కోణపరంపరాహతులన్ = వాద్యవిశేషములను గొట్టునట్టికఱ్ఱల గుమియొక్క-
దెబ్బలచేతను, కూరిన = పొందిన; వేదననో - వేదన + ఓ = బాధచేతనో, సమస్త..... కరున్ - సమస్త = స్థావరజంగమరూపమైన సర్వపదార్థములయొక్క, నిర్మాణ = సృష్టిని, భృతి = పోషణమును, ప్రణాశ = వినాశమును, కరున్ = చేయువానిని; మాధవునిన్ = శ్రీకృష్ణుని, చెనకంగన్ = తాఁకుటకు; పోవు = ఏఁగునట్టి, గీర్వాణులన్ = దేవతలను, పోకుఁడు = వెళ్లవలదు, అంచున్ = అనుచు, మొఱవై చెనొకో యనన్ = మొఱపెట్టెనో యనునట్లు, అంతన్ = ఆసమయమున, నిస్వానము = భేరి; యుద్ధమున కేఁగుటకుఁ బూర్వము మ్రోగించు జయభేరి యనుట, పాకశాసనుహజారమునన్ = దేవేంద్రుని యింటిముందర, కదనాభిశంసియై = యుద్ధసూచకమై; యుద్ధమును నిందించునదై యనియు నర్థాంతరము. మ్రోసెన్ = శబ్దించెను. అలం. ఉత్ప్రేక్ష.

మ. అపుడాబద్ధఖలీనకాశ్వచయ మై యందూపరిభ్రంశిత
ద్విప మై దివ్యరథాగ్రకేతుపటసంధిత్సామిళత్సూత మై
యపరాభూతభుజావలేపభటవీరాలాప మై జంభవై
రిపురం బంతయు మందరక్షుభితవార్ధింబోలె ఘూర్ణిల్లుచున్. 65

టీ. అపుడు = ఆసమయమున, ఆబద్ధ.....చయమై - ఆబద్ధ = కట్టఁబడిన, ఖలీనక = కళ్లెములుగల, అశ్వచయమై = గుఱ్ఱములగుంపుగలదై, అందూ.....ద్విపమై - అందూ = గొలుసులనుండి, పరిభ్రంశిత = విడువఁబడిన, ద్విపమై = ఏనుఁగులుగలదై, దివ్య.....సూతమై - దివ్యరథాగ్ర = సుందరరథములకొనలందు, కేతుపట = టెక్కెములను, సంధిత్సా = కూర్పవలెనునుకోర్కినో, మిళత్ = చేరిన, సూతమై = సారథులుగలదై, అపరాభూత... ఆలాపమై - అపరాభూత = జయింపఁబడని, భుజావలేప = భుజముల గర్వముగల, భట = యుద్ధభటులయొక్క, వీరాలాపమై = శూరోక్తులు గలదై, జంభవైరిపురంబు అంతయున్ = ఇంద్రుని యమరావతియెల్లను, ఘూర్ణిల్లున్ = ధ్వనించుచు, మందరక్షుభిత వార్ధిన్ = మందరపర్వతము చేఁ గలఁతనందింపఁబడిన సముద్రమును, పోలెన్ = అనుకరించెను. అలం. ఉపమ.

ఉ. నీయనుజన్ముఁడన్నఖుఁడ నీకని యింటికి వచ్చి జంభవై
రేయవిరోధిచే నపుడు తేజము లన్నియుఁ గాంచి చేసె న

న్యాయము పారిజాతహరణంబునఁ గృష్ణుఁడు మంచిచుట్ట మా
రా యని పల్కఁగా జనపరంపరచే విని రెల్లవారలున్. 66

టీ. నీయనుజన్ముఁడక్ =నీతమ్ముఁడను, సఖుఁడక్ = మిత్రుఁడను, నీకుక్ + అని= నీకొఱకై యని, ఇంటికిక్ =గృహమునకు, వచ్చి, జంభద్విట్ తేయవిరోధిచేక్ =జంభవైరి యగు నింద్రునిచే, అపుడు = ఆవచ్చినసమయమున, తేజములు = ప్రాభవములు, అన్నియుక్ =ఎల్లయును, కాంచి=పొంది. (అనఁగా నింద్రకృతములగు మర్యాదల నెల్ల పొంది యనుట.) కృష్ణుఁడు, పారిజాతహరణంబునక్ = కల్పవృక్షహరణముచే, అన్యాయము=అధర్మమును, చేసెక్ = ఒనర్చెను. ఓరా = ఆశ్చర్యము, మంచి చుట్టమక్ = మేలైనబంధువే, అని, పల్కఁగాక్, జనపరంపరచేక్ =జనసమూహముచే, ఎల్లవారలుక్, వినిరి.

వ. అత్తఱిం దత్తఱింబునం దత్తడులం బల్లింపకయ నెప్పరంబున నెక్కం
బోవువారును, గృష్ణుండు కృష్ణుం డని పొనఃపున్యంబుగాఁ బలుకుచు
నేమేమి యొక్కఁడెక్కఁడ నని యడుగువారికిఁ దెలివిపడ నుడువం
బడవు లేక పారిజాతంబు పారిజాతం బని పలుకుచు రణసంభ్రమంబునం
బరిభ్రమించువారును, గణయకంపణముసలముద్గరపరిఘపరశ్వథంబు
లనియెడు బహువిధప్రహరణాహరణవిపర్యాసంబున శస్త్రశాలాంత
రంబునం గలహించువారును, మరుదధిప మలినపథ మహిషరథ
మాంసాశన మకరాకరేశ మాతరిశ్వ మనుష్యధర్మ మహేశ్వరులకు
మానవుం డీ డగునే యని యసువారును, గత్తి లంకించువారును, రిత్త
జంకించువారును, సంగడీల్పం జీరువారును, సంగరభీరులం గేరువారును,
వాహనంబులం దఱుమువారును, సాహసంబుల నఱుమువారును నై
వీరావేశంబున రాజద్వారంబునం దొట్టి రయ్యవసరంబున. 67

వ. అత్తఱిక్ =ఆసమయమున, తత్తఱింబునక్ =సంభ్రమముతో, తత్తడులక్ = గుఱ్ఱములను, పల్లింపకయ=జీనుకట్టకుండనే, నెప్పరంబునక్ =శీఘ్రముగ, ఎక్కక్ = అధిరోహించుటకు, పోవువారును = వెడలువారును, కృష్ణుండు, కృష్ణుండు + అని, పొనఃపున్యంబుగాక్ =దిరుగఁ దిరుగ నగునట్లు, పలుకుచుక్, ఏమేమి? ఎక్కడ? ఎక్కడ? ఎక్కడ? నేమి జరిగె ననుట. అని, అడుగువారికిక్, తెలివిపడక్ = తెలియునట్లు, నుడువక్ =చెప్పుటకు, తడవు=అవకాశము, లేక, పారిజాతంబు, పారిజాతంబు, అని, పలుకుచుక్, రణసంభ్రమంబునక్ =యుద్ధపుఁద్వరచేఁ పరిభ్రమించువారును = తిరుగువారును, కణయ... పరశ్వథంబులు-కణయ = కుంతవిశేషము, కంపణ=ప్రహరణవిశేషము, ముసల = రోఁకలి,

ముద్గర=ఇనుపగుదియ, పరిఘ = ఇనుపకట్లగుదియ, పరశ్వధంబులు = గండ్రగొడ్డలి, అనియెడు=అనునట్టి, బహువిధ.....విపర్యాసంబునన్ - బహువిధ = అనేకవిధములైన, ప్రహరణ=ఆయుధములయొక్క, ఆహరణ = తీసికొనుటయందలి, విపర్యాసంబునన్ = తారుమారుచే (వ్యత్యాసముచేతనుట అనంగా నొకరు గ్రహింపవలసినదాని నొండొకరు గ్రహించుటచే నని భావము.) శస్త్రశాలాంతరంబునన్ = ఆయుధగృహమధ్యమున, కలహించువారును, మరుదధిప.....మహేశ్వరులన్ -మరుదధిప=దేవేంద్రుడు, మలిన పక్ష=కృష్ణవర్ణ - అగ్ని, మహిషరథ=ఎనుపోతు రథముగాఁ గల యముఁడు, మాంసాశన= మాంసము భోజనముగాఁ గల నిర్ఋతి, మకరాకరేశ=సముద్రాధిపతి యగు వరుణుఁడు, మాతరిశ్వ=వాయువు, మనుష్యధర్మ=కుబేరుఁడు, మహేశ్వర = ఈశానుఁడు, వీరలకు, మానవుండు=మనుష్యుఁడు, ఈఁడు=సాటి, అగునే,అని యనువారును, దిక్పతులను మకారాదిపదములతో వ్యవహరించుట సరసము. కత్తులు = ఖడ్గములను, అంకించువారును = జళిపించువారును, రిత్త=వట్టి, జంకించువారును=భయపెట్టువారును, సంగడీలన్ =మిత్రులను, చీరువారును=పిలుచువారును, సంగరభీరులన్ = యుద్ధమునకు భయపడువారలను, కేరువారును=తిరస్కరించువారును, వాహనంబులన్ =గుఱ్ఱములు మొదలైనతామెక్కినవానిని, తఱుమువారును = త్వరగాఁ దోలువారును, సాహసంబులన్ = తెంపరితన ములచేత, అఱుముచువారును = విజృంభించువారును, ఐ, వీరావేశంబునన్ = వీరుల యావేశముతో, రాజద్వారంబునన్ = రాజగృహద్వారదేశమున, తొట్టిరి = కూడిరి, అయ్యవసరంబునన్.

విశే. ఇందు యోధులచర్యలు సహజముగ వర్ణితములు.

ఇది మొదలుకొని డెబ్బది రెండవపద్యమువఱకు నమంగళసూచకము లగు కొన్ని కృత్యములు వర్ణితములు.

తే. గలితశృంఖల లయ్యు న కాలనిద్ర
గనుఁగవలఁ గ్రాలఁ దమయంతఁ గదలవయ్యె
దారుణాధోరణప్రయత్నమునఁ గాని
నముచిమథనునివీట శుండాలఘటలు. 68

టీ. నముచిమథనునివీటన్ =నముచిశాసకుఁడగు దేవేంద్రునినగరమున, శుండాలఘటలు=ఏనుఁగుల గుంపులు, గలితశృంఖలలు=జార్వఁబడిన గొలుసులు గలవి, అయ్యున్ = అయినను, అకాలనిద్ర=కాలముగాని కాలమున గల్గినని ద్ర, కనుఁగవలన్ =నేత్రద్వంద్వములందు,క్రాలన్ =ప్రకాశింపఁగా,దారుణ...ప్రయత్నమునన్ + కాని-దారుణ=క్రూర

మైన, ఆఘోరణ = మాపటివానియొక్క, ప్రయత్నమునక్ కాని=యత్నముచేతఁగాని; అనఁగా మావటిఁ డంకుశముచేఁ గఠినముగఁ బొడిచి బాధింప కున్న నమట. తమ యంతక్ = స్వయముగా, కదలవయ్యెక్.

క. పొరిఁబొరి నెగయుచు మ్రొగ్గుచు
ధరణీస్థలిఁ బొరలఁబడుచుఁ దలకొని శిక్షం
బొరసిన వయ్యు హయంబులు
భరియింపవు కొంతతడవు పల్యాణంబుల్. 69

టీ. పొరిఁబొరిక్ =మాటిమాటికి, ఎగయుచుక్ = ఎగురుచు, మ్రొగ్గుచుక్ = వ్రాలుచు, ధరణీస్థలిక్, పొరలక్ + పడుచుక్ =తలక్రిందుగా దొర్లుచు, తలకొని=పూని, శిక్షక్ =దండనమును, పొరసినవి=పొందినవి, అయ్యుక్ = అయినను; అనఁగాఁ గ్రమశిక్ష నితఃపూర్వము పొందినవైన ననుట. హయంబులు=గుఱ్ఱములు, కొంతతడవు=కొంత సేపు, పల్యాణంబుల్ = జీనులను, భరియింపవు = ధరింపవు.

ఉ. డాసి పురోహరిన్మణివిటంకమునం దనమేనినీడ ను
ల్లాసమదృష్టిఁ జూచి కినుకం బ్రతివీరుఁడ యంచు వ్రేసి బా
హాసి విభిన్నమై పడఁ దదర్థముఁ జేకొని వచ్చుఁ గల్పవృ
క్షాసవపానమత్తుఁ డమృతాంధసుఁ డొక్కఁడు జన్యకేలికిన్. 70

టీ.కల్పవృక్షాసవపానమత్తుఁడు=కల్పవృక్షసంబంధమైన మద్యముయొక్కత్రావు టచే మదించినవాఁడగు,ఒక్కఁడు,అమృతాంధసుఁడు=అమృతమే యాహారముగాఁ గల యసురుఁడు, డాసి=సమీపించి, పురో.....విటంకమునక్ -పురఃకి=ఎదుట నున్న, హరి న్మణి=ఇంద్రనీలమణిబద్ధమైన, విటంకమునక్ = గువ్వగూడునందు, తనమేనినీడక్ =తన శరీరముయొక్క ప్రతిబింబమును, ఉల్లాసమదృష్టిక్ =కోఅవితోసమానమైనచూపుతో; అనఁగాఁ గోపారుణమైనచూపుతో ననుట. చూచి, కినుకక్ = కోపముతో, ప్రతి వీరుఁడ=తన్నెదిరించుశూరుఁడె, అంచుక్, వ్రేసి=కొట్టి, బాహాసి = చేతఁగలకత్తి, విభి న్నమై=ముక్కలైనదై, పడక్ = జాఱఁగా, తదర్థముక్ = ఆకత్తియొక్క సంగోరు ముక్కను, చేకొని=స్వీకరించి, జ్యనకేళికిక్ = యుద్ధక్రీడకు, వచ్చెక్ =ఏతెంచెను.

భా. ఒకయమరుఁడు కల్పవృక్షమద్యముచే మదించి యెదుట నున్న యింద్రనీల విటంకమునఁ బ్రతిఫలించిన తనప్రతిబింబముఁ గాంచి త న్నెదిరించు ప్రతివీరుఁ డని బ్రమసి చేత నున్నకత్తితోఁ గొట్టి యాకత్తి యక్కతన రెండుముక్కలుగాఁగ నద్దాని సంగోరు ముక్కను జేఁబూని యుద్ధమున కేతెంచె నని భావము.

విశే. ఇం దుత్సాహము లెస్సగ సూచితము. మఱియుఁ గత్తి ముక్క లగుట యుద్ధాపజయరూపావశకున సూచకము. అలం. భ్రాంతిమంతము.

తే. కారణము లేక యూరకె నారి దెగిన
విడిచిపెట్టక రణరసావేశ మొదవఁ
బట్టి కోదండదండంబు పరిఘు గాఁగ
విసరుచును వచ్చె వేఱొండు వేల్పుజోదు. 71

టీ. వేఱొండు=మఱియొక, వేల్పుజోదు = సురయోధుఁడు, కారణము లేక= హేతువు లేకయే, ఊరకె, నారి=అల్లెత్రాడు, తెగినన్ =భిన్నమైనను, విడిచిపెట్టక=పరిత్యజింపక, రణరసావేశము=జన్యోత్సాహము, ఒదవన్ =పుట్టఁగా, కోదండదండంబున్ = ధనుర్దండమును, పట్టి = పూని, పరిఘు గాఁగన్ = గుదియ యగునట్లుగా, విసరుచున్ = చిమ్ముచు, వచ్చెన్ = ఏతెంచెను.

భా. కారణములేకయె యల్లెత్రాడు తెగఁగా నొకవేల్పుజోదు కోదండదండమునే గదవలెఁ జేఁబూని విసరుచు జన్యమునకు వచ్చె నని భావము.

వ్యా-విశే. కారణములేకయె నారి తెగుట యవశకున సూచకము. జోదు;యోధ శబ్దభవము.

క. గొనయంబు [1]నెక్కఁ ద్రొచిన
గనయంబున కెక్కకున్నఁ గ్రమ్మినతమకం
బున విల్లు విడిచి వేఱొక
యనిమిషభటుఁ డనికి వెడలె నడిదముఁ గొనుచున్. 72

టీ. గొనయంబున్ =అల్లెత్రాటిని; నారి ననుట. ఎక్కన్ =మోఁది కెగయునట్లు, త్రొచినన్ =త్రోసినను, గనయంబునకున్ = వింటికొప్పునకు, ఎక్కకున్నన్ =ఎక్కక పోఁగా, క్రమ్మిన=మూఁగిన, తమకంబునన్ =త్వరచే, విల్లున్ =ధనువును, విడిచి, వేఱొక యనిమిషభటుఁడు=మఱియొకసురభటుఁడు, అడిదమున్ =కత్తిని, కొనుచున్ = స్వీకరించుచు, అనికిన్ = యుద్ధమునకు, వెడలెన్ = బయలుదేఱెను.

వ్యా-విశే. గొనయము గనయమున కెక్కకుంట యవశకునము. గొనయము ప్ర. గుణము.

ఉ. పట్టఁదలంచెనేని కరపద్మయుగంబు వశంబు గాక లో
బుట్టినబాష్పగద్గదికఁ బోకు మనం బలు కెత్తలేక పై

---

1. నెంతఁ...నెక్కకున్నఁ.

జుట్టిన నెయ్యపుంబదనుచూపులచే సతి వెంట నంటి త
న్నట్టుగఁబట్టుగా నొకసుపర్వుఁడు వచ్చె రణాభిలాషి యై. 73

టీ. ఒకసుపర్వుఁడు=ఒకయమరుఁడు, పట్టక =పట్టుకొనుటకు, తలంచె నేని = ఉద్దేశించినను, కరపద్మయుగంబు=తామరలఁబోలు చేదోయ్, వశంబు = స్వాధీనము, కాక = కామి; అనఁగా నమరకాంత చేతులతోఁ దన ప్రియునిఁబట్టి పోకుండ నిర్బంధించుటకు నామెచేతు లామెకు స్వాధీనము గా వయ్యె ననుట. లోక =లోపలను, పుట్టి, బాష్పగద్గదికక =కన్నీటిచేసైన డగ్గుత్తిక చే, పోకుము = వెడలకుము, అనక =అనుటకు, పలుకెత్తలేక=మాట బైటికి వెడలఁజేయఁజాలక; అనఁగాఁ గన్నీటియలజడిం గలిగిన డగ్గుత్తిక చేఁ బోపల దని యనఁజాలక యనుట. పైక =వెలుపల, చుట్టిన=అల్లుకొనిన, పదనుచూపుల చేక =వాఁడిచూపులతోడ, సతి = భార్య, వెంటక = వెంబడిని, అంటి=తవిలి, తక = తన్ను, పట్టుగక + పట్టుగాక =అత్యంతము పట్టుకొనఁగా; ద్విరుక్తిసంభ్రమసూచకము. రణాభిలాషి యై = యుద్ధకాంక్షి యై, వచ్చెక.

విశే. యుద్ధమున కేఁగునపుడు వనిత వల దని యడ్డుపడుట యవశకునము. "పదపద్మయుగంబు" అని పాఠము కొన్నిప్రతులలోఁ గాననగును. అపుడు నాయికకు నాయకునిఁ బట్టుగాఁ గాళ్లు రా వయ్యెనని యెన్నవలెను. గ్రహణవిషయముగానఁ జేతులు రావయ్యె ననుటయే యుచిత మని యెంచి కరపాఠమే వ్యాఖ్యాత మయ్యె.

క. సురవీరుఁ డొకఁడు సతిచే
దురమునకు ననుజ్ఞ వేఁడి తొల్లిటియలుకం
జిరకాలదుర్లభం బగు
పరిరంభము గాంచి వెడలెఁ బ్రమదం బెసఁగన్. 74

టీ. ఒకఁడు సురవీరుఁడు, సతిచేక =భార్య చేతను, దురమునకుక =యుద్ధమునకు, అనుజ్ఞక =ఆజ్ఞను, వేఁడి=కోరి, తొల్లిటియలుకక = పూర్వపు బ్రణయకలహము చే, చిరకాలదుర్లభంబు + అగు = చాలకాలము లభింపనట్టి, పరిరంభముక = ఆలింగనమును, కాంచి = పొంది, ప్రమదంబు = సంతోషము, ఎసఁగక = ఒప్పఁగా, వెడలెక = బయలుదేఱెను.

విశే. యుద్ధమున కేఁగునపుడు భార్య నాలింగన మొసర్చుటయు నవశకునముగా నెన్నవలయును.

చ. నను నని సేయఁ బంపు ఖగనాథునిసోఁగపసిండితొక్కలు
క్కునఁ గొని కర్ణపూరమునకు ప్రభసంబునఁ దెత్తు నేను నీ

కని తన కడ్డమై నిలుచునచ్చరతో య్యలి నూఱడించి పో
రున కరుదెంచె వేల్పుఁగొమరుం డొకరుండురుదండహస్తుఁ డై. 75

టీ. వేల్పుఁగొమరుండు ఒకరుండు=ఒకదేవయువకుఁడు, నన్నున్ =నన్నును, అని=యుద్ధము, చేయన్ =చేయుటకు, పంపుము=అనుపుము. ఖగనాథునిసోఁగపసిండిఱెక్కలు=గరుడునినిడుద లగు బంగరుఱెక్కలను, ఊకున్ = బలముచే, కొని = స్వీకరించి, కర్ణపూరమునకున్ =కర్ణాభరణమునకై, రభసంబునన్ = శీఘ్రముగ, తెత్తును, నేను, నీకున్, అని, తనకున్, అడ్డమై, నిలుచు=నిల్చినట్టి, అచ్చరతోయ్యలిన్ = అప్సరసను, ఊఱడించి = ఆశ్వాసించి; ఓదార్చి యనుట. ఉరుదండహస్తుఁ డై = గొప్పదండము హస్తమునందుఁ గలవాఁ డై, పోరునకున్ =యుద్ధమునకు, అరుదెంచెన్ =వచ్చెను.

భా. ఒకయప్సరస తనమగసిని యుద్ధమునకుఁ బోవల దని యడ్డమై నిల్వ నా యమరుఁడు నీకుఁ గర్ణాభరణముగ గరుడునిబంగరుఱెక్కలం గొని శీఘ్రమ వత్తు నని యోదార్చి గదం దాల్చి యుద్ధమున కేఁగె నని భావము.

విశే. భార్య యుద్ధమున కేఁగుమగని వల దని యడ్డమై నిల్చుట యవశకునము. గరుడుఁడు స్వర్ణపక్షుఁడు గాన బంగరుఱెక్క లనుటయు వానిని కర్ణపూరములుగా నుపయోగింప నర్హతను జూపుటయు సముచితంబ.

ఉ. మానసవేగరథ్యమును మాతలిసారథికంబు నగ్రసం
దానితనీలనీరదపతాకము నైనరథంబుపై శచీ
జాని పులోమవృత్ర బలజంభశర[1] ప్రవిఘాతకారణం
బైనతనుత్రమున్ దొడిగె నాహవదోహలమానసంబునన్. 76

టీ. మానసవేగరథ్యమును = మనోవేగమువంటి వేగము గల గుఱ్ఱములు గలదియును, మాతలిసారథికంబున్ =మాతలిని సారథిగాఁ గలదియు, అగ్ర.....పతాకమున్ - అగ్ర=శిఖరములందు, సందానిత=కూర్పఁబడిన, నీలనీరద=నల్లమబ్బనెడు, పతాకమున్ = ఱెక్కము గలదియును, ఐన=అయినట్టి, రథంబుపైన్ = రథమునుమీఁద, శచీజాని=శచి భార్యగాఁ గలయింద్రుఁడు, పులోమ.....కారణంబు-పులోమవృత్ర బలజంభ=పులోముఁడు, వృత్రాసురుఁడు, బలాసురుఁడు, జంభుఁడు అనువారలయొక్క, శర = బాణముల యొక్క, ప్రవిఘాత=నాశమునకు, కారణంబు=హేతువు, ఐన, తనుత్రమున్ = కవచమును, ఆహవదోహలమానసంబునన్ =యుద్ధమందుఁ గోరిక గలమదితో, తొడిగెన్ = ధరించెను.

---

1. డొకఁడుద్ధురఖడ్గహస్తుఁ డై. 2. ప్రతిఘాతకారణం.

వ్యా-విశే. బహువ్రీహిని జాయాశబ్దమునకు నిజ్ వచ్చునుగాన "శచీజానిఁ" అని రూపమేర్పడెను. ఇట్లే "భూజానిఁ, సీతాజానిఁ" అనునవి యేర్పడును. తనుత్రము= శరీరమును రక్షించునది. రూ. తనుత్రాణము.

సీ. గతి ప్రుచ్చిలఁగ వేచుగాలిఁ ద్రావఁగఁ బొము
నిడినకైవడిఁ గాలికడియ మమర
నల దేవమణికిఁ గావలి యిడ్డప్రహారి నా
గళమున ఘంటికావళులు మెఱియఁ
బన్నగాశికి *నెదుర్పడ వెండితొక్కలు
ధరియించె ననఁగఁ బక్కర సెలంగఁ
బారిజాతాహృతిప్రభవరోష మనంగ
గతిరోధజనితఘూత్కృతులు నిగుడ

తే. ఖురముఖక్షుణ్ణకాంచనక్ష్మోణిరజము
పర్వి సంధ్యారుణేందుబింబంబుఁ బోల
వాహకోత్తముఁ డైనరేవంతుఁ డమర
వల్లభునిమ్రోల నుచ్చైశ్శ్రవంబు నిలిపె. 77

టీ. ఇం దింద్రవాహన మగు నుచ్చైశ్శ్రవము వర్ణితము - గతిక్=గమనమును, ప్రుచ్చిలఁగక్=దొంగిలించుటకై, వేచు=కనిపెట్టుకొనియున్న, గాలిక్=వాయువును, త్రావఁగక్=త్రాగుటకై, పాముక్=సర్పమును, ఇడినకైవడిక్=ఉంచినరీతిగ, కాలికడియము=కాలియందె, అమరక్=ఒప్పుచుండఁగా; ఉచ్చైశ్శ్రవము గాలి నతిక్రమించిన వేగము గలది కాన గాలి దీనిగమనమునకు రోసి యాగతివేగమును దొంగిలింపఁ గను పెట్టుకొనియుండు నసియు, నట్లు గాలి దీనిగతిని దొంగిలింపకుండ వాయుభక్షక మగు సర్పమును నిల్పిరో యనునట్లు కాలియందె యున్న దని భావము. సర్పము వాయువును భుజించి నశింపఁజేయుఁ గాన గాలిబాధ యాగుటమునకుఁ గలుగదసి యాశయము. దీన నింద్రుని గుఱ్ఱము వాయువేగమును మీఱిన గతివేగము గల దని ధ్వనిత మయ్యెను. అల దేవమణికిక్=అగుఱ్ఱపు మెడమీఁద నుండు దేవమణి యనునామము గల మంగళప్రద మగు సుడికి, కావలి=కాపు, ఇడ్డ=పెట్టిన, ప్రహరి నాక్=ప్రాకారమో యనునట్లు, గళమునక్=కంఠమున, ఘంటికావళులు=ఘంటలపంక్తులు, మెఱియక్=ప్రకాశించుచుండఁగా; అయ్యుచ్చైశ్శ్రవంబు మెడపై నున్న దేవమణి శుభప్రద మగుసుడిని గాపాడఁ బెట్టిన

* నెదుర్పడి పైఁడితొక్కలు...పక్కరులసెలఁగ; నెదుర్పడ వేఁడితొక్కలు.

ప్రాకారమో యనునట్లు మెడను ఘంటలపలయములు మెఱయుచున్న పని భావము. మెడను సుడియుండుట యుత్తమాశ్వలక్షణ మని యశ్వశాస్త్రము. పన్నగాశికిన్ = గరుడునకు, ఎదుర్పడన్ =ప్రతిఘటించుటకు, వెండిఱెక్కలు=రౌప్యపక్షములను, ధరియించెన్,అనఁగన్ =అనునట్లుగా, పక్కర=మీఁద నున్నవ్రేలాడునంగీ, చెలంగన్ =ఒప్పఁగా; గరుడుఁడు సువర్ణపక్షుఁడు. సువర్ణపక్షునితోఁ బ్రతిఘటింపఁ దాఁ దలంచినది గానఁ దత్సామ్యమునకై తాను వెండిఱెక్కల సవరించెనో యనునట్లంగీ యమరెనని భావము. పారిజాతా...రోషము-పారిజాత=కల్పవృక్షముయొక్క, ఆహృతి = ఆహరణముచే, ప్రభవ=పుట్టిన, రోషము=కోపము, అనంగన్ =అనునట్లు, గతిరోధజనితభూతకృతులు= గమననిరోధముచేఁ బుట్టిన భూతాకారములు, నిగుడన్ =వ్యాపించుచుండఁగా; గమన నిరోధముచేఁ బుట్టిన భూతాకారములు కల్పకాహరణముచే నైనకోపము నా నొప్పె నని భావము. ఖుర...రజము-ఖుర=డెక్కలయొక్క, ముఖ=అగ్రములచే, క్షుణ్ణ=నలఁగిన, కాంచనక్ష్మోణి=బంగరు నేలయొక్క, రజము=పరాగము; పర్వి=వ్యాపించి, సంధ్యారుణేందుబింబంబున్ =సంధ్యాసమయమున నెఱ్ఱనైనచంద్రబింబమును, పోలన్ =అనుకరింపఁగా; ఊచ్చైశ్శ్రవము తెల్లనిది గానఁ జంద్రునివలె నున్న దనియుఁ, ప్రకృతము దేవభూమి యగు బంగరుకొండయందు డెక్కలతాఁకున రేఁగినపరాగము మెయిని గ్రమ్ముటంజేసి సంధ్యారుణ చంద్రబింబముం బోలియున్న దనియుఁ దాత్పర్యము. వాహకోత్తముఁడైన= శ్రేష్ఠుఁడైన గుఱ్ఱపురౌతగు, రేవంతుఁడు= రేవంతుఁడనువాఁడు,అమరన్ =ఒప్పునట్లుగా, వల్లభునిమ్రోలన్ =విభుఁ డగు నింద్రునెదుట, ఊచ్చైశ్శ్రవంబున్, నిలిపెన్ =నిలువఁబెట్టెను.

అలం. సీసపాదముల నుత్ప్రేక్షలు. గీతపాదమున నుపమ.

శా. చండస్థూలరదద్వయద్వయమహాస్తంభంబులం బూని యు
ద్దండస్ఫారపతాకికాసహితమై దానచ్ఛటాచిత్రవ
ద్గండాభోగవిశాలకుడ్యములచేఁ *గన్పట్టునద్దేవతా
శుండాలం బరుదెంచె సంగరరమాశుద్ధాంతసౌధం బనన్. 78

టి. చండ...స్తంభంబులన్ -చండ=తీక్ష్ణములైన; అనఁగా వాఁడియైన యనుట. స్థూల=బలసిన, రదద్వయద్వయ = నాలుగుదంతము లనెడు, మహాస్తంభంబులన్ =గొప్ప స్తంభములను, పూని=ధరించి, ఉద్దండ.....సహితమై-ఉద్దండ = భయంకరమైన, స్ఫార=విస్తారమైన, పతాకికా=టెక్కములతో, సహితమై=కూడినదై, దాన...కుడ్యములచేన్ -దానచ్ఛటా = మదజలములచేత, చిత్రవత్ = చిత్రమైనవర్ణముగల, గండాభోగ=చెక్కిళుల వైశాల్య మనెడు, విశాలకుడ్యములచేన్ =విశాలము లగు గోడలచేతను,

---

* గన్పట్టియద్దేవతా.

కన్పట్టు=చూపట్టునట్టి, అద్దేవతాశుండాలంబు = ఆసురగజ మగు ఐరావతము, సంగర రమాశుద్ధాంతసౌధంబు = యుద్ధలక్ష్మియొక్క యంతఃపురపు మేడ, అనక = అనునట్లుగా, అరుదెంచెక = వచ్చెను.

విశే. దంతము లను స్తంభములు, పతాకలు, దానచ్ఛటాచిత్రితగండము లనెడు కుడ్యములు గల్గియుండుటంజేసి, యైరావతము రణలక్ష్మిశుద్ధాంతసౌధమువలె నున్న దని యొన్నవలయును. ఐరావతము నాలుగుదంతములు గల దనుట సుప్రసిద్ధము. అలం. రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

ఉ. ఏడుకరంబుల న్వరుస నెత్తినతోమరశక్తిచాపశ
స్త్రీడమరుస్రువవ్యజనదివ్యమహాస్త్రసాధనంబు లా
మ్రేడితకాంతితో నిజశరీరరుచిం బచరింప వచ్చె న
య్యేడికరాచతత్తడిపయిక హుతవాహుఁడుదగ్రమూర్తియై. 79

టీ. హుతవాహుఁడు = హవ్యవాహనుఁ డగు నగ్ని, ఏడుకరంబులక = ఏడు చేతులచేతను, వరుసక = క్రమముగా, ఎత్తిన, తోమర...సాధనంబు-తోమర, శక్తి, చాపము, శస్త్రి, డమరు, స్రువము, వ్యజనము లను, దివ్య=దేవసంబంధములైన, సాధనం బులు=ఆయుధములు, ఆమ్రేడితకాంతితోక = కెట్టిపైన తేజస్సుతో, నిజశరీర రుచిక = తనశరీరకాంతిని, పచరింపక = చేయఁగా, అయ్యేడికరాచతత్తడిపయిక = ఆ శ్రేష్ఠ మగు మేఁక యనెడు గుఱ్ఱముమీఁదను, ఉదగ్రమూర్తి యై = భయంకర మగు నాకృతి గలవాఁడై, వచ్చెక.

వ్యా-విశే. అగ్ని యేడుచేతులు గలవాఁడనుటయు, మేషవాహనుఁ డనుటయుఁ బ్రసిద్ధము. సమాసమున రాజుశబ్దములోని జుకారము చకారముగా మారును. "ఏడిక రాచతత్తడిపయిక" అలం. స్వభావోక్తి,

శా. బాహాసంభృతకాలదండజనితస్ఫారస్ఫులింగాలికి
న్సాహాయ్యంబు ఘటించి కోపరసఘూర్ణన్నేత్రదీప్తు ల్పయో
వాహాంతర్గతవైద్యుతప్రభల లేవం జోప వాహద్విష
ద్వ్యాహోత్తంసము నెక్కి పోరి కడరె న్వైవస్వతుం డుగ్రతిన్. 80

టీ. వైవస్వతుఁడు = యముఁడు, బాహా...స్ఫులింగాలికిక - బాహా=భుజము లందు, సంభృత=భరింపఁబడిన, కాలదండ = యమదండమునుండి, జనిత=పుట్టిన, స్ఫార= విస్తారమైన, స్ఫులింగ=మిణుఁగురులయొక్క, ఆలికిక =పంక్తికి, కోప...దీప్తుల్-కోప

రస=క్రోధరసము చే, ఘూర్ణత్=మిగులఁ దిరుగుడుపడుచుండు, నేత్ర=కన్నులయొక్క, దీప్తుల్ = కాంతులు, సాహాయ్యంబుల్ = సహాయమును; అనఁగాఁ దోడ్పాటు ననుట. ఘటించి = కూర్చి, పయో...ప్రభలల్ - పయోవాహ = మేఘమునందు, అంతర్గత= అడఁగియున్న, వైద్యుత=మెఱుపుసంబంధమైన, ప్రభలల్ =కాంతులను, లేవల్ చోపల్ = లేపనెత్తఁగా, వాహద్విషత్ ...త్తంసముల్ -వాహద్విషత్ =ఎనుపోతసెడు, వాహో త్తంసముల్ =వాహనశ్రేష్ఠమును, ఎక్కి=అధిష్ఠించి, ఉద్ధతిల్ =గర్వముతో, పోరికిల్ = యుద్ధమునకు, అడరెల్ =విజృంభించెను.

విశే. ఇందు మూఁడవపాదమున "లేవంజోపల్" అనుదానికి బదులుగ "తేవం జూపల్" అనుపాఠము గానంబడియెడి. కోపఘూర్ణితనేత్రకాంతులు మేఘలీనవిద్యు త్కాంతులను లేపనెత్తె ననుటకన్న యసితుండై వార్షికమేఘమువడువున నొప్పయను నందుఁ జూపట్టు నరుణదీధితులు మేఘాంతర్గతవిద్యుత్ప్రభలతేపనే యనఁగా దీవినే చూపిన వనుట యుక్త మని తోఁచెడుఁ గాన "తేవంజూపల్" అనుపాఠమే సరస మని తోఁచెడు.

వ్యా-విశే. వాహద్విషత్-అశ్వశత్రువు = మహిషము, వైద్యుత్ =విద్యుత్సం బంధమైనది. అత్. అలం. స్వభావోక్తి. ఉపమ గమ్యము.

శా. భీమాకారులు కామరూపధరు లాభీలక్రియా *పాదనో
ద్దామ ల్పుణ్యజను ల్భజింపఁ గుముద స్తంబేరమం బగ్రతో
భూమిం బల్లన గట్టి రా నసిరుచిస్ఫూర్తు ల్విజృంభింప సం
గ్రామేచ్ఛం బలలాశి యేఁగె మనుజస్కంధాంతరారూఢుఁ డై. 81

టీ. పలలాశి=మాంసాశి యగునిర్ఋతి, భీమాకారులు=భయంకర మైన రూపములు గలవారు, కామరూపధరులు = ఇచ్చవచ్చినయాకృతుల ధరింపఁజాలువారు, ఆభీల క్రియాపాదనోద్దాముల్ -ఆభీలక్రియా = భయంకరవ్యాపారమును; అనఁగా యుద్ధ వ్యాపారము ననుట. ఆపాదన=చేయుటయందు, ఉద్దాముల్ =అధికులు, పుణ్యాజనులు= రాక్షసులు, భజింపల్ = సేవింపఁగా, కుముదస్తంబేరమంబు=కుముద మను పేరుగలవాని యేనుఁగు, అగ్రతోభూమిల్ = ఎదుట, పల్లవ=డీను, కట్టి, రాల్ =రాఁగా, అసిరుచి స్ఫూర్తుల్ = కత్తిమెఱుంగులవిశ్వాసములు, విజృంభింపల్ = అతిశయింపఁగా, మనుజ స్కంధాంతరారూఢుఁ డై =మనుష్యనిమూఁపునడుమఁ గూర్చున్నవాఁ డై, సంగ్రా మేచ్ఛల్ = యుద్ధకాంక్షతో, ఏఁగెల్ = వెడలెను.

* పారగోద్దాముల్.

విశే. "ఆభీలక్రియాపాదన" అనుచో "ఆభీలక్రియాపారగ" యనుపాఠ మగపడెడు. అపుడు యుద్ధవ్యాపారపారమునందినవా రని యర్థము చెప్పవలెను. పుణ్యజనుఁడు=రాక్షసుఁడు. "యాతుధానాః పుణ్యజనాః" అని యమరము. నిర్ఋతియేనుఁగు కుముదము. క్రమముగాఁ బ్రాగాద్యష్టదిశలం దుండుగజములు "ఐరావతాః పుండరీకో వామనాః కుముదోఽంజనాః. పుష్పదంత స్సార్వభౌమ స్సుప్రతీకశ్చ దిగ్గజాః" అనునవి యని యమరుఁడు నుడివెను గాన నాయాదిక్కులందలి గజము లాయాదిక్పతుల పని యొన్నవలయును. నిర్ఋతి నరవాహనుం డనుట ప్రసిద్ధము. అలం. స్వభావోక్తి.

చ. మకరకుళీరకచ్ఛపసమానము లైనముఖంబుల న్భయా
నకరస ముప్పతిల్లఁ గెలన న్నిజకింకర*దైత్యదానవ
ప్రకరము గొల్వ బాహుశిఖరంబునఁ బాశము ఫూని వార్ధినా
యకుఁ డని కేఁగుదెంచెఁ గలహంసతురంగరథాధిరూఢుఁ డై. 82

టీ. వార్ధినాయకుఁడు=సముద్రాధిపతి వరుణుఁడు, మకరకుళీర...ముఖంబులన్ - మకర=మొసలి, కుళీర = ఎండ్రకాయ, కచ్ఛప = కూర్మము, అనువీనికి, సమానములైన= సదృశములైన, ముఖంబులన్ = మొగములందు, భయానకరసము = భయానక మను రసము, ఉప్పతిల్లన్ =పుట్టఁగా, కెలనన్ =పార్శ్వమున, నిజకింకరదైత్యదానవప్రకరము= తనభటులైన దైత్యులయు దానవులయు సమూహము, కొల్వన్ = సేవింపఁగా, బాహు శిఖరంబునన్ = భుజశిఖరమున, పాశమున్ =పాశ మను నాయుధవిశేషమును, ఫూని= పట్టి, కలహంసతురంగరథాధిరూఢుఁడై = రాయంచ గుఱ్ఱముగాఁ గల రథము నెక్కినవాఁడై, అనికిన్ =యుద్ధమునకు, ఏఁగుదెంచెన్ = వచ్చెను.

విశే. వరుణునకు రాయంచ వాహనము. అలం. స్వభావోక్తి.

ఉ. అంగసుగంధము ల్నిజభటాలిపథశ్రమమున్ హరింప ను
త్తుంగగదాపరిభ్రమవిధూతము లై ఘనము ల్దిగంత మా
తంగవిశాలకర్ణములఁ దారొక్కని చామరలీలఁ జూప సా
రంగహయంబు నెక్కి సమరంబున కేఁగె సమీరుఁ డుద్ధతిన్. 83

టీ. సమీరుఁడు = వాయుదేవుఁడు, అంగసుగంధముల్ = శరీరపరిమళములు, నిజభటాలిపథశ్రమమున్ = తనభటుల మార్గాయాసమును, హరింపన్ = పోఁగొట్టఁగా, ఉత్తుంగ...విధూతములై-ఉత్తుంగ=ఎత్తైన, గదా=గద యను నాయుధముయొక్క, పరిభ్రమ = త్రిప్పుటచే, విధూతము లై = ఎగఁజిమ్మఁబడిన వై, ఘనముల్ = మేఘములు,

---

* వీరదానవ.

దిగంతమాతంగవిశాలకర్ణములన్ = దిగంతములం దైన యేనుంగులయొక్క, విశాలమైన చెవులందు, తారొక్కని=తగిలి, చామరలీలన్ = చామరములవిలాసమును, చూపన్ = అగపటుపఁగా, సారంగహయంబున్ = కురంగవాహనమును, ఎక్కి, ఉద్ధతిన్ = గర్వముతో, సమరంబునకున్ = యుద్ధమునకు, ఏఁగెన్.

విశే. గదావిధూతములై దిగ్గజకర్ణములం దవిలిన మేఘములు చామరములలీలం ధరించె నని గ్రహించునది. వాయువు కురంగవాహనుఁ డనుట ప్రసిద్ధము. అలం. స్వభావోక్తి. ఉపమ గమ్యము.

క. నలకూబరమణికంఠులు, బలముల నడపింప నర్థపతి తురగముపై
ధళధళితచంద్రహాసో,జ్జ్వలితభుజుం డగుచు నడచె వాసవు మ్రోలన్.

టీ. అర్థపతి = కుబేరుఁడు, నలకూబరమణికంఠులు = నలకూబరుఁ డను తన తనయుఁడును మణికంఠుఁడును, బలములన్ = సేనలను, నడపింపన్ = నడుచునట్లు చేయఁగా, ధళధళితచంద్రహాసోజ్జ్వలితభుజుం డగుచున్ =తళతళ మని మెఱయునట్లు చేయఁబడినకత్తిచే ప్రకాశిత మగు బాహువు గలవాఁ డగుచు, వాసవు మ్రోలన్ = ఇంద్రుని ప్రక్క, నడచెన్.

అలం. స్వభావోక్తి.

ఉ. ఆననసీమఁ గ్రోధజనితారుణదీధితి ఫాలభాగనే
త్రానలకీలలం బెనుప హస్తమున న్నిశితత్రిశూలముం
బూని మదించి అంకె లిడుపోఁటరి గిబ్బలఁజేని నెక్కి యీ
శానుఁడు వచ్చెఁ బారిషదసైన్యముతో రణకాతుకంబునన్. 85

టీ. ఈశానుఁడు=ఈశానుఁ డను దిక్పతి, ఆననసీమన్ =ముఖప్రదేశమునందైన, క్రోధజనితారుణదీధితి=కోపమువలన బుట్టిన యెఱ్ఱనికాంతి, ఫాలభాగనేత్రానలకీలలన్ = లలాటమునందైన నేత్రసంబంధమగునగ్ని యొక్క మంటలను, పెనుపన్ = వృద్ధినందింపఁగా, హస్తమునన్ = చేతియందు, నిశితత్రిశూలమున్ = వాఁడియైన త్రిశూలమును, పూని, మదించి=మత్తిలి, అంకెలు=బొబ్బలు, ఇడు=పెట్టునట్టి, పోఁటరిగిబ్బలఁజేసి = శూరుఁడైనవృషభాధిపుని, ఎక్కి=అధిష్ఠించి, పారిషదసైన్యముతోన్ =ప్రమథగణముల తోడ, రణకాతుకంబున్ = యుద్ధోత్సాహముతో, వచ్చెన్.

విశే. ఈశానుఁడు శివాంశసంభూతుఁ డగుట నాతనిని శివసదృశాకారధర్మములు గలవానినిగ భావించి వర్ణించుట సహజము. అలం. స్వభావోక్తి.

ఉ. ఆయుధగర్భితంబు లగునంజలు లెత్తి పులోమకన్యకా
నాయక! యేన యేన యని నాకనివాసులు మ్రొక్కి సూరెలం
బాయక కొల్చి రా దిగధిపాలురతో నలనందసూనుఁ డా
హా యిటు సేయునే యని మహాహమికం బలుమాఱు పల్కుచున్.

టీ. నాకనివాసులు = స్వర్గవాసులు సురలు, ఆయుధగర్భితంబులు=ఆయుధము లతోఁగూడిన, అగు=అగునట్టి, అంజలులు=దోసిళులు, ఎత్తి=పైకెత్తి, పులోమకన్యకా నాయక=ఓ పౌలోమీపతీ, ఏన ఏన = నేనే నేనే, అని, మ్రొక్కి=నమస్కరించి, సూరెలన్ = పార్శ్వములందు, పాయక=చేరి, కొల్చి=సేవించి, రా్ = రాఁగా, దిగధిపాలురతోన్ = దిక్పాలురతోను, అలనందసూనుఁడు=ఆశ్రీకృష్ణుఁడు, ఆహా=అయ్యో, ఇటు=ఈరీతిగ, చేయునే=ఒనర్చునే, అని, మహాహమికన్ =గొప్పదైనగర్వముతో, పలుమాఱు=మాటిమాటికి, పల్కుచున్ = అనుచు, ఇంద్రుఁడనికి వెడలె నని ముందటిపద్యముతో నన్వయము.

వ్యా-విశే. మహత్ + అహమిక=మహాహమిక.

చ. హరిహయుఁ డాహరిం గెలుచునాసయు మోసము నాక యీగతిం
బురి వెడలంగ నవ్విభునిమ్రోల మరుద్వసువిశ్వరుద్రభా
స్వరతుషితాదిక త్రిదశవర్గము ముప్పదిమూఁడుకోటులు
ద్ధురగతి నేఁగుదెంచె రణధూర్వహగర్వము లుల్లసిల్లఁగన్. 87

టీ. హరిహయుఁడు=ఇంద్రుఁడు, ఆహరిన్ =ఆశ్రీకృష్ణుని, గెలుచునాసయున్ = జయించునాశయు, మోసము=ప్రమాదము, నాక=అనక ; అనఁగా శ్రీకృష్ణుని గెల్చుట దుస్సాధ్యమని మది నెన్నక యని భావము. ఈగతిన్ =ఈరీతిగ, పురిన్ =పట్టణమునుండి, వెడలంగన్ = బయలువెడలఁగ, అవ్విభునిమ్రోలన్ =ఆదేవేంద్రుని పార్శ్వమున, మరుద్వసు.....వర్గము-మరుత్తులు, వసువులు, విశ్వులు, రుద్రులు, భాస్వరులు, తుషితులు, ఆదిక=మొదలైన, త్రిదశవర్గము=సురసమూహము, ముప్పదిమూఁడుకోటులు = ముప్పది మూఁడుకోట్లసంఖ్యగలవారు, ఉద్ధురగతిన్ =గర్వగమనముతో, రణధూర్వహగర్వములు= యుద్ధభారమును మోయుగర్వములు, ఉల్లసిల్లఁగన్ = ప్రకాశింపఁగా, ఏఁగుదెంచెన్ = వచ్చెను.

విశే. మరుద్వస్వాదులు సురలతెగలభేదములు. ఇందుఁ ద్రిదశవర్గపదము కర్తయగుటంజేసి వారు ముప్పదిమూఁడుకోటుల సంఖ్యగలవారైనను, మహత్తులైనను, దత్సమూహమున్ దెలియఁ బల్కు వర్గశబ్దమమహద్వాచకమగుటంజేసి క్రియ యమహా

కర్తృక మగునపుడు నిల్పురీతినే నిల్పఁబడెను. "ఏఁగుదెంచెఁ" అని. ఇట్టిచోటుల "త్రిదశవర్గ మేఁగుదెంచిరి" అనియుఁ బాక్షికముగ రూప ముండనగును. "మహత్సమూహార్థకశబ్దు బమహత్కార్యయుక్తంబయ్యుఁ దద్విశేషణక్రియలు మహత్కార్య యోగ్యంబులు విభాష నగు" అని ప్రౌఢవ్యా. శబ్దప. 17 సూ.

శా. అర్వారోహణచాతురీవిలసనాహంకారదుర్వారతన్
సర్వాంగీణము లైనమైమఱువులు *న్మస్త్రీక్పాణంబులున్
గర్వాలాపవిడంబము ల్మెఱయ జోకం జిత్రసేనాదిగం
ధర్వ ల్వజ్రికిఁ దోడుసూపిరి పురద్వార ప్రదేశంబునన్. 88

టీ. చిత్రసేనాదిగంధర్వుల్ = చిత్రసేనుఁడు మొదలైన గంధర్వులు, అర్వారోహణ.....దుర్వారతన్ - అర్వారోహణ=గుఱ్ఱమునెక్కుటయందలి, చాతురీ=నైపుణియొక్క; అనఁగా స్వారిచేయునేర్పుయొక్క యనుట. విలసన = విలాసమువల్లనైన, అహంకార=గర్వముయొక్క, దుర్వారతన్ =అనివార్యత్వమును, సర్వాంగీణము లైన = ఎల్లయవయవములుఁ గప్పియున్న, మైమఱువులున్ =శరీరాచ్ఛాదనములు కవచములును, శస్త్రీక్పాణంబులున్ =చురకత్తులును ఖడ్గములును, గర్వాలాపవిడంబముల్ = గర్వపు మాటల యతిశయము, మెఱయన్ = ప్రకాశింపఁగా, జోకన్ = పరాక్రమముతో పురద్వారప్రదేశంబునన్ = పట్టణబహిర్ద్వారదేశమున, వజ్రికిన్ = వజ్రాయుధము గల యింద్రునకు, తోడుసూపిరి=సహాయులైరి.

ఉ. హేమధరాధరంబు చలియింప వెసన్ బహుకోటిసంఖ్యలై
యామరసైన్యము ల్నడచునప్పు డనంతసితోష్ణవారణ
స్తోమనిరోధ మందియును దోడనె దిక్కులు గప్పె నయ్యెడం
జామరవాయునున్నములు సాంద్రహిరణ్మయభూపరాగముల్. 89

టీ. హేమధరాధరంబు=బంగరుకొండ; మేరు వనుట; ఇది సురాలయముగదా! చలియింపన్ = కదలునట్లుగా, వెసన్ = శీఘ్రముగ, బహుకోటిసంఖ్యలై =అనేకకోటుల సంఖ్య కలవై; అనఁగా లెక్కకు మిక్కిలి యై యనుట. ఆమరసైన్యముల్ =సురసైన్యములు, నడచునప్పుడు, అనంతసితోష్ణ.....నిరోధము-అనంత=లెక్కలేని, సిత = తెల్లనైన, ఉష్ణవారణస్తోమ=గొడుగులగుంపుయొక్క, నిరోధము=అడ్డగింపును, అందియున్ = పొందినప్పటికిని, తోడనె=వెనువెంటనె, చామరవాయునున్నములు=చామరములగాలులచే

---

* న్మంచత్క్పాణంబుల్.

నెగఁజిమ్మఁబడినట్టి, సాంద్రహిరణ్మయభూపరాగముల్ = దట్టమైన బంగరు నేలసంబంధమైనధూళులు, అయ్యెడన్ =ఆసమయమున, దిక్కులు=దిశలు. కప్పెన్ = ఆవరించెను.

వ్యా-విశే. గొడుగులచే సాచ్ఛాదితమైనను జామరములగాలులచే రేఁగిన స్వర్ణపరాగములు దిశల నావరించె నని యెన్నునది. అమరాణామిదమ్=అమరం. అణ్.

ఉ. దారుణభంగి నొండొకటిఁ దాఁకెడునస్త్రముఖంబులస్ఫుణా
త్కారము లుల్లసిల్ల బెడిదంబుగఁ బుట్టినసందడిం బుర
ద్వారము నిర్గమించె సురవల్లభసేనలు భర్గజూటకాం
తారముఖంబున న్వెడలుదైవతసింధురరంబులో యనన్. 90

టీ. దారుణభంగిన్ = భయంకరమగురీతితో, ఒండొకటిన్ = అన్యోన్యమును; ఒకటి నొకటి యనుట. తాఁకెడు = అంటునట్టి, అస్త్రముఖంబుల్ =అస్త్రాగ్రములనుండి, ఘణాత్కారములు = ఘణఘణధ్వనులు, ఉల్లసిల్లన్ = ప్రకాశింపఁగా, బెడిదంబుగన్ = భయంకరముగ, పుట్టినసందడిన్ = జనించిన కలకలముతో, సురవల్లభసేనలు = ఇంద్రుని బలములు, భర్గ.....ముఖంబునన్ -భర్గ=ఈశ్వరునియొక్క, జూట=జడలముడి యను, కాంతార=అడవియొక్క,ముఖంబునన్ =అగ్రమునుండి, వెడలు=బయలుదేఱిన, దైవత సింధురరంబులో యనన్ =సురనదీప్రవాహములో యనునట్లు పురద్వారమున్ =పట్టణద్వారమునుండి, నిర్గమించెన్ = వెలువడెను.

విశే. ఇందు రెండవపాదమున "ఉల్లసిల్లన్" అనుచో "ఉప్పతిల్లన్" అనుపాఠ మగపడును. "ఉప్పతిల్లు" అనఁగాఁ బుట్టుట. శస్త్రముఖముల ఘణాత్కారము లుల్లసిల్లె ననుటకంటె నుప్పతిల్లె ననుటయే సరస మని తోఁచెడిని. అందే "పుట్టిన" అనుచో "తొట్టిన" యనుపాఠ మగపడు. ఇం దధికవిశేషము గానరాదు. అలం. ఉత్ప్రేక్ష.

శా. బాణద్విణ్మథితాంబుధిధ్వనికళాపాణింధమానీకని
స్వానస్వానభిదేలిమాద్రితట! నిస్సామాన్యచాపాగమ
ద్రోణాచార్య! సురీసమూహవరణోద్యుక్తాహితశ్రేణిని
శ్రేణీభూతకృపాణ! మాంసలభుజాశేషాహిపత్యుద్ధరా! 91

టీ. బాణ.....తట - బాణద్విట్ = బాణాసురశత్రువగు విష్ణునిచే, మథిత = తఱువఁబడిన, అంబుధి = సముద్రమునొక్క, ధ్వనికళా = శబ్దవిద్యలను, పాణింధమ= వృద్ధినందించుచున్న, అనీక = సేనలయొక్క, నిస్సాణస్వాన=వాద్యవిశేషముల మ్రోతల

చేత, భిదేళిమ=తమంతటఁదామే పగులఁబొఱు, అద్రితట=పర్వతప్రదేశముబుగలవాఁడ, నిస్సామాన్య...ద్రోణాచార్య-నిస్సామాన్య = అనితరసాధారణమైన; ఇతరుల కలవిగాని యనుట-చాపాగమ=ధనుర్విద్యయందు, ద్రోణాచార్య=ద్రోణాచార్యునివంటివాఁడ, సురీ సమూహ.....కృపాణ-సురీసమూహ=దేవతాస్త్రీలగుంపును, వరణ=వరించుటకు; పెండ్లి యాడుట కనుట. ఉద్యుక్త=సంసిద్ధులైన, అహితశ్రేణి=శత్రుపంక్తికి, నిశ్రేణీభూత=నిచ్చెన యైన, కృపాణ=కత్తిగలవాఁడ, మాంసల.....ద్ధరా-మాంసల = బలిసిన, భుజా=భుజము లచే, శేషాహిపతి=ఆదిశేషుని, ఉద్ధరా=ఉద్ధరించినవాఁడా! కాపాడినవాఁడా యనుట; ఇవి యన్నియుఁ గృష్ణరాయసికి సంబుద్ధులు.

భా. కృష్ణరాయలు దిగ్విజయార్థ మేఁగునపుడు సేన లొనర్చిన జయభేరులమ్రోతలు సముద్రమథనసమయమునసైన ధ్వనులనుగూడ మించియున్న వనియుఁ, గృష్ణరాయలు ధనుర్విద్యావిషయమున ద్రోణుం బోలువాఁడనియు, శత్రుకోటిని యుద్ధమునందుఁ జంపి దేవతాస్త్రీభోగమును వారికిఁ గూర్చిన దగుట శ్రీకృష్ణరాయలకత్తి శత్రులు సురస్త్రీలం గలసికొనుటకు మీఁదికి నంపుసాధన మగు నిచ్చెనవలె వెలయుచున్న దనియు, బలిసిన భుజములందు భువి నుంచి కృష్ణరాయలు పాలించువాఁ డౌటంజేసి యాదిశేషునకు భువినిమోయు వ్యాపారము శూన్యమయ్యె ననియు, దానఁ గృష్ణరాయలు శేషు నుద్ధరించినవాఁడయ్యె ననియు భావము.

విశే. ప్రకృతకథాంశమున కనుగుణమగురీతి నిందుఁ గృష్ణరాయల భేరిమ్రోతలు సైన్యములు, వీరశ్వము, శత్రునాశము మున్నగునవి ప్రతిపాదితము లై హృదయంగమము లగుచున్నవి.

శా. వాజ్యారోహణనైపుణీనకుల! దోర్వాతంధయారూఢస
ర్వజ్యాచక్ర! రజస్తమశ్చయతమిస్రారూపజన్యాంగణ
ప్రాజ్యోద్గీతయశశ్శశాంక! దళితారాతిక్షమాపాలర
క్తాజ్యోదంచదుదారశౌర్యహతభుగ్వ్యస్తాఖిలాశాంతరా! 92

టీ. వాజ్య...నకుల-వాజి=గుఱ్ఱములయొక్క, ఆరోహణ = ఎక్కుటయొక్క, నైపుణీ=నేర్పువిషయమున, నకుల = నకులుఁడవైనవాఁడా; నకులుఁడు పాండురాజు కొడుకు. భర్మజుని తమ్ముఁడు. ఈతఁ డశ్వశిక్షణమున మిగుల నేర్పరి యైనయట్లు మహా భారత విరాటపర్వాదులందలి కథాభాగములవలనఁ దెల్లమయ్యెడిని. దోర్వాతం..... జ్యాచక్ర-దోః=బాహువనే, వాతంధయ = సర్పమును, ఆరూఢ=అధిష్ఠించిన, సర్వ = సమస్తమైన, జ్యా=భూమియొక్క, చక్ర = వలయముగలవాఁడ, రజస్తమ...శశాంక-రజః=దూళి లనెడు, తమః=చీఁకట్లయొక్క, చయ = గుంపుచే, తమిస్రా=చీఁకటిరేయి యొక్క, రూప = రూపమైన; చీఁకటిరేయియాకారమును ధరించిన యనుట. జన్యాం గణ = యుద్ధరంగమునందు, ప్రాజ్య = పూజ్యముగ, ఉద్గీత = పొగడ్తగఁ గొనియాడఁ బడువట్టి, యశః = కీర్తియనెడు, శశాంక = చంద్రుఁడు గలవాఁడా! చీఁకటిరేయిం

జంద్రుఁడు దోఁచి సర్వమును బ్రకాశితము సేయుగతిని, పరాగ మను చిమ్మచీఁకటి క్రమ్ముటంజేసి చీఁకటిసేయి నను కరించు యుద్ధరంగమున గతి గానక చింతించు పగతుర కీతని యశశ్చంద్రప్రశంసయే తారక మయ్యె నని భావము. చంద్రుఁడు చీఁకటిని చాఱద్రోలుగతి నీతని యశోగానము పగతురను యుద్ధరంగపు గష్టములనుండి విముక్తులం జేసె నని ఫలితము. దళిత...ఆశాంతరా-దళిత=చీల్పఁబడిన, అరాతిక్షమాపాల = శత్రు రాజులయొక్క, రక్త=నెత్తు రనెడు, ఆజ్య=నేతిచే, ఉదంచత్ = పై కెగసిన; మండిన యనుట. ఉదార = గొప్పదైన, శౌర్య = పరాక్రమ మనెడు, హుతభుక్ = అగ్ని చే, వ్యాప్త=పొందఁబడిన, అఖిల = సమస్తమైన, ఆశా = దిక్కులయొక్క, అంతరా = వెలుపలిభాగములు గలవాఁడ. ఈతనిశౌర్యాగ్ని పగతుర నెత్తుటిధార లను నేతిచే బ్రజ్వలితమై దిగంతముల ముట్టె నని భావము. అహితవిదళనమున నీతనిపరాక్రమము దిగంతవ్యాప్త మయ్యె నని ఫలితము.

భా. కృష్ణరాయఁడు నకులునివలె నశ్వశిక్షానిపుణుఁ డనియు, నీతనిబాహువు శేషునివలె భువి నశ్రమముగ మోసి సుఖపెట్టుచున్న దనియు, యుద్ధరంగమునఁ గర్ణిన బహులధూళిం గాంచి కర్తవ్యముం గానక వెఱపంది శత్రురాజు లీతనికీర్తిని గానము సేసి యాకష్టములనుండి విముక్తిం గాంచుచుండి రనియు, నరిసరపతులఁ జంపుటకతన నీతని శౌర్యము దిగంతవిఖ్యాత మయ్యె ననియు భావము.

విశే. వాతంధయ = గాలిని బీల్చునది; పాము. ఇట్టిదే స్తనంధయశబ్దము. స్తన మును బీల్చువాఁడు చంటిబిడ్డ, జ్యా=నేల, భూమి గుఱ్ఱముగ నుండుట నైజము గాన జ్యాచక్ర మనెను. క్షమా=భూమి, భూమిని పాలించువాఁడు గాన రాజు క్షమాపాలుఁ డయ్యెను. హుతభుక్ =హోమము చేయఁబడినదానిం దినువాఁడు; అగ్ని. కీర్తి తెల్లగా నుండుటయు, దానిని జంద్రునిగా నెన్నుటయుఁ గవిలోకప్రసిద్ధవిషయములు. శేషుఁడు భూమిని మోచుట పురాణాదిప్రసిద్ధాంశము. తృతీయపాదాదినుపసర్గసంధి యొప్పుటంజేసి యుపసర్గ యతి నియమము ననుసరించి యచ్చునకును, హల్లునకును యతి వేయనగుం గాన 'దళి తారాతి' అనుపదమున విఱుఁగునట్టి తకారముపైనుండు అకారము 'ప్రా' అనుదానిపైఁగల ఆకారమునకు యతి యయ్యె. అలం. రూపకము.

క. చండతరమూరురాయర, గండమహాబిరుద! ధాటికారయవిచల
తొ్కండపలి కొండవీటీ, మండల! కటకేశసింధుమందరకుధరా. 93

టీ. చండతర.....మహాబిరుద - చండతర మూరురాయరగండ = మహోగ్రమైన 'మూరురాయరగండ' అనెడు, మహాబిరుద = గొప్పబిరుదము గలవాఁడ, 'అశ్వపతులు, నరపతులు, గజపతులు' అను మూఁడు తెగలరాజులను జయించినవాఁడౌటఁ గృష్ణరాయల కీబిరుదము గల్గె. ఇది కన్నడపదము. ధాటికా.....మండల - ధాటికారయ=దాడియొక్క వేగముచే, విచలత్ = మిగులఁ గంపించునట్టి, కొండపలి కొండవీటీమండల=కొండపల్లి కొండవీ డను ప్రదేశములు గలవాఁడ, కటకేశ.....కుధరా-

కటకేశ = కటకాధిపతి యనెడు, సింధు = సముద్రమునకు, మందరకుధరా = మందర పర్వత మైనవాఁడా !

భా. కృష్ణదేవరాయలు మూరురాయరగండఁ డనుమహాబిరుదము గలవాఁ డనియుఁ, గొండపల్లి కొండవీడుల జయించినవాఁ డనియుఁ, గటకాధీశుని గలఁచిన వాఁ డనియు భావము.

విశే. కొండపలి కొండవీడులందలి కొండపదములు శ్రీకృష్ణరాయనిఘాటీ రయము కొండలంగూడఁ జలింపఁజేసె ననుచమత్కారార్థమును స్ఫురింపఁజేయుచు సరసములై యొప్పుచున్నవి. ఇదియుఁ బ్రకృతకథానుకూలవిషయప్రకాశక మై సరస ముగ నొప్పుచున్నది.

తోటకము.—

త్వరితాధరితానిలవాజినట, త్ఖురజోరురజోభరగూఢరవి
స్ఫురణా ! కరణాధికభూత్కృతిమ,ద్ద్విరదాకరదారణవీరబలా ! 94

టీ. త్వరిత.....రవిస్ఫురణా-త్వరిత=వేగముచే, అధరిత = క్రిందుగాఁ జేయఁ బడిన, అనిల=గాలిగల; అనఁగా వాయువేగమును మీఱిన వనుట. వాజి = గుఱ్ఱముల యొక్క, నటత్ = నటించునట్టి; అనఁగాఁ జలించునట్టి యనుట: నర్తన మనునర్థము పొసఁగమిఁ జలన మే గ్రాహ్యము. ఖురజ = డెక్కలనుండి పుట్టిన, ఊరు = గొప్పదైన, రజోభర=పరాగభారముచే, గూఢ = మఱుఁగుపడిన, రవి=సూర్యునియొక్క, స్ఫురణా = కాంతిగలవాఁడ, కరణా.....వీరబలా-కరణ = శరీరములచే, అధిక = అధికములైన; అనఁగా గొప్పశరీరము గల వనుట. భూత్కృతిమత్ =భూతాకారము గల, ద్విరదాకర= ఏనుఁగులగుంపును, దారణ = చీల్చునట్టి, వీరబలా = వీరసైన్యములు గలవాఁడ !

భా. కృష్ణరాయల దాడులం దశ్వసైన్యములవలన రేఁగినధూళులు సూర్య కాంతినిగూడ మఱుఁగుపఱిచె ననియుఁ, గృష్ణరాయనిసైనికులు మత్తగజముల విదా రింప నెంతయుఁ సమర్థు లనియు భావము.

విశే. ఈపద్యము నడకచేతను, నర్థముచేతను, జన్యాటోపముమ సూచించునదై ప్రకృతకథానుకూలమై హృద్య మై యున్నది. మొత్తముమీఁద నిం దాశ్వాసాంత పద్య ములందలి విషయములు యుద్ధవార్తలనే సూచించుచున్నవి. ఇది తోటకవృత్తము నాఁబడు. దీనికిఁ బ్రతిపాదమునకు నాలుగేసిసగణము లుండును. తొమ్మిదవయక్షరము యతిస్థానము.

గద్యము. ఇది శ్రీమదుమామహేశ్వరవరప్రసాదలబ్ధసారసారస్వతాభి నంది నంబిసింగయామాత్యపుత్ర కౌశికగోత్రపవిత్ర సుజనవిధేయ తిమ్మయనామధేయప్రణీతం బైన పారిజాతాపహరణం బను మహా ప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము.

# పంచమాశ్వాసము

వర్ణనీయ ! తిరుమల
దేవీహృదయేశ ! యమృతదీధితికులపా
రావారపారిజాత ! ధ
రావలయశరణ్య ! కృష్ణరాయవరేణ్య ! 1

టీ. శ్రీవర్ణనీయ=సంపదలచేత వర్ణింపఁదగినవాఁడా ! తిరుమలదేవీహృదయేశ = తిరుమలదేవికి భర్తయైనవాఁడ, అమృతదీధితికులపారావారపారిజాత = చంద్రవంశమను సముద్రమునకుఁ గల్పవృక్షమైనవాఁడా, ధరావలయశరణ్య = భూమండలమునకు రక్షకుఁడైనవాఁడా; అనఁగా భూమియందలి ప్రజలకు రక్షకుఁడా యనుట. కృష్ణరాయవరేణ్య=కృష్ణరాయశ్రేష్ఠా ! 'అవధరింపుము' అని ముందటిపద్యముతో నన్వయము.

విశే. ఇందలి 'అమృతదీధితికులపారావారపారిజాత, తిరుమలదేవీహృదయేశ' అనుపదములు శ్రీకృష్ణుఁడు సత్యాసక్తుఁడై భువికిఁ బారిజాతముం గొనితెచ్చిన యీ యాశ్వాసపుఁగథకు సూచకములై వెలయుచున్నవి. అలం. రూపకము.

తే. అవధరింపుము జనమేజయక్షితీశ
వరున కిట్లను నమ్మానివల్లభుండు
దైవసైన్యంబు లీరీతిఁ దరతరంబ
వెడలి మొన లేర్పరించి యుద్వేలవృత్తి. 2

టీ. అవధరింపుము = సావధానబుద్ధిని వినుము. జనమేజయక్షితీశవరునకున్ = జనమేజయుఁ డను రాజశ్రేష్ఠునకు, అమ్మానివల్లభుండు = ఆమునిపతి, ఇట్లు, అనున్ = అనెను. దైవసైన్యంబులు=సురసైన్యములు, ఈరీతిన్, తరతరంబ=ఒకటివెనుక నొకటి. వెడలి, మొనలు=మొగ్గరములు, ఏర్పరించి=ఏర్పాటుచేసి, ఉద్వేలవృత్తిన్=అధిక మగు వ్యాపారముతో; ముందటిపద్యముతో నన్వయము.

## యుద్ధము

ఉ. వచ్చితి మింక నెందుఁ జనవచ్చు నొహో నిలు పారిజాతపా
టచ్చర ! యంచు జంకెలు గడల్కొనఁ గృష్ణునిఁ జుట్టుముట్టి వై

యచ్చరసేన బాఁకునపు డచ్చుల మే మని చెప్ప దిక్కులం
జిచ్చుఱుతూపుతండములు సింహారవంబులు నిండె నొక్కటన్. 3

టీ. పారిజాతపాటచ్చర = ఓపారిజాతవృక్షమును దొంగిలించినవాఁడ, వచ్చితిమి, ఇంకక్, ఎందుక్, చనక్, వచ్చుక్ = వీలగును. ఒహో = ఓహో, నిలు = నిలుపుము. అంచుక్, జంకెలు = బెదరింపులు, కడలొక్కొనక్ = వ్యాపింపఁగా, వైయచ్చరసేన=వియచ్చరసైన్యములు; అనఁగా సురబలము లనుట. తాఁకునపుడు=ఎదురొక్కు సమయమున, దిక్కులక్ = దిశలందు, చిచ్చుఱుతూపుతండములు=అగ్నిని జిలుకు బాణములగుంపులు; ఆగ్నేయాస్త్రము లనుట. సింహారవంబులు = సింహనాదములు, ఒక్కటుక్ =ఒకసమయమునఁదే, నిండెక్, ఏమి అని చెప్పక్ =చెప్పుట కశక్య మనుట.

భా. బెదరింపులతో జేజేలబలగము లేతెంచి యాగ్నేయాస్త్రప్రయోగము లను సింహనాదములతోడనే చేసి రని భావము.

ఉ. ఆకమలాయతాక్షి నమరావనిజాతము డించి సంభ్రమ
న్నాకపురీమహారథుల నవ్వుచుఁ గన్గొని యంగుళిత్రగో
థాకలనంబుతో యదువతంసుఁడు శార్ఙ్గనిబద్ధశేషని
ర్మోకనిచోళముం దిగిచె రోషనటద్భ్రుకుటీవిలాసుఁ డై. 4

టీ. ఆకమలాయతాక్షిక్ =ఆపద్మాయతాక్షిని సత్యను, అమరావనిజాతమ్ = దేవభూరుహమును గల్పకమును, డించి = దించి, యదువతంసుఁడు = యాదవశ్రేష్ఠుఁడు కృష్ణుఁడు సంభ్రమన్నాకపురీమహారథులక్ = తొందరపడుసురమహారథులను, నవ్వుచుక్, కన్గొని=చూచి, అంగుళి...కలనంబుతోక్ - అంగుళి=వ్రేళ్లను, త్ర = రక్షించునట్టి, గోథా = ఊడుముతోలుయొక్క, కలనంబుతోక్ = ఆచ్ఛాదనముతో, శార్ఙ్గనిబద్ధ...నిచోళమ్ుక్ -శార్ఙ్గ = శార్ఙ్గ మను తన వింటియందు, నిబద్ధ = కూర్పఁబడిన, శేషనిర్మోక=శేషుని కుబుస మనెడి, నిచోళమ్ుక్ = ఆచ్ఛాదనవస్త్రమును, తిగిచెక్ = ఆకర్షించెను; అనఁగా ధనువునకుఁ గప్పిన శేషనిర్మోకరూపాచ్ఛాదనమును దొలఁగించెనను. రోషనటత్ ...విలాసుఁడై-రోష=కోపముచే, నటత్ =చలించునట్టి, భ్రుకుటీ = బొమముడియొక్క, విలాసుఁడై = అందముగలవాఁడై, తిగిచె నని పూర్వపదముతో నన్వయము.

భా. శ్రీకృష్ణుఁడు సత్యభామను గల్పవృక్షమును నొక్కచో దించి హస్తమున కుడుముతోలుకవచమున దొడిగి కోపమున బొమముడి యమర సర్పనిర్మోకాచ్ఛాదనము దొలఁగించి ధనువుం జేబూని యుద్ధసన్నద్ధుఁ డయ్యె నని భావము.

విశే. నవ్వుట హేలాసూచకము.

క. తిగిచి శరాసన మెక్కిం
చి గుణధ్వని చేసి యంసశిరముల దొనలన్
బిగియించి తూపు లొక్కట
నిగిడింపఁ దొడంగె మరుదనీకినిమోఁదన్. ప

టీ. తిగిచి = ఆకర్షించి; అనఁగా నాచ్ఛాదనముం దొలఁగించి, శరాసనము = వింటిని, ఎక్కించి=ఎక్కువెట్టి, గుణధ్వని = నారియొక్కనాదము, చేసి=ఒనర్చి, అంస శిరములన్ =భుజశిఖరములందు, దొనలన్ =అమ్ములపొదులను, బిగియించి = బిగియఁగట్టి, తూపులు = బాణములు, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, మరుదనీకినిమోఁదన్ = సుర సైన్యముపైని, నిగిడింపన్ =వ్యాపింపఁజేయుటకు, తొడంగెన్ =ప్రయత్నించెను.

క. భిన్నాసురాస్రములచవి
గన్నమురాహితశిలీముఖము లపు డనిలో
మున్నెఱుఁగని సురవీరుల
క్రొన్నెత్తురుచవియు నెఱిఁగి క్రోలఁ దొడంగెన్. 6

టీ. భిన్నాసురాస్రములచవి = నఱుకఁబడిన రాక్షసులనెత్తురులరుచిని, కన్న = పొందిన, మురాహిత శిలీముఖములు = శ్రీకృష్ణునిబాణములు, అపుడు = ఆసమయమున, అనిలోన్ = యుద్ధములో, మున్ను = పూర్వమున, ఎఱుఁగని, సురవీరుల క్రొన్నెత్తురు చవియున్ = దేవశూరులక్రొత్తరక్తపురుచియును, ఎఱిఁగి = తెలిసి, క్రోలన్ =త్రావుటకు, తొడంగెన్ = పూనెను.

భా. శ్రీకృష్ణునిబాణములు సురరక్షణార్థ మింతకుమున్న రక్కసులనే వధించిన వాటంజేసి దేవవీరులనెత్తురుచవి వానికిఁ దెలియదు, నేఁడు సురవీరులతో యుద్ధము తటస్థించుటచే సురవీరులనెత్తుటిరుచిగూడ నెఱింగె నని భావము.

చ. అమరహితంబు గోరి యసురాంగకము ల్విదళించునట్టి మా
కమరులఁ [1]ద్రుంపఁగా వలసె నక్కట నేఁ డని సిగ్గుఁ జెందుచం
దమున గఠోరశార్ఙ్గజనితప్రదరంబులు వైరిమర్మభే
దము లొనరించి యుద్ధవసుధాస్థలిఁ [2]గూడఁగఁబాఱు నయ్యెడన్. 7

టీ. అమరహితంబున్ = సురలమేలును, కోరి, అసురాంగకముల్ = రాక్షసుల యవయవములను, విదళించునట్టి=బ్రద్దలుసేయునట్టి, మాకున్, అమరులన్ = దేవతలను, త్రుంపఁగాన్ = ఖండింపఁగా, వలసెన్ = వచ్చెను. అక్కట = అయ్యో, నేఁడు, అని, సిగ్గు=లజ్జను, చెందుచందమునన్ =పొందువిధమున, కఠోరశార్ఙ్గజనితప్రదరంబులు = కఠిన

---

1. నొంపఁగా. 2. దూరఁగఁబాఱు.

మైన శార్జ్గ మను ధనువునుండి పుట్టినబాణములు, వైరిమర్మ భేదములు=శత్రులయాయువు పట్టులను భేదించుటలను,ఒనరించి=చేసి, అయ్యెడన్ =ఆసమయమున, యుద్ధవసుధాస్థలిన్ =యుద్ధభూమియందు, కూడఁగన్ + పాఱున్ =గుంపులుగాఁ జేరును. అనఁగా శ్రీకృష్ణుని బాణములు సురవీరులమర్మముల విదళించి యుద్ధభూమిఁ గుమిగాఁ గూలె నని భావము.

విశే. రెండవపాదమున "త్రుంపఁగాన్" అనుచో "నొంపఁగాన్" అను పాఠ మగపడును. దేవత లమరులుగాన నొంపఁగా ననుపాఠమే సరస మని తోఁచెడిని. అట్లే నాలవపాదమున "కూడఁగఁ బాఱు" ననుచో "దూరఁగఁ బాఱె" అనుపాఠ మగపడు. సిగ్గుఁజెందు చందమును సూచింప దూరఁగఁబాఱె ననుపాఠమే సమర్థ మగుట నదియె యాదరణీయ మని తోఁచెడిని. సిగ్గుఁజెందిన నొరులకంటఁబడఁజాలక దాఁగియుండ యత్నించుట నైజముగదా! మఱియు బాణవేగాతిశయముం దెల్ప దూరఁగఁ బాఱె ననుపాఠమే సమర్థ మగు నని చెప్పనగును.

సీ. హరిబాణలూనంబు లై వచ్చునమరాస్త్ర
ఖండము ల్లూల్చుఁ బక్షముల జడిసి
యమృతగంధాసక్త మగుచంచుపుటమున
వడి సింధురంబులఁ బొడిచి యెత్తు
నధిపుఁ డేసినఁ బాఱునాశుగంబులకంటె
మునుమున్న చని లక్ష్యముల దళించు
భటులపై హరులపై బహురథాగ్రములపై
నొక్కఁ డయ్యను దోఁచుఁ బెక్కుగతుల

తే. నఖముఖంబుల నీకికి గండ్రలుగఁ జేయు
దివిజబిరుదధ్వజంబు లుద్రేకవృత్తి[1]
నిఖిలలోకాద్భుతావహనిర్నిరోధ
విక్రమస్ఫూర్తి ఖగరాజచక్రవర్తి. 8

టీ. నిఖల.....స్ఫూర్తి-నిఖల = సమస్తమైన, లోక = జగత్తులకు, అద్భుత = ఆశ్చర్యమును, ఆవహ = కూర్చునట్టి, నిర్నిరోధ = అడ్డులేని, విక్రమ = పరాక్రమము యొక్క, స్ఫూర్తి = వికాసముగల, ఖగరాజచక్రవర్తి = గరుడుఁడు, ఉద్రేక వృత్తిన్ = విజృంభించిన వ్యాపారముతోడను, హరిబాణ లూనంబు లై = శ్రీకృష్ణుని బాణములచేఁ దెగినవై, వచ్చు, అమరాస్త్రఖండముల్ = సురలబాణములముక్క లను, పక్షములన్ = ఱెక్కలచేత, జడిసి = వారించి, తూల్చున్ = ఎగురఁగొట్టును. ఆమృతగంధాసక్తము=అమృతమునొయొక్క పరిమళమునందుఁ బ్రేమగలది, అగు=అగునట్టి,

1. లుద్వేలవృత్తి.

చంచుపుటమునక్ =ముక్కొనచే, వడిక్ = శీఘ్రముగ, సింధురంబులక్ = ఏనుఁగులను, పొడిచి=గ్రుచ్చి, ఎత్తుక్ =పైకెత్తును; గరుడుఁడు తన్నిదాస్యముం బాపఁ జంచుపుటమున నమృతముం గొనితెచ్చినవాఁ డౌట నాతనిచంచుపుట మమృతగంధాసక్త మని యెన్న వలయును. అధిపుఁడు = తనవిభుఁడు శ్రీకృష్ణుఁడు, ఏసినక్ =ప్రయోగింపఁగా, పాఱు= పరుగెత్తు, ఆశుగంబులకంటెక్ = బాణములకన్న, "ఆశు గచ్ఛంతీత్యాశుగాః" శీఘ్ర ముగఁ బోవున వనుట. ఇది యిచ్ఛోచ్చ బ్రయుక్త మగుట సరసము. మునుమున్న=ముందే, చని=పోయి, లక్ష్యములక్ = గుఱులను, దళించుక్ =చీల్చును. ఒక్కఁడయ్యును = అస హాయుఁడైనను, భటులపైక్ = భటులమీఁదను, హరులపైక్ = గుఱ్ఱములమీఁదను, బహురథాగ్రములపైక్ = అనేకరథములశిఖరములమీఁదను, పెక్కుగతులక్ = పలు వర్తనములతో, తోఁచుక్ =అగపడును; అనఁగాఁ దా నొక్కఁడేయైనను విక్రమకౌశల మున నెక్కడఁ జూచినను దానే యగపడు ననుట. దివిజబిరుదధ్వజంబులు = సుర లయాయాజయచిహ్నములు గలపతాకలను, నఖముఖంబులక్ = గోళ్లకొనలందు, ఇఱికి= ఇఱుకునట్లు చేసి, గండ్రలుగక్ =ముక్కముక్కలుగ, చేయుక్ =ఒనర్చును.

తే. సర్వతోముఖ మయి పేర్చు శార్ఙ్గబాణ
వర్ష సమ్మర్దదుర్దినవ్యాప్తివలన
నప్పు డెదిరించి పన్నిద్ద ఱహిమకరులుఁ
గానఁబడలేక తేజోవిహీను లైరి. 9

టీ. సర్వతోముఖ మయి=అంతటను వ్యాపించిన వై, పేర్చు = విజృంభించిన, శార్ఙ్గి...వ్యాప్తివలనక్ -శార్ఙ్గి = శ్రీకృష్ణునియొక్క, బాణవర్ష = అమ్ములవానయొక్క, సమ్మర్ద=రాపిడిచేసైన, (అనఁగా బాణవర్ష మనువానవలనఁ గలిగిన యనుట.) దుర్దిన = మేఘచ్ఛన్నదినముయొక్క, వ్యాప్తివలనక్ = వ్యాప్తివలన, పన్నిద్దఱు + అహిమకరు లుక్ =ద్వాదశాదిత్యులును, అప్పుడు, ఎదిరించి=మార్కొని; శ్రీకృష్ణు ననుట. కానఁ బడలేక=కనఁబడఁజాలక; అదృశ్యు లైయనుట. తేజోవిహీనులు=కాంతిలేనివారు, ఐరి.

భా. మేఘచ్ఛన్నదినమున సూర్యుఁడు తేజోహీనుఁడై యదృశ్యుఁ డగుట సహజము. ప్రకృతము శ్రీకృష్ణబాణవర్షముకతన దుర్దినము సంభవించె ననియు దానఁ బన్నిద్దఱు సూర్యులును తేజోహీనులై యదృశ్యు లైరనియు భావము. ద్వాదశాదిత్యులు శ్రీకృష్ణబాణపాతమున కోర్వఁజాలక తేజోవిహీనులై యోడి యదృశ్యు లై రని తాత్పర్యము.

విశే. శార్ఙ్గి=శార్ఙ్గ మను ధనువుగలవాఁడు, అహిమకరులు = సంతాపముం గలుగఁ జేయువారు. ద్వాదశాదిత్యులు:—1. అర్యముఁడు, 2. ధాత, 3. త్వష్ట, 4. పూషుఁడు,

5. వివస్వంతుఁడు, 6. సవిత, 7. మిత్రుఁడు, 8. వరుణుఁడు, 9. అంశుమంతుఁడు, 10. భగుఁడు, 11. శక్రుఁడు, 12. విష్ణువు.

ఉ. చుక్కలరాణివాసములసోయగపుంజనుదోయిత్రెక్కునం
జిక్కనయైనయక్కు యదుసింహుఁడు బాణపరంపరాహతిన్
ప్రక్కలు సేయఁ గాఁగ రుధిరంబునఁ దోఁగుచు రేవెలుంగు గెం
పెక్కినచాయ నభ్యుదయ మేఁదియుఁ దాల్చె రణాంగణంబునన్. 10

టీ. చుక్క.....త్రెక్కునన్ -చుక్కలరాణివాసముల = నక్షత్రము లనెడు రాణులయొక్క, చంద్రుఁడు తారకాభర్త గదా. సోయగపుంజనుదోయి = సుందరమైన స్తనద్వంద్వముయొక్క, త్రెక్కునన్ = రాపిడిచేత, చిక్కనయైన = దట్టమైన; అనఁగా స్తనములరాపిడిచేఁ గతిన మైన దనుట. అక్కు = వక్షస్థలమును, యదుసింహుఁడు = శ్రీకృష్ణుఁడు, బాణపరంపరాహతిన్ = బాణసమూహాముల దెబ్బచే, ప్రక్కలు = ముక్కలు, చేయన్ = ఒనర్పఁగా; ఛేదింపఁగా ననుట. కాఁగు = స్రవించునట్టి, రుధిరంబునన్ = నెత్తుటియందు, తోఁగుచున్ = మునుంగుచు, రేవెలుంగు = చంద్రుఁడు, అభ్యుదయము=అభివృద్ధి; ఉదయించుట యని యర్థాంతరము. ఏదియున్ = విడిచియు; అనఁగా నొకపక్షమున సొంపుచెడి యనియు; నొకపక్షమున నుదయించుట లేకున్న ననియు భావము. రణాంగణంబునన్ = యుద్ధభూమియందు, కెంపెక్కినచాయన్ = ఎఱుపెక్కిన కాంతిని; ఎఱ్ఱకాంతి ననుట. తాల్చెన్ =ధరించెను.

భా. చంద్రుఁడుదయించునపు డరుణకాంతిని ధరించుట సహజము. ప్రకృత మభ్యుదయము లేకున్నను నరుణకాంతి నాత్రఁడు ధరించెను. ఇది యెట్లు పొసఁగును? శ్రీకృష్ణబాణముల దెబ్బ చే తారకారాణుల స్తనద్వంద్వముల . యొరయికం గర్కశమైన చంద్రునురము చీలుపఁబడె ననియు, నందుండి కాఁగురుధిరము శరీరమంతటను వ్యాపించుటకతన నుదయించుట లేకున్నను బ్రకృత మభివృద్ధిచెడిసను, నరుణగాత్రుఁడయ్యె నని భావము. అనఁగాఁ జెలువేది చందురుండు రక్తసిక్తగాత్రుఁ డయ్యె నని భావము. అలం. విరోధము.

తే. చోద్య మప్పుడు భవరోగవైద్యుఁ డైన
యంబుజోదరు డాసినయంతమాత్ర
నపగతాసాధ్యగదుఁ డయ్యె యట్టిభర్త
సారిచి రుద్రులు నిర్వృక్తశూలు లైరి. 11

టీ. అప్పుడు, భవరోగవైద్యుఁడైన = సంసార మనురోగమునకు వైద్యుఁడగు, అంబుజోదరున్ =శ్రీకృష్ణుని, డాసినయంతమాత్రన్ = సమీపించినంతమాత్రమునచే,

యక్షభర్త=కుబేరుఁడు; కుత్సితదేహుఁడనియు నర్థాంతరము. ఈపక్షమునఁ ద్వగ్రోగి యని భావము. అపగతా.....గదుఁడు-అపగత = నశించిన, అసాధ్య = జీతముకాని, గదుఁడు = గదకలవాఁడు; అపగత = పోయిన, అసాధ్య = సాధ్యముకాని, గదుఁడు = రోగముకలవాఁడు, అని యర్థాంతరము. అయ్యెన్ = ఆయెను, సారిదిన్ =క్రమముగా, రుద్రులు = ఏకాదశరుద్రులును, నిర్ముక్తశూలులు = విడువఁబడిన త్రిశూలములు గల వారు; పోయిన శూలరోగముగలవా రని యర్థాంతరము. ఏరి=అయిరి.

భా. లోకమున నుత్తమవైద్యునిచెంతకుఁ బోఁగానే వివిధరోగములు శూలలు, నివర్తించునటుల సంసారరోగవైద్యుఁడగు శ్రీకృష్ణుని సమీపింపఁగనే కుబేరుఁడు నిరస్తగదుఁడును, రుద్రులు నిర్ముక్తశూలురును నైరని భావము. అనఁగాఁ గుబేరుని గదధ్వస్త మయ్యె ననియు; రుద్రులత్రిశూలములు నిరర్థకము లయ్యె ననియుఁ దాత్పర్యము. అలం. శ్లేషము. అతిశయోక్తి.

సీ. నిర్భగ్నశృంగుఁడై నిజవాహనముఁ దాను
వైవస్వతుఁడు లాఘవంబు నొందె
దళితశాతకృపాణదంష్ట్రి యై నైరృత
భుజభుజంగస్వామి పొల్లువోయె
నిర్ధూతహేతి యై నిలుపునీఱుగ నగ్ని
దేవుండు నిర్వాణతేజుఁ డయ్యె
భయపలాయనవేళఁ బవమానునకు నాత్మ
జవసత్త్వములకల్మి సఫల మయ్యె

తే. వరుణునకు డాఁగికొనఁ జోటు వలఁతి యగుట
సుదధినాయకభావంబు నుపకరించె
జలరుహోదరసవ్యాపసవ్యముక్త
నిష్ఠురాస్త్రంబు లొండొండ నిగుడునపుడు. 12

టీ. జలరుహోదర...స్త్రంబులు - జలరుహోదర = పద్మనాభుఁడగు శ్రీకృష్ణుని యొక్క, సవ్యాపసవ్య=కుడియెడమచేతులచేత, ముక్త = విడువఁబడిన, నిష్ఠుర = క్రూర ములైన, అస్త్రంబులు=బాణములు, ఒండొండన్ = ఒకటితోనొకటి, నిగుడునపుడు = వ్యాపించునపుడు; అనఁగా నొకదానినొకటి యంటి పుఱిఖానుపుంఖముగఁ బ్రసరించు నపు డనుట. వైవస్వతుఁడు=యముఁడు, నిజవాహనమున్ = తనవాహన మగునెనుపోఁ తును, తానున్, నిర్భగ్నశృంగుఁడై=శృంగభంగముగలవాఁడై అని యమపరార్థము. విఱి గినకొమ్ములు గలవై యని మహిషవాహనపరము. శృంగభంగమనఁగా నవమానము గాన

యముఁ డవమానము నంది ననియు, వాహన మగు మహిషమునకుఁ గొమ్ములు విఱిగె ననియుఁ దాత్పర్యము. లాఘవంబుక్ = చులకఁదనమును, ఒందెక్ = పొందెను. కొమ్ములబరువు తగ్గెనుగాన మహిషము లఘుత్వమును బొందె ననుట, నైఋతభుజభుజంగ స్వామి = నైఋతుఁ డను దిక్పాలునియొక్క బాహు వనెడు సర్వశ్రేష్ఠము, దళిత... దంష్ట్రమై-దళిత=చీల్పఁబడిన, శాతకృపాణ = వాఁడియైనకత్తి యనెడు, దంష్ట్రమై = కోరకలదై, పొల్లుపోయెక్=వ్యర్థమయ్యెను; అనఁగాఁ గోరఁబెఱికిన పామువలె నైఋతుఁడు భుజమునందలి కత్తిని గోల్పోయి వ్యర్థుఁడయ్యె ననుట. అగ్నిదేవుఁడు, నిర్ధూతహేతి యై = నష్టమైనజ్వాలలు గలవాఁడై; కత్తిగలవాఁడై యని యర్థాంతరము. నిలువునీఱుగక్=నిశ్చేష్టుఁడై; నిలిచియున్నపాటుగా భస్మమై యని యర్థాంతరము. నిర్వాణతేజుఁడు=నశించినప్రతాపము గలవాఁడు, ఆరిన కాంతిగలవాఁడు, అయ్యెక్. అగ్నిదేవుఁడు తనయాయుధముం గోల్పోయి 'నిస్తేజస్కుఁడై, నిశ్చేష్టుఁడై, మంటలారుట, భస్మరూపముం దాల్చుట, యారిపోవుట' యను సహజధర్మములం బొందెనని భావము. భయపలాయనవేళక్ = భయముతోఁ బరువిడిపోవుసమయమున, పవమానునకుక్ = వాయుదేవునకు, ఆత్మజవసత్వములకల్మి = తనవేగముయొక్కయుఁ, బలముయొక్కయు ననికి, సఫలము=ఫలవంతమైనది, అయ్యెక్; అనఁగా నుపకరించె ననుట. శ్రీకృష్ణునికోల్తల కోర్వంజాలక వాయుదేవుఁడు తనకుఁ గల వేగమును బలమును విని యోగపఱచికొని పాఱిపోయె నని భావము. వాయువు మహావేగుఁడును మహాబలుఁడును గదా! వరుణునకుక్, డాఁగికొనక్=డాఁగుకొనుటకు, చోటు = స్థలము, వలఁతి =సమర్థమైనది, అగుటక్=సంభవించుటంజేసి, ఉదధినాయకభావంబుక్ = సముద్రాధిపత్యముగూడ, ఉపకరించెక్ = ఉపయోగపడెను. వరుణుఁడు సాగరాలయుఁడును సాగరస్వామియుఁ గాన శ్రీకృష్ణబాణప్రహారముల కోడి యుదధిం డాఁగె ననిభావము.

వ. మఱియు నమ్మధుమథను సముద్దండ దోర్దండ మండలీకృత శార్ఙ్గ
కోదండ నిష్ఠ్యూత నిర్భర క్రూర నారాచధారా నిపాతంబున గవాక్షిత
వక్షు లగుయక్షులును, జక్రనిర్వ్యూఢవిక్రమక్రీడలం బరిచ్ఛిన్నకర్ణా
సాధరు లగువిద్యాధరులును, గౌమోదకీప్రహారంబులం జూర్ణీకృత
శిరోమధ్యు లగుసాధ్యులును, నందకాసిధారావిదారణంబును బ్రత్య
వయవశిథిలితానువిద్ధులగుసిద్ధులును, బతంగపుంగవ పక్షవిక్షేపణాహా
తిం దూలి జర్జరు లగునిర్జరులును, ధైర్యంబులతోడన కంకటంబులు
వ్రస్సినం జూలుకఁదనంబు నొంది సాధ్వసోద్రేకంబున భద్రదంతా
వళంబుల డిగ్గ నుఱికి మేరుశిఖరంబులు వ్రాఁకియు రథ్యసారథిసహి

తంబుగా శతాంగంబులు పొడిపొడి యైనం జూర మఱు వెఱుంగక మాతంగశవంబుల క్రింద నీఁగియు భగ్నచరణంబు లై తలకెడపుగం ద్రెల్లినతురంగకళేబరంబులం గాఁగిలించుకొని నిర్జీవులుం బోలె గ్రుక్కుమి క్కనక పక్కెరలు పైఁ ద్రోచుకొనియును సంత్యక్త హేతివర్గంబును సర్వతః ప్రధావనమార్గంబును బ్రవర్తిత ప్రార్థనా లాపంబును బరిధూయమానకేశకలాపంబునుం గాఁ గొండిశీకత్వంబు నొంది తిరుగుడు వడి పాంచజన్యఘోషంబు మున్నుగా దిగంతంబు లంటం బఱచుటయుఁ, బ్రహారమూర్ఛాపరవశు లగుజయంతనల కూబర చిత్రసేనాదులం గనకకమలదళపుటానీయమానంబు లగు నభ్రగంగాపానీయంబుల సేదదేర్చి ఫలకగర్భంబులకుం దార్చి నిజ నివాసంబులకుం జేర్చికొనునా ప్తసేవకవర్గంబువలనను, విలూనదండం బులై పడిన ధవళచ్ఛత్రంబులఁ బ్రఫుల్లపుండరీకంబు లని పరిభ్రాంతి నొడియ నట్టాడుచు నిపాతితవరుణంబై నింగిఁ బేరెంబు వాఱు వాహనహంసంబువలనను, మేదుర మేదఃపంకసంకులంబు లగురుధిర పల్వలంబులు దఱిసి మజ్జన క్రీడాపరాయణం బై చండి వడిఁ గదలమిం గృతాంతుండు విడిచి పోయిన జిఱుకొట్టుచుఁ దిరుగునున్మత్త లులాయంబువలనను, మూర్ఛితక్షీపాకరమండలనిర్గతం బై నిర్గళిత శృంగం బగులాంఛనమృగంబుం గురంగీశంకం దఱిమికొని వెను వెంటం దిరుగుపలాయితపవమానవిముక్తకురంగంబువలనను, వైన తేయచరణ నఖముఖాఘాతనిపాతితంబులై రణధూళిధూసరితంబు లగురుద్రజటామండలమండన శశిఖండఖండంబులఁ గర్ణపూరంబు లుగా నిడుకొనువేడుకం గూడ నొండొరులఁ గడవం *గేరికొను ఋతాళబాలికాజనంబులవలనను, గదనరంగం బభిరామం బయ్యె నయ్యవసరంబున. 13

టీ. మఱియుఁ, అమ్లానమథను...నిపాతంబునఁ -అమ్లానమథను=అమధుసూద నుసియొక్క, సముద్దండ=అధికమైన, దోర్దండ=దండముం బోలు చేతియందు, మండలీ కృత=గుండ్రముగాఁ జేయఁబడిన, శార్ఙ్గకోదండ=శార్ఙ్గమనుధనువునుండి, నిర్ముక్త = విడువఁ బడిన, నిర్భర=పూర్ణమైన, క్రూర = భయంకరమైన, నారాచధారా = బాణధారయొక్క, నిపాతంబునఁ = పడుట చేత; అనఁగా నెడతెగని శ్రీకృష్ణబాణములపాతముచే ననుట.

---

* జేరుకొను.

గవాక్షితవక్షు లగు=కిటికీలవలెఁజేయఁబడిన యొమ్ములుగలవా రగు; అనఁగాఁ జిల్లులుపో యిన యెదలు గలవా రనుట. యక్షులును, చక్ర...క్రీడలన్, చక్ర = సుదర్శన మను చక్రాయుధముయొక్క, నిర్వక్ర=అకుటిలమైన, విక్రమ=పరాక్రమముయొక్క, క్రీడ లన్ =ఆటలచే, పరిచ్ఛిన్నకర్ణనాసాధరులు = తెగినచెవులను ముక్కులను ధరించినవా రగు, విద్యాధరులును; చక్రపుదెబ్బలచేఁ గొందఱకు విద్యాధరులకుఁ జెవులును గొంద ఱకు ముక్కులును తెగె నని భావము. కౌమోదకీప్రహారంబులన్ = కౌమోదకీ యను గదయొక్క దెబ్బలచే, చూర్ణీకృతశిరోమధ్యులు = చూర్ణముగాఁజేయఁబడిన తలనడిమి భాగముగలవారు, అగు=ఐనట్టి, సాధ్యులును, నందకాసిధారావిదారణంబునన్ = నందక మనెడి కత్తియంచుచే బ్రద్దలుచేయుటచే, ప్రత్యవయవశిథిలతానువిద్ధులు = ప్రత్యం గముయొక్క శైథిల్యముతోఁ గూడినవారు, అగు = ఐన, సిద్ధులును; అనఁగా నందకా సిచే నంగములెల్ల విదారితము లగుట నట్టిశిథిలములై న యంగములతోఁ గూడినవా రని తాత్పర్యము. పతంగపుంగవపక్షవిక్షేపణాహతిన్ = పక్షిశ్రేష్ఠ మగు గరుడునియొక్క ఱెక్కల విక్షేపమువలనిదెబ్బ చే, తూలి, జర్జరులు = శిథిలులు, అగు = ఐన, నిర్జరులును, ధైర్యంబులతోడన = ధైర్యముతోఁగూడియే, కంకటంబులు = కవచములు, ప్రస్ఖలన్ = బ్రద్దలుకావా; అనఁగా ధైర్యముతోఁబాటుగఁ గవచములును శీర్ణము లయ్యె ననుట. చులుకఁదనంబున్ =లఘుత్వమును; నీచత్వము ననుట. కవచములు శరీరభారభూతములు జాఱెను గానఁ జులకందనము కల్గె ననియు గ్రహించునది. ఒంది, సాధ్వసోద్రేకంబు న =భయాతిరేకముచే, భద్రదంతావళంబులన్ = భద్రగజములను, డిగ్గన్ = దిగు నట్లుగా, ఉఱికి = గెంతి; దిగి యనుట. మేరుశిఖరంబులు = మేరుపర్వతశిఖరములు, ప్రాఁకియున్ = ఎగఁబ్రాఁకియును, రథ్యసారథిసహితంబుగాన్ = గుఱ్ఱములతోడను సారథి తోడను, శతాంగంబులు=రథములు, పొడిపొడి=చూర్ణము, ఐనన్ = కాఁగా, చొరన్ =చొచ్చుటకు, మఱువు = రహస్యమగుచోటు, ఎఱుంగక = కానక, మాతంగశవంబుల క్రిందన్ = చచ్చిన యేనుఁగులక్రిందను, ఈఁగియున్ = అణఁగియును, భగ్నచరణం బు లై =నఱుకఁబడినకాళ్ళుగలవై, తలకెడవుగన్ =తొఱుమాఱు మెడలు కలుగునట్లుగా, త్రెళ్లిన=భువిం బడిన, తురంగకళేబరంబులన్ =గుఱ్ఱములశరీరములను, కౌఁగిలించుకొని = ఆలింగనముచేసికొని, నిర్జీవులుం బోలెన్ = ప్రాణములేనివారువలె, గ్రుక్కుమిక్కనక = ఊపిరితీయక గుటకవేయక, పక్కురలు = ఏనుఁగు గుఱ్ఱము మున్నగువానివీపుపై వేయు బట్టలను, పైక =తమమీఁద, త్రోచుకొనియును = వైచికొనియును; అనఁగా వానిని గప్పికొని యనుట. సంత్యక్త హేతివర్గంబును=విడువఁబడిన యాయుధములుగలవారును, సర్వతఃప్రధావనమార్గంబును = అంతటను బరుగెత్తుత్రోవ గలవారును; అనఁగా మార్గమంతటను బరుగెత్తుచుండి రనుట. ప్రవర్తిత ప్రార్థనాలాపంబును = చేయఁబడిన

ప్రార్థనావాక్యములు గలవారును; అనఁగా విడువు మని వేఁడికొనుచుండి రనుట. పరిధూయమానకేశకలాపంబునుర్ = చెదరి చలించు శిరోజములుగలవారును, కాక్ = అగునట్లుగా, కాందిశీకత్వంబుర్ = భయముచే నల్దిక్కులఁ కేఁగుటను. ఒంది = పొంది, తిరుగుడుపడి = సంభ్రమమునంది, పాంచజన్యఘోషంబు = శ్రీకృష్ణ విజయశంఖధ్వని, మున్నుగాక్ = ముందుగాఁగ, దిగంతంబులు=దిశలకొసలు, అంటక్ = చేరునట్లు, పటుచుటయుక్ =పరుగెత్తఁగా, పైయసమాపకక్రియలకెల్లను బైని బేరొక్కనఁబడిన యక్ష సాధ్య విద్యాధరాది పదములు కర్తలు. ప్రహారమూర్ఛాపరవశులు = దెబ్బలచేసైన యింద్రియముల తెలివి తప్పుటచే నస్వాధీనులు, అగు = ఐనట్టి, జయంతనలకూబర చిత్రసేనాదులక్ = జయంతుఁడు - నలకూబరుఁడు - చిత్రసేనుఁడు మొదలగువారిని, కనకకమలదళపుటానీయమానంబు లగు = బంగరుపద్మములరేకులచేసైన దొప్పలచేఁ దీసికొనిరాఁబడినవైన, అభ్రగంగా పానీయంబులక్ = ఆకాశగంగోదకములచే, సేదదేర్చి = శ్రమ మపనయించి, ఫలకగర్భంబులకుక్ = పీఁటలనడిమికి, తార్చి = పొందించి, నిజనివాసంబులకుక్ = తమయిండ్లకు, చేర్చికొను = పొందించుకొను, ఆప్తసేవకవర్గంబువలనను=ఇష్టులగు భృత్యులసమూహమువలనను; అనఁగా సేవకులు తమస్వామి కుమారాదులను మిన్నేటిసీటిని దెచ్చి ప్రహారములవలని మూర్ఛఁ దేర్చి మెల్లఁగ ఫలకగర్భంబులందార్చి యిండ్లకుఁ గొనిపోయి రనుట. విలూనదండంబులై = శిథిలములైన కట్టెలుగలవై; అనఁగా జాఱినకట్టెలు గల వనుట. పడిన = భూమిపైఁబడిన, ధవళచ్ఛత్రంబులక్ =వెల్లగొడుగులను, ప్రఫుల్ల పుండరీకంబులు = వికసించిన తెల్లఁదామరలు, అని పరిభ్రాంతిక్ = మోహముతో, ఒడియక్ = గ్రహించుటకు, అట్టాడుచుక్ = చుట్టుపట్ల వదలక సంచరించుచు, నిపాతితవరుణం బై = పడఁద్రోయఁబడిన వరుణుఁడు గలదై, నింగిక్ = ఆకసమున; పేరెంబువాఁయు = పరుగెత్తుచున్న, వాహనహంసంబులనను = వాహనమైన హంసవలనను; అనఁగా వరుణవాహన మగు హంస దండములు తెగి భువిఁ బ్రెళ్లిన వెల్లగొడుగులం గాంచి తెల్లఁదామర లను భ్రమం జెంది తనకుఁ దామరలు ప్రియమైనవి గానఁ దనరాతుకు వరుణుని దిగఁద్రోసి యా వెల్లగొడుగులదరి కేఁగి తిరుగుచుండె నని భావము. మేదురమేదఃపంకసంకులంబు లగు = దట్ట మగు మేదస్సనెడు బురదచే విస్తారములైన, రుధిరపల్వలంబులక్ = నెత్తుటి గుంటలను, బురదంబోలు మేదస్సుతోడను, నిండిన నెత్తుటిచే నిండిన చిన్నచిన్న పల్లపునేలల నని భావము. తఱిసి = సమీపించి, మజ్జన క్రీడాపరాయణంబై = ముసుంగుట యనునాటయం దాసక్తిగలదై, చండి = చండితనమునంది, వడిక్ = శీఘ్రముగా, కదలమిక్ = కదలకుండుటచే, కృతాంతుండు=యముఁడు, విడిచి, పోయినక్ = పోఁగా, జిఱికొట్టుచుక్ =బుసకొట్టుచు, తిరుగు = సంచరించు, లులాయంబువలనక్ = ఎనుపోతువలనను;

అనఁగా యమవాహన మగు మహిష మాకదనరంగమున నచ్చటచ్చట మేదస్సు తోడను రక్తముతోడను నిండిన చిన్న చిన్న గుంటలం గాంచి బురదనీటిగుంట లనుభ్రమఁ జెంది తనకు బురదనీటిగుంటలందు మునంగు కోర్కి మిక్కుటముగానఁ దనస్వామి యెంత యదలించినను మొండితనము పూని కదలక యుండె ననియు, దాన వాతఁడు దానిని విడిపెట్టి పోయె ననియుఁ, బిదప నది బుసకొట్టుచు నచ్చోఁ దిరుగుచుండె ననియుఁ దాత్పర్యము. మూర్ఛితక్షీపాకరమండల నిర్గతం బై=మూర్ఛనందిన చంద్రుని యొక్క మండలాకృతినుండి వెడలినదై, నిర్గళిత శృంగం బగు = జాఱినకొమ్ములు గల దైన, లాంఛనమృగంబుక్ = చంద్రలాంఛన మగు కురంగమును; చంద్రునియందలి మచ్చను గొందఱు కురంగము గను గొందఱు భూచ్ఛాయ గను మఱికొందఱు వేఱొక రీతిగను భావించి రనుట ప్రసిద్ధము. అందిచ్చోఁ గురంగరూపమునసే యది సంభావిత మయ్యె నని యెన్నునది. కురంగీశంకక్ = ఆఁడులేడి యనుభ్రమతో, తటిమికొని= వెంబడించి, వెనువెంటక్ = వెనుకవెనుకను, తిరుగు = సంచరించు, పలాయిత పవమాన విముక్త కురంగంబువలనను = పాఱిపోయిన వాయుదేవునిచే విడువఁబడిన మగలేడివల నను; వాయుదేవునకు లేడివాహనము. ఆతఁ డద్దాని నచ్చోఁ దిగవిడిచి యుద్ధరంగ మునుపీడి భయమునఁ బాఱిపోయెను. పిదప నది యుద్ధమునఁ గొమ్ములు గోల్పోయిన చంద్రలాంఛన మగు కురంగముం గాంచి యాఁడులేడికిఁ గొమ్ము లుండకుండుట సహజ మాటంజేసి ప్రకృతము దీనికిఁ గొమ్ములు లేమిఁజేసి యాఁడులేడి యను భ్రమనంది దాని వెంబడించి తిరుగుచుండె నని తాత్పర్యము. వైనతేయ.....నిపాతితంబులై = వైనతేయ = గరుడునియొక్క, చరణ=కాళులందలి, నఖ = గోళులయొక్క, ముఖ = కొనలయొక్క, ఆఘాత=దెబ్బలచే, నిపాతితంబులై = క్రిందఁ ద్రోయఁబడినవై, రణ ధూళి ధూసరితంబు లగు = యుద్ధముదందలి పరాగముచే ధూమ్రవర్ణము గల వైన, రుద్రజటామండల మండన శశిఖండఖండంబులక్ -రుద్ర=పదునొకొండుగు రగు నీశా నులయొక్క, జటామండల = జటామండలములకు, మండన = అలంకారములైన, శశిఖండ = చంద్రకళల సంబంధమైన, ఖండంబులక్ = ముక్కలను, కర్ణపూరంబు లుగాక్ =కర్ణాభరణములుగా, ఇడుకొను = పెట్టుకొనునట్టి, వేడుకక్ కూడక్ =సంతోష ముతోఁగూడ, ఒండొరులక్ =ఒకరినొకరు, కడవక్ = అతిక్రమించుటకై, కేరికొను = ఉత్సహించు, బేతాళ బాలికాజనంబులవలనను = బేతాళ కన్యాసమూహములవలనను; అనఁగా నేకాదశరుద్రులజటామండలముల కలంకారము లైన శశిఖండములు గరుడ నఖాఘాతములచే ముక్కముక్కలై యుద్ధభూమిని రాలి యందలిధూళిచే ధూసరితము లయ్యె నని యట్టి యాముక్కలను కర్ణాభరణములుగాఁ జేయఁదలంచినవారై యచటి

భూతబాలిక లన్యోన్య మాముక్కలకై యహమహమికతో నొకరికన్ము దొకరు పఱుగిడుచుండి రనియు భావము. కదనరంగంబు = యుద్ధభూమి, అభిరామంబు = మనోహరమైనది, అయ్యెన్, అయ్యవసరంబునన్ = ఆసమయమునందు; పైనివర్ణించిన ప్రకారము సేవకులు, హంస, మహిషము, కురంగము, వేతాళబాలికలు ప్రవర్తించుటం బట్టి, యుద్ధభూమి మనోహర మయ్యె నని యెన్నినది.

విశే. ఈసందర్భమునఁ గవి నిపుణముగా నీశానుల పరాభవమును సూచించెను గాని తక్కినదేవతలకువలె నిష్ఠురముగా వర్ణింపఁడయ్యెను.

చ. హరిహయుఁ డాగ్రహోజ్జ్వలితుఁ డై యనిఁ బాఱుదిశాధినాథులన్
దిరుగుఁడు పోకుపోకుఁ డని తిట్టి యదల్చి నవోదయత్పయో
ధరము నలంకరించు తనధన్వ మధిజ్యము చేసి గోత్రభీ
కరముగ బాహు లెత్తి తమకంబున సేనకుఁ జేయివీచినన్. 14

టీ. హరిహయుఁడు=దేవేంద్రుఁడు, ఆగ్రహోజ్జ్వలితుఁ డై = కోపముచే నుద్దీప్తుఁడై, అనిన్ =యుద్ధమునుండి, పాఱు = పరుగెత్తు, దిశాధినాథులన్ = దిక్పతులను, తిరుగుఁడు=మఱలుఁడు, పోకుపోకుఁడు = పోకుఁడుపోకుఁడు, అని, తిట్టి = దూషించి, అదల్చి=భయపెట్టి, నవోదయత్పయోధరమున్ = క్రొత్తఁగా నుదయించిన మేఘమును; అనఁగాఁ దొలుకారుమొగులు ననుట. అలంకరించు = భూషించు; ఇంద్రధనువు మేఘమునకు శోభను గలుగఁజేయునదియు, సామాన్యముగఁ దొలుకారునఁ గల్గునదియు నగుఁగదా. దానిని బోలున దని తాత్పర్యము. తనధన్వము = తనవింటిని, అధిజ్యము చేసి = ఎక్కుపెట్టి గోత్రభీకరముగన్ = కొండలకు భయంకర మగునట్లుగా; రాజులకు భయము గలుగునట్లుగా ననియు నర్థాంతరము. బాహులు = చేతులు, ఎత్తి = పైకెత్తి, తమకంబునన్ =సంభ్రమముతో, సేనకున్ =సైన్యమునకు, చేయి+వీచినన్ = రం డని హస్తమెత్తి సంజ్ఞ సేయఁగా.

విశే. అధిజ్యము = ఎక్కుపెట్టినవారి గలది.

క. గిరితటముఁ డాఁకి తిరిగెడు
తరంగిణియుఁ బోలె దేవతాపతియాజ్ఞన్
మరలి వియచ్చరవాహిని
మురహరునిం బొదివి ఘోరముగఁ బోరునెడన్. 15

టీ. వియచ్చరవాహిని=దేవసైన్యము; దేవనది యినియు నర్థాంతరము. గిరితటమున్ =పర్వతతటమును, డాఁకి=అంటి, తిరిగెడు=మరలునట్టి, తరంగిణియుఁబోలెన్ = నదివలె, దేవతాపతియాజ్ఞన్ =దేవేంద్రునియాజ్ఞచే, మరలి=తిరిగి, మురహరునిన్ = శ్రీకృష్ణుని,

పొదివి=కప్పి, ఘోరముగన్ = భయంకరముగ, పోరు సెడన్ = యుద్ధము సేయుసమయ
మున. అలం. ఉపమ. ఇంద్రనియాజ్ఞ గిరితటమువలెను, వియచ్చరవాహిని తరంగిణి
వలెను, గిరితటము తాఁకువలె నింద్రనియాజ్ఞాశ్రవణమును, మరలునదివలె సైన్యము
మరలుటయు నొప్పెను.

ఉ. *ఱంగనుఱ్ఱోఁత ఱ్ఱోఁగుచును తెక్కలపాములువోలె శౌరిచే
సింగిణివింట వెల్లిగొనుచిత్రశరంబులు సూతు నొంచి ర
థ్యాంగకము ల్దళించుచు నిజావయవంబులఁ దూల్ప దేవతా
పుంగవుఁ డోసరించుటయు బోరన నడ్డముసొచ్చె సైన్యముల్. 16

టీ. ఱంగనుఱ్ఱోఁతన్ = ఱంగనుధ్వనితో, ఱ్ఱోఁగుచును = ధ్వనిచేయుచు,
తెక్కలపాములువోలెన్ =తెక్కలుగలసర్పములవలె, శౌరిచేసింగిణివింటన్ =శ్రీకృష్ణుని
చేతియందలి సింగిణివింటనుండి, వెల్లిగొనుచిత్రశరంబులు = ప్రవహించుచిత్రములైన
బాణములు, సూతున్ = సారథిని, నొంచి=నొప్పించి, రథ్యాంగముల్ = గుఱ్ఱములయవ
యవములను, దళించుచున్ = చీల్చుచు, నిజావయవంబులన్ = తన యవయవములను,
తూల్పన్ = సంచలింపఁజేయఁగా; అనఁగా శ్రీకృష్ణబాణములు ధ్వనిచేయుచుఁ బరంప
రగా నేతెంచి యింద్రునిసారథిని నొప్పించి గుఱ్ఱములయవయవములఁ జీల్చి యింద్రుని
యంగములం గూడ బాధించె ననుట. దేవతాపుంగవుఁడు = దేవేంద్రుఁడు, ఓసరించు
టయున్ =వెనుదీయఁ (తొలఁగఁ) గానే, బోరనన్ =శీఘ్రముగా, సైన్యములు, అడ్డము
సొచ్చెన్ = మధ్యపడెను.

మ. మది నొక్కించుక శంక లేక సమరోన్మాదంబునం బేర్చి బె
ట్టిద మై తాఁకినదేవతారథికకోటిం గిట్టి తూలించె సు
న్మదవేదండఘటాతమశ్చయనిశమ్మన్యంబుఁ దత్సైన్యమున్
గదచే శార్ఙ్గముచే రథాంగకముచేఁ గంసారి హింసారతిన్. 17

టీ. మదిన్ = మనస్సునందు, ఒక్కించుక = కొంచెమైనను, శంక=సందేహము,
లేక; అనఁగా మనము శ్రీకృష్ణుని గెల్వఁగలమా యనువిచారమును మాని యనుట. సమ
రోన్మాదంబునన్ = యుద్ధోన్మత్తతచే, పేర్చి = విజృంభించి, బెట్టిదమై = భయంకరమై,
తాఁకిన=ఎదురొక్కిన, దేవతారథికకోటిన్ = సురరథికులగుంపును; రథముల నున్నసురల
ననుట. ఉన్మ...నిశమ్మన్యంబున్ -ఉన్మద = అధికమదముగల, వేదండఘటా = గజబృం
దములనెడు, తమశ్చయ = చీఁకటులచే, నిశమ్మన్యంబున్ = రాత్రియనితలంపఁదగినట్టి,

* ఱంగున మోము ఱ్ఱోయుచును.

తత్సైన్యమున్ = ఆదేవసైన్యమును, గదచేన్ = కౌమోదకిచేతను, శార్ఙ్గముచేన్ = శార్ఙ్గ మను ధనుస్సుచేతను రథాంగకముచేన్ = సుదర్శన మనుచక్రముచేతను, కంసారి = శ్రీకృష్ణుఁడు, హింసారతిన్ = హింసయందైన యాసక్తితో; అనఁగా హింసింతు ననునుత్సాహముతో ననుట, కిట్టి = తొడరి, తూలించెన్ = పాఱఁదోలెను.

ఉ. సైనికు [1]లెల్ల నంత రణసన్నహనం బెడలించి పాఱిన
న్నానయు నచ్చలంబు మది నాటుకొనంగఁ గపోలమండలీ
దానమిళద్ద్విరేషనినదంబుల ఘీంకృతి సంపడింప వె
ల్లేనుఁగు మీఁద డీకొలిపి యింద్రుఁడుపేంద్రునిఁ దాఁకె నుగ్ధతిన్.

టీ. అంతన్, సైనికులెల్లన్ = సేనలోనివారెల్లను, రణసన్నహనంబు = యుద్ధసన్నాహమును, ఎడలించి = సడలించి; అనఁగా యుద్ధయత్నమును విడిచి యనుట. పాఱినన్ = పాఱిపోఁగా; నానయున్ = సిగ్గును, అచ్చలంబున్ = ఆగ్రహమును, మదిన్, నాటుకొనంగన్ = నాటఁగా, కపోల.....నినదంబులన్ - కపోలమండలీ = గండస్థలముయంధైన, దాన=మదముకొఱకు, మిళత్ = చేరిన, ద్విరేఫ = తుమ్మెదలయొక్క, నినదంబులన్ = ధ్వనులతో, ఘీంకృతి = ఘీంకారము, సంపడింపన్ = సంపడిచేయఁగా; కలిసికొనఁగా ననుట. వెల్లేనుఁగున్ = తెల్లయేనుఁగగు ఐరావతమును, మీఁదన్ = శ్రీకృష్ణునిపైకి, డీకొలిపి=పురికొలిపి, ఉగ్ధతిన్ = గర్వముతో, ఇంద్రుఁడు, ఉపేంద్రునిన్ = ఇంద్రావరజుని శ్రీకృష్ణుని, తాఁకెన్.

క. పునరాగతుఁడగుమఘవునిఁ
గనుఁగొని తనమ్రోల సున్న కామినినెమ్మో
మున దృష్టి నిలిపి మురమ
ర్దనుఁ డిట్లను హాసగర్భిత[2]క్రోధోక్తిన్. 19

టీ. పునరాగతుఁడగు = తిరుగవచ్చిన, మఘవునిన్ = ఇంద్రుని, కనుఁగొని = చూచి, తనమ్రోలన్ = తనయెదుట, ఉన్న కామినిసెమ్మోమునన్ = ఉన్న స్త్రీయొక్క మనోహరమగు ముఖమునందు; సత్యమొగమునం దనుట, దృష్టి=చూపును, నిలిపి, హాసగర్భితక్రోధోక్తిన్ = నగవుచే గర్భితమైన కోపోక్తితో, ఇట్లనున్ = ఇట్లనెను.

విశే. సత్యమొగమునఁ జూపునిల్పుటకుఁ దన పౌరుషాతిశయమును, వాసవుని పరాభవమును శ్రేయసికిఁ బ్రకాశింపఁజేయుటయే ఫల మని గ్రహించునది.

---

1. లివ్విధింగదనసన్నహనం. 2. ప్రౌఢోక్తిన్.

ఉ. అచ్చరలేమ లెల్లన నగ నాహవభూస్థలిఁ దానుఁ దోడుగా
వచ్చిన తద్దిశాధిపతివర్గములుం దల లూడఁ బాఱియు
న్మచ్చటులాస్త్రఘట్టన మనంబున నెంచక నానగండయై
వచ్చినవాఁడు చూచితివె వాసవునిం గమలాయతేక్షణా! 20

టీ. అచ్చరలేమలెల్లన్ = అప్సరస్త్రీలెల్లరును, నగన్ = నవ్వఁగా, ఆహవ భూస్థలిన్ = యుద్ధభూమియందు, తానున్, తోడుగాన్ = సహాయముగా, వచ్చిన, తద్దిశాధిపతివర్గములున్ = ఆ దిక్పాలురును, తలలు, ఱూడన్ = ఱూడఁగా; అనఁగాఁ దలవెండ్రుకలు వీడఁగా ననుట. పాఱియున్ = పరుగెత్తియు, మచ్చటులాస్త్ర ఘట్టనన్ = నాసంబంధమైన తీక్ష్ణము లగు వస్త్రములరాపిడిని, మనంబునన్ = మది యందు, ఎంచక = గణింపక, నానగండయై = సిగ్గులేనివాఁడై, వచ్చినవాఁడు, కమలాయతేక్షణా = పద్మములవలె దీర్ఘములగు కన్నులు గలదానా! వాసవునిన్ = ఇంద్రుని, చూచితివె = చూచితివా.

వ్యా-విశే. వచ్చినవాఁడు: వచ్చె ననునర్థమున వర్తమానకాలికప్రయోగము. "వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు" అని తిక్కన భారత ప్రయోగము. "తల లూడన్" అనుచో "తల" అనుదానికి లక్షణాశక్తి నంగీకరించి శిరోజ మర్థము చేయఫలయును. లేదా "తల లోడ" ననుదానికిఁ దలలు బ్రద్దలగుట యనియైన నర్థము చెప్పవలయును.

ఉ. చూడుము నన్ను నంచు మధుసూదనుఁ డమ్మరిఁ బోసి తద్భుజా
క్రోడము గాఁడ నేసిన నకుంఠితుఁ డై సురరాజు కృష్ణు నీ
రేడుశరంబుల న్ఖగకులేశ్వరు ముప్పదిరెంట నేసెఁ బే
ర్వాడి తదన్యదిక్పతులు గ్రక్కున గంధగజాధిరూఢు లై. 21

టీ. చూడుము, నన్నున్, అంచున్; అనఁగా నాప్రతాపముం బరీక్షింపు మనుట. మధుసూదనుఁడు=శ్రీకృష్ణుఁడు, అమ్ము=బాణము, అరిన్ = అల్లెత్రాటియందు, పోసి = కూర్చి, తద్భుజాక్రోడము=ఆదేవేంద్రుని భుజమధ్యప్రదేశము, కాఁడన్ = గ్రుచ్చుకొనునట్లు, ఏసినన్ =ప్రయోగింపఁగా, అకుంఠితుఁడై = మొక్కవోనివాఁడై; అనఁగా నొప్పి నందనివాఁ డనుట. సురరాజు=దేవేంద్రుఁడు, కృష్ణున్, ఈరేడుశరంబు లన్ = ఈరు + ఏడు=పదునాలుగుబాణముల చేతను, ఖగకులేశ్వరున్ =గరుడుని, ముప్ప దిరెంటన్ = ముప్పదిరెండుబాణముల చేతను, ఏసెన్, పేర్వాడి = మిగులవాడి, తదన్య

దిక్పతులు = దేవేంద్రునికన్న నితరులగుదిక్పాలురు; అనఁగా దేవేంద్రుఁడు తనపరాక్రమముం జూపుటయుఁ దాము చూపఁజాలకుండుటయు ననుసరించి దిక్పాలురు వసివాడి రనుట, గ్రక్కునన్ = శీఘ్రముగా, గంధగజాధిరూఢులై = మత్తగజముల నెక్కినవారై, ముందటిపద్యముతో నన్వయము.

చ. అనలుఁడు రెండు మూఁడు యమునఁ డాసురనాథుఁడు నాలుగైదుతో
యనిధిపుఁ డాఱు గంధవహుఁ డర్థపుఁ డేడు మహేశుఁ డెన్మిదిన్
ఘనవిశిఖంబు లేయ మురఘుస్మరుఁ డన్నియుఁ ద్రెంచి శార్ఙ్గసం
జనితమహోగ్రభల్లముల జర్జరితాంగులఁ జేసె నంబఱన్. 22

టీ. అనలుఁడు=అగ్ని, రెండున్=రెండు బాణములను, యమునఁడు, మూఁడున్, ఆసురనాథుఁడు=నిర్ఋతి, నాలుగు, తోయనిధిపుఁడు = వరుణుఁడు; ఐదు, ఆఱు, గంధవహుఁడు=వాయుదేవుఁడు, అర్థపుఁడు=కుబేరుఁడు, ఏడు, మహేశుఁడు = ఈశానుఁడు, ఎన్మిదిన్, ఘనవిశిఖంబులు=గొప్ప బాణములను, ఏయన్ = ప్రయోగింపఁగా, మురఘుస్మరుఁడు=మురాసురహంత యగు శ్రీకృష్ణుఁడు, అన్నియున్ = ఆబాణములెల్లను, త్రుంచి = ముక్కలుగాఁ జేసి, శార్ఙ్గ.....భల్లములన్ -శార్ఙ్గ = శార్ఙ్గమను తనధనువునుండి, సంజనిత=పుట్టిన, మహోగ్ర=మిక్కిలి క్రూరములైన, భల్లములన్ = బాణములచే, అందఱన్ = ఆ దిక్పతులనెల్లను, జర్జరితాంగులన్ =వివశ మగు నవయవములు గలనారినిగా, చేసెన్.

విశే. ఇం దింద్రుని ప్రథమదిక్పతిగా నెంచి ప్రదక్షిణక్రమమున దిక్పాలురు నిర్దిష్టు లైరి. అపు డగ్నాద్యది దిక్పాలురకు రెండవదిక్పతి మూఁడవదిక్పతి యను మున్నగుసంజ్ఞలు గల్గును. దాని ననుసరించి యెన్నవదిక్కున కధిపతియైన వాఁ డన్ని బాణములనే ప్రయోగించె నని కవి చమత్కారముగాఁ జెప్పినాఁడు.

ఆ. వేల్పుమ్రానియందు వేడుకపడుకూర్మి
సతులకోర్కి దీర్పఁ జాలి యపుడు
హరియు హరియుఁ బోరి రన్యోన్యజయకాంక్ష
నసురజీవితాపహాశుగముల. 23

టీ. వేల్పుమ్రానియందున్ = కల్పవృక్షమందు, వేడుకపడు = సంతోషపడు నట్టి;అనఁగాఁ గల్పవృక్షమునం దాసక్తులైన యనుట. కూర్మిసతులకోర్కి = ప్రియసతుల కోర్కిని; శచికి సురద్రుమము ప్రియతమము. సత్యకును బ్రియతమమే. కాన నిర్వురు సతులును గల్పకమునందుఁ గోర్కిగలవా రనుట. తీర్పఁజాలి = చక్కఁజేయఁజాలి

అపుడు=ఆసమయమున, హరియుక్=ఇంద్రుఁడును, హరియుక్ = శ్రీకృష్ణుఁడును, అన్యోన్యజయకాంక్షక్=ఒకరినొకరు జయింపవలె ననెడుకోర్కితో, అసురజీవితాపహాశుగములక్ -అసుర=రాక్షసులయొక్క, జీవిత=ప్రాణములను, అపహ=నశింపఁజేయు నట్టి, ఆశుగములక్ =బాణములచేత, పోరిరి=యుద్ధముచేసిరి.

వ్యా-విశే. ఇందు యుద్ధముచేయు నిద్దఱికిని బే రొక్కటే యనియు, యుద్ధకారణము నొక్కటే యనియు, వారి బాణములస్వభావముగూడ నొక్కరీతిదే యనియుఁ గవి చమత్కారముగ వచించినాఁడు. ఆశుగ=శీఘ్రముగఁ బోవునది.

క. మురహరబలహరు లిట్లొం
డొరుతూపులఁ గప్పఁబడుట నొదవించిరి త
మ్మిరువుర గనుఁగొనఁ దివిరెడు
గరుడోరగముఖులకోరికకు విఘ్నంబుల్. 24

టీ. మురహర బలహరులు = మురాసురుని జంపిన శ్రీకృష్ణుఁడును, బలాసురుని సంహరించిన దేవేంద్రుఁడును; అసురసంహారమున నిద్దఱును సములే యనుట. ఇట్లు = ఈతీరుగ, ఒండొరుతూపులక్ =ఒకరిబాణములచే నొకరు, కప్పఁబడుటక్ = ఆచ్ఛాదితు లగుటచే, తమ్మిరువురక్ =తమ్ము నిర్వురను. కనుఁగొనక్ =చూచుటకు, తివిరెడు = యత్నించెడునట్టి, గరుడోరగముఖులకోరికకుక్ = గరుడులు ఉరగులు మొదలగువారి యొక్క కోరికకు, విఘ్నంబుల్ =అంతరాయములు, ఒదవించిరి.

భా. గరుడాదిఖచరులు దేవేంద్రకృష్ణుల యుద్ధకౌశలముం గాంచ దివి నుండి రనియు, వా రొండొరుబాణముల యాచ్ఛాదనమున వారికిఁ గన్పడకుండి రనియు భావము. అలం. పర్యాయోక్తి.

చ. అలుఁగుల దట్టమై పొడమునగ్నికణంబులు సోఁకి పైగఱుల్
వొలిసియుఁ దొంటివేగ ముడివోక క్రమంబున నొండొకంటిఁ బెం
జలుగొని త్రోచికొంచు శరసంఘము దాఁకు విస్తృతా
ఖిలసురసిద్ధసాధ్యముగఁ గృష్ణుఁడు జిష్ణుఁడుఁ బోర నయ్యెడన్. 25

టీ. కృష్ణుఁడుక్, జిష్ణుఁడుక్ = దేవేంద్రుఁడును, పోరక్ = కలహింపఁగా, అయ్యెడక్ =ఆసమయమున, అలుఁగులక్ =బాణములనుండి, దట్టమై = సాంద్రముగా, పొడము=పుట్టునట్టి, అగ్నికణంబులు=నిప్పుకలు, సోఁకి=అంటి, పైగఱుల్ = పైనున్న ఱెక్కలు, పొలిసియుక్ = నశించియును; అనఁగాఁ గాలిపోయిన వనుట. తొంటి వేగము=ఱెక్క లున్నపుడు గలత్వర, ఉడివోక=నశింపక, క్రమంబునక్ = వరుసగా,

ఒండొకంటిక్ =ఒకటినొకటి, పింజలుగొని=గ్రుచ్చుకొని, త్రోచికొంచుక్ = రాపాడుచు, శరసంఘము=బాణసమూహము, విస్మితాఖిలసురసిద్ధసాధ్యముగక్ = ఆశ్చర్యమునందిన సమస్తమైన సురలు, సిద్ధులు, సాధ్యులు నగునట్లుగా, లక్ష్యముక్ = చేరవలసిన చోటును, తాకుక్ =అంటును.

భా. ఇంద్రోపేంద్రులు ప్రయోగించుకొమ బాణముల రాపిడివలన నగ్నికణములు చేగి యాబాణములొక్కలు దగ్ధము లయ్యె ననియు, ఱొక్కలు లేకున్నను బాణములు వేగమువీడక పరస్పరము రాపాడుచు నేగి పుంఖానుపుంఖముగ లక్ష్యము లందుఁ దగులొక్కుచుండె ననియు, నాకృత్యమును జూచి సురసిద్ధసాధ్యాదిఖచరు లాశ్చర్యము నంది రనియు భావము. అలం. అతిశయోక్తి.

తే. ఘోరముగ మింటఁ బందిరిగొని జగంబు
నంధముగఁ జేయునిరుపురయంపగములు
నొండొకటి దాఁకి క్రొమ్మంట లొదవి తామ
చూర్ణమై పోవ ముద మయ్యెఁ జూపఱకును. 26

టీ. ఘోరముగక్ = భయంకరముగ, మింటక్ = ఆకాశమున, పందిరిగొని = పందిరివలె నొప్పి, జగంబుక్ =లోకమును, అంధముగక్ =గుడ్డిదిగ, చేయు = చేయునట్టి, ఇరువురయంపగములుక్ =ఇంద్రోపేంద్రులు ఇరువురి బాణసమూహములును, బాణముల సమూహము లాకసమున వ్యాపించి పందిరివేసినట్లు గప్పియుంట సూర్యరశ్మి భువిపైఁ బడ లేదనియు దాన లోక మంధ మయ్యె ననుట. ఒండొకటిక్ =అన్యోన్యము, తాఁకి= ముట్టి, క్రొమ్మంటలు=క్రొత్తమంటలు, ఒదవి=పుట్టి, తామ = తమకుఁదామే, చూర్ణమై= భస్మమై, పోవక్ =నశింపఁగా, చూపఱకును = చూచువారలకు, ముదము = సంతోషము, అయ్యెక్ = సంభవించెను. ఆట్టి క్రూరసారాచము లేరి కట్టిబాధ యొదవించునో యని భయపడుచుండ నవి తామే చూర్ణమగుటంజేసి చూపఱకు సంతస మయ్యె నని భావము.

వ్యా - విశే. అమ్ము+గములు = అంపగములు, సమాసమునఁ గొండొకచో నామ్వాదికనుమ్వాదుల ముపర్ణంబులు పజ్వపర్ణంబు లగును. చూపఱు=ఇదిబహువచనము.

క. అలనాఁటినన్ను మఱచితె
నిలు నిలుమీ తగినయాజ్ఞ నీ కిదె యంచుం
బులుఁగులతోని మహేంద్రుం
డలుఁగుల పెనుగూఁటఁ జిక్కునట్లుగ నేసెన్. 27

టీ. మహేంద్రుఁడు = దేవేంద్రుఁడు, అలనాఁటినన్ను = ఆనాఁడు సీతో యుద్ధముచేసిన నన్ను; గరుడుఁ డమృతము నపహరించునపుడు దేవేంద్రుఁ డడ్డుతగిలి

యుద్ధముచేసె ననుట. మఱచితె = మఱచితివా? నిలునిలుమా? = నిలువుమ నిలువుమా, నీకుక్, ఇదె=ఇదిగో, తగినయాజ్ఞ=తగినశిక్ష, అంచుక్, పులుగులజోనిక్=పక్షీంద్రుడగు గరుడుని, అలుగుల పెనుగూటక్=బొణనిర్మితమైన పెద్దగూడునందుఁ చిక్కునట్టుగక్ = కట్టువడునట్లుగ, ఏసెక్.

విశే. పక్షి గూడునం దుండుట సైజము గానఁ బక్షీంద్ర మగు గరుడున కలుఁగులపెనుగూడే యింద్రు డేర్పఱిచె నని చమత్కారము. నిలువుమా + నిలువుమా = నిలునిలుమా, మధ్యమ మువర్ణమునకు లోపమును గడవ్రాయికి లోపంబును గల్గెను. అలం. పరికరము.

మ. అలుకం గంసవిభేది నందకముచే నయ్యస్త్రము ల్బ్రుంచి వే
బలుదూపు ల్దృఢముష్టిఁ గూర్చి బలభిద్భద్రేభకుంభంబు ప్ర
క్కలుగా నేసినఁ బోరునం దొరఁగె ముక్తాశ్రేణి పైపై హిమా
చలశృంగావతరన్నభశ్చరధునీచంచత్ప్రవాహాకృతిన్. 28

టీ. కంసవిభేది=శ్రీకృష్ణుఁడు, అలుకక్ =కోపముతో, నందకముచేక్ = నందకమను కత్తిచే, అయ్యస్త్రముల్ = ఆయస్త్రములను, బ్రుంచి, వే = శీఘ్రముగ, బలుతూపుల్ =విస్తారములైన బాణములను, దృఢముష్టిక్ =దృఢమైన ముష్టిచే, కూర్చి = సంధించి, బలభిద్భద్రేభకుంభంబు = దేవేంద్రుని మంగళగజముయొక్క కుంభస్థలము; అనఁగా నైరావతకుంభ మనుట, ప్రక్కలు=ముక్కలు, కాక్ = అగునట్లు, ఏసినక్, హిమాచల.....కృతిక్-హిమాచల=మంచుకొండయొక్క, శృంగ = శిఖరమునుండి, అవతరత్ =జాఱుచున్న, నభశ్చరధునీ=మిన్నేటియొక్క, చంచత్ = గంతులిడు, ప్రవాహ = నీటివెల్లువయొక్క, ఆకృతిక్ = రూపమువంటి రూపముతో, పైపైక్ = మీఁదుమీఁదుగా, ముక్తాశ్రేణి=ముత్యములపంక్తి, బోరునక్ =బోరు మని, తొరఁగెక్ = జాఱెను.

విశే. ఐరావతము తెల్లనిదిగాన దానిని తెల్ల నగు మంచుకొండతోను, నద్దాని కుంభములనుండి జాఱు తెల్లనిమంచిముత్తియములచాలును నప్పర్వతశిఖరములనుండి దిగు మిన్నేటిప్రవాహముతోను బోల్పఁబడినవి. అలం. ఉపమ.

కరీంద్రకుంభములు ముక్తాఫలాశ్రయము లనుట సుప్రసిద్ధము.

చ. ఇతని కితండె సాటి యగు నీతని కీతఁడె సాటి వచ్చు నొం
డ్లితరులు వీరిఁ బోలఁగలరే యను చారణసిద్ధసాధ్యసం
స్తుతులు సెలంగె నారణము చూచి రణాశనమాని నింగిపైఁ
గుతుకరసాతిరేకమునఁ గుంచియ వీచి నటించె నయ్యెడన్. 29

టీ. ఇతనికిక్, ఇతండె, సాటి, అగుక్, ఈతనికిక్, ఈతఁడె, సాటి వచ్చును. ఒండ్లు + ఇతరులు=పరులు, పోలక్=సాటియగుటకు, కలరే, అను, చారణసిద్ధ సాధ్యసంస్తుతులు = చారణాదులస్తోత్రములు, చెలంగెక్=ఒప్పెను. ఆరణను, చూచి, రణాశనమాని = కలహభోజనుఁడు నారదుఁడు, నింగిపైక్=ఆకాశముపైని, కుతుకర సాతిశేకమునక్ = సంతోషాతిశయముచే, కుంచియ = నెమిలికుంచెను, వీచి=ఆడించి, అయ్యెడక్=ఆసమయమున, నటించెక్=నాట్యముచేసెను. అలం. అనన్వయము.

సీ. కినిసి బిడౌజుఁ డాగ్నేయాస్త్ర మడరింప
నట శౌరి తేజంబునందు డిందెఁ
గనలి వృద్ధశ్రవుం డనిలాస్త్ర మేసిన
నది యదూద్వహనూర్పునందు డిందె
నలిగి బలారి సౌరాస్త్రంబు నిగిడింప
నది శౌరివలచూడ్కియందు డిందె
నడరి యింద్రుండు బ్రహ్మాస్త్రంబు పయి కొల్ప
నది మురాంతకునాభియందు డిందెఁ

ఆ. బాకదమనము క్తపాశుపతాస్త్రంబు
హరినిజార్ధతనువునందు డిందె
నేమి సేయవచ్చు నీశ్వరుం డఖిలాత్ముఁ
డతని గెల్వఁ దనకు నలవి యగునె. 30

టీ. కినిసి=కోపించి, బిడౌజుఁడు=దేవేంద్రుఁడు, ఆగ్నేయాస్త్రము = అగ్నిదేవతాకమైనయస్త్రమును, అడరింపక్=విజృంభింపఁజేయఁగా, అది=ఆయస్త్రము, శౌరి తేజంబునందక్=శ్రీకృష్ణుని తేజస్సునందు, డిందెక్=లీనమయ్యెను. శ్రీకృష్ణుఁడు సర్వ దేవతాత్మకుం డగుట తేజోరూప మగు నయ్యస్త్ర మాత్రని తేజమున లీనమయ్యె ననుట. కనలి=కోపించి, వృద్ధశ్రవుండు=ఇంద్రుఁడు, అనిలాస్త్రము = వాయుదేవతాకమగునస్త్ర మును, ఏసినక్=ప్రయోగింపఁగా, అది, యదూద్వహునూర్పునందుక్ = యాదవకులో ద్ధారుఁడగు శ్రీకృష్ణనినిట్టూర్పునందు, డిందెక్; సర్వాత్ముఁ డగు శ్రీకృష్ణభగవానుని యందు వాయురూప మగు నయ్యస్త్ర మాతనివాయువునం దడంగె ననుట. అలిగి=ఆగ్ర హించి, బలారి = సురపతి, సౌరాస్త్రంబుక్=సూర్యదేవతాక మగునస్త్రమును, నిగిడిం పక్=వ్యాపింపఁజేయఁగా, అది, శౌరివలచూడ్కియందుక్=శ్రీకృష్ణునిదక్షిణనేత్ర మునందు, డిందెక్; సూర్యదేవతాక మగు నయ్యస్త్ర మాతని సూర్యనేత్రమునం దడంగె

ననుట. భగవానుఁడు సూర్యచంద్రనేత్రుఁడగుట పురాణప్రసిద్ధము. అడరి = విజృంభించి, ఇంద్రుండు, బ్రహ్మాస్త్రంబు, పయికొల్వక్ =మీఁదుకొల్వఁగా, అది, మురాంతకునాభియందుర్ = శ్రీకృష్ణునిబొడ్డునందు, డిందెక్. బ్రహ్మదేవతాక మగు నయ్యస్త్రము బ్రహ్మోద్భవస్థాన మగు నాతని నాభికమలమున నడంగె ననుట. కొమరుని ప్రతాపము తండ్రిపైఁ బోకుండుటయుఁ, గుంఠిత మగుటయు నైజములుగదా! పాక .....స్త్రంబు-పాకదమన = పాకాసురశిక్షకుఁడగు దేవేంద్రునిచే, ముక్త = విడువఁబడిన, పాశుపతాస్త్రంబు = శివదేవతాక మగు నస్త్రము, హరినిజార్ధతనువునందుర్ = శ్రీకృష్ణుని సంగోరుశరీరమునందు, డిందెక్. శివకేశవు లభిన్న లగుటంజేసి శ్రీకృష్ణుఁడు శివస్వరూపుఁడే యగును. మఱియు నిచ్చో భగవంతుని హరిహరస్వరూపముగ కవి భావించుటంజేసి శివదేవతాక మగు నాయస్త్ర మాతని యర్ధాంగశివరూపమున నడఁగె నని యెన్నవలెను. ఏమి సేయర్ వచ్చుర్ =ఏమిచేయుట కింక వీలగును? ఈశ్వరుండు, అఖిలాత్ముఁడు = సర్వస్వరూపుఁడు. అతసిర్ = ఆసర్వాత్ముని, గెల్వక్ =జయించుట, తనకుర్ =దేవేంద్రునకు, అలవి=శక్యము, అగునె=అగునా?

విశే. ఇందుఁ గవి శ్రీకృష్ణుని సర్వాత్మకుఁడును, సర్వస్వరూపుఁడును, హరిహరరూపుఁడును నగు పరమాత్మగా భావించి యిట్టివర్ణనము నొనర్చె నని గ్రహింపవలయును.

చ. తఱిగొని యంతలోన మధుదైత్యహరుండు మహేంద్రుశింజినిం
గొననెలతూపునం దునిమి క్రూరతరం బగుభల్ల మొక్కటి
న్నఱకినఁ గూలెఁ దద్భుజసనాభనకల్పిత మైనకొక్కియం
బొలుచు నొరంగాలి మొదలూడఁగఁ గూలెడు వ్రాని కైవడిన్. 31

టీ. తఱి=సమయమును, కొని = పొంది; సమయము చూచి యనుట. అంతలోనర్, మధుదైత్యహరుండు=మధుసూదనుఁడు: శ్రీకృష్ణుఁడు, మహేంద్రుశింజినిర్ =దేవేంద్రుని వింటినారిని, కొనసెలతూపునర్ = అర్ధచంద్రబాణముచేత, తునిమి = త్రెంపి, క్రూరతరం బగు=మిక్కిలి క్రూర మగు, భల్లమొక్కటర్ = బాణము నొకదానిచే, నఱకినర్ = ఖండింపఁగా, తద్భుజసనాభనకల్పిత మైన = ఆదేవేంద్రుని వార్షికమేఘముచేఁ జేయఁబడిన, కొక్కియంబు = పతాకము, ఒలుచుర్ = ఒరఁగిపోవుచు; అనఁగా వ్రాలుచు ననుట. ఓరుగాలిర్ =ఝంఝామారుతముచే, మొదలు = మూలము, డూడఁగర్ =పెల్లగిలఁగా, కూలెడు = భువిపైఁ బడెడు, వ్రానికైవడిర్ = చెట్టురీతిగ, కూలర్ =త్రెగ్గెను.

భా. శ్రీకృష్ణుని యర్ధచంద్రబాణాఘాతమున నింద్రునిటెక్కెము ఝంఝామారుతముచే వ్రేళ్ళూడి పడిన తరువువలెఁ ద్రెగ్గె నని తాత్పర్యము.

వ్యా-విశే. కొఱ=కొఱఁతగల. నెల = చంద్రుఁడు, తద్రూపమైనతూపు = అర్ధచంద్రబాణము. టెక్కియంబు. రూ. టెక్కెము.

శా. భుగ్నభ్రూకుటిదుర్ముఖుం డగుచు నాస్ఫోటించుచు న్లోనిరో
షాగ్నిజ్వాలలు బాహ్యనిర్గతము లైన ట్లుత్కటారుణ్యని
ర్మగ్నంబై కనుపట్టులోచనసహస్రం బొప్ప మౌర్వీలతా
భగ్నం బైనశరాస *మున్విడిచి జంభద్వేషి యత్యుగ్రతన్. 32

టీ. జంభద్వేషి = జంభాసురశత్రు వగు నింద్రుఁడు, భుగ్నభ్రూకుటిదుర్ముఖుం డగుచుఁ = వంచఁబడిన బొమముడిచే వికృత మైనమొగము గలవాఁ డగుచు, ఆస్ఫోటించుచుఁ = అప్పళించుచు, లోని రోషాగ్నిజ్వాలలు = లోపల నున్న కోప మనెడు నగ్ని యొక్క మంటలు, బాహ్యనిర్గతము లైనట్లు = వెలుపలికి వెడలివచ్చిన వన్నరీతిగ, ఉత్కటారుణ్యనిర్మగ్నంబై = అధిక మగు నెఱుపురంగునందు మునింగినవై, కనుపట్టు= అగపడునట్టి, లోచనసహస్రంబు = నేత్రముల వేయి; అనఁగా వేయికన్ను లనుట. ఒప్పఁ =ఉండఁగా, మౌర్వీలతాభగ్నం బైన=లతవలెనున్నారి త్రెగఁగా, శరాసమున్ = ధనువును, విడిచి, అత్యుగ్రతఁ = మిగుల నుగ్రత్వముతో, ముండటిపద్యముతో నన్వయము.

భా. తన ధనువును నారియు టెక్కెము దెగఁగా నింద్రుఁడు బొమముడిచే వికృతమైన మొగముగలవాఁడైమది నున్నరోషాగ్నిజ్వాలలు పైకి వచ్చినవో యన్నట్లు కన్ను లత్యంతారుణము లై యొప్పఁగా నల్లెత్రాఁడు తెగిన యవ్వింటిని వీడి చండుఁడై వజ్రాయుధముం బూనె నని భావము.

విశే. రౌద్రరసమును దదనుగుణమగునారభటియు నిందుఁ గన నగును.

చ. కులవసుధాధరావలికిఁ గుంటితనం బొదవించె నెద్ది యా
బలితపుఁగైదువుం గొని సుపర్వకులాగ్రణి వేయుఁగన్నులం
దలకొని కౌస్తుభస్తబకితం బగుశౌరియురంబు సూచిన
న్నలజదళోదరోదకముచాడ్పున నల్లలనాడె లోకముల్. 33

టీ. ఎద్ది = ఏది, కులవసుధాధరావలికిఁ = కులపర్వతపంక్తికి, కుంటితనంబు = గతినిరోధమును; నడువలేకపోవుట ననుట. ఇంద్రుఁడు పక్షిముల నటికినకతన బర్వత శ్రేణి సంచరింప శక్తి లేని వయ్యెను గాన వజ్రాయుధము పర్వతములకుఁ గుంటితనమును గూర్చినదయ్యె నని భావము. ఒదవించెఁ = సంభవింపఁజేసెనో, ఆబలితపుంగైదువుఁ = ఆబలిష్ఠమైనయాయుధమును (వజ్రాయుధమును), కొని = స్వీకరించి, సుపర్వకులాగ్రణి

* నం బుడిగి జంభ.

=దేవకులాగ్రణి యగునింద్రుఁడు, వేయుఁగన్నులన్ = సహస్రనేత్రములచేతను, తలకొని=పూని, కౌస్తుభస్తబకితం బగు=కౌస్తుభమణిచే నలంకృత మగు, శౌరియురంబున్ = శ్రీకృష్ణునివక్షస్థలంబును, చూచినన్ = చూడఁగా, జలజదళోదరోదకముచాడ్పునన్ =తామరాకునడుమ నున్న నీటివలె, లోకముల్ = జగములు, అల్లలనాడెన్ = సంచలించెను. అనఁగా గడగడ వడంకె ననుట.

విశే. కులపర్వతములు:—1. మహేంద్రము, 2. మలయము, 3. సహ్యాము, 4. శుక్తిమంతము, 5. గంధమాదనము, 6. వింధ్యము, 7. పారియాత్రము.

ఉ. వీరుఁడ వౌదు దీనిబలువ్రేటున కోరిచి నిల్చితేని యం
భోరుహనాభ! యంచు సురపుంగవుఁ డప్పుడు లోకభీకరా
కారత నిల్చి భీతిపరికంపితులై సుర లూహ లేది హా
హారవము ల్ఘటింపఁ గులిశాయుధరాజముఁ బూఁచి వైచినన్. 34

టీ. అంభోరుహనాభ = పద్మనాభ! దీనిబలువ్రేటునకున్ = ఈ వజ్రాయుధము యొక్క గొప్పదెబ్బకు, ఓరిచి నిల్చితివి+ఏని - ఓరిచి నిల్చితేని = సహించితివేని, వీరుఁడవు = పరాక్రమము గలవాఁడవు, ఔదు=అగుదువు. అంచున్ = అనుచు, సురపుంగవుఁడు = సురశ్రేష్ఠుఁడు దేవేంద్రుఁడు, అప్పుడు = ఆసమయమున, లోకభీకరాకార తన్ = లోకములకు వెఱపుగొల్పు నాకారముతో, నిల్చి, కర్త సురపుంగవుఁడు. భీతి పరికంపితులై =భయముచే గడగడ వడఁకువారై, సురలు = దేవతలు, ఊహలు = తలంపులు, ఏది=విడిచికొని; అనఁగా నేమి చేయుటకును దోపక నిశ్చేష్టులై యనుట. హాహా రవముల్ = హాహా యను ధ్వనులను, ఘటింపన్ = చేయఁగా, కర్త సురలు, కులిశాయుధరాజమున్ =ఆయుధ శ్రేష్ఠ మగు వజ్రమును, పూఁచి = ధరించి, వైచినన్ = వేయఁగా; అనఁగాఁ బ్రయోగింపఁగా ననుట.

విశే. పూఁచి. రూ. పూనిచి, పూంచి, పూన్చి.

మహాస్రగ్ధర.

శతధారాజాయమానజ్వలనముఖశిఖాచ్ఛాదితాభ్రస్థలం బై
వితతాభీలధ్వనిశ్రీవిలసనబధిరోద్విగ్నదిగ్వారణంబై
కృతలోకాలోకముఖ్యాఖిలగిరిచలనక్షుభ్యభూమండలంబై
పతయాళుదాత్తప్రకరఖరకరాపమ్యమై యేఁగు దేరన్. 35

టీ. శతధారా...స్థలంబై-శతాధారా = నూఱంచులనుండియు, జాయమాన = పుట్టుచున్న, జ్వలనముఖ=అగ్నిముఖములయొక్క, శిఖ=జ్వాలలచేత, ఆచ్ఛాదిత=కప్పఁబడిన, అభ్రస్థలంబై = ఆకాశప్రదేశముగలదై; వజ్రాయుధపు నూఱంచులనుండియు నగ్నిజ్వాలలు వెడలుచున్న వనియు నమ్మంట లాకసమును గప్పిన వనియు భావము. వితత

తా...దిగ్వారణంబై -వితత=విస్తారమైనట్టి, ఆభీలధ్వని = భయంకరశబ్దముయొక్క, శ్రీ= శోభముయొక్క, విలసన=ప్రకాశముచే, బధిర=చెవుడుగలిగినట్టి యైన, ఉద్విగ్న = సంక్షోభపడున యైన, దిగ్వారణం బై=దిగ్గజములుగలదై; వజ్రాయుధవేగముపలని భయంకర శబ్దము వ్యాపించి దిగ్గజములకు చెవుడును గలఁతను గలుగఁజేసె నని భావము. కృత .....భూమండలంబై-కృత = చేయఁబడిన, లోకాలోక = చక్రవాళపర్వతము, ముఖ్య=మొదలగు, అఖిల = సమస్తములైన, గిరి = కొండలయొక్క, చలన = కదలుట చేత, క్షిప్త = ఎగఁజిమ్మఁబడిన, భూమండలం బై = భూతలము గలదై; అనఁగా వజ్రాయుధ వేగముచేఁ జక్రవాళాదిపర్వతములు గదలె ననియు దాన భూములు పై కుబికె ననియుఁ దాత్పర్యము. పతయాళు.....కరౌపమ్యమై - పతయాళు=పడునట్టి స్వభావము గల; అనఁగాఁ బడుచున్న యనుట. ద్వాదశార్చ్ఛ=సూర్యులయొక్క, ప్రకర = సమూహముయొక్క, అనఁగాఁ బన్నిద్దఱు సూర్యులయొక్క యనుట. ఖర = తీక్ష్ణము లైన, కర=కిరణములు, ఔపమ్యమై = సాటిగాఁ గలదై; అనఁగా నీ వజ్రాయుధము భువిం బడు ద్వాదశాదిత్యులం బోలి చండతరకిరణం బై యొప్పె ననుట. ఏఁగుదేర = రాఁగా; ముందటిపద్యముతో నన్వయము.

విశే. ఇది మహాస్రగ్ధరావృత్తము. ప్రతిపాదమునకును, స. త. త. న. స. ర. ర. గ. గణము లుండును. తొమ్మిదవ పదునాఱవ యక్షరములు ప్రతిపాదమున యతిస్థానములు. అనఁగాఁ బాదమున రెండు యతిస్థానము లుండు నని భావము. ఇందు రౌద్రరసము తదనుగుణ మగు నారభటితోఁ గూర్చి వర్ణిత మయ్యెను.

మ. కని నెమ్మోమునఁ బిన్ననవ్వు దొలఁకం గంసారి నిశ్శంకఁ దా
క్ష్మ్యుని నడ్డంబుగఁ ద్రిప్పి వేగ రవితేజోదుస్సహాసూ్ఫర్తిమై
దను డాయ న్శతకోటిఁ గేలిశతపత్ర క్రీడఁ బట్టుం గటా
క్షనిరీక్షాగతి నందకత్నరుకిణాంకం బైనహస్తంబునన్. 36

టీ. కని=చూచి; వజ్రాయుధము ననుట. నెమ్మోమునన్ =సుందరమగు మొగమున, పిన్ననవ్వు=మందహాసము; చిఱునగ వనుట. తొలఁకన్ = చలింపఁగా; మందహాసమున కిదియే మో నను నొప్పించు నని యింద్రుఁడు ప్రయోగించెఁగాని యిది న న్నేమి చేయు నను శ్రీకృష్ణనిశ్చలంపునకు సూచక మని తలంపవలయును. కంసారి = శ్రీకృష్ణుఁడు, నిశ్శంకన్ = సందేహము లేకుండుటతో, తార్క్ష్యునిన్ = గరుడుని, అడ్డంబుగన్ = అడ్డుగా, త్రిప్పి=మఱలించి, వేగన్ =త్వరతో, రవి.....స్ఫూర్తిమైన్ -రవి=సూర్యుని యొక్క, తేజో=కాంతివలె, దుస్సహ=సహింపరాని, స్ఫూర్తిమైన్ = ప్రకాశముతోడ, తనున్ =తన్ను, డాయన్ =చేరరాఁగా; సమీపింపఁగా నను. శతకోటిన్ =నూఱుచులు గలదానిని; వజ్రాయుధమును, కటాక్షనిరీక్షాగతిన్ = క్రేగంటిచూపులయొక్క ప్రసా

రముతో; నందక.....కంబైన-నందక=నందక మనెడు కత్తియొక్క, త్సరు = పిడిచే
నైన, "త్సరుఃఖడ్గముష్టిఃా". కిణ=కాయలచే, అంకంబైన = చిహ్నితమైన; నందకము
పిడిని పట్టుకొనుటచే శ్రీకృష్ణునిచేతఁ గాయ లేర్పడె ననుట. కాయలేర్పడిన చేత నెంతటి
వస్తువు పట్టుకొనినను నొప్పిపుట్టకుండుట నైజము. హస్తంబునన్ = చేతితో, కేలిశత
పత్రక్రీడన్=విలాస పద్మక్రీడపలె; అనఁగాఁ జేత విలాసార్థము పట్టినపద్మము నెగుర
వేసిపట్టుకొనునటుల ననుట. పట్టెన్ = గ్రహించెను.

భా. అట్లు భయంకరమై యేతెంచు వజ్రాయుధమును నూఱంచులతో శత
పత్రమువలె భాసిల్లుదాని శ్రీకృష్ణుఁడు, చిఱునగ వొలుక సందియ మందక సవిలాస
ముగఁ గ్రేగంటిచూపులతోడ నందకము పిడితాఁకునఁ గాయలేర్పడినచేతితోఁ గ్రీడా
పద్మమును గ్రహించుపగిది గ్రహించె నని భావము.

విశే. ఇందు శ్రీకృష్ణునిమహానుభావత, పరాక్రమాతిశయము మున్నగునవి
సంసూచితములు.

సీ. తలలు వీడంగ విద్యాధరు ల్పఱచిరి
గగ్గులకాడైరి ఖచరవరులు
చట్టుపైపోక లై చనిరి గంధగ్వాలు
గరుడులు పంచబంగాళ మైరి
కన్నది గతి గాఁగఁ *గిన్నరు లరిగిరి
పన్న గేంద్రులు పటాపంచ లైరి
పోయినపోక లై పోయిరి సిద్ధులు
దిక్కా మొకము లైరి దిగధిపతులు

తే. హరిహయత్రాణనాయత్తు లగుచు వచ్చి
మునులు సంప్రార్థనావచోముఖరు లైరి
పూని తనమీఁద వచ్చుదంభోళి నిట్లు
పంకజోదరుఁ డొడిసి చేపట్టుటయును. 37

టీ. పూని, తనమీఁదన్, వచ్చు, దంభోళిన్ = వజ్రాయుధమును, పంకజో
దరుఁడు=శ్రీకృష్ణుఁడు, ఒడిసి = కొంచెము పైకెగిరి, చేపట్టుటయును=చేతితోఁ బట్టఁగా,
తలలు = శిరోజము లనుట, వీడఁగన్, విద్యాధరుల్, పఱచిరి = పరుగెత్తిరి. ఖచర
వరులు = సురశ్రేష్ఠులు, గగ్గులకాడు = కంకెలసమూహము; అనఁగా నిస్సారమైనవా

* గిన్నరుల్ మరిగిరి.

రనుట. ఐరి. గంధర్వులు, చట్టుపైపోఁకలై = బండరాతిపైఁ బడ్డవక్కలవలె, చనిరి; చెఱి యొకదిక్కున కేఁగి రనుట. కిన్నరులు, కన్నది = కనుపడిన త్రోవయే, గతి = శరణ్యము, కాఁగాఁ = అగునట్లుగా, అరిగిరి; అనఁగాఁ దమకంటి కగపడిన త్రోవనే యాధారముగాఁ గొని పరుగెత్తి రనుట. పన్నగేంద్రులు=పన్నగశ్రేష్ఠులు, పటాపంచలైరి=చెదరి పారిపోయిరి. సిద్ధులు, పోయినపోకలై = ఏదారి కనఁబడిన నాదారినే పట్టినవారై, పోయిరి. దిగధిపతులు=దిక్పాలురు, దిక్కొమొకములు = దిగంతములను గూర్చి యభిముఖులు; అనఁగా దిగంతములకుఁ బాఱి రనుట. దిక్పతులు దిగంతములకు స్వాశ్రయములకుఁ బరుగిడుట సహజమేగదా. ఐరి. మునులు = ఋషులు, హరిహాయత్రాణనాయత్తులు = దేవేంద్రుని రక్షించుటయందు సంసిద్ధులు, అగుచుఁ, వచ్చి; సంప్రార్థనావచోముఖరులు = వేఁడికొనుమాటలచే ధ్వనియొనర్చువారు, ఐరి; అనఁగాఁ బ్రార్థనావాక్యములఁ బలుకుచుండి రనుట.

ఉ. ముందల వట్టినట్లు తనముఖ్యతరాస్త్రము గొన్న దేవకీ
నందనుఁ జూచి సాధ్వసము నానయుఁ గ్రమ్మఁ గరీంద్ర డిగ్గి సం
క్రందనుఁ డోముకుంద! మురభుస్మర; యేనపరాధి నంచు వే
ముందఱి వచ్చి సాఁగఁబడి మ్రొక్కిన శౌరికృపార్ద్రచిత్తుఁ డై. 38

టీ. ముందల=ముందుతలను, పట్టినట్లు; ఇది యవమానసూచకము. తనముఖ్యతరాస్త్రముఁ = తనయొక్క మిక్కిలి ప్రధాన మగు నాయుధమును, కొన్న=స్వీకరించిన; తన ముఖ్యాస్త్రముం జేతఁబట్టుట తన ముందలవట్టిన ట్లింద్రున కయ్యె ననిభావము. దేవకీనందనుఁ = శ్రీకృష్ణుని, చూచి, సాధ్వసముఁ = భయమును; ఏమి చేయునో యవ్వీరుఁ డనుభయ మనుట. నానయుఁ = సిగ్గును, ఓడితినిగదా యనియు నంతటివానిపైఁ గొలఁది యొఱుంగక తలపడితి ననియు సిగ్గు జనించె ననుట. క్రమ్మఁ = వ్యాపింపఁగా, కరీంద్రుఁ = ఐరావతమును, డిగ్గి=దిగి, సంక్రందనుఁడు = దేవేంద్రుఁడు, ఓముకుంద, మురభుస్మర=మురహంత, ఏను, అపరాధిని = తప్పుచేసినవాఁడను, అంచుఁ, వే=వేగ, ముందఱిఁ = అభిముఖముగా, వచ్చి, సాఁగఁ =చాఁగునట్లుగా; దండాకారముగా, పడి = ఒరఁగి, మ్రొక్కినఁ =నమస్కరింపఁగా; సాష్టాంగ మొనర్పఁగా ననుట. శౌరి=శ్రీకృష్ణుఁడు, కృపార్ద్రచిత్తుఁడు + ఐ=దయ చేఁ దడిసిన మనస్సు గలవాఁడై; ముందటి పద్యముతోడ నన్వయము.

ఉ. లెమ్ము సురేంద్ర! నీవలన లే దొకతప్పును నీమఱంద లీ
కొమ్మ వదాన్యభూరుహముఁ గోరినఁ దెచ్చితిఁగాని కొమ్ము నీ
సొమ్మని వజ్ర మిచ్చి మధుసూదనుఁ డాతరు వీఁ దలంచినం
గ్రమ్మఱ మ్రొక్కి వాసువుఁడు కందళితప్రమదాంతరంగుఁ డై. 39

టీ. సురేంద్ర=దేవేంద్ర! ఈపదము సాభిప్రాయము. సురేంద్రుఁడ వగుట కతన సురద్రుమము నీదే యగును. దానిని నేఁ గొనుట నాది తప్పుగాని నీ ద్రుమము నాకై నీవు పోరాడుట నీది తప్పుగా దనుట. లెమ్ము; సాష్టాంగముగఁ బడియున్నవాఁడు గాన లెమ్మనె ననుట. నీవలనక్=నీపక్షమున, ఒకతప్పును=కొంచెముదోషమైనను; ఇచట నొకశబ్ద మలాప్యర్థకము. నీమఱందలు, ఈకొమ్మ=ఈయువతి, వదాన్యభూరుహము = ఈవులశ్రేను, కోరినక్, తెచ్చితిని; ఈతరువునుగూర్చి కాంక్ష నాకును లేదు గాన నావలనఁగూడఁ దప్పు లే దనియు భార్యల కన్యోన్యవైర ముండకపోవచ్చును గాని భార్యాపృజాయల కన్యోన్యవైరము తప్పక యుండు ననియు, నందు బావగారి పెండ్లమున కట్టి వదాన్యభూరుహము కల్గియుండ నామె తోడికోడ లూరకొనకుండుట సహజ మాటకతన సత్యాకాంక్షను దీర్పవలసివచ్చుటఁజేసి నే నిక్కార్యమునఁ బ్రవర్తించితి ననియు శ్రీకృష్ణుఁ డీగతిని నిపుణముగఁ బల్కె ననుట. కాని, నీసొమ్ము = నీ ధనమును, కొమ్ము=తీసికొనుము, అని, వజ్రము = వజ్రాయుధమును, ఇచ్చి, మధుసూదనుఁడు=శ్రీ కృష్ణుఁడు, ఆతరువు = ఆకల్పవృక్షమును, ఈక్ = ఇచ్చివేయుటకు, తలంచినక్ = ఉద్దేశింపఁగా; తరువు దిరుగ నిచ్చుట కతన శ్రీకృష్ణునియుదారత వెల్లడి యగు చున్నది. వాసవుఁడు=దేవేంద్రుఁడు, క్రమ్మఱక్ =మఱల, మ్రొక్కి, కందళిత... ...అంతరంగుఁడై-కందళిత=మొలక లెత్తుచున్న, ప్రమద=సంతోషముకల, అంత రంగుఁడై=మదిగలవాఁడై, తరువాతిపద్యముతో, నన్వయము.

ఉ. సొమ్మన నెద్ది యే ననఁగ సొమ్మున కెవ్వఁడఁ గర్త వీవు నీ
సొమ్మఖిలప్రపంచమును శూరకులంబు నలంకరించునీ
వమ్మహి నుండునంతకు ననన్యదురాపము పారిజాతభూ
జమ్మును నుండు నన్న వికసన్ముఖుఁడై హరి వీడుకొల్పుచున్. 40

టీ. సొమ్ము, అనక్ =అనఁగా, ఎద్ది=ఏది? సొమ్మనఁగా నేది యనుటఁజేసి యన్ని సొమ్ములును నీవే యనియు, నన్ని సొమ్ములును నీరూపములే యనియుఁ దాత్పర్యము. ఏను, అనఁగక్, సొమ్మునకుక్, ఎవ్వఁడను? అన్ని సొమ్ములయధికారమును నీదే యగుట నాకు సొమ్మనఁగా నేమి యనుట. ఈవు కర్తవు ఎల్లవానికి ననుట. కర్తవుగానఁ గార్యము లన్నియు నీవ యని భావము. అఖిలప్రపంచమును = సర్వజగత్తును, నీసొమ్ము=నీధనము; జనమంతయు నీదే యనుట. శూరకులంబుక్ =శూరవంశమును, అలంకరించు=భూషించు, నీవు, అమ్మహిక్ =ఆ భూమియందు, ఉండునంతకుక్ = ఉండువఱకును; అనఁగా శౌరివై భువి నుండునంతకాల మనుట. అనన్యదురాపము = ఇతరులకుఁ బొంద నలవి కానట్టి, పారిజాతభూజమ్మును = పారిజాతవృక్షమునుఁడ, ఉండును: భువిపై నుండు ననుట. అన్నక్, వికసన్ముఖుఁడై = వికసించినమొగము గలవాఁడై; సత్యప్రతినం దీర్పఁ

గల్గితినిగదా యని సంతసము గల్గె ననుట. శ్రీకృష్ణుఁడు కర్త. హరిన్ = ఇంద్రుని, వీడుకొల్పుచున్ =పోవ ననుజ్ఞ నొసంగుచు. తరువాతిపద్యముతో నన్వయము.

విశే. ఇందు శ్రీకృష్ణభగవానుని కార్యకారణరూపునిగాను, సర్వస్వామిగాను గవి వర్ణించినాఁడు.

ఖా.గంధరోర్వరగసిద్ధసాధ్యవరులం గారుణ్యదృష్టిక్రియా
సంధానంబున వీడుకొల్పి సురభూజంబు న్సతి న్వాహన
స్కంధాగ్రంబున నుంచి విక్రమకళా*సంలబ్ధతత్ప్రేయసీ
సంధాసిద్ధిఁ గృతార్థుఁ డై మఱలె నిచ్చ న్వేడ్క లుప్పొంగఁగన్. 41

టీ. గంధరోర్వరగ సిద్ధసాధ్యవరులన్ = గంధర్వశ్రేష్ఠులను, నాగశ్రేష్ఠులను, సిద్ధ శ్రేష్ఠులను, సాధ్యశ్రేష్ఠులను, కారుణ్యదృష్టిక్రియాసంధానంబునన్ = దయతోఁగూడిన చూపుయొక్క ప్రసారము చేతను, వీడుకొల్పి=సెలవిచ్చి పంపి, సురభూజంబున్ = కల్ప వృక్షమును, సతిన్ =సత్యభామను, వాహనస్కంధాగ్రంబునన్ =వాహన మగు గరు డునియొక్క మూఁపుకొనయందు, ఉంచి, విక్రమ...సంధాసిద్ధిన్ - విక్రమకళా = పరాక్రమవిద్యచే, సంలబ్ధ = పొందఁబడిన తత్ప్రేయసీ = ఆభార్య యగు సత్యభామ యొక్క, సంధా=ప్రతిజ్ఞయొక్క, సిద్ధిన్ = నెఱవేఱుటచేత, కృతార్థుఁడై = సఫలమైన కార్యము గలవాఁడై, ఇచ్చన్ =మదియందు, వేడ్కలు=సంతోషములు, ఉప్పొంగఁగన్ =పొంగి పొరలఁగా, మఱలెన్ .

విశే. ప్రేయసీప్రతిజ్ఞాసిద్ధియే వాంఛితముగాని శ్రీకృష్ణునకు నింద్రుని పరాభవించుటగాని సురభూజము నపహరించుటగాని, కోర్కె గా దని గ్రహింప నగును.

ఇచ్చ. ప్ర. ఇచ్ఛ.

ఉ. వాసవుతోడికయ్యమునవార్తలు సెప్పుచు మోమునందమ్మి ను
ల్లాసము మందహాసముఁ దొలంకఁగ వేలుపుస్త్రీనిపూవులం
జేసినసొమ్ము లంగములఁ జేర్చి వధూమణి నాదరించుచున్
వాసుకిభోగతల్పుఁడు సువర్ణగిరీంద్రము దాఁటెఁ జయ్యనన్. 42

టీ. వాసవుతోడి కయ్యమునవార్తలు=ఇంద్రునితోనైన యుద్ధమునందలివృత్తాం తములు, చెప్పుచున్ , మోమునందమ్మిన్ =ముఖపద్మమున, ఉల్లాసమున్ = వికాసమును, మందహాసమున్ =చిఱునవ్వును, తొలంకఁగన్ =చలింపఁగా; సురభూజమును స్వాధీన ముగఁజేసికొని ప్రేయసీప్రతిజ్ఞ తీర్పఁగల్గుటకతన నుల్లాసమును, నాకార్యమునకై యింద్రా

---

* సంరబ్ధి; సంరబ్ధ.

కులతోడి సంగరమున సంభవించిన యాయాపి శేషములవిభావన సేయుకతన మందహా సము గల్గె ననుట. వేలుపుమ్రానిపూవులక్ =కల్పవృక్షపుష్పముల చే, చేసిన = సిద్ధించిన, సొమ్ములఁ=నగలు, చేర్చి=కూర్చి, వధూమణిక్ =యువతీరత్నమును సత్యను, ఆదరించుచుక్ = గారవించుచు, వాసుకిభోగతల్పుఁడు = శేషశయనుఁడు శ్రీకృష్ణుఁడు, చయ్యనక్ =శీఘ్రముగ, సువర్ణగిరీంద్రమున్ =మేరుపర్వతమును, దాఁటెక్ = అతిక్రమించెను.

వ్యా-విశే. వేలుపుమ్రానిపూవుల చేఁ జేసినసొమ్ము లనఁగా, నాపూవుల చేఁ గూర్చిన పుష్పమాలారూపము లగు సొమ్ము లని చెప్పనగును. మఱియు వేలుపుమ్రానేగాక దాని పుష్పాదులును వాంఛితార్థముల నెల్ల నొసంగ సమర్థము లగుటంజేసి వానివలన సిద్ధించిన సొమ్ములను సత్యాంగముల గూర్చె ననియైన గ్రహింపనగును. "వాసవుతోడి కయ్యమున వార్తలు" ఇందు సమాసమునఁ దోడవర్ణకమున కిత్వమును సప్తమీతత్పురుషమున నవర్ణకమును గల్గెను. "చేత తోడ వలనల కిత్వంబు సమాసంబునం దగును" అని బాలవ్యాకరణము. "సప్తమీతత్పురుషంబునందుఁ గొన్నియెడల నవర్ణకం బగు" అని ప్రౌఢవ్యాకరణము.

### శ్రీకృష్ణుఁడు పారిజాతముతో నిజనగరి కేతెంచుట

క. కనకగిరీంద్రముం గడచి గ్రక్కున రైవతకాద్రిపాంత నిల్చిన యదువృష్ణిభోజనృపసింహులు సేనలతోడఁ దన్నెదు
ర్కొన నగరంబుఁ జొచ్చె మణిగోపురసంస్థితపౌరభామినీ
జనములు సేసముత్తెములు సల్లఁగ నుల్లసితాంతరంగుఁ డై. 43

టీ. కనకగిరీంద్రమున్ =సువర్ణపర్వతమును మేరువును, కడచి = అతిక్రమించి, గ్రక్కునక్ = శీఘ్రముగ, రైవతకాద్రిపాంతక్ = రైవతకపర్వతము సమీపమున, నిల్చినక్ = ఉండఁగా, యదువృష్ణిభోజనృపసింహులు = యాదవకులమున తెగలకు సంబంధించిన రాజశ్రేష్ఠులు, సేనలతోడక్, తన్నుక్, ఎదురొక్కనక్ = ఎదురొక్కనఁగా, మణిగోపురసంస్థితపౌరభామినీజనములు = మణివికారములైన బహిర్ద్వారము లం దున్న పట్టణవాసులభార్యలు, సేసముత్తెములు = శుభాక్షతస్థానీయము లగు మంచి ముత్తెములను, చల్లఁగక్, ఉల్లసితాంతరంగుఁ డై = వికసించిన మనస్సుగలవాఁ డై, నగరంబుక్ =పట్టణమును, చొచ్చెక్ =ప్రవేశించెను.

విశే. నాకపురినుండి శ్రీకృష్ణుఁడు వచ్చినమార్గమును వర్ణింప మఱలఁ గవి తలంపకుండుటంజేసి యప్రసక్తముగ వర్ణనలఁ జొన్పుట కిష్టపడమి తెల్లమయ్యెఁడి.

తే. పురబహిర్ద్వారములు దాఁటి భుజగశాయి
రాజమార్గంబు దటీయ హేరాళ మగుచు

బుగులుకొనియె ననాఘ్రాత పూర్వకములు
పారిజాతమహీజాతపరిమళములు. 44

టీ. పురబహిర్ద్వారములు = పట్టణంపు వెలుపలిద్వారములను, దాఁటి, భుజగశాయి=శ్రీకృష్ణుఁడు, రాజమార్గంబుక్ =ఘంటాపథమును, తఱియక్ = సమీపింపఁగా, అనాఘ్రాతపూర్వకములు = ఇంతకుము న్నెన్నఁడును వాసనచూచినవి కానట్టి, పారిజాతమహీజాతపరిమళములు = పారిజాతవృక్షపు సుగంధములు, బుగులుకొనియెన్ = వ్యాపించెను.

విశే. ఇందు "ననాఘ్రాతపూర్వకము" లనుచో "నామోదపూర్వకము" లను పాఠము గాన నగును. ఆమోదపూర్వకములు = సంతోషము ముందు గలవి. అనఁగా సంతోషమును ముందుగఁ బుట్టించున వనుట. విని కని యెఱుంగని పరిమళము లగుటం జేసి దీనికన్నఁ బై పాఠమే సరస మని తోఁచును.

ఉ. ఆమహిజాతమున్ గనినయంతటిలో ధనధాన్యరాశితో
సామజఘోటికామహితశాలలతో మణిసౌధపంక్తితో
గోమహిషీశతాంగభటకోటులతో మణిభూషణాలితోఁ
దామరతంపరై తనరెఁ దత్పురిఁ గింపచగేహవాటికల్. 45

టీ. ఇందుఁ గల్పకదర్శనమాత్రనఁ గన్గొన సిరి వర్ణితము.—తత్పురిక్ = ఆ ద్వారకాపట్టణమందు, కింపచగేహవాటికల్ = దరిద్రుల యిండ్లప్రదేశములు, ఆమహిజాతమున్ =ఆవృక్షమును, కనినయంతటిలోన్ =చూచినంతలో, ధనధాన్యరాశితోన్ = ధనసమూహముతోడను ధాన్యసమూహముతోడను, సామజ...శాలలతోన్ - సామజ= ఏనుఁగులతోడను, ఘోటికా = గుఱ్ఱములతోడను, మహిత = పూజ్యమైన, శాలలతోన్ = స్థానములతోడను, మణిసౌధపంక్తితోన్ = మణివికారములైన మేడలవరుసతోడను, గోమహిషీశతాంగభటకోటులతోన్ = గోవులు భార్యలు రథములు భృత్యులు వీని సమూహములతోడను, మణిభూషణాలితోన్ = మణిమయము లైన యలంకారముల వరుసతోడను, తామరతంపరై = ఉత్తరోత్తరాభివృద్ధి గలవై; తామరతీవ లెడతెగక యల్లుకొనునట్లు తనరె ననుట. తనరెక్ = ఒప్పెను.

మ. బెరసె న్నేన నిగిడ్చినట్లు వళు లుబ్బె స్దుర్బలాంగంబు లం
కురము ల్నూనె రదంబు లంసుస్రిలవడంకు ల్దీఱె వాలారులై

కరజంబు ల్నిగిరించెఁ గేశవితతు ల్గప్పారు వృద్ధాలికిన్
మరలం బ్రాయము వచ్చెఁ దత్తరుచలన్మందానిలాసంగతిన్. 46

టీ. కల్పకవాయుసంస్పర్శనమువలన జనులకుఁ గల్గినయవస్థ యిందు వర్ణితము.— తత్తరుచలన్మందానిలాసంగతిన్ -తత్తరు = ఆకల్పవృక్షసంబంధమైన, చలత్ =కదలుచున్న, మందానిల = మందమారుతముయొక్క, ఆసంగతిన్ = సంపూర్ణసంబంధముచే, వృద్ధాలికిన్ = ముసలివారలకు, మేనన్ = శరీరమందు, నిగిడ్చినట్లు = నిట్టనొడిచినవిధముగ, వళులు=ముడుతలు, బెరసెన్ = కూడెను. దుర్బలాంగంబులు = బలహీనములైన శరీరములు, ఉబ్బెన్ =ఉప్పొంగెను; అనఁగా బలిసె ననుట. రదంబులు = దంతములు, అంకురముల్ =మొలకలు, చూపెన్; అనఁగా మఱల మొలచె ననుట. అంఘ్రిలవడంకుల్ = కాళ్లసంచలనములు, తీఱెన్ =నశించెను. వాలారులై =దీర్ఘములై, కరజంబుల్ =గోళులు, చిగిరించెన్ = పల్లవించెను. కేశవితతుల్ = తలవెండ్రుకల గుంపులు, కప్పారెన్ = సల్లనయ్యెను. మరలన్ =తిరుగ, ప్రాయము = యౌవనము, వచ్చెన్. పైని పేర్కొనిన యౌవనధర్మములు గల్గె నని తాత్పర్యము.

క. వినఁ నేర్చిరి బధిరులు గనుఁ
గొనఁనేర్చిరి యంధకులు లఘుత్వము మీఱన్
జన నేర్చిరి వికలాంగకు
లనిమిషతరుకుసుమసౌరభావేశమునన్. 47

టీ. కల్పకపరిమళావేశమునఁ బ్రజలకుఁ గల్గినయవస్థ లిందు వర్ణితములు.— అనిమిషతరుకుసుమసౌరభావేశమునన్ = కల్పవృక్షపుష్పసంబంధమైన పరిమళముయొక్క చేరికచేత, బధిరులు=చెవిటివారు, వినన్ =ఆలించుటకు, నేర్చిరి = చాలిరి; శక్తులైరనుట. అంధకులు = గ్రుడ్డివారు, కనుఁగొనన్ =చూచుటకు, నేర్చిరి=శక్తులైరి. వికలాంగకులు = వికలమైన యవయవములు గలవారు; అనఁగాఁ గుంటివారు మొదలగు నవయవహీనులు, లఘుత్వము=లాఘవము, మీఱన్ = అతిశయించునట్లుగా; చనన్ = నడచుటకు, నేర్చిరి = శక్తులైరి.

క. విస్మయముగ నీగతి మురఘస్మరుఁడు నికేతనప్రఘాణమున భుజం
గస్మయహారవాహము డిగి, సస్మితముఖుఁ డగుచు నరిగెఁ సమ్మోదమునన్.

టీ. మురఘస్మరుఁడు=మురహంత శ్రీకృష్ణుఁడు, ఈగతిన్ = ఈరీతిగ, విస్మయముగన్ = ఆశ్చర్యముగా; పైని మూఁడుపద్యములలోఁ జెప్పినట్లు నాశ్చర్యకరము లగు పనులు కల్గుటయే యాశ్చర్యమునకుఁ గారణ మనుట. నికేతనప్రఘాణమునన్ = ఇంటి

ముంగిలివాకిటను, భుజంగస్మయహరవాహమ్ముక్ -భుజంగ = పాములయొక్క, స్మయ = గర్వమును, హర = నశింపఁజేయునట్టి, వాహమ్ముక్ = వాహనమును; గరుడవాహనము ననుట. డిగి = దిగి, సస్మితముఖుఁడగుచుక్ = నగవుతోఁ గూడిన మొగము గలవాఁడగుచు, సమ్మోదమునక్ = సంతోషముతో, అరిగెక్ = వెడలెను.

విశే. కార్యసిద్ధి వడసి వచ్చినవాఁడగుట మది సమ్మోదమును, మొగమున హాస మును దళుకొత్తె నని గ్రహించునది.

సీ. వరభక్తి దేవకీవసుదేవులకు మ్రొక్కి
బలభద్రునకు నట్లు ప్రణతి సేసి
గురపురోహితబంధుకోటికి వినయంబు
గావించి మిత్రులఁ గౌఁగిలించి
సుతసోదరామాత్యతతినతు ల్గయికొని
యాప్తవర్గంబుల నాదరించి
గారవంబునఁ బెక్కుగతుల మన్నించుచు
వినతాతనూభవు వీడుకొలిపి

తే. ప్రేయసియుఁ దానుఁ గూడి తదీయమంది
రమున కేఁగి సుఖాలాపరచన మెఱయఁ
బ్రతిన వచ్చెఁ గదా యిదె పారిజాత
మనుచు నర్పింప నద్దేవి హర్ష మంది. 49

టీ. వరభక్తిక్ = శ్రేష్ఠమగు భక్తితోడ, దేవకీవసుదేవులకుక్, మ్రొక్కి = నమస్కరించి, తల్లిదండ్రులయెడ సంతానమునకు భక్తి యుండవలెఁ గాన నిచ్చోఁ భక్తి యని కవి వ్యవహరించె ననుట. బలభద్రునకుక్ = బలరామునకు, అట్లు-భక్తితోడనె యనుట. అగ్రజుఁడు పితృసముఁడు గాన నాతనియెడలను భక్తినే యగపఱిచె ననుట. ప్రణతి = నమస్కారము, చేసి, గురుపురోహితబంధుకోటికిక్ = గురువునకును బురోహితునకును బంధుసమూహమునకును, వినయంబు = అణకువ, గావించి = చేసి, పెద్దలయెడల వినయము చూపవలెఁ గానఁ బెద్దలును బూజ్యులును నగు గురుపురోహితబంధువుల కడకువం జూపె ననుట. మిత్రులక్ = సఖులను, కౌఁగిలించి = ఆలింగనమొనర్చి; మిత్రులయెడలఁ బ్రేమను బ్రకటింపవలెఁ గానఁ బ్రేమసూచక మగు నాలింగన మొనర్చె ననుట. సుతసోదరామాత్యప్రతినతులు = సుతులు నన్నదమ్ములు మంత్రులు వీరలయొక్క నమస్కారములు, కయికొని=అందికొని; పైని నిరూపించినవారు నమస్కార మొనర్పఁ దగినవా రగుట నమస్కరించి రని చెప్పుట సరసము. ఆప్తవర్గంబులక్ = ఆప్తులసమూహము

లను, ఆదరించి = మన్నించి; తన కష్టసుఖములకుఁ తోడ్పడువారి నాదరించుట సహజ మగుటంజేసి వారియెడల నాదరముం జూపె ననుట హృద్యము. గారవంబునన్ = గౌరవముతో, పెక్కుగతులన్ = పలువిధముల, మన్నించుచున్ = మన్ననసేయుచు, వినతానూభవున్ = వినతకొడు కగు గరుడుని, వీడుకొల్పి = సెలవిచ్చి పంపి; తనకు సర్వవిధములఁ దోడ్పడినవారిని మన్నించుట యాచారము గానఁ దన కెల్లభంగుల సాహాయ్య మొనర్చినవానిని మన్నించె ననుట సుసంగతము. ప్రేయసియున్ = సత్యయు, తానున్, కూడి = కలిసి, తదీయమందిరమునకున్ = సత్యాగృహమునకు. ఏఁగి, సుఖాలాపరచన = సుఖకరమగు మాటలకూర్పు, మెఱయన్ = ప్రకాశింపఁగా; అనఁగా సరసాలాపములాడు చనుట. ప్రతిన = ప్రతిజ్ఞ, వచ్చెన్ + కదా=తీరెఁగదా, ఇదె = ఇదిగో, పారిజాతము, అనుచున్, అర్పింపన్ = ఈయఁగా, అద్దేవి=ఆసత్య, హర్షము = సంతోషము, అంది=పొంది; తరువాతిపద్యముతో నన్వయము.

విశే. ఇందు వారివారియెడల శ్రీకృష్ణుఁ డగుపఱచినభక్తిని సముచితరీతిం దగుపదములవిన్యాసముతోడ నిరూపించుటంబట్టి తిమ్మనార్యు ముద్దుపల్కురీతియుఁ దూచినట్లు మాటలువేయు చాతురియుఁ బ్రకాశితము లగుచున్నవి.

## పారిజాతప్రతిష్ఠ

తే. ప్రాణవిభుఁ బెక్కుమాఱులు ప్రస్తుతించి
మందిరారామవాటికామధ్యసీమ
దివిజభూమీరుహంబుఁ బ్రతిష్ఠసేసి
యర్హాపూజన మొనరించె ననుదినంబు. 50

ప్రాణవిభున్ = ప్రాణనాథుని శ్రీకృష్ణుని, పెక్కుమాఱులు = అనేకపర్యాయములు, ప్రస్తుతించి=స్తోత్రముచేసి, మందిరారామవాటికామధ్యసీమన్ = గృహారామప్రదేశమధ్యభాగమున, దివిజభూమీరుహంబున్ = సురతరువగు కల్పవృక్షమును, ప్రతిష్ఠ + చేసి=నాఁటి, అనుదినంబున్ = ప్రతిదినమును, అర్హాపూజనము = తగినపూజను, ఒనరించెన్ = చేసెను.

చ. సతులఁట ప్రాణనాథులఁట సారెకు నైక్యము లైనమోహసం
గతులఁట యేమి సెప్ప బలఘుస్మరుఁ బోర జయించి కల్పక
క్షితిరుహము న్ని జేశ్వరికిఁ గృష్ణుఁడు దా నిటఁ దెచ్చె నంచు సం
స్తుతు లొనరించి రొండొరులతో సవతు ల్పదియూఱువేవురున్. 51

టీ. సతులఁట = భార్యలఁట, ప్రాణనాథులఁట = భర్తలఁట, సారెకున్ = మాటి మాటికిని, ఐక్యములైన = ఏకీభావమును గూర్చునవి యైన; అనఁగాఁ బరస్పరమునకు నత్యంతమైత్రిని గూర్చున వనుట. మోహసంగతు లఁట = మోహమునకు సంబంధించిన వ్యాపారము లఁట; అనఁగా లోకమున సతీపతు లనేకులు గలరు. వారి కత్యంతమైత్రి పొసఁగును. దాన సనేక మోహవ్యాపారములు కలుగును. కాని యిట్టి యనిర్వాచ్యమైన ప్రేమతో నెసఁగు మోహవ్యాపారములతో నొప్పు భార్యాభర్తలను గాన మని తక్కుఁగల దేవేరు లాశ్చర్యపడి మెచ్చుకొనుచున్నా రని యెన్నఁబలయును. చెప్పన్ = చెప్పుటకు, ఏమి, కల దనుట. బలఘస్మరున్ = బలాసురహంతను, పోరన్ = యుద్ధమున, జయించి, కల్పకక్షితిరుహమున్ కల్పభూజమును, నిజేశ్వరికిన్ =తనభార్యకై, తాను, ఇటన్ = ఇచ్చటికి, తెచ్చెన్, అంచున్, సవతులు పదియాఱువేవురున్ = పదునాఱువేలమంది యైన సవత్తులును, ఒండొరులతోన్ = ఒకరితో నొకరు, సంస్తుతులు=నుతులు, ఒనర్చిరి = చేసిరి. దాంపత్య మనఁగా నిట్లుండవలె నని వారి యన్యోన్యప్రేమను శ్లాఘించి రనుట. ఇట నఁట కిలార్థకము.

సీ. విరివిగా నొకవేళఁ బెరిఁగి వీటికినెల్ల
నిజశీతలచ్ఛాయ నిగుడఁజేయుఁ
బిన్నగా నొకవేళఁ బెనుప్రేలియంత యై
చూడ్కుల కెంతయు వేడ్క సేయు
వింతగా నొకవేళ వివిధభూరుహపుష్ప
సురభిగంధంబుల సోడు ముట్టు
వేర్వేఱ నొకవేళ వికచకాంచనరత్న
పరిపక్వఫలములఁ బరిణమించు
తే. నభిలషించినరూపంబు నభినయించు
నుల్లమునఁ గోరుకోరిక లెల్ల నొసఁగు
సత్యభామాగృహారామనిత్య మైన
పారిజాతంబు విస్మయాపాది యగుచు. 52

టీ. ఇందుఁ బారిజాతమునుసికి వర్ణితము.—విరివిగాన్ =విశాలముగా, ఒకవేళన్ =ఒకానొకసమయమున, పెరిఁగి=వృద్ధిపొంది, వీటికినెల్లన్ =పట్టణమంతకును, నిజశీతలచ్ఛాయన్ =తనచల్లనినీడను, నిగుడన్ + చేయున్ =వ్యాపింపఁజేయును.పిన్నగాన్ =చిన్న

దిగా, ఒకవేళ = ఒకసమయమున, పెనుప్రేలియంతయై = పెద్దప్రేలిపరిమాణముకలదై, చూడ్కులకున్ = చూపులకు, ఎంతయున్ = మిక్కిలి, వేడ్కన్ = సంతోషమును, చేయున్. వింతగాన్ = ఆశ్చర్యముగా, ఒకవేళ, వివిధ.....గంధంబులన్ - వివిధ = నానావిధములైన, భూరుహ = వృక్షములయొక్క, పుష్ప = పూవులయొక్క, సురభి = పరిమళించునట్టి, గంధంబులన్ = పరిమళముల చేతను, సోడు = బ్రహ్మరంధ్రమును, ముట్టున్ = అంటును; అనగా పారిజాతము వివిధవృక్షముల పూవులను దానే పుట్టించి వానిపరిమళము చేగపాలము నంటు ననుట. ఏదియైన నాఘ్రాణించిన నద్దానిగంధము నాసాద్వారమునగ గపాలమునకుగ బోవుట సైజముగదా! వేర్వేఱన్ = విభిన్నముగా; అనగా భేదము సుగమ మగున ట్లనుట. ఒకవేళ, వికచకాంచనరత్న పరిపక్వఫల ములన్ = మంచిరంగుగల బంగారురూప మైనట్టియు, రత్నరూప మైనట్టియు బాగుగా బండినపండ్లతో, పరిణమించున్ = పరిణామమునందును; అనగా మాఱి యొప్పు ననుట. అభిలషించినరూపంబున్ = కోరినరూపమును, అభినయించున్ = తాల్చి నటించును. ఉల్లమునన్ = మదియందు, కోరు = వాంఛించునట్టి, కోరికలెల్లన్, ఒసగున్ = ఇచ్చును. సత్యభామాగృహారామనిత్యమైన = సత్యభామయొక్క యింటిముంగిటి యుద్యానమున స్థిరమైన, పారిజాతంబు, కర్త. విస్మయాపాది = ఆశ్చర్యమును గలుగజేయునది, అగుచున్; పూర్వసీసపాదములతో నన్వయము. సీసపాదములలో విస్మయమును గలుగ జేయుటకు హేతువులు నిర్దిష్టము లయ్యె.

### నారదాగమనము

వ. ఇవ్విధంబున నభీష్టఫలసిద్ధిసంతోషితస్వాంతులును నిఖిలలోకైక సంస్తూయమానమహామహిమోదాత్తులు నై నిరంతరసౌఖ్యవర్ధిష్ణు లగు నాసత్యాకృష్ణులను జూచువేడుకం గ్రమ్మఱ నొక్కనాఁడు నిజతనుప్రభాప్రభావాపహసితశారదనీరదుం డగునారదుం డరుగు దెంచి యాదంపతులు సేయుసత్కారంబులం బరితుష్టి నొంది సుఖోపవిష్టుం డై యిష్టాలాపసమయంబున నుల్లసితముఖారవిందుం డగుచు నయ్యిందువదనం గనుంగొని. 53

టీ. ఇవ్విధంబునన్ = ఈరీతిగ, అభీష్టఫలసిద్ధిసంతోషితస్వాంతులును = కోరిన ఫలము సిద్ధించుటచే సంతోషపడిన మనస్సుగలవారును, నిఖిల.....దాత్తులు-నిఖిల = సమస్తమైన, లోక = జనులచే, సంస్తూయమాన = నుతింపఁబడుచున్న, మహామహిమ = మహానుభావతచే, ఉదాత్తులున్ = అధికులును, ఐ=అయి, నిరంతర సౌఖ్యవర్ధిష్ణు లగు =

అత్యధిక సౌఖ్యముచే వర్ధిల్లువారగు, ఆసత్యాకృష్ణులను, చూచువేడుకన్, క్రమ్మఱన్ =మఱల, ఒక్కనాఁడు, నిజ.....నీరదుండగు-నిజ = తనయొక్క, తనుప్రభా = శరీర కాంతియొక్క, ప్రభావ = మహిమచే, అపహసిత = నవ్వఁబడుచున్న, శారదనీరదుండగు = శరత్కాలమేఘము గలవాఁడగు, నారదుండు, అరుగుదెంచి = వచ్చి, ఆదంపతులు = ఆ సత్యాకృష్ణులు, చేయు సత్కారంబులన్ = చేసినట్టి సమ్మానములచే, సరితుష్టిన్ =సంతుష్టిని, ఒంది = పొంది, సుఖోపవిష్టుండై =సుఖముగఁ గూర్చున్నవాఁడై, ఇష్టాలాపసమయంబునన్ = ఇష్టాగోష్ఠితోనుండుసమయంబున; అనఁగా నిచ్చవచ్చిన మాటలాడుకొనునపు డనుట. ఉల్లసిత ముఖారవిందుండగుచున్ = వికసిత మైన ముఖ పద్మము గలవాఁడగుచు. అయ్యిందువదనన్ = ఆచంద్రవదనను; సత్యను, కనుంగొని= చూచి.

తే. హేమనిభగాత్రి! నీభాగ్య మేమి చెప్ప
జిష్ణుభూజంబు నీపెట్టుచెట్టు: జేసి
సవతులన కాదు త్రిభువనేశ్వరి యనంగఁ
బొలుచుపౌలోమి గెలిచితి వలఘుమహిమ. 54

టీ. హేమనిభగాత్రి=బంగారుతో సమానమైన శరీరముగలదానా! నీభాగ్యము = నీయదృష్టము; నీసంపత్తు, చెప్పన్, ఏమి? అనఁగా ననిర్వాచ్య మనుట. జిష్ణుభూజంబున్ =ఇంద్రద్రుమమును; పారిజాతము ననుట. నీపెట్టుచెట్టున్ = నీవు నాఁటినచెట్టుగా, చేసి = ఒనర్చి, సవతులన్ +అ-సవతులన = సపత్నులనే, కాదు, త్రిభువనేశ్వరి = ముల్లోకములకు రాణి, అనంగన్ = అనునట్లు, పొలుచు = ఒప్పునట్టి, పౌలోమిన్ = ఇంద్రుని భార్యను శచిని, అలఘుమహిమన్ =గొప్పమహిమచే, గెలిచితి=జయించితివి.

విశే. నారదుఁడు నామూలమునసే సుమ్ము నీ కింతటిభాగ్యము కల్గె నని నిపుణముగఁ బ్రసంగించినాఁడు. మఱియుఁ బుణ్యకవ్రతము సేయఁ బురికొల్పఁ దలంచినవాఁడు గానఁ దన చెప్పిన-చొప్పున నడుచువారల కెల్లభాగ్యములును గల్గు ననియు నిపుణముగఁ దెలియఁ బల్కినవాఁడు.

## పుణ్యకవ్రతము

చ. అతులితతాపకీనమహిమాతిశయోచిత మైనపుణ్యక
వ్రత మొనరింపఁగా వలయు వారిజలోచన నీవు నయ్యెడం
ధృతియు గౌరియు న్నచియుఁ దత్పరబుద్ధి నొనర్చువేళఁ జూ
చితి మును తద్విధం బెఱుఁగఁ జెప్పెద నే నిపు డానుపూర్విగన్. 55

టీ. వారిజలోచన = పద్మాక్షీ, నీవును, అతులితతావకీన మహిమాతిశయోచిత మైన = సాటిలేని నీదగు ప్రాభవాతిశయమునకుఁ దగినదైన, పుణ్యకవ్రతము = పుణ్యక మను వ్రతమును; పుణ్యములఁ గలుగఁజేయు వ్రతము గాన దీని కీపేరు గల్గెను. ఒనరిం పఁగాఁ-వలయున్ = చేయవలెను. అయ్యరుంధతియున్, గౌరియున్, శచియున్, తత్పరబుద్ధిన్ = ఆ పుణ్యకవ్రతమం దాసక్తమైన మదితో, ఒనర్చువేళన్ = చేయు సమయమున, మును=పూర్వమందు, చూచితిని. నేను, ఇపుడు, తద్విధంబు = ఆపుణ్యక వ్రతమురీతిని, ఆనుపూర్విగన్ = క్రమముగా, చెప్పెదను.

విశే. అరుంధతీగౌరీశచులు చేసి రనుటంజేసి వారలవలె నీవును స్వాధీనపతిక వగుటంజేసి చేయవలె నని హెచ్చరించె నని గ్రహించునది.

చ. తెలతెలవాఱ మానినియతి న్నదికిం జని తీర్థమాడి ని
ర్మలవసనంబు గట్టి నవరత్నవిభూషణము ల్ధరించి మై
గలప మలంది క్రొమ్ముడినిఁ గమ్మవిరు ల్నవరించి యత్తమా
మలకును నాత్మభర్తకు నమస్కృతి సేసి తదీయసమ్మతిన్. 56

టీ. తెలతెలవాఱన్ = తూర్పు తెలతెల నగుచుండ; అనఁగా నుషఃకాలమున ననుట. మానినియతిన్ = మాటలాడకుండుట యను నియమముతోడ; మానముతోడ ననుట. నదికిన్, చని, తీర్థమాడి=స్నానమొనర్చి (తీర్థము = జలమునందు, ఆడి=మునిఁగి) నిర్మలవసనంబున్ =శుభ్రవస్త్రమును, కట్టి, నవరత్నవిభూషణముల్ = తొమ్మిదిజాతుల రత్నములచేనైన యలంకారములను; ధరించి, లేదా నూతనరత్నాలంకారములను ధరించియైన ననిచెప్ప నగును. మైన్ =శరీరమున, కలపము=అంగరాగము; అనఁగాఁ జంద నాదు లనుట. అలంది = పూసికొని, క్రొమ్ముడిని = క్రొత్తయైన శిరోజముల ముడియందు, కమ్మవిరుల్ =పరిమళించు పుష్పములు, సవరించి = కూర్చి; అనఁగా ముడిచికొని యనుట. అత్తమామలకున్, ఆత్మభర్తకున్ = తనమగనికిని, నమస్కృతి, చేసి, తదీయసమ్మతిన్ = వారియంగీకారము చే; తరువాతిపద్యముతో నన్వయము.

విశే. శ్రుతులును, స్మృతులును పత్యనుమతి నందక భార్య యే వ్రతమును జేయ రా దనియు, నట్లు చేసిన నది విఫల మగు ననియుఁ బల్కును గాన, నిందుఁ బతియనుజ్ఞ నందవలె నని కవి పల్కినాఁ డని యెన్నవలెను.

చ. కువలయనేత్ర! తొంటితసకోపము గర్వము మత్సరంబు మా
ని వినయముం బ్రమోదమును నిండి తొలంకెడు నెమ్మనంబున

సవతులయిండ్లకెల్లఁ దొలునాఁడు క్రమంబున నేఁగి తత్ప్రీతో
త్సవమున కామతించి యతిసంభ్రమలీలలఁ దోడితేఁ దగున్. 57

టీ. కువలయనేత్ర=కలువకంటీ! తొంటితనకోపమున్ = పూర్వమునఁగల తన కోపమును, గర్వమున్, మత్సరంబున్ =మాత్సర్యమును, మాని=విడిచి, వినయమున్ = అణఁకువయు, ప్రమోదమున్ =సంతోషమును, నిండి, తొలంకెదు = ఒలుకుచున్న, నెమ్మనంబునన్ =నిండుమదితో, తొలునాఁడు=పూర్వదినమున, సవతులయిండ్లకెల్లన్ = సపత్నీగృహములకెల్లను, క్రమంబునన్ = పిన్న పెద్ద వరుస ననుసరించి, వీఁగి, తత్ప్రీతోత్సవమునకున్ =ఆప్రతోత్సవమునకై, ఆమతించి = ఆహ్వానించి, పిలిచి యనుట. అతి సంభ్రమలీలలన్ - అత్యంతోత్సాహవిలాసములతో ననుట. తోడితేఁ = తీసికొని వచ్చుట, తగును.

విశే. ఈవిధానము సత్యాగర్వపరిహారార్థ మని యెన్నవలెను.

చ. దినదినమట్లు తత్పరమతిం బదివేవురు పేరఁటాండ్రకు
ర్చన లొనరించి సారఘనసారసుగంధములు న్విచిత్రనూ
తనపటవస్త్రభూషణవితానము లిచ్చుచు వేడ్కఁ జైత్ర శు
ద్ధనవమి యాదిగా నెల వ్రతం బొనరించినయంతమీఁదటన్. 58

టీ. దినదినము=ప్రతిదినము, అట్లు=ఆరీతిగ, పదివేవురు పేరఁటాండ్రకున్ = పదివేలమందియైన ముత్తైదువలకు, అర్చనలు=పూజలు, ఒనరించి=చేసి, సారఘనసార సుగంధములున్ =శ్రేష్ఠమైన పచ్చకప్పురమును బరిమళద్రవ్యములును, విచిత్రనూతన పటవస్త్రభూషణవితానములు = విచిత్రములైన క్రొత్తపట్టుబట్టలయు నలంకారము లయు సమూహములను, ఇచ్చుచున్, వేడ్కన్ = సంతోషముతో, చైత్రశుద్ధనవమి యాదిగాన్ = చైత్రమాసశుక్లపక్షనవమి మొదలుగా, నెల=మాసము, వ్రతంబు, ఒనరించిన యంతమీఁదటన్ =చేసినపిదప; తరువాతిపద్యముతో నన్వయము.

మ. పరమాచారధురీణు నధ్యయనసంపన్నున్ శుభాకారు శా
స్త్రరహస్యజ్ఞు విశిష్టవంశజుఁ బ్రశాంతస్వాంతు సద్బుద్ధయా
పరతంత్రున్ విదితాత్తు భూసురవరుం బ్రార్థించి యాచార్యుఁగాఁ
దరళాక్షీ! నియమింపఁగాఁ దగు వ్రతోద్యాపక్రియావేళకున్. 59

టీ. తరళాక్షీ=చపలాక్షీ! పరమాచారధురీణున్ =ఉత్కృష్టమైన వేదవిహిత ధర్మానుష్ఠానముయొక్క భారమును వహించునట్టివానిని; అనఁగా వేదవిహిత మగు ధర్మములఁ దప్పక యాచరించువాని ననుట. అధ్యయనసంపన్నున్ = వేదాధ్యయనముతోఁ

గూడినవానిని; అనఁగాఁ జక్కఁగా వేదవేదాంగములఁ జదివికొన్నవాని ననుట. శుభాకారుఁ=దర్శనీయ మైన యాకారము గలవానిని; అనఁగా నంగవైకల్యము లేని వాని ననుట. అంగవైకల్యము గలవాఁడు దానయోగ్యుఁడు కాఁడని భావము. శాస్త్ర రహస్యజ్ఞుఁ=ఎల్లశాస్త్రముల రహస్యము నెఱింగినవానిని; అనఁగా సత్కార్యప్రవృత్తియు నసత్కార్యనివృత్తియుఁ జేయు శాస్త్రములమర్మముల నెఱింగినవానిని ననుట. విశిష్టవంశజుఁ = ఉత్కృష్టశిష్టవంశమునఁ బుట్టినవానిని; అనఁగా వేదవిహితధర్మములం జేయుచుఁ దన్నార్గమును వీడక వర్తించు నుత్తమవంశమునఁ బుట్టినవాని ననుట. ప్రశాంతస్వాంతుఁ=మిగుల శాంతమైన మదిగలవానిని; అనఁగాఁ గామక్రోధాదులఁ గలుషితము గాని మదిగలవాని ననుట. ఉద్యద్దయాపరతంత్రుఁ = ఉదయించుదయకధీనుఁడైనవానిని; అనఁగా నెంతయు దయాళువైనవాని ననుట. విదితాత్మున్ = తెలియఁబడిన బ్రహ్మజ్ఞానముగలవానిని; అనఁగా బ్రహ్మజ్ఞానసంపన్ను ననుట. భూసుర వరుఁ=బ్రాహ్మణశ్రేష్ఠుని, పైని పేర్కొనిన లక్షణములు గలవాఁడే బ్రాహ్మణశ్రేష్ఠుఁ డని పించుకొను నని భావము. ప్రార్థించి = వేఁడి, వ్రతోద్యాపక్రియావేళకున్ = వ్రతపరిసమాప్తివ్యాపారకాలమునకు; ఉదాపసనము చేయుసమయమున కనుట. ఆచార్యుఁగాఁ=గురువుగా; అనఁగా వ్రతతంత్రమునందలి యాయాక్రియల నుపదేశించుటకును, అందాయాదానాదులఁ బ్రతిగ్రహించుటకును దగుబ్రహ్మగా ననుట. నియమింపఁగాఁ=వీర్పఱుపఁగా, తగును; నియమింపవలె ననుట.

శా.ఆరీతి న్నియమించి యీవలయు మాద్యద్భంతి వాహావళుల్
నారీరత్నచయం బనర్ఘనవరత్నశ్రేణిగోభూపరీ
వారంబు ల్ధనధాన్యసంతతి రసవ్రాతంబుఁ గర్పూరక
స్తూరీసంకుమదాగురుక్రముకరాసు ల్లోఁటిసంఖ్యాకముల్. 60

టీ. ఆరీతిఁ=పైని చెప్పినచొప్పున, నియమించి, మాద్యద్భంతివాహావళుల్ = మదించిన యేనుఁగులయు గుఱ్ఱములయు సమూహములను, నారీరత్నచయంబు=స్త్రీరత్నసమూహమును, అనర్ఘ...వారంబుల్ -అనర్ఘ==అమూల్యములైన, నవరత్న = తొమ్మిది జాతుల రత్నములయొక్క; లేక క్రొత్తరత్నముల, శ్రేణి=పంక్తియు, గో = ఆవులు, భూ = భూమి, పరీవారంబుల్ = పరిచారకులును, ధనధాన్యసంతతి = ధనధాన్యముల సమూహమును, రసవ్రాతంబుఁ=ద్రవద్రవ్యములసమూహమును; అనఁగా నేయి తేనె మొదలగువాని ననుట. కర్పూర...క్రముకరాసుల్ -కర్పూర=కర్పూరము, కస్తూరీ = కస్తూరి, సంకుమద=జవాది, అగురు, క్రముక = పోక (వీనియొక్క), రాసుల్ =

కుప్పలు, కోటిసంఖ్యాకములన్ = కోటిలెక్కగలవానిని; కోట్లకొలది యనుట. ఈ + వలయున్ = ఒసంగవలెను.

శా. ఏతద్వస్తు సదక్షిణాకముగ నాత్మేశు న్సురానోకహా
న్వీతుంగాఁ దగ ధారవోసి ద్విజుఁ డేయేయర్థము ల్వేఁడినం
జేతఃప్రీతిగ నిచ్చి క్రమ్మఱఁ బతిం జేకొంట యుక్తంబు వి
ఖ్యాతం బై తనరారు నీవ్రతము సాకల్యంబుగాఁ జేసినన్. 61

టీ. ఏతవ్వస్తు = ఈపదార్థసమూహము; జాత్యేకవచనము. సదక్షిణాకముగన్ = దక్షిణతోఁ గూడుకొనునట్లుగా; అనఁగా వానికి దక్షిణగా ననుట. ఆత్మేశున్ = తన ప్రాణనాథుని; భర్త ననుట. సురానోకహాన్వీతుంగాన్ = కల్పవృక్షముతోఁ గూడిన వానినిగా; అనఁగాఁ గల్పవృక్షముతోఁ గూర్చి యనుట. తగన్ = ఉచితమగునట్లుగా, ధారవోసి=ఉదకధారతో దత్తముచేసి, ద్విజుఁడు=బ్రాహ్మణుఁడు, ఏయేయర్థముల్ = ఏయే పదార్థములను, వేఁడినన్ =కోరినను, చేతఃప్రీతిగన్ = మదికి సంతోషము గల్గునట్లుగా, ఇచ్చి; అనఁగా దానముపట్టిన యాచార్యుఁ డేమి కావలె నన్న నవ్వాని నిచ్చి వాని మనస్సును సంతోషపెట్టి యనుట, క్రమ్మఱన్ =మఱల, పతిన్ =భర్తను, చేకొంట =పరిగ్రహించుట, యుక్తంబు=అర్హము. ఈవ్రతము, విఖ్యాతంబై = ప్రసిద్ధమై, తనరారున్ =ఒప్పును; ప్రసిద్ధముగా నున్నదానినే చెప్పితిని గాని లేనిదానిం జెప్పలేదనుట. ప్రాణనాథుని సురభూజముతో ధారవోయుపద్ధతి కల్పిత మనుకొనునేమో యని యీమాట యిచ్చోఁ గూర్పవలసివచ్చెను. సాకల్యంబుగాన్ = సంపూర్ణముగా; కొఱంతలేక యనుట, చేసినన్ =చేసినచో; తరువాతిపద్యముతోడ నన్వయము.

క. ధనకనకవస్తుసమితియుఁ
దనయసమృద్ధియును గల్గి తానుం బతియున్
మనమున నఱగొఱ లెఱుఁగక
యనితరసుల్ గైకసుఖము లందుదు రనుచున్. 62

టీ. ఇందువ్రతమువలని ఫలము చేరొక్కనఁబడుచున్నది.—ధనకనవస్తుసమితియున్ =ధనము బంగారము వివిధవస్తువులు వీనిసమూహములు, తనయసమృద్ధియును = పుత్రసమృద్ధియు, కల్గి, తానున్, పతియున్, మనమునన్ =మదిని, అఱగొఱలు=అఱమఱలు; కొఱంతలు, ఎఱుఁగక = లేక, అనితరసుల్ గైకముల్ = ఇతరులకుఁ బొందరాని ముఖ్యములైన సుఖములను, అందుదురు=పొందుదురు. అనుచున్.

భా. వ్రతమాచరించిన వనిత ధనధాన్యాది వస్తుసమృద్ధియుఁ, బుత్రసమృద్ధియుఁ గల్గి, పొచ్చెముకాని పతిప్రేమకుఁ దావలమై, యనన్యదుర్లభము లగు సుఖములం బొందు నని భావము.

### పుణ్యకవ్రతము

క. నారదుఁడు పుణ్యకవ్రత,మారూఢిగ నెఱుఁగఁ జెప్పఁ నసహితమతియై
కోరిక లిగురొత్తఁగఁ ద,త్పారంభ మొనర్చె సత్య ధవునియనుజ్ఞన్.

టీ. నారదుఁడు; పుణ్యకవ్రతము, ఆరూఢిగ = ప్రసిద్ధముగ, నెఱుఁగ = తెలియునట్లుగ, చెప్పఁ, అవహితమతియై=సావధానబుద్ధిగలదై, కోరికలు = వాంఛలు; ఇగురొత్తఁగ = పల్లవింపఁగా, సత్య = సత్యభామ, ధవునియనుజ్ఞ = భర్తయగు శ్రీకృష్ణుని సెలవుచే, తత్పారంభము=ఆపుణ్యకవ్రతప్రారంభము, ఒనర్చె = చేసెను.

విశే. నారదుఁడు పతిసెలవునందవలె నని తెల్పెను గాన సత్య శ్రీకృష్ణనుజ్ఞం బడసె నని గ్రహించునది.

సీ. యదువృష్ణికుకురభోజాంధకాదికముగా
*నాత్మీయమైనట్టి యాప్తగణము
సంబంధు లైనభీష్మకనఘహితాదులు
పదియాఱువేలభూపతులకులము
పాండవకారవపాంచాలు రాదిగాఁ
బరమహితం బైనబంధుసమితి
నందాదిగోపాలబృందంబు మఱియును
నెయ్యం బై వర్తించునృపచయంబు
తే. వారివారలచుట్టము ల్వారిసఖులు
గా జగంబునఁ గల్గినరాజలోక
మెంత యంతయు సకుటుంబ మేఁగుదెంచెఁ
బుణ్యకాఖ్యవ్రతోత్సవాభ్యుదయమునకు. 64

టీ. యదు వృష్ణి కుకుర భోజాంధకాదికముగాఁ = యాదవులు, వృష్ణులు, కుకురులు, భోజులు, అంధకులు మొదలుగా; పైని పేర్కొనినవారలు యదువంశములోని యాయా తెగలకు సంబంధించినవా రనుట. ఆత్మీయమైనట్టి = తనసంబంధమైన; ఆప్తగణము=ఆప్తులసమూహము, సంబంధులైన = వివాహాది సంబంధముగలవారైన;

---

* నాత్మకీయంబైన.

అనఁగా వియ్యము నందినవా రనుట. భీష్మకమహీశాదులు=భీష్మకుఁడు మొదలగు రాజులును; భీష్మకుఁడు రుక్మిణితండ్రి. పదియాఱువేల భూపతులకులమున్ = పదియాఱువేల రాజులసమూహమును; వీరు శ్రీకృష్ణుని పదియాఱువేల పట్టపుదేవేరులతండ్రులు, పాండవ కౌరవ పాంచాలురు = పాండవులు, కౌరవులు, పాంచాలురు, ఆదిగాఁ = మొదలుగా, పరమహితంబైన = మిగులనిష్టమైన, బంధుసమితి=చుట్టాలగుంపు; పాండవులును కౌరవులును శ్రీకృష్ణునకు మేనత్తకొడుకులు గాన, సహజమిత్రులు మేనత్తకొడుకులు, సహజశత్రువు లన్నదమ్ములబిడ్డ లను న్యాయము ననుసరించి వారు పరమహితు లనుట. ఆపాండవులకు కూఁతు నిచ్చిన వియ్యపువా రగుటఁ బాంచాలురు (ద్రుపదుని కొడుకులు మొదలగువారు) నాప్తులే యగుదురు. నందాది గోపాలబృందంబున్ = నందుఁడు మొదలైన గోపాలసమూహమును, మఱియును, నెయ్యులై = మిత్రులై, వర్తించు=ప్రవర్తించునట్టి, నృపచయంబున్ = రాజసమూహమును, వారివారలచుట్టములన్ =ఆయావారికి బంధువులును, వారిసఖులున్ =ఆయాదారలమిత్రులును, కాన్ = అగునట్లు, జగంబునన్ =లోకమున, కల్గిన=ఉన్న, రాజలోకంబు=రాజసమూహము, ఎంత=ఎంతకలదో, అంతయున్ =సర్వమును, సకుటుంబము = కుటుంబముతోఁగూడ, పుణ్యకాఖ్యవ్రతోత్సవాభ్యుదయమునకున్ =పుణ్యక మను పేరుగల వ్రతమునొక్క యుత్సవమునొక్క యభివృద్ధికై, ఏఁగుదెంచెన్ =వచ్చెను. పైని పేరొక్కన్నవారెల్లను భార్యలతోడను, బంధువులతోడను, మిత్రులతోడను నేతెంచి రని భావము.

వ్యా—విశే.ఇందు వచ్చినవారిని బేరొక్కనుటలోఁ గలక్రమ మతిహృద్యము, నెయ్యము. ప్ర. స్నేహము.

క. నగముల నదులఁ బయోధుల
దిగంతములఁ గాననముల దీవుల మఱియుం
దగునెడలఁ బుణ్యకవ్రత
జగదుత్సవమునకు వచ్చె సంభారంబుల్. 65

టీ. పుణ్యకవ్రతజగదుత్సవమునకున్ = పుణ్యకవ్రత మను లోకోత్సవమునకు, నగములన్ =కొండలనుండియు, నదులన్ =ఏఱులనుండియు, పయోధులన్ = సముద్రములనుండియు, దిగంతములన్ = దిఙ్మూలములనుండియు, కాననములన్ = అడవుల నుండియు, దీవులన్ =ద్వీపములనుండియు, మఱియున్, తగునెడలన్ = తగినతావుల నుండియు, సంభారంబుల్ =సామగ్రులు, వచ్చెన్; అనఁగా వానినుండి కొనివచ్చి రని భావము.

వ్యా - విశే. దీవి. ప్ర. ద్వీపమ్.

తే. అసురహరునాజ్ఞ రైవతకాద్రిపాంత
విస్మయము గాఁగ నిర్మించె విశ్వకర్మ
యాత్మనిర్మాణచాతురి కవధి గాఁగ
మణిమయోజ్జ్వల మగుదానమంటపంబు. 66

టీ. విశ్వకర్మ = దేవశిల్పి, అసురహరునాజ్ఞన్ = శ్రీకృష్ణునియాజ్ఞచే, రైవత కాద్రిపాంతన్ = రైవతకపర్వతసమీపమున, విస్మయము కాఁగన్ = ఆశ్చర్యకరముగా, ఆత్మనిర్మాణచాతురికిన్ = తనసృష్టినైపుణ్యమునకు, అవధి=హద్దు, కాఁగన్ = అగునట్లు గా; అనఁగా నింత కెక్కుడుగా నొండు నిర్మింప వీలులేనియ ట్లనుట. తన నిర్మాణ నైపుణి కిది పరమావధిగాఁ జేసె నని భావము. మణిమయోజ్జ్వలమగు = మణిప్రచుర మగుట చేఁ బ్రకాశించు, దానమంటపంబున్ = దానముచేయునపు డుండఁదగిన మంటప మును, నిర్మించెన్ = సృజించెను.

సీ. చూడ్కికి ప్రేక మై సురవిమానములచే
గగనమార్గంబెల్లఁ గ్రందుకొనియె
మనుజనాయకవరమకుటాగ్రమణులచే
దిగ్భిత్తు లధికచిత్రితము లయ్యె
నాహూతు లై సమహామునీశ్వరులచేఁ
బొడవడ దయ్యె భూభువనతలము
సందర్శనాయాతజనభరంబునఁ గ్రింద
భుగ్నస్ఫటుం డయ్యెభుజగభర్త
తే. సమయబహుముఖముఖరతూర్యములవలనఁ
బ్రహ్మాండంబు ఘోషసంభరిత మయ్యె
సకలలోకమహాశ్చర్యజనక మయిన
పుణ్యకాఖ్యమహోత్సవాభ్యుదయమునను. 67

టీ. సకలలోక మహాశ్చర్యజనక మైన = ఎల్లప్రజలకు మిగుల నాశ్చర్యమును గలుగఁ జేయునట్టి, పుణ్యకాఖ్యమహోత్సవాభ్యుదయమునను = పుణ్యక మను పేరుగల గొప్పయుత్సవముయొక్క యభివృద్ధియందు, చూడ్కికిన్ = దృష్టికి, ప్రేకమై=భారమై, సురవిమానములచేన్ = దేవతల విమానములచే, గగనమార్గంబెల్లన్ = ఆకాశమార్గ మంతయు, క్రందుకొనియెన్ = క్రిక్కిఱిసెను; విమానములపైనుండి సురలెల్లరు నుత్స వముం దిలకించుచుండి రని భావము. మనుజనాయకవరమకుటాగ్రమణులచేన్ = రాజ

శ్రేష్ఠుల కిరీటముల కొనల నుండు మాణిక్యముల చేత, దిగ్భత్తులు=దిక్కు లనుగోడలు; దిక్తటము లనుట. అధికచిత్రితములు = మిగుల చిత్రవర్ణము గలవిగాఁ జేయఁబడినవి, అయ్యెన్; లెక్కకు మిక్కిలియైన రాజు లేతెంచి రనుట. ఆహూతులైన మహామునీశ్వరులచేన్ =పిలువఁబడిన మహర్షులచేతను, భూభువనతలము = భూలోకప్రదేశము, పొడవడదయ్యెన్ =అగపడదయ్యెను; మహామునీశు లసంఖ్యాకు లేతెంచి రనుట. సంధర్శనాయాతజనభరంబునన్ =చూచుటకు వచ్చిన జనులబరువుచే, భుజగభర్త=శేషుఁడు, భుగ్నస్ఫటుండు = వంగినపడగ గలవాఁడు, అయ్యెన్; భువిని మోయు శేషునితల జనభారమును వహింపఁజాలక వంగె ననుట. అనఁగాఁ బ్రజ లసంఖ్యాకు లుత్సవమునఁ జూడవచ్చి రనుట. సమయబహుముఖముఖరతూర్యములవలన్ = ఆయుత్సవసమయమున నానాప్రకారముగ ధ్వనిచేయు మంగళవాద్యములవలన, పద్మజాండంబు = బ్రహ్మాండము, ఘోషసంభరితము=ధ్వనితోఁ బూర్ణమైనది, అయ్యెన్; అనఁగా వివిధవాద్యములు నయ్యుత్సవమున మ్రోగింపఁబడె ననుట.

ఉ. దానవభేది సత్యయును దాను యథోచితవృత్తి మంగళ
స్నాన మొనర్చి శుభ్రవసనంబులు గట్టి యనర్ఘరత్నభూ
షానివహంబు పూని హరిచందనచర్చ వహించి వృద్ధస
భ్యానుమతి న్సులగ్నమున నావ్రతదీక్ష వహించె నయ్యెడన్. 63

టీ. దానవభేది=శ్రీకృష్ణుఁడు, సత్యయును, తాన్, యథోచితవృత్తిన్ = యథార్హమైనవర్తనముతో; అనఁగా నపు డెట్లొనర్పవలెనో యట్లనుట. మంగళస్నానము=వ్రతదీక్షకుఁ బూర్వమునఁ జేయుస్నానమును, ఒనర్చి=చేసి, శుభ్రవసనంబులు=ధౌతవస్త్రములను, కట్టి; వ్రతాదుల ధౌతవస్త్రధారణ మవశ్యకర్తవ్యము. అనర్ఘరత్నభూషానివహంబున్ =అమూల్యములైన రత్నాలంకారముల సమూహమును, పూని = తాల్చి, హరిచందనచర్చ=హరిచందనపుఁబూఁతను, వహించి. పూసికొని యనుట. వృద్ధసభ్యానుమతిన్ =వృద్ధులగు సభాసదుల యంగీకారముచే, అయ్యెడన్ = ఆసమయమున, సులగ్నమునన్ =మంచిలగ్నమునందు; ఆవ్రతదీక్షన్, వహించెన్.

క. వ్రతకల్పోచితదాన, ప్రతిగ్రహార్థముగ నిఖిలపరిషదనుజ్ఞం
గృతనిశ్చయుఁ డై సవినయ, నతిచే సమ్మతిలఁ జేసి నారదమౌనిన్. 64

టీ. వ్రతకల్పోచిత'... ర్థముగన్ -వ్రతకల్ప = వ్రతవిధానమునకు, ఉచిత = తగిన, దాన = దానమును, ప్రతిగ్రహార్థముగన్ = పుచ్చుకొనుటకుఁగాను, నిఖిలపరిష

దనుజ్ఞన్=సమస్తమైన సభయొక్క సమ్మతిచే, కృతనిశ్చయుఁడై=చేయఁబడిన నిశ్చయముగలవాఁడై, కర్తవ్యావధేది. సవినయనతిచేన్ = అడఁకువతోఁ గూడిన నమస్కారముచే, నారదమూనిన్, సమ్మతిలన్=అంగీకరించునట్లుగా, చేసి = ఒనర్చి; తరువాతివాద్యముతో నన్వయము.

సీ. మదవతీకరముక్తమణికుంభసంభృత
సౌరభోదకముల జలకమార్చి
హిమధామకిరణవిభ్రమవిడంబకశుభ్ర
కౌశేయయుగళంబు గట్ట నిచ్చి
ఘనసార మృగమదగంధబంధుర మైన
గంధసారము మేనఁ గలయ నలఁది
విస్తృమరపరిమళ ప్రసవమాల్యంబులు
ఘనజటాజూటంబు మునుఁగఁ జుట్టి
తే. లలితమణిమయభూషణావళులు దొడిగి
యిష్టరాజోపచారసంతుష్టుఁ జేసి
ఋత్విజులఁ గాఁగ ధౌమ్యాదిబుధుల నిలిపి
వారిఁ బూజించె సకలోత్సవంబు మెఱయ. 70

టీ. మదవతీ.....దకములన్ - మదవతీ = యువతులయొక్క, కర=చేతుల నుండి, ముక్త=విడువఁబడిన, మణికుంభసంభృత = మణికలశములందు, నిండిన, సౌరభోదకములన్ =సుగంధజలముచే, జలకమార్చి=స్నానముచేయించి, హిమధామ..... యుగళంబున్ -హిమధామ = చంద్రునియొక్క, కిరణ=కిరణములయొక్క, విభ్రమ = విలాసములను, విడంబక = అనుకరించునట్టి, శుభ్ర = తెల్లని, కౌశేయయుగళంబు = దుకూలద్వయమును, కట్టన్ = కట్టుకొనుటకు, ఇచ్చి; చంద్రకిరణములంబోలి తళతళ మెఱయు పట్టుబట్టల రెండింటిని గట్టుకొనుట కిచ్చి రనుట. ఘనసార.....బంధురము-ఘనసార=కర్పూరము, మృగమద=కస్తూరి (వీనియొక్క), గంధ = పరిమళముచే, బంధురము=పూర్ణము, ఐన, గంధసారమున్ = చందనమును, మేనన్ = శరీరమున, కలయన్ =అంటుటను, అలఁది=రాఁచి; అనఁగాఁ గర్పూరమును కస్తూరిని చేర్చిన చందనమును శరీరమునకుఁ బూసి రనుట. విస్తృమర.....మాల్యంబులు-విస్తృమర = వ్యాపించువట్టి, పరిమళ = సుగంధముగల, ప్రసవమాల్యంబులు = పుష్పమాలలను, ఘన జటా

జూటంబు = గొప్ప దగుజటలగుంపు, మునుఁగ = నిండుగట్లుగా, చుట్టి; జటాజూట మగపడనియట్లు పరిమళించు పూలదండలను జుట్టి రనుట. లలితమణిమయభూషణా వళులు = సొగసైన రత్నాలంకారముల సమూహమును, తొడిగి, ఇష్టరాజోపచార సంతుష్టుఁ-ఇష్టరాజోపచార=ఇష్టము లగురాజున కొనర్చు నుపచారములవంటి యుప చారములచే, సంతుష్టుఁ = సంతోషించినవానినిగా, చేసి; నారద మనుట. బుత్విజులఁ = ప్రతము చేయించువారు, కాఁగ = అగునట్లు, ధౌమ్యాదిబుషులఁ = ధౌమ్యుఁడు మొదలుగాఁగల బుషులను, నిఱిపి, వారిఁ, పూజించెఁ = అర్చించెను, సకలోత్సవంబు = సంపూర్ణమగు నుత్సవము, మెఱయఁ = ప్రకాశించునట్లుగా; తరు వాతి పద్యముతోడ నన్వయము.

శా. భద్రేభంబులమీఁద నెక్కి వెనుకం బ్రద్యుమ్నశైనేయసౌ
భద్రాదు ల్గన ధర్మజప్రముఖభూపశ్రేణితో శౌరి తూ
ర్యద్రాఘిష్ఠరవంబు లుప్పతిలఁ జేర న్వచ్చె సంపన్నా
నాద్రవ్యం బగుదానమంటపము నంత న్సంభృతానందుఁ డై. 71

టీ. భద్రేభంబులమీఁదఁ = మంగళగజములపైని, ఎక్కి, వెనుకఁ, ప్రద్యుమ్న శైనేయసౌభద్రాదుల్ = ప్రద్యుమ్నుడు, సాత్యకి, సుభద్రకొడు కభిమన్యుఁడు మొద లగువారు, చనఁ, ధర్మజప్రముఖభూపశ్రేణితోఁ = ధర్మరాజు మొదలగు రాజుల పంక్తితో, శౌరి = శ్రీకృష్ణుఁడు, తూర్యద్రాఘిష్ఠరవంబు = మంగళవాద్యముల మిగుల దీర్ఘములైన చప్పుడులు, ఉప్పతిలఁ = ఒప్పుచుండఁగా, సంపన్ననానాద్రవ్యంబు = ఒప్పియున్న వివిధపదార్థములు గల, దానమంటపమున్, అంతఁ, సంభృతానందుఁ డై = నిండిన సంతోషముగలవాఁ డై, చేరఁ + వచ్చెఁ = సమీపించెను.

విశే. దీర్ఘశబ్దమునై తమప్ ప్రత్యయము చేయఁగాఁ గల్గినరూపము ద్రాఘిష్ఠ.

ఉ. ద్రౌపదియు సుభద్రయును దోఁ జనుదే విభవాగతాన్యపృ
థ్వీవరకామినీమణులు వేడ్క భజింపఁగ సత్యభామ ము
క్తావినిబద్ధపంజరయుతం బగుపల్లకి యెక్కి వచ్చె వృ
ద్ధావిసరంబు మున్నుగ వ్రతప్రతిపాదనసావధాన యై. 72

టీ. ద్రౌపదియుఁ = ద్రౌపదియును, సుభద్రయును, తోఁ = తనతోడ, చను దేఁ = రాఁగా, విభవాగతాన్యపృథ్వీవరకామినీమణులు = ప్రతవైభవమును జూడ వచ్చిన యితరరాజశ్రేష్ఠలయువతీరత్నములు; ఇతరరాజులభార్య లనుట. వేడ్కఁ = సంతోషముతో, భజింపఁగఁ = సేవింపఁగా, సత్యభామ, ముక్తావినిబద్ధపంజరయుతం బగు = మంచిముత్తెములచేఁ జేయఁబడిన యాచ్ఛాదనముతోఁ గూడిన దైన, పల్లకిఁ,

ఎక్కి, వృద్ధావిసరంబు = వృద్ధాంగనాసమూహము, మున్నుగ = ముందునడువఁగా, వ్రతప్రతిపాదనసావధాన యై = వ్రతమును జేయుటయం దవహితమైన బుద్ధి కలదై, వచ్చెన్.

### వ్రతదానములు

చ. జలరుహపత్రనేత్ర మునిసత్తమవృద్ధసువాసినీజనం
బులు వెనువెంట రాఁ జని ప్రమోదముతో వ్రతదానమంటప
స్థలమున నర్చితం బగువదాన్యమహీరుహసార్వభౌమముఁ
వలగొని వచ్చి దేవమునివర్యున కిచ్చె యథోచితార్చనల్. 73

టీ. జలరుహపత్రనేత్ర = పద్మదళాక్షి యగు సత్యభామ, మునిసత్తమవృద్ధసువాసినీజనంబులు = మునీశుల వృద్ధసుమంగలులు; అనఁగా మునీశులభార్య లనుట. వెనువెంటన్ = తనవెంటను, రాన్ = రాఁగా, చని = మీఁగి, ప్రమోదముతోన్ = సంతోషముతో, వ్రతదానమంటపస్థలమునన్ = వ్రతసంబంధిదానములు జేయ నేర్పుఱుపఁబడిన మంటపప్రదేశమున, అర్చితం బగు = పూజిత మైన, వదాన్యమహీరుహసార్వభౌమమున్ = వదాన్యవృష్టిచక్రవర్తిని; కల్పకము ననుట. వదాన్య మనఁగా విరివిగ దానము చేయునది; ఈవుల మ్రోఁకు, వలగొని = ప్రదక్షిణము చేసి, వచ్చి, దేవమునివర్యునకున్ = సురమునిశ్రేష్ఠునకు నారదునకు, యథోచితార్చనల్ = అర్ఘ్యపూజలు, ఇచ్చెన్; యథోచితముగఁ బూజించె ననుట.

విశే. ఇందు రెండవపాదమున "ప్రమోదముతో" అనుచో "ప్రభుత్వముతో" అని పాఠ మగపడు. ప్రభుత్వముతో ననఁగాఁ బ్రాభవముతో నని యర్థము. ప్రకృతమున సత్య ప్రాభవముమీఱి వచ్చె ననుటకన్నఁ బ్రమోదముతో వచ్చె ననుటయే యుచిత మగుటంజేసియు, నారదుఁడు వ్రతవిధానము జెప్పునవసరమునఁ దొంటి తన గర్వాదు అను విడువవలె నని యుపదేశించుటంజేసియు గర్వసూచక మగు ప్రభుత్వపదమునకన్న ప్రమోదపద మచట నుంటయే సరస మని తోఁచెడి.

చ. సతులు పడాఁతివేవురును సంగడి రా వదనాంబుజంబునం
గృతకవికాస మచ్చుపడఁ గృష్ణునిపట్టపుదేవి యిందిరా
ప్రతినిధి రుక్మిణీరమణి రాఁ దగ వౌ నని వచ్చెఁ బుణ్యక
వ్రతము గనుంగొనం గమలరాగమణీశిబికాధిరూఢ యై. 74

టీ. సతులు, పదాఱువేవురును; పదాఱువేలమంది శ్రీకృష్ణునిభార్యలు ననుట. సంగడిక్ = కూడ, రాక్ = రాఁగా; కలసిరాఁగా ననుట. పట్టపురాణి యగుట నీమె వెనుక వారు వచ్చి రని భావము. వదనాంబుజంబునక్ = ముఖపద్మమునందు, కృతక వికాసము = కల్పిత మగు సంతోషము; అనఁగాఁ దెచ్చిపెట్టికొన్న సంతస మనుట. అచ్చుపడక్ = తెల్లముగాఁగ; నాథుఁడు సవతికి వశుఁ డైయుంటయు, మఱియు నామెమాట మీఱఁజాలక యెంతయేని కష్టమున కోర్చి యసాధ్య మగు కల్పవృక్షము నామెకు సుసాధ మొనర్చుటయు, రుక్మిణికి సంతసము నొనర్పఁజాలవు. కాని ప్రకృత మామె తనకుఁ గల విచారముం గప్పిపుచ్చి లేనిసంతోషమును దెచ్చిపెట్టుకొని విచారము లేనిదానివోలెఁ బై కగపడుచు నౌదార్యము మీఱ రుక్మిణి వచ్చుచుండె నని భావము. కృష్ణునిపట్టపుదేవి = కృష్ణునిదేవేరి, ఇందరా ప్రతినిధి=లక్ష్మీదేవికి బదులై నది; అనఁగా మాఱు లక్ష్మీదేవి యనుట. "రాఘవత్వేఽ భవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని, అన్యేషు చావతారేషు విష్ణో రేషానపాయినీ" అను నభియుక్తోక్తి ననుసరించియు నీమె లక్ష్మి ప్రతినిధియే యగు నని భావము. రుక్మిణీరమణి, కర్త. రాక్ =వచ్చుట, భగవు = న్యాయము; దొను, అని; వెళ్లుటయే యుచిత మని యెంచి యనుట. సత్య తనయిటి కేతెంచి పిలుచుటయు, వ్రతముత్తమ మైన దగుటయు, రుక్మిణిరాకకుఁ గారణము లని భావము. పుణ్యకవ్రతము, కనుంగొనక్ = చూచుటకు, కమలరాగమణిశిబికాధిరూఢ యై = పద్మరాగమణివికారమైన పల్లకి నధిష్ఠించినవై, వచ్చెన్.

విశే. తాను రాకున్న తనయసూయ వెల్లడి యగును. మఱియు నందలివిశేష ములఁ గన్నార గాంచుట సిద్ధింపదు. కావున రుక్మిణి తనపెద్దతనమును స్థిరముగఁ జేయ నెంచి కృతకవికాసముతో వచ్చె నని గ్రహించునది. మణిశబ్ద మాకారాంత మును గలదు.

వ. అట్టియెడ నమ్మహావ్రతదానోచితంబుగా వేర్వేఱ నేర్పఱిచి పంబడు సాలంకారధేనుసహస్రంబులు విడువడు నిజవత్సంబులం బిలుచునం భారవంబులవలనం, బ్రత్యేకంబ పర్వతంబులుగాఁ గల్పింపఁబడు కనక రజతతామ్రకాంస్యాదిలోహంబులుం బద్మరాగప్రవాళహరినీలమా ణిక్యమరకతాదిరత్నంబులుం దిలగోధూమయవవ్రీహిమాషముద్గాది ధాన్యంబులుం గనకనిర్మితచ్ఛత్రచామరశయ్యావ్యజనపాదుకాదుష్యప కరణంబులుం గజతురగస్యందనాదివాహనంబులు మొదలుగాఁ గలుగు దానద్రవ్యంబులను సమకూర్చునధికారులసంభ్రమాలాపంబులవలన, నపూర్వమహోత్సవసంతోషితస్వాంతు లగుదిగంతమహీకాంతుల పర స్పరసవససల్లాపంబులవలన, వివిధదేశాగతంబు లగు రాజలోకశుద్ధాంత

వర్ణంబుల కెడ గలుగ జఘియువేత్రహస్తులతర్జనసూచ్యర్జనంబులవలన, సంయమీశ్వరతిలకంబుల వికస్వరస్వరంబుల నామేర్పిడించువేదమంత్ర పఠనంబులవలన, వైభవాలోకనలంపటు లై యాకసంబున గుంపులు గొని నిలింపు లగ్గించుసంస్తవరవంబులవలనం, బటహభేరీ*ఝుల్లర్యాది వాదిత్రనాదంబులవలనను, నాసమయం బభ్యర్ణఘూర్ణచంద్రోదయ ఘూర్ణమానార్ణవంబునుం గ్రేణిసేయుచుండె నట్టియెడం దత్కల కలంబు వినివారించి నారదుండు సత్యభామ కిట్లనియె. 75

టీ. అట్టియెడన్ = ఆసమయమున, ఆమ్మహాప్రతదానోచితంబుగాన్ = ఆమహా ప్రతమునియొక్క దానమునకుం దగునట్లుగా, వేర్వేఱన్ = వేర్వేఱుగాన్, ఏర్పఱింపం బడు = ఏర్పఱుపఁబడ్డ, సాలంకారధేనుసహస్రంబులు = అలంకృతములైన వేలకొలఁది గోవులు, విడువడు = తమ్ము విడిచి తిరుగు, నిజవక్త్రంబులన్ = తమదూడలను, పిలుచు, అంభారవంబులవలనన్ = అంభా యను ధ్వనులవలనను, ప్రత్యేకంబ = వేర్వేఱి, పర్వతంబులుగాన్ = కొండలుగా, కల్పింపఁబడు = కల్పింపఁబడినట్టి, కనక...లోహంబులున్-కనక = బంగారము, రజత=వెండి, తామ్ర = రాగి, కాంస్య = కంచు, ఆది = మొదలైన, లోహంబులున్, పద్మరాగ...రత్నంబులున్ - పద్మరాగ = పద్మరాగము, ప్రవాళ=పగడము, హరినీల = ఇంద్రనీలము, మౌక్తిక = మంచిముత్యము, మరకత = పచ్చ, ఆది = మొదలైన, రత్నంబులున్, తిల...ధాన్యంబులున్ - తిల = నూవులు, గోధూమ=గోధుమలు, యవ=యవలు, వ్రీహి = వడ్లు, మాష = మినుములు, ముద్గ = పెసలు, ఆది = మొదలైన, ధాన్యంబులున్, కనక...కరణంబులున్-కనక = బంగార ముచే, నిర్మిత = చేయఁబడిన, ఛత్ర=గొడుగులు, చామర = వింజామరలు, శయ్యా = పఱపులు మంచములు, వ్యంజన=విసనకఱ్ఱలు, పాదుకా=పావలు, ఆది=మొదలగు, ఉపకరణంబులున్ = సామగ్రులను, గజ...వాహనంబులు - గజ = ఏనుఁగులు, తురగ = గుఱ్ఱములు, స్యందన = రథములు, ఆది = మొదలైన, వాహనంబులు, మొదలుగాన్, కలుగు, దానద్రవ్యంబులను=దానోచితపదార్థములను, సమకూర్చ = సిద్ధము సేయునట్టి అధికారుల సంభ్రమాలాపంబులవలనన్ = అధికారులయొక్క త్వరతో నొప్పుమాటల వలనను, అపూర్వమహోత్సవసంతోషితస్వాంతు లగు = ఇదివఱి కెన్నఁడు నెఱుంగని మహోత్సవము చే నానందింపఁబడిన మదిగలవా రగు, దిగంతమహీకాంతుల పరస్పర నరససల్లాపంబులవలనన్ = దిగంతాధిపతులయొక్క యన్యోన్యసరసవాక్యములవలనను, వివిధదేశాగతంబు లగు రాజలోకశుద్ధాంతవర్గంబులకున్ = వివిధములైన దేశములనుండి

---

* ఝుల్లరీశంఖతుత్తుంభికాదివాదిత్ర; ఝుల్లరీశంఖదుందుభ్యాదివాదిత్ర.

వచ్చిన రాజభార్యల సమూహమునకు, ఎడగలుగక = అవకాశము గలుగునట్లు; దారి యగున ట్లనుట. జడియు = తొలఁగఁజేయు, వేత్రహస్తులతర్జనసూచ్ఛర్జనంబులవలనక = బెత్తములు చేతఁబట్టినవారియొక్క బెదరింపు టఱపులవలనను, సంయమీశ్వరతిలకం బుల వికస్వరస్వరంబులక = మునిశ్రేష్ఠులయొక్క రేఁగినధ్వనులచే, ఆమేడించు = ప్రతిధ్వనించునట్టి, వేదమంత్రపఠనంబులవలనక = వేదమంత్రపాఠములవలనను, వైభవా లోకనలంపటులై = ప్రతోత్సవముం జూడ నాసక్తులై, ఆకసంబునక = ఆకా శమున, గుంపులు కొని=గుమిగూఁడి, నిలింపులు=దేవతలు, అగ్గించు = కొనియాడునట్టి, సంస్తవరవంబులవలనక = నుతుల శబ్దములవలనను, పటహ...నాదంబులవలనక - పటహ=డప్పులు, భేరీ=డోలులు, ఝుల్లరీ = ఖంజరి, ఆది=మొదలగు, వాద్య = వాద్య ములయొక్క, నాదంబులవలనక = ధ్వనులవలనను, ఆసమయంబు, అభ్యర్ణ...ర్ణవం బునక -అభ్యర్ణ = సమీపమునసైన, పూర్ణచంద్రోదయ=పూర్ణచంద్రునియుదయముచే, ఘూర్ణమాన = సంక్షోభించు, అర్ణవంబునక = సముద్రమును, క్రేణిసేయుచుండెక = పరిహసించుచుండెను. అట్టియెడక = ఆసమయమున, తత్కలకలంబుక = ఆ కలకల ధ్వనిని, వినివారించి = వారించి, నారదుండు, సత్యభామకు, ఇట్లు = ఈరీతిగ, అనియెన్.

క. వికచాబ్జనేత్ర ! యీపు
ణ్యకవ్రతవిధానమునకు నాథుని ధారో
దకపూర్వ మీవలయు ని
య్యకొలుపుమా యిపుడు యాదవాన్వయతిలకున్. 76

టీ. వికచాబ్జనేత్ర=వికసించిన పద్మములం బోలు కన్నులు గలదాన, ఈపుణ్యక వ్రతవిధానమునకుక = ఈపుణ్యకవ్రతవిధికై, నాథునిక = భర్తను, ధారోదక పూర్వము = దానజలధారాపురస్సరముగ; ధారాపూర్వకముగ ననుట. ఈవలయక = ఒసఁగవలెను; ధారాదత్తము చేయవలె ననుట. ఇపుడు, యాదవాన్వయతిలకుక = యాదవవంశశ్రేష్ఠుని శ్రీకృష్ణుని, ఇయ్యకొలుపుమా = అంగీకరింపఁజేయుమా; సమ్మతిలఁ జేయు మని భావము.

సత్యభామ నారదునకుఁ గృష్ణుని దాన మిచ్చుట

చ. అనవుడు సత్యభామ హృదయంబున లజ్జయు సంభ్రమంబునుం
బెనఁగొనఁ బ్రాణవల్లభునిఁ బ్రేమరసాలసవీక్షణంబునం
గనుఁగొని మోము వాంచి మధుకైటభమర్దన ! చిత్తగించితే
మునిపతిమాట నావుడును మోవిపయిం జిఱునవ్వుఁగన్. 77

టీ. అనవుడుఁ = అనినపిదప, సత్యభామ, హృదయంబునఁ = మదియందు, లజ్జయుఁ = సిగ్గును; నేను నిన్ను ధారాదత్తము చేయుదు నని పతితోఁ జెప్పుటకుఁ జాలక సిగ్గునందుచున్న దనుట. సమ్మదంబునుఁ = సంతోషమును; సవతు లేరికిని లేని స్వామ్యము పతిపైఁ దనకుఁ గల్గెఁగదా యని సంతసమందె ననుట. పెనఁగొనఁ = ఒకటితోనొకటి చుట్టుకొనఁగా, ప్రాణవల్లభునిఁ = ప్రాణనాథుని, ప్రేమరసాలసవీక్షణంబునఁ = ప్రేమరసముచే మందమైన చూపుచే; అనఁగాఁ బ్రేమసూచకమగు మందమగు చూపుచే ననుట. కనుఁగొని = చూచి; ప్రేమయొక్కచూపును బ్రసరింపఁజేయుట పతిని లోఁకువగొనుటకని యెన్ననది. మోమువాంచి = మొగమువంచి; ఇది సిగ్గునకు సూచకము. మధుకైటభమర్దన = మధుకైటభశిక్షకా! శ్రీకృష్ణ! మునిపతిమాటఁ = మునీశ్వరునిపల్కును, చిత్తగించితే = అవధరించితివా; వింటివా యనుట. నావుడును = అనినపిదప, మోవిపయిఁ = పెదవిమీఁద, చిఱునవ్వు = చిన్ననవ్వు, ఇగుర్వఁగఁ = ఇగురొత్తఁగా; మొలకెత్తఁగా ననుట. తరువాతి పద్యముతో పన్వయము.

వ్యా-విశే. 'అనవుడుఁ, నావుడుఁ, అనుడును' ఇవి యనుధాత్వానంతర్యార్థకరూపములు.

మ. నవచంద్రాలిక! నీకు నేల యనుమానం బాగమోక్తంబు గా
న విచారింపక ధారవోయు ననిన న్లజ్జాభరాక్రాంత లై
సవతు ల్వాంచిరి వక్త్రపంకరుహాము ల్సంబంధిభూపాలక
ప్రవరు ల్నవ్విరి నర్మగర్భితవచఃప్రాగల్భ్య మేపారఁగన్. 78

టీ. నవచంద్రాలిక=విదియచందురుం బోలు నొసలు గలదాన, నీకుఁ, అనుమానంబు=సందేహము, ఏల = ఎందులకు? ఆగమోక్తంబు కానఁ = శాస్త్రోక్తముగావున, విచారింపక = ఆలోచింపక, ధారవోయుము = ధారాదత్తము చేయుము; ఈవ్రత విధికి శాస్త్రనియమ మట్లున్నదిగాన దీనికి సందేహ మెందుల కని నిపుణముగఁ బల్కఁ ననుట. నీవు న న్నూరకె ధారవోయఁ దలంప లేదు. నేను నీ కూరకె యట్టియధికార మీయ లేదు. మన మిర్వుర మాగమమునకు వశుల మని భావము. అనినఁ = అనఁగా, లజ్జాభరాక్రాంత లై = లజ్జాభారముచే నాక్రమింపఁబడినవా రై, సవతుల్, వక్త్రపంకరుహాముల్ = ముఖపద్మములను, వాంచిరి=వంచిరి; తమ కేరికి నొసంగనిస్వామ్యమును సత్య కొక్కఁ డె కిచ్చినందులకు సవతులు సిగ్గుపడి రనుట. మఱియు సత్య సిగ్గుమాలి యడుగుటకును, నాతఁ డందుల కియ్యకొనుటకును సిగ్గునంది రనియు గ్రహింప నగును. సంబంధి భూపాలకప్రవరుల్ = వియ్యంపువా రగు రాజులు; భీష్మకాదు

లనుట. నర్మగర్భితవచః ప్రాగల్భ్యము = పరిహాసములో నున్నమాటల ప్రౌఢత్వము. ఏపారఁగాఁ = అతిశయింపఁగా, నవ్వి. ఆఁడుదానిమాట మీఱఁజాలక శ్రీకృష్ణుఁడు తన్నాఁపె ధారవోయుట కంగీకరించినందులకు వారికి హాస ముప్పతిలె ననుట.

చ. మునిపతియానతిం జకితముగ్ధమృగీతరలాక్షి ప్రాణనా
థునిఁ గనకాంబరాంచలముతోఁ గుసుమాయుధవాగురానిబం
ధనమును బోనిక్రొవ్వీరులదండఁ దగులొక్కఁ జుట్టి వేడ్కఁ గ
ల్పనగముఁ గూడఁ గంకణరుణంరుణమంజులదోర్యుగంబునన్. 79

టీ. చకిత...తరలాక్షి-చకిత=భయపడిన, ముగ్ధ = సుందరమైన, మృగీ = ఆఁడు లేడియొక్క, తరల=చంచలములైన, అక్షి=కన్నులవంటి కన్నులు గలది; సత్య యనుట. మునిపతియానతిఁ=మునీశుఁ డగు నారదునాజ్ఞచే, కనకాంబరాంచలముతోఁ=స్వర్ణ వస్త్రాంచలముతోడఁ గూడ, ప్రాణనాథునిఁ = భర్తను, కుసుమాయుధవాగురానిబం ధనమును బోని=మన్మథునివలయొక్క కూర్పున బోలినట్టి, క్రొవ్వీరులదండఁ=క్రొత్త పూవులదండచే, కల్పనగముఁ కూడఁ = కల్పవృక్షములతోఁ గలియునట్లుగా, కంకణ రుణంరుణమంజులదోర్యుగంబునఁ = కంకణముల రుణంరుణ ధ్వనులచే నందమైన హస్తద్వంద్వముచే, తగులొక్కఁ = అంటునట్లుగా, చుట్టి ; కల్పవృక్ష ముతోఁ జేర్చి శ్రీకృష్ణుని పూలదండతోఁ గట్టె ననుట.

విశే. ప్రకృతము శ్రీకృష్ణుఁ డత్తరుణికి వశుఁడై యిట్లు ప్రవర్తించెను గాన నాతని బంధింప నేర్పడినమాలను మన్మథునివలఁగాఁ గవి చెప్పుట సరసము. పోని - వంటి - ఆట్టి ఇవి సమానార్థకములు.

తే. పరమమునిమానసాలానబంధనమునఁ
గుదురుపడ కుండ యాదవకుంజరంబు
వికచరాజీవనేత్రచే వేల్పుమ్రానఁ
గమ్మఁబూవులదండచేఁ గట్టువడియె. 80

టీ. పరమమునిమానసాలానబంధనమునఁ - పరమమునిమానస=ఉత్కృష్టులగు ఋషులయొక్క, ఆలాన = ఏనుఁగుగట్టు కొయ్యయొక్క, బంధనమునఁ=కట్టు నందు, కుదురుపడకుండు = ఉండనట్టి; నిలువనట్టి యనుట. యాదవకుంజరంబు = యదువంశోద్భవుఁ డగు శ్రీకృష్ణుఁ డను గజము. వికచరాజీవనేత్రచేఁ = వికసించిన పద్మములం బోలు కన్నులు గల సత్యచేత; ఆమెకన్నులవిలాసమునకు లోఁగె నని యభి

ప్రాయము. జేల్పుప్రూనక్ =కల్పవృక్షమందు, కమ్మఁ బూవులదండచేక్ = పరిమళించు పుష్పమాలచేత, కట్టువడియెక్ =బంధింపఁబడెను. నిశ్చల మానసు లగు బుుషులమదికిఁ గూడ నగోచరుఁ డగు భగవానుఁ డొకవనిత చేఁ బూలదండ యనుసాధనముచేఁ గల్ప వృక్షమునందు బద్ధుఁ డయ్యె నని భావము. అలం. అతిశయోక్తి. రూపకము. విరోధము.

వ్యా-విశే. కమ్మఁబూవులదండ, 'కమ్మని' అను విశేషణ నిగాగమమునకుఁ బిందువు కలెను.

చ. బలిదనుజేంద్రుఁ గట్టి తని పల్కఁగ విందుము గాని నేఁడు మా
చెలి యిదె పుష్పదామకముచే నినుఁ గట్టగఁ గంటి మింక నె
మ్మెలు పచరింప రా దనుచు మేలము లాడెడుసత్యబోట్ల స
న్నల నెసకొల్పుచుం గెలన నవ్వి ధర్మజభీమఫల్గునుల్. 81

టీ. బలిదనుజేంద్రుక్ = బలి యను రాక్షసచక్రవర్తిని, కట్టితి = బంధించితి, అని, పల్కఁగక్ = చెప్పఁగా; పురాణము లనుట. విందుము, కాని, నేఁడు మాచెలి = మావనిత; సత్య యనుట. ఇదె=ఇదిగో, పుష్పదామకముచేక్ = పూలదండచే, నినుక్, కట్టఁగక్, కంటిమి=చూచితిమి. ఇంకక్, ఎమ్మెలు=టక్కులు*, పచరింపరాదు = ప్రకటింపఁగూడదు; ఏవాఁడో బలిచక్రవర్తిని నీవు బంధించితి వని విందు మది కల్లయో నిజమో తెలియ రాదు, గాని నేఁడు మాసత్య నిను గల్పకమునఁ బూలదండచే బంధింపఁ గన్నారం గాంచితిమి, ఇఁక టక్కులు చేయకు మనుట. అనుచుక్, మేలములు = హాస్యపుమాటలు, ఆడెడు = పలుకనట్టి, సత్యబోట్లక్ = సత్యభామ చెలికత్తెలను, సన్నలక్ = సంజ్ఞలచే; నేత్రసంజ్ఞ లనుట. ఎసకొల్పుచుక్ = పురికొల్పుచు; ఇంకను బరిహసింపుఁ డని ప్రేరణసేయు చనుట. కెలనక్ = పార్శ్వమున, ధర్మజభీమఫల్గునుల్ = ధర్మరాజు భీముఁడు నర్జునుఁడును, నవ్వి; బొవలు గానఁ బరిహసించుటయుఁ బరిహసింపఁ బోట్లను బురికొల్పుటయు నుచితమే. సన్న. ప్ర. సంజ్ఞ.

మ. సమయజ్ఞుం డయి గర్గసంయమి మహాసంకల్పముం జెప్పఁ గ
ల్పమహీజంబు సదక్షిణాకము నిజప్రాణేశుఁ గూడ న్నుప
ర్వమునిశ్రేష్ఠున కిచ్చె దానముగ ధారాపూర్వ మవ్వేళఁ 'దు
భ్యమహాం సంప్రదదే నమో నమ' యటం చద్దేవి మోదంబునన్. 82

టీ. సమయజ్ఞుం డయి = సుముహూర్తకాలము నెఱింగినవాఁడై, గర్గసంయమి= గర్గుఁ డను ముని, మహాసంకల్పముక్ =వివాహాదులందును దానసమయమునను దేశకాలాదులను దురితాదులను నిర్వచించుచుఁ బురోహితుఁడు చెప్పెడు మహాసంకల్పమును

---

* ఈ యర్థమునకన్న 'గర్వోక్తి'యనుట సరసముగ నుండును.

చెప్పక్ =చెప్పఁగా, సదక్షిణాకము=దక్షిణతోఁ గూడినట్టి, కల్పమహీజంబుక్ = కల్ప వృక్షమును, నిజప్రాణేశుక్ కూడక్ =తనభర్తనుగూడ, లేదా, సదక్షిణాకము, కల్ప మహీజము, నిజప్రాణేశుక్ = తనభర్తను, కూడక్ = కూడినట్లుగా, కర్త మహీజము. అనఁగాఁ దనపతితోఁ గూడిన కల్పవృక్షమును దక్షిణతోఁ గూడ ననుట. సుపర్వమునిశ్రేష్ఠనకుక్ = సుర్షియగు నారదునకు, అవ్వేళక్ = ఆసమయమున, తుభ్యమ్ = నీకొఱకు, అహమ్= నేను, సంప్రదదే=ఇచ్చుచున్నాను. నమో నమఃనమస్కారము. అటంచుక్ =అట్లనుచు, అద్దేవి = ఆసత్య, మోదంబునక్ = సంతోషముతో, ధారా పూర్వము=జలధార మున్నుగాఁగ, దానముగక్, ఇచ్చెక్, ఇందుఁ బ్రతిగ్రహీతృ వాచకమునకు షష్ఠియు నవిరుద్ధంబు.

వ్యా-విశే. నారదుఁడు చెప్పినచొప్పునఁ బ్రాణనాథుఁడు దానముగా నీయఁ బడినవాఁడు, దానముపట్టిన బ్రాహ్మణుఁ డేదికోరిన నది యొసంగి మఱలఁ బ్రాణేశుఁడు పొందఁదగినవాఁడు కాన, నీమఱలఁ బుచ్చుకొనునట్టి దానమున "తుభ్యమహం సంప్రదదే న మమ" అను సామాన్యమంత్రములోని "న మమ=నాది కాదు" అను, స్వత్వపరిహారకవాక్యము త్యాజ్య మైయుండుటంజేసి విడువఁబడినది. "నమో నమ యటం" చనుచో విసర్గంబున కనుకరణంబున లోపము గల్గి యడాగమము సిద్ధించెను.

ఆ. ధారవోసి మఱియుఁ దద్వ్రతాంగంబుగా
దాన మిచ్చె నపుడు తలిరుఁబోఁడి
మణిసువర్ణ ధాన్యమయపర్వతంబులు
గోసహస్ర వాజికుంజరములు. 83

టీ. ధారవోసి=ధారాదత్తముచేసి, మఱియుక్, తద్వ్రతాంగంబుగాక్ = ఆ వ్రతమున కంగమగునట్లుగా, తలిరుఁబోఁడి=చిగురువలె నొప్పిదమైన యాసత్య, మణి సువర్ణ ధాన్యమయపర్వతంబులు = మణులయు, సువర్ణంబులయు, ధాన్యములయు రాసుల ననుట. గోసహస్రవాజికుంజరములు = వేలకొలది యావులను గుఱ్ఱములను నేనుఁగులను, దానము, ఇచ్చెక్.

వ్యా-విశే. తలిరు + మేను, బహువ్రీహిని స్త్రీవాచ్యం బగుచో నుపమానంబు మీఁది మేనునకుఁ బోఁడి యని సూరి. చిగురు + పోఁడి. ఉదంతముపై నుగాగమము. వ్రతకార్యము చిగురుఁబోఁడి. రూ. అ. తలిరుంబోఁడి. చిగురుఁబోఁడి. మొ. ఇట్టిచో. అలరుఁబోఁడీత్యాదు లుపమానపూర్వపదకర్మధారయంబు లని ప్రౌఢ. పోఁడి=పోఁడిమి - ఈపఱుమున మేనునకుఁ బోఁడి రాలేదు. కల దని యర్థము.

క. ఇవ్విధమున దానము గొని
చివ్వలయోగిరపుఁదపసి చెట్టును గూడం
బువ్వులసరులం జుట్టిన
యవ్విభునిచెఱంగు విడిచి యల్లన నగుచున్. 84

టీ. ఇవ్విధమునన్ = ఈరీతిగ, దానమున్, కొని = పుచ్చుకొని, చివ్వలయోగి రపుఁ దపసి=కలహభోజనుఁ డగు ముని; నారదుఁ డనుట. చెట్టును, కూడన్ = అంటు నట్లుగా, పువ్వులసరులన్ = పూలదండలచే, చుట్టిన, అవ్విభుని చెఱంగున్ = ఆ శ్రీకృష్ణుని కట్టుబట్టకొంగును, విడిచి=వదలించి; విప్పి యనుట. అల్లనన్ = మెల్లగ, నగుచున్ = నవ్వుచు; కలహము మొదలుపెట్టినవాఁడును బెంచినవాఁడును నేఁడు గన్నారఁ దప్పలమున్ గాంచినవాఁడును బొందినవాఁడును నాతఁడే యగుట నిచ్చో నీ పదము సాభిప్రాయ మగుచున్నది. తరువాతిపద్యముతో నన్వయము.

క. సత్యముగ నిన్ను నిప్పుడు
సత్యాసతి మాకు నిచ్చె సకలామ్నాయ
స్తుత్య! యిఁక మా యభీప్సిత
కృత్యంబులు సలుపు మనుచుఁ గేళిపరుం డై. 85

టీ. సత్యముగన్ = నిజముగ, నిన్నున్, ఇప్పుడు, సత్యాసతి = సత్యభామ, మాకున్, ఇచ్చెన్. మాశబ్ద మిచట శ్రీకృష్ణునిపైఁ దనకుఁ గల యధికస్వామ్యము సూచించునది. సకలామ్నాయస్తుత్య = సర్వవేదములచే నుతింపఁదగినవాఁడా! మా యభీప్సితకృత్యంబులు = మా కిష్టము లగుపనులను. సలుపుము = చేయుము. అనుచున్, కేళిపరుండై=వేడుకయుం దాసక్తుఁ డై; తరువాతిపద్యముతో నన్వయము.

విశే. ఇదివఱకు నీవు మాకు వశుఁడవు గావు. నేఁ డన్ననో నిక్కము సత్య మాకు దానముచేయుటకతన మాస్వత్వ మైతివి. ఇంక మాకాంక్షితముల మోక్షాదుల నొసఁగు మని నారదుఁ డావేదవేద్యుఁ బ్రార్థించె ననియు ధ్వనిత మగు. మాకున్ + ఇచ్చెన్-ఇచ్చోఁ బ్రతిగ్రహీతృవాచకమునకుఁ దెనుఁగున షష్ఠియు నగుట నవిరుద్ధము.

నారదుఁడు కృష్ణునిచేఁ బసులుగొనుట

సీ. మేళవించినవి సుమ్మీ దీనిమెట్లని
మాంసలాంసంబున మహాతిఁ జేర్చి
మిన్నేటిజలము సుమ్మీ తొలంకెడు నని
డాచేత మణికమండలు వొసంగి

యిది జపోచితము సుమ్మా జతనం బని
వలచేతఁ బద్మాక్షవలయ మిచ్చి
యీశానుఁ డిచ్చెఁ జుమ్మా మాకు నిది యని
శార్దూలచర్మంబుఁ జంకఁ జొనిపి
తే. పొమ్ము షణ్ముని యొకకొంత పోవఁబోవ
రమ్ము రమ్మని మరలఁ జేకంగఁ బిలిచి
కపటనటనాపరుం డైనకంసవైరిఁ
బరమమునినవ్వుటాలకుఁ బనులుగొనియె. 80

టీ. దీనిమెట్లు, మేళవించినవిసుమ్మా=స్వరానుకూలముగఁ గూర్చినవిసుమా అని, మాంసలాంసంబునన్ = బలిసిన భుజముమీఁద; శ్రీకృష్ణునిభుజముపై ననుట. మహతిన్ = మహతి యను వీణెను, చేర్చి, నారదునివీణకు మహతి యని పేరు. "విశ్వావసోస్తు బృహతీ తుంబరోస్తు కళావతీ, మహతీ నారదస్య" అని యమరము. స్వరానుకూలముగ మెట్ల నమర్చితి. అవి స్థానముం దప్పనుజుమా జాగ్రత్త యని చెప్పె ననుట. వీణమూఁపుపై నుంపఁదగినది గాన నండే యుంచె నని గ్రహించునది. మిన్నేటిజలము సుమా=మందాకినీజలముసుమా, తొలఁకెడున్ = తొణఁకును, అని, డాచేతన్ = ఎడమచేతియందు, మణికమండలువు=మణివికారమైన కమండలువును, ఒసంగి=ఇచ్చి; ఇందాకాశగంగాజల మున్నది. తొణఁకునుజుమా జాగ్రత్తగాఁ బట్టుకొమ్మని మణికమండలువును శ్రీకృష్ణునిచేతియం దుంచె ననుట, ఎడమచేత జలపూరణ మగుచెంబును ధరించుటయు, నాచమన మొనర్చినపుడు కుడిచేత నెడమచేతితో నీటిని వంచుకొనుటయు నహజ మగుట నం దుంచె. మఱియు మిన్నేటిజల మనుట యిది జాఱిన మఱిల సులభముగా దని తెల్పుట కని గ్రహించునది. ఇది, జపోచితముసుమ్మా = జపమునకుఁ దగినది సుమా! జతనంబు=జాగ్రత్త, అని, వలచేతన్ =కుడిచేతియందు, పద్మాక్షవలయము =తామరపూసలదండను, ఇచ్చి; ఈమాలజపమున కెంతయు నుపకరించునది జాగ్రత్త సుమా యని కుడిచేత పద్మాక్షవలయము నిడె ననుట. జపకాలమునఁ బవిత్రమైన కుడిచేత నక్షవలయముం దాల్చుట సహజము గాన దీనిం గుడిచేతఁ బెట్టె నని యెన్నునది. ఈశానుఁడు=ఈశ్వరుఁడు, ఇచ్చెఁజుమ్మా, మాకున్ ; తన కనుట. ఇది, అని, శార్దూలచర్మంబున్ =పులితోలును, చంకన్ =కక్షమునందు, చొనిపి=పెట్టి; ఈశ్వరుఁ డిది యెసంగె జాగ్రత్త యనుచుఁ జంకను బులితోలు చొప్పించె ననుట.దర్భాసనము నాయాస్థలములకుఁ బోవునపుడు చంక నిడికొనుట సహజ మగుట నద్దానిం జంకఁ జొనిపె నని యెన్నునది.

---

* సండిఁ జొనిపి.

పొమ్ము, పొమ్ము, అని, ఒకకొంత=కొంచెముదూరము, పోవక పోవక=పోఁగా పోఁగా, రమ్ము రమ్ము, అని; రారా పోపో యని యనుట. మరలక, చేరంగక=దగ్గఱగా, పిలిచి' కపటనటనాపరుఁ డైన=కృత్రిమపువర్తనముఁ దాసక్తుఁ డైన, కంసవైరిక=శ్రీకృష్ణుని. పరమమునిన=నారదుఁడు, నవ్వుటాలకుక=పరిహాసమునకై, పనులు కొనియెొక = సేవ సేయించుకొనియెను. రారా పోపో యనువాక్య మెంతయు హాస్యరసాత్మకము.

విశే. అతఁడు చెప్పిన-చొప్పున రమ్మన వచ్చుటయుఁ, బొమ్మనఁ బోవుటయుఁ, గపటనటనకు సూచకములు. దేవదేవుని యాయా యవయవములకుఁ దనవస్తువులను నారదుఁడు సోఁకించుటకు నిక్కముగ నాలోచింప నాదేవుని పవిత్రావయవస్పర్శమున నావస్తువులు పవిత్రము లగు ననియు, నాపవిత్రవస్తుస్పర్శమునఁ దాసుగూడఁ బవిత్రుఁడ నగుదు ననియు నారదుఁడు భావించుటయే కారణ మని యెన్నఁదగును.

మ. నిగమాంతప్రతిపాద్య నాద్య నభవు న్నిత్యు న్గుణాతీతు వి
శ్వగురుక జిన్మయు నవ్యయుం బరము నిశ్శంకం బనుల్గొంచు మా
నిగరిష్ఠుండు కృతార్థుఁ డయ్యె ననఁ జండేహింపఁగా నేల భ
క్తగణాధీనుఁ డనంగ నవ్విభుఁడు లోకఖ్యాతిఁ బెంపొందఁడే. 87

టీ. నిగమాంత ప్రతిపాద్యక = ఉపనిషత్తులచేఁ జెప్పఁబడువానిని, అనఁగా నుపనిషద్వేద్యుఁ డనుట; వేదవేద్యుఁ డని భావము. ఆద్యక = అన్నింటికి మొదలైన వానిని, అభవుక =పుట్టుక లేనివానిని, నిత్యుక =శాశ్వతుని, గుణాతీతుక = సత్త్వరజ స్తమోగుణముల నతిక్రమించినవానిని; నిర్గుణు ననుట. విశ్వగురుక = జగద్గురుని, చిన్మయుక =జ్ఞానరూపుని, అవ్యయుక =నాశరహితుని, పరముక = సర్వోత్తముని; పరాత్పరు ననుట. నిశ్శంకక = సందియము లేక, పనుల్గొంచుక = పనులను బుచ్చు కొనుచు; సేవ సేయించికొను చనుట. మానిగరిష్ఠుఁడు=మానులలో మిగుల గొప్పవాఁడు నారదుఁడు. కృతార్థుఁడు=ధన్యుఁడు, అయ్యెక; ఏమానులును భగవానునిచేఁ బనులు గొనఁజాలమియుఁ, బా నట్టిభాగ్యమును బడయఁటయు నారదునికృతార్థతకుఁ గత ములు. అనక = అనఁగా, సందేహింపఁగాక, ఏల = ఎందులకు?, అవ్విభుఁడు = ఆ శ్రీకృష్ణుఁడు, భక్తగణాధీనుఁడు=భక్తులసమూహమునకు వశమైనవాఁడు, అనంగక = అనునట్లుగా నాతఁడు భక్తవశుఁ డను నానుడి గలవాఁ డగుట నిపుడు భక్తాగ్రేసరుఁ డగు నారదునకు వశుఁ డై మెలంగుట చిత్రము గా దని భావము. ఇతరముల మాని సర్వదా భగవానుని ధ్యానించువాఁడే భక్తుఁడు.

చ. అపుడు విరించిసూనుఁడు జనార్దనునెయ్యపువాలుఁగంటిఁ జూ
చి పడఁతి! నీమనోహరునిఁ జేకొను [1]మిచ్చెద నంచుఁ బల్కఁచో
నపరిమితప్రమోదభరితానన య్యై వెస నిచ్చె వేలుపుం
దపసికి నాత్మభూషణవితానము లన్నియు నిష్క్రయంబుగన్. 88

టీ. అపుడు, విరించిసూనుఁడు = బ్రహ్మపుత్రుఁడగు నారదుఁడు, జనార్దను నెయ్యపువాలుఁగంటిన్ = శ్రీకృష్ణుని ప్రియపత్నిని; సత్య ననుట. (వాలుఁగంటిన్ విశాలములైన కన్నులు గలదానిని) చూచి, పడఁతి=తరుణీ!, నీమనోహరునిన్ = నీ మదిని హరించినవానిని; నీప్రియు ననుట. చేకొనుము=స్వీకరింపుము, ఇచ్చెదను, అంచున్, పల్కఁచోన్ =పల్కినపుడు; పల్కఁగా ననుట, అపరిమిత ప్రమోదభరితానన య్యై = అధికసంతోషముచేఁ బూర్ణమైన మొగము గలదై, వెసన్ = శీఘ్రముగ, వేలుపుందప సికిన్ =సురమునికి నారదునకు, ఆత్మభూషణవితానములు అన్నియున్ =తన యలంకార ములనెల్లను; నగల ననుట. నిష్క్రయంబుగన్ = మూల్యముగా (క్రయముగా) మార్పుగా ననుట. ఇచ్చెన్,తననగల వినిమయముగ నొసంగి నారదునుండి తనప్రియుఁని గ్రహించె నని భావము.

విశే. నీ మనోహరుఁ డగుట నీ వాతనిఁ బాసియుండఁజాల వనియు, జనార్దను నెయ్యపు వాల్గంటి వనుట నాతఁడును ని న్నెడఁబాసి యుండలేఁ డనియు, దాని మీ యిర్వురం గూర్చుటయే నాయాశయ మనియు నారదుఁడు నేర్పుగఁ బల్కె నని యెన్నునది.

క. ఇచ్చి కయికొనియెఁ గ్రమ్మఱి
నచ్చెరుంబోఁడి విభుని నావైభవమున్
మెచ్చి కురియించి రపుడు వి
యచ్చరు లచ్చెరువుగాఁగ నలరులవానల్. 89

టీ. ఇచ్చి, క్రమ్మఱిన్ = మఱల, అచ్చెరుంబోఁడి = ఆపల్లవాంగి; సత్య, విభునిన్ =నాథుని, కైకొనియెన్ = స్వీకరించెను, వియచ్చరులు = సురలు, ఆవైభ వమున్, మెచ్చి, అచ్చెరువు కాఁగన్ = ఆశ్చర్యముగా, అలరులవానల్ = పుష్పవర్ష ములు, కురియించిరి. దివినుండి పూలవానలు గురిసె నని భావము.

చ. తనుతరమధ్య యాగవిధానము తప్పక యుండ మౌనిచే
ననుమతిఁ గాంచి మ్రొక్కి వినయంబున నందఱి నామతించి క
ల్పనగము క్రొవ్విరు ల్కనక [2]పాత్రమునం దగ నించి యిచ్చె వా
యనములు రుక్మిణీప్రభృతు [3]లైనసతుల్పదియాఱువేలకున్. 90

---

1. మిప్పుడ నీకు నిత్తునా; మిప్పుడ నీకు విల్తునా. 2. పాత్రములం. 3. లైనసతుల్.

టీ. తనుతరమధ్య = మిక్కిలిసన్నమైన నడుము గలది సత్యభామ; ఆగమవిధానము=శాస్త్రవిధి, తప్పకయుండక=తప్పకుండుటకై, మానిచేక=నారదునిచే, అనుమతిక=అంగీకారమును, కాంచి=పొంది; "శాస్త్రవిధానము తప్పలేదు. నీవు నీపతినిట్లు పొందుట. మ్రొక్కిక్, వినయంబునక = అడఁకువతో, అందఱిక, ఆమతించి = పిలిచి, కల్పనగము క్రొవ్విరుల్=కల్పవృక్షపుఁగ్రొత్తపూవులను; అపుడే కోసిన వనుట. కనకపాత్రమునక=బంగరుపళ్లెరమున, నించి=నింపి, రుక్మిణీప్రభృతు లౌసవతు ల్పది యాఱువేలకుక = రుక్మిణిమొదలగు పదాఱువేలసవతులకును, వాయనములు, బహుమానము లనుట. ఇచ్చెక.

వ్యా-విశే. "ఒక్కపూ వామాని యీయ రుక్మిణి యపురూపముగఁ దనమాళిందాల్చె. ఇదిగో నే నిపుడు మీ కెల్లరకు వలయునన్ని యిచ్చుచున్నదానను" అని సత్య తనవైభవమును గర్వమును సవతులకుఁ బ్రకటించె నని యెన్ననది.....'సవతుల్ పదియాఱువేలకుక'-ఇచ్చోఁ విశేషణ మగు సవతు లనుదానికిఁ బ్రథమ. "విశేషణంబు ద్వితీయాదులకును బ్రథమ యగు" నను ప్రౌఢవ్యా. కారక. 22-వ సూత్రముచే సాధువగును. "అహీనబలసారథులు మధుకైటభాదిదైత్యసతులకు; తన్నిద్రాపదితోడక" అని కవీశుల ప్రయోగములు.

క. ఈచందమున నమానుష
గోచరమహిమాఢ్యుఁ డైనగోవిందుని స
త్యాచంద్రముఖీవరు సుర
వాచంయమివరుఁడు చతురవాచాప్రౌఢిన్. 91

టీ. ఈచందమునక = ఈవిధముగ, అమానుషగోచరమహిమాఢ్యుఁ డైన = మనుష్యులకుఁ దెలిసికొనరాని మహిమతోఁ గూడిన, గోవిందునిక=శ్రీకృష్ణుని, సత్యాచంద్రముఖీవరుక = సత్యభామ యను చంద్రవదనకుభర్త యైననానిని, సురవాచంయమివరుఁడు = సురమునిశ్రేష్ఠుఁడు నారదుఁడు, చతురవాచాప్రౌఢిక = నిపుణములగుమాటల ప్రౌఢత్వముచే; 100-వ పద్యమందలి 'కొనియాడి యరిగె' అనుదానితో నన్వయము.

విశే. పారిజాతప్రబంధకథ కేవలము సత్యకు శ్రీకృష్ణుఁడు స్వాధీనుఁడై యుండుటనే సూచించున దగుట సత్యాచంద్రముఖీవరపదముచే శ్రీకృష్ణునివిషయమునఁ బ్రకృతమునకుఁ దగినరీతినిఁ గవి వాడుట సరసము.

నారదుఁడు కృష్ణుని స్తుతించుట

అసులోమవిలోమకందము.—

క. నాయశరగసారవిజయ
తాయనజయసార సుభగ ధరధీనియమా
మాయనిధీ రధగభసుర
సాయజనయతాయకవిర సాగరశయనా! 92

టీ. నాయ.....జయసార-నాయ=నీతిని, శర=బాణములను, గ = పొందిన, సార = బలమును, వి = పక్షియొక్క; గరుడునియొక్క యనుట. రయ = వేగమును, తాయన = విస్తరింపఁజేయునట్టి, జయసార=విజయసారముగలవాఁడ! నీతిబాణబల గరుడవేగజాత్రమైనసారవిజయము తన్ను సాధించిన నీతిబాణబల గరుడవేగముల సెంతయుఁ బెంపొందించె ననుట. అనఁగా విజయసంభవమువలనఁ దత్సాధనసామగ్రి కెంతయుఁ బొంగు సిద్ధించె నని భావము. సుభగ=సుందరుఁడా! ధర.....నియమా-ధర=కొండనుబోలు, ధీ=బుద్ధియొక్క, నియమా=కట్టుఁబాటు గలవాఁడ; అచలమైన బుద్ధినియమనముగలవాఁడనుట. మా.....నిధీ-మా=లక్ష్మికిని, అయ = శుభావహావిధికిని, నిధీ=గనియైనవాఁడా! స్థానభూతుఁడనుట. లక్ష్మీవాసుండును గల్యాణరూపుండు నని భావము. రథ.....సుర - రథ=శరీరమును, గ=పొందిన, భ = చంద్రుఁడును, సుర=దివిజులును గలవాఁడ; సర్వదేవాత్మకుఁడనుట. సాయజ.....రవిర - సాయ = బాణములచే, జ=పుట్టిన, నయ=నీతియొక్క, తాయ = విస్తృతిచే, రవి = జీవులను, ర=ఆకర్షించువాఁడ. దుర్జనుల నమ్ముల శిక్షించి ధర్మవు నెలకొల్పి ప్రజలమెప్పు గన్న వాఁడనుట. లేదా, సాయజనయ=బాణములవలన నైన నీతి గలవాఁడ, దుష్టశిక్షణమున ధర్మమును బాదుకొల్పినవాఁడా యనుట. తాయరవిర = విస్తృతిచే సూర్యునాకర్షించినవాఁడా! వామనావతారమున మిన్నంటురూపముఁ దాల్చినవాఁడు గాన నిది యొసఁగును. సాగరశయనా=సముద్రము శయ్యగాఁ గలవాఁడ.

విశే. సుభగవీర్యభగినీభగపత్యాదిశబ్దములవ్యుత్పత్త్యర్థము నరసిన నవి గ్రామ్యములుగఁ దోఁపకపోవు. కాని వీనివ్యుత్పత్త్యర్థమును గవిలోకము విచారింపక సుందరార్థములఁ బ్రయోగించుటఁజేసి వీని కట్టిగ్రామ్యత తొలఁగెను.

అర్ధభ్రమక మనఁగాఁ బద్యమును దుదినుండి మొదలువఱకు వ్యత్యాసముగాఁ జదివినను నదేప్రకార మేర్పడునట్లు చెప్పుట. ప్రకృత మీకందమును దుది నుండి త్రిప్పి చదివినను మొదటినుండి చదివినట్లే చదువఁబడుచు గాన నిది యర్ధభ్రమక మనఁబరఁగుచున్నది. మఱియు నిందుఁ దొలియర్థమును త్రిప్పి చదివినచో

నుత్తరార్ధమును, నుత్తరార్ధమును ద్రిప్పి చదివినచో బూర్వార్ధమును నేర్పడును గాన సంగోరునకే యనఁగా నర్ధభాగమునకే భ్రమణము గలదుగాన నిది యర్ధభ్రమక మను సార్థకనామము నందినది.

### పాదభ్రమకము

క. ధీర శయనీయవరధీ, మారవిభానుమతమమత మనుభావిరమా
సారసవననవసరసా, దారదసమతార*తార తామసవరదా! 93

టీ. ధీర=ధైర్యవంతుఁడా! శయనీయశరధీ = శయనార్హమైన సముద్రముగల వాఁడా! జలనిధిశయనుఁ డనుట. మార.....మమత - మార = మన్మథునియొక్క, విభా=కాంతికి, అనుమత=సమ్మతమైన, మమత = దేహాభిమానముగలవాఁడా! మదన సమతేజుఁ డనుట. మనుభావిరమా=మననముచేఁ గలుగు సంపదగలవాఁడా; సార... ...సరసా - సార=శ్రేష్ఠములైన, సవన=యజ్ఞములందు, నవసరసా = నూతనసరసుఁడైన వాఁడా! యజ్ఞహవిర్భోక్త యనుట. దారదసమతారతార=పాదరసమునకు సమానమైన ముక్తాహారములు గలవాఁడా! తామసదరదా = దుర్జనులకు భయము నిచ్చువాఁడా! దుష్టశిక్షకుఁ డనుట.


విశే. ఇది పాదభ్రమకము. ఇందుఁగల నాలుగుపాదములలోఁ బ్రతిపాదమును వ్యత్యాసముగా ననఁగాఁ దుదినుండి మొదలునకుఁ జదివినచో నదేపాద మేర్పడును గాన, దీనిని బాదభ్రమక మందురు. ప్రతిపద్యపాదమును ద్రిప్పిచదివినను యథాపూర్వముగ ననఁగా మొదటినుండి చదువునపు డేర్పడురీతి నేర్పడుచో నట్టి రచన పాదభ్రమకము నాఁబడును. ఇట్టి శబ్దచిత్రములగు రచనలు నిక్కముగ రస ప్రతిబంధకము లగుటంజేసి, దండ్యాద్యాలంకారికులు 'తత్తు నైకాంతమధురమతఃపశ్చాద్వివక్ష్యతే' అని యమకప్రస్తావనయందుఁ జెప్పిరి. కాని యిట్టివానిని గవులనేకులు తమకబ్బములందుఁ జొనిపియున్నారు. ఆక్రమమునుబట్టి యాలోచింపనేకదేశస్థితము లగుటంబట్టి యిట్టిరచనలు కావ్యజీవిత రసప్రతిబంధకములు గాఁజాలవని తలంచి రని తోఁచెడిని. పైనిర్వాసినప్రకారము 'తత్తు నైకాంతమధురమ్' అని వీనినిగూర్చి యనిష్టము నగపఱిచిన దండ్యాచార్యుఁడే పలురకములగు నమలోమప్రతిలోమాది యమకభేదములను, నేకాక్షరద్వ్యక్షరాదిరచనావిశేషములను నిరూపించుటంబట్టి చూడఁగా నిట్టిరచనలును గొంతవఱకు హృదయంగమము లై యుండునని యే యప్పటి కవిపండితలోకపుతలఁ పని చెప్పవలసియున్నది. అయినను నీరచనలు సామాన్యముగఁ గావ్యగడువులే యని చెప్పుటకు సందియము లేదు.

---

* హార.

## గోమూత్రికాబంధము

క. విదళితదైత్య రమాగృహ,పదసారసవినతదేవ పతగేశహాయా
చిదమిత చైత్యశమావహ,మదవారణ విమతభావమతపాశజయా!




టీ. విదళితదైత్య=నఱుకఁబడిన రాక్షసులుగలవాఁడ, రమాగృహ=లక్ష్మికి స్థానమైనవాఁడ, పద.....దేవ-పదసారస = పాదపద్మములంను, వినత=నతులైన, దేవ = దేవతలుగలవాఁడ, పతగేశహాయా = పక్షీంద్రుఁడగు గరుడుఁడు వాహనముగాఁగల వాఁడ, చిదమిత=జ్ఞానముచే నధికుఁడా ! చైత్యశమావహ=దీక్షలకు శాంతిని గూర్చు వాఁడ, మదవారణ = మత్తును దొలఁగించువాఁడ, విమత.....జయా-విమతభావ = విరుద్ధభావములను; అనఁగాఁ గామక్రోధాదుల ననుట. విమతమత = విరుద్ధమతములను; నాస్తికాదిమతముల ననుట. విమతపాశ = విరుద్ధములగు బంధములను; అనఁగా భయ సంశయాదుల ననుట. జయా = జయించినవాఁడ.


విశే. పైని నిరూపించినప్రకారము దీనియుద్ధారమును లిఖించి, పద్యపాదములు నాల్గింటిలోను మొదటి రెండుపాదములయందలి యక్షరములను, మొట్టమొదటి చాలుగా మొదటియక్షరమును, బిదప నొకయక్షరమును వదలి తరువాతియక్షరము నిట్లే నొక్కొక్కపర్ణమును నడుమనడుమ వదలి వ్రాసి, బంధమునడుమ నావదలిన యక్షరములను రెండవచాలుగా లిఖించి, మూఁడునాలుగుపాదములందలి యక్షరములలోఁ బూర్వమువలెనే మొదటియక్షరము మొదలుకొని యొక్కొక్కటి నడుమ విడుచుచు మూఁడవపంక్తిని క్రిందుగా వ్రాసి మొట్టమొదటియర్థము మూఁడినుండి క్రిందిగాను, రెండవయర్థమును గ్రిందినుండి మూఁడుగాను జదువవలెను. ఇదియె గోమూత్రికా బంధోద్ధారపఠనక్రమము.

శ్లో. "వర్ణానామేకరూపత్వం యద్యేకాంతరమర్థయోఃి;
గోమూత్రికేతి తం ప్రాహుర్దుష్కరం తద్విదో విదుఃి."

అని దండికావ్యాదర్శలక్షణము.

## ఆగ్నేయబంధము

చ. జలదవితాననీల ఖలసాలకులక్షితివారణేశ ని
శ్చలమునివారపాల సురచారణయక్షనవానుకూల కుం
డలివరహారలోల నరనారదతత్పర భూవిధేయ యు
జ్వలమనునీతిశీలితవశంవద శక్రరమానికేతనా ! 95




టీ. జలదవితాననీల = మేఘబృందమువలె నల్లనైనవాఁడా ; ఖలసాల..... వారణేశ-ఖల=దుష్టులనెడు, సాలకుల=వృక్షసమూహమునియొక్క, క్షితి=నాశవిషయమున, వారణేశ=గజేంద్రముం బోలువాఁడా!, "ఖల=దుష్టులగు, సాలకుల = మద్దిచెట్లగుమిని, క్షితి = నశింపఁజేయుటయందు" అనియుఁ జెప్పనొప్పును. నిశ్చలమునివారపాల = నిశ్చలులైన మునిసమూహముల రక్షించువాఁడా ! సురచారణయక్షనవానుకూల=సురలు, యక్షులు, చారణులు అను వీరికి నూత్నమైనయనుకూలుఁడా; అనఁగా

వీరలకు హితుఁడనుట, కుండలివరహారలోల = సర్పహారుఁడగు శివునియం దాసక్తుఁడా! నరనారదతత్పర=నరుఁడు నారదుఁడను బుషులం దాసక్తి గలవాఁడా! భూవిధేయ= భూదేవికి విధేయుఁడవైనవాఁడా; శ్రీవిష్ణువునకు భూదేవి భార్య యగుట ప్రసిద్ధము. ఊజ్వల.....వశంవద-ఊజ్వల = ప్రకాశించునట్టి, మనునీతి = మనుధర్మశాస్త్రము నందలి ధర్మములందు, శీలిత=స్వభావముగలవానికి, వశంవద=స్వాధీనుఁడా; అనఁగా మనువుచే జెప్పఁబడిన ధర్మముల ననుసరించి మెలఁగువారియందుఁ బ్రసన్నుఁడై వర్తిలు ననుట. శక్రమానికేతనా = ఇంద్రలక్ష్మికి స్థానమైనవాఁడా; అనఁగా స్వారాజ్యమున కుపద్రవము గల్గునపుడెల్లను దాని నేకో యొక యుపాయమున విష్ణువు వారించి తిరుగ సురపతికి దాని నిచ్చువాఁ డౌట విష్ణువు శక్రమానికేతనుఁ డయ్యె నని యెన్నునది.

విశే. అప్పకవి చెప్పిన నాగబంధోద్ధారము.

క. "ఇలతో నెనుబదినాలుగు, నిలయంబులు నగు పయోధినిభసీలాంగా
మెలిగొన్న పామువలె వెలు, పలగుర్ దలతోఁక నాగబంధంబునకున్."

## ఛురికాబంధము

క. శ్రీవర వరవరహృతభవ,భావన వనజాయతాక్ష పాలితవిబుధా
ధావితదనుభవ నియమిస,భావనచతురా సముద్ధృతార్ణవవసుధా!




టీ. శ్రీవర=లక్ష్మికి పతియైనవాఁడా! వరవర.....భావన-వర = సారములైన, వర=వరములచేత, హృత=హరింపఁబడిన, భవభావన = సంసారచింతలు గలవాఁడ, వనజాయతాక్ష = పద్మములవలె దీర్ఘము లగు కన్నులు గలవాఁడ, పాలితవిబుధా = రక్షింపఁబడిన దేవతలు గలవాఁడ, ధావితదనుభవ = పరుగెత్తింపఁబడిన రాక్షసులు గలవాఁడ, నియమి.....చతురా - నియమి = మునులయొక్క, సభా = సమూహమును, అవన = రక్షించుటయందు, చతురా = నేర్పుగలవాఁడా! సముద్ధృతార్ణవ


వసుధా = ఎత్తఁబడిన సముద్రమందలి భూమికలవాఁడ. ఇచట వరాహావతారకథ ననుసంధింపవలెను.

విశే. అప్పకవి చెప్పిన చురికాబంధోద్ధారము.

క. "చరణాంత్యవర్ణ మొక్కటి, చరణయుగాద్యమ్ము జేసి సరసులు మున్నా
రియుగడలమధ్య మొకటిగఁ, బరుఁజులఁ గదియింప ఖడ్గబంధం బొనరున్."

## చక్రబంధము

శా. చిత్రాకృత్యభినందితవ్రజమృగాక్షీమధ్యగా యక్షరా
మిత్రోష్ణద్యుతిదిగ్ధచక్ర జనివల్లీకర్షణా కృష్ణభా
సత్రారాధ్య నుతింతు నిన్ను జగదీశా విక్రమాతిస్థిరా
రాత్రీ *నాంచితభామితాబ్జ సదయా రాధానుభావాకరా! 97



* శాచిరభామితా.

టీ. చిత్రా.....ప్రజమృగాక్షీమధ్యగా - చిత్రాకృతి=చిత్రమైన యాకార
ములచేత, అభినందిత = సంతోషపెట్టఁబడిన, ప్రజమృగాక్షీ = గొల్లకొమ్మలయొక్క,
మధ్యగా=నడుమును బొందినవాఁడా;అనఁగా నేవనిత యేరూపముం గోరు నారూపముం
భజించి వారి నానందింపఁజేయుచు నావనితలం గూడియున్నవాఁడా యనుట. లేదా,
"చిత్రాకృతి = చిత్రమైన యాకారముగల రాసక్రీడచే, అభినందిత = సంతోష
పెట్టఁబడిన, ప్రజమృగాక్షీ = గొల్లచేడెలయొక్క, మధ్యగా=నడుమ నున్నవాఁడా"
అనియుఁ జెప్పనగును. అక్షరా=నాశశూన్యుఁడా! మిత్రోష్ణ.....చక్ర-మిత్ర =
సూర్యునియొక్క, ఉష్ణద్యుతి = తీక్ష్ణకాంతులచే, దిగ్ధ=పూయఁబడిన, చక్ర = చక్రా
యుధముగలవాఁడ, జని.....ర్క్షపా-జని = పుట్టుక యనెడు, వల్మీక = పుట్టకు,
ఋక్షపా = భల్లూకపతియైనవాఁడ; భల్లూకము పుట్టను బురుగులకై త్రవ్వివేయుట
నైజము. కృష్ణభా = నల్లనికాంతి గలవాఁడ, సత్రారాధ్య = యాగములందుఁ బూ
జ్యుఁడా! జగదీశా = లోకనాయకా! విక్రమాతిస్థిరా = పరాక్రమముచే ధీరుఁ
డా; రాత్రీన.....తాబ్జ - రాత్రి+ఇన=రాత్రీన = రేరాజైనచంద్రునియొక్క,
అంచిత=ఒప్పుచున్న, భా=కాంతులతో, మిత=తులితమగు, అబ్జ=శంఖముగలవాఁడ,
సదయా = దయతోఁగూడినవాఁడ, రాధా...కరా - రాధా = రాధాదేవియొక్క,
అనుభావ = కటాక్షాదులకు, ఆకరా = స్థానమైనవాఁడా!

విశే. చక్రబంధోద్ధారము.

మ. "పయిఁబైఁగాఁ బదిచుట్లు నాఱుదళముల్ ప్రాగ్రేఖలం దీర్చి స్వా
హ్వాయపత్యాహ్వాయముఖ్యచిహ్నములు గన్పట్టంగఁ బాదత్రయా
శ్రయరేఖాంత్యపదాశ్రయాదివృతిగా శార్దూలవిక్రీడితా
హ్వాయవృత్తంబు యథాక్రమంబుగ లిఖింపం జక్రబంధం బగున్.

ఇందు మూఁడవచుట్టునఁ "గృష్ణరాయకృతి" యనియు, నాఱవచుట్టున
"నందితిమ్మకవి" యనియుఁ గృతిపతిపేరును గవిపేరును బొందుపఱుపఁబడిసవి.

## ద్వ్యక్షరికందము

క. మనమున ననుమానము నూ
నను నీనామ *మనుమనుమననమును నేమ
మ్మున మాన నన్ను మన్నన
మను మను నానామునీనమానానూనా! 98

---

* మును మను; మాన మను.

టీ. నానా.....నూనా-నానా=వివిధులైన, మునీన = మునిశ్రేష్ఠులయొక్క, మాన=ప్రమాణమునకు, అనూనా=అధికుఁడా; బుషుల నెల్లరను మించిన మహిమ గల వాఁడనుట: మనమునక్ =మదియందు, అనుమానమున్ = సందియమును, ఊహను = పొందను; ఇంక సందియ మంద ననుట. నీనామము=నీ పేరు, అను = అనునట్టి, మను మననమును=మంత్రజపమును, నేమమ్మునక్ = నియమముతో, మానక్ = విడువను, నన్నక్, మన్ననక్ =సమ్మానముతోడ, మనుము=బ్రదుకుము, అను = అనుము. నను గారవనున వగ్గిల్లు మని యాశీర్వదింపు మని భావము.

విశే. ఈపద్యము నమలతోడనే నడుపఁబడినది గాన నిది వ్యతిరికంద మయ్యెను. అనుమానపదమునకు సంస్కృతమున నూహయే యర్థముగాని సందియ మను నర్థము లేదు, కాని యాంధ్రకవీశులు దీనిని బలుచోటుల సందియ మను నర్థముననే వాడియున్నారు. "అనుమానము లేక తిరిగె నతఁ డెల్లెడలన్" అని తిక్కన. ఊహ యనునది నిశ్చయార్థ మగోచరమగునపుడే కల్గునది కాన దీని కీయర్థము నాంధ్రకవులు కల్పించియుండు రని తోఁచెడిని.

## ద్వికంద క్రౌంచపదము

క. అంకురిత శ్రీ *సంగభు,జాంకా హరిహయమణిమదహారతనువర్ణా
సంకటకృద్దైత్యాశయ,శంకాజననిజచరిత శయధృతశంఖా! 99

క. పంకజనాభా భంజిత,పంకా పరమపురుష భవపరిభవనాశా
శంకరభావా కిసలయ,సంకాశపదయుగ కలశశరనిధిశయనా! 100

టీ. అంకురిత.....భుజాంకా-అంకురిత = మొలచిన, శ్రీసంగ = లక్ష్మీదేవి సంబంధమువలని, భుజాంకా = భుజచిహ్నము గలవాఁడా; లక్ష్మి యాశ్లేషించియున్న కతన భుజమునఁ గిణాదిరూప మగు చిహ్న మేర్పడె ననుట. హరి.....వర్ణా - హరి హయమణి=ఇంద్రనీలమాణిక్యములయొక్క, మద=గర్వమును, హర=పోఁగొట్టునట్టి, తనువర్ణా=శరీరకాంతిగలవాఁడా; నీలవర్ణుఁ డనుట. సంకట.....చరిత-సంకటకృత్ = కష్టమును గలిగించు, దైత్యాశయ=రాక్షసుల యాలోచనలకు, శంకా=సందేహమును, జనన=పుట్టించునట్టి, నిజచరిత = స్వీయచరిత్రము గలవాఁడా; రాక్షసుల కష్టకార్యము లకు నాశకుఁడా యనుట. శయధృతశంఖా = హస్తమున ధరింపఁబడిన శంఖము గల వాఁడా, పంకజనాభా=పద్మము బొడ్డునఁ గలవాఁడా! భంజితపంకా = నశింపఁజేయఁ

* రంగభు.

బడిన పాపము గలవాఁడా! పరమపురుష = పురుషోత్తముఁడా, భవనపరిభవనామా = సంసారము నవమానించు పేరుగలవాఁడా; తన్నామస్మరణమున సంసారదుఃఖము నశించు ననుట, శంకరభావా = శివుఁడు మదియందుఁ గలవాఁడా, శంకరరూపుఁడనియుఁ జెప్పనగును. కిసలయసంకాశపదయుగ = చిగురులతోఁ దుల్యమైన పాదద్వంద్వముగలవాఁడా, కలశశరనిధిశయనా=పాలసముద్రమున శయనించునాఁడా!

విశే. ఇది క్రౌంచపదవృత్తము. క్రౌంచపదమునకుఁ బ్రతిపాదమున భ, మ, స, భ, స, న, న, య గణము లుండును. పదునొకండవయక్షరమును పందొమ్మిదవ యక్షరమును యతిస్థానములు. ఇందు రెండు కందపద్యములు గలవు. ప్రథమార్ధము నొక కందముగను, (అనఁగా మొదటి రెండుపాదము లనుట) నుత్తరార్ధము నొక కందముగను (అనఁగాఁ దృతీయ చతుర్థపాదముల ననుట) జదువఁదగును. ఒకానొకపద్యమున నిట్లు వేఱొకపద్యమునుగాని పద్యములనుగాని యిముడ్చురచనను గర్భకవిత్వ మందురు. ఆశు, బంధ, గర్భ, చిత్రము లని కవిత్వములు నాలుగువిధములు. పూర్వోక్తములైన గోమూత్రికాదులు బంధకవిత్వము నాఁబడు. ఇదియు దీనితరువాతిదియు గర్భకవిత్వము నాఁజను. 98 'మనమున ననుమానము మానను' అనునది చిత్రకవిత నాఁబరఁగును. తక్కుంగల ప్రబంధములోని పద్యముల రచన యాశుకవిత యనఁదగును.

### భుజంగప్రయాతగర్భస్రగ్వణి.

వాసుదేవా ఘనస్వచ్ఛకాంతీ రమా
వాస వంశస్వరవ్యక్తవేదక్రమా
రాసలాస్యప్రకారప్రవీణోద్యమా
వాసవాదిస్తుతవ్యక్తనామా నమః. 101

టీ. వాసుదేనా = వసుదేవపుత్రుఁడా! ఘనస్వచ్ఛకాంతీ = మేఘమువఁటి స్వచ్ఛమైన తేజస్సుగలవాఁడా! రమావాస = లక్ష్మీదేవికి నివాసస్థానమైనవాఁడా! వంశ.....క్రమా-వంశ=పిల్లనగ్రోవియొక్క, స్వర = ధ్వనిచేత, లేక స్వరవిశేషములచేత, వ్యక్త=తెలియఁజేయఁబడిన, వేదక్రమా = వేదపాఠక్రమము గలవాఁడా, శ్రీకృష్ణపరమాత్మునిపిల్లనగ్రోవినుండి పుట్టిననాదములు వేదపాఠక్రమమునుం బోలి యున్న వనుట. రాస.....ద్యమా-రాసలాస్య = రాసక్రీడ యను నాట్యవిశేషము యొక్క, ప్రకార = రీతియందు, ప్రవీణ = కుశలమైన, ఉద్యమా = యత్నముగలవాఁడా; రాసక్రీడయందు మిగుల నైపుణి గలవాఁ డనుట. వాసవాది.....

నామా-వాసవాది=దేవేంద్రుఁడు మొదలగువారిచే, స్తుత = నుతింపఁబడిన, వ్యక్త = విశదమైన, నామా=పేరుగలవాఁడా ! నమః = నమస్కారము.

విశే. స్రగ్విణికిఁ బ్రతిపాదమున నాలుగు రగణము లుండును. సప్తమాక్షరము యతిస్థానము. భుజంగప్రయాతమునకుఁ బ్రతిపాదమున నాలుగు యగణము లుండును. సప్తమాక్షరము యతిస్థానము. ఇందుఁ దుదిఁగల 'నమః' అనుపదమును మొదటఁ జేర్చి చదివినచో భుజంగప్రయాత మేర్పడును. ఇందుఁ బ్రబంధాంత మగుచున్నది కానఁ గవియు నీమూలమున భగవానున కంజలి ఘటించె నని గ్రహింప వలెను.

క. అని చిత్రగతుల నవ్విభుఁ
గొనియాడి మునీంద్రుఁ డరిగెఁ గోపవధూటీ
జనతావల్లభుఁడును మి
త్రనికాయముతోడ నిజపురంబున కరిగెన్. 102

టీ. అని, చిత్రగతులన్ = చిత్రములగురీతులతో; చిత్రములగు కవిత్వపురీతు లతో ననియు నర్థాంతరము. అవ్విభున్ = ఆశ్రీకృష్ణుని, కొనియాడి=నుతించి, మునీం ద్రుఁడు=మునిశ్రేష్ఠుఁడు నారదుఁడు, అరిగెన్ = వెడలెను. గోపవధూటీజనతావల్లభుఁ డును = గోపికాసమూహమునకుఁ బ్రియుఁడైన శ్రీకృష్ణుఁడును, మిత్రనికాయము తోడన్ = మిత్రులసమూహముతోడ, నిజపురంబునకున్ = తనపట్టణమునకు; ద్వారక కనుట. అరిగెన్.

చ. నిజపురి కేఁగుదెంచి ధరణీధరుఁ డప్పుడు భోజరాజధ
ర్మ్మజకురునాథముఖ్యమహిమండలనాథులఁ దక్కుఁగల్గు బ
ంధుజనులఁ గల్పకద్రుమజనూతనదివ్యభూషణాంబర
వ్రజము లొసంగి వీడ్కొని నిరంతరసౌఖ్యరసైకలోలుఁ డై. 103

టీ. నిజపురికిన్ = తనపట్టణమునకుఁ వీఁగుదెంచి=వచ్చి, ధరణీధరుఁడు = శ్రీ కృష్ణుఁడు, అప్పుడు, భోజరాజధర్మ్మజకురునాథముఖ్యమహిమండలనాథులన్ = భోజ రాజు, ధర్మ్మరాజు, కౌరవరాజు, (దుర్యోధనుఁ డనుట.) మొదలగురాజులను, తక్కుఁగల్గుబంధుజనులన్ = తక్కిన బంధువులను, కల్పకద్రుమజనూతన దివ్యభూష ణాంబరవ్రజములు=కల్పవృక్షమునుండి పుట్టిన యపూర్వములైన దివ్యములైన యలం

కారములయు బట్టలయు సమూహాములను, ఒసంగి = ఇచ్చి, వీడొక్కని = సెలవిచ్చి పంపి, నిరంతర సౌఖ్యరసైకలోలుఁడై = అత్యధికమగు సుఖము ననుభవించుటయందే ముఖ్యముగ నాసక్తుఁడై; తరువాతి పద్యముతో నన్వయము.

క. తలిరులతుదఁ జినుకులు జల
జల వడియఁగఁ బడిసి మెలఁగుచలికరువలి ను
న్నొలపమున విరియుపరువపుఁ
దొలుమొగడలవలపు దెలుపుతోఁటలలోనన్. 104

టీ. తలిరులతుదన్ = చిగుళ్లకొసలనుండి, చినుకులు=నీటిబొట్టులు, జలజలన్ = జలజల మనునట్లుగా, వడియఁగన్ =రాలఁగా, బడిసి, మెలఁగు=సంచరించునట్టి, చలికరువలి ననొలపమునన్ =చల్లగాలియొక్క మృదుప్రసారము చే, విరియు=వికసించిన, పరువపుఁ దొలుమొగడలవలపు = వికసించిన తొలుఁదొల్త తొడిగిన మొగ్గలయొక్క పరిమళమును; తెలుపు = ప్రకటించు, తోఁటలలోనన్ =ఉద్యానములలో; 107-న పద్యమునందలి 'ఓలలాడుచుండెన్' అనుక్రియతో నన్వయము.

భా. చెట్టులచిగుళుల తుదినుండి నీటిచుక్కలు రాలుచుండె ననియు, వాని తాఁకున బడిసినగాలి యయ్యుద్యానములందలి తొలుఁదొల్తతొడిగిన పరిపక్వముకుళముల పరిమళమును బ్రకటించుచు వీచుచుండె ననియు భావము. చినుకులచే బడిసిన దనుటంజేసి చల్లందనము, ననొలప మనుటంజేసి మాంద్యమును, బరిమళము ప్రకటించున దనుటంజేసి సౌరభ్యమును సూచితములు. ముఖ్యముగ నీకవీశు నచ్చతెమఁగురచన కిది ముఖ్యోదాహరణము గానోపును. అలంతిజిలిబిలిపల్కులతోడ ముద్దుగ వాయు విందు వర్ణితము. అలం. వృత్త్యనుప్రాసము.

క. దరదళదంబుజముకుళో,దరదళమిళదళికులచ్ఛదప్రహృతిసర
త్సరసరజోధూసరపరి, సరసరసీతీరకుంజసదనస్థలులన్. 105

టీ. దరదళ.....స్థలులన్ -దర = ఇంచుక, దళత్ = వికసించిన, అంబుజ ముకుళ=తామరమొగ్గలయొక్క, ఉదర=నడుమనఁ గల, దళ=రేకులందు, మిళత్ = కూడియున్న, అళికుల = తుమ్మెదగుంపుయొక్క, ఛద = ఱెక్కల సంబంధమైన, ప్రహతి = దెబ్బచే, సరత్ = జాఱుచున్న, సరస = మరందముతోఁగూడిన, రజ =పరాగముచేత, ధూసర = బూడిదరంగైన, పరిసర = చుట్టుప్రక్కల నున్న, సరసీ తీర = సరస్సుగట్టునందలి, కుంజ సదన = పొదరిండ్లయొక్క; స్థలులన్ = ప్రదే

శములందు 107-ప పద్యమునందలి 'ఓలలాడుచుండెఁ' అను క్రియతో నన్వయము.

విశే. ముఖ్యముగ నీకవీశుని మృదుసంస్కృతపదరచన కిది యుదాహరణమగును. అలం. వృత్త్యనుప్రాసము యమకము.

క. మరకతగోమేదకపు,ష్యరాగవిద్రుమవిదూరసంభవముక్తా
హరినీలవజ్రకురువిం,దరత్నమయకృతకభూమిధరకందరలన్. 106

టీ. మరకత.....కందరలన్ -మరకతము, గోమేదకము, పుష్యరాగము, పగడము, వైడూర్యము, మంచిముత్యము, ఇంద్రనీలము, వజ్రము, కెంపు అను, రత్నమయ = నవరత్నమయ మైన, కృతకభూమిధర = కల్పితములైన కొండలయొక్క, (అనఁగాఁ క్రీడాపర్వతము లనుట.) కందరలన్ = గుహలందు. 107-వ పద్యము నందలి 'ఓలలాడుచుండె' నను క్రియతో నన్వయము.

విశే. ఇందు నవరత్నములుం బేర్కొనఁబడినవి.

సీ. భోజకన్యాసరిద్రాజహంసము సత్య
భామాశుకీకేళిపంజరంబు
జాంబవతీనిశాచంద్రోదయంబు కా
లిందీసరోజినీందిందిరంబు
భద్రాకలాపినీప్రావృడంబుదము సు
దంతారసాలలతాపికంబు
మిత్రవిందావనీచైత్రాగమము లక్ష్మ
ణాహారయష్టికానాయకంబు
తే. షోడశసహస్రకామినీస్తోమధేను
కారిరంసామదోత్కటవారణేంద్ర
మనఁగ సౌఖ్యంబునిగ్గి నోలలాడుచుండెఁ
గృష్ణుఁడఖిలావనైకవర్ష్ణుఁడగుచు. 107

టీ. భోజకన్యా.....హంసము - భోజకన్యా = రుక్మిణి యనెడు, సరిత్ = నదికి, రాజహంసము = రాయంచయైనవాఁడును; నది కధీనమై రాయంచ వర్తిలుగతిని

శ్రీకృష్ణుఁడు రుక్మిణీప్రియుఁడై వర్తిల్లె నని భావము. ఇందు భార్యలను గవి క్రమ
మును దప్పక మనోహరముగఁ బేరొక్కనెను. సత్య.....పంజరంబు - సత్యభామా=
సత్యభామ యనెడు, శుకీ=ఆఁడు చిలుకకు, కేళిపంజరంబు = విలాసపంజరమైనవాఁడును;
చిలుక కట్టుబాటులేని విలాసపంజరమున విహరించుగతిని సత్య శ్రీకృష్ణునిం గూడి
విహరించుచుండె ననుట. జాంబవతీనిశాచంద్రోదయంబును - జాంబవతీ = జాంబవతి
యనెడు, నిశా = రాత్రికి, చంద్రోదయంబును = చంద్రోదయమైనవాఁడును;
చంద్రోదయమున రేయి శోభిల్లి యెప్పునట్లు శ్రీకృష్ణునికూడికను జాంబవతి యత్యంత
ముప్పొంగుచుండె ననుట. కాళిందీ.....దిందిరంబు-కాళిందీ=కాళింది యనెడు, సరో
జినీ=పద్మలతకు, ఇందిందిరంబు = తుమ్మెదయైనవాఁడును; తుమ్మెద తమ్మిపరిమళమునకుఁ
జొక్కి పద్మలతను బాయకుండుగతిని శ్రీకృష్ణుఁడు కాళిందిని బాయక యుండె
ననుట. భద్రా.....బుదము - భద్రా = భద్ర యనెడు, కలాపినీ = ఆఁడునెమిలికి,
ప్రావృడంబుదము = వార్షికమేఘమైనవాఁడును; ఆఁడునెమిలి వర్షాకాలమేఘముం
గాంచి యానందపరవశ యైనగతిని భద్ర శ్రీకృష్ణసందర్శనమున నధికసంతోషము
నందె ననుట. సుదంతా.....పికంబు-సుదంతా = సుదంత యనెడు, రసాలలతా =
మామిడిగున్నకు, పికంబు=కోయిలయైనవాఁడును; పికము రసాలమును వీడనియ ట్లామెం
గూడి శ్రీకృష్ణుఁ డుండె ననుట. పికము మామిడిచివురు మెసవునదిగాన నాచెట్టు నం
విడువకుండుట సహజము; మిత్రవిందావనీచైత్రాగమము - మిత్రవిందా = మిత్రవింద
యనెడు, వనీ=అరణ్యభూమికి, చైత్ర = వసంతర్తువుయొక్క, ఆగమము = రాకయైన
వాఁడును; వసంతర్తువు చేరికను నరణ్యభూము లపూర్వమగునందము వహించుగతిని
శ్రీకృష్ణునికూడికను మిత్రవింద యధికానందము నందె ననుట. లక్షణా.....నాయ
కంబు-లక్షణా = లక్షణ యనెడు, హారయష్టికా = యష్టికవంటి హారమునకు, నాయ
కంబు=నాయకమణియైనవాఁడును; నాయకమణిచే హార మధికశోభ కలది యగుగతిని
శ్రీకృష్ణునికూడికను లక్షణ ముదమందె ననుట. నాయక మనఁగా హారమధ్యగమణి. పై
సీసపాదములందు నాల్గింటను శ్రీకృష్ణు నష్టమహిషులు సక్రమముగ నిరూపితలైరి.
మీఁది గీతపాదమునఁ దక్కిన పదాఱువేలగోపికలను శ్రీకృష్ణుఁడు సంతోషపెట్టుట
సూచింపఁబడెను. షోడశ.....వారణేంద్రము - షోడశసహస్ర = పదాఱువేలమంది
యైన, కామినీస్తోమ = వలపుఁగత్తెలసమూహ మనెడు, ధేనుకా = ఆఁడేనుఁగులతో,
రిరంసా=రమించు కోర్కెగల, మదోత్కటము=మదముచే నధికమైన, వారణేంద్రము =
గజశ్రేష్ఠమైనవాఁడును; వారణేంద్రము కరిణీబృందముతో రమించుగతిని శ్రీ
కృష్ణుఁడు పదాఱువేల కామినులం గూడి విహరించుచుండె ననుట. అనఁగ = అను
నట్లు, కృష్ణుఁడు, అఖిల.....వర్తిష్ణుఁడు - అఖిల=సమస్తమును, అవన = రక్షించుట

యందు, ఏక=ముఖ్యముగ, వర్తిష్ణుఁడు=ప్రవర్తించు స్వభావముగలవాఁడు, అగుచున్, సౌఖ్యాంబునిధిన్ = సుఖసముద్రమున, ఓలలాడుచుండెన్ = ఈఁదులాడుచుండెను. సంపూర్ణానందము నందుచుండె ననుట.

విశే. ఇందు 'హరి శ్రీకృష్ణ' అను మున్నగుపదములతో శ్రీకృష్ణుని బోధింపక సామాన్యముగ 'కృష్ణుఁడు' అని యనుటంబట్టి కృతిపతి యగు కృష్ణరాయలను గవి ధ్వనితుం జేయ యత్నించె నని తోఁచెడిని. దానఁ బూర్వదిగ్విజయ మాచరించి యేతెంచి భార్యలతోడ సుఖించు కృష్ణరాయలవ్యాపారము నిందు ధ్వనిత మొనర్చె ననియు నూహ పొడమెడు. ఇందులకు నిఖిలావనైకవర్తిష్ణుఁ డనుపదమును సాహాయ్యము గాఁ గలదు! మఱియు శ్రీకృష్ణుఁడు పూర్వదిక్పతియైన యింద్రునిం జయించుట కృష్ణరాయలు పూర్వదిక్పతియైన రాజును జయించుటకు సూచక మగు ననియు భావము పొడమెడు. శ్రీకృష్ణుఁడు తనతలపైఁ దన్నినదాన నభిమతార్థప్రదానమున గౌరవించుట కృష్ణరాయలు ప్రణయాపరాధము గావించిన తిరుమలదేవిని గౌరవించుటకు సూచక మని తోఁచెడి. ఇ ట్టీకథ యెంతయుఁ గృతపతిచరిత్రసూచకమై మనోజ్ఞమగుగతిని గవి కూర్చెనేమో యని సందియము జనించెడిని. రిరంసా - ఇది సన్నంతము-రంతుమిచ్ఛా రిరంసా; వర్తిష్ణుః = ఇష్ణుచ్ ప్రత్యయాంతరూపము. ఇట్లే 'వర్ధిష్ణుః' అను మున్నగునవి.

సీ. కౌశికగోత్రవిఖ్యాతుఁ డాపస్తంభ
సూత్రుఁ డార్వేలపవిత్రకులుఁడు
నందిసింగామాత్యనకును దిమ్మాంబకుఁ
దనయుండు సకలవిద్యావివేక
చతురుఁడు మలయమారుతకవీంద్రునకు మే
నల్లుండు కృష్ణరాయక్షితీశ
కరుణాసమాలబ్ధఘనచతురంతయా
నమ్రహగ్రహారసన్మానయుతుఁడు

తే. తిమ్మయార్యుండు శివపరాధీనమతి య
ఘోరశివగురుశిష్యుండు పారిజాత
హరణ మనుకావ్య మొనరించె నంధ్రభాష
నాదివాకరతారాసుధాకరముగ. 103

టీ. కౌశికగోత్రవిఖ్యాతుఁడు, ఆపస్తంబసూత్రుఁడు; కౌశికగోత్రము నాపస్తంబసూత్రము ననుట. ఆశ్వేలపవిత్రకులుఁడు; ఆశ్వేలనియోగిపవిత్రవంశజుఁడనుట. నందిసింగామాత్యునకును, తిమ్మాంబకున్, తనయుండు; తండ్రి సింగన, తల్లి తిమ్మాంబ, ఇంటి పేరు నంది యనుట. సకల.....చతురుఁడు - సకల = సమస్తమైన, విద్యా = విద్యలయొక్క, వివేక = జ్ఞానమునందు, చతురుఁడు = కుశలుఁడైనవాఁడు, మలయమారుతకవీంద్రునకున్ = మలయమారుతబిరుద మందిన ఘంటసింగయకు, మేనల్లుఁడు=తోఁబుట్టువుకొడుకు, కృష్ణరాయ.....యుతుఁడు - కృష్ణరాయ = కృష్ణరాయలనెడు, క్షితీశ = రాజుయొక్క, కరుణా=దయచే, సమాలబ్ధ = పొందఁబడిన, ఘన = గొప్పవియైన, చతురంతయాన = పల్లకీలు, అగ్రహార = జీవనమునకై యిచ్చిన గ్రామములు, (ఈరూపమైన) సన్మాన = బహుమానములతో, యుతుఁడు = కూడినవాఁడు; అగ్రహార మనఁగా బ్రాహ్మణులకు జీవనమునకై రాజు లిచ్చినగ్రామములు (అగ్ర = బ్రాహ్మణులు, హార = ఆహారము). అగ్రశబ్దము బ్రాహ్మణులు వర్ణములలో మొదటివారుగాన వారిని బోధించును. తిమ్మయార్యుండు = (అయ, అన, అన్న ఇవి యన్నియుఁ బూజ్యార్థకములే గానఁ దిమ్మన తిమ్మన్న యనికూడ ననఁదగును.) తిమ్మయయనుపూజ్యుఁడు, శివపరాధీనమతి=శివునియందు వశమైన బుద్ధిగలవాఁడు; అనఁగా శివభక్తుఁడనుట. అఘోరశివగురుశిష్యుండు = అఘోరశివుఁడను గురువునకు శిష్యుఁడైనవాఁడు, ఆదివాకరతారాసుధాకరమునగ్ = సూర్యుఁడు నక్షత్రములు చంద్రుఁడు నున్నంతకాల ముండునట్లుగా, అంధ్రభాషన్ = తెలుఁగుభాసయందు, పారిజాతహరణము, అను=అనెడు, కావ్యము=ప్రబంధము, ఒనరించెన్ = రచించెను.

విశే. కవులు తమగ్రంథములలోఁ గాలము నేలాగో ప్రకటించు నలవాటు లేమి నీతఁడిన్ని చెప్పియుఁ బ్రబంధకాలమును దేటపఱుపఁ డయ్యెను.

శా. *ఏకచ్ఛత్రితసర్వభూతల! నృసింహేంద్రక్షమాభృత్తప
పాకద్యోతితరూప! మాస్త్రికతులాభారప్రదానోన్నతా!
కోకస్తన్యసమాస్రసన్నిభ! హరిత్కాలంకషోదగ్యశ
శ్శ్రీకర్ణాటమహీశ! వైరికరిరాట్సింహప్రతాపోదయా! 109

టీ. ఏకచ్ఛత్రితసర్వభూతల = ఏకచ్ఛత్రము గలదిగాఁ జేయఁబడిన సనుస్తమైన భూమిగలవాఁడ; తనయొక్కనియండనే యుండునట్లు భువి నొనర్చె ననుట. నృసింహేంద్ర.....రూప-నృసింహేంద్ర = నృసింహరాజను, క్షమాభృత్ = భూపతి

* ఏకచ్ఛత్రపదావనీతల!

యొక్క, తపఃపాక = తపస్సులపంటచే, ద్యోతిత = ప్రకాశితమైన, రూప = స్వరూపముగలవాఁడా; అనఁగా నరసరాజునోములపంట యనుట. మౌక్తిక.....సన్నిభ - మౌక్తిక = ముత్యములచేసైన, తులాభార = తులాభార మనుదానమును, ప్రదాన = ఇచ్చుటయందు, ఉన్నత=గొప్పవాఁడా!; త్రాసునఁ దా నొకప్రక్కఁ గూర్చుండి వేలొకప్రక్కఁ దనయెత్తునకు సరిగ రత్నాదులఁబోసి వానిని దానమిచ్చుట తులాభార మనంబడును. కోక స్తసే.....సన్నిభ-కోక స్తసీ = చక్రవాకములంబోలు స్తనములు గలస్త్రీలకు, అసమాస్త్ర=మన్మథునితో, సన్నిభ=సదృశమైనవాఁడా! హరిత్.....మహీశ - హరితూక్కలంకష=దిక్కులయొడ్డుల నొరయునట్టి; అనఁగా దిగంతముల వ్యాపించినట్టి యనుట. ఉద్యత్=అభివృద్ధినందు, యశః = కీర్తి గల, శ్రీకర్ణాట మహీశ = శ్రీకర్ణాటదేశాధిపతీ! వైరి.....దయా-వైరి=శత్రువు లనెడు, కరిరాట్=గజరాజములకు, సింహప్రతాప=సింహపరాక్రమముయొక్క, ఉదయా=ఉద్భవమైనవాఁడా; సింహపరాక్రమోదయముఁ గాంచి గజరాజములు భయపడున ట్లీతని ప్రతాపోదయముఁ గాంచి రాజు లెల్లరు భయపడుచుండి రనుట.

విశే. తులాభారపదముచే నీప్రబంధమందలి పుణ్యకప్రతకగ్రయు వైరికరిరాట్పనముచే నింద్రవిజయకగ్రయు సూచితములు.

క. భువనవిజయాఖ్యసంస,న్నవరత్నవిభా ప్రభాతనలినాప్త! రమా
ధవచరణకమలసేవా, ప్రవణమతీ! వీరరుద్రపర్వతవజ్రీ! 110

టీ. భువన.....నలినాప్త-భువనవిజయ=భువనవిజయ మనెడు, ఆఖ్య = పేరుగల, సంసత్=సభయందలి, నవరత్నవిభా = నవరత్నములకాంతులకు, ప్రభాతనలినాప్త = బాలసూర్యుఁడైనవాఁడా; సూర్యోదయమున సూర్యకిరణసంబంధమున మణులు దేదీప్యమానము లగుట సహజము. కృష్ణరాయలు బాలసూర్యునిపగిది నాకొలువుకూటమున వెలుంగ నమ్మణుల కపూర్వశోభ కల్గె నని భావము. రమా.....మతీ - రమా ధవ=శ్రీకృష్ణునియొక్క, చరణకమల = పాదపద్మములయొక్క, సేవా = సేవించుట యందు, ప్రవణ=ఆసక్తమైన, మతీ = బుద్ధిగలవాఁడా; శ్రీవిష్ణుభక్తాగ్రేసరుఁ డనుట. కవి తా శైవుఁ డైనను గృతిపతిప్రీతికై వైష్ణవకథాప్రధాన మగు నీకబ్బమును రచించె నని తెల్లమయ్యెడి. వీరరుద్రపర్వతవజ్రీ = వీరరుద్రగజపతి యనెడు పర్వతమునకు నింద్రుఁడ వైనవాఁడా! ఇం దింద్రపదమునుబట్టి యింద్రవిజయము సూచిత మనఁదగును.

విశే. కృష్ణరాయనికొలువున నష్టదిగ్గజము లుండి రని కొనబంతి. కాని నవరత్న శబ్దసారస్యము ననుసరించి నవరత్నము లుండిరే మో యని యనుమానను పొడమెడి. మంగళమహాశ్రీవృత్తము.—

చిత్తజభిదంఘ్రియుగచింతనకళాధిగతజిష్ణుసమవైభవవిశేషా!
విత్తరమణామరగవీతరణిభూజలదవిశ్రుతకరాంబురుహా! గోష్ఠీ
నృత్తమణిరంగతల! నీతిమనురాజనిభ! నిర్భరదయారసపయోధీ!
మత్తగజయూథమదమగ్నసుఖితాళిరవమాన్యగృహామంగళమహాశ్రీ.

టీ. చిత్తజ.....విశేషా-చిత్తజభిత్=శివునియొక్క, అంఘ్రియుగ = పాద ద్వయముయొక్క, చింతనకళా=ధ్యానవిద్యచేత, అధిగత=పొందఁబడిన, జిష్ణుసమ = ఇంద్రసదృశమైన, వైభవవిశేషా = విభవవిశేషములుగలవాఁడా; శివధ్యానమునఁ గృష్ణరాయలకు దేవేంద్రవైభవము కల్గె నని భావము. కవి శివభక్తుఁ డగుట నిట్లు చెప్పెను గాని కృష్ణరాయలు వైష్ణవమతావలంబి యగుట నిది పొసఁగదు. కాని శివమత మున రాయలకు ద్వేషము లేదనుట కిది సూచకముగా నగును. విత్తరమణ.....కరాం బురుహా-విత్తరమణ=ధనపతి కుబేరునివలెను, అమరగవీ = సురల నావగుకామధేనువు వలెను, తరణిభూ = సూర్యునికొడు కగుకర్ణునివలెను, జలద=మేఘునివలెను, విశ్రుత = ప్రసిద్ధమైన, కరాంబురుహ = హస్తపద్మము గలవాఁడా; అనఁగా వారివలె నడ్డులేక దానము చేయున దని భావము. గోష్ఠీ.....రంగతల-గోష్ఠీ=విద్వాంసులగోష్ఠి యనెడు, నృత్త=నాట్యమునకు, మణిరంగతల = మణినిర్మిత నాట్యభూమియైనవాఁడా! పండిత గోష్ఠుల కాస్పదమైనవాఁ డనుట. నీతిమనురాజనిభ = ధర్మములవిషయమున మనువు నకుఁ దుల్యమైనవాఁడా; మనువువలె సర్వధర్మపరిజ్ఞాత యనుట. నిర్భరదయారస పయోధీ = పూర్ణమైన కృపారసమునకు సముద్రమైనవాఁడా!; మిగుల దయగలవాఁ డనుట. మత్త.....మహాశ్రీ-మత్త = మదించిన, గజయూథ = గజసమూహ సంబంధమైన, మద = దానోదకమున, మగ్న=మునిఁగినట్టియు, సుఖిత = సుఖపడునట్టి, అళి=తుమ్మెదలయొక్క, రవ=ధ్వనులచే, మాన్య=పూజ్యమైన, గృహ = భవనసంబంధ మైన, మంగళ=శుభమైన, మహాశ్రీ = మహాసంపత్తుగలవాఁడా!; అనఁగాఁ గృష్ణ రాయనిభవనమున మదించినయేనుఁగులు గల వనియు, వాని మదజలమున మునిఁగి తుమ్మెదలు కలరవము లాచరించుచుండు ననియు, దాన నాతనిగృహము మంగళముల కాకరమై, మహాలక్ష్మితోడ విలసిల్లు ననియు భావము.

విశే. 'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే' అను భాష్యోక్తి ననుసరించి యిచ్చోఁ గవిపల్లవుఁడు తిమ్మయ మంగళమహాశ్రీ యను

పదము ప్రయోగించియు, శ్రీశబ్దము నంతమున ననుసంధించియు మంగళాంతముగ గావ్యమును బరిసమాప్తి నొందించుట యెంతయు సరసము. మఱియుఁ దదనుకూలముగ మంగళ మహాశ్రీవృత్తముఁగూర్చుట యెంతయుఁ మనోజ్ఞమగు. మఱియు 'మత్తగజ... మంగళ మహాశ్రీ' అను పదసారస్యము ననుసరించిన గజాంతైశ్వర్యసిద్ధిగా నాశీర్వదించినట్లును స్పష్టమగును. ఇంతియగాక కృతిపతి లబ్ధవిజయుఁడై శ్రీలకుఁ దావలమై వివిధసుఖము లనుభవించుచు వివిధదానములఁ జేయుచు సుఖముగ నానందాబ్ధి నోల లాడుచుండుటయు సూచితము. కావ్యాదిని శ్రీకారమును నంతమున శ్రీకారమును వెలయుటంజేసి, శ్రీకారకరండమున నీకథ యిమిడ్చినట్లు తెల్లమగును.

గద్యము. ఇది శ్రీమదుమామహేశ్వరవరప్రసాదలబ్ధ సారసార
స్వతాభినంది నందిసింగయామాత్యపుత్ర కౌశిక
గోత్రపవిత్ర సుజనవిధేయ తిమ్మయనామ
ధేయప్రణీతం బైనపారిజాతాపహరణం
బను మహాప్రబంధంబునందుఁ
సర్వంబునుం
బంచమాశ్వాసము.

పారిజాతాపహరణము సంపూర్ణము.

# పద్యముల అకారాద్యనుక్రమణిక


| పద్యములు | పుట. | ఆశ్వా. | పద్య. |
|---|---|---|---|
| అంకురిత శ్రీసంగ | 376 | 5 | 99 |
| అంగన కనుంగొను | 182 | 2 | 94 |
| అంగనుగంధముల్ | 299 | 4 | 83 |
| అంతకుమున్న | 191 | 3 | 3 |
| అంతట నొక్కనాఁడు | 33 | 1 | 43 |
| అంతటఁ బారిజాత | 83 | 1 | 110 |
| అంతలోనన | 60 | 1 | 78 |
| అంతిపురమున | 117 | 2 | 22 |
| అందఱలోన | 55 | 1 | 69 |
| అంబరచారి | 257 | 4 | 15 |
| అంబుధరజాల | 168 | 2 | 79 |
| అకట యడేమియో | 58 | 1 | 73 |
| అచ్చరపువ్వుఁబోండ్లు | 184 | 2 | 96 |
| అచ్చరలేమ | 322 | 5 | 20 |
| అటులైనను | 119 | 2 | 26 |
| అట్టియెడ | 355 | 5 | 75 |
| అట్టి సురతరువు | 283 | 3 | 57 |
| అడిగినంతలోన | 50 | 1 | 61 |
| అతనికి సత్యభామయు | 114 | 2 | 17 |
| అతులమహానుభావ | 65 | 1 | 84 |
| అతులితతావకీన | 343 | 5 | 55 |
| అత్తఱిం దత్తఱింబు | 289 | 4 | 67 |
| అదితి మొఱంగి | 120 | 2 | 28 |
| అదియును నామర | 226 | 3 | 41 |
| అనలుం డంజలి | 194 | 3 | 7 |
| అనలుఁడు రెండు | 323 | 5 | 22 |
| అన విని మానిసీ | 93 | 1 | 124 |
| అన విని వ్రేటు | 63 | 1 | 82 |
| అనవుడు సత్యభామ | 357 | 5 | 77 |
| అని కొనియాడి | 225 | 3 | 39 |
| అని కైనం బతి | 119 | 2 | 25 |
| అని చిత్రగతుల | 376 | 5 | 102 |
| అనినం గైటభ | 255 | 4 | 12 |

| పద్యములు | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| అని నాకపుర | 188 | 2 | 101 |
| అని పలికిన | 285 | 4 | 60 |
| అని పలికి శౌరి | 120 | 2 | 27 |
| అనిపలుకునంబుద | 100 | 1 | 137 |
| అని పోలోమి | 287 | 4 | 62 |
| అనిమిషపుర | 202 | 3 | 21 |
| అని యనుమానించుచు | 81 | 1 | 107 |
| అని యిట్లు | 41 | 1 | 52 |
| అని యివ్విధంబునం | 162 | 2 | 71 |
| అని వగల | 75 | 1 | 98 |
| అని వినయంబు | 121 | 2 | 29 |
| అని సత్యభామ | 58 | 1 | 74 |
| అనుచుం గాంతలు | 260 | 4 | 17 |
| అనుచుఁ నారదుఁ డాడిన | 55 | 1 | 68 |
| అనుచుఁ బ్రియాంస | 245 | 3 | 58 |
| అనుటయు నంత | 166 | 2 | 76 |
| అపు డాబద్ధ | 288 | 4 | 65 |
| అపుడు జగత్పతి | 264 | 4 | 24 |
| అపుడు రుక్మిణి | 37 | 1 | 46 |
| అపుడు విరించి | 365 | 5 | 88 |
| అప్పుడు తాంబూలంబులు | 90 | 2 | 21 |
| అప్పుడు శౌరిఁ | 196 | 3 | 11 |
| అభ్యుదయపరంపరా | 26 | 1 | 34 |
| అమరవిభుండుదూరమున | 192 | 3 | 4 |
| అమరవిభుండుసేరి | 226 | 3 | 40 |
| అమరహితంబు | 309 | 5 | 7 |
| అమరారాతి | 250 | 4 | 3 |
| అమరులబోనపుట్టిక | 131 | 2 | 41 |
| అమరు లమృతాంబు | 131 | 2 | 40 |
| అమృతం బొసవ | 136 | 2 | 47 |
| అమ్మా యే మని | 59 | 1 | 75 |
| అరదము నెక్కి | 79 | 1 | 104 |
| అరవిందానన | 210 | 3 | 35 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| అర్చిష్మత్ప్రతిమ | 246 | 3 | 59 |
| అర్వాగ్రోహము | 302 | 4 | 88 |
| అలకలు నాసికా | 273 | 4 | 38 |
| అలఁదినచందనంబు | 196 | 3 | 12 |
| అలనాఁటినన్ను | 325 | 5 | 27 |
| అలఫణిభోగ | 17 | పీ | 20 |
| అలరుంబోఁడుల | 52 | 1 | 64 |
| అలికులరావముల్ | 57 | 1 | 72 |
| అలికులవేణి | 199 | 3 | 17 |
| అలినీలాలక | 49 | 1 | 60 |
| అలుకం గంస | 326 | 5 | 28 |
| అలుకఁ బ్రలంబ | 212 | 3 | 36 |
| అలుఁగులదట్టమై | 324 | 5 | 25 |
| అవతంసిత | 271 | 4 | 36 |
| అవధరింపుము.....గగన | | | |
| గంగా | 191 | 3 | 2 |
| అవధరింపుము.....కైవ | | | |
| సైన్యంబు | 307 | 5 | 2 |
| అవధరింపుము.....పారి | | | |
| జాతంబు | 106 | 2 | 2 |
| అవధరింపుము.....వన | | | |
| విహారంబు | 249 | 4 | 2 |
| అవె దివ్యర్షి | 184 | 2 | 95 |
| అసురహరు | 350 | 5 | 66 |
| అసుహృదసు | 24 | పీ | 30 |
| ఆకమలాయతాక్షి | 308 | 5 | 4 |
| ఆకుసుమంబు | 61 | 1 | 79 |
| ఆతపగ్లాని | 264 | 4 | 23 |
| ఆదనుజాపహర్త | 193 | 3 | 6 |
| ఆదరమున | 203 | 3 | 23 |
| ఆననసీమ | 300 | 4 | 85 |
| ఆనరసమహీ | 12 | పీ | 14 |
| ఆనలినాయతాక్షు | 139 | 2 | 51 |
| ఆమహిజాతముం | 337 | 5 | 45 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| ఆమాటల్విని | 286 | 4 | 61 |
| ఆయతతేజముల్ | 121 | 2 | 30 |
| ఆయతభూర్జ | 180 | 2 | 90 |
| ఆయమృతాంశు | 8 | పీ | 7 |
| ఆయుధగర్భితంబు | 301 | 4 | 86 |
| ఆయెడ సిద్ధ | 195 | 3 | 10 |
| ఆరణభోజను | 63 | 1 | 81 |
| ఆరమణీలలామమది | 99 | 1 | 134 |
| ఆరమణీలలామముల | 30 | 1 | 39 |
| ఆరాత్రి సత్యఁ | 278 | 4 | 48 |
| ఆరామప్రియ | 233 | 3 | 42 |
| ఆరీతి న్నియమించి | 346 | 5 | 60 |
| ఆవిహగావతంసము | 167 | 2 | 77 |
| ఆసరసీరుహాక్షి | 70 | 1 | 92 |
| ఇం కిటు నిన్ను | 94 | 1 | 126 |
| ఇంచిన వేడ్క | 107 | 2 | 6 |
| ఇందునిభాస్య | 86 | 1 | 115 |
| ఇచ్చి కయికొని | 365 | 5 | 89 |
| ఇట్లనియె | 118 | 2 | 23 |
| ఇతని కిత్తుండె | 326 | 5 | 29 |
| ఇది భోజాత్మజ | 43 | 1 | 54 |
| ఇనకరతాప | 265 | 4 | 26 |
| ఇన్నిదినంబులుఁ...గడు | 67 | 1 | 88 |
| ఇన్నిదినంబులుఁ.....నల | | | |
| సత్య | 53 | 1 | 65 |
| ఇనుదెసఁ జూడ | 122 | 2 | 31 |
| ఇరుగ్రేవల | 167 | 2 | 78 |
| ఇవ్విధంబున | 342 | 5 | 53 |
| ఇవ్విధమున | 362 | 5 | 84 |
| ఈచందమున | 366 | 5 | 91 |
| ఈతరుశాఖల | 251 | 4 | 6 |
| ఈనయగారపుం | 93 | 1 | 125 |
| ఈపగిదిన్మరారి | 255 | 4 | 13 |
| ఈపగిదిన్నాల్రాజితి | 78 | 1 | 102 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| ఈలలితాంగి | 82 | 1 | 109 |
| ఈసునఁబుట్టి | 98 | 1 | 133 |
| ఉదయాద్రి | 19 | ప్ర | 23 |
| ఉన్నతసౌధ | 198 | 3 | 15 |
| ఊర్వీశమాళి | 8 | ప్ర | 8 |
| ఊవిద యెవ్వతె | 97 | 1 | 131 |
| ఎంతకు లేఁదు | 62 | 1 | 80 |
| ఎలదేఁటు ల్దమ | 256 | 4 | 14 |
| ఎవ్వానివిజయంబు | 10 | ప్ర | 12 |
| ఏకచ్ఛత్రిత | 381 | 5 | 109 |
| ఏడుకరంబులఁ | 272 | 4 | 78 |
| ఏణీశాబవిలోలనేత్ర | 180 | 2 | 91 |
| ఏతద్వస్తు | 313 | 5 | 61 |
| ఏమేమీ కలహాశ | 64 | 1 | 83 |
| ఏయేవేళల | 31 | 1 | 40 |
| ఏవంవిధ | 21 | ప్ర | 25 |
| ఒకభృంగంబు | 124 | 2 | 33 |
| ఒకయెడఁ జక్రవాక | 263 | 4 | 22 |
| ఓచెలి శారి కిచ్చె | 69 | 1 | 90 |
| ఓ లొనకయింత | 85 | 1 | 112 |
| ఓలలితేంద్రనీల | 99 | 1 | 135 |
| కంపనలీల | 108 | 2 | 9 |
| కడఁకన్రేచలి | 134 | 2 | 45 |
| కనకగిరీంద్ర | 336 | 5 | 43 |
| కనకపంజర | 80 | 1 | 106 |
| కనకమహీధరేంద్ర | 185 | 2 | 97 |
| కనఁ దిలకంబు | 254 | 4 | 10 |
| కని నెమ్మోమున | 331 | 5 | 36 |
| కని సత్కారమణీ | 205 | 3 | 25 |
| కనుఁగవఁ బిన్ననవ్వు | 44 | 1 | 55 |
| కనుఁగవ మ్రాన్పడంగ | 263 | 4 | 21 |
| కనుఁగొంటే సకలేందు | 181 | 2 | 92 |
| కనుఁగొన వేడ్కలఁ | 283 | 3 | 22 |
| కనుపట్టె నొకచోట | 206 | 3 | 46 |

| పద్యములు | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| కమలదళాక్షుని | 168 | 2 | 81 |
| కమలాప్తోన్న మదంశు | 161 | 2 | 69 |
| కమనీజృంభికలకు | 159 | 2 | 67 |
| కమ్మకస్తురి | 157 | 2 | 64 |
| కలకంఠకంఠి | 46 | 1 | 57 |
| కలకాల మొక్క | 71 | 1 | 93 |
| కలలోన నైన | 72 | 1 | 94 |
| కలికినిడువాలు | 112 | 2 | 13 |
| కాంచి చేరంగ | 265 | 4 | 27 |
| కామినీమాన | 138 | 2 | 50 |
| కారణము లేక | 292 | 4 | 71 |
| కార్కొన్నకటికి | 128 | 2 | 37 |
| కాళియభేదిఁ | 192 | 3 | 14 |
| కినిసి బిడౌజుఁ | 327 | 5 | 30 |
| కిన్నరకంఠి | 179 | 2 | 89 |
| కుంతలేశ్వరుఁడు | 11 | ప్ర | 13 |
| కులమును రూపము | 32 | 1 | 42 |
| కులవసుధా | 329 | 5 | 33 |
| కువలయనేత్ర | 344 | 5 | 57 |
| కువలయపత్రనేత్రకుఁ గొంటివె | 170 | 2 | 85 |
| కువలయపత్రనేత్ర నెటి గొప్పన | 51 | 1 | 62 |
| కృతకాద్రి | 73 | 1 | 95 |
| కెరలి చీఁకటి | 129 | 2 | 39 |
| కేళిగతి మాఱి | 108 | 2 | 8 |
| కొందఱమంతనంబులను | 81 | 1 | 108 |
| కొమ్మ వేగిర | 257 | 4 | 16 |
| కొలకొలమంచు | 161 | 2 | 70 |
| కోణపరుపరా | 288 | 4 | 64 |
| కోదండద్రోణునకు | 23 | ప్ర | 29 |
| కోపనపదహతి | 91 | 1 | 122 |
| కౌశికగోత్ర | 380 | 5 | 108 |
| ఖగకులనాథు | 169 | 2 | 82 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| గంధరోద్ధర | 335 | 5 | 41 |
| గట్టివచేతలుం | 95 | 1 | 127 |
| గతి స్రుచ్చిలఁగ | 295 | 4 | 77 |
| గరుడునిపెక్కులం | 282 | 4 | 55 |
| గలితశృంఖల | 290 | 4 | 68 |
| గిరితటముఁ | 319 | 5 | 15 |
| గురివెందఁ జైత్ర | 237 | 3 | 48 |
| గొనయంబు నెక్క | 292 | 4 | 72 |
| ఘనకుచ | 267 | 4 | 30 |
| ఘనదోర్దండ | 210 | 3 | 34 |
| ఘనసాంధ్యరాగ | 276 | 4 | 45 |
| ఘోరముగ మింట | 325 | 5 | 26 |
| చండతర | 305 | 4 | 93 |
| చండస్థూల | 296 | 4 | 78 |
| చందన హరిచందన | 233 | 3 | 43 |
| చక్రనిదాన | 54 | 1 | 66 |
| చక్రవర్తి | 15 | ప్ర | 19 |
| చని గారుత్మత | 115 | 2 | 18 |
| చనుఁగవ ప్రేఁకమ్ము | 264 | 4 | 25 |
| చనుదెంచి యమ్మురారికి | 59 | 1 | 76 |
| చనుదెంచేఁ గలహం | 114 | 2 | 16 |
| చరమాద్రి | 152 | 2 | 59 |
| చిత్తజభిదంఘ్రి | 383 | 5 | 111 |
| చిత్రాకృత్యభినందిత | 372 | 5 | 97 |
| చిలుక తేరును | 126 | 2 | 35 |
| చిలుకలు వాఁడి | 242 | 3 | 54 |
| చుక్కలరాణి | 312 | 5 | 10 |
| చూడుము నన్ను | 322 | 5 | 21 |
| చూడ్కికి ప్రేఁకమై | 350 | 5 | 67 |
| చెంద్రికపూవన్నె | 110 | 2 | 12 |
| చెలువ ల్గొందఱు | 110 | 2 | 11 |
| చోద్య మప్పుడు | 312 | 5 | 11 |
| జడకొని | 193 | 3 | 5 |
| జనమేజయ | 26 | 1 | 35 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| జయ గోవింద | 151 | 2 | 56 |
| జలకం బాడి | 112 | 2 | 14 |
| జలజాక్షి యిది | 47 | 1 | 58 |
| జలజాతాసన | 90 | 1 | 121 |
| జలదవితాన | 370 | 5 | 95 |
| జలరుహనాభు | 282 | 4 | 54 |
| జలరుహనేత్రఁ | 201 | 3 | 20 |
| జలరుహపత్రనేత్రమునిఁ | 354 | 5 | 73 |
| జలరుహపత్రనేత్రుఁడును | 275 | 4 | 41 |
| జలరుహమిత్రు | 154 | 2 | 60 |
| జీర్ణపర్ణద్రు | 171 | 2 | 86 |
| డాసి పురోహరి | 291 | 4 | 70 |
| తక్కినదిశాధి | 195 | 3 | 9 |
| తగునె యదుప్రవీర | 283 | 4 | 56 |
| తనదంతాగ్రము | 5 | ప్ర | 3 |
| తనదుకోడంద్ర | 96 | 1 | 130 |
| తనపాదజలము | 252 | 4 | 7 |
| తనమనోవల్లభుని | 271 | 4 | 35 |
| తనమృదుగీతికా | 6 | ప్ర | 5 |
| తనశృంగార | 56 | 1 | 71 |
| తనుఁ గనుఁబ్రామి | 244 | 3 | 57 |
| తనుతరమధ్య | 365 | 5 | 90 |
| తనువున నంధకారపు | 123 | 2 | 32 |
| తరుణీ యీతరు | 250 | 4 | 4 |
| తఱిగొని యంత | 328 | 5 | 31 |
| తలలు వీడంగ | 332 | 5 | 37 |
| తల వాంచి మగుడ | 284 | 1 | 111 |
| తలిరాకుగుత్తి | 238 | 3 | 49 |
| తలిరాకుఁబోఁడి | 107 | 2 | 5 |
| తలిరాకుమెఱుఁగు | 244 | 3 | 56 |
| తలిరులతుద | 377 | 5 | 104 |
| తళతళని | 168 | 2 | 80 |
| తానటె పారిజాత | 287 | 4 | 63 |
| తామరదోయిలో | 109 | 2 | 10 |

| పద్యములు | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| తామరలవ్రేటు | 269 | 4 | 33 |
| తామసవృత్తి | 8 | పీ | 9 |
| తారకాధీశు | 136 | 2 | 48 |
| తిగిచి శరాసన | 309 | 5 | 5 |
| తిరుమలదేవీ | 190 | 2 | 105 |
| తూఁగెంజల్లని | 262 | 4 | 20 |
| తెలతెలవాఱి | 344 | 5 | 56 |
| తొడలపైఁ జాఁచిన | 204 | 3 | 24 |
| తొడవులు పుచ్చి | 266 | 4 | 28 |
| తొలుమలఁతితో | 135 | 2 | 46 |
| త్రిపురస్త్రీల | 212 | 3 | 37 |
| త్వరితాధరితానిల | 306 | 4 | 94 |
| దనుజవిరోధి | 201 | 3 | 19 |
| దయమీనాక్షి | 101 | 1 | 138 |
| దరదళదంబుజ | 377 | 5 | 105 |
| దరమీలన్నయనంబు | 155 | 2 | 61 |
| దానవభేది | 351 | 5 | 68 |
| దానవవైరి | 270 | 4 | 34 |
| దారుణభంగి | 330 | 4 | 90 |
| దినదిన మట్లు | 345 | 5 | 58 |
| దినపరిణామ | 133 | 2 | 44 |
| దినరాజత్తటి | 275 | 4 | 42 |
| దినవారిరాశి | 124 | 2 | 34 |
| ద్రోవదియుఁ | 353 | 5 | 72 |
| ద్వారకవైకుంఠ | 40 | 1 | 51 |
| ధనకనక | 347 | 5 | 62 |
| ధన మిచ్చి | 75 | 1 | 97 |
| ధరియించిన | 55 | 1 | 67 |
| ధారవోసి | 361 | 5 | 83 |
| ధీరశయనీయ | 368 | 5 | 93 |
| నందప్రియ | 241 | 3 | 52 |
| నగముల నదుల | 349 | 5 | 65 |
| నతిసేసె | 169 | 2 | 83 |
| నను భవదీయ | 91 | 1 | 123 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| ననునని సేయ | 293 | 4 | 75 |
| నను నాకశ్యప | 210 | 3 | 33 |
| నను నెవ్వతిగాఁ | 98 | 1 | 132 |
| నలకూబర | 300 | 4 | 84 |
| నలినాప్తుండు | 150 | 2 | 54 |
| నవచంద్రాలిక | 358 | 5 | 78 |
| నాగమాంబా | 190 | 2 | 106 |
| నాగాంబికా | 22 | పీ | 27 |
| నామొగమోట | 68 | 1 | 89 |
| నాయశరగసార | 367 | 5 | 92 |
| నారదుఁడు | 348 | 5 | 63 |
| నావినిసత్య | 284 | 4 | 58 |
| నావుడుఁగొరికి | 38 | 1 | 48 |
| నావుడుసత్య | 254 | 4 | 11 |
| నిగమాంత | 364 | 5 | 87 |
| నిజపురిఁకేగు | 376 | 5 | 103 |
| నిర్భగ్నశృంగుఁడై | 313 | 5 | 12 |
| నీయనుజన్ముఁడగ | 288 | 4 | 66 |
| నెఱులఁదడి | 274 | 4 | 40 |
| నెలకొనికృష్ణరాయ | 18 | పీ | 23 |
| నెలకొనివేసవి | 52 | 1 | 63 |
| పంకజనాభా | 374 | 5 | 100 |
| పట్టుదలంచెనేని | 292 | 4 | 73 |
| పడఁతీసిమధు | 89 | 1 | 119 |
| పతగవిభుండు | 188 | 2 | 102 |
| పతినీవై విహరింప | 118 | 2 | 24 |
| పతిప్రాణసదృశ | 74 | 1 | 96 |
| పరమముని | 359 | 5 | 80 |
| పరమాచార | 345 | 5 | 59 |
| పరికింపరు | 67 | 1 | 87 |
| పరిపంథి | 25 | పీ | 33 |
| పరిమళము | 49 | 1 | |
| పరువంబుగాక | 239 | 3 | |
| పలుకులఁదేనె | 87 | | |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| పలుదెఱఁగు | 65 | 1 | 85 |
| పాటలగంధి | 89 | 1 | 120 |
| పాదపనూత్తనాంబు | 243 | 3 | 55 |
| పునరాగతుఁడగు | 321 | 5 | 19 |
| పురబహిర్ద్వార | 336 | 5 | 44 |
| పూనికొనిమేబు | 70 | 1 | 91 |
| పెకలియజారఁడ | 208 | 3 | 81 |
| పెరిఁగినహార | 272 | 4 | 37 |
| పొందుగఁ పశ్చిమాబ్ధి | 132 | 2 | 42 |
| పొరిఁబొరినెగయు | 291 | 4 | 69 |
| పొలఁతుల్లాఁగిట | 3 | పీ | 2 |
| ప్రతివర్ష | 102 | 1 | 139 |
| ప్రసృతివిలోచనా | 103 | 1 | 140 |
| ప్రాణవిభుఁ | 340 | 5 | 50 |
| ప్రామినుకులదొంగ | 38 | 1 | 49 |
| ప్రామినుకులపూఁబోఁడుల | 108 | 2 | 7 |
| ప్రోడతనంబులు | 269 | 4 | 32 |
| బలిదనుజేంద్ర | 360 | 5 | 81 |
| బలివిధ్వంసియుఁ | 273 | 4 | 39 |
| బాణదిగ్ధాథి | 303 | 4 | 91 |
| బాహాసంభృత | 297 | 4 | 80 |
| బాహుసౌధక్రీడ | 20 | పీ | 24 |
| బిసరుహపత్ర | 77 | 1 | 100 |
| బెడిదమగు | 261 | 4 | 19 |
| బెరసెన్నేన | 337 | 5 | 46 |
| భద్రేభంబుల | 353 | 5 | 71 |
| భిన్నాసురాస్త్ర | 309 | 5 | 6 |
| భీమాకారులు | 298 | 4 | 81 |
| భుగ్నభ్రూకుటి | 329 | 5 | 32 |
| భువనవిజయాఖ్య | 382 | 5 | 110 |
| భోజకన్యా | 378 | 5 | 107 |
| మంచునఁదోఁగిన | 156 | 2 | 63 |
| మకరకుళీర | 299 | 4 | 82 |
| మగమాల | 45 | 1 | 56 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| మదవతియొకతె | 200 | 3 | 18 |
| మదవతీకర | 352 | 5 | 70 |
| మది నొక్కించుక | 320 | 5 | 17 |
| మనమరయు దలంచి | 87 | 1 | 116 |
| మనమున నమమానము | 373 | 5 | 98 |
| మనమున మాటలం | 88 | 1 | 113 |
| మరకతగోమేదక | 378 | 5 | 106 |
| మరలక జన్య | 186 | 2 | 99 |
| మరుదంభోరుహా | 267 | 4 | 29 |
| మరుదీశద్విప | 277 | 4 | 46 |
| మరుద్వృధా | 247 | 3 | 61 |
| మఱియునమ్మధు | 314 | 5 | 13 |
| మఱియురుక్మిణి | 29 | 1 | 38 |
| మలయసమీరణ | 239 | 3 | 50 |
| మలమూనిల | 237 | 3 | 47 |
| మహిభృద్భేది | 235 | 3 | 45 |
| మాత్సర్యఘన | 113 | 2 | 15 |
| మానంబెతొడవు | 96 | 1 | 129 |
| మానవతి యట్లు | 64 | 1 | 114 |
| మానసవేగ | 294 | 4 | 76 |
| మానిని దీని | 251 | 4 | 5 |
| మాసినచీర | 76 | 1 | 99 |
| మిన్నందివేగ | 60 | 1 | 77 |
| మిన్ననుండి | 143 | 2 | 73 |
| ముందలవట్టి | 333 | 5 | 38 |
| మునినాకిచ్చిన | 79 | 1 | 103 |
| మునిపతియానతిం | 359 | 5 | 79 |
| మునిపతిరాకయుం | 165 | 2 | 74 |
| మునిపతివచ్చి | 96 | 1 | 128 |
| మునియేమిసేయు | 66 | 1 | 86 |
| మునుకొనికొండవీటి | 17 | పీ | 21 |
| మురమర్దనుఁడివ్విధమున | 170 | 2 | 84 |
| మురహరబల | 324 | 5 | 24 |
| మేనిమిరి | 206 | 3 | 26 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| మేల్కనుముదేప | 152 | 2 | 58 |
| మేళవించినవి | 362 | 5 | 86 |
| మొగుడుఁదమ్ముల | 278 | 4 | 49 |
| మొనసినదీపికా | 127 | 2 | 36 |
| యక్షులు వీరలో | 181 | 2 | 93 |
| యదుతిలక | 213 | 3 | 38 |
| యదువృష్ణి | 348 | 5 | 64 |
| యాదవత్వమున | 13 | పీ | 17 |
| యామవతీకళత్ర | 129 | 2 | 38 |
| యామినీసమయంబు | 159 | 2 | 68 |
| రంభామహోరోజ | 234 | 3 | 44 |
| రక్కసిమగువల | 40 | 1 | 50 |
| రాజులనెత్తుట | 9 | పీ | 10 |
| రాజువీడెత్తి | 158 | 2 | 66 |
| రాధాతనయా | 22 | పీ | 26 |
| లంగనుమ్రోత | 320 | 5 | 16 |
| లెమ్ముసురేంద్ర | 333 | 5 | 39 |
| వంచనఁబొంచి | 172 | 2 | 87 |
| వచ్చితి మింక | 307 | 5 | 3 |
| వచ్చినముసిపతి | 36 | 1 | 45 |
| వచ్చియరదంబు | 80 | 1 | 105 |
| వజ్రంబునకు | 163 | 2 | 72 |
| వదలనీవి | 261 | 4 | 18 |
| వనజశ్రీధన | 277 | 4 | 47 |
| వనితకుచ | 85 | 1 | 113 |
| వనితయొకర్తు | 197 | 3 | 13 |
| వనితాజనతా | 25 | పీ | 32 |
| వరభక్తిదేవకీ | 332 | 5 | 49 |
| వలిపముగట్టి | 140 | 2 | 52 |
| వలిమలయల్లువాఁడు | 7 | పీ | 6 |
| వాజ్యారోహణ | 304 | 4 | 92 |
| వామనేత్రీ | 117 | 2 | 20 |
| వామలోచన | 100 | 1 | 136 |
| వారణయానలు | 268 | 4 | 31 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| వారణరాజ | 252 | 4 | 8 |
| వారలలోఁ దిప్పాంబ | 12 | పీ | 15 |
| వారిం జూచి | 194 | 3 | 8 |
| వారిలోపల | 56 | 1 | 70 |
| వాలముతాఁకున | 107 | 3 | 28 |
| వాసవుతోడి | 335 | 5 | 42 |
| వాసుదేవా | 375 | 5 | 101 |
| వికచాబ్జనేత్ర | 357 | 5 | 76 |
| విదళితకాళింగ | 247 | 3 | 60 |
| విదళితదైత్య | 369 | 5 | 94 |
| వినయయ్యెం | 157 | 2 | 65 |
| వినవేర్చిరి | 338 | 5 | 47 |
| వినయంబు | 42 | 1 | 53 |
| వినుఁడుసురేశ్వరు | 284 | 4 | 59 |
| విను మింతుల్ | 253 | 4 | 9 |
| విరహులమై | 137 | 2 | 49 |
| విరివిగా నొకవేళ | 341 | 5 | 52 |
| విలయోల్బణ | 208 | 3 | 30 |
| విస్ఫయముగ | 338 | 5 | 48 |
| వీరుఁడ వౌదు | 330 | 5 | 34 |
| వీరశ్రీనరసింహ | 13 | పీ | 16 |
| వెండియుఁ దుహిన | 140 | 2 | 53 |
| వెండియు నప్పసిండి | 173 | 2 | 88 |
| వెడవెడకన్ను | 78 | 1 | 101 |
| వేడుక నీకె | 199 | 3 | 16 |
| వేల్పుగట్టు | 276 | 4 | 44 |
| వేల్పుఁజిగురాకు | 275 | 4 | 43 |
| వేల్పుమ్రాని | 323 | 5 | 23 |
| వైంధ్యద్వీప | 24 | పీ | 31 |
| వైతాళికు లప్పుడు | 151 | 2 | 55 |
| వ్రతకల్పోచిత | 351 | 5 | 69 |
| శతధారా జాయ | 330 | 5 | 35 |
| శరధిక్రోడ | 152 | 2 | 57 |
| శాకపాకంబుల | 115 | 2 | |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| శాశ్వతవిజయము | 10 | పీ | 11 |
| శౌరి యిదె | 281 | 4 | 52 |
| శ్రీమదికిక | 1 | పీ | 1 |
| శ్రీమహిత గేహ | 191 | 3 | 1 |
| శ్రీరంగేశ్వర | 14 | పీ | 18 |
| శ్రీలఁజెలంగు | 186 | 2 | 98 |
| శ్రీవరవర | 371 | 5 | 96 |
| శ్రీవర్ణనీయ | 307 | 5 | 1 |
| శ్రీవేంకటగిరి | 249 | 4 | 1 |
| శ్రీసదన | 105 | 2 | 1 |
| సంతసమంది | 166 | 2 | 75 |
| సకలసురైక | 280 | 4 | 51 |
| సటలిట | 209 | 3 | 32 |
| సతులఁట | 340 | 5 | 51 |
| సతులుపదాఱు | 354 | 5 | 74 |
| సత్యముగ నిన్ను | 362 | 5 | 85 |
| సమయకృత్యంబు | 106 | 2 | 4 |
| సమయజ్ఞుం డయు | 360 | 5 | 82 |
| సమయవిలాసి | 133 | 2 | 43 |
| సమయాభీర | 155 | 2 | 62 |
| సమర్థక్షమ | 189 | 2 | 104 |
| సరసపుటల్క | 5 | పీ | 4 |
| సరసబిసవిసర | 188 | 2 | 103 |

| పద్యములు. | పు. | ఆ. | ప. |
|---|---|---|---|
| సరసాలాపముల | 106 | 2 | 3 |
| సరసిజనేత్ర | 241 | 3 | 53 |
| సరిగమపధని | 34 | 1 | 44 |
| సర్గ మొనర్తు | 206 | 3 | 27 |
| సర్వతోముఖ | 311 | 5 | 9 |
| సామర్థదళిత | 23 | పీ | 28 |
| సారంగాక్షుల | 187 | 2 | 100 |
| సురనికరంబు | 207 | 3 | 29 |
| సురలోకాభిమత | 281 | 4 | 53 |
| సురవీరుఁ డొకఁడు | 293 | 4 | 74 |
| సురసంయమి | 37 | 1 | 47 |
| సైనికులెల్ల | 321 | 5 | 18 |
| సౌమ్మన సెద్ది | 334 | 5 | 40 |
| హరి నరకాసురుఁ | 28 | 1 | 37 |
| హరిబాణ | 310 | 5 | 8 |
| హరి యపుడు | 280 | 4 | 50 |
| హరి యిట్లు | 32 | 1 | 41 |
| హరివంశకథ | 27 | 1 | 36 |
| హరిహయుఁడార్చ | 319 | 5 | 14 |
| హరిహయుఁ డాహరిఁ | 301 | 4 | 87 |
| హేమధరాధరంబు | 302 | 4 | 89 |
| హేమసిధగాత్రి | 343 | 5 | 54 |


చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము—1960

DCI

AOUA104 B110. BC

# పద్యకావ్యములు

| | ప్రతి 1-కి రూ. అ. |
|---|---|
| అచ్చతెనుఁగురామాయణము | 2 3 |
| ఆదివిమల్లలు ఎగమంత్రనారాయణ మూర్తిగరిచి | 1 0 |
| అనిరుద్ధచరిత్రము, కనుపర్తి అబ్బయామాత్యప్రణీతము | 1 0 |
| అనంతనిచందము, ఛందోవర్ణనము | 2 0 |
| అనుభవసారము | 1 0 |
| అప్పకవీయము, కిడుగురామమూర్తిపంతులుగారి విమర్శతో నున్నది | 5 0 |
| అంబరీషోపాఖ్యానము, సటీక (భాగవతము) | 0 8 |
| ఆంజనేయదండకము హనుమద్దండక | 0 4 |
| ఆంధ్రభాగవతము పోతనామాత్యప్రణీతము. 2 సంపుటములు | 15 0 |

శ్రీమదాంధ్రభారతము-పద్యకావ్యము, అనేకబ్రాహ్మణుల సహాయమున చిగురాలమునుండి సంపూర్ణపరిశ్రమముతో బరిష్కరింపఁబడినది.

| | |
|---|---|
| ఆది, సభాపర్వములుగలసంపుటము | 4 0 |
| ఆరణ్యపర్వము | 4 0 |
| విరాటోద్యోగపర్వములు | 4 0 |
| ద్రోణపర్వములు | 4 0 |
| కర్ణశల్యసౌప్తిక స్త్రీపర్వములు | 4 0 |
| శాంతిపర్వము | 4 0 |
| అనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వములుగల సంపుటము | 0 |
| ఆదిపంచకము, ఒకటేసంపుటము | 1 |

| | ప్రతి 1-కి రూ. అ. |
|---|---|
| చూడామణిపుచకము, స్త్రీపర్వ | 7 0 |
| కాంతికస్తకము | 7 0 |
| ఆనందరంగరాట్చరిత్రము కాలిక | 2 3 |
| ఆంధ్రభారత సమగ్రనామ మహాద్రి సూర్యనారాయణశాస్త్రి | 1 3 |
| ఆంధ్రశ్రీమద్రామాయణము; కావ్య స్మృతిశిల్పి జనమంచిశేషాద్రిశర్మ కృతము, 3 సంపుటములు | 15 0 |
| డిటో 7 సంపుటములు | 18 0 |
| ఆంధ్రభాషాభూషణము | 0 6 |
| ఆంధ్రనామసంగ్రహము ఆంధ్రనామశేషము, సాంబసిద్ధుటివు టీకానుక్రమణికాసహితము కాలికోబైండు | 2 0 |
| ఆంధ్రచంద్రాలోకము సటీక | 1 8 |
| ఉసంశయవిచ్ఛేదము అడిదము సూరకవిది | 1 4 |
| ఉత్తరరామాయణము, కలకంటి పాపరాజప్రణీతము, చక్కనికూర్పు | 6 0 |
| ఉత్తరహరివంశము, నాచనసోమనాథకృతము | 3 0 |
| కళాపూర్ణోదయము, లఘుటీకతో | 4 0 |
| కవికుండలము, చక్కనిచిత్రపటములు | 6 0 |
| కుచేలోపాఖ్యానము, సటీక, భాగవ | 3 8 |
| డిటో గట్టుప్రభువ్యాఖ్యతము | 1 0 |
| కృష్ణరాయవిజయము, కుమారధూర్జటి కృతము | 0 12 |
| గద్యపద్యసంగ్రహము | 1 0 |

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
పుస్తకాళ్ళు 137, 292, ఎన్ప్లనేడ్, చెన్నపురి. 1.

ముఖము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| పుస్తకం సంఖ్య | AOUA104B110 |
|---|---|
| పుస్తకం పేరు | పంచాంగపఠనము |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | |
| వెనుక అట్ట | |
| మొత్తం పేజీలు | 421 |
| పెద్ద సైజు పేజీలు | |
| ఖాళీ పేజీలు | లే, BCL |
| లేని పేజీలు | |
| తయారు చేసినది | Jayalakshmi |
| పేజీలు విడదీసినది | Jayalakshmi |
| స్కాన్ చేసినది | Hosmat |
| పరీక్ష చేసినది | BUJJI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పంపినది | 9000 |